

# శ్రీ మాష్టరుగారి బోధామృతం

## నాకు తెలిసిన మాష్టారు 1,2 భాగములు
## శ్రీ మాష్టారు మంచి మాట



పెసల సుబ్బరామయ్య

# శ్రీ మాష్టరుగారి బోధామృతం



పెసల సుబ్బరామయ్య

సర్వస్వామ్యములు : శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ వారివి.

ప్రథమ ముద్రణ : 2008
**రెండవ ముద్రణ : 2014**
ప్రతులు : 2000

**రూ. 40-00**

కాపీల కొరకు : శ్రీ సాయి మాస్టర్ సేవాట్రస్ట్
గొలగమూడి (PO)
నెల్లూరు జిల్లా 524 321

Please visit :www.saimastersevatrust.org

మనోజ్ ప్రింటర్స్
చప్పల్ బజార్, కాచిగూడ, హైదరాబాద్.
ఫోన్ : **9246887388**

## పరిచయం

శ్రీసాయిబాబా శిరిడి అనే కుగ్రామంలో వెలసి లోకానికి వెల్లడి జేసిన శుద్ధమార్గాన్నీ, అనంతశక్తినీ అనుభూతిని పొంది అందరికీ అర్థమయ్యేలా సులభశైలిలో ఎన్నో గ్రంథాలను రచించి, విస్తృతంగా ప్రవచనాలు చేసి, సద్గురు తత్త్వము యొక్క గొప్పతనము వివరిస్తూ, ఆ మహనీయుని ఆశ్రయించనిదే తృప్తి, శాంతి, ఆనందము కలుగవని శ్రీసాయి మాష్టరుగారు ఘంటాపథంగా బోధించారు. శ్రీ మాష్టరుగారిని మనకు పరిచయం చేసే పుస్తకాలు , 'నాకు తెలిసిన మాష్టారు' (ఒకటి రెండు భాగములు) , అయితే వారు ఆచరించి చూపిన మార్గాన్ని తెలిపేది శ్రీమాష్టారి మంచి మాట.

గతంలో వేర్వేరుగా ప్రచురించబడిన పై మూడు గ్రంథాలు క్రోడీకరించి, శ్రీ మాష్టారుగారి ప్రభోధామృతము అను క్రొత్తపుస్తకమును చేర్చి ఈ గ్రంథంగా ప్రస్తుతం ప్రచురించడం జరిగింది. ఇందువల్ల శ్రీమాష్టారుగారి జీవన విధానము, వారి బోధలు మనము ఈ ఒకే గ్రంథంలో చదువుకోవచ్చు. పై మూడు గ్రంథములను ఎలాంటి మార్పు చేయకుండా యథాతథంగా ఇందులో కూర్చడం జరిగింది.

శ్రీమాష్టరుగారే మార్గదర్శిగా శ్రీసాయి శుద్ధమార్గంలో మనల్ని నడిపే కరదీపికయే ఈ గ్రంథం.

పెసల సుబ్బరామయ్య

## మాస్టారి గారి సిద్ధాంత ప్రణాళిక

1. సరైన మానవత్వము అలవరచుకున్న తర్వాతనే ఆధ్యాత్మిక సాంప్రదాయానికి పనికి వస్తాము.
2. పరిపూర్ణుడైన మహాత్ముని సేవ సాంగత్యము లభించాలి.
3. ఆయన కృపకు మనము అర్హులం కావాలి.
4. మన సంస్కారానికి తగిన సాధనా మార్గము ఆయన తెలియజేయాలి.

ఇవన్నీ అలవడాలి అంటే శ్రీ సాయి లీలామృతము, శ్రీ గురుచరిత్ర, ఇతర మహాత్ముల చరిత్ర పారాయణం చేయాలి. తప్పని సరిగా సత్సంగము, సద్గోష్ఠులలో పాల్గొనాలి. ఇవి ఆచరించుకుంటూ పోతే సద్గురువు కృప అనుభవమివ్వటమే కాకుండా, శ్రీ దత్తాత్రేయుని అవతరణ తిరిగి ఆంధ్రదేశములో తప్పని సరిగా జరుగుతుంది.

ఈ సిద్ధాంత ప్రణాళికలో మనము పాల్గొందాం తద్వారా దత్తుని అనుగ్రహము పొందుదాము. మాస్టారు గారు చూపిన సాయి మార్గములో నడవటమే మనము మాస్టారు గారికి అందజేసుకునే చిరుకానుక. అది సమర్పించుకొనే శక్తిని ప్రసాదించమని తిరిగి సద్గురువు సాయి మాస్టర్‌నే వేడుకుందాము.

ఓం సాయి నాథా జై - గురు భరద్వాజ జై





## మనవి

మనమంతా సత్వ, రజో, తమోగుణాల మిశ్రమ రూపము. పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజ గారి ప్రతిమాట మానవ జాతి శ్రేయస్సుకు ఉపయోగపడుతుంది. మానవుడు ఉద్ధరించబడాలి అంటే పూర్తి విశ్వాసము, సర్వశ్యాశరణాగతి అనేవి ప్రథమంగా ఉండవలసిన లక్షణాలు. మహనీయులు చెప్పిన మాట మనమెంతవరకు ఆచరిస్తే అంతమేరకు ఉద్ధరించబడతాము. వారి మాటలకు మన బుద్ధి అనుసరించి వ్యాఖ్యలు చెప్పుకుంటే ఆచరణ శూన్యమవుతుంది. మాస్టారి గారి మాటలను ఆచరించేబదులు తర్కించటము మొదలు పెడితే ఫలితం శూన్యం. శ్రీ గురు చరిత్ర, శ్రీ సాయి లీలామృతము, శ్రీ వెంకయ్య స్వామి వారి చరిత్ర మనకు నేర్పే పాఠం ఇదే. శ్రీ మాస్టారు గారు బోధించినదంతా ఒక బోధనలాగా కాక మనతో మాట్లాడుతూ హితవు చెబుతున్నట్లుగా ఉంటాయి. అయితే ఆ మాటలలోని సంపూర్ణ భావము కాలాంతరములో ఎప్పుడో ఎవరికో గాని బోధపడదు. మంచి విషయాలు మనస్సుకు ఎక్కిస్తుంటే చెడు విషయాలు వాతంతట అవే మనసుంచి దూరమౌతాయి. కనుక శ్రీమాస్టారు గారి మాటలను తర్కం లేకుండా ఆచరించి అందరూ ధన్యులవ్వాలని నా ప్రార్థన.

పెసల సుబ్బరామయ్య

## ప్రార్ధన

ఎడతెరపి లేకుండా తన ఇష్టమొచ్చినట్లు మన మన ఆలోచనల రూపంలో ఒక నదివలె నిరంతరం సాగుతూ నిద్రలో కూడ స్వప్నాల రూపంలో మనలను వేధిస్తుంది. ఇట్టి మనస్సును మన స్వాధీనంలోకి తెచ్చుకునే ప్రయత్నంలో మనకు ప్రీతి పాత్రులైన వారిని గూర్చి చదవడము, ఆ చదివిన దానిని మననము చేయుటము, ఆ సద్గుణాలను మనం కూడా అలవరచుకునే ప్రయత్నం చేస్తూ, నా మనస్సును నిరంతరము వారి దివ్య లీలతో నింపుతూ, మాస్టారు చూపిన ఉత్తమమైన మార్గములో పయనంచేయుటానికి చేసే చిన్న ప్రయత్నమే ఈ చిరుపుష్పము. దానిని ఆస్వాదించే శక్తి నాతో కలిపి అందరికీ ప్రసాదించమని శ్రీ మాస్టారు గారిని ప్రార్ధిస్తున్నాను.

- పెసల సుబ్బరామయ్య



## సాయి సన్నిధిలో **VIP** లు లేరు:

అంత పెద్ద కోటీశ్వరుడైన శ్రీమాన్ బూటీ, ప్రఖ్యాత లాయర్ దీక్షిత్ గారు, బ్రిటీష్ ప్రభువులైన కర్టిస్ దంపతులు, బరోడా మహారాణి గార్లకంటే గొప్పవాళ్ళెవరుంటారు. ఈలాంటి గొప్పవారికి కూడా **VIP**ల క్రింద ప్రత్యేక గౌరవాలు సాయి ఇవ్వనపుడు, మనం ఆ మహనీయుని పాదాలాశ్రయించాక మనం కొందరిని **VIP**లుగా గౌరవించడం తగదని శ్రీమాష్టరు చెప్పడమేగాక విద్యానగర్ మందిర ప్రారంభోత్సవమప్పుడు ఆచరించి చూపారు.

నెల్లూరు శ్రీసాయి మందిరం నుండి కొందరు విద్యానగర్ సాయి మందిర ప్రారంభోత్సవానికి వచ్చారు. వారు అడగ పంపితేకూడా శ్రీమాష్టారు వారు కోరిన ప్రత్యేక దర్శనం వీలుకాదని మృదువుగా తిరస్కరించారు. ఇది మనస్సులో పెట్టుకొని నెల్లూరులో నిర్వహించిన ఆల్ ఇండియా సాయి సమ్మేళనానికి పూజ్య శ్రీ మాష్టరుగారికి ఆహ్వాన పత్రంకూడా పంపలేదు. సార్ మీరు నెల్లూరులో జరిగే ఆలిండియా సాయి సమ్మేళనానికి ఎప్పుడొస్తున్నారు అని నేనంటే పైవిషయం చెప్పారు.

బెంగుళూరు నుంచి కారులో వచ్చిన భక్తుడు శ్రీభరద్వాజగారు ఎక్కడున్నారని ఒకరిని అడిగారు. సాయి కృపవలన పై విషయమంతా తెలిసిన వారినే ఆ భక్తుడు అడిగారు. ఆ భక్తుడు పై విషయం విని నేరుగా ఒంగోలు వెళ్ళి తన కారులో శ్రీమాష్టరుగారిని నెల్లూరుకు తీసుక వచ్చి సమ్మేళన ఆర్గనైజర్లచే శ్రీమాష్టరుగారిని పూలమాలాలంకృతునిచేసి వెంటనే వారిచేత ఉపన్యసింపజేశారు. ఎవరు ఉపన్యసిస్తే సాయి భక్తి ప్రజలలో వెల్లి విరుస్తుందో సాయికి చక్కగా తెలుసు. సాయి దృష్టిలో **VIP**లు లేరని నిరూపించారు. మనకు ఆచరణ మార్గం చూపారు.

కాని, నేడు ఏ సాయి కార్యక్రమాలైనా VIPలు లేకుండా జరుగనే జరుగవు. సాయిని నమ్మమన్న మాష్టారు మాట త్రోసివేసి మానవ మాత్రులైన వారిని VIPల క్రింద నమ్మి ప్రత్యేకతలు ఇవ్వడం ఎంతవరకు తగునో యోచించండి.

## బూటీగారి చివరి సందేశం:

శ్రీమాన్ బూటీగారు తన చివరి సందేశం తన బిడ్డలు, భార్య, బంధువులకు ఇలా చెప్పారు. ఎప్పుడు శ్రీసాయినాథుని దర్శనానికి మీరు వచ్చినా శ్రీసాయిసంస్థానంవారు మీరు బూటీ వంశస్తులని ప్రత్యేక మర్యాదలు చేయవచ్చు. అలాంటివి మీరు స్వీకరిస్తే అప్పుడే మీ పతనమారంభమైందని గుర్తించండి అని చెప్పారు. శ్రీబూటీగారే అలా అంటే ఇక మనమెంత?

ఎప్పుడైనా మనం గర్వం, అహంకారం లేకుండా సాయిని సేవించాలేగాని వారి దగ్గర మనగొప్పలు ప్రదర్శించడం తగదని అర్థం.

## సాయినాథునకు మనకు మధ్యవర్తులు వద్దు:

ఒకప్పుడు ఎంత బ్రతిమాలినా తనను ఫోటో తీయడానికి సాయి అంగీకరించలేదు. అప్పుడు ఫోటో తీయాలనేవారు షామాగారిని ఆశ్రయించారు. వారు బాబాను బ్రతిమాలినా వారంగీకరించలేదు. మరొకరోజు ఒక భక్తుడు ఎంతో ఆర్తితో బాబాను ఫోటో తీయమని మనిషిని పంపాడు. ఆ వచ్చిన వారు ఆ మాటే మరచిపోయారు. ఆ భక్తుని ఆర్తిని, భక్తిని బట్టి బాబాగారే అడిగి మరీ ఫోటో తీయించుకున్నారు. గనుక మనకు మధ్యవర్తులుగాదు. ఆర్తి, భక్తి, ప్రేమలుండాలని మాష్టరు బోధించారు.



## పుణ్యం:

శ్రీపాకలపాటి గురువుగారి చరిత్రలో "కొండకోనకు అడవిబాట" అనే అధ్యాయములో శ్రీమాష్టరుగారు చెపుతారు "ఎంతో పుణ్యముంటే గాని సద్గురు దర్శనం జరుగదు. ఇంకెంత పుణ్యముంటే గాని వారి సంపూర్ణ కృపకు పాత్రులం కాలేము."

నాజీవితములో ఇది నూటికి నూరుపాళ్ళు సత్యమయింది. చిన్ననాడు దేవునికి దండం పెట్టే అలవాటున్నా, కాలేజీ చదువుల ప్రభావం వలన, స్నేహితుల ప్రభావం వలన ఆ దండం పెట్టడం కూడా పూర్తిగా ఆగి పోయింది. పైగా దండం పెట్టేవారిని ఎగతాళి చేసే క్రొత్తగుణం వృద్ధి చెందింది. పెండ్లి ఈడు వచ్చాక స్నేహితుల ప్రభావం వలన కామాంధత చిగురించ సాగింది. ఇద్దరు బిడ్డలు కలిగినా దేవుడికి దండం పెట్టేవారిని ఎగతాళి చేయడం వరకే కానీ దేవుడు లేడనిమాత్రం చెప్పేవాణ్ణి కాదు. ఈకాలంలో ఇతరులకు సహాయం చేయడం అనే గుణం మాత్రం పోలేదు. అట్టి తరుణంలో "కష్టాలుగూడా అనుగ్రహానికి గుర్తు" అనేమాట సత్యమయింది.

నా ప్రక్కింటి స్నేహితునికి నాకు మా రెండిండ్ల మధ్యగల స్థలం దగ్గర పేచీవచ్చి, అందరూ నన్నే సమర్థించినా, అతడు రౌడీల సహాయంతో నాకు చీకాకు కలిగించాడు. రెండడుగుల స్థలం అతనికే వదిలేశాను. కానీ ధర్మం ఓడిపోయిందనే తీవ్రపరితాపంతో, కలిచేడుకు మూడు కిలోమీటర్ల దూరంలో కొండపైనున్న దేవాలయానికి ప్రతి ఆదివారం ఉదయం వెళ్ళి సాయంకాలం వరకు ధర్మం, అధర్మం, లోకం తీరులను గూర్చి ఈశ్వరునితో తగాదాలాడి వచ్చేవాడిని. ఏకాగ్రచిత్తంతో దేవునితో తగాదాలాడినా అది పుణ్య కర్మే అయింది. ఆ తర్వాత శ్రీరామకృష్ణ జీవిత చరిత్ర జీవితంలో మొదటిసారి నా చేతికివచ్చి చదివాను. అందులో పరమహంస గారంటారు "భార్యా బిడ్డలకొరకు, ఆస్తిపాస్తుల కొరకు కడవలకొద్దీ కన్నీరు కారుస్తారే, దేవుని

కొరకు ఒక్క బొట్టు కన్నీరు కార్చారా?". ఒక ఏకాంత ప్రదేశానికి రాత్రిపూట వెళ్ళి గంటల తరబడి ఏడ్చేవాడిని. ఆసమయంలో నా కెందుకు ఏడుపొచ్చిందో తెలియదు.

దేవాలయానికి వెళ్ళి ఏకాగ్ర మనస్సుతో తగాదా పడడం ద్వారాను, శ్రీరామకృష్ణ జీవిత చరిత్ర పారాయణ ద్వారాను నా పుణ్యం ఎంత పెరిగిందో చెప్పలేను. ఈ కాలంలోనే భగవద్గీత చదివాను. ఏమీ అర్థంకాలేదు. కానీ ఆ గ్రంథంలోని 18సం॥ పిల్లవాడుగానున్న శ్రీకృష్ణుని చిత్రం నన్నెంతో ఆకర్షించి నిత్యం నిద్రలేస్తూనే కొన్ని నిమషాలసేపు తన్మయంగా చూచేవాణ్ణి. ఈ మూడు కారణాలవల్ల నాకు శ్రీభరద్వాజ మాష్టరుగారి దర్శనం లభించింది.

అంతకుముందు మూడు సంవత్సరముల నుండి వారు మా గ్రామానికి వస్తున్నా నేను వారిని దర్శించనేలేదు. నా పుణ్యం ఏవిధంగా పెరిగినందున ఒక స్నేహితుని బలవంతం వలన నేన్ను శ్రీమాష్టరుగారిని చూచాను. అది మొదలు ఈనాటి వరకు నేను ఆ మహనీయుని వదల లేకున్నాను. అంతటి మహనీయుని దర్శనం చేయించింది నా పుణ్యమేనని నా విశ్వాసము. గనుక శ్రీపాకలపాటి గురువుగారి చరిత్రలో శ్రీమాష్టరుగారు వ్రాసిన మాట అక్షరసత్యం గదా! నిత్యం నియమిత కాలంలో భగవంతుని ముఖారవిందం తనివితీరా చూడడం, మహనీయుల చరిత్ర భక్తి ప్రేమలతో పారాయణ చేయడం, మనకిష్టమైన దేవునితో గానీ సద్గురువుతో గాని మనస్సు విప్పి మాట్లాడడం చాలా మంచి పుణ్యకార్యాలని, వాటిద్వారా భగవంతుడు కోరిన కాలము, మనస్సు వారికి సమర్పించి మానవ జన్మ ధన్యము చేసుకొన్న వారమవుతామని శ్రీమాష్టరుగారు చెప్పేవారు.



## సర్వాన్నీ వదలి తప్పుమార్గాన సాధన చేసే వారికి సరైన మార్గం చూపాలన్న కరుణామయుడు:

మాగ్రామంలో MSc. చదివిన యువకుడు దైవాన్వేషణలో తల్లి దండ్రులు, బంధుమిత్రులు, ఆస్థి అంతస్తులు వదలి సాధన కంకితమై భిక్షతో జీవించే వాడు. ఒకరోజు మాటల సందర్భంలో "ఈశ్వరునితో పోలిస్తే సాయిబాబా ఒక దుమ్ము రేణువుతో సమానము" అన్నాడు. నేనీమాట ఒంగోలులో నివశిస్తున్న శ్రీమాష్టరుగారితో అన్నాను. పాపమాయన ఎవరో ఉత్తమ సాధకుడేగాని అతని భావన సరిగాలేక వక్ర మార్గంలో ఉంది. నాకు ముందుగా తెల్పి ఒకసారి వచ్చి మాట్లాడమని చెప్పు. నేను ఇంటి దగ్గరే ఉంటానన్నారు. నేనావిషయం ఆ సాధకునికి చెపితే నేనావిధంగా మరొక చోటికి రానన్నాడు. ఆ మాట విన్న శ్రీమాష్టరుగారు అలాగైతే వారెప్పుడుంటారో నాకు తెలిపితే నేనే వారి దగ్గరకు వచ్చి మాట్లాడుతానన్నారు. ఈ మాట విన్న ఆ సాధకుడు "వారు నా దగ్గరకు రానక్కరలేదు. నేను వారి దగ్గరకు పోనక్కరలేదు" అన్నారు. అంతా దైవేచ్ఛ అని శ్రీమాష్టరుగారు అతని మార్గం సరి చేయాలనే ప్రయత్నం మానివేశారు. తన పనులన్నీ పోగొట్టుకొని ఆ సాధకుని మేలుగోరి అతని ఇంటికి వెళ్ళి మాట్లాడేందుకు కూడా సిద్ధపడ్డారు శ్రీమాష్టరుగారు. ఆ మహనీయుని ప్రేమ, ఔదార్యమును గూర్చి ఏమని వ్రాయగలము. ఇంతటి ఉదాత్త పురుషుడు గనుకనే శ్రీసాయి వీరిని "నా బిడ్డలాంటి వాడు" అని మెచ్చుకున్నారు.

## తాననుభవించే తృప్తి, శాంతి, ఆనందము అందరూ అనుభవించాలనే తపన:

మా స్కూల్లో ఒక టీచర్ పరమ నాస్తికుడు. తాను చెడింది కాక ఏ కల్మషమెరుగని విద్యార్థులందరికీ తన నాస్తిక భావాలంటించేవాడు.

గొప్ప గొప్పనాస్తిక మహాశయులంతా తమ నాస్తిక భావాలు సంపూర్ణంగా వదిలేసి, దైవ చింతన వైపు ఎలా మొగ్గారో మంచి ఉదాహరణలతో అందరికీ చెప్పడమే శ్రీమాష్టరుగారి ధ్యేయంగా ఉండేది. శ్రీసాయిలీలామృతం చదివిన వారికి శేషగిరిరావుగారి అనుభవం విశదంగా అర్థమవుతుంది. ఆంధ్రరాష్ట్రంలోని నాస్తిక అష్ట దిగ్గజములలో ఒకరు శ్రీశేషగిరిరావు. వీరు తన వళ్ళు మంటల నివారణ కొరకు రష్యాలోని డాక్టర్లను ఆశ్రయించినా ఫలితం లేక పోయింది. ఒకసారి శ్రీమాష్టరుగారి నుండి శ్రీసాయిలీలామృతం పొంది పారాయణ మొదలిపెట్టిన మూడవ రోజున శ్రీసాయిబాబా స్వప్న దర్శనం మరియు వ్యాధి నివారణ జరిగింది. తన ఆనందం పట్టలేక తన అనుభవం శ్రీమాష్టరుగారికి లెటరు ద్వారా తెలిపారు. ఆ లెటరు నా చేతికిచ్చి మా నాస్తిక టీచర్‌కు, విద్యార్థులకు చూపించి నిజానిజాలు తెలుసుకోమనేవారు. శ్రీశేషగిరిరావుగారిని ఫలానా అడ్రస్సులో కలవండి అని వారికి చెప్పమన్నారు. ఈ టీచర్ చిత్తశుద్ధి లేనివాడు గనుక శేషగిరిరావును కలిసే ప్రయత్నం చేయలేదు.

## అందరినీ సాయినాశ్రయించేటట్లు చేయాలనే వారి తపన:

శ్రీమాష్టరుగారు కలిచేడులో ఆధ్యాత్మికతనుగూర్చి ఉపన్యసించేందుకు వస్తున్నారని కరపత్రాలు వేశారు. పైనాస్థిక టీచర్ "దేవుడున్నాడని నిరూపిస్తే లక్షరూపాయలు ఇవ్వబడును" అని కరపత్రాలు, ఊరంతా బోర్డులు తగిలించాడు. శ్రీమాష్టరుగారు కలిచేడు వచ్చి ఉపన్యసించారు. ఉపన్యాసం తర్వాత పైవిధంగా బోర్డులు వ్రాసినవారు వేదిక మీదకొస్తే నిరూపిస్తాను. దయచేసిరండి అని ఎన్నిమార్లు మైక్‌లో పిలిచినా రాలేదు. అక్కడున్న పాత విద్యార్థులు ఫలానా టీచర్ సార్ బోర్డులు వ్రాసింది. ఇలాంటి వెధవ పనులు చేయడం అతనికి అలవాటు అన్నారు. అట్లయితే వాళ్ళయింటికి వెళ్ళి మాట్లాడుతాం అని పిల్లలు వెంటరాగా వాళ్ళయింటికి వెళ్ళారు. రాత్రి ఎనిమిది గంటలకే అతడు



నిద్రపోతున్నాడని నిద్రలేపడం సభ్యతకాదని గేటు దగ్గర కాపలా ఉన్న అతని తమ్ముడన్నాడు. విద్యార్థులు అతనిని ప్రక్కకునెట్టి లోపలికివెళ్ళి అతనిని బయటికిలాగాలని చూస్తే శ్రీమాష్టరుగారు అన్నారు "బాబూ, దేవుడున్నాడని నిరూపిస్తే లక్షరూపాయలు ఇస్తానని బోర్డులు తగిలించి, మైకులో పిలిస్తే రాకుండా రాత్రి 8 గం||లకే నిద్రపోతున్నానని చెప్పమని గేటులో నిన్ను కాపలా పెట్టడం సభ్యతేనా" అని చెప్పి విద్యార్థులతో "అలా భయపడేవాడిని బలవంతము చేసి ఏమి మాట్లాడిస్తాము. అతని సత్తా తెలుస్తూనే వుందిగా" అని వచ్చేశారు. తప్పుమార్గాన వెళ్ళే వ్యక్తిని సరైన మార్గాన నడిపించేందుకు తన హోదాను, అంతస్తును లెక్క చేయకుండా ఆ వ్యక్తి ఇంటికి వెళ్ళి మాట్లాడేందుకు కూడా వెనుకాడ లేదు. శ్రీమాష్టరుగారు వస్తున్నారని తెలిసి ఇంటిలో దాక్కున్న వ్యక్తిని అవమానించాలని, హేళనచేసి మరలా బోర్డులు తగిలించడం వంటి పనులు చేయకుండా అతనికి బుద్ధి చెప్పాలన్న విద్యార్థులకు అది సరైన పద్ధతికాదని విద్యార్థులను వెనక్కు మళ్ళించిన వారి ఔదార్యాన్ని ఏమని కొనియాడగలము!

## సైకోట్రానిక్స్ పుస్తకం నాకిచ్చి మావిద్యార్థులందరికీ చూపించి జాగ్రత్తగా తెచ్చి ఇమ్మన్నారు:

నేను **BSc., BEd.** సైన్స్ టీచర్‌ను అనే గర్వంతో బొత్తిగా కళ్ళు మూసుకుపోయినరోజులవి. అప్పుడే దైవకృప, నా పుణ్యము కలిసి నన్ను శ్రీమాష్టరుగారి సన్నిధికి తీసుకవచ్చాయి. సైకోట్రానిక్స్ అంటే అర్థంకూడా తెలియని మూర్ఖశ్రేష్టుడను. అతి మానసిక శక్తులను పరిశీలించే శాస్త్రం పేరు సైకోట్రానిక్స్ అంటారు. యూనివర్శిటీ పేరు, దేశం పేరు గుర్తులేదు. అక్కడ శాస్త్రజ్ఞులందరూ జీతం లేకుండా పనిచేస్తారు. వాళ్ళకు కారు, కారుకు పెట్రోలు, **AC**తో ఇండ్లు, అన్ని సౌకర్యాలు ప్రభుత్వమే ఉచితంగా ఇస్తుంది. ఒక్కొక్క స్కూలుకు వెళ్ళి పది నిమిషాలు ఏ

ఆలోచన లేకుండా ఉండగల విద్యార్థులను తమ పరికరాల సహాయంతో ఇద్దరిని ఎన్నుకుంటారు. వారి తల్లిదండ్రులకు నచ్చజెప్పి ఆ విద్యార్థి ట్రైయినింగ్‌లో సెలక్టు అయితే ప్రతి నెలా తల్లిదండ్రులకు కొంత డబ్బు పంపుతామని ఆ విద్యార్థి ఎందులో రాణిస్తే ఆ చదువు తమ ఖర్చుతో చదివిస్తామని చెప్పి తీసుకవెళుతారు. ఇలా అనేక మంది విద్యార్థులను తీసుక వెళ్ళి మనస్సును ఆలోచనా రహితంగా కొంతసేపు వుంచే పద్ధతులు బోధించి పరీక్షిస్తారు. మంచి రిజల్టుచూపిన విద్యార్థులను ఉంచుకొని మిగతా వారిని వాళ్ళ వాళ్ళ ఇండ్లకు పంపేస్తారు.

ఈ కాలేజిలో టేబుల్ పైన నున్నని అద్దం ఉంటుంది. దానిపైన ఒక పెన్సిలు ఉంటుంది. తన సంకల్పబలంతో ఆ పెన్సిలును కదిలించాలి. దాని తరువాత రూళ్ళ కర్రలు కదిలించడం, ఇలా బరువు పెంచుతూ వస్తువులను కదిలించే ట్రైయినింగ్ ఇస్తారు. ఒక విద్యార్థి ఒక లాంగ్ బెంచీని ఒక చోటు నుండి మరియొక చోటికి కదల్చడం, ఒకరి వల్లకాకుంటే ఇద్దరు ముగ్గురు కేవలం మానసిక శక్తితోనే కదల్చడం చేస్తారు. ఒక విద్యార్థిని తన మానసిక శక్తితో నీటి కుండను గాలిలోకి కొంత ఎత్తుకు లేపి గాలిలో కొంతసేపు ఉంచి తిరిగి భూమి మీద ఉంచుతుంది. ఈ విషయాలన్నీ ఫోటోల సహాయంతో వివరించబడిన పెద్ద గ్రంథం నా కిచ్చి మా విద్యార్థులకు చూపించమన్నారు. ఆ గ్రంథాన్ని వరల్డ్ టీచర్సు ట్రస్టువారు మాష్టరుగారి సోదరుడు శ్రీ క్రిష్ణమాచార్యుల గారికి ఇచ్చారట. వారు దానిని శ్రీమాష్టరుగారికిచ్చారు. ఇలాంటి విషయాలన్నీ ప్రపంచంలో జరుగుతుంటే వాటిని గురించి బొత్తిగా తెలియని నా అవివేకానికి, గర్వానికి నాకెంతో సిగ్గేసింది.

## సదోపవాసం:

సత్ + ఉపవాసం మంచి ఉపవాసమని అర్థము. ఎలా ఉండాలి అనేందుకు వివరణ ఇచ్చారు. భోజనానికి భోజనానికి మధ్యన ఏమీ తినకుండుట. మనం రుచి కొరకు గాని, ఇతరుల బలవంతం మీద గాని,



మొహమాటపడి గాని ఎక్కడబడితే అక్కడ ఏది బడితే అది, ఎప్పుడు బడితే అప్పుడు తింటుంటాము.

ఇలాంటి ప్రవర్తన ద్వారా మనకు ఆహారంద్వారా చెడ్డ సంస్కారములు వచ్చే ప్రమాదాన్ని శ్రీ మాష్టరుగారు 'పూజావిధానం' పుస్తకంలో స్పష్టంగా వ్రాశారు. రెండవది బాగా ఆకలి లేనప్పుడు ఆహారం స్వీకరిస్తే బంధహేతువౌతుంది అంటారు. పంచ భూతాల రూపంలోను, అనేక జీవుల శ్రమ ద్వారాను భగవంతుడు తయారు చేసిన ఆహారాన్ని మనం వృథా చేస్తున్నాము. గనుక మనం భగవంతునకు ఋణపడుతాము.

గనుకనే శ్రీవెంకయ్యస్వామివారు 'మందం బంధం' అంటారు. మందాకలితో భుజిస్తే అది బంధ హేతువని చెపుతున్నారు. అందుకే శ్రీమాష్టారు నాకు తెలిసినంతలో భోజనానికి భోజనానికి మధ్య కాఫీ తప్ప మిగత ఘన పదార్థాలు ఎంత బలవంత పరిచినా తినేవారు కాదు.

సాధన అంటే ఏమిటి? సంస్కారముల మార్పు అని తెలుసు. నాలో ఎన్నో లోపాలున్నాయి. వాటిని నిర్మూలించడం ఎలాగు? ప్రతి నిత్యం, అనుక్షణము కూడా మనం చేసే పనులు, మాట్లాడే మాటలు, మరియు మన ఆలోచనలు ధర్మంగా ఉన్నాయా? సద్గురుని బోధలు అనే వరుపురాతి పరీక్షకు నెగ్గుతాయా అని ఎప్పటికప్పుడు చూచుకొని, తప్పుచేసినందుకు గురువుగారికి క్షమాపణ చెప్పుకొంటూ తిరిగి అలాంటి తప్పు చేయనంతగా పశ్చాత్తాప పడాలి. అలా పశ్చాత్తాప పడినప్పటికీ ఎన్నో జన్మల అలవాటు ప్రభావం వలన కాలు జారకపోము. తప్పుచేయకుంటే ధన్యులమే. కానీ కాలు జారిన ప్రతిసారి మనం చేసింది తప్పు అని గుర్తించడం ఒక ఎత్తు, పశ్చాత్తాప పడి ఇక అలాంటి తప్పుచేయకుండా జాగ్రత్తగా నడవడిని సరిదిద్దుకోవడం ఎంతో ముఖ్యము. ఇలాంటి గుర్తింపు, పశ్చాత్తాపము, జాగ్రత్త అనేవి ఎలా కలుగుతాయి? కేవలము మన

తత్వం సాత్వికంగా మారాలి. అలాంటి సాత్వికత ఎలా వస్తుంది? వార్తాలాపంలో 1. ఆహారశుద్ధి అంటే ధర్మ బద్ధంగా ఆర్జించిన దాన్నే భుజించడం 2. సత్ గ్రంథ పటన 3. సత్ సంగము 4. మహనీయుల సన్నిధి 5. మహనీయుల సేవ అన్నింటి కంటే ఉత్తమ సాధన అంటారు.

మహనీయుల సేవ అనగానే గడ్డాలు పెంచి నాలుగు శ్లోకాలు వల్లించి, చిల్లర మహిమలు ప్రదర్శించిన వారంతా మహనీయులని నమ్మి తనువు, ధనము సమర్పించి జీవితాంతం సాధన చేసి దేవుడే లేడనే వారిని నేను చూచాను. శ్రీవెంకయ్యస్వామివారు, శ్రీసాయినాథులవారి లాంటి మహనీయుల సేవే సాటిలేనిది. అయితే వారిప్పుడు కంటికి కనిపించరుగదా అనవచ్చు. అన్నీ జీవులలో వెంకయ్య ఉన్నాడని వ్రాసుకో అని వీరంటే, నా సమాధి అనంతరము కూడా నేను నా భక్తుల ఎదుట పిలిచిన వెంటనే ఉంటానని సాయి అన్నారు. వీళ్ళిద్దరూ ఆ మాటలు అక్షరాలా సత్యమని నిరూపిస్తున్నారు. యత్ భావం తత్ భవతి అని భావం ప్రధానంగా సాటి జీవులకు సేవ చేయమన్నారు. మనం చేసే వృత్తినే వారి సేవగా భావించి చేయమని చెప్పారు. ఏ పని చేయడానికి అంగీకరిస్తావో ఆ పని క్షుణ్ణంగా చెయ్యి లేకుంటే అంగీకరించబోకు అన్నారు సాయి. శరీరంతో ఉండే వారిని గురువుగా స్వీకరిస్తే మనలో వుండే లోపాలు వారిలోనూ మనకు కన్పించి మనం వారిని హృదయపూర్వకంగా సేవించలేక పోయే ప్రమాద ముంది. గనుక మహా సమాధి చెందిన మహనీయులనే గురువుగా ఎంచుకోండి అంటారు శ్రీమాష్టారుగారు.

### అలా గురువుగా స్వీకరించేందుకు ఒక పద్ధతి చెప్పారు:

నీకు లభించిన మహనీయుల చరిత్రలన్నీ హృదయపూర్వకమైన ఆర్తితో చదువు. వారిలో నీ మనస్సు ఎవరిని ఆకర్షిస్తుందో వారినే గురువుగా స్వీకరించి వారి చిత్ర పటాన్ని యాంత్రికము, లాంఛన ప్రాయము



గాకుండా పూజించు, ధ్యానించు, వారి చరిత్రనే తృప్తి దీరా పారాయణ చెయ్యి. ఒకవేళ నీ పూర్వ జన్మ ఋణానుబంధాన్ననుసరించి వారు నీకు గురువు కాకుంటే నీవారాధించే గురువుగానీ, శ్రీదత్తమూర్తిగానీ నీకు ఫలానా వారు నీ గురువు అని చెపుతారు. వారి నుండి అలాంటి ఆదేశం నీవు పొందాలంటే కేవల శ్రద్ధా భక్తులుండాలని బోధించారు.

శ్రీసాయీశుని ద్వారా తాను పొంది అనుభవిస్తున్న నిత్యానందాన్ని మానవులందరూ పొందాలని ఉబలాట పడేవారు. గురు సేవగా తాను చేసే ధర్మప్రచారంలో ఉపాధ్యాయులు గొప్ప పాత్రవహిస్తారని చెప్పేవారు. పెద్దవాళ్ళు పాత గుడ్డల వంటివారని, విద్యార్థులు క్రొత్త గుడ్డలవంటివారని, పాత గుడ్డల కంటే క్రొత్త గుడ్డలకు రంగు చక్కగా అంటుకుంటుందని శ్రీరామకృష్ణ పరమహంసగారి మాట పదే పదే చెప్పేవారు.

మాస్కూలులో 'నేను నాస్తికుడను, నాకంతా తెలుసు' అని విర్రవీగుతూ తన అజ్ఞాన పూరితమైన మాటల ద్వారా విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్న ఒక టీచర్ ఉండేవాడు. అతని ప్రభావం టీచర్ల మీద కూడా ఉండేది. పరమ నాస్తికుడైన శేషగిరిరావుగారు తన చిత్రమైన వ్యాధిని శ్రీసాయి నిర్మూలించి నందున, తాను వ్రాసిన నాస్తిక గ్రంథాలన్నీ కాల్చివేసి శ్రీరమణాశ్రమంలో తన శేష జీవితం గడుపుతున్నారు. శ్రీమాష్టరుగారు శ్రీసాయిలీలామృతం ఇవ్వడం ద్వారా తన రోగం నిర్మూలమైన విషయం శ్రీమాష్టరుగారికి లెటర్ వ్రాశారు. ఆ లెటరు నా చేతికిచ్చి మా స్కూలులోని నాస్తిక టీచర్‌కు ఇతర ఉపాధ్యాయులకు విద్యార్థులకు చూపి జాగ్రత్తగా లెటరు మరలా వారికి చేర్చమని చెప్పి పంపారు.

తప్పు మార్గాన నడిచేవారిని ఉద్ధరించేందుకు వారికెంత గొప్ప ఆరాటమో చూడండి. వారిలాగ మనలను కూడా ధర్మ ప్రచారంలో పాల్గొని కృషిచేయమని గాడిదలు గంధపు చెక్కల విషయం చెప్పారు. గాడిదలకు గంధపు చెక్కల వాసన, విలువ తెలియకపోయినా అవి

గంధపు మొద్దులను లారీ దగ్గరకు మోసుక వచ్చి మనకు సేవ చేస్తున్నాయి. మీరు నా దగ్గర ఎన్నో గొప్ప విషయాలు తెలుసుకొనికూడా మీ స్నేహితునికిగాని, ఇంట్లో వారితో గాని మీరు విన్న విలువైన విషయాలు చెప్పక పోవడం ద్వారా మీకంటే గాడిదలే మేలని చెప్పేవారు. అంటే మీరు కూడా ధర్మప్రచారం మీ ఇంట్లోను, స్నేహితులతోను చేయమని బోధించేవారు.

## శ్రద్ధకు పరీక్ష:

ఒక కాలేజీ విద్యార్థి శ్రీమాష్టరి దగ్గరకొచ్చి తాను డ్రామా క్లాసులకు వరుసగా మూడు రోజులురాలేదని తనకా డ్రామాను మరలా చెప్పమని అడిగారు. సాయంకాలము 4 గంటలకు కాలేజీ గేటు దగ్గరుండు ఇద్దరము కలిసి రూముకు వచ్చాక చెపుతాను అని మాష్టరు చెప్పారు. కానీ నిత్యం ఇలా మాష్టారు కాలేజీ గేటు దగ్గర ఉండమంటూనే ఉన్నాడు. ఆ విద్యార్థి అలాగే గేటు దగ్గర ఉండి మాష్టారు రానందున నిరాశ చెందుతూనే వున్నాడు. మూడు రోజులయ్యాక ఆ విద్యార్థి మాష్టారి రూముకొచ్చి "సార్ నాకు డ్రామా చెప్పడం ఇష్టంలేకుంటే ఆ మాట నాకు చెప్పేస్తే నా కాలం వ్యర్థం కాకుండా నా తిప్పలు నేను పడేవాణ్ణి కదా. ఇలా ఎందుకు చేశారు" అని అడిగేశాడు. అప్పుడు శ్రీమాష్టారు "నీ శ్రద్ధను ఆ విధంగా పరీక్షించాను. నీవు పరీక్షలో నెగ్గావు. ఇప్పుడు చెపుతాను కూర్చోమని డ్రామా వివరించసాగారు. ఎంత చక్కగా నా హృదయంలోకి ఎక్కించారంటే ఇక జీవితంలో ఎప్పుడూ మరచి పోలేనట్లు, మరలా ఆ డ్రామాను గూర్చి పరీక్షలో ఏప్రశ్న అడిగినా వ్రాసేటట్లు చెప్పారు. వారిబోధనా దక్షతను నేనెలా వర్ణించగలను అంటాడా విద్యార్థి.

మనం కూడా ఎదుటివారి శ్రద్ధను పరీక్షించి మన సమయం వారి కొరకు వెచ్చించాలిగాని కాలక్షేపానికి వచ్చి మనలను మాట్లాడించే వారిని గూర్చి జాగ్రత్త పడమంటున్నారు. ఎదుటివాడు వినే పద్ధతి, వేసే ప్రశ్నలను బట్టి, అతడు వినే విధానాన్ని బట్టీ వారి శ్రద్ధ తెలిసిపోతుంది.



## ఆనందానుభూతి:

1982 వ సం|| లో ఒక చిత్రమైన అనుభవం కలిగింది. కేవలం అది దైవకృప మాత్రమే. మామూలు రోజుల్లో వచ్చే ఏ ఆలోచనా రావడంలేదు. నిరంతరం సాయిని గురించి ఆశుకవిత్వంగా పాటలు పాడేవాణ్ణి. బడికి వెళ్ళినా బజారుకు వెళ్ళినా, ఇంట్లో ఉన్నా, సత్ సంగంలోనైనా ఎప్పుడూ పాడేవాణ్ణి. ఇంట్లోగాని, సత్సంగంలోగాని అలా గొంతెత్తి పెద్దగా పాడవద్దనేవారు. నేను టీచర్‌ననీ అందరూ నన్నుచూచి నవ్వుతున్నారనీ చెప్పినా నేను వినిపించుకోను. స్కూలులో పాఠాలు చెప్పడం అమోఘంగా ఉంది. అట్లా నేనెట్లా చెప్పగలుగుచున్నానో నాకే ఆశ్చర్యం. నాకు 10వ తరగతి ఫిజిక్స్ లెక్కలు చెప్పడమంటే ప్రతినిత్యం ప్రిపేరయి పోవాలి. అలాంటిది ప్రిపరేషన్ లేకుండానే క్రొత్త పద్ధతిలో చెప్పేవాణ్ణి. అంతకు ముందు 20% విద్యార్థులు లెక్కవేస్తే ఇప్పుడు 90% వేస్తున్నారు. క్లాసులోకి పోతే మూడు పిరియడ్లు గడిచినా బయటికిరాను. విద్యార్థులు ఎంతో ఆసక్తితో వినేవారు. ఆరునెలల క్రిందట ఒక విద్యార్థి ఒక గాజు గ్లాసు పగలగొట్టి తాను కాదన్నాడు. కానీ ఈ రోజు తానే తన తప్పు వప్పుకున్నాడు.

కొందరు టీచర్లు నాకు పిచ్చి పట్టినదని హెడ్మాష్టరును తీసుకొచ్చి కిటికీ బయట నుండి నేను చెప్పేది వినమన్నారు. ఆయన ఒక అరగంట విని తనను తీసుకవచ్చిన టీచర్‌ను నాలుగు చీవాట్లు పెట్టాడు. మీరింత మంది క్లాసులకు వెళ్ళి పాఠాలు చెపుతున్నారు. ఒక్కరోజైనా ఒక్క టీచరైనా క్లాసులోని పిల్లలందరినీ ఏమీ అనకుండానే వాళ్ళ అటెన్షన్‌ను డ్రాచేయ గలిగారా? ఆయన ఏమి చెపుతున్నాడు అనేది లెక్క గాదు. తాను చెప్పేది విద్యార్థుల హృదయంలో ఎంత వరకు పదిల పరచాడు

అనేది లెక్క. ఎప్పుడూ ఆయన మీద ఇలాంటి కంప్లెయింట్ చేయవద్దని పంపేశాడు.

కొందరు మిత్రులు శ్రీభరద్వాజమాష్టరు గారికి లెటర్ వ్రాసి నాకు పిచ్చి పట్టిందని ఒక్కసారి వచ్చి చూచిపొమ్మని వ్రాశారు. కానీ నా భార్యగాని, తల్లిగారు గాని వ్రాయలేదు.

ఈ సమయంలో నేనొక ప్రార్థన చేసేవాణ్ణి. "సాయి! మోక్షమంటే ఏమిటో, ఎలా ఉంటుందో నాకు తెలియదు. దయచేసి నన్నీ విధంగానే చచ్చేదాకా ఉంచు ప్రభూ!" అని చెప్పుకునేవాణ్ణి. నా వల్ల ఎవరికీ ఏ ఇబ్బందీ లేదు. ఇంట్లో, స్కూలులో, సత్‌సంగంలో, బయట స్నేహితులతో చాలా ఆనందంగా ఉన్నాను. స్కూలు పిల్లలు ఎప్పుడూ నా చుట్టూ గుంపుగా ఉండేవారు.

ఈ పరిస్థితిలోనే శ్రీవెంకయ్యస్వామివారి 40వ రోజు ఆరాధన వచ్చింది. శ్రీమాష్టరుగారు గొలగమూడి వస్తున్నానని వ్రాశారు. నేను కుటుంబ సమేతంగా గొలగమూడి వచ్చాను. ఎన్నడులేనిది ఆ రోజు పూలమాల మాష్టారికి వేయాలని నాలో ఒకే ఆరాటము. పూలమాల పట్టుకొని నేను కంటేపల్లి వైపు చూస్తున్నాను. శ్రీమాష్టరుగారు కొండాయపాళెం మీదుగా కారులో వచ్చి నా వెనుక నిలబడి నేనెట్లా ఉన్నానో గమనిస్తున్నారు. ఎవరో వెనుక చూడమంటే చూచాను. ఆ ఆనంద పారవశ్యంలో వారికి పూలమాల వేసి పాదనమస్కారం చేశాను.

నీ ఆరోగ్యం బాగాలేదన్నారు. ఎలా వుందని అడిగారు. ఇలా ఉందని వివరించి, ఎందుకు సార్, ఇలా వుంది అని అడిగాను. మన శరీరంలోని నరాలన్నీ సాత్వికమైనప్పుడు అలా వుంటుంది. ఏమీ భయపడవద్దు. ఆ సాత్విక భావం నిలుపుకునేందుకు జాగ్రత్తగా వుండు అన్నారు.



## శ్రీమాష్టరుగారు నాకు నేర్పిన పాఠం:

నన్నెప్పుడూ విద్యానగర్ నుండి 5గం30 ని|| బస్సుకే పంపేవారు. 6 గం|| బస్సుకు పోతానన్నా వప్పుకునేవారు కాదు. 5గం. 30|| ని బస్సుకు పోతే బడికి పోయేందుకు 30ని|| వ్యవధి ఉంటుంది. 6 గం|| బస్సుకుపోతే సరిగ్గా 10 గంటలకు బడి టైముకే బస్సు దిగుతాను. హర్రీ బర్రీగా బడికి పోవాలి. 5 గం 30ని|| బస్సుకుపోతే స్నానం చేసి స్థిమితంగా బడికి పోవచ్చు. స్నానం చేయకుండా జిడ్డు మొహంతో బడికి పోయి మనమేమి పాఠాలు చెపుతాము. గనుక మన డ్యూటికి ఎంత ప్రాధాన్యతనిచ్చేవారో చూడండి. చక్కగా పాఠాలు చెప్పినప్పుడే మన మీద విద్యార్థులకు నమ్మకం కుదురుతుంది. బాబాను గురించి మనం చెప్పేది వారికి వంటబట్టి ఆచరించగలుగుతారు. మన డ్యూటి మనం సరిగా నిర్వర్తించకుంటే బాబా మనలను మెచ్చుకోరు. వారి కృప కోల్పోయాక మన మెన్ని పారాయణలు చేసినా కంఠశోషేగదా అనేవారు. డ్యూటి నిర్వహించడం ఎలాగో వారే ఆచరించి మనకు చూపారు. 9గం|| 30 ని||లకు ఇంట్లోంచి కదలాలంటే కదిలేవారు. 9గం|| 25ని|| వరకు సత్సంగ గదిలో మాట్లాడుతూ 5 ని||లలో డ్రెస్సు చేసుకొని మార్గాన నడుస్తుండేవారు. ఒక్కొక్కప్పుడు టిఫిన్ కూడా చేయరు.

"నీవు చూసేదంతా కలిసి నేను" అన్నారు బాబా. ఏ ఏ పనిచేసేవారు ఆ పని ధర్మ బద్ధంగా బాబా మెచ్చుకునేటట్లు చేయాలి. అదే మాష్టారి మార్గము. బాబా మెచ్చిన పద్ధతి. శ్రీవెంకయ్యస్వామివారు ఒకరి స్వప్నంలో అంటారు. **"What do you mean by negligency of duty ? Bloody idiot!"** గనుక బాబా సేవంటే ఆయనకు హారతులు పాడడం, అభిషేకాలు చేయడం, నైవేద్యాలు పెట్టడం మాత్రమే కాదు. వాటితో గూడా మన కర్తవ్య నిర్వహణ చక్కగా బాబా మెప్పు పొందేటట్లు చెయ్యాలి.

మన పెద్దలు ఎంత గొప్పగా చక్కగా చెప్పారో చూడండి. హారతుల్లో "త్వమేవ మాతాచ పితా త్వమేవ.... సర్వం మమ దేవ దేవ" అంటాము. సర్వం అనే పదంలో ఆ మంత్రంలో చెప్పినవన్నీ వస్తాయి. ఆ మంత్రంలో సూచించినట్లు అందరూ బాబా రూపాలని వారి ఎడల మన డ్యూటి పరిపూర్ణంగా నిర్వహించాలి గదా! ఆ డ్యూటి నిర్వహించడంలో ఆశ, వ్యామోహం, మమకారాలు లేకుండా అది బాబా సేవగా చేయాలి.

సహస్ర శీర్షా పురుషః అన్నశ్లోకంలో కూడా పై అర్థాన్నే సూచించారు. నిత్యపూజలో చదువుతాము. దాన్ని ఎంత గొప్పగా ఆచరించాలో చూడండి. ప్రస్తుతం నాకు అనేక మందితో బాంధవ్యం ఏర్పడింది. కొందరు భర్తలు, మరి కొందరు భార్యలు, కొందరు విద్యార్థులు, కొందరు వ్యాపారస్తులు, కొందరు ఉద్యోగస్తులు ఉన్నారు. వీరంతా 'మేము బాబాను చక్కగా ఆరాధించలేకున్నాము. మా విధి నిర్వహణ అడ్డవౌతుంది అంటారు. బాబాను చక్కగా ఆరాధించడమంటే హారతులు, పారాయణలు, నైవేద్యాలు అని వీరి భావం. అది ఎంత పొరపాటో యోచించండి.

శ్రీమాష్టరుగారి అన్నగారైన శ్రీకృష్ణమాచారిగారు పట్టుబట్ట ధరించి పూజచేస్తున్నారట. వాళ్ళ పాకీవాని బిడ్డ జ్వరం వల్ల నీరసించి ఉన్నట్లుండి కళ్ళు తేలేసి పడిపోయింది. ఆ పాకీ మనిషి బిడ్డనెత్తుకొని ఓ స్వామీ! అని ఏడుస్తూ వాకిట్లో నిలబడింది. ఆ ఆర్తనాదం విన్న శ్రీకృష్ణమాచారిగారు పరుగున పోయి ఆ బిడ్డను తాకి ఎత్తుకొని ఇంట్లోకి తీసుక వచ్చి మందువేసి చికిత్స చేసి 1 గంటకు స్పృహ వచ్చాక ఆ బిడ్డ తల్లికి ధైర్యం చెప్పి పంపారట. పూజకు వచ్చిన శిష్యులు ఈ చర్యకు ఆశ్చర్య పోయారు. పూజ వదలి పాకీవాని బిడ్డను ఎత్తుకోవడం వారికి విడ్డూరంగా తోచింది. శ్రీకృష్ణమాచారిగారు చెపుతారు " ఆ బిడ్డరూపంలో ఆ తల్లి రూపంలోను బాబా ఆర్తనాదం చేస్తుంటే వినికూడా మనం పట్టించుకోకుంటే బాబా మన పూజనూ మనలనూ శపిస్తారు"



అన్నారు. గనుక మన ధర్మాన్ని డ్యూటిగా చక్కగా నిర్వర్తిస్తే బాబా ఎంతో సంతోషిస్తారు. మనం నిర్వర్తించే డ్యూటియే బాబా సేవ. అదే మనలను చేయమన్నారు అనే భావన ప్రధానంగా సాగాలి. మనతీరిక సమయంలో రాజకీయాలు, సినిమా కబుర్లు, గ్రామంలోని విశేషాలు చెప్పుకొని మనసు పాడుచేసుకునే బదులు పారాయణ, పూజ, ప్రదక్షిణలు వీలున్నంత వరకు చేసుకోవడం బాబా మెచ్చుతారు.

కొందరు విద్యార్థులు చదువు మానేసి పారాయణలు, పూజలు, ప్రదక్షిణలు చేస్తుంటారు. అది బాబా మెచ్చే పనేనా? ఆ విద్యార్థికి చదువుకొనే అవకాశమిచ్చి భవిష్యత్తులో ఆ చదువు ద్వారా జీవితం అనే యుద్ధరంగానికి తరలిస్తున్నారు. ఇప్పుడా విద్యార్థి తన ఆయుధాలకు పదును పెట్టుకోవాలి. అది మాని బాబా పరీక్షలలో సహాయం చేస్తాడని తలచడం అవివేకం మాత్రమే. ఆ విద్యార్థి విరామ సమయంలో బాబా పారాయణలు పూజలు చేసుకోవడంలో తప్పులేదు. నిత్యం పది నిమషాల కాలం ఒక కడ్డీ వెలిగించి బాబాను ప్రార్థించి తన విద్యకుపక్రమిస్తే బాబా సంతోషిస్తాడు. చదువుమాని పారాయణ చేస్తే బాబా సహాయం రానేరాదు.

ఇలాగే కొందరు తల్లులు తనకు ఇంటిపనితో తల బట్టకట్టి పోతుంది బాబా సేవకు వీలే లేదు అంటున్నారు. అది ఎంత వెర్రితనమో చూడండి. ఆకలిగొన్న ఏ ప్రాణికి అన్నం పెట్టినా నాకు పెట్టినట్లే అన్నారు బాబా. ఇంటి పనులన్నీ వంట చేసేందుకే గదా! ఆ వంటను తన భర్త, బిడ్డలు ఆకలి రూపంలో ఆరగించేది బాబాయే గదా, ఇదే నిజమైన పూజ అనే భావంతో నిరంతరం స్మరణతో పనులు సాగిస్తే బాబా ఎంతో సంతోషిస్తారు.

అసలు అన్నం తినేటప్పుడు, స్నానం చేసేటప్పుడు, దొడ్డికి పోయినప్పుడు, పండ్లు తోముకొనేటప్పుడు బాబా స్మరణకు అడ్డేముంది. శ్రద్ధ ఒక్కటే ఉండాలిగాని కనీసం రోజు ఒక గంటసేపైనా పై అన్ని

పనులకు మనం ఖర్చుపెడుతూనే ఉన్నాము. ఆ కాలంలో ఎంతో తీవ్రంగా ప్రశాంతంగా నామస్మరణ చేసుకోవచ్చు.

ప్రతి వృత్తిలోను ఈ భావన ప్రధానంగా పనిచేస్తుంది. నేను చేసే వృత్తి బాబా నాకు ప్రసాధించిన పని. దీనిని సక్రమంగా ధర్మబద్ధంగా బాబా మెచ్చుకొనేటట్లు నిర్వహించాలి అనే దీక్షతో పాటించిన వారికి శ్రీమాష్టారి తండ్రిగారైన శ్రీఅనంతాచార్యుల గారికి వలె బాబాగారి కృప కలగడం తథ్యం.

నా విషయంలో శ్రీమాష్టరుగారు అవలంబించిన పద్ధతే ఇది. నాకెప్పుడోగాని ఆరతుల్లో పాల్గొనే అవకాశం ఉండేదిగాదు. అరుదుగా పాల్గొనే వాడిని. విద్యానగర్‌లో ఎక్కువగా పనిలో నిమగ్నుమయ్యేవాడిని. ఆ పనే నాకు బాబా సేవ అనే భావం నాకు తీవ్రంగా ఉండేది. దానినే శ్రీమాష్టారుగారు అంగీకరించారని భావించాను. ఎందుకంటే "నీవు హారతికెందుకు రాలేదు" అని ఒక్కసారైనా అడిగి ఎరుగరు. అట్లని నేను సోమరిగా పండుకొని హారతికి గైరు హాజరు కాలేదు. పనిలో నిమగ్నమైతే ఇక హారతికేం వెళ్ళేది. అక్కడే బాబాను స్మరిస్తుండేవాడిని.

గనుక <u>మనకిచ్చిన పనిలోనే ధర్మం తప్పకుండా బాబాను చూడమని శ్రీమాష్టారు నాకు నేర్పారు.</u>

యుగ ధర్మంతోపాటు మన మాచరించవలసిన కర్మల రూపం గూడా మారుతూ వస్తున్నాయి. ఇది గుర్తించక పాత పద్ధతులనే ఆచరిస్తాననడం చాలా హాస్యాస్పదమేకాక అపాయకరమని గుర్తించమన్నారు. ఈమాటను వివరించి ఆచరణయోగ్యమైన పనులు కర్మయోగంగా చేయమని సలహా ఇచ్చినందుకు శ్రీక్రీస్తుకు పట్టిన బాధలన్నీ మరొక రూపంలో అనుభవించారు ఆచార్యులవారు.



ఆపద్ధతులేవో వారు చెప్పినవి మీ ముందుంచుతున్నాను. వాటిలోని గొప్పలేవో లోపాలెంత సహజమో మీరే ఊహించుకోండి.

ప్రతి మందిరం వాళ్ళు ప్రతిసారి అన్నదానం చేశామని సంబరపడి పోతున్నారు. పాతకాలంలో వడ్లు దంచే రోజులలో, పూటకూళ్ళ ఇళ్ళే అన్నానికి అతిథులకు దిక్కు. మరి ఈనాడు వడ్లు దంచే పనిలేదు. పూటకూళ్ళ ఇళ్ళు లేవు. బ్రహ్మాండమైన హోటళ్ళు వచ్చాయి. ఆనాడు అన్నదానం చేయండి అన్నారు. మరి ఈనాడు కూడా అదే పరమ ధర్మమని ఆచరించడం ఎంత ఘోరమో వివరించారు. ఒక రిక్షావాడు అన్నదానం జరుగుతుందంటే భార్యా బిడ్డలను తీసుక వచ్చి కమ్మగా భోంచేసి పోతాడు. ఆరోజు తనకు మిగిలిన డబ్బుతో ఏమిచేస్తున్నాడు. తప్పత్రాగి భార్యను హింసిస్తున్నాడు. ఆ హింసకు మనమే (అంటే అన్నదానానికి ఇచ్చినవారు, దానిని నడిపిన కార్యకర్తలు) బాధ్యత వహించాలి. అలా కాకుంటే ఆ మిగిలిన డబ్బు మరొక దురభ్యాసానికి ఖర్చు చేస్తున్నాడు గాని దాన్ని సద్వినియోగం చేస్తున్నాడా అని ఆలోచించండి. మరి ఆనాడు శిరిడీలో బాబా అన్నదానం సంతర్పణలు చేశారంటే ఆనాటి అక్కడి పరిస్థితులేమిటి? నిజమైన ఫకీర్లకు, నిజమైన సాధువులకు బాబా దర్శనార్థం వచ్చిన భక్తులకుగాని అన్నంతినే హోటళ్ళున్నాయా? లేవు, గనుక బాబా అన్న సంతర్పణలు ప్రోత్సహించారు. మరి ఈనాడుకూడా అదే చేసి పాపం మూటగట్టుకుంటానంటే ఎవరు చెపితే ఆగుతారు.

పై అన్నదానాలకు బదులు కొన్ని కార్యక్రమాలు ప్రతి మందిరానికి సూచించారు. అన్నదానాలను వ్యతిరేకించినట్లు భావించిన పెద్దలనబడు (వి)నాయకులనుండి ఎదురుగాలి చవిచూచారు. అలా చవిచూచినవాడిని నేను కూడా ఒకణ్ణి. మనం మందిరంలో అన్నదానానికి బీద ధనికులు అనే భేదం లేకుండా ఒకే బంతిలో వడ్డిస్తున్నామా? మనవారికి ప్రసాదం పొట్లాలు ఇచ్చి పంపుతున్నాము. కానీ మాసిన తల, గుడ్డపేలికలు చుట్టుకున్న వారికి తృప్తిగా వారు కోరింది

పెడుతున్నామా? ఈలాంటి అన్నదానములవలన బాబా మనలెక్కలో ఏమి జమ వ్రాయిస్తున్నారో ఆలోచించండి?

## మందిర నిధులను ఈక్రింది విధాలుగా ఖర్చు పెట్టమన్నారు:

1. ఆ ప్రాంతములోని వైద్యశాలలకు ప్రతివారం వెళ్ళి మందులు కొనేటందుకు, సరైన పోషకాహారం తీసుకొనేటందుకు శక్తిలేని నిరుపేదలకు వాటిని అందించండి.
2. వంటికి సరైన గుడ్డ లేక కడుపుకు తిండిలేక నలిగే అభాగ్యులకు ఆ పరిస్థితికి కారణం ఏమిటో తెలుసుకొని, వారు అందరిలాగా బ్రతికేటందుకు ఏర్పాటు చేయమన్నారు.
3. అసాధారణ ప్రజ్ఞ, పాటవములు గలిగి చదువుకునే స్తోమతలేక అణగారిపోయే నిరుపేద విద్యార్థులను చదివించండి. వారి సర్వబాధ్యతలు వహించమన్నారు.
4. ఆధ్యాత్మిక లైబ్రరీలు విరివిగా ఎంత ఖర్చయినా చేసి అందుబాటులో ఉంచమన్నారు. ఒక్కరూ ఆ లైబ్రరీలను వాడుకోవడం లేదని అలక్ష్యం చేయవద్దన్నారు.
5. సాధనకు అంకితమైన మహనీయులకు కావలసిన సర్వ సదుపాయములందించమన్నారు.
6. కరువు కాటకాలు, తుఫానులకు సహాయమందించండి. తుఫాను బాధితులకు గృహనిర్మాణాన్ని చేపట్టమన్నారు. నేడు రామకృష్ణ మఠంవారు ఈకార్యం నిర్వహించినట్లు ఎవ్వరూ నిర్వహించలేకున్నారు. మదర్ థెరెసాను వారి సంస్థలను ఆదర్శంగా తీసుకోమన్నారు.
7. అనాథ శరణాలయాలు నిర్వహించండి
8. చక్కని విద్య అంటే లౌకిక విద్యతోపాటు ఆధ్యాత్మిక విద్య. **character buildup** చేయగల ఉపాధ్యాయులను ఏరి తీసుకోమన్నారు.



పై కార్యక్రమాలవంటివి గాక బాబాకు బంగారు కిరీటాలు చేయించడం, కనులు జిగేల్ మనే మందిరాలు కట్టడం, ధనవంతులకే ప్రవేశార్హమయ్యే ప్రదేశాలుగా మారుతున్నాయి గాని గూడులేని నిరుపేదలు ఒక్క గంట విశ్రాంతిగా పడుకునే ఏర్పాటుందా? మన మందిరాలలో దూరం నుండి వచ్చినవారు అన్నం తెచ్చుకొని తినేందుకు వీలులేదు. కొన్ని మందిరాలలో అయితే లెట్రిన్స్, యూరినల్స్ ఉండకూడదని శాస్త్రమట. ఈలాంటి భావాలు చాటినందుకే ఆచార్యులవారు పడరాని ఇబ్బందులు పడ్డారు. అయినా వారు సిసలైన సత్యవాదిగానే నేటికీ కొనసాగుతున్నారు.

శ్రీమాష్టరుగారు మన మధ్య ఉన్నప్పుడు అన్నదానాలు చేయించారు గదా? అని మీరు అడుగుట సహజమే. కానీ బంతిలో విచక్షణ చూపడం అంటే పేద, ధనికుల బంతులు వేరువేరుగా పెట్టడం, అన్నార్తులకు అన్నం పెట్టకుండా, ఆకలి లేనివారికే భోజనాలు పెట్టడం, నిరుపేదలకు ప్రసాదం నామమాత్రం పెట్టి, 'మనవాళ్ళు' అనే వ్యామోహంతో ప్రసాదం పొట్లాలు ఇచ్చి పంపడం వారెప్పుడూ అంగీకరించలేదు. అలా జరిగి ఉంటే అవి వారి దృష్టికి వచ్చి ఉండవు. వారి దృష్టికి వచ్చినాక ఆయా కార్యకర్తలను మెత్తగా మందలించకుండా వదలలేదు. కానీ వక్ర బుద్ధులుగల కార్యకర్తలు తమ నీచ బుద్ధులు మానకుంటే వారిది బాధ్యతకాదు గదా! పై సేవాకార్యక్రమాలన్నీ చేయమని, అన్నదానం ముఖ్యం కాదని ధర్మం బోధించే ఉపన్యాసాలను మందిరం తరపున హమేషా పెట్టించమని చెప్పారు. కానీ నేడు అన్ని కార్యక్రమాలకంటే ఈ అన్నదాన కార్యక్రమం మాత్రమే ముఖ్యమైన సేవ అనిభావించి తద్వారా సంక్రమించే మితిమీరిన పాపభారం మోయడం అంతా కలి ప్రభావం గదా. అందుకే గీతలో కృష్ణుడు మమ మాయా దురత్యయా , నా మాయ దాట శక్యము కానిది అంటూ మామేవయే ప్రపద్యంతే మాయా మేతాం తరంతితే అన్నాడు. నన్నే శరణు పొందిన వాడు ఒక్కడే ఈమాయను దాటగలడు అని అన్నారు. నన్నే శరణు పొందినవారు అంటే శ్రీమాష్టరుగారు ఒకటి చెపితే మరొకటి చేయడమని

అర్థమా? అందుకే వారు చివరికి అన్నదానాలు వద్దు అని చెప్పలేదు, చేయండి కానీ ఇదొక్కటే మంచి మార్గమనీ చెప్పలేదు. మా కలిచేడు మందిర ప్రారంభోత్సవానికి ఆ గ్రామంలో సరైన హోటల్ లేదు గనుక వచ్చిన అతిథులందరికీ భోజనం పెట్టమని మాత్రం చెప్పారు. శ్రీ మాష్టరుగారి మాటను మీకందించే భాగ్యం కలిగించిన కార్యకర్తలందరికీ ధన్యవాదములు. శ్రీమాష్టరుగారికి సాష్టాంగ దండ ప్రణామములు.

నా మాయ దాట శక్యము కానిది. కాని నన్నే శరణు పొందిన వారిని ఆ మాయ ఏమియు చేయలేదు అన్నారు గీతలో. ఈ మాయలో పడ్డాక ఇక అది సంపూర్ణశరణాగతి చేయనిస్తుందా? చేయనివ్వదు. అక్షరాల నిజం. ఈ సమస్యకే గీతలో అంటారు

ఏతాం త్వంత గతం పాపం జనానాం పుణ్యకర్మాణాం


తే ద్వంద్వ మోహనిర్ముక్తాహ భజంతే మా దృఢవ్రతాః

ఎవరి ఇప్పటి పుణ్యకర్మల బరువు పూర్వపు పాపకర్మల బరువు కంటే ఎక్కువైతే అప్పుడు వారు పరమాత్మను అనన్య శరణాగతి చేయగలరు

అంటారు. అలాగే జ్ఞానేశ్వరి భగవద్గీతలో సద్గురు భక్తులను మాయ ఏమియూ చేయజాలదని అభయమిచ్చారు. అయితే సద్గురు సమాశ్రయం జరగడం ఎలా? కేవలం పుణ్యకర్మలద్వారా మాత్రమే అని చెప్పారు. అయితే పుణ్యకర్మలు ఏవి?

శ్రీవెంకయ్యస్వామి చరిత్రలో ఒక భక్తుడు శ్రీస్వామివారిని కొండమీదకు తన వీపున మోసుకొని పోతే శ్రీస్వామివారు అన్నారు "మూరకు మూడు కోట్లు కట్టి రసీదు తీసుకపోయారయ్యా". అందుకు శ్రీమాష్టరుగారు వ్యాఖ్య వ్రాశారు, "అతడు శ్రీస్వామి వారిని మోసిన ప్రతి మూరడు దూరానికి అనంతమైన పుణ్యం అతని పేరున జమ వ్రాయబడింది" అని.





అంటే గురుసేవ ఉత్తమ పుణ్యకర్మ అన్నమాట. అయితే ప్రస్తుతం గురువుగారు మనముందులేరు గదా? అనవచ్చు.

ఈ సృష్టిలోని ప్రతిప్రాణిని గురు రూపంగా భావించి సేవించ మంటారు. శ్రీసాయిలీలామృతమే గాక అందరి మహనీయుల చరిత్ర మనకు బోధించే సత్యమిదే. ఏ ప్రాణిని ఆదరించినా అది గురువుకే చెందుతుంది అయితే ఆ భావనతో చేయడం ముఖ్యం. అలాగే ఏ ప్రాణిని నిరాదరించినా అది గురువుకే చెందుతుంది. గనుక సర్వప్రాణులకు హితము చేసే విధంగా, త్రికరణ శుద్ధిగా కీడు చేయకుండా ఉండేటట్లు మనం నడుచుకుంటే సద్గురు సమాశ్రయం లభించడమేగాక ఆ లభించిన సద్గురువు నుండి ఉత్తమమైన మేలు పొందగలుగుతాము. అందుకే వేమన యోగిగారు చెపుతారు "ఏ ప్రాణికి మేలు చేసినా అది పుణ్యకర్మేనని, ఏ ప్రాణికి కీడు చేసినా అది పాపకర్మేనని" గనుక మనం మనసా, వాచా, కర్మణా సర్వ జీవుల హితం కొరకే పాటు పడేటట్లయితే మనకు సద్గురు సమాశ్రయమూ, ఆ సద్గరువు నుండి ఉత్తమ మేలు పొందడం జరుగుతుంది. అంతేగాని కేవలం ఆరతులు నైవేద్యాలు సమర్పించి నిత్యజీవితంలో ఇతర ప్రాణులు సద్గురు రూపాలనే మాట మరచి ప్రవర్తిస్తే ఫలితమేముంటుందో యోచించండి.

జై సద్గురు రాయా

## మాష్టరుగారు ధ్యానాన్నిగూర్చి వ్రాసిన లెటరు:

విద్యానగర్, 6.6.77.

శ్రీ సుబ్బరామయ్యగార్కి

ఆశీస్సులు. మీ రెండు జాబులూ అందినవి. చాలా ఆనందం కల్గింది. మీకు సాయికృప వున్నది. మీరేమీ ఎవ్వరినీ అడగవలసిన పనిలేదు. అలా చేసుకొంటూ పోతుంటే సర్వం లభించగలదు. బండి పట్టాల మీదగా పోతే చాలు. గమ్యం తప్పక



[illegible]

చేరగలదు. పట్టాలంటే తప్పక ధ్యానాదులు పట్టుదలగా చేయగలగడమే. సాధన ఆరంభంలో కొంతకాలంపాటు చాలా మందికి అప్పుడప్పుడు సాధన మందగించినట్లుగా, ధ్యానం కుదరనట్లు అనిపించి నిరుత్సాహంతో విడిచివేస్తారు. అసలు సాధనలో పురోగతికి, మొదటి చిహ్నము అటువంటి నిరుత్సాహాన్నెప్పుడూ పొందక సాగిస్తుంటమే సాధన. బాగా కుదిరే **time**ను పగలు లాగా, మాంద్యాన్ని రాత్రిలాగా పోల్చవచ్చు. సాధక దశలో అప్పుడప్పుడూ రెండూ ఆవర్తాలు చేస్తుంటాయి. రాత్రిరాగానే బెంబేలు పడక పట్టుదల వహిస్తే తిరిగి తెల్లవారగానే మరింత సులువుగా సాగుతుంది. అలా వదలక చేయగలగడమే సాధనలో పెద్ద మలుపు. అందులో భాగం మాత్రమే ధ్యానంలో నిరామయత కుదరడం.

నిరామయత సద్గురువు కృపను సూచిస్తుంది. పైన చెప్పిన రీతిన ధ్యానం కొనసాగించిన తప్పక కృతార్థత రాగలదన్న నిదర్శనం ఇప్పటి మీ నిరామయత. కనుకనే చాల అదృష్టవంతులన్నది. బాబా కృపచూపారు. పై చెప్పినదే నిష్ఠ. ఎప్పుడైనా కుదరనట్లనిపించినా "ఇది తాత్కాలికమైన ప్రకృతి సిద్ధమైన మార్పే" అనే గుర్తుతో పట్టుదలగా సాధన మరింత పట్టుదలగా కొనసాగించడమే సబూరి. తాత్కాలిక చలనానికి బెంబేలవకుండా సాగడమే. కొండెక్కేప్పుడు కొంతదూరం పోయాక అలసట వచ్చినట్లు సాధకులకు కొంతకాలం నిరామయత తర్వాత ఒక్కొక్కప్పుడు చలనం, అస్థిమితం, అసంతృప్తిరావచ్చు. అప్పుడు కొండెక్కేవాడు కొద్ది సేద తీర్చుకుని తిరిగి శిఖరారోహణకుపక్రమించాలి. ఇలా శిఖరం చేరేదాక అహర్నిశలు పరిభ్రమిస్తాయి. ముందుగ ఇలా తెలుసుకొని ఉండడం అప్పుడు పట్టుదల ధైర్యాలనివ్వగలదు.

మీ అనుభవాలు చాలా బాగున్నాయి. స్వప్నాల సంకేతం కాలం సూచించగలదు. అంతదాకా అవి దేవ రహస్యాలు. విప్పి చెప్పరాదు. కనుక వ్రాయడం లేదు.



[illegible]

'జపం' అంటే నామము మాత్రం ఆవర్తమవుతూ ఉంటుంది. అది నిలిచి ఏమిచేయక చూస్తున్నట్లుండిపోతుంది ధ్యానం. కొందరికి రూపం నిలుస్తుంది, కొందరకు రూపరహితంగా నిలుస్తుంది. రెండూ మంచివే. ఎవరి సంస్కారాన్ననుసరించి వారి కొస్తుంది.

నేను **spot valuation** కు తిరుపతిలో **20/6** దాకా ఉండాలి. రేపు వెడుతున్నాను. **week end** కు వస్తాను.

శ్రీమతి సుబ్బమాంబగార్ని అడిగినట్లు చెప్పండి.

గుంటూరు సాయిబాబా భజనమండలి, **R.**అగ్రహారం, వారు వెలువరించే "శ్రీసాయిలీలామృతము" అను మాసపత్రికకు చందా 5/- పంపి **(M.O)** జనవరి 77 నుండి సంచికలు పంపను వీలైతే పంపమనండి. అందులో నా వ్యాసాలు వరుసగా వస్తున్నాయి; వస్తాయి. అది రాగానే మన సోదర బృందం అందరూ చదువుకోండి. మరలా కొంచెం పని ఎద్దడి తగ్గాక వ్రాస్తాను. దేవాలయం పని ఆరంభం కాగానే తప్పక మీరు సంకల్పించినట్లు శ్రీసాయీశునికి మీ కాయిక సేవనుకూడా సమర్పించు కొందురు గాని.

శ్రీసాయి మిమ్ములనందరిని సదా దయచూచుగాక!

ఇట్లు
ఆశీస్సులతో
భరద్వాజ

## మద్రాసు డొనేషన్లు:

విద్యానగర్ సాయిమందిర డొనేషన్ల కొరకు మద్రాసు వెళ్ళారు శ్రీమాష్టరుగారు. అక్కడొక వ్యాపారి "సార్ సాయి చరిత్రలో నింబారు క్రింద చూడు కావలసినంత ధనముందంటే అలాగే అవసరమైన ధనమంతా అక్కడ దొరికింది. రోజుకు ఇరవైరూపాయలు దక్షిణరాని రోజులలో కూడా సాయి రెండు వందలకు పైన ధర్మంచేశాడు గదా



మరి మీ కవసరమైన డబ్బు సాయి ఇవ్వరా? ఈ విధంగా అందరి దగ్గరకు రావడమెందుకు? అన్న వ్యాపారితో, అన్నీ సాయిచేస్తే ఇక మనం చేసేదేముంది. మనకు ఓర్పు, సహనం నేర్పేందుకే ఈ భిక్షాటన. సిద్ధ్య సిద్ధ్యో సమోభూత్వా సమత్వం యోగ ఉచ్యతే అన్నారు. పని సఫలమైనా, విఫలమైనా మనసు బ్యాలన్సు తప్పకుండా ఉండడం నేర్చుకోవాలి. అందుకే ఈ భిక్షాటన అన్నారు. ఇదేవిధంగా కలిచేడులో ఒకరింటికి పోతే "లేదంటే లేద"ని కసిరి కొట్టారు. ఎందుకు సార్ మనం ఇలా తిరగడం అంటే పై జవాబే చెప్పారు. కనుక మనం నిష్కామ కర్మలో పాల్గొనకుంటే మనలో ఉండే వక్రగుణాలు బయటికిరావు. బయటికి వస్తేనే ఆ సంస్కారాన్ని నిర్మూలించుకునే ప్రయత్నం చేస్తాము. గనుక మన సంస్కారాల మార్పుకొరకు నిష్కామ కర్మలో తప్పక పాల్గొనవలెను అని బోధించారు.

ఆధ్యాత్మిక సాధనలో సంస్కారముల మార్పు కొరకు తీవ్రప్రయత్నం చేయాలి గాని తొందరపాటు పనికిరాదు. తొందర పడితే పరిపాకం ఇంకా ఆలస్యమౌతుంది. అట్లని తీవ్రప్రయత్నం మానరాదు అన్నారు.

"వివిధ విషయాలు సమన్వయం చేసుకునే బుద్ధి కుశలతను పెంచుకోవాలి" అన్నారు శ్రీమాష్టరుగారు. ఏవిషయములోను ఎవరినీ తక్కువచేసి మాట్లాడేవారు కాదు. "సార్ వీడు భజన చేస్తూనే లేడీస్ వైపు చూస్తుంటాడు. ఇతని ధ్యాస లేడీస్ మీదనే గాని బాబా మీద ఉండదు" అన్న వారితో "ఈ గ్రామం జనాభా ఎంత? అన్నివేల మందిలో దేవునికి నమస్కరించేవారెందరు. వారిలో భజనకు వచ్చే వాళ్ళెంత మంది. ఇన్నివేల మందిలో భజనకైనా వచ్చాడు గనుక మిగిలిన రాని వాళ్ళ కంటే ఇతను గొప్పే కదా? అతను చేసే తప్పును పదిమందిలో కాకుండా ఒంటరిగా ఉన్నప్పుడు అతని ప్రవర్తన తప్పని వివరించాలి. అతనిలో అలా పరివర్తన వచ్చినంత వరకు మన

ప్రయత్నం మానకుండా చేస్తూ సాయికి విన్నవిస్తే తప్పక కాపాడుతారు.

అయితే అతని తప్పును అందరిలోను ఎత్తిచూపకుండా ఏకాంతంగా ఆ తప్పును గూర్చి వివరిస్తే అతనిలో తప్పక పరివర్తన కలుగుతుంది అని ముగించారు.

**సాయి ప్రచారం మన మంచికే:-** మనం చేసే సాయి ప్రచారం వల్ల ఎందరు బాగు పడ్డారు సార్?

శ్రీమాష్టరుగారు:- సాయి తత్వమేమిటి దానిని ఆచరిస్తే మనకెంత మేలు జరుగుతుంది తృప్తి, శాంతి, ఆనందం పొందేందుకు మహనీయుల జీవిత చరిత్ర పారాయణ, వారి బోధలను ఆచరించడం, ఆచరించేందుకు హృదయపూర్వక ప్రయత్నం చేయడం, మనం చేస్తూ ఇతరులకు చెపుతుంటే ఇతరుల విషయం ఎట్లా ఉన్నా మనకు గొప్ప మేలు జరుగుతుంది. ఎందుకంటే సాయినాథుని విషయం ఇతరులకు చెపుతుంటే అలాంటి భావాలు మనలో లోతుగా పాతుకొని మన సంస్కారాలు మార్చే ప్రక్రియ మనలో లోపల జరుగుతుంది. మనం ఎవ్వరి సంస్కారాలను మార్చలేము. కానీ ఎదుటివారికి సాయి యొక్క విశిష్టతను గూర్చి చెపుతుంటే మనలో ఆ భావాలు లోతుగా పాతుకొని మన సంస్కారాలు మారి తీరుతాయి. ప్రచారం అనే తీవ్రప్రయత్నం ద్వారా మనం మొదట మారుతాము. మన ప్రచార ప్రయత్నం ద్వారా ఇతరులు బీజప్రాయంగానైనా క్రొత్త సంస్కారాలకు అలవాటు పడుతారు. భగవంతుని కృప సదా సమానంగా అందరిపైన వర్షిస్తుంది. కానీ భగవంతుని విశ్వసించి, అనుభవములు పొంది పారాయణలు, ప్రవచనాలు తిరిగి తిరిగి చదవడం ద్వారా క్రమంగా వారిలో బీజప్రాయంగానైనా క్రొత్త సంస్కారాలు ఏర్పడుతాయి. కొందరిలో ఈ జన్మలోనే ఆ సంస్కారాలు ఫలవంతమవుతాయి. అలాకాని వారికి మరు జన్మకైనా వారిలో బీజాలుగా ఉన్న



సంస్కారాలు మొలకెత్తక మానవు. మనం వారికి సాయిని పరిచయం చేస్తే వారినెలా తనమార్గానికి తెచ్చుకోవాలో సాయికి బాగా తెలుసు. అనేకమంధి నాస్తికులు సాయి మార్గానికి రావడం వారి నాస్తిక సోదరులను ఆశ్చర్యపరచడం చూస్తున్నాము కదా! గనుక ప్రచారం వల్ల ఇతరులకంటే మనకే గొప్పమేలు కలుగుతుంది.

ఒక సాధకుణ్ణి శ్రీమాష్టారి దగ్గరకు రమ్మంటేరారు. ఆ సాధకుని దగ్గరకు మాష్టరుగారు వస్తానంటే వద్దంటాడు. గనుక ఆ సాధకుని విషయం వదిలేశారు.

"నా పంచన చేరిన వారికి పాయసం పోస్తాను. చేతనైన వారు జుర్రుకుంటారు. లేకుంటే పాయసం చీమలకో, ఈగలకో ఎవరికి ప్రాప్తముంటే వారికి దక్కుతుంది" అన్న శ్రీమాష్టరుగారి మాట సత్యమయింది. ఆధ్యాత్మిక సాధనలో మొదట అహంకారం చావాలి. వినదగు నెవ్వరు చెప్పిన, వినినంతనే వేగిర పడక వివరించదగున్ అన్నమాట ప్రతి సాధకుడు పాటించాలి గదా! తనకంతా తెలుసుననీ ఎవ్వరినుండి ఏమీ విననక్కరలేదనే గర్వమే పై సాధకుడికి ఒక జన్మ వృథా చేసింది.

## సాధకులకు ఉండ దగిన మరొక సుగుణం:

ఆధ్యాత్మిక సాధనంతా తృప్తి, శాంతి, ఆనందం పొందేందుకే గదా ఇవి సాధించేందుకు ప్రయత్నించే వారు కపటము లేకుండా త్రికరణ శుద్ధిగా వ్యవహరించడం అలవాటు చేసుకోవాలి. ఆలోచన, మాట, చేతలు ఒకటిగా ఉండాలి. ఈ మూడు ఒకటిగాలేకుంటే ఎన్నాళ్ళు సాధన చేసినా అభివృద్ధి గోచరించదు. త్రికరణశుద్ధిగా వ్యవహరిస్తే ఎదుటివాడు మరొకరోజు మనకు సహకరించడనే భయమే త్రికరణశుద్ధి లోపానికి కారణము. మనకా వస్తువు లభించాలనే దైవనిర్ణయముంటే భగవంతుడు ఆ వస్తువును ఎవరి ద్వారానైనా మనకంద జేస్తారు. త్రికరణశుద్ధి

లేకుండా వ్యవహరించినందున మన సాధన చక్కగా జరుగకపోగా దైవం దృష్టిలో మనం దోషులుగా లెక్క కట్టబడుతాము.

## పావలా బాకీకి మరొక జన్మ ఎత్తాలి:

ఒకరోజు ఒక భక్తునితో "ఫలానా బంకులో నేను పావలా బాకీ ఉన్నాను. అది ఇచ్చి రమ్మని పావలా ఇవ్వబోయారు శ్రీమాష్టరుగారు. ఆ భక్తుడు "పావలానే గదా సార్, ఏమి ఇస్తాములే "అని అన్నాడు. అప్పుడు శ్రీమాష్టరుగారు "ఆ పావలా బాకీకి మరలా జన్మ ఎత్తాలోయ్" అని అన్నారు. ఋణము, శత్రుత్వము, హత్యా చెల్లించక తప్పవు అన్న శ్రీసాయిమాట ఎంత ఖచ్చితంగా పాటించవలసి ఉందో మనకీ సన్నివేశంలో శ్రీమాష్టరుగారు బోధిస్తున్నారు. గడ్డిపోచలు బల హీనమైనవే గానీ అవికొన్ని కలిపి తాడుగా పేనబడినపుడు మదపుటేనుగును కూడా బంధించగలవు అన్నట్లు, పావలానే గదా అని అశ్రద్ధ చేస్తే ఒక జన్మే ఎత్తవలసి వస్తుంది. జాగ్రత్త అంటున్నారు శ్రీమాష్టరుగారు.

## సమన్వయించుకోవడం:

ఏ విషయాన్నీ పనికిరానిదిగా వారు తీసిపారేసేవారు కాదు. సార్ క్రిష్టియన్లు మైకుబెట్టి వీధులెంబడి మనలను దూషిస్తున్నారు, అన్నవారితో అన్నీ తెలిసి కూడా ఏమీచేయలేని మీలాంటి వారికంటే వారు చాలా గొప్పవారు, తాను నమ్మిన సత్యాన్ని పదిమందికి చెపుతున్నారు. మీకంటే వారు గొప్పవారే. తన తప్పు తాను తెలుసుకొనేటట్లు బైబిల్‌ను మనం వారికి వివరిస్తే ఇక అలాంటి తప్పుచేయుడు గదా. అన్నీ తెలిసిన మీరు ఎవరికీ ఏమీ చెప్పరు. గనుక మీకంటే వారు గొప్పవారే కదా? ఈవిధంగా ప్రతి విషయంలోను సమన్వయించుకొనే శక్తి వారొక్కరికే ఉంది అంటే అతిశయోక్తి కాదనుకుంటాను.



ప్రారబ్ధాన్ని క్షయింపజేసి మిగిలిన ప్రారబ్ధాన్ని శ్రీసాయి వారి తపోశక్తితో దగ్ధమొనర్చి చివరకు తనలాంటి మహనీయునిగా రూపొందించారు. తన కష్టాలన్నీ తన ప్రారబ్ధ ఫలితాలేనని తెలిసిన శ్రీ శివనేశన్‌స్వామివారు ఏమీ చలించక జరిగేదంతా చూస్తూ ఉండిపోయారు. చివరకు సాయి యంతటి మహనీ యుడుగా తయారయ్యారు. గనుక ప్రతివారు తన కష్టాలు తన ప్రారబ్ధ కర్మ ఫలితాలని గుర్తిస్తూ ఎవరిమీద ఏలాంటి ద్వేషభావం లేకుండా జీవిత యాత్ర సాగిస్తే క్రొత్త బంధాలు తగులుకోకుండా పాత బంధాలు సాయికి వదిలినవారమై సుఖము, శాంతి, ఆనందం పొందుతాము అంటారు శ్రీమాష్టరుగారు.

"నేను చెపుతున్నా నీవు వినిపించుకునేదెప్పుడో" శ్రీపాకలపాటి గురువుగారి చరిత్రలో కొండకోనకు అడవిబాట అనే అధ్యాయంలో వ్రాస్తారు శ్రీమాష్టరుగారు. వారి మాట వినడం మాత్రమే చాలదు. ఆ మాట మనకు హృదయగతం కావాలి. దిల్‌కేబాత్ ఔర్ దిమాక్‌కేబాత్ అన్నారు. దిల్ అంటే హృదయం. డిమాక్ అంటే మనసు. దిల్‌కేబాత్ ఎలా అవుతుంది? ఎప్పుడు అవుతుంది? మన తత్వం సాత్వికంగా మారాలి. రాజస తామస తత్వాలు నశించాలి. సాత్వికత ఎలా పెంచుకోవాలో వార్తాలాపం అనే గ్రంథంలో చెపుతారు. శాస్త్రపఠనము, శ్రవణము, మననము, ఆహారశుద్ధి (అంటే ధర్మంగా ఆర్జించినదని అర్థము. శాఖాహారము మాత్రమేనని భ్రమ పడవద్దు. మాంసాహారం తినే మహనీయులు కోకొల్లలుగా ఉన్నారు.) సత్‌సంగము, మహనీయుల దర్శనము, సన్నిధి, సేవలు వీటివలన వారు బోధించిన దానిని మనచేత వారు ఆచరింప జేస్తారు. పై విషయాలు ఆచరిస్తే వారి బోధ వినగలుగుతాము. కీర్తి ప్రతిష్టలు, అప్రతిష్టలు ఋణానుబంధాన్ని అనుసరించి వచ్చేవే గాని మన అర్హతకు సంబంధించినవి గావు. ఏ పని చేసినా నాకు చేతగాదు అని

చెప్పకూడదు. ఆయనకు (సాయికి) నమస్కరించి చేతనయిన వరకు చేయడమే. బేలుదారిపని దగ్గరనుండి పెండ్లి మంత్రాలు, వైద్యము, కరెంటు పని అన్నీ చేయగలిగి ఉండాలి.

## ఆహారము ఆకలికి మందు:


ఆహారము ఆకలికి మందువలె తీసుకోవాలి, రుచికొరకు తింటే ఈ శరీరము త్వరగా రిపేరుకొచ్చి ఆస్పత్రి పాలవుతాము. అప్పుడు ఈ శరీరముతో గురుసేవ చేసే భాగ్యముండదు. గురువు ప్రత్యక్షముగా లేడని చింతపడవద్దు. అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడని వ్రాసుకోమన్నారు. నేను నా మహాసమాధి అనంతరము కూడా అప్రమత్తుడనే, ఏ జీవిని ఆదరించినా తిరస్కరించినా నాకే చెందుతుంది. శ్రీభరద్వాజ మాష్టరుగారు "ఎవరి మనసు నొప్పించినా నా కిష్టముండదు" అన్నారు. 'అనంతమైన నీ పాద సేవను కోరితినో దేవా' అని సేవ చేయాలంటే ఈ శరీరం బాగుండాలి కదా.


భగవంతుడు నిజంగా కోరేదేమిటి? మన కాలము, మన మనస్సు మాత్రమే. అలంకరణలు, నైవేద్యాలు, హారతులు అన్నీ మన తృప్తి కొరకే. శ్రీసాయి, శ్రీస్వామి, శ్రీమాష్టరుగారు ఈ సత్యాన్ని చాలా చక్కగా బోధించారు. దమ్మపేట నాగేశ్వరరావుగారు తాను చెప్పుకొన్నదానికంటే రెండు నిమషాలు ముందుగా మందిరం నుండి వెళ్ళిపోయాడు. నాటి స్వప్నంలో శ్రీవెంకయ్యస్వామి కన్పించి మందిరం బయటికి వెళ్ళిన వారిని చొక్కా కాలరు పట్టుకొని మందిరంలోకి లాక్కొచ్చి మందిరంలోని గోడ గడియారము చూపించారు. అందులో 6గంటల 28 ని. అయింది. అది వారానాడు మందిరము నుండి బయటికి వెళ్ళిన టైము. తాను చెప్పుకొన్న ప్రకారము 6గంటల 30 ని. వరకు ఉండకుండా 2 నిమిషాలు



ముందుగా వెళ్ళారని శ్రీస్వామివారు చెపుతున్నారని గ్రహించి అందుకు శిక్షగా 24 గం. ఎలాంటి ఆహారం తినకుండా నీళ్ళు మాత్రమే త్రాగి ఉన్నారు. శ్రీమాష్టరుగారు జీవితాంతము 5 గం. 50 ని. వచ్చి మమ్ములను నిద్రలేపి 6 గం. హారతి చేయించేవారు. గనుక పూజ, హారతులు, పారాయణ, ప్రదక్షిణలకు సమయపాలన చాలా ముఖ్యము. సమయపాలన లేకుండా యాంత్రికము, లాంఛన ప్రాయమైన సాధనలు చేస్తుండ బట్టే మనకు సత్ఫలితాలు రావడం లేదని మనం బాగా గుర్తించాలి. 1. సమయ పాలన 2. అర్థము తెలుసుకొని పూజ చేయడం 3. పారాయణ ప్రదక్షిణలు చేసేటప్పుడు మనస్సు స్థిరంగా ఆ మహనీయునిపై నిలపడం ప్రధానమని గుర్తించాలి.

# నాకు తెలిసిన మాస్టారు







# ప్రార్థన

శ్లో॥ ''మూకం కరోతి వాచాలం
పంగుం లంఘయతే గిరిం''

కుంటివారికి కొండలు ఎగిరి దూకు సామర్థ్యం ఇవ్వగల గురుదేవా! మూగవారి నోట వేదములు పలికించు ఓ సద్గురురాయా! తమ కృపను ఈదీనునిపై కాస్త ప్రసరింపజేయ ప్రార్థన.

శ్లో॥ యదంఘ్రి కమల ద్వంద్వం ద్వందతాప నివారణం ।
తారకం భవ సింధోశ్చ తం గురుం ప్రణమామ్యహం ॥

తమ దివ్య పాదారవిందముల నాశ్రయించిన జీవులు ద్వంద్వాలను అతిక్రమించి ఈ భవ సముద్రమును దాటగలుగుచున్నారు. అట్టి తమ దివ్య పాదారవిందములకు ప్రణమిల్లుచున్నాను.

శ్లో॥ గురుమధ్యే స్థితం విశ్వం విశ్వమధ్యే స్థితో గురుః ।
గురుర్విశ్వం నచాన్యోస్తి తస్మై శ్రీ గురవే నమః ॥

శ్రీగురునియందు ఈ విశాల విశ్వం ఇమిడియున్నది. ఈ విశాల విశ్వమంతా శ్రీగురుడే వున్నాడు. శ్రీగురునకు అన్యముగా ఏదియులేదు. అట్టి గురుదేవునకు నమస్కారము.

సాధ్యమైనంతసేపు సద్గురుదేవులైన శ్రీ సాయిమాష్టరుగారి దివ్య చరణారవింద ములపై చంచలమగు ఈ మనసును నిమగ్నం చేయడం, వారి దివ్య లీలాచింతనలో ఈ పిచ్చికోతి అనే మనసును త్రిప్పడమే ఈ రచనా వ్యాసంగ లక్ష్యము. ఇందుకు వారొసగిన దివ్యౌషధము Live in the present (వర్తమానంలో నివసించు). ఆ దివ్యౌషధం చక్కగా వంటబట్టాలంటే చక్కగా పథ్యముండాలి. నామజపము త్రికరణశుద్ధిగా చేసిన ఇడ్లీలను శ్రీ వెంకయ్య స్వామివారు తిన్నారు. అట్టి నామజపం లేకుండా తెచ్చిన ఇడ్లీలను తాకేందుకు కూడా నిరాకరించారు శ్రీస్వామివారు. త్రికరణశుద్ధి గల నామజపమే ఆ పథ్యం. భవరోగంతో సతమతమయ్యే నేను సుడిగుండాలలో పడకుండా శ్రీ మాష్టరుగారి పాదముల చెంతకు చేర్చుకోమని ఆ ప్రేమమూర్తికి ప్రణమిల్లుచున్నాను.

పెసల సుబ్బరామయ్య

# ముందుమాట

ఈ పవిత్ర గ్రంథం మీకందించుటలో గల నా ముఖ్యోద్దేశ్యము మీకు విన్నవిస్తున్నాను. నేనొక మనిషిగా మీముందు నిలిచేందుకు ముఖ్య కారకులు శ్రీ మాష్టరు గారు మాత్రమే. శ్రీ మాష్టరుగారితో నాకు పరిచయమే లేకుంటే నేను తప్పక ద్విపాద పశువునే అయివుండేవాడను. నన్ను మనిషిగా రూపొందించడమే గాకుండా గొప్ప సిద్ధపురుషులైన శ్రీ రంగన్నబాబుగారు (గుంటూరు), శ్రీ వెంకయ్యస్వామివారు (గొలగమూడి), శ్రీ జిల్లేళ్ళమూడి అమ్మగారు, శ్రీ పూండిస్వామివారు, శ్రీ మాయి అమ్మగారు, శ్రీ చివటం అమ్మగారు, శ్రీ సుధీంద్రబాబు గారు, శ్రీ అనసూయ మాతగారు (పొరడసింగా), శ్రీ శివనేశన్ స్వామిగారు, శ్రీ నారాయణ మహరాజ్‌గారు, శ్రీ గజానన మహరాజ్, శ్రీ బాలయోగిగారు (ముమ్మిడివరం), శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి గారు, శ్రీ నాంపల్లి బాబాగారు, శ్రీ గులాబ్ బాబాగారు, శ్రీ స్వామి కేశవయ్య గారు మొదలైన మహనీయుల దర్శన ఆశీస్సులిప్పించిన కరుణామూర్తి శ్రీ మాష్టరుగారు. ఆ మహనీయుని కృపతోనే షిరిడీ, అక్కల్‌కోట, మాణిక్యనగర్, నర్సోబావాడి, గాణుగాపూరు, కాశి, నాగపూర్ వంటి దివ్య పుణ్యక్షేత్రాలు దర్శించగలిగాను.

''బాబా పిలిస్తే పలుకుతారు'' అనే నమ్మకం ముందు నీకుంటే తర్వాత విద్యార్థులకు గట్టిగా ఛాలెంజింగ్‌గా చెప్పగలుగుతావు అని చెప్పి, బాబా పిలిస్తే పలుకుతారు అనే నమ్మకం నాకు కలుగజేసిన మహనీయమూర్తి వారు. అంతేగాక భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారి చరిత్ర విషయాలు సేకరించే భాగ్యం కేవలం శ్రీ మాష్టరుగారి వలననే కలిగింది. శ్రీ స్వామివారి నుండి ఎన్నో దివ్యానుభవాలు పొందిన నేను గొలగమూడిలోని వారి సమాధి యొద్ద శాశ్వతంగా నివసించేందుకు ప్రేరణ నిచ్చిన పుణ్యమూర్తి శ్రీ మాష్టరుగారే.

ఏ సిద్ధపురుషుని దగ్గరకెళ్ళినా కొన్ని గంటలో, లేకుంటే కొన్నిరోజులు మాత్రమే ఉండగలము. కాని ఎక్కువగా కలిచేడు గ్రామ ప్రాంతములో పర్యటించే శ్రీ స్వామివారిని సిద్ధపురుషులని నేను గుర్తించేటట్లు చేసి షుమారు ఏడెనిమిది సంవత్సరాలు వారి దివ్య సన్నిధిలో గడిపేటట్లు చేసిన మహనీయమూర్తి వారు. శ్రీ స్వామివారంటే ఏమిటో ఈనాడు నా భావం మీముందు స్పష్టంగా విన్నవించలేను. కాని అట్టి దివ్యభావన నాకు కల్గేందుకు కారణం నా గొలగమూడి నివాసంద్వారా నిత్యం వినే భక్తుల దివ్యానుభవాలే. అగ్ని దగ్గరున్న వారి గుడ్డల తేమ, వారి ప్రయత్నమే లేకుండా ఆరిపోయినట్లు సిద్ధపురుషుల



సన్నిధిలో ఉన్నంత మాత్రాన మన దుష్టసంస్కారాలు మన సాధనతో నిమిత్తం లేకుండా రాలిపోతాయని పూజ్యశ్రీ మాష్టరుగారు చెప్పిన వాక్యమెంత సత్య సమ్మతమైనదో నాకనుభవమైంది. ఇన్నివిధాలుగా నన్నుద్ధరించడమే గాకుండా జీవితాంతము నాకు ఉపయోగకరమైన నాలో మార్పు తెచ్చే దివ్యవాక్కులను అనుగ్రహించిన మహనీయ మూర్తి వారు.

వారి దివ్యవాక్కుల వెనుక ఎంత గొప్ప ధర్మసూక్ష్మాలు ఇమిడియున్నాయో అవగతమయ్యేందుకు నాకు షుమారు ఇరవై సంవత్సరాల కాలం పట్టింది. ఇక వాటిని ఆచరణ యోగ్యం చేసుకోవాలంటే ఎన్ని జన్మలు పట్టాలో నాకర్థంకావటం లేదు. ఇందులోని ప్రతిమాట మానవజాతి ఉద్ధరణకు చక్కని సోపానమై ఉన్నదని నా దృఢ నమ్మకము.

''నా నోటిగుండా వచ్చిన ప్రతిమాట వ్రాసి పెట్టుకో సుబ్బరామయ్యా, నీకు భవిష్యత్తులో పనికొస్తాయి'' అన్న వారి దివ్యవాణిని నేను సంపూర్ణంగా నెరవేర్చలేక పోయాను. వారి ఎడల నాకుగల కృతజ్ఞతా భావాన్ని తెలుపుకొనేందుకే ఈ వాణీ సుమాంజలి వారి పాదములకర్పిస్తున్నాను.

ఇట్టి సదవకాశము నాకు కల్గించిన భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారికి, శ్రీ సాయినాథునికి, పూజ్యపాదులు శ్రీ మాష్టరుగారికి అనంతకోటి సాష్టాంగ దండ ప్రణామములు.

ఎడతెరపి లేకుండా తన ఇష్టమొచ్చినట్లు మన మనస్సు ఆలోచనలరూపంలో ఒక నదివలె నిరంతరం సాగుతూ నిద్రలోకూడా స్వప్నాల రూపంలో మనలను వేధిస్తుంది. ఇట్టి మనస్సును మన స్వాధీనంలోకి తెచ్చుకునే ప్రయత్నంలో మనకు ప్రీతిపాత్రులైన వారిని గూర్చి చదవడం, ఆ చదివినదాన్ని మననం చేయడం, ఆ సద్గుణాలను మనంకూడా అలవరచుకునే ప్రయత్నం చేసేందుకు ఈ చిన్న గ్రంథం ఉపయోగపడాలని నా మనస్సును వారి దివ్య లీలారూపంలో త్రిప్పేందుకు నాకు సహకరించేటట్లు చేయమని శ్రీ మాష్టరు గారిని ప్రార్థిస్తున్నాను.

శ్రీ మాష్టరుగారి బోధలన్నీ అనంతములు. వారి బోధనా పద్ధతులు కూడా అనంతములు. ఇట్టి అనంత జ్ఞానరాశిని గ్రంథస్థం చేయడం నాలాంటి అల్పజ్ఞునకు సాధ్యముకాదు. కానీ కేవలం నా అవసరాన్నిబట్టి వ్రాస్తున్నాను. వాటిని సౌలభ్యముకొరకు

1. వాచస్పతి 2. ఆచరణ 3. ఆధ్యాత్మికత 4. లెటర్స్ 5. నాకనుగ్రహించిన దివ్య సంపద. 6. హోత్ దరూన్ చలాల్. అనే శీర్షికల క్రింద విభజించి వ్రాస్తున్నాను.

శ్రీ మాష్టరుగారు చెప్పినట్లు కూర రుచిగా ఉందా లేదా చెప్పగలం కాని ఇందులో ఉప్పెంత ఉంది, కారమెంత ఉంది చెప్పలేము. వారి దివ్యస్మృతులే మనకు మధురాతి మధురమైన వంటకాలు.

**ఈ గ్రంథమందలి లోపములను సహేతుకముగా నా దృష్టికి తెచ్చినట్లయిన మరుసటి ముద్రణలో సవరించుకోగలను.**

నమస్తే!

**పెసల సుబ్బరామయ్య**



సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః
ఆచార్య శ్రీ భరద్వాజ గురవే నమః

# మాస్టారుతో మొదటి పరిచయం

## మృగాన్ని మనిషిగా మార్చిన మహనీయమూర్తి

1966లో నా వివాహమైంది. తలుపూరులో బి.ఇడి. సైన్సు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. వాలీబాల్, బ్యాట్‌మెంటు ఆటలు, భార్యతో కాలక్షేపం, క్లాసులో చిలక పలుకులు పలకడం – ఇంతకంటే ప్రపంచమే తెలియని పశుప్రాయమైన జీవితమది. మా ఇంటికి నలభై గజాల దూరంలో శ్రీ వెంకయ్యస్వామివారు వేపచెట్టు క్రింద విడిది చేసియున్నారు. గ్రామస్తులు గుంపులు గుంపులుగా దర్శించిపోతున్నారు. నన్ను మా ప్రక్కింటివారు ఆహ్వానించినా నేను శ్రీ స్వామివారి దర్శనార్థం వెళ్ళేవాణ్ణి కాను. కామాంధునకు కళ్ళు కనబడవంటే ఇదే కాబోలు! అని ఇప్పుడనిపిస్తుంది. నా తెల్లని డ్రస్సు, శరీరబలం, ఎంత గర్వమో అప్పుడు!

తలుపూరు నుండి కలిచేడుకు బదిలీ అయింది. ఒక అమ్మాయి, అబ్బాయి కలిగారు. అయినా నా జీవితంలో మార్పు లేదు. విద్యానంద స్వామి వారి ఉపన్యాసం విని భగవద్గీత చదివాను. అర్థంకాలేదు. అది మొదలు నా ఇష్టదైవమైన శ్రీకృష్ణుని ఆరాధిస్తూ శ్లోకాలు, అష్టోత్తరం చదివేవాణ్ణి. కాని తృప్తి, శాంతి లేదు. తిండి, ఆటలు, స్త్రీలోలత్వం, క్లాసులో పాఠాలు, ఎన్నాళ్ళయినా నా జీవితమింతే అనిపిస్తుంది. కాని అందులోనుండి బయట పడలేను.

డిసెంబర్ 1975న పూజ్యపాదులు మాష్టరుగార్ని కలిసాను. నా జీవితమే పూర్తిగా తారుమారైంది. మరురోజు నుండి ఆటలు మానేశాను. ఆహారం తగ్గిపోయింది. నిద్ర చాలా తగ్గిపోయింది. ఆదివారం వస్తే విద్యానగరులో మాష్టరుగారిని దర్శించాలని ఆరాటం. **పశుతుల్యమైన**

జీవన విధానం నుండి ఆనందమార్గంలో అడుగిడినాను. మాష్టరుగారిని ఎలా కలిసానో కొద్దిగా చెపుతాను.

మాష్టరుగారితో నా తొలిపరిచయం చిత్రంగా జరిగింది. నా దగ్గర 10వ తరగతి చదివి శ్రీ మాష్టరుగారి దగ్గర బి.ఎస్‌సి. చదివిన విద్యార్థి చి॥ అచ్చి రమణయ్య మాటల సందర్భంలో నన్ను తప్పక శ్రీ మాష్టరుగారిని కలువమన్నాడు. 'భరద్వాజగారి గొప్పతనమేమిటి, షేక్‌స్పియర్‌ను గూర్చి ఏమి చెపుతాడు?' అని అడిగాను. ''వారిని గూర్చి నేను చెప్పలేను సార్. మీరే కలసి మాట్లాడండి. తెలుస్తుంది'' అని చెప్పి మూడవనాడు కలిచేడు వస్తున్నారని కూడా చెప్పాడు. నేను మరచిపోతాను, నీవే వచ్చి తీసుకు పొమ్మన్నాను. సరేనని వెళ్ళాడు.

మూడవనాడు సాయంకాలం శ్రీరామమందిరం దగ్గరకు నేను, నా మిత్రుడు టి.వి. శేషగిరిరావుగారు వెళ్ళాము. అదే సమయంలో మాష్టరు గారిని వేదికమీదకు ఆహ్వానించడం, మాష్టరుగారు రావడం జరిగింది. మాష్టరుగారు 'గురుమధ్యే స్థితం విశ్వం' అనే ప్రార్థనా శ్లోకం చదివి ఒక్క నిముషం ఆగి, 'ఎంత చిత్రమో చూడండి,' అన్నారు. వెంటనే సభాస్థలి నిశ్శబ్దమైంది. ఇక్కడ ఫ్యాను, మైకు, లైటు పనిచేస్తున్నాయి. అక్కడ పిండి మిల్లు, ఆప్రక్క గుడ్డల మిషను పనిచేస్తున్నాయి. ఎందువల్ల? కరెంటువల్ల. కరెంటు ఎలా పుడుతుందో తెలుసా? ఏమీలేదు, నీటి ప్రవాహానికి అడ్డకట్టవేసి ప్రవాహం ఆపుతారు, కరెంటు వస్తుంది. అంతే. అదెలా సాధ్యం అనుకోవద్దు. డ్యాంకు ముందు ఒక పెద్ద ఫ్యాను ఉంటుంది. దాని ఇరుసుకు మాగ్నెట్ తగిలిస్తారు. దానిచుట్టూ రాగితీగల చుట్ట ఉంటుంది. డ్యాంలో నీరు ఫ్యానుపై పడే ఏర్పాటుంటుంది. అందువల్ల ఫ్యాను తిరుగుతుంది. గనుక మాగ్నెట్ తిరుగుతుంది. రాగితీగల చుట్టలో కరెంటు పుడుతుంది. ఇదే మన సైకిల్ డైనమాలో గూడా జరిగేది. మన ఆలోచనా ప్రవాహాన్ని ఆపగలిగినట్లయితే ఈ కరెంటు కంటే మహత్తరమైన కరెంటు మనలో పుడుతుంది. దానితో చనిపోయిన వాళ్ళను కూడా బ్రతికించవచ్చు. మరి ఈ కరెంటు అలాంటి మహత్తర కార్యాలు చేయలేదు. మీ గ్రామానికి వచ్చే శ్రీ వెంకయ్యస్వామివారు అలా ఆలోచనా ప్రవాహాన్ని ఆపిన మహనీయుడే. వీరేకాదు, వాకాడులో



యజ్ఞం చేయించే శ్రీ నారాయణ మహరాజ్ అలాంటివారే. వీరే కాదు శ్రీ రమణమహర్షి, షిరిడీసాయి, రామక్రిష్ణ పరమహంస, తాజుద్దీన్ బాబా, శ్రీ రంగన్నబాబుగారు, పూండి స్వామివారు, ఇలా ఎందరో మహనీయు లున్నారు. వాకాడులో యజ్ఞం చేయించే నారాయణ మహరాజ్‌గారి ఆటలు కట్టించాలని కొందరు తుంటరి కాలేజీ విద్యార్థులు వచ్చారు. వారు మాట్లాడకముందే వారంతకుముందు చేసిన తుంటరి పనులన్నీ ఏకరువు పెట్టి వారి నోరు మూయించారు. అంతటితో వారు వెళ్ళిపోయారు. కావాలంటే వారిని వచ్చి చూడండి. ఇలాంటి మహనీయులలో అగ్రగణ్యులు శ్రీ షిరిడీసాయి అని చెప్పి శ్రీ సాయిలీలామృతమంతా సంక్షిప్తంగా చెప్పారు. ఎవరైనా మాట్లాడాలంటే కల్యాణరాం గని దగ్గరకు వచ్చి మాట్లాడవచ్చని చెప్పి వేదికదిగి వెళ్ళారు.

మేము కల్యాణరాం గనిదగ్గరకు వెళ్ళేసరికి మాష్టరుగారు అక్కడి ఆఫీసు గదిలో కాలేజీ విద్యార్థులతో మాట్లాడుతున్నారు. ఆ విద్యార్థులంతా నా స్టూడెంట్సే. నన్ను చూస్తూనే, ''అయ్యవారు మాష్టరుగారిని ఏమైనా అడుగు తారు'' అంటూ అందరూ నిశ్శబ్దమైనారు. ''ఏమైనా అడగండి'' అంటూ మాష్టరుగారు నన్ను హెచ్చరించారు. ఇక తప్పుకోలేక ఒక ప్రశ్న అడిగాను. ''సార్! ఇందుగలడందులేడని సందేహము వలదు అన్నట్లు ఈ విశ్వమంతా భగవంతుడే గదా! మరి మన వేలు మనం కొరుక్కుతినం గదా, మరి అరటిపండు కూడా భగవంతుడే కదా. దాన్ని వారికర్పించడమేమిటి? వారు తినడమేమిటి?'' అని అడిగాను. వారెన్నో విధాల చెప్పారు. నాకు సంతృప్తి కలుగలేదు. కొంతసేపు విద్యార్థులతో మాట్లాడి మరలా నన్ను 'మీ ప్రశ్న ఏమైంది?' అని అడిగేవారు. వారలా నాలుగుసార్లు అడిగినా నాకు సంతృప్తికరం గాలేదు. అప్పటికే రాత్రి 1 గంటకు పైన అయింది. ''రేపు ఉదయం 8 గంటలకు శ్రీ వెంకయ్యస్వామి దగ్గరకు - ఈ ప్రాంతమందలి సిద్ధలయ్య కొండకు – పోతాము. వచ్చేవారు రావచ్చు'' అని చెప్పి అందరినీ పంపేశారు. తెల్లవారి సరిగ్గా మేము వెళ్ళేసరికి మాష్టరుగారు ప్రయాణమై వస్తున్నారు.

మార్గమధ్యంలో నన్ను చొక్కా లాగి ఆపి, విద్యార్థులను ముందు పోతుండమన్నారు. తిరిగి ''మీ ప్రశ్న ఏమైంది?'' అని మొదలుపెట్టారు. శ్రీ స్వామివారి దగ్గర కొచ్చేసరికి నాలుగుసార్లు వివరించారు. మధ్యలో కొంత

కాలవ్యవధి ఇస్తూ వచ్చారు – చెప్పినదాన్ని నేను అవగాహన, ఆలోచనతో ఒక అంగీకారానికి వస్తానని. నేను మారలేదు. శ్రీ స్వామివారి దర్శనం అమోఘము. మాష్టరుగారిని శ్రీ స్వామివారు ఎన్నెన్నో లక్షలు కట్టమంటారు. మాష్టరుగారు తన దగ్గరున్న డబ్బంతా సమర్పించి, వచ్చిన విద్యార్థుల దగ్గరున్న పైకమంతా తీసి సమర్పించారు. ఇంకా కట్టమంటారు శ్రీ స్వామివారు. శ్రీ మాష్టరుగారు ఒక్క నమస్కారం చేసి కట్టాను స్వామీ అంటారు. శ్రీ స్వామివారు మరలామరలా అలా అడగడం వీరు అలానే చెప్పడం జరిగింది. తర్వాత ఆశీర్వాద చీటి ఇచ్చి, ప్రసాదం ఇచ్చిపంపారు. ప్రక్కనున్న దేవాలయం దగ్గర మాష్టరుగారు కూర్చున్నారు. తిరిగి నన్ను ''నీ ప్రశ్న ఏమైంది'' .అని మొదలుపెట్టారు. నేను నిర్మొహమాటంగా ''మీరు చెప్పేది నాకు నచ్చలేదు'' అని చెప్పేశాను. వెంటనే మాష్టరుగారొక కాగితం మీద జిల్లెళ్ళమూడి అమ్మ, శ్రీ రంగన్నబాబుగారు, పెద్ద బాలయోగిగారు, చివటం అమ్మ, శ్రీ పూండి స్వామి, శ్రీ నారాయణ మహరాజ్‌గారి అడ్రసులు, ఎక్కడ బస్సు ఎక్కాలి, ఎక్కడ దిగాలి వగైరా వ్రాసి ''ఈ మహాత్ములను దర్శించండి. మీరు అడుగకనే మీ ప్రశ్నకు సమాధానమొస్తుంది'' అని చెప్పారు. అంతదూరం నేను వెళ్ళలేనని ఆ కాగితం తీసుకోను నిరాకరించాను. మాష్టరుగారు ఎంతో బలవంతంగా, ''నీవు పోకుంటే మానె ఈ కాగితం నీ దగ్గరుంచ''మని నా జేబులో పెట్టారు. అంతే! నా పని పూర్తయిపోయింది.

మూడవనాడు శ్రీ నారాయణ మహరాజ్‌గారిని చూడాలని వాకాడు వెళ్ళాను. అక్కడే మాష్టరుగారిని కూడా దర్శించి విద్యానగర్ వచ్చాను. అదృష్టంకొద్దీ శ్రీ రంగన్నబాబుగారు మాష్టరుగారింటికి వచ్చి యున్నారు. ఒకేసారి ముగ్గురు మహనీయుల దర్శనమైంది.

విద్యానగర్‌లోని మాష్టరుగారి రూములో నా అనుభవం మరువరానిది. మేము వెళ్ళేసరికి శ్రీ రంగన్న బాబుగారు లోపల నిద్రపోతున్నారు. మాష్టరుగారి ముందురూము నిండా భక్తులు క్రిక్కిరిసి ఉన్నారు. ఒకామె శ్రీ రంగన్న బాబుగారి దివ్యలీలలు శ్రీ మాష్టరుగారికి వివరిస్తున్నది. శ్రీ మాష్టరుగారి ఆదేశంపై మమ్ములను కూడా సర్ది కూర్చోపెట్టుకున్నారు. కొంతసేపటికి ఆపుకున్నా ఆగకుండా నాకు కన్నీరు ప్రవహిస్తున్నది. ఇక తట్టుకోలేక లేచి మిద్దెమీదకు వెళ్ళి వచ్చాను. తిరిగి అదేవిధంగా వుంది. ఈ దఫా



శ్రీ రంగన్నబాబుగారి లీలలు వినకుండా ప్రక్కకు పోదల్చలేదు. కొంతసేపటికి నాకేమైందో తెలియదు. పాతవ్యక్తిలాగా అందరిని దాటుకొని మాష్టరుగారి వెనుక వుండే చిన్న గదిలోకి వెళ్ళాను. అక్కడున్న స్టీలు పళ్ళెంలోని విభూతి ఒక పేపరుమీద పోసి ఆ పళ్ళెంలో నేను వంట చేసుకునేందుకు తీసుకుపోయిన బియ్యం పోసి ఆ బియ్యంపైన ''ఓం సాయి'' అని వ్రేలుతో వ్రాసి మాష్టరుగారి ముందు ఆ పళ్ళెంపెట్టి వారికి నమస్కారం కూడా చేయకుండా కన్నీళ్ళతోనే వచ్చి కూర్చున్నాను. నా కన్నీళ్ళకు కారణం లేదు. అది ఒక దివ్యానుభూతి. దాన్ని శ్రీ మాష్టరుగారు గమనిస్తూనే ఉన్నారు కానీ ఏమీ ప్రస్తావించలేదు. అది మొదలు ప్రతివారం విద్యానగర్ వెళ్ళి శ్రీ మాష్టరుగారిని దర్శించేవాణ్ణి. నేనేమీ అడగను. వారు నాకేమీ చెప్పరు. వారి దర్శనం, వారి దివ్యవాక్కు వినడంలో నాకు గొప్ప ఆనందం ఉండేది. వారి ప్రభావం నామీద ఎంతగా ఉండేదో చెప్పలేను. నాలోని మార్పును నాకంటే చక్కగా మా శ్రీమతి గుర్తించింది.

శ్రీ మాష్టరుగారి దగ్గరకు వెళ్ళి వచ్చాక నేను చాలా ప్రశాంతంగాను, గంభీరంగాను, ఆనందంగాను ఉండేవాణ్ణి. ఏ కారణం చేతనైనా ఒక్కవారం వారి దర్శనం చేయకుంటే వెంటనే ఆ లోటు నాలో కొట్టొచ్చినట్టు ప్రకటమయ్యేది. ఎంతో విసుగుగాను, చికాగ్గాను, కోపంగాను ఉండేవాణ్ణి. గనుక నా శ్రీమతి నన్ను విద్యానగర్ వెళ్ళిరమ్మని ప్రోత్సహించి పంపేది. అక్కడ నుండి రాగానే నా ప్రవర్తనలో ఎంతో మార్పు ఉండేది. నేనెన్నో ప్రశ్నలు మాష్టరుగారిని అడగాలని కాగితంమీద వ్రాసుకొని వెళ్ళేవాణ్ణి. చిత్రంగా నేనా ప్రశ్నలు వారినడగకుండానే వారు ఇతరులతో మాట్లాడే మాటలనుండి నా ప్రశ్నలకు సమాధానాలు వచ్చేవి. ఒకరోజు అన్ని ప్రశ్నలకు సమాధానాలు వచ్చాయి. ఒక్క ప్రశ్న మాత్రం మిగిలిపోయింది. శ్రీ మాష్టరుగారు చివరగా లేచి ఇంట్లోకి పోతూ ''రమణవాణి'' అనే పత్రిక నాకిచ్చి చదువుకోమన్నారు. చిత్రం! మొదటి పేజీలోనే నా ప్రశ్నకు సమాధానముంది. ఇప్పుడు ఆ దివ్యసన్నిధిని నేను పొందే భాగ్యం ఈ జన్మకికలేదుగదా!

భక్తుల హృదయాల్లో ప్రేమ భావం ప్రతిష్ఠించడం ఆ సద్గురు మూర్తికే చెల్లింది. ఉదాహరణ :- మొట్టమొదటిసారి మమ్ములనందరినీ కృష్ణమూర్తిగారింటికి భోజనాలకు పంపారు. అక్కడ టేబుల్స్, కుర్చీలు చూచి అది ఒక హోటలనుకున్నాము. అక్కడ భోజనం పెట్టే విధానం చూచాక

మా గుండె చెరువైంది. విస్తర్లో వడ్డించిన కూర, పొడి, పచ్చడి వగైరాలో ఏది అయిపోతే అది వెంటనే మనం అడగకుండానే మరలా వడ్డిస్తున్నారు. నెయ్యి మరలా మరలా వేస్తున్నారు. ఈవిధంగా పెడితే ఈ హోటలు వారికేమి గిట్టుబాటవుతుంది అని నా మిత్రుడు, నేను మధనపడ్డాము. వెంటనే నా మిత్రుడు అక్కడున్న ఒకరిని ఆ విషయం అడిగేశాడు. ''ఇది హోటలు కాదు. వారు మాస్టరుగారి భక్తులు. వారేమిస్తారో, వీరేమి తీసుకుంటారో అది సాయికే ఎరుక. మనం తృప్తిగా భోంచేయడమే వారి ధ్యేయమని'' చెప్పారు. అంతటి ప్రేమ భావాన్ని వారి హృదయాలలో నాటిన శ్రీ మాస్టరుగారి ప్రేమ తత్వానికి సహస్ర ప్రణామములు.

## శ్రీ మాస్టరుగారితో మొదటి పరిచయము

ఈనాడు నాకు చాలా వింతగాను, ఆశ్చర్యంగాను తోస్తుంది. కాని ఆనాడు నాకేమీ అనిపించలేదు. అదేమిటంటే మా మొదటి పరిచయం లోనే నా జీవితానికి అవసరమైన నాలుగు విషయాలూ చెప్పేశారు.

1. సాధనయొక్క పరమగమ్యం చంచలమైన మనోచలనాన్ని ప్రయత్న పూర్వకంగా వివేక విచారాలతో ఆపడం అని బోధించారు. అదే మహనీయులందరూ చేసింది అన్నారు.

2. వడ్డీ వ్యాపారం చేయడం కుమార్తెకు వేశ్యవృత్తి నేర్పడం వంటిదన్నారు. ఆనాటితోనే ఆపనికి స్వస్తి చెప్పాను. బ్యాంకులో వేస్తే అనేకవిధాల దేశానికి ఉపయోగపడుతుంది గనుక మనకేదైనా మిగిలితే బ్యాంకులో ఉంచుకోసాగాను.

3. సినిమాలకు మనమిచ్చే ప్రతిపైసా బ్లాక్ మార్కెటీర్ల పర్సులోకి పోతుందని గుర్తించమన్నారు. అంతే నేటికి షుమారు ఇరవైరెండు సంవత్సరాల నుండి సినిమాలు బొత్తిగా మానేశాను. షిరిడీ సాయి బాబా, లవకుశ, వీరాంజనేయ ఈ మూడు సినిమాలు మాత్రం చూచాను. భార్యాబిడ్డలను సినిమా హాలులో వదిలి నేను బయట తిరుగుతుండటం, సినిమా వదిలే టైంకు తీసుకురావడం జరుగుతుంది.



4. ''మహనీయుల దర్శనం వల్ల నీకు సర్వం సిద్ధిస్తుంది. నీవు వారినేమీ అడగనక్కరలేదు'' అని మహనీయుల అడ్రసుల లిస్టు ఇచ్చారు. దర్శించమన్నారు. నా ప్రయత్నం లేకుండానే వారి కరుణతో దర్శించాను. ఆనంద డోలికలందుకున్నాను.

ఇంతటి మహత్తర మార్పు నాలో కల్గించిన ఆచార్యుల వారికి కేవలం నమస్కారములకంటే అన్యమేమి సమర్పించగలను!



సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః
ఆచార్య శ్రీ భరద్వాజ గురవే నమః

# వాచస్పతి

## మహాత్ముల తీర్పు

''నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని
కలుగనేటికి తల్లుల కడుపు చేటు'' (భాగవతం)

హరికీర్తి అంటే హరియొక్క గొప్పదనం అని అర్థం. ఆ శ్రీహరి మానవాకారం ధరించి మనమధ్య మెలిగి నేటి కాలానుగుణ్యముగా వారి వారి స్థాయికి తగినట్లు జ్ఞానబోధచేసి తళుక్కున మెరిసి చటుక్కున మాయమైన అపూర్వ రూపమే శ్రీ భరద్వాజ మాస్టరుగారు. ఈ క్రింది వ్యాసాలలో మొదట వారు శ్రీహరియొక్క అవతారమని నిరూపించే నిదర్శనాలు చెప్పి, తర్వాత వారి బోధలు, దివ్య వాక్కులు చెపుతాను.

వారినిగూర్చి మరో నందదీపం, మహాత్ముల ముద్దుబిడ్డడు మరియు సాయిబాబా ప్రత్యేక సంచిక వుండగా మరలా ఇదెందుకనడం సహజం. (1) శ్రీహరి కథామృతం ఎంత విన్నా - ఎంత వ్రాసినా తనివి తీరదు. అట్టి దివ్య చరిత్ర, దివ్యవాక్కులు, వారి దివ్యగుణాలను గూర్చి మననం చేసేకొద్దీ అదే సత్సంగమై మనలోనూ అట్టి దివ్య గుణాలేర్పడేందుకు అంకురార్పణ జరుగుతుంది. అదే ముక్తికి మొదటి సోపానము.

(2) వారు నేటికీ నిత్యసత్యులై వారిని నమ్ముకున్నవారిని ఎల్లవేళలా కంటికిరెప్పలా కాపాడుతున్నారన్న నగ్నసత్యాలు తెలిసినప్పుడు, వారు శరీరంతో వుండగా వారే దైవమని నమ్మి సేవించినవారికి వారు ఇప్పుడు లేరనే కొరతతీరి ఇప్పుడు కూడా వారియెడల సరైన అవగాహనతో – వారిని ప్రార్థించి వారినుండి తగు సహాయము పొందగలరనే ఆకాంక్షతో వ్రాయడమైనది. వారియందు



నిజమైన ప్రేమాభిమానములు కల్గిన ఆత్మీయులు పిలిచినా, పిలువకున్నా, వారు ఆత్మస్వరూపులై అనుక్షణమూ తనను నమ్ముకున్నవారిని కంటికి రెప్పవలె కాపాడుచున్నారని రాబోవు వ్యాసాలలో విశదమవుతుంది.

### శ్రీ భరద్వాజ మాస్టరుగారెవరు? సిద్ధపురుషులతీర్పు.

పరిపూర్ణ సిద్ధపురుషులైన శ్రీ పాకలపాటి గురువుగారికి మాస్టరుగారు శ్రీ మహావిష్ణువుగా దర్శనమివ్వడం, ఆ తర్వాత వారు మాస్టరుగారిని మరొక్కసారి చూడాలని తపించిపోవడం మాస్టరుగారి సోదరులైన శ్రీకృష్ణమాచారిగారికి లెటరువ్రాసి మాస్టరుగారిని తనవద్దకు పంపమని అర్థించడం, మాస్టరుగారు పాకలపాటి గురువుగారి యొద్దకు వెళ్ళివచ్చాక వారివెనుకనే పాకలపాటి గురువుగారు విశాఖపట్నం వచ్చి మాస్టరుగారిని మరొక్కసారి తనివితీరా చూచి వెళ్ళడం మొ॥ విషయాలన్నీ పాకలపాటి గురువుగారి చరిత్రలో చదివాము. మాస్టరుగారు మానవజాతికి వెలుగుబాట చూపేందుకు అవతరించిన శ్రీహరియేనని ఒక పూర్ణ సిద్ధపురుషుని తీర్పన్న మాట అది.

**2వ నిరూపణ :-** ఇదే విధంగా సాయినాథుని ప్రతిరూపమైన భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారి తీర్పు చూద్దాము. శ్రీ వెంకయ్య స్వామివారి యొద్ద భీష్ముని పట్టుదలగలవాడని శ్రీ స్వామివారిచేత ప్రశంసించబడిన రోశిరెడ్డి అనే శిష్యుడుండేవాడు. వీరి సేవానిరతికి సంప్రీతుడైన స్వామివారు వీరి మనస్సులోని సమస్యలకు దృశ్యరూపంగా సమాధానం చూపేవారు. వీరికి కనిపించే దృశ్యాలు మనోజనితాలు కావని, అవి నిజ జీవితంలోని సత్యాలనీ తెల్పే రెండు విషయాలు చెప్పి తర్వాత మాస్టరుగారి విషయాన్ని చెప్పడం సమంజసం.

ఒకరోజు రోశిరెడ్డి తన భార్యాబిడ్డలు ఈ వర్షాలలో ఎలా ఉన్నారోనని ఇంటిని గూర్చి తలచాడు :- వెంటనే వీరికొక దృశ్యం గోచరించి అందులో ఆ సమయంలో ఇంటిలో ఎవరేమి చేస్తున్నది, సజ్జమాసూలు ఎలా చేస్తున్నదీ, నిమ్మకాయలు ఎలా కోసిందీ చూచాడు. మూడవనాడు వీరి కుమారుడొస్తే - విచారించగా తనకు దృశ్యంలో గోచరించిన విషయాలే ఆ సమయంలో ఇంటిలోనివారు చేస్తుండినట్లు రూఢి అయింది. ఇదే విధముగా అనేకమంది

వ్యక్తులను గూర్చి వీరు దృశ్యరూపంలో చూచిన విషయాలు తరువాత వారి ప్రవర్తనలో సత్యమని నిరూపించబడ్డాయి. గనుక మాస్టరుగారిని గూర్చి వీరికి శ్రీ స్వామివారిచ్చిన దృశ్యంకూడా శ్రీస్వామివారి సత్యమైన తీర్పేనన్నమాట.

భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారి సమాధి మందిర శంకుస్థాపన రోజు మాస్టరుగారు శ్రీ స్వామివారి దర్శనార్థం శ్రీ స్వామివారిని సమీపించారు. మాస్టరుగారు శ్రీ స్వామివారికి పది అడుగులదూరంలో వుండగానే సాయి భక్తులందరూ మాస్టరుగారికి జయ జయ ధ్వానాలు చేస్తూ, పాదాభివందనాలు చేస్తూ, పెద్దగుంపు తయారై మాస్టరుగారిని కదలనివ్వలేదు. శ్రీ స్వామివారి దగ్గర అలా చేయవద్దని మాస్టరుగారెంత చెప్పినా వినిపించుకోకుండా భక్తులు నమస్కారాలు చేస్తున్నారు. ఈ విధంగా ప్రజలకు కాళ్ళప్పగించి నమస్కారాలు చేయించుకోవడం శ్రీ స్వామివారి పద్ధతికి విరుద్ధం గనుక రోశిరెడ్డిగారికి బాధకల్గింది. ''స్వామీ! తమవంటి మహనీయులే కాళ్ళు తాకనివ్వరే, మరి ఈ భరద్వాజ సంగతేమిటి? ఈయన స్థాయి ఏమిటి? ఎందుకిట్లా పాడైపోతున్నాడు?'' అని స్వామికి మనస్సులో చెప్పుకొని మధనపడ్డాడు. వెంటనే వీరి కన్నులు మూతపడి ఒక దివ్య దృశ్యం కనిపించసాగింది. అందులో మాస్టరుగారొక ఎడారిలో నిలబడియున్నారు. సమీపాన రోశిరెడ్డియున్నారు. ఒక్కక్షణంలో మాస్టరుగారు శంఖుచక్రాలు ధరించి శ్రీ మహావిష్ణువయ్యాడు - కానీ గడ్డం అలానే వుంది. మహావిష్ణువు పాదాలక్రింద మాత్రం కొంతవరకు నవనవలాడే పచ్చిగడ్డి మంచుబిందువులతో మెరిసిపోతుంది. వెంటనే రోశిరెడ్డి ఒక దున్నపోతుగా మారి మాస్టరుగారి పాదాలచుట్టూవున్న పచ్చిగడ్డి మేస్తున్నాడు. ఈ దృశ్యం కొన్ని నిమిషాలు కనిపించి ముగిసింది. స్పృహకల్గాక దృశ్యం విషయం స్పష్టంగా గుర్తుంది. తన మనసులోని సందేహానికి శ్రీ స్వామివారిచ్చిన సమాధానమదని రోశిరెడ్డి గుర్తించాడు.

అంతవరకు మాస్టరుగారి ప్రవర్తనను తప్పుపట్టి నాతోగూడా అనేకసార్లు తక్కువచేసి మాట్లాడిన రోశిరెడ్డి, ఆ సాయంకాలం శ్రీ మాస్టరుగారి పాదాలకు సాష్టాంగనమస్కారం చేశాడు. నాకు అంతులేని ఆశ్చర్యం కల్గి ఈ వింత ప్రవర్తనేమిటని రోశిరెడ్డిని అడుగగా పై విషయమంతా పూస గ్రుచ్చినట్లు చెప్పి, ''సుబ్బరామయ్యా! నీ పుణ్యం గట్టిది గాబట్టి సరైన గురువు చిక్కాడు.



ఆయన చెప్పినట్లు చేస్తే బాగుపడతావయ్యా - ఆయన సామాన్యుడు కాడు!'' అని చెప్పి తర్వాత గూడా అనేకమార్లు మాస్టరుగారిని ప్రశంసిస్తుండేవాడు. ఇది మాస్టరుగారిని గూర్చి భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారి తీర్పు.

శ్రీ స్వామివారి భక్తురాలైన తులసవ్వ కుమారుడు ఆదినారాయణ రెడ్డి కారుడ్రైవరు పోలు మస్తానయ్య ఇలా చెప్పుతున్నారు : ఒకరోజు మాస్టరుగారు శ్రీ స్వామివారి దగ్గరకొచ్చి, 'నమస్కారం స్వామీ!' అన్నారట. అప్పుడు శ్రీస్వామివారు, ''నమస్కారమయ్యా'' అని ఎంతో ప్రేమపూర్వకమైన గొంతుతో ప్రతినమస్కారం చేశారట. శ్రీ స్వామివారు ప్రతినమస్కారం ఒక్క మాస్టరుగారికి తప్ప మరెవ్వరికీ చేయలేదు. గనుక మాస్టరుగారెంత గొప్పవారో తెలుస్తుందంటారు మస్తానయ్య. వ్రాయసాగితే ఇలాంటి నిదర్శనాలెన్నయినా వ్రాయవచ్చు.

నిత్యసత్యుడు :- మహాసమాధి అనంతరంకూడా మానసికంగా తన్నాశ్రయించినవారికి మాస్టరుగారు తన సహాయ సలహాలందిస్తున్నారు. మనం వారిని ప్రార్థించని సమయాలలోకూడా మనకు వారు సహాయపడటమంటే వారు సాక్షీభూతులుగా సర్వభూత హృదయాంతర్వర్తియై వెలుగొందు తున్నారని తెలుస్తుంది. ఈ విషయాలను కర్నూలు నటరాజ బాబాగారి అనుభవాలేగాక ఇతరుల అనుభవాలుకూడా ఋజువు చేస్తున్నాయి.

నటరాజ బాబాగారిలా వ్రాస్తున్నారు :- నేను 1986 నుంచి మాస్టరు గారి గ్రంథాలు పారాయణ చేస్తున్నాను. అప్పటినుండి సాయినాథుడు నాకు స్వప్నదర్శనాలిస్తూ మాస్టరుగారిని గూర్చి, పారాయణనుగూర్చి అనేక విషయాలు బోధిస్తున్నారు. ముఖ్యంగా 'సాయిసన్నిధి' చదివాక వారిపైగల గురుభావం హిమాలయాలకు పెరిగింది. అయితే నా దురదృష్టంకొద్దీ నాకు వారిని చూచే భాగ్యం కలుగలేదు. మాస్టరుగారు సమాధి చెందారని తెలిసి నా ఆవేదనకంతులేదు. మనసు శూన్యమై నిలిచింది. నాలాంటి వారెందరికో మార్గోపదేశం చేసి శాంతిని పంచిన మాస్టరుగారు - ఇంకా ఎందరికో మేలు చేయవలసిన వారిని అర్ధాంతరంగా ఇలా తీసుకువెళ్ళావేమి బాబా? అని భోరున ఏడ్చాను. నాటిరాత్రి శ్రీసాయి స్వప్నంలో నాకు చెప్పిన మాటల సారాంశమిది :

''మాస్టరుతో నాకు చాలా పనుంది. వారు శరీరధారులైవుంటే చేయజాలని పనులు ఇప్పుడు చేతనాస్వరూపులై చేయగల్గుచున్నారు. ఈ విశ్వశాంతి కార్యక్రమంలో నాకు సహాయం చేయటానికి మాస్టరుగారు శరీరం విసర్జించవలసి వచ్చింది.

నాకు అండపిండ బ్రహ్మాండమంతటా పనులున్నాయి. కోటానుకోట్ల గ్రహాలలోని గ్రహరాసుల బాగోగులు నేను చూడాలి. ఈ విశ్వశాంతి పరిరక్షణ కార్యక్రమంలో మాస్టరుగారితో నాకు చాలా పనుంది.

అయినా మాస్టరుగారు ఎక్కడికి పోయారు? ఎక్కడికీ పోలేదు. నేను సమాధి అనంతరం ఎలా ఉన్నానో ఆయనా అలానే ఇప్పటికీ వున్నాడు. ఎప్పటికీ వుంటాడు. చేతనాస్వరూపుడై నీకు మార్గోపదేశం చేస్తూనే వుంటాడు''. మాస్టరుగారు చిరంజీవులుగా వుంటారని, వారికి ప్రమోషన్ వచ్చిందనీ సాయి నోటినుండి విన్నాక నా ఆనందమునకు అవధులు లేకుండా పోయింది.

**సమాధిపై కోర్టుకేసు :-** ఈ విషయం తెలిసి నా మనసు మూగగా రోదించింది. అంత గొప్ప మాస్టరుగారిని గురించి కోర్టులో కేసు పెట్టారా? ఎంతోమంది ముముక్షువులకు మార్గంచూపే మహనీయునిపై కోర్టుకేసులు, వాదోపవాదాలా? సాయి ఏం చేస్తున్నారు? అనుక్షణం ఇవే ప్రశ్నలు నన్ను వేధిస్తూ సాయంత్రానికి నన్ను నేనే సముదాయించుకోలేక భోరున ఏడ్చేశాను. ఆ రాత్రి ఏదో కలవచ్చి - ఆ స్వప్నం అయిపోయింది. వెంటనే ఒక పెద్ద వెలుగు - ప్రశాంతత నన్నావరించాయి. ఆ వెలుగులో నుండి మాస్టరుగారు ప్రత్యక్షమైనారు.

''నా సమాధి విషయమై నీవెందుకు కలతపడుతావ్? మానావమానాలు, సుఖదుఃఖాలు సరిసమానంగా చూచుకోవాలి'' అని మాస్టరుగారు చిరునవ్వుతో చెప్పి ఒక గోడమీద చాక్‌పీసుతో ఆ వాక్యాలు వ్రాసి చూపించారు. ఇంకొక రెండువాక్యాలు అవధూతల గురించి వ్రాసి చూపారు. గానీ అవి గుర్తులేవు. అంతటితో స్వప్నం అంతమైంది. నేను మాస్టరుగారిని చూడకున్నా నాపై దయతో స్వప్న దర్శనమిచ్చి నన్ను ఊరడించారు. ఈ సూత్రాన్ని నేను నిజజీవితంలో ఆచరించాలని నాకు బోధించారని భావిస్తూ మాస్టరుగారికి బాబాకు కృతజ్ఞతాపూర్వక వందనములాచరిస్తున్నాను.



**తప్పులు దిద్దే మాస్టరుగారు :**

దత్తజయంతి సందర్భముగా సాయి ఇత్తడి విగ్రహము, వెండి పాదుకలు వుంచి రుద్రాభిషేకము చేసి సాయి సత్యవ్రతము చేయాలని మా సత్సంగం నిర్ణయించింది. తెల్లవారితే దత్తజయంతి. ఆ రాత్రి మాస్టరు గారు స్వప్న దర్శనమిచ్చి, 'అభిషేకం ఆ సాయి విగ్రహానికే కాక దత్తాత్రేయ విగ్రహంకూడా వుంచి చెయ్యాలి'' అన్నారు.

''మా ఇంట్లో దత్త విగ్రహం లేదు. మరి దత్తవిగ్రహం ఎవరి దగ్గరుంది?'' అన్నాను నేను.

''రమేశన్ గారింట్లో ఉందిగదా!'' అంటూ ఒక దత్త విగ్రహము ఒకచేత్తోను, రెండవచేత్తో సాయి విగ్రహము పట్టుకొని చూపించి, మాస్టరు గారు అదృశ్యమయ్యారు. ఎంతో ఆశ్చర్యానందాలతో ఉదయం ప్రయత్నించి సరిగ్గా పూజసమయానికి రమేశన్ గారింటినుండి దత్త విగ్రహం తెచ్చి కార్యం నెరవేర్చాము.

ఇందులో గ్రహించవలసినదేమంటే దత్తజయంతి సందర్భంగా దత్త విగ్రహాన్నికూడా వుంచి పూజించడం ఉత్తమమనే విషయం మేము విస్మరించిన విషయం మాస్టరుగారికి ముందే తెలుసన్నమాట! అందువల్లనే మేము అలాంటి పొరపాటు చేయకుండా సకాలంలో స్వప్నదర్శనమిచ్చి మా తప్పును సరిదిద్దే సలహా ఇచ్చారు. అంటే మనం ఏ క్షణాన ఏమి చేయబోతామో, అందులో తప్పొప్పులేమిటో ముందుగా తెలిసిన సర్వజ్ఞులన్నమాట. అంతేగాక అంత పెద్ద కర్నూలు నగరంలో ఎవరింట్లో ఏయే వస్తువులుండేది సర్వం తెలిసిన సర్వజ్ఞులన్నమాట. లేకుంటే దత్త విగ్రహం రమేశన్‌గారింటిలో వుందని చెప్పలేరుగదా?

ఓం సర్వజ్ఞాయ నమః

**విశ్వశాంతినిగూర్చి శ్రీసాయి, మాస్టరుగారు, ఋషీశ్వరుల మంతనాలు**

ఆమధ్య ప్రతిరోజు ఎక్కడో ఒకచోట విమానప్రమాదాలు జరుగుతూనే వున్నాయి. విశ్వశాంతి కృషిలో సహాయపడేందుకు మాస్టరుగారిని

సాయినాథుడు తీసుకువెళ్ళినట్లు చెప్పారే, మరి వీరంతా ఏమి చేస్తున్నట్లు - మరి ఈ ప్రమాదాలేమిటి? అని పదేపదే సాయిని ప్రశ్నించాను. ఆ బాధాకరమైన ప్రమాదాల తలంపులతో నాకు అన్నం సహించలేదు. సుదర్శన్ అనే మిత్రుని ఇంటిలో సత్సంగం జరుగుతున్నది. పారాయణ అనంతరం శ్రీహరి విఠల్‌గారు భజన చెబుతున్నారు. నేను ధ్యానస్థుడ నయ్యాను. ధ్యానంలో ఒక అపురూపమైన అద్భుతదృశ్యం గోచరించింది.

సాయినాథుని పటం పెట్టియున్న సోఫాపై సాయినాథుడు నడచి వచ్చి కూర్చున్నాడు. ఒక దుప్పివచ్చి సాయినాథునికి ఎదురుగా కూర్చున్నది. ఇదేమిటి దుప్పి వచ్చిందని నేననుకొంటుండగానే దుప్పి, ఎద్దు మొదలైన అనేక అడవిమృగాలువచ్చి వరుసగా కూర్చున్నాయి. ఇదేంటి సాయి, అడవి మృగాలన్నీ ఇంటిలో కొచ్చాయని సాయినడిగాను. వారు, ''అవి మృగాలు కావు. ఆ రూపంలో మహర్షులు వచ్చారు. మేము విశ్వశాంతికై ఏమి చేస్తున్నామని నీవు అడిగావుగా, ఇదే చేస్తున్నామని అన్నారు. మరి మాస్టరుగారెక్కడ? అని అడుగుచుండగానే సాయి పగలబడి పెద్దగా నవ్వుచున్నారు. ఇంతలో నా ఎదుటనున్న దుప్పివచ్చి నా ఒడిలో కూర్చున్నది. ఆ దుప్పి చాలా బరువుగా వుంది. నేను మహర్షులకు స్థలం చాలడంలేదని వెనుకకు జరిగాను. మరలా మాస్టరుగారెక్కడని అడుగుతుంటే సాయి విరగబడి నవ్వుతున్నారు. సాయి బంధువులంతా సాయినాథ్ మహరాజ్‌కి జై అని హారతి మొదలుపెట్టారు. ఆ దృశ్యం మాయమై నేను మేల్కొన్నాను. సాయి నవ్వు నా చెవులలో గింగురు మంటున్నది. 1) సాయి ఎందుకు నవ్వారు? మాస్టరుగారు నీ ఎదురుగా వుంటే గుర్తించలేకున్నావుగదా అని నవ్వారని నాకు తోస్తుంది. 2) విశ్వశాంతికి మహర్షులంతా సాయినాథుని ఆధ్వర్యంలో సమాలోచనలు జరిపి తగుచర్యలు తీసుకుంటున్నారని తెలిసింది. 3) భజన కార్యక్రమం 2 గం॥ జరిగింది. నా దృశ్యం 5 నిమిషాలు జరిగింది. బాహ్యప్రపంచంలో 2 గం॥ కాలం ధ్యానములో 5 నిమిషాలకు సమానమైందని తెలుసుకున్నాను.

ఒకరోజు తులసవ్వ కొమారుడు వల్లపురెడ్డి ఆదినారాయణరెడ్డి మాస్టరు గారిని తీసుకురమ్మని తన కారు పంపారు. కారు డ్రైవరు మస్తానయ్యకు మాస్టరుగారంటే అంతవరకు చాలా చులకనభావం వుండేది. కారణం వారు సిగరెట్ త్రాగడం, గడ్డం పెంచియుండడము. మాస్టరుగారు కారులో వస్తుండగా మార్గమధ్యంలో ఉన్నట్లుండి కారు ఇంజన్‌నుండి



మంటలు, పొగ పెద్దగా లేచాయి. ఇంజనులో ఏర్పడిన స్పార్కు పుట్టి పెట్రోలు టాంకు అంటుకుందట. డ్రైవరు కారు ఆపి బయటకు దూకేసి మాస్టరు గారినికూడా బయటకు దూకెయ్యమన్నాడు. కానీ మాస్టరుగారు నిర్భయంగా కళ్లుమూసుకొని ధ్యానస్థులైనారు. నట్టువేసి గట్టిగా బిగించిన వైరు స్పానరుతో గానీ రాదట. కానీ డ్రైవరు తన తొందరపాటులో చేతివేళ్లతో లాగేస్తేనే వైరు ఊడిరావడంచూచి ఆశ్చర్యపోయాడు. మంటలు పూర్తిగా ఆరిపోయాక మాస్టరుగారు కళ్లుతెరచి, ''ఏమయ్యా అయిపోయిందా?'' అని అడిగారు. పై ప్రమాదంలో రెండు విషయాలు మస్తానయ్యను ఆశ్చర్యపరిచాయి. 1) పెట్రోలు టాంకుకు నిప్పంటుకొని ప్రాణాపాయ స్థితిలో హెచ్చరించినాగానీ నిర్భయంగా మాస్టరుగారు కారులో కూర్చోవడం 2) సామాన్య మానవుడని తాను తలచిన ఈ సిగరెట్లు త్రాగే గడ్డపుస్వామి వల్ల మాత్రమే ప్రాణాపాయ కరమైన పై అగ్ని ప్రమాదం తొలగిందని డ్రైవరు గుర్తించడం - ఈ రెండు కారణములవలన మస్తానయ్యకు మాస్టరుగారిపై ఎనలేని భక్తి గల్గింది.

## నిష్కామ కర్మకు ఆచార్యులవారి (ఆసిడ్ టెస్ట్) అపూర్వ పరీక్ష

ఒకసారి మాస్టరుగారిలా చెప్పారు :

''నిష్కామకర్మ చేస్తున్నవారికి, వారికి తెలియకుండానే వారి అంతరంగాల్లో సకామం తొంగిచూస్తుండే ప్రమాదముంది. అలాంటి హీన సంస్కారాలను వివేకంతోను, అభ్యాసంతోను, ఆత్మ పరిశీలనతోను అంత మొందించకుంటే పడ్డ శ్రమంతా వ్యర్థమౌతుంది. తనకూ, తనవారికీ ఎలాంటి స్వార్థంలేకుండా సాటివారి (సంఘం) యొక్క శ్రేయస్సుకోసం చేసే ఏ కార్యమైనా 'నిష్కామకర్మ'యని చెప్పబడింది. కానీ మనంచేసే నిష్కామకర్మ దైవంయొక్క ప్రీతికొరకు దైవ ప్రేరేపితులమై దైవంచేతిలో ఉపకరణగా మాత్రమే మనమాకార్యం చేయగలుగుచున్నామనే ఎరుక కార్యకర్తలలో ఏమారకుండా వుండాలి. అలాంటి నిరంతర ఎరుకతో నిష్కామకర్మ చేయడం చాలాకష్టమే. అలాంటి నిరంతర ఎరుకతో కర్మ చేస్తున్నప్పటికీ మనకు తెలియకుండానే మన అంతరంగాలలో subconscious levelsలోవున్న కామం (కోరిక) పొంచియుండి సమయం వచ్చినపుడు తొంగిచూస్తూ ప్రకటమవుతుంది. ఎలాగ?

Function సఫలమైతే అంతరంగం సంతోషంతో గంతులేస్తుంది. తన కృషివల్లనే success అయిందని అంతరంగం పొంగిపోతుంది. function విఫలమైతే mental imbalance రూపంలో (చికాకు, కసురుకోవడం, బాధ) ప్రకటమౌతుంది. దీనికంతా function సఫలం కావాలి అనే అంతరంగంలోని కామము ఒక కారణం. రెండవది నేను చేస్తేనేగదా పని అవుతుంది అనే కర్తృత్వభావం మనకు తెలియకుండా subconscious levelలో వుండడం మరొక కారణం. ఈ mental imbalanceకు కారణం నాలోని కామమేనని గుర్తించడం ఒకస్థాయిలోని వివేకికి మాత్రమే సాధ్యం. అదే గురుకృప, ఉదాహరణకు : మనమొక నామజపయజ్ఞం చేయిస్తూ కార్యభారమంతా నెత్తినేసుకొని చేస్తున్నామనుకొందాము. ఆ కార్యం సజావుగా జరిగితే నోటి మాటలుగా మాత్రం 'అంతా ఆయన కృప - సాయి దయ అలావుంది! మనదేముంది?' అని అనడం పరిపాటి. కానీ అకాల వర్షంవల్లగానీ, అనుకున్న ఆహుతులు రానందువల్లగానీ, అనుకున్న సంఖ్యకంటే ఎక్కువమంది అతిథులొచ్చి అన్నపానీయాలు, వసతులు చాలినంతగాలేక function అభాసయిందనుకోండి. అప్పుడు అందరూ organisorను చెడామడా నాలుగు అక్షింతలు వేస్తారు. 'బాగా చేశాడులే. వేళకు నీళ్ళులేదు, అన్నంలేదు. accommodation అధ్వానం. ఇంత function జరుగుతుంటే నాలుగు టార్పాలిన్లు కనీసం అన్నంవండేచోటైనా వేసుకోరూ. అంతా పిసినారిచేష్టలు. ఇంతమంది వస్తుంటే arrangements చేయలేనివాడు మరొకరి సహాయం సలహా తీసుకోనక్కరలేదండీ' అని చాటుగా అనేవాళ్ళు కొందరూ, future guidanceకని ముఖానే అనేవాళ్ళు కొందరు.

అప్పుడు కార్యకర్త బాహ్యంగాగానీ, అంతరంగంలోగానీ ఎలా react అవుతాడన్నదే acid test. ఒకస్థాయిలోనివారైతే జరిగిన లోపాలకు తాను బాధ్యుడుకాదనీ ఆయా పనులు నిర్వహించినవారే కారణమని వారిని నాలుగు కేకలేయడం ఒక స్థాయిలోనివారి reaction. రెండవ స్థాయిలోనివాడు - ఏంచేస్తాం - సాయి దయ అలావుంది అని ఎవరినీ వేలెత్తి చూపడు. పైకి మౌనం వహిస్తాడు కానీ అంతరంగంలోమాత్రం సాయి తనను ఆదుకోలేదని, function grand success అయ్యేలాచూడలేదని మనసులోనైనా బాధపడతాడు. అంతటితో ఆగక సాటికార్యకర్తల అసమర్థతను మనసులోనైనా నిందించకుండా వుండలేడు. ఇక నేనెప్పుడూ ఈ పనికిమాలిన groupను



నమ్ముకొని కార్యభారం నెత్తిన వేసుకోకూడదు అని మనసులోనైనా అనుకోకమానడు. ఇక మూడవ రకం చూస్తాము :- ఎందరేమన్నా కార్యం సర్వనాశనమైనాసరే ఎదుటి వారిపైకాదుగదా తనను తానుకూడా నిందించు కోడు. తాను భగవంతుని చేతిలో తెడ్డులాంటివాడను అనేభావం స్వత సిద్ధమైందన్నమాట. అట్టివానికి function యొక్క రుచితో పనేముంది? సాయినాథుడు function అనే పాకం చేస్తున్నాడు. పాకం చెడిపోతే తెడ్డుకు మనఃక్లేశమెలా వస్తుంది?

'సిద్ధ్య సిద్ధ్యో సమోభూత్వా సమత్వం యోగ ఉచ్యతే'

అన్న గీతావాక్యానికి ఈ function నిర్వహణ ఒక ఒరుపురాతి పరీక్ష. కార్యకర్త మనసులో ఎలాంటి చలనంలేకుండా సాయిచేతిలో తెడ్డుగా ఉపయోగ పడినందుకెంతో తృప్తిగా సాయికి కృతజ్ఞతలు చెప్పుకుంటాడు.

మొదటి రెండురకాల కార్యకర్తలలో తానుచేసిన పని అందరి మెప్పు పొందేటట్లుండాలని తపన అంతరంగంలో వారికి తెలియకుండానే వుంటుంది గనుకనే పని విఫలమైతే మనసు బాధపడుతుంది. మూడవవానిలో subconscious levelలో కూడా ఆ తపన లేదు గనుక - స్వతసిద్ధమైన శరణాగతి వుందిగనుక మనసులో బాధ వుండదు.

అలాంటి పరిపాకము, స్వతసిద్ధమైన శరణాగతి అభ్యాస మయ్యేందుకే నిష్కామకర్మ. అంతేగానీ సాటివారిని ఉద్ధరించడానికి కాదు. సర్వ సమర్థుడు, సర్వప్రేరణాధికారి, సర్వజ్ఞుడైన సాయివుండగా సంఘానికి మేలుచేసేందుకు మనమెంతటి సాహసికులం. నిష్కామకర్మంతా మనలోని లోపాలను, బలహీనతలను గుర్తించి వివేకవైరాగ్యాలతో తొలగించు కొనేందుకేనని గుర్తించాలి. ఈ బలహీనతలనే 'మలదోషం' అన్నారు.

ఇదంతా ఎవరు చేస్తారు, పనిచేయడం, బాధపడడం ఎందుకని public functionsలో పాల్గొనకుండా తీర్థప్రసాదాలందుకుంటూవుంటే మనలోవుండే బలహీనతలు మనకు తెలిసేదెలాగు? తెలియకుంటే నిర్మూలించుకొనే విచారణ జరిగేదెలా? అలా విచారణతో అలాంటి కామాది మలదోషాలను నిర్మూలించు కోకుంటే సాధనేలేదు. శరణాగతే కుదరదు. హృదయపూర్వకమైన శరణాగతి

లేక ఆత్మవికాసం ఎలా సాధ్యం? అందుకే మిలారెపా సులువెరిగి సాధన చేయమంటారు. పని ఎంత **turnup** చేశాము అనేది **criteria** కాదు. మనలోని రాగద్వేషాది మలాలు ఎంతవరకు నిర్మూలించుకున్నాము అన్నది ముఖ్య Targetగా వుంచుకొని నిష్కామకర్మ చేస్తుండాలి'' అని ముగించారు.

**ఆచార్యులవారు ఆచరించి చూపిన నిష్కామకర్మ :**

అది విద్యానగర్ సాయిమందిర శంకుస్థాపన సమయం. అన్నదానానికి బోలెడు బియ్యం, సామాను భిక్షద్వారా సమకూడివుంది. ఉదయం శంకుస్థాపన సమయానికి ఇతర గ్రామాలనుండి నలభై యాభైమందికంటే ఎక్కువ రాలేదు. శంకుస్థాపనలో కొన్నివందలమంది పాల్గొన్నారుగానీ వేలసంఖ్యలో లేరు. మధ్యాహ్నం అన్నం ఎంతమందికి తయారుచేయాలనే మీ మాంస వచ్చింది. మాస్టరుగారినడిగితే **maximum** మనకు వచ్చిన బియ్యం అన్నీ వండేస్తేసరి. బాబా బియ్యం పంపారు. వారే ఖర్చుపెడతారు. అని మాత్రం సూచనప్రాయంగా చెప్పి వదిలేశారు. కార్యకర్తలు ఆ మాటలు లెక్కచేయలేదు. అన్నాలు దేవాలయస్థలంలో వండి కాలేజి హాస్టలు డైనింగు హాలులో భోజనాలు పెడుతున్నారు. కారణం విపరీతమైన గాలివలన షామి యానాలు నిలువలేదు. ఎండ విపరీతంగా వుంది. భోజనాలకెవరూ రారు అని తలచి 500 మందికి భోజనాలు తయారు చేశారు. హారతి అయ్యాక వడ్డించసాగితే వండినదంతా ఒక్క బంతికే సరిపోయింది. బీదాబిక్కి యానాదులు, హరిజనులు, బిక్షగాళ్ళు వేలసంఖ్యలో అన్నంకొరకు ఎండలో నిలబడియున్నారు. అన్నంలేదని వాళ్ళను త్రిప్పిపంపడమెలా? అన్నాలువండి రెండెద్దులబండిమీద పెట్టుకొని ఎద్దులులేనందున మనుషులే లాక్కొస్తున్నారు. కొందరు బండి నెడుతున్నారు. దారంతా ఇసుక, చెప్పులలోకి కాలే ఇసుకదూరి పాదాలకు బొబ్బలెక్కుతున్నాయి. అయినా ప్రాణాలకు తెగించి పనిచేస్తున్నారు. బియ్యం అన్నీ అయిపోయిందాకా భోజనాలకు వస్తూనే ఉన్నారు. సాయంకాలం 4 గంటల వరకు వేలమందికి అలా అన్నసంతర్పణ జరిగింది. గాలిలో పొయ్యిమండడం ఒక బాధ. ఫర్లాంగు దూరం **transport** ఒక బాధ. కార్యకర్తల ఒళ్లు గుల్లయింది. మాస్టరుగారి మాట విననందుకు మంచిశాస్తి జరిగిందని నవ్వుకున్నారు. మాస్టరుగారు చెప్పినట్లు అదే వేకువజామున వంటపని పూర్తిచేసివుంటే ఈబాధ వుండి వుండదు.



మరునాడు సత్సంగమయ్యాక మామూలుమాటల్లో ఈ వంటల మాట వచ్చింది. నా మాటవినలేదని మాస్టరుగారెవరిపైన కోపగించలేదు. కష్టపడ్డవాళ్ళందరికీ సానుభూతి మాటలుచెప్పి చల్లబరుస్తున్నారు. చివరగా అన్నారు. ''నేను చెప్పినట్లు బియ్యమన్నీ ముందే వండిపోసివుంటే ఎలా వుండేది. ఒకవేళ అతిథులు రాలేదనుకోండి. అన్నమంతా మిగిలిపోయిందను కుందాము. అన్నం రాసిపై అంత కర్పూరం వెలిగించి అగ్ని హోత్రునికి ఆహుతిచేస్తాను. ఆరూపంలో ఆయనే ఆరగిస్తారు. ఆయన బియ్యం పంపాడు - మనం వండిపోశాము. ఆరగించవలసిన బాధ్యత ఆయనదేగదా? ఆయన ఏ రూపంలో ఆరగిస్తే అదే వారి అభిలాషయని సరిపెట్టుకోవడమే మనం చేయవలసినదల్లా. ఇప్పుడిలా జరిపించాడని, అది సాయినాథుని బోధనా పద్ధతి అని సరిపెట్టుకోవడమొక్కటే సరైన సాధన'' అని ముగించారు.

ఇదేవిధంగా మందిరం స్లాబు పోసేరోజు సగం స్లాబు పోశాక మబ్బుగా వుందని అందరూ పని నిలపమన్నారు. మాస్టరుగారుమాత్రం ఇది సాయినాథుని కార్యం. వారిదే బాధ్యత. మీరు పనికానివ్వండి అన్నారు. వర్షం వచ్చిందికానీ విద్యానగర్‌చుట్టూ అరమైలు అవతలమాత్రమే కురిసింది. స్లాబు పోశాక 5 గం॥ తర్వాతనే విద్యానగర్‌లో కుంభవృష్టి కురిసింది. తెల్లవారి అందరూ 'మీరు ఎంత ధైర్యంచేశారు సార్' అన్నారు. ''వర్షంవచ్చి బిల్డింగ్ అంతా కొట్టుకుపోయినా నాకేమీబాధలేదు, ఆయన బిల్డింగ్‌పోతే నాకు బాధెందుకు? ఆయన పోగొట్టాలంటే మనం నిలుప గలమా? ఆయన నిలపాలంటే మనం పోగొట్టగలమా? పని సఫలమైనా విఫలమైనా సమభావం వహించడమే నిష్కామ కర్మకు గీటురాయి'' అని వారు బోధించిన బోధకు ప్రత్యక్ష వ్యాఖ్యగా ఆచరించిచూపారు. అదేవారి బోధనావిశిష్టత.

**దివ్యబోధ**

1979లో ఒకసారి మాస్టరుగారు, ''సుబ్బరామయ్యా! నానోటి గుండా వచ్చిన ప్రతిమాట వ్రాసిపెట్టుకో. భవిష్యత్తులో పనికొస్తాయి'' అని చెప్పారు కానీ నేను అలా చేయలేదు. **mood** వచ్చినప్పుడు ఏ కాగితం చిక్కితే

దానిపై వ్రాసుకొనేవాణ్ణి. అలాంటి వాటిలో ఒక పెండ్లిపత్రికపై వ్రాసుకొన్నవే ఈ క్రింది విషయాలు.

1. తప్పు చేసిన వానిని క్షమించాలి. ఎప్పుడు? – తప్పు ఒప్పుకుంటే.
2. సుఖదుఃఖాలను సమభావంతో తీసుకోవాలి. అప్పులవాళ్ళ అప్పులు తీర్చేస్తూ బాధపడడమెందుకు?
3. రాళ్ళతోకొడ్తే ఓర్చుకోవాలి. ఎప్పుడు? – క్రీస్తువలె నిర్దోషి అయినప్పుడు.
4. అనేక జన్మల బాకీలే మన చుట్టుప్రక్కల పరిస్థితులు, మన ఆశ్రితులు, బంధువుల రూపంలో మనకుకలిగే అనుభవాలు. ఆ బాకీలు తీరిపోగానే మనుషులు మారి మనపట్ల మార్పు చూపిస్తారు.
5. ''ధర్మేచ, అర్థేచ, కామేచ, నాతిచరామి'' అని పెండ్లినాడు అగ్నిసాక్షిగా చేసిన ప్రమాణానికి భిన్నంగా ఏదీ అనుభవించరాదు.
6. పూర్వం స్త్రీలకు కూడా యజ్ఞయాగాదుల నిర్వహణలో భాగం ఉండేది. కానీ division of labour వల్ల కొన్నిపనులు భర్తకు, కొన్నిపనులు భార్యకు సంక్రమించాయి. అందుకే జంధ్యం, తాళిబొట్టు వచ్చాయి. అందుకే స్త్రీలు వంటచేశాక మొదట కొంత అన్నము, కూర అగ్నికి సమర్పిస్తుంటారు. (మా తల్లిగారు అలాచేయడం నేను (రచయిత) చూచాను.
7. గురుసేవ : గురువు తప్పితే నాకు అన్యంలేరు అని శరణాగతి చేయాలి.
8. అధికంగా అనుభవిస్తే రాబోయే కాలంలోని మన పుణ్యాన్ని ముందుగా అనుభవిస్తున్నామన్నమాట.
9. రక్షించేది, చంపేది మన ధర్మం, పుణ్యం మాత్రమే కాని డబ్బు, బంగారం కాదు.
10. Deception made by us in our previous janma makes the good people also to deceive us in this janma.
11. King living like a fakir is **mahatma**. Give away to the needy in the name of God.



12. రక్షణ ధర్మంలో ఉంది. కానీ వస్తువులలో కాదు. డబ్బు ఉన్నా రోగం నయంకాదు.

దివ్య బోధ

## కర్మసుకౌశలం

అవి నేను గీతోపన్యాసాలకెళ్ళే రోజులు. ఒకరోజు మాస్టరుగారు కర్మసుకౌశలమంటే ఏమిటి? అని అడిగారు. పనిచేయడంలో నేర్పరితనం చూపించమని అర్థం చెప్పాను. అప్పుడు మాస్టర్‌గారు చెప్పారు :

మాస్టర్ : ఆడవాళ్ళు అంట్లుతోముకుంటారు ఎందుకు?

నేను : వంట చేసేందుకే గదా సార్!

మాస్టర్ : ఆ వంట చేసి ఎవరికి పెడతారు?

నేను : అత్త, మామ, భర్త, పిల్లలు.

మాస్టర్ : నిజమే, వారు అన్నం పెట్టేది వారి ఆకలికా లేక వారి శరీరాలకా?

నేను : వారి ఆకలికే సార్.

మాస్టరు : 'అహం వైశ్వానరో భూత్వా' అన్న శ్లోకంలో ఏమి చెప్పబడింది?

నేను : జీవుల ఆకలిరూపంలో నేనుండి వారు తిను నాలుగురకాలైన ఆహారాన్ని జీర్ణము చేస్తున్నాను అన్నారు.

మాస్టర్ : వారు వంటచేసేది ఆకలిరూపంలో నున్న పరమాత్మను తృప్తి పరచడానికే అన్నభావం వారికేనాడైనా ఉందా? అలా కలిగి ఉండడాన్నే భావశుద్ధి అన్నారు. అప్పుడు అదే కర్మసుకౌశలం అవుతుంది. ఎప్పుడో గిన్నెకు పసుపు పూసి కుంకుమ పెట్టి పొంగలిచేస్తేనే దైవానికి నివేదించినట్లుగా భావిస్తారు. నిత్యం వారు చేసే వంట ఆకలిరూపంలోని పరమాత్మ సేవకే అనే

భావన ఉంటే అది కర్మసుకౌశలం అవుతుంది. మరి వ్యవసాయదారులు పండించేది ఎందుకు?

నేను : ట్రాక్టర్లుకొని, ఇంక రెండెకరాలు కొని, మిద్దెలు మేడలు కట్టుకోవడానికి గదా సార్!

మాస్టరు : అవన్నీ నిజమే! వారు పండించేగడ్డి ఎన్నిజీవుల ఆకలి తీరుస్తుంది. కాకులు, పిల్లులు, కుక్కలు, సూక్ష్మజీవులు, మనుషులు ఇలా ఎందరి ఆకలినో వారి పంట తీరుస్తుంది. వారి సేవద్వారా వారు ఆయా జీవులలోని ఆకలి రూపంలోని పరమాత్మనే సేవిస్తున్నామన్న భావం వారికుండడమే కర్మసుకౌశలం అన్నారు. మరి నీవేమి చేస్తావు?

నేను : నేనేమి చేసేది మీకు తెలుసుగదా సార్.

మాస్టర్ : నీవు టీచర్‌వని నాకు తెలుసు. హైస్కూల్లో free education ఎందుకు పెట్టారు?

నేను : అందరూ చదువుకోనుంటే ఓటుహక్కు చక్కగా వినియోగిస్తారని.

మాస్టర్ : సెకండరీ విద్య ఆశయాలేమిటి?

నేను : To mould the future citizens of India. (భావిభారత పౌరులను తయారుచేయడం.)

మాస్టర్ : నీవు తయారుచేయగలవా?

నేను : నా విద్యార్థులందరూ బీడీలు త్రాగుతూ ఎందుకూ కొరగాకుండా తయారవుతున్నారు సార్?

మాస్టర్ : ఒక్క పనిచేస్తే నీవుకూడా సత్‌పౌరులను తయారుచేయ గలుగుతావు. అప్పుడు నీవు చేసే పనికూడా కర్మసుకౌశలమే అవుతుంది. ఎలాగంటే నీవు గట్టిగా వారికి సాయిని పట్టివ్వు. సాయి వారిని సత్‌పౌరులుగా తీర్చిదిద్దుతారు.



నేను : వారికి సాయిని నేనెలా గట్టిగా పట్టివ్వగలను సార్?

మాస్టర్ : ఏమీలేదు, ముందు నీవు గట్టిగా బాబాయందు విశ్వాసం గలిగి ఉండాలి. బాబా పిలిస్తే పలుకుతాడు అనే నమ్మకం నీకుండాలి. అప్పుడు నీవు గట్టిగా విద్యార్థులకు చెప్పగలుగుతావు. బాబా యందు నీకే నమ్మకంలేకుంటే నీవు గట్టిగా వారికెలా చెపుతావు? నీవెప్పుడైనా బాబాను పిలిచావా?

నేను : నేను పిలిస్తే ఆయన పలుకుతాడా సార్?

మాస్టరు :- పిలిస్తే పలికేందుకు ఆయన బద్ధకంకణుడై కూర్చొని ఉన్నాడు. పిలచేవారే లేరు. నీవు ఒకమారు పిలిచిచూడు. పలుకుతాడు.

నేను : నాలాంటి వారికి పలుకుతారా సార్.

మాస్టర్ : అరే, మళ్ళీ అలాగే చెపుతావు! పిలిచిచూడు తెలుస్తుంది. నీకు అనుభవం కలిగాక విద్యార్థులకు challengingగా చెప్పు. ఏమాత్రం సందు వుండకూడదు సుమా!

వెంటనే నేను బాబాను పిలువకున్నా తర్వాత నాకు పిలువవలసిన పరిస్థితి రావడం, ఒకసారికాదు, ఆరు ఏడుసార్లు పిలిస్తే వారు పలకడం, ఇక విద్యార్థులకు challengingగా చెప్పడం - నేనొక పిచ్చివాడుగా మారడం జరిగిపోయింది. కర్మసుకౌశలం అంటే ఏమిటో అలా ఆయన బోధించారు.

మనం స్నానం చేస్తున్నప్పుడు ఈ నీళ్ళరూపంలో నీవే నన్ను శుభ్రం చేస్తున్నావు ప్రభూ! అసలీ శరీరంలో నీవుండబట్టే స్నానం చేస్తున్నాను. లేకుంటే ఈ శరీరం బూడిదయ్యేదే గదా? అని తలంచు. మనం వెళ్ళే దోవలో ముల్లు తీసిపారేస్తున్నామనుకో - ఈ ముల్లు నాకుగాని, ఇతరులకు గాని గ్రుచ్చుకుంటే ఆబాధ నీకే గదా సాయినాథా! అని స్మరించు. ప్రతివిషయానికి మరచిపోకుండా ఆపనితో వారినే link చేయి. పనులన్నీ నీవే చేస్తున్నావు. నీకొరకే చేస్తున్నావు. కానీ వాటిని చేయడంలో కౌశలముంది. ఆ కౌశలమే సాయికి link చేయడం. ప్రతిపనికీ వారిని స్మరించడం చిన్నగా అలవాటు చేయాలి. అలా చేస్తూపోతే ధ్యానబాహ్యమైన క్షణమే ఉండదు. నిరంతరం సాయి సేవచేయడమవుతుంది. అదే భావశుద్ధి - క్రమముక్తి అవుతుంది.

శ్రీ మాస్టరుగారు పై ఉదాహరణలు మాత్రమే ఇచ్చారుగాని మిగిలిన అన్నీ మనకై మనమే భావించుకోవాలి. మనం ఎన్నోమార్లు అన్నం తింటున్నాము, కాఫీ, టీ, ఫలహారాలు చేస్తున్నాము. మిత్రులకు పెడుతున్నాము. బాబాగారి కార్యక్రమాలని అన్నదానం - నారాయణసేవ అని కరపత్రాలు వేయిస్తున్నాము. 'ఆకలిరూపంలో వచ్చిన నీకు ఈ అన్నం టిఫిన్, టీ, కాఫీ ఇచ్చి సంతృప్తి పరుస్తున్నాను తండ్రీ' అని కనీసం మనం తినేటప్పుడైనా సాయి నాథుని (శ్రీకృష్ణుని) స్మరిస్తున్నామా? ఏమో స్వామీ! నేనెప్పుడూ అలా అనుకోను. నా పొట్టకు తినడం, స్నేహితులు బంధువులతో కలసి కబుర్లు చెప్పుకుంటూ కేరింతలు కొడుతూ తినడమేగాని ఆకలి రూపంలో ఉన్న శ్రీసాయిని తలచడంలేదు. కనీసం ఆకలిని సంతృప్తిపరచే సమయంలోనైనా ఆపరమాత్మను స్మరించే బుద్ధి కుశలత ప్రసాదించమని శ్రీ మాస్టరుగారి పాదాలకు ప్రణమిల్లుచున్నాను. కనీసం ఆ టైంలోనైనా త్రికరణశుద్ధిగా నామ జపంచేసే భాగ్యం ఈ మందభాగ్యునకిమ్మని మరీమరీ వేడుకొనుచున్నాను. పై పనులన్నీ ''నీ సేవలే అగుగాక'' అని ఎన్నిమార్లు ఉదయ ప్రార్థనచేసినా డాక్టరు వ్రాసిచ్చిన మందుల చీటీ వల్లెవేసే వాణ్ణయ్యానుగాని మందు తిని పథ్యముండని నాకు భవరోగమెలా కుదురుతుంది ప్రభూ!

భావశుద్ధి, కర్మసుకౌశలం – ఈ రెండు పదాలు మానవజాతిని పరమాత్ముని సన్నిధికి చేర్చగల రెండు రథచక్రాలవంటివి. 'వసద్ది చేసుకుంటే (సరిగా మలచుకుంటే) రెండక్షరాలు చాలయ్యా' అని శ్రీ వెంకయ్యస్వామివారు శెలవిచ్చారు. ఈరెండూ ఆచరించే సామర్థ్యమే మనకు అవసరం. అట్టి సామర్థ్యం మనకు లేకపోవుటకు కారణం మన పుణ్యం చాలలేదన్నమాట. అందుకే మాస్టరుగారు ఎక్కువమందికి బాబాకు పూజ చేయమని చెప్పేవారు. ''దేవ, ద్విజ, గురు, ప్రాజ్ఞపూజనం'' అన్న భగవద్గీతా శ్లోకం కూడా ఇదే చెపుతుంది. పారాయణ, ధ్యానము, నామస్మరణ ఇవన్నీకూడా ఒక విధమైన పూజలే. శరీరంతో చేసే భౌతికపూజతో పాటు వాచక, మానసిక పూజలే ఈ పారాయణ, ధ్యాన, నామస్మరణలు. గనుక మొదటి మెట్టెక్కితే తర్వాత మెట్లు సాయినాథులే ఎక్కిస్తారు! అయితే దేవ, ద్విజ, గురు, ప్రాజ్ఞపూజనమే సాధన గమ్యమని తలచడం పొరపాటు.



ఆ విశ్వచైతన్యమే పరమాత్మ, అదే శ్రీ సాయి, శ్రీ వెంకయ్య స్వాములవారిలాంటి మహనీయుల రూపం దాల్చింది. అన్నిప్రాణులలోని ఆకలి నేనే అన్నారు కృష్ణపరమాత్మ. దానినే బాబా మరొక విధంగా చెప్పారు. ''ఆకలిగొన్న ఏప్రాణికి పెట్టినా నాకు పెట్టినట్లే'' అన్నారు. అంటే ఆ పరమాత్మకు అన్నం, టిఫిన్ పెడుతూ కాఫీ ఇస్తూ, టీ త్రాగిస్తూ (వీటిని మూడుపూటలా మనం స్వీకరించడమే) ఆ సమయంలోనైనా మనం బాబాను స్మరిస్తున్నామా? ఏవేవో ఆలోచనలు, కీచులాటలు, కసురుకోవడాలతో తింటున్నాము. అంటే ఆకలిరూపంలోనున్న పరమాత్మకు పెడుతూ కూడ అలా చేస్తున్నామన్నమాట! అందుకే మాస్టరుగారు అది అపచారమంటారు.

అలా పెడితే నిజంగా వారు సంతసించి మనల నాశీర్వదిస్తారా? స్వీకరిస్తారా? అలా పెడితే పరమాత్మకు కాదు అది చెందేది. అది అహంకార యుతమైన ఈ శరీరానికే చెందుతుంది. అందుకే శ్రీ వెంకయ్యస్వామివారు త్రికరణ శుద్ధిగా నామస్మరణలేకుండా నేను ఇడ్లీలు తీసుకుపోతే తాకనుగూడా నిరాకరించారు. త్రికరణశుద్ధిగా నామజపంచేసి ఇడ్లీలు తీసుకుపోతే అప్పుడే హోటల్ ఇడ్లీలు తిని ఉంటేకూడా నేను తీసుకుపోయిన ఇడ్లీలు సంతోషంగా తిన్నారు. గనుక మనం తినే అన్నం వగైరాలు భగవదర్పితం అవాలంటే కనీసం తినేటప్పుడు, త్రాగేటప్పుడైనా త్రికరణశుద్ధిగా నామజపం చేయడం ఎంతో ముఖ్యం. అలాచేయలేక మన మనస్సు పరుగెత్తుకెళ్తుంటే, మనసును స్థిరం చేయమని హృదయపూర్వకంగా బాబాను ప్రార్థించి నివేదించాలి.

ఈ విధంగా నామం చేసేందుకు 'వర్తమానంలో నివసించు' 'live in the present' అనేది చక్కని సలహా. ఈ సలహాను ఆచరించలేకున్నామంటే - మన ఆలోచనలు వేటిమీద పోతున్నాయో ఆ పనులన్నీ బాబాకాదు మనమే చేస్తున్నామన్న అజ్ఞానభావమే కారణం. అంటే నేను కర్తను అనే భావం మనకు తెలియకుండానే మనలో పేరుకుంటుంది. ఆ భావం సంపూర్ణంగా పోవడమే అనన్య శరణాగతి. అట్టి అహంకారం మన హృదయాలనుండి సమూలంగా తొలగించాలంటే సాయినాథుని త్రికరణ శుద్ధిగా, కేవల శ్రద్ధతో ప్రార్థన చేయడమొక్కటే మన కర్తవ్యం.

పట్టువీడని విక్రమార్కునివలె వాచాశూరత్వంమాని క్రియా శూరత్వం చూపమని మాస్టరుగారన్నమాట నిలబెట్టాలని శ్రద్ధతో మాత్రమే కాకుండా కేవలశ్రద్ధతో చేస్తుంటే తప్పక ఏనాటికైన రైలుపట్టాలమీదనే మన బండి పోవడం జరుగుతుంది. మన ఇంజనుకు రిపేరువచ్చినా సాయినాథుడనే మరొక బండి మన బండిని గమ్యం చేర్చడం తథ్యం. బురదలో బండి కూరుకుపోతే బండి ఒడ్డుకు తేవాలన్న తపనతో పంచె ఎగసికట్టి చమటలు పట్టేటట్లు శ్రమపడేవానిలాగా మన శక్తినంతా ఉపయోగించి ఆధ్యాత్మిక రంగంలో పని చేయడమొక్కటే కావాలి అంటారు మాస్టారు. అట్టి సద్బుద్ధిని, కార్యశూరత్వాన్ని ప్రసాదించమని నేను త్రికరణశుద్ధిగా వారిపాదాలకు ప్రణమిల్లి అర్థిస్తున్నాను.

## క్రొత్తవి తగిలించుకోవద్దు

క్రొత్తవి తగిలించుకోవద్దు. పాతవాటి విషయం బాబాకు వదలి వేయండి. వాటిని దగ్ధమొనర్చడమా, లేక ఆ బొమ్మలు ఫిలింనుండి తుడిచేసి క్రొత్తవి వ్రాయడమా, లేక కొండంతను గోరంతగా అనుభవింప జేయడమా, లేక స్వప్నాలలో అనుభవింపజేయడమా, లేక భవిష్యత్తులోని మరొక రోజుకు మార్చడమా అన్నది బాబాగారి బాధ్యత. బాబాగారికి పగ్గాలప్పగించడం మన బాధ్యత. కర్తవ్యం. ''క్రొత్తవి తగిలించుకోకుండా ఉండడం ఎలాసార్?'' అన్నారు మరొక శ్రోత. అందుకు మాస్టరుగారు, 'ఈక్షణంలో నివసించడం అభ్యసించాలి. అంటే **past and future** తలంపులు మానడం. దీన్నే గీతలో ''ఉదాసీనో గతవ్యధః సర్వారంభపరిత్యాగీ యోమద్భక్తస్సమే ప్రియః'' అన్నారు. గతాన్ని గూర్చి ఉదాసీన భావం వహించు, భవిష్యత్తులో ప్లానుప్రకారం ఏది చేయాలనే విషయం ఆలోచించకు. నిజానికి మన ఆలోచనాస్రవంతి అంతా ఈ రెండంశాలుగానే ఉంటుంది. ఇది మీకు చక్కగా అవగాహన కావాలంటే ఒకవారం డైరీ వ్రాయండి తెలుస్తుంది. వ్రాయడం ఎలా - ఏ ఆలోచనలు లేకుండా కేవలం బాబా చరిత్ర, బాబా రూపం వరకే పరిమితంగా ఆలోచనలు వుండాలని కూర్చోండి. అప్పుడు మీకొచ్చే ఆలోచనలన్నీ డైరీలో వ్రాస్తూ తిరిగి బాబా చరిత్ర, రూపాలమీద లగ్నం చేస్తూ ఇలా రోజూ ఒక అరగంట లేక ఒకగంట డైరీ వ్రాస్తుంటే మనకు దేనిమీద ఎక్కువ అభిరుచి కలిగి ఎలాంటి ఆలోచనలు వస్తున్నాయో తెలుస్తుంది.



మనతో కొందరు కలసి మాట్లాడి వెళ్ళారు. మన కర్మానుసారం వారితో కలిపారు బాబా. వారితో సంభాషణ జరిగింది. వారు వెళ్ళాక ఆ సన్నివేశాన్ని మూడువిధాలుగా నెమరు వేయవచ్చు. 1. ఆ వచ్చినవారు మంచివారని ఒక భావన. ఇది రాగమునకు సంబంధించినది. 2. వారు చెడ్డవారనే భావన. ఇది ద్వేషమునకు సంబంధించినది. ఇవి రెండూ పనికిరానివే. వీటినుండి విడివడాలి. 3. బాబా! నా ప్రారబ్ధానుసారం ఈ సన్నివేశాన్ని ఏర్పరచావు. అని మన ఆలోచనలు బాబామీద లగ్నం చేయాలి. అంతకుమించి మనమేమి ఆలోచించినా భవిష్యత్తుకు విత్తనాలు నాటడమే అవుతుంది. మన భవిష్యత్ ఫిల్మ్‌ను మనమే తయారుచేసుకుంటున్నవారమవుతాము. నీ తీరిక సమయాన్ని పనిలో లగ్నం చెయ్యి. ఆలోచనలేకుండా ఇల్లు సర్దు, గుడ్డలు కుట్టు, ఉతుకు, ఇలా ఏదైనా చేయి. ఇతర ఆలోచన లేకుండా ఉండడం ముఖ్యం.

క్రొత్త ఋణానుబంధాలు తగిలించుకోకుండా ఉండడం ఎలాగు? పైన వ్రాసినది ఒక ఉదాహరణ మాత్రమే. నిత్యం, అనుక్షణం అందరికీ ఇంటిలోను మిత్రులతోను, బంధువులతోను మెలగడంలో క్రొత్త క్రొత్త ఋణాను బంధాలు తగులుకొంటూనే ఉన్నాయి. ఆ విధంగా మనం ఋణాను బంధాలలో తగుల్కోకుండా ఉండాలంటే - 'రాగ, ద్వేష వియుక్తైస్తు' అనే శ్లోకంలో చెప్పినట్లు చేయాలి. రాగ, ద్వేషాలు, అభిమానము, మమకారము వగైరా లేకుండా మాస్టరుగారిలా జీవించాలి. ''నేనొకరితో గంటల తరబడి మాట్లాడవచ్చు, మరియొకరితో మాట్లాడకపోవచ్చు, నాకెవరిపైనా ద్వేషం లేదు, మమకారంలేదు. నా అంతరంగ మెలాంటిదో ఎవ్వరూ తెలుసుకోలేరు'' అంటారాయన. అలా జీవించగల్గడమే కర్మసుకౌశలం.

''వీళ్ళంతా జన్మజన్మలుగా ఋణాను బంధాన్ననుసరించి కలుస్తున్నారు. వీళ్ళందరికీ ఒక్కరూపాయి బాకీ ఉన్నచోట రెండురూపాయలుగా ఆ బాకీలు తీర్చాలి. బాబాగారన్నట్లు 'ఋణానుబంధాన్ని విశ్వసించు, ఏప్రాణిని తోలెయ్యవద్దు.' అంటే మమకారంలో కూడా చిక్కుకోవద్దు అని కూడా భావం. 'త్వమేవ మాతాచ, పితాత్వమేవ' అన్న శ్లోకం ప్రకారం వాళ్ళందరి రూపాలలో ఉండేది శ్రీ సాయినాథుడేనని శ్రద్ధాభక్తులతో సేవించి

ఋణ విముక్తులవడమే కావలసింది అని తెలుసుకొని వారితో మెలగాలి. అంతేగాని ఆ శ్లోకం పాడడం మాత్రమే చాలదు'' అంటారు మాస్టారు. ''మనకేవి రావాలో అవి వచ్చి తీరుతాయి. రానివి ఎంత ప్రయత్నించినా రావు'' అంటారు శ్రీరమణ మహర్షిగారు. ఇది చక్కగా వంటబడితే ఇక రాగద్వేషాలకు అవకాశమే లేదు. అది పోగొట్టావు, ఇది పోగొట్టావు, చెప్పినమాట వినవు అని మనభావాలు మనవారిపై తీవ్రంగా ఏర్పడినప్పుడు మనకు తెలియకుండానే వారిపై మన అంతరంగంలో ద్వేషమేర్పడుతుంది. మనవాళ్ళు గొప్పవాళ్ళు కావాలి అని ఆశించినపుడు మమకారం ఏర్పడుతుంది. అదే ఆశ - అది పోతేగాని అంతా పోదంటారు శ్రీవెంకయ్యస్వామివారు. దీన్నే మరొక విధంగా చెపితే ఇష్టం, అయిష్టం అవుతుంది. అనుక్షణం కేవల శ్రద్ధతో మనం చేసే ప్రతిపని కూడా సాయినాధుడు మనకిస్తానన్న ఉత్తమోత్తమ స్థితి చేరేందుకొక మెట్టేనని గుర్తిస్తూ, ఇష్టం, అయిష్టం లేకుండా, వివేక వైరాగ్యాలతో జీవించడం అలవాటు పడాలి. అంతేగాని పటాలను పూజించడం, హారతులివ్వడంతోటే మనం సాయి మాస్టర్ చెప్పినదంతా ఆచరించామనుకుంటే అది భ్రమ మాత్రమే. మనసును పనిలో నిమగ్నం చెయ్యి అంటారు మాస్టారు. ఇక్కడ చాలా జాగ్రత్త అవసరం. చేతులు, కండ్లు పనిచేస్తున్నా మనసు ఆలోచనలలో ఉంటుంది. నోరు ఇంట్లోవారిని కసురుకోవడమో, నామం చెప్పడమో చేస్తుంది. ఆ పనిలో త్రికరణములు (మనస్సు, వాక్కు, శరీరము) ఏకంగా కూడి చేయడంలేదు. అలా చేసిన పని కర్మసుకౌశలంగా చేయబడలేదు గనుక ఆ పనిని బాబా స్వీకరించరు. స్వీకరించారని మనం మాత్రం అనుకుంటాము అంతే. బాబాగారి భక్తులకు అన్నవస్త్రాలకు లోటులేదు. ఎన్ని ఉన్నా ఇంకా కావాలి, సంఘంలో మన స్థానమేమైపోతుందో అని మనకు తెలియకుండానే సబ్‌కాన్షస్ లెవెల్‌లో పేరుకు పోతుంది. అదే అసలు అనర్థం. నిత్యం కొన్ని నిమిషాలైనా బాబా ముందు స్థిమితంగా కూర్చొని మనకు మానసిక అశాంతి ఎక్కడ కల్గింది? కారణమేమిటి? సాధనకు భిన్నంగా ఎక్కడ మన భావాలు, ఆచరణ దెబ్బతిన్నాయి? అని లోతుగా యోచించి, మన తప్పులకు పశ్చాత్తాపముతో పాటు ప్రాయశ్చిత్తాలు చేసుకోకుంటే మనకు క్రొత్తవి తగులుకోక తప్పవు అంటారు మాస్టారు.



## శిలాశాసనాలు

శ్రీ మాస్టరుగారి నోటివెంట వచ్చిన ప్రతిమాట ఎంత తీవ్ర సత్యమో గ్రహించి ఆనందించడమనేది మన హృదయ పరిపాకం మీద ఆధారపడి ఉంటుంది.

వదిలించుకోలేని నా బలహీనతలను గురించి ఇంతకు ముందువలె మరలా మాస్టరుగారికి విన్నవిస్తే ''పోతాయిలే, తొందరేముంది'' అని చాలా తేలికగా అన్నారు. ఆ తర్వాత వారి సహజ బోధనా పద్ధతిలో నేను వినేటట్లు ఈ బలహీనతల నిర్మూలనా ప్రసంగం తెచ్చి నాప్రక్కవారికి చెపుతున్నారు.

''మన బలహీనతలను గురించి నోటితో చెప్పుకొని బాధపడుతున్నాముగాని వివేకానందునివలె ప్రాయశ్చిత్తాలు చేసుకుంటామా? లేదే! మరి అవెలా మనలను వదులుతాయి? ఒకరోజు వివేకానందుడు ఒక అందమైన స్త్రీని చూచి ''భగవంతుడు ఎంత అద్భుత అందాన్ని సృష్టించాడు'' అని మనసులో అనుకున్నాడట. వెంటనే వారికి వివేకం మేల్కొని, ''ఛ! నా బుద్ధి ఎంత పొరబడింది! ఈ సృష్టంతా భగవన్మయమయితే అందము, వికారము అనే ద్వంద్వాలకు తావేది? ఈరోజు ఇది అందమని తేల్చింది నా మనసు. రేపు దానిని కావాలంటుంది. దీనికి అంతేది? ఈ తప్పుకు నేడే శిక్ష అనుభవించాలని దోశల పెనుము ఎర్రగా కాలపెట్టి దానిపై కూర్చున్నాడు. ఆ బొబ్బలు మానేందుకు ఆరు నెలలపాటు బోర్లాపడుకొని చికిత్స పొందాడు. ఆ విధంగా మనం ప్రాయశ్చిత్తాలు చేసుకోకుండానే ఈ బలహీనతలు వదలమంటే ఎలా వదులుతాయి? కార్యశూరత్వమంటే అదే గదా. మనం వాచాశూరత్వానికే అంకితమయి ఉంటే సాయినాధుడేం చేస్తాడు. కష్టించిన వారికే గదా దైవకృప కల్గేది?'' అన్నారు.

మాస్టరుగారు ధ్యానం చేయాలని కూర్చొని తూగితే తలగోడకేసి కొట్టుకుంటే టెన్నిస్ బాలంత బొప్పి కట్టిందట. మరొకరోజు అలాగే తూగితే రెండు మోచేతులు గోడకేసి కొట్టుకుంటే రెండుచేతులూ స్వాధీనం తప్పి మరొకరు అన్నం కలిపి వారి నోటిలో పెట్టవలసి వచ్చిందట. అలా తిరిగొస్తే బాగుండుననిపిస్తే - ఇక్కడ లేనిది అక్కడేముంది గనుక ఈ కాళ్ళకు బుద్ధి రావాలని జేబులో డబ్బులు లేకుండాజేసి అడ్రసువ్రాసి జేబులో పెట్టుకొని

తిరగసాగారట. స్పృహతప్పి పడిపోతే ఎవరో వీరి జేబులోని అడ్రసుచూచి రిక్షాలో రూమువద్ద వదిలారట. ఇలాగే మరొకరోజు అలా వెళ్ళొచ్చి కాఫీ త్రాగుతామని అనిపిస్తే ఆరు గంటలు కాఫీకూడా త్రాగకుండా ఉన్నచోటే వాళ్ళన్నగారైన శ్రీ కృష్ణమాచార్యి గారింట్లో కూర్చోనుండి పోయారట. శ్రీ ఆనందమయి అమ్మగారి దర్శనార్థం వారెంత తెగింపుచేసి ప్రాణాలపై ఆశలేకుండా మంచులో చెట్టుక్రింద పూర్తి జ్వరంలో నిరీక్షించడం చూచాము. ఇవన్నీ వాచా శూరత్వం మాని, క్రియాశూరత్వం చూపు అన్న వారి శిలాశాసనానికి వారు ఆచరించి చూపిన ఉదాహరణలే. అలాంటి ప్రాయశ్చిత్తాలే మనల నుద్ధరిస్తాయి గాని కేవలం మాటలు మాత్రం చాలవని శ్రీమాస్టరుగారు మరొక్కసారి మనలను హెచ్చరిస్తున్నారు.

## ప్రారబ్ధం - మానవ ప్రయత్నంగూర్చి మాస్టరుగారి బోధ

ప్రక్కగ్రామమునుండి ఒక రెడ్డిగారు వచ్చి తమ అంతులేని కష్టాలు, చెడ్డరోజులనుగూర్చి మాస్టరుగారితో చెప్పుకున్నారు. అంతావిని మాస్టరుగారన్నారు : ''మన ప్రారబ్ధము natural course ప్రకారం slowగా అనుభవించడమా లేక ఎక్కువశ్రమ శరీరానికి ప్రయత్నపూర్వకంగా తెచ్చిపెట్టుకొని అనుభవిస్తూ, త్వరగా మన ప్రారబ్ధానుభవమును పూర్తిచేసుకోవడమా అనేది మనచేతిలో వుంటుంది. ఒక బండపై నడువగా నడువగా చాలాకాలానికి నున్నగా వస్తుందాబండ. అట్లాగాక ఆ బండపై మిషన్‌వేసి పాలిష్‌చేస్తే వెంటనే నునుపు వస్తుంది. అలాగే సుఖం, శాంతి, మంచిరోజులనేవిగూడా! ఏలినాటిశని పట్టినవానికి నేలమీద పడుకోవడం, ఇష్టమైన కూర వదలడం, వేకువజామున చన్నీటి స్నానంచేసి దేవాలయాలకు వెళ్ళి ప్రదక్షిణలు చేయడంవంటి సాధనలతోటి నియమంగా సద్గ్రంథ పారాయణ; నామస్మరణ, పూజ వగైరా ఎంత తీవ్రంగా చేస్తుంటే అంత త్వరగా ప్రారబ్ధం ఖర్చయిపోయి మంచిరోజులు వస్తాయి. గనుక వెంటనే మీశక్తి కొద్దీ సాధన ప్రారంభిస్తే త్వరలోనే సాయి కృపచూపి మంచిచేస్తారు. ప్రయత్నించండి'' అని సలహా యిచ్చారు.

ఇందులో చన్నీటి స్నానాలు, ఉపవాసాలు, నామస్మరణ, పూజ, ఇష్టమైనపదార్థాలు వదలడం వంటి సాధనల ప్రాశస్త్యం వివరించారన్న మాట.



''భక్తులకే కష్టాలు వస్తుంటాయి ఎందుకు సార్?'' అన్న విద్యార్థితో, ''భక్తులు కానివారికి కష్టాలు రావటంలేదా ఏమి?' భక్తులైనవారికి వారివారి ప్రారబ్ధానుసారం కష్టాలు రావడం సహజమే. అయితే నిజమైన భక్తులకు వారి కష్టాల యెడలగల భావన మరొకవిధంగా వుంటుంది. ''నమే భక్త ప్రణశ్యతి'' నా భక్తుడు నశించడు - బాధపడడు అని గీత చెబుతుంది. తన ఎదుట ఎన్ని అవాంతరములు, గందరగోళములు జరుగుతున్నా నిజమైన భక్తుని దృష్టి ఆ పరిస్థితులపైగాక, వానిని నడుపు దైవంమీద వుంటుంది. తన మనసు భగవంతునిపై లగ్నం చేసేందుకు వాటిని ఉపయోగపెట్టుకుంటాడు. కుంతీదేవి లాగ, ఎన్ని మార్పులు జరిగినా అవన్నీ ఆ భక్తునకు చివరకు అనుకూలంగానే ఫలితమిస్తాయి. ప్రస్తుతానికి కష్టంగావున్నా ముందురోజులలో అవి ఆ భక్తునకు మేలు చేసేవిగా వుంటాయి. గనుక నిజమైన భక్తుడు పరిస్థితులపైగాక వానిని నియమించి నడుపుతున్న భగవంతునిపై మనసు లగ్నం చేస్తాడు.

ఏనాడైనా నీ మనసులో ఆందోళన, భయము, worry వచ్చాయంటే ఆరోజున నీ ధ్యాస భగవానునిపై సరిగా లగ్నంకాలేదని అర్థం. అంటే చాలినంత పారాయణ జరుగలేదని, ఆ జరిగిన పారాయణలోకూడా నీ మనసు సరిగా లగ్నంకాలేదని అర్థం. గనుక **whenever you are worried you have to note that your anusthana is not up to mark. So be alert and go deep into parayana and satsanga. You take the example of an old student Chennaiah.**

ఈ చెన్నయ్య **B.A.** చదివేరోజులలో రేపు పరీక్షవున్నాసరే ఆరోజు 'సాయి చరిత్ర, వగైరా వ్రాయాలంటే వచ్చి వ్రాసేవాడు. అయినా అన్నింటిలో **1st class** వచ్చేవాడు. **M.Sc.,** చేశాడు, **T.M.** (భావాతీత ధ్యానము) ట్రైనింగుకు పంపారు. కానీ అక్కడ సరిగా ఉండక ఉద్యోగాల కొరకు **interview**కు వెళ్ళను మొదలుపెట్టాడు. ఏ ఉద్యోగమూ రాలేదు. సరిగదా **T.M. training**లో **days** పోయాయని **fail** చేశారు. తరువాత అతడు **realise** అయి ఏడు వారాలు తీవ్రంగా పారాయణచేస్తే వెంటనే **lecturer**గా ఉద్యోగం వచ్చింది. ఇదే పని మొదటనే చేస్తే తప్పక త్వరగా **settle** అయివుండేవాడు.''

మరొకరోజు సాధననుగూర్చి ఇలా చెప్పారు :

''నీ మనసు సాధనలో లగ్నంచెయ్యి. శ్రీసాయిని సర్వగతుడుగా స్మరించు. పనిలేని మనసే పాపాలకు, శోకాలకు, తాపాలకు నిలయం. సాధన దశలో ఖాళీగా వుండే మనసు ముక్తికి కడుదూరమవుతుంది. దినమంతా పనిలో లగ్నంచెయ్యి. మనసుకు శాంతికావాలంటే ఇదే మార్గం. ఆనందం అందుకోవాలంటే రోజంతా పనే ఆలంబన కావాలి. పనిలో నిలిచిన మనసు అన్యచింతలకు తావివ్వదు. ఆ పనే సాధనగా తీసుకొని సాయి చెప్పిన శుభ్రమార్గంలో నడవడమే సాధన.''

ఒకరోజు శ్రద్ధను గురించి ప్రస్తావన వచ్చింది. అప్పుడు చెప్పారు : ''శ్రద్ధ అనేది అనుక్షణమూ వుండవలసిన జాగ్రత్త. మనమెచ్చట వున్నాసరే సాయి సన్నిధిలో, సాయిలోనే వున్నామని భావించాలి. మనం చేసే ప్రతి చిన్నపనీ అగ్గిపెట్టె తీసుకోవడం, ఆష్ట్రే తీసుకోవడం దగ్గరనుండి ప్రతి చిన్నపనిలోనూ శ్రద్ధ వుండాలి. మనసులో వేరే ఆలోచన లేకుండా మనసంతా పూర్తిగా ఆ చిన్నపని చేయడంలో నిమగ్నమవ్వాలి. అందువల్లనే నేను ఒకే సమయంలో అనేకవస్తువులు రెండుచేతులతోను manipulate చేయగల్గుతాను. వస్తువులు చేయిజారిపడటం ఎప్పుడూ వుండదు. వస్తువులు మరచిపోవడం కూడా జరుగదు. We must learn to live at the present moment. అనుక్షణం సాయి మనవైపు చూస్తుంటే మనం alertగా వారివైపుచూస్తూ వారికొరకే ప్రతి చిన్నపనీ చేస్తున్నామన్న నిశ్చయమైన ఎరుకతో చేయాలిగాని, సాయి మనవైపు చూస్తుంటే మనం past గురించో future గురించో యోచిస్తుండటంవల్ల ఆ క్షణంలో మనంవారి సన్నిధిని విస్మరించడమెంత అపచారం? అనుక్షణం వారు మనవైపు చూస్తున్నారు అనే స్థిరనిశ్చయం ఎక్కువమందికి వుండదు. ఒకవేళ వున్నా అనుక్షణం మరచిపోతుంటారు.

ఇష్టాయిష్టాలు లేకుండా టైంటేబుల్ ప్రకారం పనిచేసితీరాలి. ఇష్టాయిష్టాలు లేకుండా పోవాలంటే మొదట నడవాలనిపిస్తే గంటల తరబడి కూర్చోవాలి. కూర్చోవాలనిపిస్తే గంటలతరబడి నడవడం, అకాలంగా తినాలనిపిస్తే పస్తుండటం - ఇలా కొన్నాళ్ళు మనసును వేధిస్తే అది వశమై ఇష్టాయిష్టాలులేకుండా సాయి సంకల్పానుసారం నడచుకోవడం నేర్చుకుంటుంది. నిరంతరం past and future ను గూర్చి ఆలోచించడం మాని present mininuteలో జీవించడం నేర్చుకుంటుంది మనస్సు. ఇదంతా చేయాలంటే భల్లూకపుపట్టు కావాలి. మిలారెపాలాంటి యోగులచరిత్ర మన ఆచరణకు మంచి steering యిస్తుంది.''



''సార్, సాయి భక్తులందరూ దొంగభక్తులు - శీలంలేని వెధవలు అని నిందలు వేస్తున్నారు సార్'' అని వాపోయాడొక విద్యార్థి. మాస్టరుగారు అన్నారు: ''అవునయ్యా, పాపం వాళ్ళేమిచేస్తారు? అనేక వేల జన్మలలో అజ్ఞానంవలన చేసిన కర్మల ఫలితంగా సంప్రాప్తమైన set of instruments గల శరీరాలవి. ఆ instruments ఎలా ప్రవర్తిస్తే అలానే పలుకుతారు. అవి ఏ sound యిస్తే అదే ఆలపిస్తున్నారు''. వారియెడల మనం జాలిపడి, 'బాబా! వాళ్ళు అలా ప్రవర్తించేలా ఎందుకు చేస్తావు? వారి అజ్ఞానం పారద్రోలి జ్ఞానం ఇవ్వు' అని ప్రార్థించాలి.

అసలు బద్ధశత్రువైనా వానియెడల ద్వేషం వహించేందుకు వీలు లేదు. ఎందుకంటే అలా ప్రవర్తించింది ఎవరు? వాని శరీరమా? ఆత్మా? ఆత్మ అనేందుకు వీలేలేదు. కారణం ఆత్మ ఏపనీ చేయదు. 'నిష్క్రియం, నిర్వికల్పం గదా!' శరీరం అందామా అంటే - చనిపోయాక అది మాట్లాడలేదుగనుక వాని ప్రవర్తన శరీరానిదికాదు. అజ్ఞానానికి వ్యక్తిత్వం లేదు. అది ఇంద్రియగోచరం గాదుగనుక వ్యక్తిత్వం లేదు. వ్యక్తిత్వం లేని దానిపై కోపించడం, ద్వేషించడం ఎలాసాధ్యం? ఎదుటివానిలో అజ్ఞానం గలదు గనుక, మనంకూడా అలాంటి అజ్ఞానంలో వున్నప్పుడే react అవడం జరుగుతుంది. మనం జ్ఞానంలోవుంటే ఎదుటివాని అజ్ఞానం పట్టించుకోముగదా! ఎదుటివాని అజ్ఞానం రూపుమాపేందుకు ప్రార్థిస్తాం''

''సర్వం బాబా మయం - సర్వం ఖల్విదం బ్రహ్మ అని ఎలా చూడడం - మోసగానిలోకూడా బాబాను చూస్తే మన డబ్బు పోగొట్టుకోవలసి వస్తుందిగదా!'' అని మాస్టరుగారినొకరోజు అడిగాను. అందుకిలా చెప్పారు :

''మోసగాడని తెలిసికూడా-అడిగిన వెంటనే మనం పైకం ఇవ్వనక్కరలేదు. ఇవ్వనంత మాత్రాన బాబాను తిరస్కరించి నట్లుకాదు. ఒకడొక నది ఒడ్డున ధ్యానం చేస్తున్నాడు. వాని స్నేహితుడు పులివేషం వేసుకొని వచ్చాడు. వెంటనే అతడు భయపడటం ఖాయమే. విగ్గునుతీసి తన నిజరూపం చూపించాడు. ఇకమీదట పులివేషగాణ్ణిచూచి భయపడడు. కన్నులు పులిని చూస్తే మనస్సు తన స్నేహితుని చూస్తుంది. అందువల్ల భయం లేదు. అలానే మనం లోకంలో ఇంద్రియాలతో వ్యవహరిస్తున్నా మనసులో బాబాను భావిస్తుంటే సరి. అభ్యాసంవలన సమభావం వస్తుంది. ఒక పాడుపడ్డ ఇంటిలో ఒకత్రాసు వ్రేలాడదీయబడి, దానిలో ఒకవైపు నిండుగా రాళ్ళు రప్పలు వున్నాయి. అందువల్ల, అది ఒకవైపుకే వాలివుంది. ఇవతల పళ్ళెంలో బరువులు వేయడం వల్లగానీ లేక వున్న బరువులు తొలగించడం ద్వారానైతేనేమి సమముగా తూగేటట్లు చెయ్యవచ్చు. అలానే అంతా చైతన్యమే. మనసువలన అలా భిన్నభిన్నంగా గోచరిస్తుంది. నేను అని పరిమితంగా ఏమీలేదు అని భావన చేయడమే త్రాసులోని బరువులు తొలగించడం.

పై కథలో విగ్ తీయడంవలన అసలు సంగతి తెలిసింది. విగ్ తీయడం అంటే జ్ఞానం కల్గడం. అది ఎలా కలుగుతుంది?

విశ్వంలోని నామరూపాల ప్రభావంవలన నానాత్వం గోచరించే మనస్సుకు నిరంతర అభ్యాసంద్వారా ఆ నామరూపాల మాటునవున్న బాబాను (ఏకత్వం) (బ్రహ్మాన్ని) చింతనచేయడం సహజసిద్ధం కావాలి. 'భావాద్వైతం సదా కుర్యాత్ - క్రియాద్వైతం నకుర్వచిత్' అన్నారు. భావంలో అద్వైతం సదా చింతనచెయ్యి, కార్యం చేయడంలో అద్వైతం తగదన్నారు పెద్దలు. గనుక వచ్చినవాడు బాబా రూపమే. అయినంత మాత్రాన అప్పివ్వాలనేముంది? పాము, పులికూడా బాబారూపాలే అయితే వాటిని ఇంట్లోపెట్టి పూజించాలా? వాటి పాదాలకు నమస్కరించాలా? అలాగే ఆ మోసగాని రూపంలోకూడా బాబా వున్నారు అన్న భావనే ప్రధానంగానీ మనం క్రియారూపంలో బాబాకు చేసే షోడశోపచారాలు చేసి వాడడిగిన దక్షిణ ఇవ్వనక్కరలేదు సుమా! దీన్నే గీతలో కర్మసుకౌశలం-కర్మనాచరించడంలో చాలా కౌశలం-నేర్పరితనం కావాలి అని పరమాత్మ హెచ్చరించాడు.''



## రాగద్వేషాలు జయించి నిర్మూలించేందుకు గృహస్థాశ్రమం ఒక చక్కని work shop.

డిశంబర్ 1979లో కాన్వెంటు టీచర్ కొరకు అన్వేషిస్తూ దామోదర్ అనే అబ్బాయి ఆ విషయం మాస్టరుగారితో సంప్రతిస్తున్నాడు. మాస్టరుగారన్నారు, ''చదువుకున్న అమ్మాయినిచూచి నీవు పెండ్లి చేసుకుంటే నీకు రెండు విధాలుగా ఉపకరిస్తుంది. ఒకటి టీచరుగా నీ స్కూలులో పనిచేస్తుంది. రెండు house wifeగా వుంటుంది'' అన్నారు. నేను ఏకాంతంలో సాధన చేసుకుంటాను నాకు వివాహంవద్దు అంటాడు దామోదర్. ''నీకు అరుగవలసిన కోణాలు ఇంకా చాలా వున్నాయి. అవి గృహస్థాశ్రమంలోనే అరగాలి. ఇక వేరే మార్గమే లేదు. వాటిని ఇక ఏవిధంగాను అరగదీసుకునేందుకు వీలుపడదు. అవి అరుగకుండా నీవు ఏకాంతంలో సాధనచేసినా నిష్ప్రయోజనమే'' అని మాస్టరు గారు ఖండితంగా చెప్పారు. దాము చాలా బాధపడ్డాడు. తర్వాతరోజు సత్సంగంలో వార్తాలాపం చదువుతున్నారు. అందులో నిత్యానంద, ప్రకాశానందుల వారు పలికారు - జనకుడు, యాజ్ఞవల్క్యుడు గృహస్థాశ్రమంలో రాగద్వేషాలు పూర్తిగా దగ్ధమొనర్చి యోగారూఢులై ఇష్టాయిష్టాలు సంపూర్ణంగా లేకుండా పోయాకనే ఏకాంతంగా సాధన చేసినట్లు, ఆవిధంగా రాగద్వేషాలు జయించేందుకే గృహస్థాశ్రమంలో వున్నట్లు శాస్త్రప్రమాణం చూపారు. అప్పుడు దాము కొంచెం స్థిమితపడ్డట్లు కనిపించాడు.

అందుకే మాస్టరుగారనేవారు - మనంగా ఇలా చేయమని చెపితే మనుషుల హృదయాలకు హత్తుకోదు. అందుకే నేనెప్పుడూ ఆ మహనీయుడు ఇలా చెప్పాడు, ఈ గ్రంథంలో ఇలావుంది అని ప్రమాణాలు చూపుతూ పరోక్షంగా చెపుతుంటాను అనేవారు.

## విధి నిర్ణయం గురించి మాస్టరుగారి వ్యాఖ్య

''విధినిర్ణయం అంటారుగదా, దాన్నిగురించి మీ అభిప్రాయ మేమిటి - అంతా విధినిర్ణయం ప్రకారం జరిగేటట్లయితే ఇక మన ప్రయత్నమేముంది సార్'' - అన్నాను.

మాస్టరుగారు వివరించారు : ''విధి నిర్ణయంపై అచంచల విశ్వాసంతో ధర్మం తప్పకుండా నడుచుకోవడమొక్కటే మనం చేయగలిగింది. ఏ శరీరానికి ఏమేమి అనుభవం కావాలో, అవన్నీ ముందే నిర్ణయించబడివుంటాయి. అవి ఆ శరీరానికి అనుభవమై తీరుతాయి. ఎక్కువగా అనుభవించాలనే మిషతోనో, తప్పించుకోవాలనే మిషతోనో అధర్మంగా ప్రవర్తింపచూడటం పనికిరాదు. అలాంటి ప్రవర్తనవలన మనకు చెడ్డ సంస్కారాలు develop అయి; నీచ జన్మలకు పునాదులేసుకుంటామన్న మాట. ఇష్టాయిష్టాలు లేకుండా బాబా సంకల్పాలకు వినమ్రులమై తల ఒగ్గడమే మనం చేయదగ్గపని. మనకేదైనా విధినిర్ణయం మార్చడంవలన మనకు మంచి జరుగుతుందని బాబాగారు తలుస్తే, తప్పక ఆ నిర్ణయాన్ని మారుస్తారు. మనం అడగనక్కరలేదు''.

మధ్యలో సత్యంగారు కల్పించుకొని, ''నిర్ణయంవున్నా మన ప్రయత్నంతో Counter చేసి తప్పుకోవచ్చు గదా! గనుక ఆ నిర్ణయం మార్చవచ్చు'' అన్నాడు. అప్పుడు మాస్టరుగారన్నారు : ''సాధారణ మనుషుల్లో లక్షకు ఒక్కరు కూడా అంత గట్టిగా ప్రయత్నంచేసి విధిని మార్చే పట్టుదల గలవారై ఉండరు. ఉదా:- దేవాలయానికో, సత్సంగానికో పోవాలని వస్తుంటాడు. ఆనాటి సత్సంగంలో అతడు పాల్గొనేటట్లు ముందు నిర్ణయం లేదు. గనుక మధ్యలో friend కనిపించి మాటలు పెట్టుకుంటాడు. వాణ్ణి వదలకొట్టుకోలేడు. 50% వదలకొట్టుకొని వస్తున్నా మరొకడు వచ్చి ఏ సినిమాకో, షికారుకో రమ్మని బలవంతం చేస్తాడు. వెంటనే వెళ్తాడు. అంతేగానీ నేను సత్సంగానికి వెళ్ళాలి రాలేను అని ఖండితంగా చెప్పలేడు. అలాచెప్పే స్తోమతు లక్షకొకరికికూడా ఉండదు. అలాంటి స్తోమతువుంటే అక్కడికి పోకుండా సత్సంగానికి వచ్చి బాబాకు ప్రార్థన చేయడమే సరియైన మార్గమని తడుతుంది. ఇలాగే అనేక అవరోధాలవలన మన ప్రయత్నాలు జరుగవు. అంతా విధినిర్ణయమే జరుగుతుంది. జరిగేది విధినిర్ణయమే అయినా అహంకార యుతమైన మన అంతరాత్మలు అంతా నా ప్రయత్నముతోనే సాధించానని భ్రమిస్తూ, అనవసరమైన బంధాలు పెంచుకొని జననమరణ చక్రంలో పరిభ్రమిస్తుంటాము'' అన్నారు.



మార్చి 1980లో మెట్టునుండి ఒక విధవరాలు తన 14సం॥ పిల్లవానిని తీసుకొని మాస్టరుగారి దగ్గరకొచ్చింది. ఆపిల్లవాడు అదోరకంగా వుంటాడు. చదువుకోడు - బాబా చరిత్ర పారాయణ - పూజ, భజన ఎంతచెప్పినా చేయడు. చదువులో మొద్దు. దానికి తగినట్లు ఎప్పుడూ అనారోగ్యము. దానికి తగినట్లు బీదరికము. ఆ పిల్లవానికి మాస్టరుగారొక కథ చెప్పారు :

''ఒక తండ్రికి ఇద్దరు కొడుకులున్నారు. తండ్రి వాళ్ళిద్దరికీ ఆస్తి సమానంగా పంచియిచ్చాడు. ఒకడు తన ఆస్తినంతా జాగ్రత్తచేసుకొని కష్టపడి పనిచేసి, పంట పండించి పైకం కూడబెట్టి క్రమంగా వందఎకరాల ఆసామియై సేద్యగాళ్ళచేత సేద్యం చేయిస్తూ హాయిగా వున్నాడు. రెండవవాడు అంతా త్రాగి, జూదమాడి పోగొట్టుకొని అప్పుల పాలయ్యాడు. ఇంటినుండి బయటకొస్తే కట్టేసి తన్ని చొక్కా, లాగు పెరుక్కునేటట్లు తయారుయ్యాడు. అప్పుడు దేవుని ప్రార్థించాడు - 'స్వామీ, ఇక నేనెప్పుడూ ఇలా చెయ్యను. ఈ అప్పుల వాళ్ళనుండి రక్షించు' అని. దేవుని దయవల్ల ఆనాటి బాకీలవాళ్లు పోతేపోవచ్చు, మిగిలిన పాత బాకీలవాళ్ళు పోతారా? ఓ దేవుడా, నీకు మొక్కానుగదా. మరలా అప్పులవాళ్ళబాధ పెట్టావే, అట్లాగయితే నీకు మొక్కను పొమ్మన్నాడట. దేవునికి నష్టమా? అట్లాగే మనం చేసిన పూర్వకర్మ మనలను వదలదు. దేవుని ప్రార్థిస్తే వెంటనే మంచి ఎలా జరుగుతుంది? మనం కొన్నాళ్ళు ప్రార్థించి బుద్ధి గల్గివుంటే దేవుడు నీ ప్రారబ్ధాన్ని తగ్గిస్తాడు.

ఎక్కువకాలం జైలుశిక్ష వేసినవానికి వాడు ఇకనెప్పుడు అలాంటి తప్పుచేయడు అనేటంతగా వాని నడవడిలో మార్పు వచ్చి - జైలు ఆఫీసర్లకు వానిపై నమ్మకమేర్పడితే శిక్షాకాలం తగ్గించి ముందుగానే విడుదల చేస్తారు. అలానే మనమూ మన సత్ప్రవర్తన, భక్తి విశ్వాసాలవలన భగవంతుని మెప్పిస్తే మన ప్రారబ్ధం కూడా తీసేసి కృష్ణాబాయమ్మను రక్షించినట్లు, ఉపాసనీబాబాను రక్షించినట్లు దేవుడు రక్షిస్తాడు. కష్టపడి పనిచేస్తే అన్నలాగా హాయిగా వుంటాము. అంటే కాలం వ్యర్థం చేయకుండా అవకాశం పాడుచేయకుండా భగవంతుని ప్రీతికొరకు మంచిచేస్తే మనకు లాభం వచ్చి పుణ్యం వలన సుఖపడు తాము. అలాగాక తమ్ముని వలె కాలాన్ని, అవకాశాన్ని దుర్వినియోగంచేస్తే

బాధపడతాము. 'ఓ భూమీ! నీవు నాకేమి పెట్టావు?' అంటే 'ఓరి చవటా! నీవు నాకేమి ఎరువు వేశావు?' అంటుంది. 'ఓ పుస్తకముల కట్టా, నిన్ను నేను భద్రంగా ఇంటిలో ఉంచానుగదా, నాకేమి నేర్పావు?' అంటే 'ఓరి దద్దమ్మా! నన్ను నీవు చదివావా?' అంటుంది. కనుక కష్టపడి శ్రమచేస్తేనే ఫలితం దక్కుతుంది. బాబా చెప్పింది అవగాహనతో ఆచరించాలి. అందుకే మొదట చక్కగా పారాయణ చేయాలి. అప్పుడు బాబా మన ప్రవర్తనకు సంతోషించి మనకు సహాయం చేస్తారు'' అని ఆ పిల్లవానికి ఊది, అరటి పండు ప్రసాదం యిచ్చి పంపారు.

## మహనీయుల ప్రవర్తన

నేను మొదటిసారి షిరిడి వెళ్ళినప్పుడు నాకొక నకిలీ సాధువు కలిసాడు. ఎముకల గూడై రోడ్డుప్రక్క కూర్చొనియున్నాడు. గొప్ప మహనీయుడని నమస్కరించాను. తన వ్రతం-దీక్ష వగైరాలను గూర్చి చెప్పి బిరియాని, మాంసం పులుసు తెప్పించుకున్నాడు. కానీ తానేమో గోచీ మాత్రమే ధరించి వట్టివంటిన వున్నాడు. మాటల సందర్భంలో తాను పూర్వాశ్రమంలో లక్షాధికారినని తన ఆస్తిపాస్తుల వివరాలుకూడా చెప్పాడు. నేనీ విషయం మాస్టరుగారికి చెపితే, ''నీవు బాగా మోసపోయావు. 1. మహనీయుడెవ్వరూ తన పూర్వాశ్రమ వైభవాన్ని గూర్చి చెప్పనే చెప్పరు. బాబా తన గురుసేవను గూర్చికూడా ఎవ్వరికీ చెప్పలేదు. ఉపదేశంకొరకు చావసిద్ధమైన రాధాబాయితో మాత్రమే తన గురుసేవా వృత్తాంతం బయట పెట్టారు. 2. నిజమైన సాధువు అన్నపానీయాలకుకూడా భగవంతునిపైనే ఆధారపడతాడు. ఎదుటివారిని దేబిరించడు. తన నియమం ప్రకారం కొన్ని ఇండ్ల దగ్గర నియమితకాలంమాత్రం భిక్షనడిగి వేచివుంటాడు. ఆలోగా భిక్షయిస్తే సరే, లేకుంటే ఈరోజుకు ఇంతే ఇచ్చారని పస్తయినా పడుకుంటాడుగానీ నియమం మాత్రం తప్పడు. వార్తాలాపం చదివితే ఇలాంటి విషయాలు తెలుస్తాయి'' అన్నారు.

"Live at the present moment - live at the present moment" అని మాస్టరుగారు ఎన్నిసార్లు బోధించారో చెప్పలేను. అలా ఉండలేక మనసు past or futureలో పరుగులెత్తి ఆలోచనల రూపం ధరించేది. ఒకరోజన్నారు -



''అది అలా తిరుగుబోతు గాకుండా చేయాలంటే వివేక వైరాగ్యాలకుతోడు అంతులేని విశ్వాసం ఉండాలి. దేనిమీద? సద్గురు సాయినాథుని అనంతప్రేమ స్వరూపంపైన. వారి సర్వజ్ఞత్వం, సర్వసమర్థత్వంపై విశ్వాసముండాలి. దీనికితోడు మన నిరహంకారస్థితి సహజసిద్ధమై ఉండాలి. అంతా చేసేది ఆయనైతే మన ఆలోచనలు కార్యరూపం దాల్చి మనకేమి మేలు చేయగల్గుతాయి అనే వివేకం ఉండాలి.

''ఉదాసీనోగత వ్యధః -
సర్వారంభ పరిత్యాగీ యోమద్భక్తస్సమేప్రియః''

అన్న గీతావాక్యం పై దృష్టి నిలిపి గతంగూర్చి ఆలోచన, భవిష్యత్తును గూర్చిన చింతలేకుండా జీవిస్తుంటే live at the present moment అవుతుంది'' అన్నారు.

అన్ని బోధలకంటె ఇది నాకు చాలా మంచి బోధ అయింది. పై గీతాశ్లోకం నిరంతరం గుర్తుంటేచాలు. అల్లామాలిక్ అయినప్పుడు ఇక నా ఆలోచనలతో పని ఏముంది? నా ఆలోచనలన్నీ నా అహంకారానికి గుర్తులే అనేది నిరంతరం మరువరాని సత్యం అన్నమాట.

''కావాలనే కోర్కెలన్నీ విడనాడి నన్నే శరణు పొందు'' అన్నారు సాయినాథుడు.
''ఆశపోతే అంతా పొంతుండ్లాయ్యె'' అన్నారు శ్రీ వెంకయ్యస్వామివారు.

తాజుద్దీన్ బాబా మాటను దమ్మపేట లక్ష్మిగారు ఒక చక్కని వాక్యంలో ఇమిడ్చారు. 'పనిగట్టుకొని ఆలోచనా స్రవంతిని అరికట్టుటే సాధన' అని. మనం present momentలో నివసించకుండా future or past secondsలో నివసిస్తూ ఆ ఆలోచనలు చేస్తుండేందుకు కారణం - పై మహాత్ములు చెప్పిన కావాలనే కోరిక, ఆశ అనే సంస్కారాలే గదా కారణం. తాజుద్దీన్ బాబాగారు చెప్పినట్లు ఆలోచనా స్రవంతిని అరికట్టాలి. అసలు ఆలోచనలు ఎందుకు కల్గుతున్నాయో తెలుసుకుంటే తర్వాత అరికట్టడం సులువు. దీనికిగూడా పూజ్య శ్రీ మాస్టరుగారు చక్కగా వివరణ ఇచ్చారు. ''ఆలోచనలకు కారణం ఏమిటంటారు? అజ్ఞానం. అజ్ఞానం అంటే ఏమిటి? అన్నీ మన సంకల్పాను సారమే జరుగుతున్నాయనీ, జరగాలనీ అనుకోవడం. కానీ ఈ సృష్టిలో ఏ

ఇసుకరేణువు ఎక్కడ వుండాలో ముందే నిర్ణయమై ఉంది. ముమ్మాటికి అంతే. లేకుంటే సూర్యచంద్రులు, గ్రహాలు ఇంత నిర్దుష్టంగా పరిభ్రమించే ప్రసక్తే లేదు. మన ఋషులు చెప్పింది, నేటి scientific విజ్ఞానం చెప్పేదీ అదే. మహాత్ములందరూ చెప్పిందీ అదే. కబీరు చెప్పినట్లు ఏ ధాన్యపుగింజ ఏ జీవి నోట్లోకి పోవాలో ముందే దాని మీద వ్రాసిపెట్టబడి వుంటుందట. ఆ అక్షరాలు మన చర్మచక్షువులకు కనిపించకపోవచ్చు. మరి అదే నిజమయితే మన ఆలోచనలకు తావేముంది? మనం ఆలోచించినా, ఆలోచించకున్నా మనకు రావలసినవి వచ్చి తీరుతాయిగదా! మనకు ప్రాప్తంలేనివి, మనం ఎంత గింజుకులాడి ప్రయత్నించినా మన కర్మానుసారంగా ముందే నిర్ణయమున్న దానికంటె అధికంగా మన ప్రస్తుత ప్రయత్నంవల్ల, ఆలోచనలవల్ల మనకేమి అనుభవానికిరావు. ఇదే జనకుని రాజభోగముల విషయంలో జరిగింది. వారు సన్యాసితోటి అడవిలోనికి వెళ్ళగా (సుఖాలను త్యజించి) అక్కడకూడా ఆ టైమ్‌కు అవి లభ్యమయ్యాయి. మన ప్రారబ్ధంలో అవసరాలు పొందేందుకు కొంత కృషి చేయాలని వ్రాసిపెట్టియుంటే మన ఆలోచనతో నిమిత్తం లేకుండా అప్పటికప్పుడు మనమే ఆయా పనులు నిర్వర్తించి తీరుతాము. అందుకు మన ఆలోచనకు తావేలేదు.

So life at the present moment అదే మన ధ్యానంలో సాయికి విన్నవించుకోవలసిన ముఖ్య ప్రార్థన. మనలగురించి ఎవరేమను కుంటారోనన్న, ఈలాంటి భావాలు మనస్సులో లేకుండా సాయిపై మనసు లగ్నం చేయడమే ధ్యేయం.

## మానవ ప్రయత్నము - ఆలోచన

మాస్టరుగారు ఒంటరిగా దొరికారంటే వెంటనే అడిగేందుకు రెడీగా నా దగ్గర ప్రశ్న ఉండేది. 'ఆలోచనలను అరికట్టడమే సాధన గదా సార్ - మరి మనకు ముందుగా ప్లాను, ఆలోచన లేకుండా పనులెలా జరుగుతాయి?' అని ఒకసారి అడిగాను.

'ఆలోచనే అక్కరలేదు సుబ్బరామయ్యా, ఆ పనిచేయవలసినట్లు వున్న మన పూర్వ కర్మే మనచేత ఆ సమయానికి ఆ పనిచేయించి తీరుతుంది. ఆ కర్మే



మనలను ఆ పనిచేసేందుకు ముందుకు నెట్టి చేయిస్తుంది. నీవు ముందుగా ఎంతగా ఆలోచించినా ఆలోచించకున్నా ఆ విధంగానే పనిచేసి తీరుతావు. ఆలోచన అనవసరం' అని ఎన్నిసార్లు చెప్పారో చెప్పలేను. వారెన్నిమార్లు చెప్పినా నాకది హృదయగతం కాలేదు. ఆ కరుణామయుడు విసుగులేకుండా మరలా మరలా మాటలు మార్చి చెప్పేవారు. వారి సంకల్పబలం వలన కొన్నాళ్ళకు నాకీ విషయం బోధపడి హృదయగతమవసాగింది. అంతవరకు నాకు జరిగిన అనుభవాలే నాకు ఉదాహరణలయ్యాయి. 1. కలిచేడులో పూరిండ్లలో బాడుగ కున్నాను. ఇల్లుకట్టాలనే ఆలోచనే లేదు. ఒకరోజు యూరినల్స్‌కు వెళితే మా డిపార్ట్‌మెంట్‌వారు ఒక బిల్డింగ్ పడగొడుతున్నారు. అందుకు ఖర్చు వెయ్యి రూపాయలన్నారు. ఒక్కపైసా ఖర్చులేకుండా నేను చేస్తానని చెప్పి ఆ బిల్డింగ్ నేనే పడగొట్టించాను. వందరూపాయల ఖర్చుతో 5 అంకణముల ఇంటికి సరిపడ ఇటుక వచ్చింది. ఇటుక ఫ్రీగా వచ్చింది గనుక సిమెంటురేకువేసి ఇల్లు కట్టాను. 2. నా కుమార్తెకు S.B.I.లో ఉద్యోగమొస్తుందని కలలోగూడా తలచలేదు. ఆలోచించలేదు. ఎల్లుండి last date for applying అని తెలిసింది. చిత్రంగా apply చేశాను. ప్రస్తుతం అదే ఆమె శాశ్వత ఉద్యోగమైంది. 3. నా college education అలాగే జరిగింది. హాస్టలులో అన్నం పెట్టకుంటేమానె పెట్టె పెట్టుకోనిస్తే చాలు సాయంకాలానికి 8 కి.మీ. నడిచి ఇంటికి పోతానని ఎన్నోసార్లు ఆ హాస్టలుకు తిరిగాను. ఇక విరమించుకోవాలని వస్తుంటే రాధయ్య అనే పుణ్యాత్ముడు తటస్థపడి 4 సం॥ freeగా అన్నం కూడా అదే హాస్టలులో పెట్టించాడు. 4. గొలగమూడికి కాపురం రావడం 5. గొలగమూడిలో రేకులిల్లు కట్టడం 6. గొలగమూడిలో మిద్దె కాపురం. 7. అమ్మాయి పెండ్లి చేయడం. పైపనుల్లో ఒక్కక్షణం ఆలోచనే లేదు. వాటంతటవే జరిగిపోయాయి. వ్రాస్తుంటే పుస్తకాలు చాలవు. గనుక ఆలోచనా స్రవంతి నరికట్టుటే సాధన. అని మాస్టరుగారు నా ప్రథమ సమాగమములో చెప్పినదే చేయవలసిన కర్తవ్యమని, ఆలోచనలు వ్యర్థమని చెప్పినది అక్షరసత్యమైంది.

## నాకు పూజ నేర్పడం

సాయిమందిర నిర్మాణం జరుగుతున్నపుడు నేను విద్యానగర్‌లో వున్నాను. ఆరోజు గురుపూర్ణిమ. నేను మాస్టర్‌గారి గదికి వచ్చేసరికి మధ్యాహ్నం

1 గం॥ అయింది. ''సుబ్బరామయ్యా! ఈరోజు గురుపూర్ణిమ. బాబాకు పూజ చేసుకో'' అన్నారు. 'ఇంటికి వెళ్ళి రేపు చేసుకుంటాలే సార్!' అన్నాను. ''అరే రేపు గురుపూర్ణిమ వస్తుందా! గురుపూర్ణిమ ఈరోజే'' అన్నారు. ఏవో కుంటిసాకులు చెప్పి తప్పుకో చూచాను. మాస్టరుగారు మరలా మరలా ఈరోజే చేసుకోమని చెప్పడంతో 10పైసలకు కర్పూరం, కడ్డీలు, బెల్లం తెచ్చి అక్కడపెట్టి, మాస్టరు గారింట్లోని చెట్టు పువ్వు తెచ్చిపెట్టి బాబాకు ఒక్క నమస్కారంచేసి కర్పూరం వెలిగించి మాస్టరుగారికి చూపాను. వారు శ్రద్ధగా కన్నుల కద్దుకున్నారు. బెల్లం కొద్దిగా తీసి ప్రసాదం సార్ అని మాస్టరుగారికి పెట్టాను. దాన్ని ఎంతో భక్తిగా కళ్ళకద్దుకొని నోట్లో వేసుకొని, ''ఇంతేగదా! దీనికి రేపు చేస్తానంటివే'' అంటూ తన గ్రంథపఠనంలో నిమగ్నమై పోయారు.

అసలు విషయమేమిటంటే - నాకు పూజచేసే మంత్రమొక్కటీ రాదు. పూజా విధానం తెలియదు. అందుకని అలా దాటవేయచూచాను. కానీ సర్వ సమర్థులైన మాస్టరుగారు నా నోటిగుండా పై విషయం చెప్పించకుండానే నా సత్తా గ్రహించేశారు.

మామూలుగా మా గ్రామం వెళ్ళేముందురోజు రాత్రే మాస్టరుగారి దగ్గర సెలవు తీసుకొని విభూతి తీసుకొని ఉదయాన్నే 5½ గంటలకు బస్టాండుకు వెళ్ళేది నాకు అలవాటు. కారణం మాస్టరుగారిని అప్పుడు నిద్రలేపలేక ముందు రోజు రాత్రే సెలవు తీసుకుంటాను. ఆరోజు - గురుపూర్ణిమ తర్వాత 5వ రోజున అలాగే సెలవు తీసుకోవడానికి మాస్టరుగారి దగ్గరకు వెళ్ళాను. మాస్టరు గారు, 'సుబ్బరామయ్యా! రేపు ఉదయం నీవు వెళ్ళేముందు నాకు చెప్పివెళ్ళాలి. మరచిపోవద్దు సుమా!'' అన్నారు. వారికి నిద్రాభంగం చేయడం ఇష్టంలేక నేను ఉదయం 8గం॥లకు బయలుదేరుతానన్నా వప్పుకోలేదు. సరేనని అలారం పెట్టుకొని నాలుగున్నర గంటలకే నిద్ర లేచి నేను మిద్దె దిగేసరికి మాస్టర్‌గారు సత్సంగ రూములో ఏదో పుస్తకం చదువుతూ తప్పులు దిద్దుతున్నారు. తీరాచూస్తే అది ''సాయినాథపూజ'' అనే పుస్తకం. దాన్ని పూర్తిగా తప్పులుదిద్ది నాకిస్తూ, ''దీన్ని ఒకటిరెండుసార్లు తీరిగ్గా చదువు. ఆదివారం రోజు పుస్తకం చూచి పూజచేసుకో'' అని చెప్పి ఆ పుస్తకం నాకిచ్చి పంపారు. మూడు నాలుగు నెలలు నేనా పుస్తకం చదివిందీ లేదు, పూజ చేసిందీలేదు. వారు నన్ను చదివావా



అని అడుగలేదు. వారి దివ్యశక్తే నన్ను ప్రేరేపించి చదివించింది. రెండుమార్లు చదివి పూజ చేయగానే పుస్తకం చూడకుండానే షోడశోపచారపూజ చేయగలిగాను. ఆపూజే నన్ను గొలగమూడిలో శ్రీవెంకయ్యస్వామివారి సన్నిధిలో పెద్దపూజారిని చేసి నిలిపింది. అద్భుతరీతిన పూజనేర్పిన శ్రీమాస్టరుగారికి నేనెంతో ఋణపడ్డాను.

పూజ అంటే మన భట్రాజు పొగడ్తలతో భగవంతుని మెప్పింప జూడడ మని అప్పటి వరకు తలచేవాణ్ణి. అది సంపూర్ణంగా తప్పని, 1. చంచలమైన మన మనస్సును చంచల రహితంగా నిలిపేందుకు అది ఒక ఉపకరణంగా ఉపయోగపడవలెనని 2. భగవంతుని నిజతత్వమేమిటో ఆ నామాలలో వివరించబడినదని 3. ఈ పవిత్రనామాలను ఏకాగ్రంగా, హృదయ పూర్వకంగా, అర్థసహితంగా, నిత్యం స్మరించడంవలన మన పుణ్యం పెరిగి అది మన పాపం కంటే ఎక్కువై మన ఆచరణను సన్మార్గంలో నడిపిస్తుందని 4. చాలినంత పుణ్యం మనపేర జమకాగానే ఆ పుణ్యఫలమే మనలను సద్గురు సన్నిధికి తీసుకువెళ్ళి వారి ఆజ్ఞలు పాటించేటట్లు చేస్తుందని తెలిసింది. అందుకే భగవద్గీతలో దేవ, ద్విజ గురుప్రాజ్ఞ పూజనం చెప్పబడింది 5. ఈ పూజ చేయగా చేయగా శారీరక, వాచక, మానసిక స్థితులకు తీసుకపోతుందనీ గనుక ప్రతివారు తీరిక ఉన్నప్పుడు కాకుండా నిత్య జీవితంలో నిర్దుష్టమైన టైంలోనే చేస్తుంటే గొప్ప ఫలితాలిస్తాయని పూజ్యపాదులు అనేకసార్లు నొక్కి చెప్పేవారు. ఈ సత్యాన్ని ఆచరింపజేసిన ఆ సర్వసమర్థుని పాదాలకు ఎన్ని జన్మలకైనా ఋణగ్రస్థుడనే గదా!

## మానసిక పూజ

కొన్నాళ్ళు పూజ చేసాక పూజంటేనే నాకుబాధ అనిపించి ''సార్! పూజ నాకువద్దు. కమ్మగా బాబారూపాన్ని చూస్తుంటే మధ్యలో ఆసనం, పాద్యం, యజ్ఞోపవీతం మొ॥నవి చేసేటపుడు బాబారూపం మనసునుండి మరుగుపడు తుంది. అది నాకు చాలాబాధగా ఉంది'' అని మొత్తుకున్నాను. ఆ సర్వజ్ఞమూర్తి వెంటనే అన్నారు : ''ఈ విషయం ఎవ్వరికీ చెప్పవద్దు. వస్తువులకు ప్రాధాన్యమి వ్వకుండా అన్ని ఉపచారాలు మానసికంగా సమర్పిస్తుండు'' అన్నారు. ఇంకా ముందుకువెళ్ళి మరొక సలహాగూడా ఇచ్చారు. ''స్థలం గూర్చి ప్రాధాన్యత

ఇవ్వకుండా నీకు ఎప్పుడు ఎక్కడ పూజచేస్తే బాగుండుననిపిస్తే అక్కడే పూజచేసుకో మానసికంగా'' అని సెలవిచ్చారు. ఎందుకలా చెప్పారో నాకప్పుడు అర్థంకాలేదు. ఇరవైసంవత్సరాల తర్వాత ఇప్పుడు తెలిసింది. సర్వసాధనలూ మనోనిగ్రహం కొరకే గదా! బాహ్య పూజకంటే మానసిక పూజ గొప్పది. మనసు తనంతతానుగా సాయిరూపం ధరించి నిలచి ఉండడం, ఆస్థితినుండి వస్తువులు వెతుకులాడే స్థితికి రావడం ఇబ్బందిగానే ఉంటుంది. దాన్ని ఆ మహనీయమూర్తి గుర్తించి వస్తువులకు ప్రాధాన్యంలేని మానసిక పూజ సూచించారు. పూజ మాత్రం ఏమారవద్దని చెప్పారు. ఇది ఎంత గొప్ప సూచనో నాకు ఇప్పుడు తెలుస్తున్నది.

దానం స్వధర్మో, నియమో, యమశ్చ, శ్రతంచశాస్త్రాణి సద్వ్రతాని సర్వే మనో నిగ్రహలక్షణాంతాః. అన్న ఉపనిషద్ వాక్యాన్ని ఆకళింపు చేసుకొన్న వారి మేధస్సును నాలాంటి అల్పుడు ఎన్ని జన్మలకైనా అందుకోగలడా?

శ్రీస్వామివారి మందిరంలో పూజ చేసేటప్పుడు అక్కడున్న సహాయకులు ఏ వస్తువు లోపం చేసినా నేను కస్సుబుస్సులాడి వారి హృదయాలను గాయపరచడమేగాక నా మానసికశాంతి పోగొట్టుకొనే వాణ్ణి. పై మానసికపూజ గుర్తు వచ్చాక ఎవ్వరినీ ఏమీ అనేది లేదు. అసంతృప్తి లేదు. ఇతరులపై అలుసుభావం లేదు. అంతా ఆనందమే. ఎన్ని జన్మల పుణ్యమో పూజ్యపాదుల పాదాలచెంత చేరగల్గడం. 'శాంతిని నెలకొల్పు వారు ధన్యులు. వారు ఓదార్చబడుదురు' అన్నారు క్రీస్తు. నా మదిలోనేగాక నా సహాయకుల మదిలోగూడ శాంతి స్థాపించిన మాస్టరుగారు ఎంతటి ధన్యులోగదా!

## వ్యాఖ్యల సమ్మేళనం !

పూజ్యశ్రీ మాస్టరుగారు బోధించిన వ్యాఖ్యలు, బాబా వ్యాఖ్యలు, శ్రీ రమణుల వ్యాఖ్యలు, శ్రీ వెంకయ్యస్వామివారి మౌన వ్యాఖ్యలు, శాస్త్రవాక్యాలు సమ్మిళితంగా అవగాహన చేసుకుంటే ఎంతటి చక్కని ఆణిముత్యాలు లభిస్తాయో చెప్పలేను. శ్రీమాస్టరుగారు పూజకు ఎంత ప్రాముఖ్యమిచ్చేవారో నాకొక సన్నివేశంలో రూఢి అయింది. అసలు పూజంటే భట్రాజు



పొగడ్తలని భావించే నాకు మాస్టరుగారు ''సాయినాథపూజ'' అనే గ్రంథమను గ్రహించి నిత్యం పూజచేసుకునేటట్లు చేశారు. కొన్నాళ్ళకు వారే మానసిక పూజ చేయమన్నారు. బాహ్యంగా పూలు, అక్షింతలు, నైవేద్య, హారతులు వగైరా శారీరకపూజ అయితే భగవంతుని అనంత గుణాలను నోటితో చెప్పడమే వాచకపూజ. అష్టోత్తరం చదవడం, భజనలు, స్తోత్రాలు, హారతులు, విష్ణు సహస్రనామాలు వగైరా అన్నీ వాచకపూజ క్రిందకు వస్తాయి. ఆ తర్వాత మెట్టు, మానసికపూజ. అన్నీ మానసికంగా సమర్పిస్తూ ఇష్టదైవం యొక్క రూపం మనసులో చెదిరిపోకుండా సాధ్యమైనంత ఎక్కువసేపు నిలుపుకోవడం. శారీరక, వాచక, మానసికపూజ వేరువేరుగా కాకుండా అన్నీ కలసికూడా ఏకకాలంలో జరిగేస్థితికూడా ఉంటుంది. అదే త్రికరణశుద్ధిగా పూజ చేయడం - శరీరము, వాక్కు, మనస్సులే త్రికరణాలు. గనుక పూజయొక్క ధ్యేయం మనసును ఇష్టదైవంపై ఏకాగ్రం చేయడం ఈ గుర్తెరిగి చేయమని పూజ్యపాదులు మాస్టరుగారు చెప్పేవారు. ఇది శ్రద్ధాభక్తులవలన, మహనీయుల సేవవలన లభిస్తుంది అంటారు. మహనీయులను సేవించేందుకు గృహస్తులకు అన్నప్పుడల్లా వీలు కాదుగదా అంటాము. శ్రద్ధాభక్తులు వున్నవారికి రాముడంతటా ఉన్నాడు అంటారు సాయి. అన్ని జీవులలోను నేనున్నాను అన్నారు సాయి. అన్ని జీవుల ఆకలి రూపంలో నేనే ఉన్నాను అన్నారు కృష్ణపరమాత్మ. గనుక మనం సంపాదించేందుకు కృషి దగ్గరనుండి వంటచేసి తినేవరకూ అది పరమాత్మ సేవే. నామస్మరణలేకుండా అన్య చింతలతో తెచ్చిన ఇడ్లీలు తినకుండా శ్రీవెంకయ్య స్వామివారు తిరస్కరించడము, నామస్మరణతో ఇడ్లీ తెచ్చినప్పుడు మాత్రం స్వీకరించడము ఇందుకు ఉదాహరణ! ఇదేవారి మౌనవ్యాఖ్య. దైవారాధనలో నిజంగా దైవం మనసేవను అంగీకరించాలంటే మన మనస్సెంత పరిశుద్ధంగా ఉండాలో పై లీలలో శ్రీస్వామివారు బోధించారు. ఈ బోధనే శ్రీ ఆచార్యులవారు నా కిరిణీ పండు స్వీకరించడం, సపోటాపండ్లు తిరస్కరించడంలోని రహస్యం. అలాగే మాస్టరుగారు నా సిగరెట్ నాకివ్వు అని శ్రీనివాసులు రెడ్డిగారి దగ్గర అడిగితీసుకోవడంలోను వ్యక్తం చేశారు. గనుక పూజయొక్క ధ్యేయం మనస్సును నిగ్రహించేందుకని, అది శారీరక, వాచక, మానసిక స్థాయిలలో సాధించే ప్రయత్నం శ్రద్ధా భక్తులతో ఆచరిస్తే ఎంతో మేలని మాస్టరుగారి

మౌన వ్యాఖ్యలు తెలుపుతున్నాయి. పొట్టకూటికి సంపాదించేటప్పుడు, దానిని వంటచేసేటప్పుడు, దానిని మనం భోంచేసేటప్పుడు భగవంతుని ఎడల కృతజ్ఞతాభావంతో శ్రద్ధగా త్రికరణశుద్ధిగా నామస్మరణ చేయడం ఎంత మేలో మాస్టరుగారు వివరిస్తూ - 'రూపాయి ఫలితం రావలసిన చోట పైసా ఫలితం వచ్చేటట్లు మనజోలికి చిల్లి పెట్టుకుంటే ఎలా?' అనేవారు. బాబా అనంత కరుణతో సర్వత్రా, సర్వదా, మనలను అనుగ్రహిస్తూనే ఉన్నారు. కానీ మనమే మన 'జోలికి' అశ్రద్ధ, అవిశ్వాసం అనే చిల్లులు పెట్టుకున్నాము అని బోధించేవారు.

## శాస్త్రసారం

సర్వశాస్త్రాల సారాన్ని ఒకే ఒక్క వాక్యంలో పలికి నా హృదయవీణలు మీటి మధురగానం వినిపించారు మాస్టర్.

శ్రీ మాస్టరుగారికి ఏదో ఒక విధంగా సేవచేయాలనే నా తపన. విద్యానగర్‌లో ఇంటివెనుక ప్రహరీగోడలేదు. దానికి తాటిఆకుతో దడి కడుతానని ఎంతో అభ్యర్థించి ఒప్పించాను. ఒక ఆదివారం వచ్చి కట్టమని నాకు లెటర్ వ్రాసి వారు పనిమీద తిరుపతి వెళ్తామని కూడా వ్రాశారు. నేను విద్యానగర్ వచ్చి దడి కుట్టేపని మొదలు పెట్టిన పావుగంటకే మాస్టరుగారు తన ప్రోగ్రాం మానుకొని తిరిగి ఇంటికి వచ్చారు. నేను ఆనందంగా ''సార్! ఎలా కుట్టమంటారు?'' అని అడిగాను. వెంటనే వారన్నారు.

''మీరు ఎలా కుడితే అలాగే నాకు సంతోషం''

ఈ మాటను నేనెన్ని జన్మలెత్తినా అనగలనా? నావరకు నేను అలా అనలేను. ఆపని చేసేవారికి తలనొప్పి గలిగేటంతగా సలహాలిస్తుంటాను. చివరకు ఏదో ఒక విధంగా పని ముగుస్తుంది.

''మీరెలాకుడితే అలాగే నాకు సంతోష''మన్నారే ఆమాటే సర్వ శాస్త్రాల సారం. ఎలా? మానవుని అసంతృప్తి, మానసిక అశాంతి, భార్యాభర్తల మధ్య భేదాభిప్రాయము, మనుషుల మధ్య భేదాభిప్రాయమునకు కారణమేమి?



వారివారి ఇష్టాయిష్టాలే గదా? ఈ ఇష్టము, అయిష్టములకు మూలం కామం. అంటే కోరిక. అంటే ఇది ఇలా ఉంటే బాగుంటుంది. ఇది మంచిది అని తలచడం. ఎదుటివారుకూడా తమ అభిరుచే Correct అయినదని వాదించుకోవడం. ఆ వాదనలో ఎదుటి వారి భావాలు గాయపరచడం. తద్వారా తన అశాంతికి తానే పునాది వేసుకోవడం. ఈ ఇష్టము - అయిష్టములను కూకటి వేళ్ళతో పెకలించారు శ్రీమాస్టరుగారు. ఏ విషయమైనా సరే ఇలాచేస్తే బాగుంటుందేమో ఆలోచించండి. ఇలాచేస్తే ఇలా అయ్యే ప్రమాదముందేమో యోచించండి అని చాలా సున్నితమైన సలహాగా మాత్రమే ఇస్తారేగాని తన వాదన ఎదుటివ్యక్తిపై రుద్దే ప్రయత్నమే చేయరు. వారి సలహా ఆచరించడమా, తిరస్కరించడమా అనేది మనకే వదిలేస్తారు. తానుమాత్రం ఇష్టము, అయిష్టము లేకుండా సాక్షీభూతుడుగానే ఉంటారు. తన మాట ఆచరించలేదని మనమీద ఎప్పుడూ కినుక వహించనే వహించరు. ఎందుకు? ''అల్లామాలిక్'' గనుక తనకేమిటి నష్టం. మనలను గూడ తనవలెనే ఇష్టము-అయిష్టము లేకుండా ఉండమని ప్రబోధిస్తున్నారు. అంతులేని ఆనందం కావాలని అందరమూ ఆరాట పడడమే కాని, నిరంతరం ఇతరుల భావాలను గాయపరుస్తుంటే అదెలా సాధ్యమవుతుంది?

''మానవుని హృదయాన్ని గాయపరచకు, భగవంతుని ఏడవ నిలయం మానవుని హృదయంలో ఉంది'' అన్న తాజుద్దీన్ బాబాగారి వాక్యాన్ని మనమాచరించామా? లేదు. వారిమాటపై మనకు నమ్మకమేముంది? సృష్టిలో ప్రతిదీ ముందు నిర్ణయానుసారం జరుగుతుంటే దాన్నలా జరగనియ్. ఈ స్వల్ప విషయాలకొరకు ఎదుటి వారిని గాయపరచి మన unrest మనమే తెచ్చుకొంటున్నాము. ఆత్మీయులను మన ఇష్టాయిష్టాలకు బలిచేసి వారి హృదయాల్లోనే గాక మన హృదయంలో కూడా gulf (దూరము) ఏర్పాటు చేసుకొంటున్నాము. మన likes and dislikes పోతే అందరూ మన ఆత్మీయులే. అట్లాని మన సొమ్ము అవతలివారికి దోచి ఇవ్వనక్కరలేదు. వ్యవహారం smooth గా deal చేస్తూ ఎదుటి వారిలో బాబాను చూడు. అప్పుడు మన వ్యవహార పద్ధతే మారుతుంది.

యదాసర్వేప్రముచ్చంతే కామాపస్యహృధిశ్రతాః
అధమర్త్యో అమృతోభవతి అత్రబ్రహ్మనమస్నూతే

'హృదయములోని కామములన్నీ (కోరికలన్నీ) బాగా తుడిచి పెట్టుకుపోతే మరుక్షణమే బ్రహ్మమౌతాము' అన్నారు వేదఋషులు వసిష్టులు. 'ఆశపోతే అంతా పోతుండ్లాయ్యా' అన్నారు శ్రీ స్వామివారు. మీరు ఎలా కుడితే అలానే నాకు సంతోషమన్న వాక్యానికర్థమిదే. ఈ ఒక్కమాట నాకు వేదవాక్యమై లక్షలసార్లు నా ఎదుటివారితో నా ప్రవర్తనే మార్చేసింది. కానీ నా ఇష్టాయిష్టాలు సంపూర్ణంగా చావలేదు. వాటిని సంపూర్ణంగా దహించమని శ్రీమాస్టరుగారికి ప్రణమిల్లుచున్నాను.

## ఆచార్యులవారి అపురూపమైన భల్లూకపు పట్టుదల!

చాలా సంవత్సరాలుగా, మాష్టరుగారికంటె ముందునుంచే నేను శ్రీవెంకయ్యస్వామివారిని తలుపూరులో మా ఇంటిప్రక్కనగల వేపచెట్టు క్రింద చూస్తూనే ఉన్నాను. అనేకమంది శ్రీస్వామివారికి నమస్కరిస్తూ ఉండడం చూస్తూనే ఉన్నాను. కాని నేను మాత్రం శ్రీస్వామి వారిదగ్గరకు వెళ్ళేదిలేదు. నాకు మాస్టరుగారితో పరిచయమయ్యాక 1975నుండి సుమారు పది నెలలు అంటే నలభై యాభై సార్లయినా మాస్టరుగారు నన్ను శ్రీవెంకయ్యస్వామి వారిని దర్శించమని చెప్పేవారు. నేను మాస్టరుగారి దర్శనార్థం వెళ్ళగానే విద్యానగర్‌లో వారి మొదటి ప్రశ్న ''చూశావా?'' అనే. చూడడమేమిటో మాకిద్దరికే తెలుసు. నేను క్రిందచూపులు చూస్తూ ఊరకుండేవాడిని. ఒకవేళ నా బిడ్డలే గనుక నేను నాలుగుమార్లు చెప్పినా వినకుంటే ఇక ఎన్నటికీ వారికా విషయంగూర్చి చెప్పను. కానీ ఆమహనీయమూర్తి ఎంత పట్టుదల గలవారో చెప్పలేను. ''శ్రీస్వామి వారిని ఎందుకు చూడవు? వారు భూమి మీద దేవుడు. మేమంతా వారికి నమస్కరిస్తుంటే, నీవు మాకు నమస్కరిస్తుంటే అర్థమేమిటి? అలా నీవు శ్రీస్వామివారిని దర్శించకుంటే ఇక్కడకు రావద్దు'' అని ఒక్క రామబాణం వదిలారు. ఆమాటతోటి నేను ఖిన్నుడనైపోయాను. నామనో వేదన గమనించిన ఆ ప్రేమమూర్తి వెంటనే ''ఆయన దేవుడని నీకు నమ్మకము కుదిరితేనే వారికి నమస్కరించు. లేకుంటే వద్దు'' అన్నారు. ''దేవుడవునోకాదో తెలుసుకునేటంత



జ్ఞానముంటే ఇక్కడికెందుకొస్తానుసార్'' అన్నాను. ''ఏమీలేదు. అక్కడ ఏది జరిగేందుకు వీలులేదో అది జరిగితే శ్రీస్వామివారు దేవుడని నమ్ముతానని మనసులో అనుకొని టైం పెట్టుకొని కూర్చో, ఆ టైం లోగా అది కాకుంటే ఆపైన నీవు వారిదగ్గరకు వెళ్ళవద్దులే'' అన్నారు. ఏది జరిగేందుకు వీలుకాదో నాకెలా తెలుస్తుంది సార్'' అన్నాను. అందుకు కూడ మాష్టరుగారే పరీక్షలు చెప్పారు : వారి సేవకులలో ముగ్గురు తప్ప ఇతర సేవకులుగాని వచ్చిన భక్తులు గాని వారిని తాకేందుకు వీలులేదు. గనుక నాచేత కాళ్ళకు నూనె పూయించుకోవాలి అనిన్నీ, ఎవరి చేతినుండి ఏమీ తీసుకోరు గనుక నేను తీసుకుపోయిన పదార్థం వారు నాచేతి నుండి తీసుకొని తినాలనీ మనసులో అనుకొని టైం పెట్టుకొని కూర్చోమని, ఆపైన ఒక్క నిమిషం ఉండవద్ద'ని చెప్పారు. ఇంకొక జాగ్రత్త కూడా చెప్పారు. 'ఆ రెండు విషయాలు అక్కడ సాధారణంగా జరిగేందుకు వీలులేదని ముందుగా విచారించి తెలుసుకో. ఆ విచారణకొరకు నాలుగుసార్లు వెళ్ళిచూడు. ఎవ్వరినీ అడగకుండా నీకే తెలుస్తుంది. తీరా అనుభవమిచ్చాక - అదేదో కాకతాళీయంగా జరిగిందని అనుకుంటే దాని పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి' అని సెలవిచ్చారు. నేనదేవిధంగా నాలుగుసార్లు వెళ్ళి చూచి, అవి రెండూ జరిగేందుకు వీలులేదని నిర్ణయించుకున్నాక ఒకరోజు మా స్నేహితుడు శ్రీ శేషగిరిరావు గారితో వెళ్ళి 1. నాచేతి నుండి ఈ శెనగలు, బెల్లం శ్రీస్వామివారు అడిగి పెట్టించుకొని తినాలని 2. నాచేత కాళ్ళకు నూనె మర్దన చేయించుకోవాలని – పై రెండు కోరికలు నేను వెళ్ళిన పదినిమిషాలలోగా జరిగి పోవాలని అనుకొని దూరంగా కూర్చున్నాను. చిత్రాతిచిత్రం జరిగింది. క్రొత్తవాళ్ళు శ్రీస్వామివారి పాదాలు తాకి నమస్కరించుకుంటారని, అది శ్రీస్వామివారు అంగీకరించరు గనుక ఎప్పుడూ ఇద్దరు సేవకులు కాపలా ఉండేవారు. మేము వెళ్ళగానే వారి మనసులు ఎలా పనిచేశాయో తెలియదుగానీ ఇద్దరూ చెరొకవైపు వెళ్ళిపోయారు. ఇక శ్రీస్వామి వారు, మేమిద్దరము తప్ప వేరే ఎవ్వరూ లేరు. ''అయ్యా! తినేందుకేమైనా పెడుతావా'' అని శ్రీస్వామివారు నావైపు చేయిచాపారు. నా ఆనందం హద్దులు దాటింది. వారికి పళ్ళులేవు గనుక బెల్లం మాత్రం కొంచెంపెట్టి మిగిలిన శెనగలు, బెల్లం నూరి పొడిచేసి తెచ్చేలోగా ద్వారపాలకులు వచ్చి ఆపొడి మేము

పెడతామన్నారు. శ్రీస్వామివారు వారిని వద్దని, నాచేతనే పెట్టించుకు తిన్నారు. వెంటనే ''అయ్యా! కాళ్ళకు కొంచెం నూనె పూస్తా?'' అని అడిగారు. శ్రీస్వామివారి సేవకులు పూస్తానంటే అంగీకరించక నాచేతనే పూయించుకున్నారు. అంతేగాక వళ్ళంతా మర్దనచేయించుకున్నారు, తలంటించుకున్నారు. తలస్నానంకూడా నేనే చేయించాను. ఆ విధంగా పూజ్యపాదులు బలవంతంచేసి నన్ను శ్రీస్వామివారి చెంతకు పంపి శాశ్వతంగా నన్ను వారికి వప్పగించి పుణ్యం కట్టుకున్నారు. శ్రీస్వామివారి అండన చేరినందుననే ఎనలేని ఆనందంతో జీవిస్తున్నాను. నన్ను వారి చెంతకు చేర్చినంత వరకు మాస్టరుగారు పదినెలలు పట్టుపట్టారంటే నామీద నాకే రోత కల్గుతుంది.

పూజ్యపాదులు శ్రీమాస్టరుగారు నామీద ఎనలేని ప్రేమతో తన భల్లూకపు పట్టుదలతో నాచేత మరి రెండుపనులుకూడా చేయించారు 1. మా గ్రామంలోని రామాలయంలో సత్సంగం చేయించడం 2. ఇంట్లో నిత్యం సత్సంగం చేయించడం. కలిచేడు రామాలయంలో కూర్చొని బాబాచరిత్ర చదువుకో. ఇంట్లో చదవడంకంటే మంచిదని సుమారు 1సం॥ చెప్పినా నేను అలా చేయలేదు. వారు మాత్రం తన పట్టు విడువలేదు. ఒక రోజు నన్ను చాలా తీవ్రంగా పట్టేశారు. ''ఎందుకు చదువవు'' అని నిలదీశారు. చెప్పకతప్పలేదు. 'అక్కడ ఎక్కువమంది నాదగ్గర పదవ తరగతి వరకు చదివి కాలేజీ చదివే విద్యార్థులే సార్. వారు ఏవేవో కొంటె ప్రశ్నలు వేస్తారు. నేను చెప్పలేను. ఒకవేళ చెప్పినా తృప్తిపడరు. వాదన వస్తుంది. ఎందుకింత గలాట? మనం గుట్టుగా ఇంట్లో పారాయణ చేసుకుంటే పోతుందిగదా?' అన్నాను. ''ఓస్! అందుకేనా మందిరంలో చదవనిది? అట్లాకాదు, ఎవరేమి ప్రశ్నించినా నీవు ఒక్కటే సమాధానం చెప్పు. నీవు హృదయపూర్వకంగా తెలుసుకోవాలని ప్రశ్నించేటట్లయితే నీ ప్రశ్నకు ఈ పుస్తకంలో సమాధానముంది, పుస్తకమంతా చదువు. నీ ప్రశ్నకు సమాధానమొస్తుందని ఆ పుస్తకం అతనికిచ్చెయ్. అతడాగ్రంథం చదివిన తర్వాతకూడా అతని ప్రశ్నకు సమాధానం లభించకుంటే అతనిని నా దగ్గరకు తీసుకురా. మీ ఇద్దరి ఖర్చులు నేనే భరిస్తాను'' అన్నారు. ఇక చేసేదిలేక మరురోజునుండి శ్రీరామాలయంలో చదువను మొదలుపెట్టాను. మొదలుపెట్టిన తెల్లవారినుండే ఎదురింటి రామక్రిష్ణయ్య పూర్తిగా నిషాచేసి నాదగ్గరకొచ్చి, ''ఎంత తినాలని ఇక్కడకొచ్చి చదవను మొదలుపెట్టావు?'' అని మాట్లాడుతూ



ఇక సత్సంగం జరుగనివ్వలేదు. 'ఎంత చిక్కితే అంత తినాలని వచ్చాను. భాగం కావాలంటే నీవు కూడా వచ్చి కూర్చో' అని చెప్పేవాడిని. పది పదిహేను రోజులు సత్సంగమే జరుగలేదు. ప్రక్కవాళ్ళంతా 'మీరు అంగీకరిస్తే చాలు అతనిని లాగి అవతల వేస్తాము. అతనేమిటి మందిరంలోకొచ్చి త్రాగి మాట్లాడడం' అనేవారు. నేనుమాత్రం అంగీకరించలేదు. బాబాను ప్రార్థనచేద్దాం - అతనికి ఆ దుర్గుణం మాన్పమని. మనమతనితో కలబడితే ఇక మన సాధన, భక్తి ఏముంది? అని తిరస్కరించాను. చిత్రంగా 15రోజుల తర్వాత అతను రావడం మానేసి తన కుమార్తెను సత్సంగానికి నిత్యం పంసేవాడు. ఆ సత్సంగ ఫలితంగా కలిచేడులో సాయిమందిరం వెలవడమే కాకుండా అనేక సాయిలీలలు భక్తి లేనివారికికూడ అనుభవమయ్యాయి.

ఆధ్యాత్మికతలో శక్తినంతా వినియోగించి కృషిచేయనిదే ఫలితముండదన్నారు బాబా కానీ శ్రీమాస్టరుగారు ఆధ్యాత్మికతలోనేగాక తనతో అనుబంధముండే ప్రతివారు ఏస్థితిలోనున్నా వారిని ఆధ్యాత్మిక పథంలో నడిపించడంలో తన శక్తినంతా వినియోగించి కృషిచేసే మహనీయుడు. ఒక వ్యక్తికి తానేదైనా సలహా ఇవ్వాలనుకుంటే డైరెక్టుగా ఆ వ్యక్తితోనే చెపితే ఆ వ్యక్తి బాధపడులాడని ఆవ్యక్తి వినేటట్లుగా అనేకసార్లు ప్రక్కవారితో మాటల సందర్భంలో ఆమాట చెపుతుండేవారు. అది వారి అపూర్వమైన బోధనా విధానము. ఆ విధానమునకు నేనే ఉదాహరణ. నేను వినేటట్లుగా నా ఎదుటనే ఇతరులతో అనేకసార్లు, ''మననుండి భగవంతుడు కోరేదేమిటి?'' అని అడిగి, వారు సరిగా చెప్పలేకుంటే మాస్టరుగారే చెప్పేవారు. ఏమని? 'భగవంతుడు నిజంగా మననుండి కోరేది మన కాలము, మన మనస్సును వారికి సమర్పించమని. మిగిలిన నివేదనలు, అలంకరణలన్నీ మన తృప్తికొరకే'' అని చెప్పేవారు. ఈమాట అనేక పర్యాయాలు వారి నోటి వెంబడి విన్నాక ప్రతినిత్యం ఉదయం 6 నుండి 9 గం॥వరకు నేను పూజ, పారాయణ, ధ్యానంలో గడపసాగాను. ఈ సలహాతోటి మరొకమాట గూడ చెప్పేవారు. 'కాలం, మనస్సులలో కాలం సమర్పించడం మనవంతు. మనస్సు స్వీకరించడం వారిపని. మనం పట్టు వదలక నియమితకాలాన్ని వారికర్పిస్తుంటే మనసు దానంతటది వారి పాదముల నాశ్రయించేటట్లు భగవంతుడే అనుగ్రహిస్తారు' అని చెప్పేవారు.

అయితే ఒకటి - తన వాదన నిలువడంలేదని తెలిసికూడా కేవలం వాదన కొరకే వాదిస్తుంటే మాస్టరుగారు ఒక్కక్షణం వృధా చేయరు. ఉదా : వెంకటగిరిలో ఒక వ్యక్తితో తెల్లవార్లూ వాదిస్తున్నారు. ఆ వాదన జరిగేరూములో నేనూ పడుకొనియున్నాను. చివరకు మాస్టరుగారు అన్నారు - 'ఓరేయ్! నీవు వాదనలో నెగ్గాలనే మాట్లాడుతున్నావు. Truth (సత్యం) కంటే వాదనే నీకు ముఖ్యమైతే ఇక నేను ఒక్కక్షణం మాట్లాడను, అని ఆతర్వాత ఒక్క మాట గూడ మాట్లాడ లేదు. సత్యం తెలుసుకునేందుకయితే మాస్టరుగారు ఎంతోసేపైనా మాట్లాడుతారుగాని వాదనకొరకే అయితే ఒక్కక్షణం కూడా మాట్లాడేవారు కాదు.

మనం ఒకరిని సంస్కరించదలచినపుడు వారి తప్పేమిటో ఎత్తి చూపించవచ్చు. కానీ ఆపని పదిమంది ఎదుటచేస్తే వారి మానసిక వికాసం వికసించే బదులు ముకుళిస్తుంది. అంటే వారి మానసిక వికాసం దెబ్బ తింటుంది. గనుక వారి తప్పేమిటో పదిమంది ఎదుటకాకుండా ఏకాంతంగా తెలియజెప్పి, వారికట్టి బలహీనత తొలగించమని బాబాను ప్రార్థనచేయడం ఉత్తమ మార్గమని చెప్పేవారు.

శకునాలు పాటించడంలో నేను మేటిదిట్టను. ఎందుకంటే ఎక్కడికైనా వెళ్ళాలని పూర్తిగా ప్రయాణమై చివరిక్షణాల్లో శకునం బాగాలేదని మానేసే వాడిని. నా చేతిలోని వస్తువు జారిపడినప్పుడంతా ఆశకు లోబడి అక్కడేదో పోతుందని ప్రయాణమై పోయినప్పుడు ప్రతి దఫా పని కానే కాదు. సరికదా నా రక్తము నేను చూడవలసివచ్చేది. ఏదో విధంగా చిన్న దెబ్బయినా తగలడం జరిగేది. ఒకరోజు ఆశవలన బాబా ఇచ్చే ఈ సంకేతాన్ని లెక్కచేయకుండా పోతున్నానని తెలుస్తూనే ఉంది. కానీ నెల్లూరు వెళ్ళాను. నిష్కారణంగా నా కాలు చవిటి కాలువలో పడి గాజుపెంకు గుచ్చుకొని రక్తం వెల్లువలైంది. ఇట్లాఎన్నో.

ఇక తట్టుకోలేక మాస్టరుగారికి చెప్పాను. ''బాహ్యమైన సంకేతాలతో పాటు నీ మానసిక పరిస్థితి గమనించు. మనసు అశాంతిగా, అల్లకల్లోలంగా గజిబిజిగా ఉంటే తప్పకుండా ఆ ప్రయాణం మానెయ్' అని సెలవిచ్చారు.

నా అనుభవంలో చూస్తే బాహ్యమైన సంకేతం వచ్చినప్పుడల్లా తప్పక మనసు అశాంతిగానే ఉంటుంది. కొన్ని సమయాలలో విచారిస్తే నేను



కలువవలసిన వ్యక్తులు ఆసమయాలలో లేనట్లు తెలిసింది. అందుకని మాస్టరుగారు చెప్పినట్లు అంతరంగిక మానసిక స్థితి గమనించి నడచుకోవడం ఉత్తమమైన పద్ధతని తెలుసుకున్నాను.

'భగవాన్ శ్రీవెంకయ్యస్వామిలాంటి కొందరు మహనీయులు నిత్యం తమకు ఒక్కొక్క సేవను ఒకే వ్యక్తి చేసేటట్లు చూసుకుంటారు. ఆసేవను మరొకరు చేసేందుకు అంగీకరించరెందుకు సార్!' అని అడిగాను. అందుకు వారు ''పూర్వజన్మలలోని వారి పుణ్యఫలము, మహాత్ములతో వారికి గల అనుబంధముల వలన వారికి మహాత్ములు ఆ సేవలను అనుగ్రహిస్తారు. అందుకని వారినుండి మాత్రమే స్వీకరిస్తారు'' అన్నారు.

సాధకులు చిరుతిండి తినరాదు. ఆ బలహీనతను కొందరు కొన్ని విషయాలలో నిగ్రహించ లేనపుడు - ఆయా తినుబండారాలు ఎక్కువగా కొని, బాబా రూపాలుగా భావించి అందరికీ పంచిపెట్టమని, అలాచేస్తే ఆ బలహీనతలు పోతాయనీ సెలవిచ్చారు.

## శాస్త్రసారం

ఒక భక్తుడు, ''సార్! సాధనకు ధ్యానం చేస్తే మంచిదా? పూజచేస్తే మంచిదా? నామస్మరణ మంచిదా? ఏదిచేస్తే మంచిది'' అని అడిగాడు.

మాష్టారు :- అన్నీ మంచివే, మేడపైకి వెళ్ళడానికి మొదటి మెట్టు ఎంత ముఖ్యమో చివరి మెట్టుకూడా అంతే! మధ్య మెట్లుకూడా అంతే ముఖ్యము.

మనిషికి మనస్సు ఎప్పుడూ ఒకేవిధంగా వుండదు. ఒక్కొక్కప్పుడు ఒక్కొక్కవిధంగా వుంటుంది. కనుకనే మనసునకు ఎపుడు ఏమిచేస్తే బాగుంటుందనిపిస్తే అదిచెయ్యి. అన్ని సాధనలు మనస్సును నియమించేందుకు, లేక మనసును నిలకడజేసేందుకు (ఆలోచనా పరంపరలనుండి) ఉపకరణాలు మాత్రమే. అందుకే బాబా ''నన్ను ఆనందంగానైనా ధ్యానించు, అదీ గాకుంటే నఖశిఖ పర్యంతము నన్ను చూస్తూ వుండు. అదీ వీలుగాకుంటే నా నామాన్ని

హృదయపూర్వకమయిన ప్రేమతో ఉచ్ఛరిస్తూవుండు'' అన్నారు. కనుక మనస్సునకు ఎప్పుడు ఏ సాధన చేస్తే బాగుండుననుకుంటే అది చేస్తూవుండు. అదే మంచిసాధన. మనస్సును నియంత్రించుటే అన్ని సాధనల లక్ష్యం అనేది మరువకూడదు సుమా!

అయితే నియమబద్ధంగా నిత్యం తప్పనిసరిగా ఒకే కాలంలో పై సాధనలు చేస్తుంటే సత్వర సత్ఫలితాలు కలుగుతాయి. సాధరణంగా మనం మనకు తీరిక చిక్కినప్పుడు, ఉత్సాహంగా వున్నప్పుడు చేస్తుంటాము. అలా చేస్తుంటే రూపాయి రావలసినచోట ఒకపైసా వచ్చినట్లుంటుంది. కాలనియమం చాలా ముఖ్యం. కాలనియమం ఉన్నప్పుడు ఆ నిర్ణీత కాలమునకు ఒక అరగంట ముందునుండే మనలో ఆ ధ్యాస మొదలవుతుంది. నిర్ణీత కాలం లేకుంటే కాలమంతా వృధే.

ఒకరోజు మాస్టరుగారిలా చెప్పారు : సాధనంటే ఏమిటి సార్? అన్నవారితో, ''ఏముంది? మన సంస్కారాల మార్పే సాధన'' అని క్లుప్తంగా చెప్పారు.

## సోమరులకు సహాయం చేయకూడదు!

మాష్టరుగారికి చాలా ఆప్తుడుగా అందరికీ కనిపించే ఒకవ్యక్తి రూములో (విద్యానగర్) నేను కొన్నాళ్ళు ఉన్నాను. ఆవ్యక్తి తాను జ్వరంలో ఉన్నాననీ, ఉదయంనుండి మధ్యాహ్నం 11గం వరకు కాఫీకూడా త్రాగలేదని నాకు చెప్పాడు. తాను హోటలుకు కూడా పోలేకున్నానని చెప్పాడు. నేను వంటచేసుకొని తింటాను గనుక నా దగ్గర పాలు, చక్కెర ఉన్నాయి. ఆ వ్యక్తికి కాఫీ పెట్టిస్తామని అదికూడా సాయిసేవని భావించి మాష్టరుగారిని కొంచెం కాఫీపొడి పెట్టించమని అడిగాను. నేను కాఫీ త్రాగనని మాస్టరుగారికి తెలుసు గనుక కాఫీపొడి ఎందుకు? అని అడిగారు. ఫలానావ్యక్తి జ్వరంతో ఉన్నాడు. కాస్త కాఫీ పెట్టిస్తామనుకున్నానని చెప్పాను. ''అతను చాలా సోమరి, తన బ్రాండు సిగరెట్లు ఇక్కడ దొరక్కుంటే కోటకు 5 కి.మీ నడిచిపోయైనా వాటిని కొని త్రాగుతాడు. హోటలు కెళ్ళి త్రాగలేడా? సోమరులకు సహాయం



చేయకూడదు'' అని మరుపురాని బోధచేసి కాఫీపొడి పెట్టించేందుకు నిరాకరించారు.

ఈ బోధద్వారా నా జీవితంలో ఎన్నోమార్లు వివేకంద్వారా ఎవరికి సహాయం చేయాలో, ఎవరికి చేయకూడదో నేర్పించారు.

## మననుండి భగవంతుడు కోరేది!

మననుండి భగవంతుడు కోరేదేమిటి? ఈ నైవేద్యాలు, కర్పూర హారతులు వగైరా మాత్రమేనా?

భగవంతుడు మననుండి కోరేది - మన మనస్సు, కాలము మాత్రమే. ముందు మన కాలం సమర్పిస్తే తర్వాత మన మనస్సు క్రమంగా బాబానే స్వీకరిస్తారు. నిత్యం ఏదో ఒకసమయం బాబాకొరకు ఏర్పరచుకొని క్రమం తప్పకుండా ఆ కాలంలో ఏ సాధస చేయాలనిపిస్తే ఆ సాధన చేస్తుండడమే కావలసింది. తక్కువ విషయాలన్నీ బాబానే చూసుకుంటారు. మనలను గమ్యం చేరుస్తారు.

బాబా చరిత్రలో ఒకరు తనకు తీరుబడి అయినప్పుడు వచ్చి బాబా పాదసేవ చేస్తుంటాడు. ''ఏమయ్యా! నీకు తీరుబడి అయినప్పుడు నాకు సేవ చేయను వస్తావు. అప్పుడు నేను నిన్ను సేవచేయనివ్వకుంటే అలుగుతావా?' అని బాబా దెప్పుతారు. గనుక మనం బాబాకు కేటాయించిన సమయాన్ని మన సొంత పనులకు వాడుకోకుండా తప్పకుండా వారిసేవకు వినియోగిస్తుంటే బాబా తప్పక సంతృప్తి చెంది మనలను అనుగ్రహిస్తారు. ఏదో మాటల సందర్భంలో మందిర నిధులను ఎలా ఖర్చు చేయాలి అనే విషయమై శ్రీమాస్టరుగారికి ఇష్టమైన కొన్ని పద్ధతులను గూర్చి అమ్మగారు ఇలా చెప్పారు. మందిరంలో వచ్చే నిధులతో వెండి కిరీటాలు, మొజాయిక్ తాపడాలు సమకూర్చే బదులు ఈ క్రింది పనులు చేయడం మంచిదని మాష్టరుగారు చెప్పేవారు.

1. చుట్టుప్రక్కల వైద్యశాలలకు వెళ్ళి నిజంగా బీదవారైన వారికి కావలసిన మందులు కొనివ్వడం, ఆహారము పండ్లు, పాలు ఇవ్వడం. అవసరమైతే గుడ్డలు ఇవ్వడం ఎంతో మంచి పని.

2. మంచి తెలివితేటలు గల్గి దేశానికి వారి సేవలు పనికివచ్చేటట్లుండి కూడా బీదరికమువలన పై చదువులు చదువలేని బీద విద్యార్థులకు అన్నవస్త్రాలే గాకుండా వారి ఖర్చుంతా మందిరం యాజమాన్యమే భరిస్తే ఎంతో గొప్పగా బాబా సంతోషిస్తారు.
3. కొందరు మేధావులైన బీదవిద్యార్థులకు స్కాలర్‌షిప్పులివ్వడం.
4. ఆధ్యాత్మిక గ్రంథాలు,, ఆధ్యాత్మిక వ్యాసాలతో గూడిన కరపత్రాలు అచ్చు వేసి అందరికీ అందుబాటులో ఉండేటట్లు చూడడం.
5. ఆధ్యాత్మిక గ్రంథాలయాలు ఏర్పాటుచేసి అందులో కేవలం ఆధ్యాత్మిక గ్రంథాలు మాత్రమే ఉండేటట్లు చూడడం. ఆ లైబ్రరీ లను ఎక్కువ మంది ఉపయోగించుకోకపోవచ్చు కానీ ఏ కొద్దిమందికి ఉపయోగపడ్డా మన నిధులు సఫలమైనట్లే అని చెప్పేవారు.

## సొంత గృహానికి, లాడ్జింగ్‌కు భేదము!

కొందరు ఇండ్లు వదలి మాష్టరుగారి దగ్గరే ఉండేవారు. వారినలా ఉంచేసుకున్నారని మాష్టరుగారినే ఆ వ్యక్తుల పెద్దవారు ఆడిపోసుకుంటున్నారని మాష్టరుగారితో నేనొక రోజు అన్నాను. అప్పుడు మాష్టరుగారొక దివ్యబోధ చేశారు. ''ఇంటికి పోతూనే ఎడాపెడా ఒకటే అక్షింతలు, రగడ మొదలౌతుంది. పెద్దలు వీరిని పోషించలేకున్నా ఫరవాలేదు. పస్తులైనా అందరూ కలసి ఆనందంగా ఉండవచ్చు. పెద్దలు తమ నిస్సహాయతకు బిడ్డలే కారణమని వారి ప్రవర్తనే కారణమని లోలోపల తలంచుచూ ఆ వైరభావాన్ని మాటలలో వ్యక్తంచేస్తారు. వీళ్ళు దాన్ని సహించలేక ఇలా వచ్చి కూర్చొని శాంతి, ఆనందాన్ని ఆస్వాదిస్తారు. What is the difference between a house and a lodge or a choultree? హోటలువారు మన మంచిచెడ్డలతోను, సుఖశాంతుల తోను సంబంధం లేకుండా ఆకలికి అన్నం పెడుతారు, నీడనిస్తారు-డబ్బు తీసుకొని. ఆపైన మన విషయం పట్టించుకోరు. మరి ఇల్లంటే అట్లాకాదుగదా! మనం తినేందుకు, తలదాచుకునేందుకు మాత్రమేకాకుండా మన సుఖశాంతులకు ఆనందానికి, ఆత్మీయత, అభిమానము, ప్రేమ, ఆదరణలకే ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. అందరూ కలసి పస్తున్నా ఆనందమే. నిజానికి కుటుంబము



లోని ఒకవ్యక్తికి అనారోగ్యమైతే మిగిలినవారెంత గొప్పగా స్పందిస్తారు? ఆవ్యక్తి ఎడల ఎంత సానుభూతి, ప్రేమ, ఆదరణలు చూపిస్తారు? అందుకే కొందరు ఇల్లంటే పడిచస్తారు. ఇంట్లో తినేందుకేమీ లేకపోయినా అక్కడే కాలం గడపాలని చూస్తారు. అట్టి ప్రేమ, ఆదరణ, ఆత్మీయతలనివ్వలేనివి ఇండ్లేకాదు. అవి Hotels, and choultrees అవుతాయి. అందుకే వీళ్ళంతా నాదగ్గరే ప్రేమను పంచుకుంటూ ఇలా ఉండిపోతారు. ఆ విధంగా నేను వీరితో ప్రేమను పంచు కోవడమే వీరి పెద్దల దృష్టిలో నేను చేసిన అపరాధము. అందుకే వారు నాతో మాట్లాడరు. మాట్లాడకపోతే పోనీ. అధర్మపరులైన వారికొరకు నేను వీరితో ప్రేమగా వ్యవహరించడం మానుకోవాలా ఏమి? అందరిలో సాయిని చూడటం నాకు చేతనయ్యేదెప్పుడు? అన్నారు.

## అడ్డంకు అంతరంగంలోనిది!

మనకు కావలసిన స్నేహితులు వచ్చి ఒక్క లారీ సామాను మన చిన్న గదిలో కుక్కినా ఇంకా ఏమైనా సామాను వుంటే తెచ్చిపెట్టుకోండి అని ఎంతో సంతోషంగా చెపుతాము.

అదే ఎవరో వచ్చి 'ఈ సంచి మోయడం మాకు ఇబ్బందిగా ఉంది. దీన్నిక్కడుంచండి, ఒక గంట తర్వాత తీసుకుపోతాము' అని అంటే, 'అబ్బే వీలులేదండీ, మాకే చాలా ఇబ్బందిగా ఉంది. ఇక్కడికి పదిమంది వస్తూ పోతుంటారు. వీలుకాదండీ' అని చెప్పి తప్పుకుంటాము. వీరికి ఇలాంటి సమాధానం చెప్పేందుకు అడ్డంకు అంతరంగములో ఉంది. దాన్ని తొలగించు కోవాలి. అందరిలో సాయిని చూడడం వారికి సహాయపడడం నేర్చుకోవాలి. అలా చేస్తుంటే మన అంతరంగంలోని అడ్డంకు కొన్నాళ్ళకు తప్పక తొలుగు తుంది. అందుకు సాయి తప్పక సహాయం చేస్తారు. అందుకు మన inner efforts అవసరం.

## మాష్టరుగారి సహజాతి సహజమైన అహంకార రాహిత్యం!

మాష్టరుగారి ఒక పుట్టినరోజుకి ప్రఖ్యాతి గాంచిన ఉపన్యాసకులైన గాలి శేషగిరిరావుగారు వచ్చారు. అందరి ఎదుట సభాముఖంగా శేషగిరిరావు గారు

మాష్టరుగారికి పూలమాల సమర్పించి పాదాభివందనం చేస్తున్నారు. ఇదేంటి ఇలాచేస్తున్నారు అని ఎంతో వినయంగా చెప్పినా శేషగిరిరావుగారు అన్నారు : ''మేము వాచావేదాంతులము మాత్రమే. మీరు అనుభవజ్ఞానులు''. గాలి శేషగిరిరావుగారు ఒంగోలులో కొన్నాళ్ళు నిత్యం ఉపన్యసిస్తున్నారు. మాష్టరు గారు శ్రోతలలో కూర్చొని వినడం చాలా అవమానంగా ఉన్నదని సెక్రటరీ పోరు పెట్టి మాష్టరుగారిని వేదికపై శేషగిరిరావుగారి ప్రక్కన కూర్చొబెట్టారు. ఒక్క ఐదునిమిషాలు తర్వాత కుర్చీలో నుండి లేచివచ్చి మాష్టరుగారు మామూలుగా శ్రోతలలోనే కూర్చున్నారు. ఆ తర్వాత సెక్రటరీగారు బాధపడ్డాడు. కానీ మాష్టరుగారు ఎంతో వినమ్రతతో తన గొప్పతనాన్ని నిరాకరించారు. నిరహంకారం సహజసిద్ధమవడమంటే అదే గదా!

## పాయసం వడ్డించడం!

''నా పంచకొచ్చిన ప్రతివారికి పాయసం వడ్డించడమే నా కర్తవ్యం. చేతనైతే జాగ్రుకుంటే సరి! లేకుంటే చీమలు ఈగల రూపంలో సాయినాథులే ఆరగిస్తారు. నాకెలాంటి బాధలేదు!'' అన్నారు.

అందరికీ సుగతే. ఆదిలో అపరాధం ఎవరిది All methods of spiritual practices done with sincerity and sraddha are correct. ఉదా:- మనసు లేకుండా నోటితో భజన చేసేవాడుకూడా మేలే. ఎవరికంటే - గ్రామములో తిని నిద్రపోయే majority ప్రజలకంటే అతడు ఉత్తముడే. ఇతరులను హింసించి, దొంగతనం చేసేవానికంటే వాడు ఉత్తముడే. So Master has approved all methods in spiritual practice. అయితే ఆయా పద్ధతులలో సులువెరిగి చేయడం, నిజమైన ధ్యేయానికి ఆయా కార్యాలు ఎలా ముడివడియున్నాయో తెలుసుకుని చేయడం ఎంతో మంచిది అనేవారు.

పూజ్యశ్రీ మాష్టరుగారు విజయవాడలో ఒక మందిరంలో ఉపన్యసిస్తూ చెప్పిన మాటలు :

''శ్రీ సాయినాథుని దేవాలయాలను అంకమ్మ, పోలేరమ్మ గుడులవలె ఆపదమ్రొక్కులకే పరిమితం చేసి ఉపయోగించుకోరాదు. వారు



సర్వజ్ఞులు, సర్వసమర్థులు, వారి చరిత్ర హృదయగతం చేసుకొని పారాయణ చేస్తుంటే వారెంతటి ప్రేమస్వరూపులో మనకర్థమవుతుంది. మొదట ఆపద తీరేందుకే వారి నాశ్రయించినా ఆ ఆపదతీరగానే కృతజ్ఞతతో వారి చరిత్ర పారాయణ చేస్తూ నిత్యం కొంతకాలం వారిని స్మరిస్తుంటే ఎంతటి తృప్తి, శాంతి ప్రసాదిస్తారో స్వయంగా తెలుసుకోగల్గుతారు. ఆపద వచ్చాక వారిని ప్రార్థించటం ఆ ఆపద తొలగించుకోవడం చాలా హీనమైన మార్గము. అసలు వారి చరిత్ర పారాయణ, పూజ, ధ్యానం చేసుకుంటుంటే మనకు ఆపద రాకముందే దానినుండి ఎలా తప్పుకోవాలో వారాదేశిస్తారు. ఒక్కొక్కసారి అలాంటి ఆదేశం లేకుండా మనమే ఆ ఆపద తప్పుకునేటట్లు ప్రవర్తించేలా చేస్తారు. ప్రారబ్ధం బలీయంగా ఉంటే ఆప్రారబ్ధాన్ని స్వప్నాలలో అనుభవింపజేయడం కూడా గలదు. గనుక వారి నాశ్రయించడంలో ఉన్నంత మేలు ఇతరత్రా ఏవిధంగానూ లేదని నా స్వానుభవం తెలుపుతుంది.''

## విశ్వాసం!

విద్యానగర్‌నుండి ఒంగోలు వచ్చిన క్రొత్తలో మాష్టరుగారు తీవ్ర మయిన ఆర్థిక ఇబ్బందిలో ఉన్నారు. వారికి జీతం రావడంలేదు. ఒంగోలులోని ప్రింటింగ్ ప్రెస్ ఆర్థికంగా సహకరించలేని స్థితిలో ఉంది. ఇద్దరు చిన్నపిల్లల ఖర్చులు, వచ్చేపోయే అతిథుల ఖర్చులు. సామాన్యులైతే భరించలేరు. ఇందులో అమ్మగారి వైద్య ఖర్చులు. ప్రతివారు ''అయ్యో! మాష్టరుగారు దేవుణ్ణే నమ్ముకుంటే ఇలా చేశాడే'' అని సానుభూతి మాటలు మాట్లాడేవారు. ఒక ప్రముఖ వ్యక్తి నాతో అన్నారు : ''వారికేమి కొరవ? ఒకరు కూరలు, ఇంకొకరు బియ్యం ఇస్తారు'' అని. ఇది గౌరవంగా జరిగే పనేనా? చాలా ఇబ్బందికరమైన పరిస్థితి. కానీ మాష్టరుగారికి ఎంత గొప్ప తృప్తి ఉందో ఈ మాటలు తెలుపు తున్నాయి.

''వీళ్ళంతా ఇలా అనుకుంటారు ఏంటి సుబ్బరామయ్యా! బాబా నాకిప్పుడేం తక్కువ చేశారు? విద్యానగర్‌లో ఉంటే ఎక్కడికి పోవాలన్నా గంటల తరబడి బస్‌స్టాప్‌లో వేచియుండాలి. ఆ తర్వాత రైల్వేస్టేషన్‌లో వేచియుండాలి. ఇక్కడా బాధలేదే. రైలు ఎప్పుడెంత లేటయింది ప్రక్కింటికి ఫోను వస్తుంది.

స్టేషన్‌లో మన భక్తులు రమ్మని ఫోన్ చేస్తేనే బయలుదేరుతాను. ఆ సమయానికి ఎవరో ఒకరు కారులోనో, మోటార్‌బైక్‌మీదో రిక్షాలోనో స్టేషన్‌కు తీసుకుపోతున్నారు. విద్యానగర్‌లో నీళ్ళు చేదుకోవాలి. మరి ఇక్కడ మన ఇంటికి కుళాయిలున్నాయి. విద్యానగర్‌లో ఫ్యానులు లేవు. మరి ఇక్కడ ప్రతిరూముకూ ఫ్యానే. ఫ్యాను నేను వేసుకోకున్నా వచ్చిన అతిథులు ఫ్యాను వేసుకుంటారుగదా. భోజనాలకు నాకెప్పుడూ ఇబ్బందే లేదు. అన్ని జీవులకు ఆహారమిచ్చే బాబా మన కెందుకివ్వరు? ఒకవేళ ఇవ్వకుంటే మన కులవృత్తి భిక్ష ఉండనే ఉంది.'' ఇంతటి తృప్తితో జీవించడం అందరికీ సాధ్యమా! అదే వారి గొప్పదనం.

## సద్గురుని పాత్ర!

నేను :- సార్! మన ఖర్మ ఎలా ఉంటే అలాగే జరిగితీరుతుందికదా?

మాష్టరుగారు :- ఔను, నిజమే.

నేను :- అలాంటప్పుడు సద్గురువుతో పనేముంది?

మాష్టరుగారు :- సద్గురువు విషయంలో సాధారణమైన సూత్రాలు పొసగవు. ఒక భక్తుడు సద్గురుని కృపకు పాత్రుడయ్యాడంటే అతనిని సద్గురువు ఎలా నడిపిస్తాడనేది చాలా చిత్రంగా ఉంటుంది. ఆ భక్తునికి సంబంధించిన భవిష్యత్తును గూర్చిన ఫిల్మంతా సద్గురుని పరమవుతుంది. కావాలంటే ఆ ఫిల్ములో అవసరమైన భాగాలు కాల్చేసేదానికి గాని, ఆ ఫిల్ములోని బొమ్మలు మార్చి వేరేవి వ్రాసేందుకుగాని, లేక ఆఫిల్ములోని కొన్నిభాగాలు ప్రస్తుత జీవితంలో అనుభవానికి రాకుండా మరొక జన్మకు మార్చేందుకుగానీ, లేక అదే జీవితంలో ఆ వ్యక్తి ఆధ్యాత్మికంగా బాగా ఎదిగి ఆ అనుభవాలకు చలించకుండా ఓర్పుతో అనుభవించే మరొక భవిష్యత్ కాలానికి మార్చడానికిగానీ ఆయనకు అధికారముంటుంది. గనుక సద్గురు కృప పొందిన వారికి సద్గురువు చేయలేనిదంటూ ఏమీలేదు. ఆ భక్తుని ఆధ్యాత్మిక పురోభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని సద్గురువు ఏమైనా చేయగలరు. ఒక్కొక్కప్పుడు ఆభక్తుని ప్రారబ్దాన్ని స్వప్నాలలో అనుభవింపజేయడం, జాగ్రత్తులో దాని బాధ లేకుండా చేయడం కూడా మనం చూస్తాము. బాబా



చరిత్రలో రక్తం కక్కుకునే క్షయవ్యాధిగ్రస్తుని చెడ్డకర్మను స్వప్నంలో టీచర్ కొడుతుంటే అరచేతులనుండి రక్తం కారుతూ అతడు తీవ్రంగా ఏడుస్తాడు. మరొకరోజు ఎవరో రోడ్డు రోలరును అతని గుండెలమీద నడుపుతున్నారు. అతడు భయంకరంగా ఏడుస్తున్నాడు. తర్వాత స్వప్నం అంతరించింది. ఆ భక్తునికి ఆరోగ్యం చేకూరింది. గనుక మన ఆధ్యాత్మిక, లౌకిక అభివృద్ధి దృష్ట్యా సద్గురుని పాత్ర గణనీయంగా ఉంటుంది. ఐతే సద్గురుని కృప పొందడంలోనే భక్తుని సామర్థ్యమంతా ఇమిడి ఉంటుంది.

## సత్సంగం ఎందుకు చేయాలి?

సత్సంగం ఎందుకు చేయాలి? మహనీయుల చరిత్రలు చదవడమెందుకు?

సత్సంగం చేసినందున చదివేవారికి, వినేవారికి తమలోని లోపాల ప్రసక్తి వచ్చినప్పుడు హృదయంలో కలుక్కుమనిపిస్తుంది. కొంతమంది తీవ్ర పరితాపానికి గురియై ఈ జన్మలోనే ఆయా లోపాలు తన ప్రవర్తన నుండి నిర్మూలించుకుంటారు. ఒకవేళ అలా నిర్మూలించుకోలేకుంటే హృదయాలలో కలుక్కుమనే బాధ భావాలుగా ఈ జన్మకు సంస్కారంగా నిలచిపోయి వచ్చేజన్మకు సంక్రమిస్తుంది. సత్సంగం నిర్వహించినవారు అలాంటి దుర్గుణ రాహిత్యానికి కలుక్కుమనే foundation stone పునాదిరాయి వేశారన్నమాట. అది మహాగొప్ప పుణ్యకార్యము. భూమిలో రెండు గూటాలు నాటబడి ఉన్నాయి. ఒక గూటాన్ని నిత్యం కొంతసేపు కదిలించి వదిలేస్తున్నాము. మరి యొకదాన్ని అలా కదిలించమనుకోండి. కొంతకాలానికి ఈ కదిలించే గూటం సులభంగా పీకేసేందుకు వీలౌతుంది. కదిలించనిది ఒకేరోజు పీకాలంటే ఊడిరాదు. అలాగే మనలోని దుర్గుణాలుకూడ, గనుక నిత్యం సత్సంగం చేయడం ఎంతైన అవసరమన్నారు.

సాయి చరిత్ర ఎందుకు మరలా మరలా చదవాలి? ఈ విశాల విశ్వమంతా సాయి రూపంగా చూచేందుకు నేర్చుకునేందుకు, తాను ఆధ్యాత్మికంగా ముందుకు పోయేందుకు ఏజగత్తైతే అడ్డమవుతుందో - సాయి చరిత్ర హృదయగతమైన వారికి ఆజగత్తే ఆధ్యాత్మికంగా ముందుకు పోయేందుకు ఉపకరిస్తుంది.

పేను, నల్లిని చంపేందుకు వెనుకాడుతాము. కాని మన విరోధిని పరోక్షంగా విమర్శించకుండా ఉండలేము. అలా విమర్శించడం తప్పని గుర్తించి ఆ చెడ్డసంస్కారము నుండి బయటపడందే సాయి మనకు ఎన్నిచేసినా ప్రయోజనం లేదు. సాయినాథుని దగ్గర భిక్షమెత్తే స్థితినుండి బయటపడలేము. తాళాల గుత్తి తీసుకోలేము. సర్వం ఋణానుబంధానుసారం జరుగుతుందని విశ్వసించి నడుచుకోవాలి. లేకుంటే మనది మిథ్యాసాధనవుతుంది. చెన్నబసప్ప, వీరభద్రప్పల వలె తయారవుతున్నామన్నమాట. గనుక చరిత్ర పఠనము, శ్రవణంతోటి హృదయ పరిశీలన ఎంత ముఖ్యమో ఆలోచించాలి.

## వక్రబుద్ధి!

పూజ్యశ్రీ మాస్టరుగారు సర్వసాధారణమైన లౌకికసంభాషణ చేస్తున్నప్పటికీ ఆ సంభాషణలో వెలలేని ఆణిముత్యాలవంటి ఆధ్యాత్మిక సత్యాలు దొర్లేవి. అందుకొక ఉదాహరణ. ఒకరోజు నాతో, ''X అనే వ్యక్తి నాగూర్చి ఏవేవో ఊహించుకొని ఏవేవో భేదభావాలు ఏర్పరచుకుంటున్నాడు. వాని అభిప్రాయమేమిటో కనుక్కొని వాణ్ణి చక్కబరచే మార్గం చూడు'' అన్నారు. అందుకు నేను ''సార్! నేనా వ్యక్తిదగ్గరకే పోను. ఆవ్యక్తికి నాపై ఎంత సద్భావ ముందో ఒక చిన్న సన్నివేశం చెపుతాను వినండి. అని ఆచిన్న సన్నివేశం చెప్పాను. 'అరే అలా మాట్లాడాడా! అయితే నీవు వెళ్ళవద్దులే' అన్నారు. 'కానీ వీనికి ఈమధ్య crucidity (క్రుసిడిటీ) అధికమవుతున్నది. (అంతకుముందే ఆ గుణం ఆ వ్యక్తిలో ఉందన్నమాట) ఆధ్యాత్మికతలో అది తగదుగదా' అని ఆ సంభాషణ ఆపివేశారు. ఆ తర్వాత ఆ statement యొక్క గొప్ప భావం నాకిలా అర్థమయింది.

రాగద్వేష విముక్తైస్తు అన్నట్లు ఎలాంటి భావపరంపరలూ లేకుండా సద్భావంతో బాబాగారి ఆజ్ఞలు శిరసావహించుటే మనధ్యేయం కావాలి. అంతే గాని crucidity పెంచుకుంటూ ఒకరిపై మరియొకరు దుమ్మెత్తి పోసుకుంటుంటే అదే ఋణానుబంధమై మరుజన్మకు వెంటాడుతుంది. ఒకే గురువును సేవించిన వారిలో బాబాగారు మాత్రం అంత గొప్ప స్థితికి వచ్చారు.



మిగతావారు కక్షలు, మనస్పర్థలూ వీడలేకపోయారు. చివరకు బాబాను కొట్టేవరకు వచ్చారు. రాగద్వేషాలు వదలిపెట్టే మెలకువ తెలియకుంటే ఆధ్యాత్మికత పేరుతో అంతకంతకు దిగజారిపోతాము. అందుకే బాబాగారు భేదమనే గోడను కూలద్రోయ్, ఎవరినీ నీ శత్రువులుగా తలచవద్దన్నారు. సాధన పేరుతో రాగద్వేషాలనే ఉచ్చుల్లో ఇరుక్కొని మరుజన్మకు చెన్నబసప్ప, వీరభద్రప్పలమవుతామన్నమాట. ఈ భావాలన్నీ మాస్టరుగారి ఆశీస్సుల ప్రభావమని విశ్వసిస్తున్నాను.

## ధ్యానాన్ని గజస్నానం చేయవద్దు!

''ధ్యానాన్ని గజస్నానం చేయవద్దు'' అని పదేపదే చెప్పేవారు. ధ్యానం చేసినప్పుడు బాగానే ఉంది. లేచి ఇవతలకు రాగానే నేను వేరు, జగత్తు వేరు అనే భావం మనకు తెలియకుండానే మన మనసులో మొదలైన ఆలోచనా స్రవంతి ధ్యానమునకు ముందుకంటే ధ్యానానంతరం ఎక్కువ ఉధృతంగా కొనసాగు తుంది. ధ్యానం చేసినంతసేపు మన ప్రయత్నంతో నీటికి కట్టవేసి ఆపినట్లు ఆపామన్నమాట. ధ్యానానంతరం కట్టతెంచుకొని ప్రవహించే నీటివలె ఆలోచనలు ఉధృతంగా కొనసాగుతాయి. అదే తప్పు పద్ధతి. కళ్ళు తెరచియున్నా ధ్యానం చేస్తూ ఉండాలి. శత్రుమిత్రుల భేదం పోవాలి. ఎలా పోతుంది? వివేకంతో పోతుంది. ఇప్పటి మన పరిస్థితులు, బంధుమిత్రులు, ఆశ్రితులు ఆ రూపాలలో మనకు గల్గే అనుభవాలు సర్వం పూర్వపు ఋణానుబంధాన్ననుసరించే కల్గు తున్నాయనే వివేకము, విశ్వాసం తీవ్రంగా కలగాలి. వంటబట్టాలి. ధ్యాన బాహ్యంగా గడిపే క్షణమే లేకుండా పోవాలి. అంతా ఋణానుబంధాన్ననుసరించి జరుగుతుంది అనే పరమసత్యం బాగా వంట బట్టాలి. మన ఆలోచనతో ప్రమేయం లేకుండా సర్వం జరుగుతుంది. మనకు రావలసినవి వచ్చి తీరుతాయి. రానివి మనమెంత ఆలోచించి ప్రయత్నించినా రావు, జరుగవు. మన మనస్సు లోని ఆలోచనలను ఈ వివేకం ద్వారా అదుపులో పెట్టుకోవాలి. జాగ్రదావస్థలో మనసులోని ఆలోచనలను అదుపులో పెట్టేందుకు పని ముఖ్యమైన ఆలంబన కావాలి, live at the present moment అనే principle ప్రకారం చేయడం నేర్చుకోవాలి. మధ్యాహ్నం మితంగా భోంచేసి నిద్రపోకుండా ఏదో పని

కల్పించుకొని పనిచేయాలి. గుడ్డలు ఉతుకు, గుడ్డలుకుట్టు, రూములోని వస్తువులను నామజపంచేస్తూ సర్దుకో, ఏదైనా చెయ్యి. మన Attention మాత్రం ఆలోచనా స్రవంతిని అరికట్టడంగా ఉండాలి. ఆలోచనలను అరికట్టి ఏమి చేయాలి? అంతటా ఉన్న చైతన్యాన్ని స్మరించాలి. ఆ చైతన్యమే సాయి అన్న ఎరుక ఉండాలి. ఆ విధంగా ధ్యాన బాహ్యంగా లేని క్షణం లేకుండా చేసుకోవాలి. అంతేగాని ధ్యానాన్ని గజస్నానం చేయకూడదు. కావాలి అనే కోరికలను వివేకంతో నిర్మూలించుకోవాలి. నేను జీవించాలి అనేది కూడ కోరికే. మరణ భీతి అనేది చాలా భయంకరమైన శత్రువు. అదికూడా పోతేగాని కావాలనే కోరికలు తుదముట్టినట్లు కావు. సర్వం electron, proton, neutron, మయమే. ప్రస్తుత సైన్సు ప్రకారం ఇవి మూడుకూడా వేరుకాదు. మూడూకూడ ఒకే చైతన్య కక్ష్యలే. వాటి తరంగ దైర్ఘ్యములు వేరువేరుగా ఉండుటచే అలా వేరువేరుగా కనబడుతున్నాయి. 'అంతా ఒకే చైతన్యమే ఉంది' అని నిత్యనూతనంగా జగత్తును గుర్తిస్తూండు. సాధన మార్పు కొరకు శ్వాసను గమనించు. శ్వాసకు ఆధారం ప్రాణం. ఈ ప్రాణశక్తే సాయి. అది అన్ని జీవులలో ఒకటే గదా! మరి శత్రుమిత్రులు ఎలా వచ్చారు? అలా సంభవించడానికి అజ్ఞానమే కారణము. నిర్జీవులలోకూడా చైతన్యమే వుంది. అక్కడ electron, proton, neutron అనే రూపాలలో చైతన్య స్పందనలే ఉన్నాయి. అన్నింటిలోను అవే ఉంటే మధ్య మన ఆలోచనలేమి ప్రయోజనం చేకూర్చగలవు. ఈవిధంగా కొన్నాళ్ళు ఆలోచిస్తే మనస్సు స్థిమితపడుతుంది. ఆవిధంగా మన ఆలోచనలు అరికట్టబడాలంటే భగవంతుడు మననుండి కోరిన కాలము, మనస్సు వారికి సమర్పించాలి. అలా సాధన మొదలుపెట్టి తంటాలుపడుతూ హృదయపూర్వకమైన ప్రయత్నం చేస్తుంటే భగవంతుడు తప్పక తోడై మన నావను గమ్యం చేరుస్తాడు. ఇందులో సందేహానికి తావే లేదు'' అన్నారు.

**ఆచార్యులవారి అభిమతము :**

మాస్టరుగారు ఆధ్యాత్మికతలో ఏసాధననూ, ప్రక్రియనూ త్రోసివేసేవారు కాదు. అయితే ఆ సాధన ఎందుకు చేస్తున్నామో తెలుసుకొని సులువెరిగి చేయడం ముఖ్యమని చెప్పేవారు. భజనలు, మందిరాలు, పూజారుల ద్వారా పూజలు, హరికథలు, వ్రతాలు, ప్రదక్షిణలు, చన్నీటి స్నానాలు, పొర్లుదండాలు ఒకటేమిటి సర్వం వారు అంగీకరించేవారేకాని నిరసించేవారు కాదు.



మానవుడు మిశ్రమ కర్మలు చేస్తుంటాడని, ఒకవేళ ఎప్పుడో పాపంకంటే అతని పుణ్యమధికమైనప్పుడు చక్కని మార్గానికి తప్పక వస్తాడని, ఈలోగా తెలిసినవారు అందరినీ పుణ్య కర్మలు చేసేందుకు ప్రోత్సహించి వారికి తెలియకుండానే పుణ్యకర్మలు చేసేటట్లు చేయడమే విజ్ఞత అని చెప్పేవారు.

ఒక వ్యక్తి దేవాలయానికి రావాలంటే 1. తన పనులన్నీ ప్రక్కకు నెట్టాలి 2. ఇంటినుండి శ్రమతో నడిచిరావాలి 3. దూరమైతే వాహనానికి ఖర్చుపెట్టాలి 4. దైవదర్శనానికి వట్టిచేతులతో రాకుండా కొంత ఖర్చు చేయాలి. ఇంత శ్రమ పడ్డ భక్తుడు అసలు దేవాలయ ఛాయలకేరాని వారికంటె మేలుకదా! ఈ విధంగా పుణ్యమధికమవుతూ వస్తే ఎప్పుడో దారిలో పడుతాడు. అయితే క్రొత్తవి తగిలించుకోకుండా చూచుకోవాలి. అందుకు సత్సంగమెంతో ఉపకరిస్తుంది. ఆవిధంగా సత్సంగం లేనివారికి + (ప్లస్) మార్కులకంటే – (మైనస్) మార్కులే ఎక్కువయ్యే ప్రమాదముంది అని చెప్పారు.

## Comments వ్రాయడం

ఒక సన్నివేశం పైన comments వ్రాయడంలో వారికి వారే సాటి. ఆ కామెంట్ ద్వారా ఆ సన్నివేశం మనకేమి బోధిస్తుందో, మనమెలా నడుచుకోవాలో తెలియచెపుతారు. ఆ ఒక్క comment ఎందరు సాధకులకు శాంతి సౌఖ్యాలనిస్తుందో లెక్కవేయలేము. సాయిబాబా చరిత్రలో ఒక వృద్ధురాలు బాబాగారి పొట్ట పిసుకుతుంది. పురందరే అను భక్తుడు అది చూడలేక కాస్త నెమ్మదిగా పిసకమంటాడు. వెంటనే బాబా పురందరేను కసురుకొని అక్కడ నుండి వెళ్ళిపొమ్మని ఆజ్ఞాపించారు. ఆ సన్నివేశం అంతటితో ముగిసింది. మాష్టారు ఆపైన ఒకే ఒక్క వాక్యం వ్రాశారు ''ఇతరుల సేవలో మనం జోక్యం చేసుకోకూడదు'' అని. ఇది నాకొక దివ్య సందేశమై నాకేగాక ఇతరులకు గూడ ఆనందదాయకమైంది. ఎలాగు?

నేను శ్రీ వెంకయ్యస్వామి వారి సమాధికి పూజ చేసేటప్పుడు ఆ మందిరంలో పనిచేసేవారు పొరపాటున చేసిన చిన్న తప్పుకు కూడా కోపపడేవాణ్ణి. మనిషన్నాక ఏమరుపాటున తప్పుచేయడం సహజం. కానీ ప్రతిసారి నేను కోపపడి వారిని బాధపెట్టేవాణ్ణి. ఒకరోజు మాస్టరుగారు వ్రాసిన పై కామెంటు గుర్తురావడం, ఆతర్వాత వారెలా చేసినా నేను సంతోషంగా స్వీకరించడం జరుగుతున్నది. ''శ్రీస్వామివారికి వారావిధంగా సేవ చేయాలనుకున్నారు. ఇక మనం వారి సేవలో జోక్యం చేసుకోరాదు'' అని ఏమీ అనడం లేదు. వారికేగాకుండా, నాకుగూడ ఎంత ఆనందంగా హాయిగా ఉందో చెప్ప సాధ్యమా? మరొక ఉదాహరణ.

ఒకసారి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి సేవకుడు మల్లిక వెంకయ్య నుండి ఐదురూపాయలు తీసుకొని ఒక రైతు స్వామివారి ధునికి కట్టెలు తోలాడు. ఆ తర్వాత ఆ రైతు తన కుప్ప నూర్పిడిచేస్తూ మల్లికవెంకయ్యకు కూలి ఇవ్వకుండా పొలంలో ఒకరోజు పనిచేయించుకున్నాడు. ఆ తర్వాత ఆ రైతు శ్రీస్వామివారి దగ్గరకు రాగానే శ్రీస్వామివారు అన్నారు : ''అయ్యా బండాయన వచ్చాడా! ఆయన దేవునకు రూ 25 బాకీ ఉన్నాడు'' అని చెప్పారు. ఆ తర్వాత ఆ రైతు తిరుపతికిపోయి అక్కడ ఇరవైఐదు రూపాయలు పోగొట్టుకొన్నాడు. ఇదీ సన్నివేశం. దానికి మాస్టరుగారు వ్రాసిన comment ఎంత అద్భుతమో చూడండి. ''శ్రీస్వామివారి సేవకులు సాక్షాత్తు భగవంతుని సొత్తు. ఆ సేవకులకు చెల్లించవలసిన పైకం వారికిగాని, వారి గురువుగారికి గాని చెల్లించకుంటే ఆ ధనం ఈ విధంగా నష్టపోవలసివస్తుంది'' అని వ్రాశారు. ఆమాట హృదయగతమైన తర్వాత శ్రీస్వామివారి సేవకుల నుండి ఎంత స్వల్పమైన పనిగాని చేయించుకొనేవాడనుకాను. ఆ సేవకులు సాక్షాత్తు భగవంతుని సొత్తుగనుక వారి సేవకు మామూలు కూలీలకు ఇచ్చినట్లు ధనం ఇవ్వడం తగదు. భగవంతుని సేవకులద్వారా మనం సేవ పొందడం కూడా చాలా తప్పనితలచి మానేశాను.

## ఆచార్యదేవోభవ!

అలాగే శ్రీ వెంకయ్యస్వామివారి చరిత్రలో నా స్వానుభవమంతా వ్రాశాక మాస్టరుగారు వారి comment వ్రాశారు : ''కష్టాలు కూడా



అనుగ్రహానికి గుర్తు''. ఈ comment ఎంత సత్యమైనదో నాకు మాత్రమే అనుభవమవుతుంది. ఇరవైమూడు సంవత్సరాలు టీచర్‌గా సర్వీసు చేసినా నేను ప్రస్తుతం పొందే ఆనందం అప్పుడు పొందలేకపోయాను. ఇట్టి ఆనందమయ జీవితం ప్రసాదించడానికే అప్పుడు అన్ని కష్టాలు పెట్టారు. కష్టాలేమిటంటారు మీరు! నా ఆయాస రోగం ఏ మందులకూ లొంగలేదు. శ్రీ మాస్టరుగారుకూడా చూస్తూ ఊరకున్నారు. నేనడిగేదిలేదు రోగం తగ్గించమని. ఆత్మహత్యే శరణ్యమనే స్థితికికూడా వచ్చాను. కాని శ్రీవెంకయ్య స్వామివారు చెప్పిన నియమాలను వెంట్రుకవాసి తేడా లేకుండా పాటించలేక పోయేవాణ్ణి. చివరకు గొలగమూడిలో వారి సన్నిధికి తీసుకువచ్చి, ఉద్యోగం రాజీనామా చేయించి, రోగం తగ్గించి ఆనందాన్ని అనుగ్రహించారు. గొలగ మూడిలో ఉండి ఆయా భక్తుల అనుభవాలు వింటుండబట్టి నా భక్తి విశ్వాసాలు అంతకంతకూ అభివృద్ధిచెందాయి. అదే కలిచేడులో వుంటే శ్రద్ధాభక్తులు నాకిప్పుడున్నంతగా ఉండేవికావు కనుక ఆనాడు ప్రాణాంతకమైన కష్టాలు అనుభవించకుంటే నేను గొలగమూడిలో నిలువలేను. గనుక ''కష్టాలు గూడా అనుగ్రహానికి గుర్తు'' అన్న comment ఎంత గొప్పదో నాకు క్షుణ్ణంగా అర్థమయింది. నేనుపడ్డ కష్టాలన్నీ ఇక్కడ వ్రాయలేను.

## సాధన

సాధనకు సరైన అర్థం చెప్పడం శ్రీమాస్టరుగారికే సరి. ''ఇతరులను బాగుపరచేందుకు ఈ పనిచేస్తున్నాను అంటే - ఆక్షణం నుండే నీ పతన మారంభమైందని గుర్తించు'' అన్నారు.

''అలా ఎందుకని సార్'' అన్నాను.

''సర్వజ్ఞుడు, సర్వసమర్థుడు అయిన సాయికంటే నీవు ఎక్కువగా చేయగలవా? ఎక్కువ సమర్థుడవా? సర్వులను ఆదుకొనేందుకు వారు బద్ధకంకణులై ఉండగా వారికంటే నీవు దయామయుడవా? నీ వెంతటి వాడవు? మన సాధన కొరకే ఇతరులను బాగుపరచే కార్యక్రమాలు చేస్తుండడం, ఆయా కార్యక్రమాలు నిష్కామకర్మగా చేస్తుండడం మనవిధి. అవి మన సాధన కొరకు మాత్రమే చేయాలి – వాటి ఫలితం

బాబాది. అలాంటి నిష్కామకర్మ చేయనిదే, ఇతరులతో కలవనిదే మనలోని లోపాలు మనకు తెలిసిరావు. తెలిసిరానిదే వాటి నిర్మూలనకు వివేక, విచారాలు, పశ్చాత్తాపము, ప్రాయశ్చిత్తము మనలో జరుగవు. ఆ లోపాలు అన్యధా నిర్మూలించబడవు. అంతేగానీ ఇతరులను బాగుపరచడం ఒక్కటే మన ధ్యేయం కాకూడదు. మన నిష్కామకర్మ ద్వారా ఎదుటివారు బాగుపడితే పడవచ్చు లేకుంటే లేదు. కానీ ఆకృషి ద్వారా మనలోని దోషాలు మనం గుర్తించి నిర్మూలించుకోవాలి'' అని ముగించారు.

## శ్వాస గమనిక

శ్వాసను గమనించమని లెక్కలేనన్నిసార్లు నాకు చెప్పేవారు. గట్టిగా శ్వాసనులాగి, వదలి గమనించేవాణ్ణి. అది చాలా బాధాకరంగా ఉన్నందున వదిలేశాను. సుమారు ఇరవైసంవత్సరాల తర్వాత ఆ బోధయొక్క నిజస్వరూపం కొంతైనా నేడర్థమయింది. గట్టిగా శ్వాసనులాగి వదలమని కాదు మాస్టరు చెప్పింది. తీరిక సమయాలలో మనసు అన్యచింతలకు పోకుండా దానికి పని కల్పించాలి. అలా మనసుకు పని కల్పించే సాధనే శ్వాసను గమనించడం. మనసును నిర్బంధించకుండా కొంచెం ఆలోచించ నివ్వాలి. ఎలాగు? ఈ శ్వాసకు ఆధారం మన ప్రాణశక్తి, బయట ఉండే గాలి, నేను శ్వాసిస్తున్నాను అని తెలుసుకునే ఎరుక. ఇవి అన్ని జీవులలోనూ ఉన్నాయి. మనలోనూ ఉన్నాయి. అయితే మనం దేహపరిమితులమనే భ్రాంతిలో ఉన్నాము. ''ఈ భ్రాంతిని పోగొట్టి అంతటా ఉన్న నీ తత్వం అనుభవానికి వచ్చేటట్లు అనుగ్రహించి కావవే వరదా!'' అని పదేపదే చింతన చేయడమే శ్వాసను గమనించడమని ఈనాడు తెలుస్తున్నది. మార్గాన నడుస్తున్నప్పుడు, విశ్రాంతిగా పడుకున్నప్పుడు, కూర్చున్నప్పుడు ఈ విధంగా మనసును మన అధీనంలో ఉంచుకోవడం సాధకులకెంతో అవసరం.

## పుస్తక ప్రచురణ

### పుస్తక ప్రచురణ గూర్చి మాస్టరుగారి అభిప్రాయము

సాధారణంగా పూజ, అన్నదానం చాలా గొప్ప సత్కార్మలని తలచి శక్తిగలవారు ఎంతైనా ఖర్చు చేస్తారు. కానీ మాస్టరుగారు పుస్తక ప్రచురణ పై సత్కార్మలకంటే ఎంతో గొప్ప సత్కార్మని చెప్పారు.



ఒకప్పుడు నేను వారి జ్ఞానయజ్ఞమునకు సహకరించాలని తలచి నా సహకారాన్నికూడా ఆర్థికంగా స్వీకరించమని అర్థించాను. అందుకువారు, ''మీరెక్కడుంటే అక్కడ సత్సంగం చేయండి. అదే నాకు లక్షలిచ్చినట్లవుతుందని'' శెలవిచ్చారు. ఆమాట మేరకు నేను గొలగమూడి వచ్చాక నిత్యం మహనీయుల చరిత్ర చదివేవాణ్ణి. కొంతమంది చదువవద్దని సలహా ఇచ్చారు. నేనాగలేదు. ఆశ్రమాధికారులకు చెప్పి మైక్ తీసేశారు. నేను మైక్ లేకుండానే సత్సంగం చేసేవాణ్ణి. ఆ తర్వాత సత్సంగాన్నే ఆపించారు. ఈ విషయం మాస్టరుగారికి చెపితే, ''శ్రీస్వామివారిలీలలు చిన్న చిన్న పుస్తకాలుగా విడుదల చేయి. ఆ పుస్తకమున్నచోటల్లా నీవు సత్సంగం చేసినట్లవుతుంది'' అని శెలవిచ్చారు. ఆ విధంగా ''స్వామికృప'' అనే పుస్తకం ఇప్పటికి ఎనభైవేల కాపీలు అచ్చు వేయించడం జరిగింది. గనుక ఈ పుస్తకమే సత్సంగమన్నమాట. 16-7-97 సాయిబాబా పక్షపత్రికలో 5వ పేజీలో శ్రీ ఆచార్యులవారితో సద్గోష్టి అనే శీర్షిక క్రింద మాస్టరుగారు ఇలా చెప్పారు : ''అన్నదానం గొప్పదే అయినా అది ఆకలి తీర్చగలదు కాని హృదయ పరివర్తన గల్గించలేదు. రాగద్వేష అసూయాది భావాలలోగాని సాటి వ్యక్తులపట్ల, సంఘటనలపట్ల మన యోచనా రీతినిగాని కించిత్తుగూడా మార్పును తేలేదు. కానీ సత్సంగము మనిషిలో పరివర్తన తెచ్చి ధర్మప్రవృత్తి కల్గించి, జన్మ పరంపరలనే మారుస్తుంది. అందుకనే అట్టి విద్యాదానం ముల్లోకాలూ దానమిచ్చినంతటి గొప్పదని భారతంలో వ్యాసుడు వ్రాశాడు'' అని చెప్పారు.

ఇందులో మాస్టరుగారు సూచించిన సత్సంగాలు, నాకు సలహాయిచ్చిన పుస్తక ప్రచురణ ఇవన్నీ విద్యాదానాన్నే తెలుపుతున్నాయి.

ఈ విషయంలో హైదరాబాద్ - విద్యానగర్ 1-9-321/3 నివాసియైన పరిటాల వరలక్ష్మిగారికి మాస్టరుగారు ఇచ్చిన ఆదేశం గమనించదగినది. ''సాయిప్రచారం చేయి, నీకు కలిగిన అనుభవాలు ఇతరులతో చెప్పు. సాయి లీలామృతం ఇతరులకు ఇవ్వు. దాని ఫలితం చాలా గొప్పది. ఎన్నో యాగాలు చేసిన ఫలితం వస్తుంది. నీవు చేయవలసిన ప్రచారం ఇదే'' అని ఆదేశించారు. గనుక పుస్తక ప్రచురణ, పుస్తకములు చదివేవారికి అవి అందివ్వడం ఎంత గొప్ప విషయమో మనందరం తెలుసుకొని ఆచరించాలని నా అభిలాష.

## అఖండదీపం

అఖండదీపం గురించి శ్రీమాష్టరుగారు ఇలా చెప్పారు : ''బాబాకు వెలిగించిన దీపం నిరంతరం వెలగడమొక్కటే ధ్యేయమా?

అలాగైతే ఒక నూనె పీపాకు పెద్ద పొడవైన క్రొత్తగుడ్డ పేని వత్తివేసి వెలిగించివేస్తే ఇక మనకే బాధలేకుండా – అంటే చమురు పోయడం, వత్తి నెగతోయడం వంటి పనులులేకుండా వెలుగుతూనే ఉంటుందిగదా? అనంతకోటి సూర్యుల వెలుగుతో ప్రకాశించే బాబాకు వెలుగు లేదనా మనం దీపం పెట్టడం? కానేకాదు. మన హృదయంలో దేదీప్యమానంగా వెలిగే బాబా చుట్టూ పేరుకొన్న చెత్తా చెదారం అనే అజ్ఞాన భావాలను తదను గుణంగా నిరంతరం చలించే మనసును తొలగించేందుకే మన అఖండదీపం ఒక ఉపకరణంగా మనకు సహకరించాలని మనం పెట్టుకోవాలి.

నిరంతరం లౌకిక వ్యవహారాలలో కొట్టుమిట్టాడే మన మనస్సును నిత్యం క్రమబద్ధం చేయడమే అఖండదీప ఉద్దేశ్యం. అందుకోసం అఖండ దీపం సాధ్యమైనంత చిన్నదిగా ఉండాలి. వత్తికూడా సాధ్యమైనంత సన్నగా ఉండాలి. ఉదయం 6 గం॥ హారతప్పుడు దీపంలో చమురు సమర్పించి వత్తిని సరిచేసి అఖండదీపమనే సాయికి నమస్కరించుకొని వెళ్ళాలి. తిరిగి మధ్యాహ్నం 12 గం॥ హారతికి తప్పక హాజరుకావాలి. హాజరు కాకుంటే అఖండ దీపానికి చమురు పోసి వత్తి ఎగదోసే బాధ్యత ఇతరులు చక్కగా చేస్తారో లేదో అనే భయం హృదయాంతరాళంలో మనలను జాగృతం చేయాలి. అలాగే సాయంకాలం 6 గంటలకు, రాత్రి 10 గం॥లకు వచ్చి అఖండదీపం సరిచేసుకొని నమస్కరించుకోవాలి. మనమెంత తీరికలేని పనిలో ఉన్నా నాలుగువేళలా మనలను తట్టిలేపి మందిరానికి తీసుకువచ్చే ఒక దివ్యమైన పరికరంగా ఉపకరించాలి. మందిరంలోని అఖండదీప సంరక్షణా బాధ్యత సామూహికంగా అందరి బాధ్యతగా ఉండాలి. అంతేగాని ఎవరో ఒక ఉద్యోగి బాధ్యతకు వదలి వేయకూడదు. ఇలా మనలను time to time బాబా సన్నిధికి తీసుకువస్తూ లౌకిక వ్యవహారాలనుండి తిరిగి బాబాను గుర్తుచేసే ఉపకరణమే అఖండదీపం. అందుకే బాబా నిరంతరం లెండీలో వెలిగించిన దీపాన్ని నియమం తప్పకుండా దర్శిస్తూ వుంటూ మనకు ఎంతో ఆదర్శప్రాయమై, మనకొక దివ్య కర్తవ్యాన్ని



బోధించారు. అలా మన మనస్సులు, హృదయం బాబా చుట్టూ పరిగెత్తినప్పుడే (క్రమబద్ధంగా) మనలో సత్యాన్ని దర్శించే గుణం వృద్ధి చెందుతుంది. అంతేగాని ఏదో విధంగా మందిరంలో నిరంతరం దీపం వెలగడమే ముఖ్యముకాదు'' అని వివరించారు.

## చన్నీటిస్నానం

''సార్! కొంతమంది చన్నీటి స్నానం చేసి తడిబట్టలతో ప్రదక్షిణం చేస్తారు. కొంతమంది పొర్లుదండాలు పెడుతారు. మరి కొంతమంది అడు గడుగునా దండాలు పెడుతారు. ఇవన్నీ దేవుని మెప్పిస్తా యంటారా?''

మాష్టారుగారు చెప్పారు, ''లేదు, లేదు. వాటివల్ల తప్పక ఫలిత ముంటుంది. ఎలాగంటే, నేను హిమాలయాల సమీపంలో (టిబెట్టు అను కొంటాను) ఒక తెగ సాధువులను చూచాను. వాళ్ళు నిజమయిన సాధకులే. వాళ్ళు ధరించిన గొంగళ్ళు ఎంతో మొరటుగా వున్నాయి. మన శరీరానికి తగిలితే తగిలినచోటల్లా దద్దులు రావడం ఖాయం. ఆ గొంగళ్ళు ఆ ప్రాంతంలో అందరూ వాడరు. మామూలువాళ్ళు కాస్త మృదువైన గొంగళ్ళు వాడుతారు. ఈ సాధకులు మాత్రం లోపల కౌపీనం తప్పిస్తే మరెలాంటి ఆచ్ఛాదనా లేకుండానే ఈ గొంగళ్ళు నిరంతరం కప్పుకునే వుంటారు. ఆ గొంగళ్ళు నిరంతరం వారి శరీరాన్ని బాధ కలిగిస్తూ వుంటాయి. అది నిర్వవాదాంశము. 'మీరు ఇలాంటి మొరటు గొంగళ్ళు ఎందుకు ధరిస్తారు, అందరిలాగా కాస్త మృదువైన గొంగళ్ళు ఎందుకు ధరించకూడదు?' అని నేను వాళ్ళను అడిగాను. వాళ్ళ సమాధానం : 'మన ప్రారబ్దానుసారం మనం అనుభవించవలసిన అనేక శరీరబాధలు వుంటాయి. అవి ఎప్పుడు అనుభవానికి వస్తాయో చెప్పలేము. ఇలాటి గొంగళిద్వారా అనుక్షణం కొంతబాధ అనుభవిస్తుంటే ప్రారబ్దవశాత్తూ ఎక్కువగా అనుభవించవలసిన బాధలు ఒకేసారి మనకనుభవానికి రాకుండా వుంటాయి. కనుక పెద్ద జబ్బుతో సాధనకు అనర్హులమయ్యేకంటే నిరంతరం కొంత ప్రారబ్దాన్ని అనుభవిస్తూ దైవకృప కొరకు కృషిచేస్తుండడం మంచిది. కనుక ఈ చన్నీటిస్నానాలు, తడిగుడ్డలు వంటి సాధనలద్వారా మన ప్రారబ్దం చాలా త్వరగా ఖర్చయి మనకు

భవిష్యత్తులో తెరిపి చిక్కడం జరుగుతుంది. ఉపవాసాల ద్వారాకూడా ఇదే జరుగుతుంది. ఐతే ఆ సాధన చేసే వారి దృక్పథం, దృష్టి అలా ప్రారబ్ధం క్షయం చేసుకోవడమేనని ఉండాలి'' అని వివరించారు.

ఇది అక్షరాలా నిజమని నట్టేటి లక్ష్మమ్మ, (మనుబోలు) వారి అనుభవం. నెల్లూరు నవాబుపేటలో బాలికల పాఠశాల దగ్గర టీ కొట్టు నడిపే ఆమెకు గడ్డలులేచాయి. ఆమె తలుపూరు నారాయణ దాసు ఆశ్రమంలో గోతాలపై శ్రీస్వామివారి చుట్టూ ప్రదక్షిణలు చేసి మూడవనాటికల్లా సంపూర్ణంగా విముక్తురాలైంది. ఇలా ఎన్నో అనుభవాలున్నాయి. ఇవేగాక నేను 1986సం॥లో షిర్డి వెళ్ళినపుడు అర్ధరాత్రివేళ శ్రీ శివనేశన్ స్వామివారు గురు స్థానంలో ప్రదక్షిణలు చేస్తున్నారు. 108 చేశారో, 216 చేశారో తెలియదు. అంత దీక్షగా, అంతసేపు, ఆవేళలో ప్రదక్షిణలు చేయడం ఎందుకు? ఆ ప్రదక్షిణల ద్వారా ఆ సిద్ధపురుషుడు సాయినాథుని మెప్పిస్తున్నారనుటకు తిరుగులేదు.

## ప్రారబ్ధం ఖర్చు

ఒక రోజున మాస్టరుగారు చిత్రమైన విషయం చెప్పారు. అలాగే మనం కూడా చేస్తే ఏమౌతుందో నేను పరీక్షించి చూడలేదు.

శ్రీమాస్టరుగారికి ఎప్పుడూ నోరంతా పూసి చాలా బాధపెట్టేదట. ఎన్ని మాత్రలు, ఆయింట్‌మెంట్స్ వాడినా తగ్గలేదట. వారే రుగ్మతకైనా వైద్యం చేయించుకునేవారు. ఎక్కువగా హోమియోమందు తాను తీసుకుంటూ అందరికీ ఇప్పించేవారు. మందు తీసుకోవడం, అందుకు ఖర్చు భరించడం కూడా ప్రారబ్ధంలో భాగమని చెప్పేవారు.

ఈ నోటి పూత ద్వారా తనకు ప్రారబ్ధం నెమ్మదిగా అనుభవమై చాలా టైం పట్టేటట్టుందనిపించిందట. అందుకని ఆ కర్మశేషాన్ని విపరీతంగా తెచ్చిపెట్టుకొని కొన్నిగంటలసేపు తీవ్రమైన బాధ అనుభవిస్తే ఆ కర్మశేషం సంపూర్ణంగా అనుభవమై దానినుండి విముక్తి పొందవచ్చునని మాష్టారు ఎర్రని ఆవకాయ ఊరగాయ తీసుకొని నోటినిండుగా పెట్టుకున్నారట. బాధకు కళ్ళనీళ్ళు కారుతున్నా తన పట్టు వదలలేదట. అప్పుడు క్రమంగా తగ్గనారంభించి తెల్లవారేసరికి అసలే లేకుండాపోయింది.



## వేదాలేమి చెపుతాయి?

మాష్టరుగారు వెంకటగిరిలో ఏదో మాట్లాడుతున్నారు. ఎవరో ఒకతను చక్కగా డ్రెస్‌చేసుకొని వచ్చి, ''వేదాలేమి చెపుతాయండి?'' అని అడిగాడు. వెనుకముందు చూడకుండా మాష్టరుగారు చెప్పారు.

''వేదాలు ఈ మాయామయ సృష్టిని వర్ణిస్తాయి. సృష్టంతా వివిధ ఋతువులు గల్గిన దృశ్యమాన జగత్తుగా ఉంటే, దీనిని వివిధ వర్ణములుగల్గి తన చుట్టు తాను తిరిగే తెరచివుంచిన గొడుగుగా ఉంటే అందులో మన దృష్టికి గోచరించే భాగాన్ని వేదాలు వర్ణిస్తున్నాయి. నిరంతరం పరిభ్రమిస్తుంది గనుక వివిధ ఋతువులతోగూడి అనుక్షణమూ నిత్యనూతనంగా దర్శనమిస్తున్నదని వేదాలు ఈ సృష్టిని వర్ణిస్తాయి'' అని చెప్పారు.

''సంఘంలో మీ కృషిపట్ల కొందరిలోని (హేతు, నాస్తికవాదులు) వ్యతిరేక భావాలే నేటి మీ ఇబ్బందులకు కారణం సార్. కుడిఎడమ చూచుకుంటూ కాస్త నెమ్మదిగా మీ ప్రచారం సాగించండి, అన్నవారితో, ''మన కారు జోరుగా పోతున్నట్లు గుర్తేమిటి? ఎదురుగాలి ఎంత బాగా వస్తుంటే మన కారు అంత జోరుగా పోతుందని గుర్తు. మనకారు కదలకుంటే ఎదురుగాలే ఉండదు. మనకు ప్రస్తుతం ఎదురుగాలి బాగా ఉంది గనుక మనకారు జోరుగా పోతున్నదని అర్థం'' అన్నారు ఒకరోజు.

చెప్పినట్లు సాధన చేయక అనవసర ప్రశ్నలు వేసి అతితెలివి ప్రదర్శించే వారికి మాష్టరుగారు ఒకరోజొక కథ చెప్పారు :

ఒక రూము నిండుగా బంగారు కడ్డీలు, నాణాలు పోసి తలుపులు తాళం వేసి ఉంచారు. ఒకడు బాధపడుతుంటే ఆ రూము తాళంచెవి అతని చేతికిచ్చి ఆరూములోని బంగారు కడ్డీలు, నాణాలు కావలసినన్ని తీసుకుపోయి నీ కష్టాలు తీర్చుకోమన్నారు. అతడు వారిదగ్గర ఆ రూము తాళము చెవి తీసుకొని ఆ రూము ద్వారము దగ్గర నిలబడి ఇలా అనుకోసాగాడట : ''ఈ రూములో అంత పెద్ద నిధి ఉంటే ఇలాంటి తాళం బుర్రవేస్తారా? ఈ తాళం బుర్ర ఇనుముతో చేశారేమిటి? ఈ తాళం బుర్రకు ఎన్ని లివర్స్ ఉన్నాయి? అంత నిధి వుంటే దీనికి కాపలా ఎవరినీ పెట్టలేదేమిటి? అని ఇంకా

ఎన్నో ప్రశ్నలు వేసుకుంటూ ఆ రూము ముందు నిలుచొని జాప్యం చేస్తున్నాడుగాని రూము తలుపు తీసి మాత్రం చూడలేదు. అంతలోనే అతడు పెద్ద దొంగ అని నిర్ణయించుకొని సైనికులు వచ్చి అతనిని పట్టుకువెళ్ళి జైలులో వేశారు. ఇలాంటిది మన సంగతి. చెప్పినట్లుచేసి ఆధ్యాత్మికశక్తి పొందక అనవసరమైన ప్రశ్నలతో కాలయాపన వల్ల లాభమేమిటి?'' అని బోధించారు.

## మన పూజను బొమ్మలాటలతో పోల్చారు!

మనం చేసే పూజను మాష్టరుగారు చిన్నపిల్లల బొమ్మలాటతో పోల్చారు. ''బొమ్మరిల్లు అని ఇసుకతో కట్టవేసి దానిని ఇల్లు అంటారు చిన్నపిల్లలు. అందులో అనేక ఇసుక కుప్పలుపెట్టి ఇది అమ్మ, ఇది నాన్న, ఇది తమ్ముడు అంటారు. ఇది అన్నం, ఇది కూర అని చెబుతుంటారు. మనమూ అంతే. అలాంటి ఆట పటాల దగ్గర ఆడుకొని తిరిగి వస్తాము. అక్కడ ఆడిన ఆటకు అర్థం తెలుసుకోము. మన నిత్య జీవితంలో ఆ ఆటను పోలిన నిజమైన పనులు చేయము. మరి ఫలితం ఎలా వస్తుంది?'' అంటారు పూజ్యశ్రీ మాష్టరుగారు.

ఇతరుల కొరకు మనం ప్రార్థనచేయడం, ప్రదక్షిణలు చేయడం, పారాయణ చేయడం మాష్టరుగారు అంగీకరించేవారు కాదు. వారికది చేయడం మంచిదైతే చేయమని శ్రీసాయినాథునకు విన్నవించి వదలమని చెప్పేవారు. వారు సర్వజ్ఞులు అనే మన విశ్వాసానికి అది గుర్తని చెప్పేవారు. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో ఆ వ్యక్తులు పారాయణ, ప్రదక్షిణ చేయలేని పరిస్థితులలో వారికి బదులు మనం చేయడం అంగీకరించేవారు. ఒక విషయం మాత్రం ఖరాఖండీగా చెప్పేవారు - ఇతరులకొరకు మనం ఆ సాధనలు చేసిన ప్రతిసారి ఆయా వ్యక్తులు మేలు పొందకుండా మనం అడ్డుకుంటున్నామని గుర్తించమని హెచ్చరించేవారు. మనమలా చేస్తుంటే వారికి బాబాపై విశ్వాసం కలిగేదెలా? వారికొరకు వారే సాధనచేస్తూ ప్రార్థన చేస్తుంటే బాబాగారి కృప, శక్తి సామర్థ్యాలు వారికి చక్కగా అవగాహన అనుభవానికి వచ్చి - భవిష్యత్తులో మేలు పొందుతారు. ఇతరుల కొరకు మనం ఎన్నిసార్లు సాధన చేయగల్గుతాము? అలా ఎంతమంది కొరకు సాధన చేయగల్గుతాము? అని చెప్పేవారు.



## మరణభీతి

''సార్! శ్రీస్వామివారు 'ఆశపోతే అంతా పోతుంద్లాయ్యా' అన్నారే అది నిజమేనా? నాకెలాంటి ఆశలేదు. నా సాధన పూర్తయినట్లేనా?'' అని అడిగాను. ''ఆశ అంటే జీవించాలనే ఆశ కూడా ఉండకూడదు.'' అన్నారు. ''నాకేమీ జీవించాలనిలేదు. ఇప్పుడైనా చచ్చేందుకు సిద్ధమే సార్'' అన్నాను ఎంతో గర్వంగా. ''మరణభీతి అంటే ఏమిటో ఆ టైం వచ్చినప్పుడు తెలుస్తుంది. ఇప్పుడు కాదు'' అని మౌనం వహించారు. ఇక నేనేమీ మాట్లాడలేదు.

ఈ సంభాషణ జరిగిన ఒక వారంరోజులకు ఎవరో మాష్టరుగారి సత్సంగ రూములో ఏదో దుంప చెక్కు తీసేసి స్లైసెస్‌గా కోసి బాబా ముందుంచి వెళ్ళిపోయారు. ఆ స్లైసెస్‌నుండి నీరు చుక్కలు చుక్కలుగా ఊరి స్లైసెస్‌నిండా ఉన్నాయి. మాష్టరుగారు అక్కడే పడుకొని ఏదో చదువుకొంటున్నారు. వచ్చిన ప్రతివారూ అదేమిటని అక్కడున్న నన్నడుగుతున్నారు. సైగలతో నాకు తెలియదని చెపుతున్నాను. చివరకు కుతూహలమాపుకోలేక చూపుడువ్రేలితో ఆ నీటి బిందువులు తాకి నాలుక మీద రాసుకున్నాను. నాలుక బ్లేడుపెట్టి కోసినట్లు బాధ, ఊసెయ్యాలని నాలుక కదిలిస్తే ఇంకా గొంతులోకి పోతున్నది. అదొక విషపదార్థమని, దాన్ని నాలుకకు తాకించాను గనుక చావడం ఖాయమనీ భయంతో వళ్ళంతా చెమటలు పట్టాయి. జుట్టు పీక్కున్నాను. చొక్కా గుండీలు తెగిపోయాయి. అక్కడికొచ్చిన విద్యార్థులు మాష్టరుగారికి చెప్పినా వారేమీ పట్టించుకోలేదు. చివరకు నాబాధ చూడలేక ఒకరు మాష్టరుగారు చదివే పుస్తకాన్ని ప్రక్కకు లాగి చెప్పారు. ''ఏమైంది'' అని అన్నారాయన. నేను వేలుతో సైగచేసి దాన్ని రుచి చూచానని చెప్పాను. ''ఓస్ అంతేనా! విభూతి నాలుకకేసి రుద్ది పుక్కిలించి ఉమ్మేయ''ని చెప్పారు. నాలుక తెగిపోయేటట్లు ఉమ్మేశాను. మూడు వంతులు బాధ తగ్గింది. తర్వాత క్రమంగా తగ్గి పోయింది. మరణ భీతి అంటే ఏమిటో ఆక్షణంలో అర్థమయింది. ఆవిషయం మాష్టరుగారు అడగలేదు. నేను చెప్పలేదు. కానీ సత్యం అర్థమయింది. అది దురదకంద అని తర్వాత తెలిసింది.

**వేదమంత్రం!**

నా జీవితంలో వేలసార్లు గుర్తు వచ్చేమాట - నన్ను ఎంతో సంస్కరించిన మాట ఇది. మీ దృష్టిలో స్వల్పంగా ఉండవచ్చు. నాకది ఒక వేదమంత్రంగా అనుక్షణం గుర్తువస్తుంది. ప్రతి విషయంలోను అనంతకోటి **adjustments**, శతకోటి సలహాలిచ్చేది నా స్వభావం. దీని ద్వారా నాతో కలసి పనిచేయాలంటే తోటివారికి చాలా చిరాకేస్తుంది. (అని ఈరోజు తెలుస్తున్నది కానీ అప్పుడు తెలిసేది కాదు).

ఒక సందర్భంలో మాస్టరుగారన్నారు : ''డాక్టరుగారు మనకు ఆపరేషన్ చేస్తుంటే మనం 'ఈ కత్తెర ఇలా త్రిప్పు, కాస్త నెమ్మదిగా కట్‌చెయ్, ఈ ఫోర్‌సెప్స్ ఇలా పట్టుకో' అని చెపుతుండడం ఎంత సబబుగా ఉంటుంది? ఆ పనిచేసే వారికి స్వేచ్ఛనిచ్చి చేయనివ్వాలి గాని ప్రతి చిన్నదీ మన ఇష్టానుసారం జరగాలని తలచడం మంచిదికాదు'' అని పలికారు.

ఆమాటతో వారే ఆధ్యాత్మిక శక్తిని నాలో ప్రయోగించారో నేను చెప్పలేనుగాని నా ప్రవర్తన పూర్తిగా మారిపోయింది. అప్పటినుంచి **mild suggestion** ఇవ్వడం తప్ప మారుమాట్లాడను. పని పూర్తిగా పాడైపోయినా సరే! వారి సలహా నన్ను కట్టేసింది. అందువల్ల నాకు అంతులేని ఆనందమే మిగిలింది.

మరొకరోజన్నారు – ''పశుపక్ష్యాదులు, జన్మించింది మొదలు చనిపోవువరకు ఒక్కసారి కూడా నోరు కడుక్కోవు. కానీ వాని నోటికి సహజ సిద్ధంగా ఉండే వాసన తప్ప దుర్వాసన లేదు. మహనీయులుకూడా ఒక్కసారికూడా నోరు కడుక్కోకపోయినా వారి నోటికీ దుర్వాసన ఉండదు. మరి మనం రోజుకు ఎన్ని పర్యాయాలు బ్రష్‌చేసుకున్నా మన నోరు మరలా మరలా దుర్గంధంగానే ఉంటుంది? ఎందుకు? మానవుడు నోటితో చేయరాని పనులు చేస్తుంటాడు గనుక'' ఇది ఎంత గొప్ప సత్యమో గదా!

**పులి నోటబడ్డ వేట!**

''పులి నోటబడ్డ వేటవలె సద్గురు కృపకు పాత్రుడైనవాడెప్పుడూ విడువబడడు. సద్గురువు పులి వంటివాడు. మనం వేటవంటివారము. మన



కృషి అంతా పులినోటిలో పడేందుకేనని గట్టిగా విశ్వసించి అందుకు అర్హత సాధించాలి. అందులోనే సాధకుని సామర్థ్యమంతా ఇమిడి ఉంది. సద్గురుని కృప పొందాక ఇక మన పని పూర్తయిందన్నమాటే. వారి కృప పొందడమనే కర్తవ్యం మనపై ఉంది. అందుకే పూర్వజన్మలో చేసింది మరుజన్మకు పెట్టుబడిగా మనకు లభిస్తుందని పెద్దలు చెప్పారు. ఇక్కడ పూర్వజన్మ అంటే తల్లి గర్భవాసంలో జన్మించడమనే భావం చాలా తప్పు. ప్రతి సెకండు మరుజన్మ అనేది నిజమైన అర్థము. అందుకే శాస్త్రంలో ఇప్పుడు చేసే మన ప్రయత్నం ద్వారా పూర్వం చేసిన కర్మలను దహించివేస్తూ ముందుకు సాగు అని చెప్పారు. అందుకే గీతలో యోగి తన ప్రయత్నము ద్వారా మనో మాలిన్యాన్ని తొలగించుకోవాలి అని చెప్పారు. గనుక మన ప్రయత్నానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. అందుకే బుద్ధుడు శ్రద్ధ అనకుండా కేవలశ్రద్ధ అంటారు. భక్తి అనకుండా కేవలభక్తి అని adjective వాడారు. గనుక ఎటుచూచినా మన ప్రయత్నం గొప్ప పాత్ర వహిస్తుంది. ఇతరుల ప్రయత్నానికి మనం సహకరించి ముందుకు సాగే విధంగా చేయడంగూడా సాధనే. అలా సహకరించడం పుణ్యకర్మే అయినా అది మన సాధనను ముందుకు తీసుకు పోతుంది'' అని శెలవిచ్చారు.

వార్తాలాపం

''సార్! ఇన్ని గ్రంథాలు మీరు ఎలా సేకరించారు? వాటన్నిటిని ఎప్పుడు చదవగలిగారు?'' అన్నాను.

''శ్రీసాయినాథుని అనుగ్రహం వలన నా చేతికి ఆయాగ్రంథాలు ఎవరి ద్వారానో అందించబడుతుంటాయేగానీ నా ప్రయత్నమంటూ ఏమీ ఉండదు. ఆ పుస్తకం తెరిచినప్పుడు ఆయన కృపవలన నాకు ఏవిషయం కావాలో అదే పేజీ తెరుచుకునేది. అలా నాలుగుసార్లు త్రిప్పగానే ఆ గ్రంథంలో నాకు కావలసిన విషయాలన్నీ వచ్చేస్తాయి. ఆ తర్వాత A to z ఎంత చదివినా ఇక నాకు కావలసిన ఒక్క విషయమూ అందులో కనిపించదు. విజ్ఞాన వీచికలు అనే గ్రంథం చివర ఇచ్చిన 71 గ్రంథాలు అలా వారి కృపతో చదివినవే. అవి లభించడంకూడా వారి దయే. ఉదాహరణకు వార్తాలాపం అనే గ్రంథం నా దగ్గరకు చేరడం చూడండి, ఎంత గమ్మత్తుగా ఉందో. నేనొకసారి ట్రెయిన్‌లో

పోతున్నాను. ఎవరో ఒకతను చక్కగానే ఉన్నాడు. శ్రావ్యంగా ఒక పాట పాడి చేయిచాపాడు. తలా పావలా, అర్ధరూపాయి ఇచ్చారు. చాలా డబ్బు దొరికింది, వెళ్ళిపోయాడు. తర్వాత ఒక పది నిమిషాలకు నిజంగా ఒక గ్రుడ్డివాడొచ్చి భక్తి పాట పాడినా ఎవ్వరుగాని ఒక్క పైసా ఇవ్వలేదు. నేనతనికి ఒక అర్ధరూపాయి ఇస్తూ, 'ప్రాప్తాప్రాప్తములంటే ఇలానే ఉంటాయి' అన్నాను. వెంటనే ప్రక్కనున్న ప్రయాణీకుడు ''నీలాంటి కుర్రవాళ్ళంతా ఇట్లాగే అదృష్టం, ప్రాప్తం అంటుండబట్టే దేశం ఇలా ఏడుస్తుంది'' అన్నాడు. ఇక నా సంభాషణ, ఆ పెట్టెలోనివారి ప్రశ్నలూ మొదలైనాయి. అందరూ నాకు వ్యతిరేకంగా వాదించేవారే. నేను స్థిమితంగా సశాస్త్రీయంగా వారికి సమాధానలిస్తున్నాను. చివరిగా ఒక వృద్ధుడు ''నీవెవరు బాబూ'' అన్నాడు. ''ఏం బాబూ, మీరు కూడా అడగాలంటే అడగండి నేనెవరైతేనేమిలేండి'' అన్నాను. ''కాదు బాబు నీవు వయస్సులో చిన్నవాడవైనా సశాస్త్రీయంగా అందరికీ సమాధాన మిస్తున్నావు. చాలా అదృష్టవంతుడవు. నీవెవరు బాబు'' అన్నాడు. ''నేను ఎక్కిరాల అనంతాచార్యులవారి 4వ అబ్బాయి భరద్వాజ''నని చెప్పాను. వెంటనే వారు తన దగ్గరున్న స్కూలు సంచి నుండి 'వార్తాలాపం' అనే గ్రంథం తీసి నాకిస్తూ, ''దీన్ని నీకివ్వాలని చాలారోజులనుండి మోస్తున్నాను. నా మిత్రులంతా నీకే ఇవ్వమనడంతో అలా మోస్తున్నాను. నీ అడ్రసు తెలియలేదు'' అని అంటూ ఆ గ్రంథం నాకిచ్చారు. సుమారు మూడు నెలల తర్వాత ఆ గ్రంథం ఒక రోజు తెరిచాను. అందులోని విషయాలన్నీ నా భావాలే. దాంతో ఆ గ్రంథాన్ని సత్సంగంలో చదివాను. దానిని బరోడా రాణిగారు ప్రింట్ చేయించారు. అది ఎంత గొప్పగ్రంథమో చెప్పలేను. ఆత్మజ్ఞానులైన ప్రకాశానంద స్వామివారు, నిత్యానందస్వామివారి సంభాషణలే ఆ గ్రంథం. ఆ సంభాషణలన్నీ శాస్త్రాధారాలతో ఉండడమే గొప్పదనం.''

## మహనీయులను గుర్తించడం!

శ్రీమాష్టరుగారు మహనీయులను గుర్తించేందుకు రెండు పద్ధతులు చెప్పారు. 1. ఎవరి సన్నిధిలో మన మనస్సు అంతర్ముఖమై కాలగతి తెలియదో, లౌకికమైన మానసికవత్తిడులు తలెత్తవో అది మహనీయుల



సన్నిధి అని గుర్తించు. అయితే ఆధ్యాత్మిక జ్ఞానం బొత్తిగా లేనివారికి అలాంటి అనుభవం జరిగినా వారది మహనీయుల సన్నిధి అని గుర్తించలేరు. అట్టివారికి మరొక సులభమార్గం చెప్పారు. ఆ రెండవమార్గం ఏమిటంటే ఆ మహనీయుని సన్నిధిలో ఏది వీలుకాదో, అది వీలు కావాలని, జరిగితీరాలనీ మనసులో చెప్పుకొని టైం పెట్టుకొని నామస్మరణ చేస్తూ వారి సన్నిధిలో కూర్చుంటే వారు మన మనసులోని మన కోరిక గుర్తెరిగి మనం పెట్టుకున్న టైం లోపలే తప్పక మనలను అనుగ్రహించి మన కోరిక తీరుస్తారు. ఉదా : శ్రీవెంకయ్యస్వామి వారు నా మనస్సులోని కోరికలు చిత్రంగా తీర్చి నన్ననుగ్రహించినట్లు.

## మహనీయుల సన్నిధి ప్రభావం – మన దుష్ట సంస్కార నిర్మూలనం

జాజ్వల్యమానంగా వెలిగే మంట దగ్గర కూర్చున్నవారు తమ గుడ్డల తడి ఆర్పమని ఆ అగ్నిదేవుని ప్రార్థించనక్కరలేదు. మనమలా అడగకుండానే ఆ వేడికి మన గుడ్డల తడి ఆరిపోతుంది. అలాగే అనేక సాధనలద్వారా మనం మన దుష్టసంస్కారాలను నిర్మూలించుకోలేకపోవచ్చు. కాని మహనీయుల సన్నిధిలో కూర్చున్నంత మాత్రాన వారి సన్నిధి ప్రభావం చేత మన దుష్ట సంస్కారాలు దహించివేయబడతాయి. వారిని మనం ప్రార్థించనక్కరలేదు. సాధ్యమైనంతసేపు వారిసన్నిధిలో ఉండడమే మనం చేయవలసిన పని.

## త్రికరణశుద్ధి లోపం

ఒకసారి మాటల సందర్భంలో మాష్టారు ఇలా అన్నారు : ''మానవులకు త్రికరణశుద్ధి లోపించింది సుబ్బరామయ్యా! ఎంత చిత్రమో చూడు! రోజుకు ఎన్నిసార్లయినా అష్టోత్తరం చేస్తాము కాని ఆవిధంగా ఎప్పుడైనా చింతన చేశామా? 'బహిరంతరములయందు వ్యాపించియున్నావు, మా హృదయములో ఉన్నావు, ప్రాణవాయువు, ప్రాణచలనము నీవే. నీవులేని తావేలేదు. సర్వకాల సర్వావస్తలయందు ఉన్నావు' అన్నాము కానీ కాలము వృథా చేయకుండా తీరిక సమయాలలో నైనా భగవంతుని ఈ గుణములను

చింతన చేస్తున్నామా? మనము త్రాగే నీరు భగవంతుడు ప్రసాదించినదేగదా? అంతకంటే తీర్థమేమున్నది? అంతకంటే పవిత్రమైనదేముంది? ఈ విషయ మెప్పుడైనా గమనించి చింతన చేశామా? ప్రాణవాయువు భగవంతుడే. ప్రాణచలనమూ భగవంతుడే. ఆ దృష్టితో శ్వాసను ఎప్పుడైనా గమనించామా? పృథివి, ఆపస్సు, తేజస్సు, వాయువు, ఆకాశము నీవేనని అష్టోత్తరంలో చెపుతున్నాము. ఆపస్సంటే నీరు కదా! ఆ నీటితో ఎన్నో మార్లు స్నానం చేస్తూ కూడా భగవంతుడే నా శరీరానికి స్వస్థత చేకూర్చేందుకు ఈ నీటి రూపంలో నాకు సహకరిస్తున్నాడు అని ఎప్పుడైనా తలంచామా? దేహస్థ పృథివ్యాపస్తేజో వాయురాకాశ స్వరూపాయ నమః అంటున్నాము. ఆ పంచ భూతముల కలయికగా ఈ దేహమున్నది. ఆ పంచభూతములూ భగవంతుడే. ఈ దేహాన్ని ఆడించే శక్తి భగవంతుడే గదా! పై విధంగా ఎప్పుడైనా చింతన చేస్తున్నామా? ఇదంతా త్రికరణశుద్ధి లోపం కాదా? తీరికవేళల్లో నైనా ఆలోచనా స్రవంతిలో కొట్టుకొనిపోకుండా పై విధంగా చింతన చేస్తుంటే భేదమనే అడ్డుగోడ తొలగుతుంది. సాయికృప కొంతవరకైనా పొందగలుగుతాము'' అని వివరించారు.

## ఉదాహరణలివ్వడం

ఆధ్యాత్మ విద్యను ఉదాహరణలతో వివరించడంలో వారికి వారేసాటి. ఆలోచనా స్రవంతి నరికట్టేందుకు సాయి ఒక మార్గం చెప్పారు. ''నన్ను కేవలం ఆనందంగా నన్నే ధ్యానించు. అది వీలుకాకుంటే నఖశిఖ పర్యంతం నా రూపాన్ని ధ్యానించు, అది చేతకానప్పుడు నా లీలలు మననం చెయ్యి. అదీ వీలుకానప్పుడు నా నామాన్ని ప్రేమతో స్మరించు'' అని చెప్పారు. దీన్నే మాస్టరుగారు మరొక కథ ద్వారా వివరించేవారు. ఒక కోటీశ్వరుని కుమారుడు ప్రపంచంలో తన తండ్రివెళ్ళే ప్రతిదేశానికి వెళ్ళి అక్కడ తన తండ్రిపేరు ప్రతిష్ఠలకు భంగం కలిగేటట్లు ప్రవర్తించేవాడట. అందుకా తండ్రి తన కుమారునకు అడిగినంత ధనం ఇస్తానని, అతను మాత్రం విదేశాలకు రాకుండా భారతదేశంలోనే తిరగమని బతిమాలి ఒప్పించాడట. కుమారుడు అలాగే తిరిగేవాడు. క్రమేణా డబ్బు ఆశచూపి వారి రాష్ట్రంలోను, ఆ తర్వాత



వారి జిల్లాలోను, ఆతర్వాత వారి మండలంలోను, అటు తర్వాత వారి గ్రామము, ఆపైనవారి వీధి, ఆ తర్వాత వారి ఇంటి ఆవరణము, ఇంటిలో ఒకగదిలో తిరిగేటట్లు డబ్బు ఆశతో ఆపిల్లవాని తిరుగుడు మాన్పి క్రమంగా వారింట్లో రూములో కూడా ఒక కుర్చీలో కదలకుండా కూర్చోవాలని డబ్బు ఆశనే ఎరచూపి వశం చేసుకొని సఫలీకృతుడయ్యాడు. అలానే మనం కూడా మన మనస్సును ఆనందంగా ధ్యానించడం (నిర్గుణధ్యానం), సాకారధ్యానం, లీలాశ్రవణం, మననం, నామస్మరణలనే సాధనలలో నిమగ్నంచేస్తూ మనసు నరికట్టాలని, దాని తిరుగుబోతు స్వభావాన్ని క్రమంగా మానాలని వివరించేవారు. ఇది ఎంతటి చక్కని ఉదాహరణో చూడండి.

## భగవంతుని సహాయం

''భగవంతుని సహాయం ఎవరికి లభిస్తుంది? ఒకని బండి బురదలో ఇరుక్కుపోయింది. 'దేవుని సహాయముంటే ఎవరైనా వచ్చి బండినెడితే బయటికివస్తుంది. మనమేమి చేయగలము' అని గట్టునున్న చెట్టుక్రింద చల్లగా కూర్చున్నాడొక వేదాంతి. అటువంటప్పుడు ఆ దోవన వచ్చే వాళ్ళనుకూడా ప్రక్క ద్రోవకు వెళ్ళేటట్లు చేస్తాడు భగవంతుడు. ఒకవేళ దారితప్పి ఆ మార్గాన ఎవరైనా వస్తే వారిని బండినెట్టమని బతిమాలినా, ''ఏమీ! మేము నీకు బండినెట్టేవాళ్ళలాగ కనబడుతున్నామా'' అని నెట్టకుండానే వెళ్ళిపోతారు.

అట్లాగకుండా మరియొకడు చెట్టుక్రింద కూర్చోకుండా బురదలో దిగి పంచె ఎగగట్టి చెమటలు పట్టేటట్లు బండిని నెట్టే ప్రయత్నం చేస్తుంటే ప్రక్కదోవనవెళ్ళే వాళ్ళనుకూడా భగవంతుడు ఆమార్గానికి తీసుకొచ్చి, అతని కష్టంచూచి అతడడుగకుండానే బండినెట్టి బయట పడేస్తారు. గనుక ఇబ్బందులలో కష్టానికి వెరువక ఎవరు శ్రమ చేస్తారో వారికి భగవంతుని సహాయం లభిస్తుంది. కాని నోటితో భగవంతుడే రక్షిస్తాడని చెపితే చాలదు'' అని బోధించారు.

ఒకరోజు ఒకరైతు వచ్చి చాలా దూరం ప్రాధేయపడుతున్నాడు. ''మీరొక్కసారి బాబాకు ప్రార్థన చేయండి, నా కష్టాలనుండి గట్టెక్కుతాను''

అన్నాడు. ''నేను ప్రార్థన చేస్తే మీ కష్టాలు తీరడమేమిటి? మీరే బాబాను ప్రార్థించండి, ఆ కరుణామయుడు అందరినీ రక్షిస్తాడు'' అన్నారు మాస్టరు. ''లేదు సార్! నాకు ఆ నమ్మకముంది, ప్రార్థన చేస్తాను, అని ఒక్కమాట చెప్పండి, నేను వెళ్ళిపోతాను'' అన్నాడతడు. ''అలా చెప్పడం మీకు వ్యర్థమైన ఆశలు కల్పించడమే! నేను అలా చేయకూడదు. మీరు శ్రద్ధగా, ఓపిగ్గా బాబా చరిత్ర పారాయణ చేయండి. ఆయన తప్పక కరుణిస్తారు'' ''ఎన్నిసార్లు చేయాలి సార్!'' ''ఇదేమి అంగడిలో వస్తువా? ఇంత అని వెల నిర్ణయించేందుకు, ఆయన కృప చూపేంతవరకు అలా పారాయణ చేయవలసిందే.'' ఇలా వారి సంభాషణ చాలాసేపు జరిగింది. శ్రీమాస్టరుగారు ఎందుకలా తన మాటపై నిలబడి వారికి ప్రార్థన చేస్తాను అని చెప్పలేదో నాకు ఆశ్చర్యమైపోయింది. ఆయన వెళ్ళిపోయాక మాస్టారుగారి నడిగాను.

''సార్! మీరు విద్యానగర్‌లో వుండగా ధారాళంగా మీ పిడికిలి తెరచి దానం చేశారు. ఒంగోలు వచ్చాక యింతగట్టిగా పిడికిలి బిగించారేమిటి సార్?' (విద్యానగర్‌లో వారి సంకల్పంతో విచ్చలవిడిగా లీలలు చూపారు. ఒంగోలులో అది లేనేలేదు. అని నాభావము). మాస్టరుగారన్న మాటలు ఎంత గొప్పగా అవి వారి అవతారకార్యాన్ని ఎంతగా వెల్లడిచేస్తాయో చూడండి. ''ఎందుకు సుబ్బరామయ్యా, ఎన్నిచేసినా వ్యక్తిలో moral transformation రానప్పుడు మనం చేసే సహాయమంతా బూడిదలో పోసిన పన్నీరవుతుంది. నా దగ్గర ఎంతో మేలుపొందిన ఈ వ్యక్తి తక్కువ కొలపాత్రతో కూలీలకు గింజలివ్వడం మానాడా? నాసిరకం గింజలు యివ్వడం మానాడా? ఇతనిలో ఏమార్పు రాలేదు. మార్పు తెచ్చుకోవాలన్న ఆలోచనలేదు. సాయిలీలామృతం యిచ్చి పారాయణ చేయమంటే చేయడు. ఈ కేసు సాయినాథులవారే చూచుకొంటారు, మార్పు రావడమా? లేదా? అనేది'' అని ముగించారు.

అంటే మన కష్టాలు తీర్చుకోవడంలోనూ, సాయికృప పొందడంలోను, పారాయణ పర్యవసానంలోనూ, మహాత్ములు ఆశించేది వ్యక్తిలో moral transformation. అసలు మనలో ఫలానా దోషాలున్నాయి అని గుర్తించి వాటిని పోగొట్టుకొనేటట్లు ప్రయత్నం చేయడం అన్నమాట. అది లేనపుడు వారు చేసే సహాయమంతా అడవిగాచిన వెన్నెల అవుతుంది అన్నమాట.



మనలో అట్టి నైతికపరివర్తన తేవడమే వారి అవతారకార్యమన్నమాట.

**శిక్షణ - శిక్ష** : విద్యానగర్‌లో మాస్టరుగారి ఇంటిముందుండే బాత్‌రూములో కుక్క ఈనింది. చిన్న చిన్న కుక్కపిల్లలు తిన్నగా నడిచి సత్సంగ రూంలోకి వస్తుండేవి. కుక్కకు రొట్టెపెడితే తనకే పెట్టినట్లు బాబా చెప్పియున్నారు. గనుక భక్తులు ఆ కుక్క పిల్లలను ఏమనేవారు కాదు. ఒకరోజు మాస్టరుగారు సత్సంగ రూములో ఉండగానే ఈ చిన్న కుక్క పిల్లలు ఆ రూము నుండి ఇంటిలోకి పోతున్నాయి. మాస్టరుగారు అక్కడున్న నాతో, ''సుబ్బరామయ్యా, ఈకుక్క పిల్లలకు ఒక్కొక్కటి తగిలించి బయటకు తరుము'' అన్నారు. నేను వాటిని కొట్టకుండా పట్టుకొని బాత్‌రూములో వదలిపెట్టివచ్చాను. ''సార్ - కుక్కను కొడితే నన్ను కొట్టినట్లేనని చెప్పారు గదా బాబా. మరి మీరు ఈ చిన్నపిల్లల్ని కొట్టమంటారేమిటి?'' అని అడిగాను. ''అవును - బాబా వాటిని శిక్షించవద్దన్నారు గాని శిక్షణ ఇవ్వవద్దని చెప్పలేదు. ఈరోజు మనమేసే దెబ్బ వాటికి శిక్షణేగాని శిక్షకాదు. ఈరోజు మనం వాటికట్టి శిక్షణ ఇవ్వకుంటే రేపు పెద్దవై ఇంట్లోకొచ్చి ఏమైనా చేస్తాయి. అప్పుడు నేనుగాకున్నా ఎవరైనా వాటిని బాగా కొడుతారు. గనుక ఇప్పటి మన శిక్షణ వాటికి భవిష్యత్తులో దెబ్బలు తప్పిస్తుంది. ఈ పెద్దకుక్కలు చూడు, బుద్ధిగా ఇక్కడే పడుకుంటాయిగాని ఇంట్లోకి పోవు. గనుక మన భావం ప్రధానం, కసితో కొట్టేది వేరు, శిక్షణ కొరకు కొట్టడం వేర''ని పాఠం నేర్పారు.

ఒకసారి ''ఆయన (బాబా) మనవైపు చూస్తుంటే మనం ఎక్కడో ఆలోచిస్తూ మనగొడవలో మనముండడం ఎంత అపచారం'' అన్నారు. కానీ ఈ మాట అక్షరసత్యమని ఈ రోజు నాకుండే ప్రగాఢమైన విశ్వాసం ఆ రోజు లేదు. కాని ఈ విషయం ఈ జన్మకు ఆచరణకొస్తుందని నాకు ఆశలేదు. అయితే ఆ కరుణామయుడు ''నేను ఈ విషయాన్ని ఆచరించ లేకున్నానే'' అనే హృదయవేదనను నాకొక క్రొత్త సంస్కారంగా ఈ జన్మకు అనుగ్రహించారు.

ఈ విషయాన్నే శ్రీమాస్టరుగారు మరొకవిధంగా కూడా చెప్పేవారు. ''మనం నిజంగా బాబా బిడ్డలమవడం సత్యమయితే మనం వారిని ఈపని

నెరవేర్చమని అడుగకపోయినాసరే, ముందు రాబోయే ఇబ్బందులు మనకు తెలియక పోయినా సరే వారికైవారే సరైన సమయంలో మనలను ప్రేరేపించి ఆయా కార్యాలను నెరవేరుస్తారు.'' ఉదాహరణకు మా కుమార్తె వివాహం ఇక మూడురోజులే ఉంది. నేను నిర్విరామంగా తిరుగుతున్నాను. బాబాను అడిగే మానసిక పరిస్థితిలేదు. నెల్లూరు వెళ్ళేందుకు ప్రయాణమై శ్రీ స్వామివారి మందిరం ముందు బయట నిలబడియున్నాను. గొలగమూడినుండి నెల్లూరుకు పోయేందుకుగల రెండు మార్గాలలోని బస్సులు ఒకేసారి వచ్చి నిలబడి నాకు తెలిసిన డ్రైవర్లయినందున వచ్చి బస్సెక్కమని ఇద్దరూ పిలుస్తున్నారు. ఒక్క నిమిషం నాకేమైందో తెలియదు. ఉన్నపళంగా కళ్ళుతెరచే టప్పటికీ ఈలోకంలో లేను. నేను మన లోకంలో కొచ్చేసరికి రెండు బస్సులూ వెళ్ళిపోయాయి. ఇక రెండుగంటల తర్వాతగాని బస్సులేదు. ''నా అర్జంటు పనులతో రెండుగంటలకాలం వృధా అయిందే. నేనెంత బుద్ధి హీనుడను'' అనుకుంటూ ఇల్లుచేరి కుర్చీలో కూలబడ్డాను. అంతే! కాబోయే అల్లుడు మోటారు సైకిల్‌పై నాకోసం వస్తున్నాడు. క్రిందటి రోజులలో రెండు మార్లు వాళ్ళ అన్నవాళ్ళు వచ్చారట. నేను లేను. మరి ఇప్పుడుకూడా నేను కనబడకుండా బస్సెక్కి వెళ్ళి ఉంటే ఏమవుతుందో బాబాకు తెలుసు. గనుకనే నాకు ఒక్కక్షణం స్పృహలేకుండా చేసి మమ్మలనిద్దరిని కలిపారు. ఆయన వచ్చే సంగతి నాకు తెలియదు. కానీ బాబా సర్వజ్ఞులు, సర్వసమర్థులు గనుక మనకేది మంచిదో అదే చేస్తున్నారు. నేను నెల్లూరుకు బస్సులో పోయే టైం కంటే కూడా ముందుగానే మా అల్లుని బైక్ మీద వెళ్ళాను. అది మాస్టరుగారి వ్యాఖ్యకు అర్థం.

''సార్! భగవద్గీతలో 'యుక్తాహార విహారస్య' అన్నారు. ఈ యుక్తాహారం అన్నదానికి మితాహారమని కూడా అర్థం చెపుతున్నారు. ఎంత తినడం మితాహారమవుతుంది?'' అన్న భక్తునితో శ్రీమాస్టరుగారన్నారు : ''ఎంత తింటే నీకు భుక్తాయాసం లేకుండా ఆకలితో వున్నప్పటి కంటె ఎక్కువ హుషారుగా పని చేయగలుగుతావో అదే మితాహారం. భుక్తాయాసం వచ్చిందాకా, తృప్తి కలిగిందాకా తిన్నామంటే అది మితాహారంకాదు. అమితాహారం'' అని సెలవిచ్చారు. నా బలహీనతలను గురించి శ్రీమాష్టారుగారికి విన్నవించి నేను



కనీసం శ్రీసాయీశుని ఆజ్ఞలను పాటించలేకున్నాను సార్ అంటే, ''పాటించేటట్లు చేయమని శ్రీస్వామివారికి నివేదించు'' అని ఒకసారి అన్నారు. ఇదే ప్రశ్న మరి కొన్నాళ్ళ తర్వాత అడిగాను. అప్పుడు, ''మన కోరికలను గూర్చి వాచా అడగడం మాని కార్యరూపేణా నిరూపించ ప్రయత్నించాలి'' అని సెలవిచ్చారు.

''వాచాశూరత్వం మాని కార్యశూరత్వం చూపు'' అని ప్రబోధించారు.

శ్రీనాగమునీంద్ర స్వామివారు శ్రీవెంకయ్యస్వామివారిని దూషించిన విషయం మాష్టారుగారికి చెబితే ''సాయి సాంప్రదాయంలో వచ్చినవారికి తప్ప మిగిలినవారి ప్రవర్తన అలాగే ఉంటుంది! అట్లాగని వారి జ్ఞానానికి లోటు లేదు'' అన్నారు.

శ్రీస్వామివారు చమురు లేకుండా చెట్టు కాల్చు అన్నప్పుడుగాని, సాయి ఉప్పు, కారం లేకుండా ఉండగలవా? అన్నప్పుడు గాని మాష్టారుగారు చెప్పినది అక్షర సత్యమని తెలుస్తుంది.

''నీ మనస్సు ఏరూపమైనా ధరించవచ్చు కాని మహనీయుల రూపం స్వప్నంలో ధరించడం వీలేగాదు. నీ స్వప్నంలో వారు కనపడివుంటే కేవలం వారు మనమీద గల దయతో అలా దర్శనమిచ్చి ఆ స్వప్నాదేశం యిచ్చారనేది నిస్సందేహం'' అన్నారు. కనుక దాన్ని అక్షరాలా గుడ్డిగా పాటించి తీరితే మనకు సర్వమూ సిద్ధిస్తాయి. ఇటు లౌకికంగాను, అటు పారలౌకికంగాను మనకిక కొదువేలేదు'' అన్నారు.

సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః
ఆచార్య శ్రీ భరద్వాజాయ నమః

# ఆచరణ

శ్రీ తాజుద్దీన్ బాబాగారు చెప్పిన అహింసా పద్ధతిని పూజ్యశ్రీ మాష్టారు ఎంత చక్కగా నరనరాల్లో జీర్ణము చేసుకొని ఆచరిస్తున్నారో ఈ క్రింది నా స్వానుభవం చాటుతుంది.

''మద్యము త్రాగినా తాగేవు, విగ్రహారాధన జరిగే చోట నివసించినా నివసించేవు, కాబాను తగులబెట్టినా పెట్టేవు కానీ మానవ హృదయాన్నెప్పుడూ గాయపరచవద్దు. కారణం భగవంతుని ఏడవ నిలయము మానవుని హృదయమై యున్నది.'' అన్నారు శ్రీ తాజుద్దీన్ బాబా.

దీన్నిబట్టి ఎదుటివారి అసమర్థతను, లోపాలను పదిమంది ఎదుట ఎత్తిచూపిస్తే ఆ వ్యక్తి తన హృదయంలో నొచ్చుకోవడం తథ్యం గదా! కోపతాపాలకు గురియైనప్పుడైనా సామాన్య మానవులు పై విషయాన్ని ఉల్లంఘించి నడుచుకోవడం తథ్యం. కోపతాపాల నీడే సోకని మాష్టరుగారి ఆచరణే మనకొక దివ్యబోధ.

ఒక వ్యక్తియొక్క ఇంగ్లీషులో వ్రాసిన డైరీ మాష్టరుగారి చేతిలో ఉంది. అందులోనుండి ఏమోచెప్పి ఆ డైరీ చదవమని నా చేతికిస్తున్నారు మాష్టరు గారు. వెంటనే ఆ పుస్తకం తీసుకోకుండా నేను, ''సార్! నేనది సరిగా చదువ లేను. ఒకవేళ చదివినా అర్థం చేసుకోలేను'' అన్నాను. ప్రక్కనే ఉన్న ఆ డైరీగల వ్యక్తి - ''గ్రాడ్యుయేటువి - పైగా టీచరు పనిచేస్తున్నావు ఆ మాత్రం చదివి అర్థం చేసుకోలేవా?'' అని హేళనచేయు ధ్వనితో అంటున్నాడు. వెంటనే మాష్టరుగారు మెరుపుకంఠంతో ''ఛ! నోర్మూయ్'' అన్నారు. అంతటితో ఆ సంభాషణ ముగిసింది. శ్రీ మాష్టరుగారు ఆ మాట ఎందుకన్నారో చదువరులు గ్రహించే ఉంటారు. మాష్టరుగారు ఆ మాటే అనకుంటే నిజంగా నేను నా అసమర్థతకు ఎంతో నొచ్చుకునియుండేవాణ్ణి. ''ఇతరులను



గాయపరచే మాట సత్యమైనదైనా! అది సత్యమేకాదు'' అన్నది ఇందుకేగదా! భగవద్గీత బోధించిన భక్తియోగంలోని భక్తుని లక్షణాలు దైవీసంపద్విభాగము లోని దైవీసంపద లక్షణాలు నరనరాల్లో జీర్ణము చేసుకొని నరరూపంలో ఉన్న దైవమే శ్రీ మాష్టారు.

మహనీయుడైన మాష్టరుగారి ఆచరణ మానవజాతి అంతటికీ ఆచరణయోగ్యమే. మాష్టరుగారు విద్యానగర్‌లో ఉండగా ప్రతి గురువారము జరిగే భజన సత్సంగములకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చేవారు. ఈ కార్యక్రమం నిత్యం జరిగేదే అయినా ఆరోజు ప్రక్కగ్రామాలనుండి కూడా భక్తులు వచ్చేవారు. వారిలో క్రొత్తపాళెంనుండి వచ్చే భక్తులు ఎక్కువగా ఉండేవారు. విద్యానగర్ నుండి క్రొత్తపాళెం వెళ్ళేందుకు రాత్రి 8 గంటలకు లాస్ట్‌బస్సు. ఆ తర్వాత బస్సులు లేవు. గనుక మాష్టరుగారు ఏడున్నర గంటలకే సత్సంగం నిలిపి క్రొత్తపాళెం భక్తులకు టెంకాయలు కొట్టి, హారతిచ్చి ప్రసాద మిచ్చి పంపేవారు. వాళ్ళంతా ఎంతో సంతోషంగా ప్రసాదం తీసుకొని వెళ్ళేవారు.

వాళ్ళు 8 గంటలకు బస్సుకు పోలేకపోతే ఇంటిలో వారికి గల ఎన్నో పనులు నిర్వహించడం కష్టం. ఇంట్లోవారికి, సేద్యగాళ్ళకు అన్నాలు పెట్టాలి. తెల్లవారికి చద్ది అన్నాలు జాగ్రత్త చేయాలి. ఇలాంటివెన్నో పనులుంటాయి. ఒక్కవారం వారు రాలేక విద్యానగర్‌లో ఉండిపోతే మరుసటివారం ఇంటిలోని పెద్దలు వారిని సత్సంగానికి రానివ్వరు.

ఇదంతా తెలిసిన మాష్టరుగారు సనాతన ఆచారాలకు స్వస్తిచెప్పి సత్సంగం మధ్యలోనే వారికి టెంకాయలు కొట్టి హారతిచ్చేవారు. ఈ సూత్రం తెలిసి ఆచరించగలిగితే మానవాళికెంత శాంతి, సౌఖ్యాలు లభిస్తాయో ఆలోచించండి. అందుకే మాష్టరుగారు మనందరికీ పూజనీయులైనారు.

శ్రీ మాష్టరుగారు ఢిల్లీలో ఒక ప్రొఫెసరుగారితో ఆధ్యాత్మిక విషయాలపై చాలాసేపు వివరంగా మాట్లాడారు. ఆ ప్రొఫెసర్‌గారు ఆ మాటలు విని ఆశ్చర్యచకితుడై పోయాడు. ప్రతి ప్రొఫెసరుకు తన స్పెషలైజ్డ్ సబ్జక్టే

పరిమితంగా తెలిసి ఉంటుంది. ఆ సబ్జక్టు కూడా మాష్టరుగారికి తెలిసినంత క్షుణ్ణంగా అప్‌టుడేట్ ఇన్ఫర్మేషన్ తెలిసియుండడం అసంభవం. అలాంటిది మాష్టరుగారికి ఇన్ని రంగాలలో ఇంత ప్రావీణ్యమెలా కలిగిందా అని ఒకవైపు మరొకవైపు ఈ రంగాలన్నిటిని ఆధ్యాత్మిక సత్యాలకు అనుసంధించడముతో వారు ఉక్కిరిబిక్కిరైపోయారు. తెల్లవారి ప్రొఫెసర్లతోటి మాష్టరుగారిని గురించి చెప్పసాగాడు. వాళ్ళంతా అన్నారట : ''ఈ పుస్తక పురుగులు నీలాంటి వారిని తికమక పెట్టేందుకు ముందుగా కంఠత పెట్టిన కొన్ని శ్లోకాలు వల్లిస్తారు. ఉన్నఫళంగా మనం టాపిక్ మార్చి ప్రశ్నిస్తే దిక్కులు చూస్తారు'' అని కొట్టేశారు. మొదటి ప్రొఫెసర్ మాష్టారిని పరీక్షించి చూడమన్నారు. ''నాటిరాత్రికి మాష్టారిని విందుకు మీ ఇంటికి ఆహ్వానించండి. తర్వాత మేమొచ్చి చూస్తామ''న్నారు. అలాగే జరిగింది. భోజనానికి వెళ్ళేటప్పుడు ఎవ్వరూలేరు. ముగించి వచ్చేలోగా హాలులో ప్రొఫెసర్లందరూ నిశ్శబ్దంగా కూర్చొనున్నారు. పరిచయ వాక్యాల తర్వాత ప్రొఫెసర్ల ప్రశ్నల వర్షం మొదలైంది. అప్పుడు మాష్టారు - ''మీ అందరి ప్రశ్నలూ ఈ కొద్ది సమయంలోనే సమాధానపడాలి గనుక నేను రెండు పద్ధతులు చెపుతాను. వాటిలో మీ ఇష్టమొచ్చింది అనుసరిద్దాం. ఒకటి - ఒకరు ప్రశ్నించాక అందుకు నేనిచ్చే సమాధానం పూర్తయినంతవరకు 2వ వారు మాట్లాడరాదు. రెండవ పద్ధతి : మీరంతా మీ మీ ప్రశ్నలు అన్నీ ముందుగానే నాకు చెప్పండి. ఈ ప్రశ్నలన్నింటికీ ఈ నిర్ణీత సమయంలోనే మీకు తృప్తిగా చెప్పిచూస్తాను. మీ ఇష్టమొచ్చిన పద్ధతి ఎన్నుకోండి'' అన్నారు. వారు రెండవ పద్ధతి ఎన్నుకొని వారి వారి ప్రశ్నలన్నీ కుప్పించారు. మాష్టరుగారు చెప్పను మొదలుపెట్టి - ఎవరి ప్రశ్నకు జవాబు రాబోతుందో వారిని జాగ్రత్తగా వినమని హెచ్చరిస్తూ అందరి ప్రశ్నలకు సమాధానమిచ్చేసరికి వారు నివ్వెరపోయారు.

ఒక్కొక్కప్పుడు వారు ప్రవర్తించిన తీరే మనకు ప్రబోధమై మేల్కొలిపేదిగా ఉంటుంది. 1982లో నాకు పిచ్చి పట్టినదని స్కూలులో అందరూ నమ్మారు. సత్సంగంలోని మిత్రులు మాష్టరుగారికి లెటర్స్ వ్రాశారు. కాని ఇంటిలోని వారు వ్రాయలేదు. మోక్షం వైగైరాలు నాకక్కరలేదని, నన్ను ఆ ఆనందస్థితినుండి క్రిందికి జారిపోకుండా చివర వరకు ఉంచమనీ



సాయిని ప్రార్థించేవాణ్ణి. శ్రీ స్వామివారి 40వ రోజు ఆరాధనకు మాష్టరుగారు గొలగమూడి వస్తున్నారు. ఎప్పుడూ ఎరుగనిది మాష్టరుగారికి పూలమాల వేయాలని నాకు సంకల్పం కల్గి అలా వేశాను. తెల్లవారి మాష్టరుగారే నన్నడిగారు - ''నీకు ఆరోగ్యం బాగుగా లేదన్నారు? ఎలా వుంది?'' అని. అప్పుడు నా ఆనందానుభూతి వర్ణించి - ఈ ప్రపంచంలో నాకేదీ గుర్తుండదని, నిరంతరము సాయి స్మరణేననీ - చెప్పలేనంత ఆనందంగా వుందనీ - ఈస్థితి నుండి క్రిందకు పడిపోకుండా రక్షించమని ప్రార్థిస్తుంటాననీ చెప్పి అలా ఎందుకైందని అడిగాను. ''మనలో సాత్విక భావాలు ప్రకోపించినప్పుడలా ఉంటుంది. నీవేమీ కంగారుపడవద్ద''న్నారు. ''బాబాకు పూజ చేస్తాను. మీరు ప్రక్కన కూర్చోండి'' అని అర్థించాను. మాష్టరుగారు కూర్చోగానే ధ్యానస్థులయ్యారు. నా ప్లాను ప్రకారం బాబాకు వలె మాష్టరుగారి తలకు గుడ్డకట్టి ఒక పంచెకప్పి అష్టోత్తరం మొదలుపెట్టాను. ఒకేనామం ఎంతో బిగ్గరగా అరుస్తూ కన్నీరు కారుస్తూ ఎంతోసేపు చెప్పేవాడిని - ప్రక్కవారు నా చెవిలో ప్రక్కనామం అరిస్తే ఎప్పుడో అందుకునేది. అలా కనీసం అష్టోత్తరం చేసేందుకు ఒకటిన్నర గంట పట్టింది.

మాష్టరుగారు లేచేటప్పుడే తల గుడ్డను ప్రక్కకు తోసేసారు. అందరికీ ప్రసాదమిచ్చారు.

ఏమి ఇలా చేసారే అని నన్ను ఒక్కమాట అనలేదు. నీకెలా వుంది అని అడుగలేదు. క్రమంగా ఒక పదిహేనురోజులలో నాకా నిషాతగ్గి మామూలు మనిషినైపోయాను. టైట్ బనియన్లు వేసుకున్న వ్యక్తికి చెమట పడితే ఉండే స్థితి ఇప్పటిస్థితి. ఆ బనీను తీసి ఫ్యాను క్రింద కూర్చోబెట్టితే ఉండే హాయి ఆనాటి నా స్థితి. మరి తిరిగి అలాంటి స్థితి మాష్టరుగారి దయతో ఎప్పుడు పొందగలనో మరి.

ఒకరోజు మాష్టరుగారు తలస్నానంచేసి తెల్లని గ్లాస్కో పంచె, తెల్లని బనీను, పెద్ద సరిగంచుగల కండువా కప్పుకొని నుదుట విభూతి ధరించి, నోటిలో వక్కపొడి వేసుకొని, పుస్తకం చేతిలో పట్టుకొని విద్యానగర్ సత్సంగం రూములో ప్రవేశించారు. అప్పటివారి సౌందర్యము, తేజస్సు నాకు వెంటనే

శ్రీ రామచంద్రుని గుర్తుకు తెచ్చాయి. ''పుంసాం మోహనరూపాయ'' అని ఇందుకే చెప్పారు గాబోలు అనుకున్నాను. నేను మంత్రముగ్ధుడనై వారిని చూస్తున్నాను. వారాగ్రంథం చదువుతూ చదువుతూ చాపపై పడుకున్నారు. సరిగ (జరీ) కండువా ప్రక్కనపడిపోయింది. ఇంతలో ఒక బిచ్చగాడు వచ్చి, ''సామీ, మీరిచ్చిన గుడ్డ చినిగిపోయింది. చలికి చస్తున్నాను. అంత గుడ్డపేలిక పారెయ్యండి'' అన్నాడు. వెంటనే మాష్టరుగారు తన ఎడమచేతితో ఆ సరిగంచు కండువా తీసి నాకందిస్తూ దాన్ని ఆ బిచ్చగానికివ్వమని సైగచేశారు. వారు పుస్తకపఠనం నుండి బయట పడలేదు. ఆ కండువా కనీసం రెండు మూడు వందలు విలువ చేస్తుంది. వారేదో పరధ్యానంలో ఉన్నారని ''సార్! ఇది క్రొత్త కండువా సార్'' అన్నాను. అయితే ఫరవాలేదు ఇచ్చెయ్ అన్నట్లు సైగచేసారు. ఇక దాన్నే భిక్షగానికివ్వక తప్పలేదు. కుడిచేత్తో దానం చేస్తే ఎడమ చేతికి తెలియకూడదంటారు. ఇదే కాబోలు. ఇదేవిధంగా ఎప్పుడు బిచ్చగాళ్ళు వచ్చినా తన ముందున్న పండ్లలో పెద్దవాటినే వారికిచ్చేవారు. ఆ వచ్చిన వారు ''సాయి'' అన్న ఎరుక నిరంతరం వారిని అంటిపెట్టుకుని యుండేది.

విద్యానగర్ సాయిమందిరం నిర్మాణములో ఉంది. నా విద్యార్థి ఒకరు నిత్యం గతనెలనుండి నాతోనే అక్కడ పనిచేస్తున్నాడు. కానీ అతనికి ఒకే ఒక జత గుడ్డలు అంటే ఒక ట్రౌజరు, ఒకే ఒక చొక్కా ఉన్నాయనే సంగతి నాకు తెలియదు. ఒకరోజు సాయంత్రం 6 గంటలకు హారతప్పుడు ఆ విద్యార్థి తడిబట్టలతోనే వచ్చి ఆరతి తీసుకొని వెళ్ళాడట. అందరూ వెళ్ళిపోయాక మాష్టరుగారు నన్ను పిలిచి ఆ విద్యార్థి పేరు చెప్పి నన్ను అతనిని తీసుకు రమ్మన్నారు. ఆ విద్యార్థి రాగానే ''ఇందాక తడిబట్టలతో వచ్చి ఆరతి తీసుకున్నావేమి?'' అని ప్రశ్నించారు. ఆ విద్యార్థి ఏమీ చెప్పలేక క్రింద చూపులు చూస్తుండిపోయాడు. ''నీకా ఒక జతబట్టలే ఉన్నాయి కదూ?'' అంటూ ప్రశ్నార్థకంగా అతనివైపు చూచారు. ఔనన్నట్లు అతను తల ఊపాడు. వెంటనే మాష్టరుగారు ఇంటిలోనుండి మూడు ట్రౌజర్లు మూడు చొక్కాలు క్రొత్తవి తెచ్చి అతనిపైకి విసిరేసి ఆల్టర్ చేసి తొడుక్కో అని చెప్పారు. ఈ విచిత్ర సన్నివేశానికి నాపై నాకే అసహ్యమేసింది. అతడు నా విద్యార్థి. నాతోటే ఉన్నాడు కాని అతనికి ఒకే ఒక జత గుడ్డలున్న విషయం నాకు తెలియనే తెలియదు. ప్రేమమూర్తియైన మాష్టరుగారు తడిబట్టలతో ఆరతికి వచ్చిన ఆపిల్లవాని పరిస్థితి వెంటనే పసిగట్టి ఆదుకున్నారు. దయ, ప్రేమ ఆచరణలో ఎలా ఉండాలో చూపిన ప్రేమమూర్తికివే ప్రణామములు.



విద్యానగర్ సాయిబాబా మందిరం స్లాబుపోసి క్యూరింగ్ చేస్తున్నాము. మధ్యాహ్నం ఒంటిగంట, రెండుగంటల మధ్య సమయం, పది పదిహేనుమందిమి నీరు చేది నిచ్చెనమీద మోసుకుపోయి పోస్తున్నాము. ఎండ చాలా తీవ్రంగా ఉంది. స్నేహితులమందరము బాగా తడిసిపోయాము. పని శ్రమ అయినా మాకు చాలా సంతోషంగా ఉంది. అప్పుడే మాష్టరుగారు మందిరం పైకి ఎక్కి వచ్చారు. ఎర్రటి ఎండలో పనిచేసే మమ్మలను చూసి వారికెంత జాలివేసిందో చెప్పలేను. వెంటనే దామోదర్‌ను పిలచి ''ఇంటికి వెళ్ళి అమ్మగారినడిగి పంచెలు తీసుకురా పో'' అన్నారు. వెంటనే దామోదర్ వెళ్ళి ఆమాట అలాగే వల్లించాడు. అమ్మగారు ఏమి పంచెలు ఎన్ని తెమ్మన్నారు అని కూడా అడగకుండా గ్లాస్కో పంచెలు, టవల్స్ అన్నీ పెద్దమూట కట్టి పంపారు. మాష్టరుగారు అవి మాకియ్యబోతుంటే ''సార్! ఈ ఇస్త్రీ గుడ్డలన్నీ మాకెందుకుసార్, బురద అయిపోతాయి'' అన్నాము. ''ఎండ తగలకుండా తలకు చుట్టుకోండి. బురద అవుతుందా?'' అంటూ ప్రతి పంచెమీద కొంచెం బురద నీరు చల్లి తలా ఒకటి మాపై విసిరేశారు. ఇక తప్పదని తలా ఒకటి తలకు చుట్టుకున్నాము. కొంతసేపు గడిచాక, ''ఇంక మీకీ పంచెలు తిరిగిరావు సార్'' అన్నాము. ''ఎందుకూ? అవి మీకొరకే తెప్పించాను'' అని అన్నారు. సాయంకాలం కొంతమంది నీళ్ళలో పిండి మాష్టరుగారికి తిరిగి ఇచ్చేశారు. నాలాంటి కొందరు సొంతం చేసుకున్నాము. ఆ ఎండలో మేమందరము వారికి సాయిబాబా వలె కనిపించి ఉంటాము. లేకుంటే వేల రూపాయలు ఖరీదుచేసే గుడ్డలన్నీ మాకు సమర్పించడమేమిటి! ఏమి పంచెలు! ఎన్ని తెమ్మన్నారు అని కూడా అడగకుండా అన్నీ మూట కట్టి పంపిన అమ్మగారి ఔదార్యమేమని కొనియాడగలను? సర్వులను సాయిరూపాలుగా చూచే ఈ మహా మహితాత్ములకు సాటి ఎవరు? సాధన పరాకాష్ట అంటే అదే గాబోలు!

నన్ను నిత్యం ఇంట్లో సత్సంగం చేస్తుండమని కొన్ని నెలలపాటు చెప్పి చూచారు. నేను మౌనం వహించానేగానీ మొదలుపెట్టి ఇంట్లో సత్సంగం చేయ లేదు. ఎందుకు వెనుకాడుతున్నావని ఒకరోజు నిలదీశారు. ''ఇంట్లో అందరూ వచ్చినా మా అమ్మ సకాలానికి రాదు సార్! ఆమెను నేనేమీ అనలేను''. అని చెప్పాను. ''అట్లాగాదు సుబ్బరామయ్యా! అన్నానికి ఎసరు పెట్టందే వాళ్ళు రారు. నేను గూడ అలానే తంటాలు పడ్డాను. నీవు ఒక్కపూట అన్నం తినడం మానేస్తే ఆమె సక్రమంగా వస్తుంది'' అని ఒక చిట్కా చెప్పారు. అదేవిధంగా నేనొకరోజు అన్నం తినకుండా ''సత్సంగానికి రాని మీ అన్నం నేను తిననని'' గట్టిగా కేకలేసాను. ''ఈరోజు తిను. రేపటినుండి తప్పక సత్సంగానికి వస్తాన''ని మా అమ్మగారు మాట ఇచ్చారు. తెల్లవారినుండి అందరికంటే ముందుగా ఆమె చాపలు పరచి, పటంపెట్టి, పూలమాల సిద్ధంచేసేది. ఆవిధంగా శ్రీమాష్టరుగారు నాకు నిత్యం ఇంట్లో సత్సంగం ప్రసాదించారు.

ఆధ్యాత్మిక సాధనలో దైవీసంపద లక్షణాలు సహజసిద్ధం కావాలని పెద్దల వాక్యం. అట్టి దైవీసంపదలో మొదట చెప్పబడినది ''అభయం, సత్వసంశుద్ధిః'' అభయం అంటే భయరహితమైన స్థితి. పూజ్యశ్రీ మాష్టరు గారు ఒక అధికారితో మాట్లాడుతున్నారు. ఆ అధికారి నీవు రెండు పనులు ఒకేకాలంలో సక్రమంగా చేయలేవు. గనుక బాబాసేవగాని, ఉద్యోగంగాని ఏదైనా ఒకటే ఎన్నుకోమన్నాడు. నా తీరిక సమయంలో బాబా సేవ చేస్తున్నాను. నా విద్యుక్త ధర్మాన్ని ఎన్నడూ నేను అశ్రద్ధ చేయలేదు అని ఎంతోసేపు చెప్పినా ఆ అధికారి మొండిగా బాబా సేవచేస్తూ నీవు నీ డ్యూటీ చక్కగా నెరవేర్చలేవని మరలా అన్నాడు. అప్పుడు పూజ్యపాదులు మాష్టరుగారన్నారు ''నేను నా డ్యూటీ సక్రమంగా చేస్తున్నానో లేదో బాబాకొక్కరికే తెలుసు'' అన్నారు. అంతటితో ఆ సంభాషణ ఉన్నఫళంగా ఆగిపోయినది.

నిర్భయంగా బాబామీద సంపూర్ణ విశ్వాసాన్ని క్రియారూపంలో (నోటిమాటలు అనే క్రియ) వ్యక్తంచేసి తన ''అభయం సత్వసంశుద్ధిః'' అనేది ఎలా ఉంటుందో లోకానికి వెల్లడించిన మహామహితాత్ముడు మాష్టారు.

శ్రీ మాష్టరుగారిని దూషించిన వ్యక్తి కొన్నాళ్ళ తర్వాత మనసు మారి నన్ను క్షమించమని అడిగితే మాష్టారు అన్నమాటలు నాకు స్వర్ణాక్షరాలుగా



నిలచిపోయాయి. ''నిన్ను నేను క్షమించడమేమిటి? నీవు నాకు ఏమి కీడు చేశావని నిన్ను క్షమించమంటున్నావు. అందరికీ అన్నీ చేసేది ఆ సాయినాథుడే. అయ్యో! అలా భాధపడబోకు'' అని ఆ వ్యక్తిని ఓదార్చారు. అలనాడు క్రీస్తు, ''ఓ ప్రభూ! వారేమి చేయుచున్నారో వారికి తెలియడం లేదు. దయచేసి వారిని క్షమించ ప్రార్థన'' అని తనను శిలువ వేసిన వారికొరకు ప్రార్థించినట్లుంది మాష్టారి ప్రవర్తన.

మాస్టర్‌గారి ప్రవర్తనతో నా ప్రవర్తన పోల్చుకుంటే నేనెంత మిథ్యాసాధన సాగిస్తున్నానో హృదయగతమవుతుంది. నాకు కొద్దిపాటి అవమానం కల్గించిన వ్యక్తి మార్గంలో నాకు తారసిల్లితే వెంటనే నా అంతరంగంలో ఆనాటి సన్నివేశం మెదలి ఆ వ్యక్తి ఎడల ద్వేషం, అసహ్యం తళుక్కున మెరువక మానడం లేదు. కార్యరూపంలో బయటికి చాలా సౌమ్యంగా అందరికీ నేను కనబడవచ్చు. కానీ నా అంతరాత్మ నాకు చక్కగా తెలుస్తుంది. నేను సాధన చేసినట్లు పైకి కనబడినా నిజానికి నేను చెన్నబసవప్ప, వీరభద్రప్పలకు దగ్గరౌతు న్నానన్నమాట. శ్రీ మాష్టరుగారి ప్రవర్తనకు, నా ప్రవర్తనకు గల భేదాన్ని బేరీజు వేసుకోకుంటే నేను సాధనలో ముందుకుసాగే అవకాశమే లేదు. చివరకు నాకు మిగిలేది మిథ్యా సాధనే.

ఓం సద్గురు సాయినాథాయ నమః.

## భిక్షతో జీవించిన మాస్టర్ - తాజుద్దీన్ బాబా దర్శనం

గొలగమూడిలో కొన్ని సంవత్సరాలున్న సుబ్రమణ్యం శాస్త్రిగారు (బందరు స్వామి) నాగపూర్ వెళ్ళారు. వారిచేతిలోని సాయిలీలామృత మందలి మాస్టరుగారి ఫోటోను చూచిన నాగపూర్ నివాసి తన ఆశ్చర్యాన్ని ఇలా ప్రకటించాడట. ''అరే! ఈయన నాగపూర్ వీధులలో కొన్నాళ్ళు భిక్షతో జీవించినవాడేనే. ఇంత గొప్పవాడయ్యారా?'' ''ఏమి చేసేవారు? ఎలా భిక్షనెత్తుకున్నా''రని సుబ్రమణ్యశాస్త్రిగారడిగారట. ''వారు తాజుద్దీన్ బాబాగారి సమాధి సమీపంలో ఎక్కడో ధ్యానంలో మునిగి వుండేవారు. ఎప్పుడో తనకు ఆకలి తెలిసినపుడు రోడ్డు వెంబడి కూర్చొని దోసిలిపట్టి కళ్ళు మూసుకుని కూర్చొనేవారు. ఆ మార్గాన పొయ్యేవారు వారికి బుద్ధిపుట్టింది

ఏదైనా దోసిలిలో వేస్తే ఇక అక్కడుండకుండా వెళ్ళేవారు. ఎవరైనా వంద రూపాయల నోటు వేస్తే దాన్ని టీ కొట్టువానికి ఇచ్చి రొట్టె, టీ తీసుకునేవారు. మిగిలిన పైకం ఆ అంగటివాని దగ్గరుంచి తనకవసరమైనప్పుడంతా తినేవారు. ఒకవేళ ఎవరైనా ఒక అరటిపండు వేస్తే ఆరోజుకు భగవంతుడు తనకదే పెట్టారని తృప్తి చెందేవారు.

ఒకరోజు తాజుద్దీన్ బాబాగారి దర్శనం కాలేదని తన తల పగుల గొట్టుకొని ప్రాణత్యాగానికి సిద్ధమౌతానని అక్కడున్న గోడకు తలబాదుకున్నాడో లేదో గులాబ్‌బాబాగారొచ్చి భుజంమీద చెయ్యివేసి నవ్వారు. అశ్రుధారలతో వారికి పాదాభివందనం చేశారు. గులాబ్ మహరాజ్‌గారిలో వారికి తాజుద్దీన్ బాబా దర్శనమై ఉంటుంది'' అని సుబ్రమణ్యంగారు చెప్పారు. దీనినిబట్టి మనకు తెలిసేదేమంటే మాస్టరుగారు మరొకరూపంలో అలా జీవించివుండవచ్చు.

## బాబాగారి ఆజ్ఞలపై మాస్టరుగారి విశ్వాసం

విద్యానగర్ వదిలిపెట్టకముందు ఒంగోలులో పట్టపగలు ఒక కల వచ్చిందట. ఆ స్వప్నంలో తాను బ్యాగ్ తీసుకుని విద్యానగర్‌కు పోతుంటే రోడ్డు ప్రక్కనున్న ఒక అవధూతలాంటివారు అక్కడకు పోవద్దని తన సంచి పట్టుకొని లాగుతున్నారట. మాస్టరుగారు గూడ బలంగా లాగడంతో ఆ అవధూత పైకి లేచాడట. వారి నిక్కరు ఊడిపోయి దిగంబరంగా కనిపించేసరికి మాస్టరుగారు నవ్వుతున్నారట. మాస్టరుగారు స్వప్నంలో నవ్వడం అక్కడున్న భక్తులనేకులు చూచారట. కానీ వారడగితే తన స్వప్న వృత్తాంతం వారికి చెప్పారట. దీనిభావం ఏమిటో తర్వాత తెలిసింది. ఆయనను బాబా ఒంగోలులోనే స్థిరపరచడం జరిగింది.

## ముందు నిర్ణయంపై అకుంఠిత విశ్వాసం

ఏఏ మీటింగు ఎప్పుడెప్పుడు ఎచ్చటెచ్చట జరగాలి, దానిలో ఎవరెవరు ఉపన్యసించాలి, ఎవరెవరు వినాలి అనేది ముందుగానే నిర్ణయమై ఉంటుంది.



అలాంటప్పుడు మీటింగుకు శ్రోతలు లేరని బాధపడడం భావ్యం కాదు. ఒక్క జ్ఞానిమాత్రమే ఈ ధర్మసూక్ష్మమెరిగినందున

సిద్ధ్య సిద్ధ్యోసమో భూత్వా సమత్వం
యోగ ఉచ్యతే - అని చలనం లేకుండా ఉంటారు. మిగిలిన వారంతా ఆ మీటింగు జరిపిన కార్యకర్తలపై విరుచుకుపడడం చూస్తుంటాము.

ఒకసారి కలిచేడు హైస్కూలులో మీటింగు పెట్టించాము. హెడ్మాస్టరు నాస్తికుడు. అయినా అంగీకరించాడు. తీరా మీటింగు సమయంలో వేరే పనిపెట్టుకుని తాను రాకుండా ఉండడమే గాకుండా విద్యార్థులను కూడా పాల్గొనకుండా ప్రయత్నం చేశారు. మొత్తానికి మీటింగు జరిగింది యాభై మంది శ్రోతలతో. ఇదేవిధంగా కలిచేడు రామమందిరం దగ్గర మీటింగు జరిపించాడు గోపాల్. కొద్దిమంది శ్రోతలతోనే మీటింగు జరిగింది. మాకు మాత్రం చాలా బాధ అనిపించింది.

కానీ కరుణామయులు, పరమ జ్ఞాన స్వరూపులైన మాస్టరుగారు పై రెండు సన్నివేశములలో గూడా ''ఏమయ్యా, ఇలాంటి మీటింగులకు తీసుకువచ్చారే'' అని ఒక్కమాట కూడా అనలేదు అది వారి జ్ఞానపటిమ.

## లౌకిక వ్యవహారం

ఒకరోజు నేను, మాస్టరుగారు నెల్లూరులో మద్రాసు బస్టాండునుండి టౌన్‌లోకి పోతున్నాము. ఒక రిక్షావాణ్ణి పిలిస్తే ఐదురూపాయల బాడుగకు పదిరూపాయలు అడిగాడు. మేము మరొకర్ని పిలిస్తే అతడు ఐదురూపాయలే చెప్పాడు. మేమా రిక్షాలో ఎక్కుతున్నాము. వెంటనే మొదటి రిక్షావాడు ''రిక్షా బాగా ఎక్కిన మొఖాలే'' అన్నాడు. ప్రక్కన మాస్టారుగారున్నారని నేను పలకలేదు. మాస్టరుగారు మాత్రం చటుక్కున రిక్షా దిగి ''ఏమన్నావ్? నీవెప్పుడైనా రిక్షా వేశావా? మాటలు జాగ్రత్తగా మాట్లాడేది నేర్చుకో'' అన్నారు. వెంటనే అతడు కిమ్మనకుండా రిక్షా త్రిప్పుకొని వెళ్ళిపోయాడు. అప్పుడు మాస్టరుగారు నాకు చెప్పారు : ''ఇలాంటి గడుగ్గాయలను మనం

వదిలేస్తే అమాయకులైన అనేకమందిని వారి మాటలతో బాధిస్తారు. వీళ్ళను వదలకూడదు'' అన్నారు. ధర్మాచరణంటే ఏమిటో వారి దగ్గరే నేర్చుకోవాలి.

మరొకరోజన్నారు - మొదటిముద్ద కాదు, చివరి ముద్ద శ్రీ సాయికి సమర్పించండి చూద్దాం. మొదటి ముద్దయినా నిత్యం పెట్టగలరేమోగాని చివరిముద్ద నిత్యమూ సమర్పించలేరు. చివరిముద్ద పెట్టేందుకు ఎప్పుడో ఒకసారి మరచిపోతారు. ఇది తథ్యం.

లౌకిక వ్యవహారాల్లో సర్వసాధారణమైన మనుషులు మెలగలేక పోవచ్చునేమోగాని ధర్మాధర్మాలెరిగిన మాస్టరుగారి ఆచరణే మనకు ఆదర్శప్రాయం.

ఒకరోజు మాస్టరుగారు, నేను వెంకటగిరినుండి రైలులో ఒంగోలు పోతున్నాము. అది జనరల్ కంపార్ట్‌మెంట్. గనుక కిటకిటలాడిపోతోంది. మాస్టరుగారి సీటు ప్రక్కనే నన్నుకూడ కూర్చోబెట్టుకున్నారు. మా ఎదురు సీటులో అందరూ ఆడవాళ్ళే. ఒకామె పసిబిడ్డనెత్తుకొని కూర్చోనుంది. ఎప్పుడో కాస్త తూగి ప్రక్క ఆమెకు తగిలింది. వెంటనే ఆవిడా చాలా ఉక్రోషంగా తిడుతూ చాలాసేపు అరుస్తున్నది. అక్కడున్న వాళ్ళలో ఒక్కరు గూడ 'ఎందుకమ్మా అలా అరుస్తావు, ఆమె ఇప్పుడు నిన్నేమి చేసింది?' అని మర్యాదకైనా అడగలేదు. ధర్మప్రభువైన శ్రీ మాస్టరుగారు ''ఎందుకమ్మా అలా అరుస్తావు. పాపం ఆమె ఒక్క మాటైనా నిన్ను అనిందా. నీవు నిద్రతూగితే ఏం చేస్తావు? నీవెప్పుడూ ప్రక్కవాళ్ళకు తగల్లేదా? ఆమె పసిబిడ్డను పట్టుకుని అంత ఇబ్బందిగా కూర్చోనుంటే ఆమెకు సానుభూతి చూపాల్సింది పోయి అలా మాట్లాడుతావేమిటి?'' అన్నారు. ఆమె కిమ్మనకుండా వెంటనే నోరుమూసేసింది. ఆ కంపార్టుమెంటులో ఇతరులెవ్వరూ నోరు విప్పలేదు. ప్రతివాడూ మనకెందుకొచ్చిన గొడవలే అని అనుకునేవారే. అదే పూజ్య మాస్టరుగారికి, మనకు భేదం.

కారి రామస్వామివారు ఇటుక వ్యాపారాన్ని గూర్చి శ్రీస్వామివారు ''నీవు పదిమందిలో పదకొండవవాడవులేయ్యా'' అన్నారు. ఆ పనిలోని పాపం పదిమందికీ వస్తుంది. వారిలో నీకు గూడ కాస్త వస్తుంది అని అర్థం.



భారతంలోగూడ ఇదే సన్నివేశం ఎదురౌతుంది. అధర్మమనేది చేసిన వాడికే కాకుండా అధర్మం చేసేందుకు ప్రేరణనిచ్చినవానికి, అది చూచి ఆనందించిన వారికి, నిగ్రహించ సమర్థత ఉండికూడా నోరు నొక్కేసుకుని భీష్మునిలాగా కూర్చున్నవారికి, ప్రేక్షకులందరికీ అక్కడ జరిగే మంచి చెడ్డలలో భాగముంటుందని దాని భావం.

## ఉదారంగా ఇవ్వడం :

ఒకరోజు మాస్టారుగారు నెల్లూరునుండి శ్రీ సాయిలీలామృతాలు ఒక బస్తాడు బస్సులో తెచ్చారు. మిట్టమధ్యాహ్న సమయం, మే నెల, మండువేసవి. విద్యానగర్ వీధులు ఆరోజులలో ఇప్పుడున్నంత రద్దీగా వుండేవికావు. కూలీలు ఎవరూ కనిపించలేదు. మాస్టరుగారు బస్తాదగ్గర నిలబడి నాలుగువైపులా కూలీలకొరకు చూస్తున్నారు. మాస్టరుగారి పిలుపులేకుండానే ఒకతను వచ్చి ''మూట నాకెత్తండి, నేను తెస్తాను'' అని మూట యిల్లు చేర్చారు. ఆరోజులలో ఆ మూట తెచ్చినందుకు కూలి ఒక రూపాయి యిస్తే ఎక్కువ. కాని మాస్టరుగారు అతనిచేతిలో ఐదురూపాయల నోటు ఉంచారు. అతను నాదగ్గర చిల్లరలేదుసార్ అన్నాడు. మాస్టరుగారు, 'చిల్లరవద్దు, వుంచుకో పో!' అన్నారు. ఆ మాటతో అతని ముఖం చాటంతై నవ్వుకుంటూ పోతున్నాడు. చేతిలో రూ. 5/- నోటు వుంది. ఒక సత్సంగేయుడు ఎదురై, ''ఏమిటి నవ్వుకుంటూ పోతున్నావు'' అన్నాడు. ''పుస్తకాలమూట తెచ్చినందుకు స్వామివారు రూ. 5/-లు దయచేశారు'' అని ఎంతో సంబరంగా చెప్పాడు. ఆ సత్సంగేయుడు మాస్టరుగారి దగ్గరకొచ్చి, ''సార్, మీరు ఒక మూటకు రూ. 5/-లు యిచ్చారే. ఒక్క రూపాయేగదా మనమిచ్చేది. అదీ ఎక్కువే. ఇట్లా మీరు మరచి పోయారంటే ఇక ఏ వస్తువు మనింటికి రావాలన్నా రూ. 5/-లు లేనిదే తేలేము'' అన్నాడు. మాస్టరుగారు : ''నేనతనికి మూట తెచ్చినందుకు కూలి ఇవ్వలేదు. మనం మనిషి దొరక్క యిబ్బందులలో వున్నప్పుడు గమనించి మనం పిలవకుండానే తానే వచ్చి మూట యింటికి చేర్చాడు. మనబిడ్డ అయితే ఎంతైనా యిస్తాం గదా! కొనుక్కుతినేందుకు. అందుకని యిచ్చాను'' అని ముగించారు. ఎంతటి దాతృత్వం! ప్రేమ పూర్వకంగా

సహాయమందించినందులకు హృదయపూర్వకంగా పారితోషికం. ఆహా! ఇలా చేయడం మన మాష్టారుకే చెల్లింది. ఆరోజులలో ఒకరోజు కూలి రూ. 5/-లు.

## ప్రసాదం

పూజ్యశ్రీ మాస్టరుగారు ఏ మహనీయుని సన్నిధినుండి ప్రసాద మొచ్చినా ఎంతో వినమ్రతతో శ్రద్ధాభక్తులతో ప్రసాదం కన్నులకద్దుకొని నోట్లో వేసుకునేవారు. తన సన్నిధిలోనున్న భక్తులందరికీ అందేటట్లు చూచేవారు. కొంత ఇంట్లోకి పంపి కుటుంబ సభ్యులందరినీ తీసుకోమనేవారు.

## ప్రతి గురువారం మాస్టరుగారు విద్యానగర్‌లో ప్రసాదం తీసుకునే విధము :

నివేదన కొరకు భక్తులు తెచ్చిన అన్ని పదార్థాలను ఒకటిగా కలిపేసేవారు. ఆపిల్‌పండ్ల ముక్కలు, అరటిపండ్లు, మామిడిపండ్లు, మిఠాయిలు, తినే శెనగపప్పు, బెల్లం, చక్కెర, కలకండ అంతా కలిపేసేవారు. ప్రతివారికి దోసిట నిండా పెట్టేవారు. కొందరు కాగితాలు, విస్తరాకులు పట్టేవారు. ఆ ప్రసాదమే వారికి గురువారం రాత్రికి ఆహారంగా సరిపోయేది. కానీ శ్రీ మాస్టరుగారు మాత్రం చిట్టచివర తన కుడిచేతి బొటనవ్రేలు, చూపుడువ్రేలుతో పట్టుకొని ఒకే ఒక చిన్నముక్క తీసుకొని కళ్ళకద్దుకొని నోటిలో వేసుకునేవారు. అదేవిధంగా అమ్మగారికి కూడా ఒకముక్క ప్లేటులో వేసి ఇంట్లోకి పంపేవారు. ఒకరోజు నా కడుపుమంట బయటకు కక్కేశాను. ''సార్! మాకైతే దోసిటనిండా ప్రసాదం పెడుతుంటిరే, మరి మీరు ఎంతో స్వల్పంగా ఒకే ఒక చిన్నముక్క ప్రసాదంగా తీసుకుంటారేమిటి?'' అని అడిగేశాను. అందుకు మాస్టరుగారు చెప్పిన మాటలు శిలాశాసనాలుగా నిలచి పోయాయి. ''అట్లా ఎక్కువ తీసుకుంటే అదే ఆహారము, అన్నము అవుతుంది. స్వల్పంగా తీసుకుంటే ప్రసాదమవుతుంది'' అన్నారు. అందుకు నేను, ''అయితే మాకు అన్నము, మీకు ప్రసాదమా సార్'' అన్నాను. మాస్టరుగారు, ''అయితే నీవు కూడా స్వల్పంగానే తీసుకో'' అని ముగించారు.



## ఉత్తమోత్తమ సద్గురుమూర్తి

చిరంజీవి దామోదర్ (సత్సంగ సభ్యుడు) చనిపోయాడని నాకు తెలియదు. అతనిని మద్రాసు తీసుకుపోయిందీ తెలియదు. దహనక్రియల తర్వాత మూడవనాడు విద్యానగర్ వెళ్ళాను. ఎప్పుడూ అక్కడే కూర్చొనుండే దామోదర్ ఎంతసేపటికీ కనిపించకపోయేసరికి ''దామోదర్ ఎక్కడికి వెళ్ళాడు సార్'' అని అమాయకంగా అడిగాను. వెంటనే మాస్టరుగారు సాయినాథుని గుండె దగ్గరకు తన కుడిచేతి చూపుడువ్రేలు చూపుతూ ''ఇక్కడికి వెళ్ళాడు. ఇక అక్కడే వుంటాడు'' అన్నారు. నాకేమో బోధపడక ముఖం చిట్లించి చూస్తుండిపోయాను ప్రశ్నార్థకముఖంతో.

''దామోదర్ స్వర్గస్తుడయ్యాడు, నీకు తెలియదా!'' అని క్లుప్తంగా సంక్షిప్తశబ్ద చిత్రం వినిపించారు. అదే నేనుగాని, మరియొకరుగాని అయితే సాయినాథుని పటంవైపు చూపుతామా? తమ గుండెనే చూపుకుంటూ ''ఇక్కడే శాశ్వతంగా ఉంచుకున్నాను'' అని చెప్పేవాళ్ళంగదా! అలాంటి డంబాలు లేని సాధారణత్వం గనుకే మహాత్ములందరికీ ముద్దుబిడ్డ డయ్యారు. అందరికీ ఆరాధ్యదైవమైనారు. సాధారణత్వం నరనరాల్లో జీర్ణించుకున్న ఇట్టి మహనీయమూర్తి పరిచయమేర్పడటమే నా భాగ్యమని తలుస్తాను.

ఈ దామోదర్‌ను గూర్చి అతని మరణానంతరం శ్రీ మాస్టరుగారన్న మాటలద్వారా దామోదరెంత గొప్పగా మాస్టరుగారి హృదయాన్ని చూరగొన్నాడో తెలుస్తుంది :

''వాడుకాబట్టి అన్నిరోజులు అంత శ్రద్ధాభక్తులతో అచంచల విశ్వాసంతో నన్నంటి పెట్టుకొని ఏమారకుండా నీడవలె ఉండగలిగాడు. ఇంకొకరైతే అలా ఉండలేరు'' అని అన్నారు. దాము అంటే మాస్టరుగారికెంత ప్రేమో!

## మాస్టరుగారి పెంపకం

బిడ్డలను పెంచి విద్యాబుద్ధులు గరపడంలో వారికి వారే సాటి. ద్వారక ఎంత అల్లరి చేసేవాడో చెప్పలేము. వందమంది విజిటర్స్‌తో మాస్టరుగారు

మాట్లాడుతున్నా సరే ద్వారక గంతులేస్తూ వచ్చి మాష్టారుగారి పైబడి గడ్డం, తలవెంట్రుకలు రేపేసి, ఒక్కొక్కసారి బనియన్ బటన్స్ పోగొట్టేవాడు. మాష్టరుగారు ఒక్కమాట అనేవారు కాదు. ''ఎవడురా ద్వారకను కొట్టింది? ఏమైంది నాన్నా'' అని బుజ్జగిస్తూ ''అరే ప్రసాద్! అది ఐస్ బండేనా? అనేవారు. 'ఆఁ అవును సార్' అంటే 'ద్వారకకు ఒక మంచి ఐస్ కొనియ్యవోయ్' అనేవారు. ద్వారక ఐస్ అనేమాట చెవిని పడగానే వీధివైపు పరుగెత్తేవాడు. కూడా ప్రసాద్ వెళ్ళి 'అరే! ఐస్ బండి ఎటు పోయిందబ్బా' అంటూ చివరకు ద్వారక కోరిక ప్రకారం రెండు చాక్‌లెట్స్ కొనిచ్చి ఒక గంట తర్వాత ఇంటికి చేర్చేవాడు.

వేసవి సెలవులొస్తే ఒకవైపు కేరంబోర్డు. ఒకవైపు లెక్కలు, ఇంగ్లీషు, సైన్స్, సోషల్ - సెంట్రల్ స్కూల్ సిలబస్ సాధ్యమైనంత పూర్తి చేయించేవారు. ఒక్కొక్కప్పుడు అన్నం తినేలోగా తానే స్వయంగా కేరంబోర్డు ఆడేవారు. పర్యటనలో ఉంటే తప్ప ఇంటి దగ్గరుంటే ఎంతమంది విజిటర్స్ రానీ టైంటేబుల్ ప్రకారం ''ఏం ద్వారకా, ఎన్ని లెక్కలు వేశావు? ఆ ఇంగ్లీషు పాఠం వచ్చిందా'' అని అమ్మగారి దగ్గరుండే వేదమ్మను ద్వారకను అడిగి కనుక్కునేవారు. వారినుండి జవాబు లేకుంటే ''ఏమేవ్! వాళ్ళు అక్కడున్నారా లేక నిద్రపోతున్నారా? ఏమిటి సంగతి?'' అనేవారు. ఇక అమ్మగారే సమాధానం చెప్పితీరాలి. అంత పట్టుదలగా విద్యాభ్యాసం నేర్పించేవారు. ఎందరు విజిటర్స్ వున్నాసరే ద్వారక పుస్తకంతో తన దగ్గరకు రాగానే ముందు ఆ చిన్నారి సందేహాలు తీర్చి, తర్వాత విజిటర్స్ విషయం చూచేవారు.

పాఠం తాను చదువుతూ కఠినపదాలు అండర్‌లైన్ చేస్తూ, ఆ పదాలకు నౌన్, అడ్జక్టివ్, వెర్బ్ ఫార్మ్స్ చెపుతూ అవసరమైతే వాటి అర్థాలు పుస్తకంలో వ్రాస్తూ ఆ పాఠం మొత్తం తెలుగులోకి ట్రాన్స్‌లేట్ చేసి చెప్పేవారు. పాఠ పాఠాన్ని చదువుతూ తెలుగులోకి అనువదించి చెప్పమనే వారు. పాతలెక్కలు చేయించేవారు. ఇంగ్లీషులో స్టాక్ పదాలకు అర్థాలడిగి తెలుసుకునేవారు. వారున్న పనుల వత్తిడిలో నేనైతే క్రమశిక్షణ పేరుతో బిడ్డలను దండించడమో, తిట్టడమో తప్ప వారి చదువుకు సహాయపడి పైమెట్టుకు చేయూతనివ్వడం జరిగే ప్రసక్తేలేదు.



ఆదర్శమూర్తివైన ఓ ప్రభూ! నిను గన్న కన్నులే కన్నులు, నీతోటి నేస్తమే నేస్తము. నీ సహచర్యమే లేకుంటే నా బ్రతుకే దుఃఖభూయిష్టమై ఉండేది గదా ప్రభూ! ఇష్టాయిష్టాలు లేకుండా మన విద్యుక్తధర్మం నెరవేరుస్తూ ఋణవిముక్తులు కావడమే ఆత్మవికాసానికి మార్గమని వాచా బోధించడం కాకుండా ఆచరణద్వారా బోధించిన మహామనిషివి కదా ప్రభూ!

ఎన్నిమార్లయినా మానసికంగా నమస్కరించడం తప్ప మీకు నేనేవిధంగా ఋణం తీర్చుకోగలను?

## కార్యశూరత్వం

సాధనలో నాకున్న బలహీనతలను గురించి మాస్టరుగారికి చెపితే మొదటిసారి, రెండవసారి మాత్రం ఆ విషయాలను గూర్చి శ్రీ స్వామివారిని నివేదించమన్నారు. మూడవ పర్యాయము చెపితే ''వాచా శూరత్వము మాని కార్యశూరత్వము చూపు'' అని చెప్పారు. ఇది సాధకులందరికీ ప్రబోధమే.

శ్రీ చీరాల స్వామివారుండగా ప్రతివారము ఆరోజులలో వంద రూపాయలు ఖర్చుపెట్టి వెళ్ళేవారు. శనివారం రాత్రికి అక్కడచేరి ఆదివారం పగలంతా ఎండలో వారి సమీపంలో కూర్చోనుండి ఆదివారం రాత్రి రైలెక్కి సోమవారం కాలేజీలో పనికి వెళ్ళేవారు. అదేవిధంగా ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి షిరిడీకి వెళ్ళేవారు. షిరిడీకి ఎంత తరచుగా వెళ్ళేవారో చెప్పలేను. సంవత్సరానికి నాలుగుసార్లు వెళ్ళిన సందర్భములున్నాయి. అట్టివారి ఆచరణ మనందరికీ మార్గదర్శకమైనది. దీన్ని ఆదర్శంగా తీసుకొని నిత్యం శ్రీ స్వామివారి సమాధి దర్శనార్థం కలిచేడునుండి గొలగమూడి వచ్చేవాడిని. వాచా బోధించడం గాక ఆచరించి చూపిన ఆ మహనీయమూర్తికి శతకోటి వందనాలు.

## తలుపూరు ప్రయాణం :

విద్యానగర్ సాయి మందిర నిర్మాణార్థమై చందా వసూలు చేస్తున్నారు. నేను పూర్వం పనిచేసిన తలుపూరుకు కూడా చందాలకొరకు పొమ్మన్నారు.

''అక్కడెవ్వరూ ఇవ్వరు. వద్దు సార్'' అన్నాను. ''అక్కడ మనకు వచ్చే డబ్బుకంటే, వారి పరిచయాలు, వారికి బాబాను గూర్చి తెలియచెప్పడం ముఖ్య''మని చెప్పారు. సరేనని ఒక తేది ఖరారు చేసుకుని ఇద్దరం కలిసి ప్రక్క గ్రామమైన తలుపూరుకు వెళ్ళాలనుకున్నాము. అలాగే చేశాము. తలుపూరులో ఒక్కరుగూడా ఒక్కపైసా ఇవ్వలేదు. సరికదా ఒక్క ఐదు నిముషాలు కూర్చొని మాస్టరుగారితో మాట్లాడే ఓపిక కూడా లేదు. అసలీ ప్రపంచం ఎవరికి కావాలి? వారి లౌకిక ప్రపంచం వారిది. సదాశివయ్య అనే టీచర్ మమ్ములను ఆ గ్రామంలో గొప్ప లక్షాధికారుడైన నాయుడుగారింటికి (పెమ్మసారి గిరప్పనాయుడుగారు) తీసుకువెళ్ళాడు. మేము బయట వరండాలో ఉన్నాము. ఒక్కరుకూడా బయటకు వచ్చి మాతో మాట్లాడలేదు. సరికదా తర్వాత చందా పంపుతామనే కబురు పంపారు. అక్కడనుండి కరణం రమణయ్యగారింటికి వెళ్ళాము. ప్రస్తుతం డబ్బు బొత్తిగా లేదని తర్వాత పంపుతానని చెప్పారు. కానీ మాస్టరుగారు మౌనంగా కుర్చీలో కూర్చొని ఏదో పేపరు చూస్తున్నారు. ఆ గ్రామంలోని పెద్దనాయుడు గారు అక్కడకొచ్చి ''వాళ్ళను పంపించివెయ్'' అని రమణయ్యగారితో పెద్దగా మా ముందే చెపుతున్నాడు. ఆమాట విన్న మాస్టరుగారు ఒక పావుగంటవరకు అక్కడనుండి లేవలేదు. మమ్ములను లేచివెళ్ళమని రమణయ్యగారు చెప్పలేకుండా ఉన్నారు. ఈలోగా నాయుడుగారే లేచి వేరేగదిలోకి వెళ్ళిపోయారు.

ఆ గ్రామంనుండి 5కి.మీ. నడిచివెళితే మెయిన్‌రోడ్డులో బస్సు దొరుకుతుంది. గ్రామంలోకి ఇక మూడుగంటలకుగాని బస్సు రాదు. అప్పుడు పదకొండుగంటలు. ఇంత ఎండలో నడక వద్దంటే మాస్టరుగారు వినలేదు. పదిబారలు వెళ్ళేసరికి మా ప్రార్థన లేకుండానే ఒక అపరిచితుడు వచ్చి మోటార్‌బైక్ ఆపి మమ్ములను ఒక్కొక్కరిని తీసుకువెళ్ళి రోడ్డులో వదులుతానన్నారు. మాస్టరుగారు ముందు నన్ను పొమ్మంటారు. తిరిగి బైక్ వచ్చినదాకా తానా రోడ్డు వెంబడి నడవాలనే కదా నేను సుతరామూ అంగీకరించక మొదట వారినే పంపాము. ఆ బైక్ అతనికొరకే మాస్టరుగారు రమణయ్యగారింట్లో అంతసేపు ఆలస్యం చేశారని అప్పుడు తెలిసింది. మేము



మెయిన్‌రోడ్డు చేరేసరికి పన్నెండుగంటలయింది. మాస్టరుగారు నెల్లూరు వెళతానంటారు. మాయింట్లో ఒక్క ముద్ద అన్నం తిని వెంటనే వెళ్ళమని మొండికేశాను. మాస్టరుగారు నాకిప్పుడు ఆకలిలేదు వద్దంటారు. వారు నెల్లూరు చేరేసరికి మూడుగంటలవుతుంది. అప్పుడు హోటలు కెళ్ళాలిగదా. మాయింటికి రమ్మని మొండికేశాను. ఆ దయామయుడే మెత్తబడి ఏ బస్సు ముందు వస్తే అటు పోతానన్నారు. బాబా నా ప్రార్థన మన్నించి మాఇంటివైపు వెళ్ళే బస్సు ముందు వచ్చింది. ఇల్లు చేరాము. మాస్టరుగారికి ఇష్టమైన ఆకుకూర, ఉప్పుడు మిరపకాయలు చేసిపెట్టి ఉన్నారు. వెంటనే మాస్టరుగారికి అన్నం వడ్డించి నేను బస్సు వస్తుందని రోడ్డులో నిలబడ్డాను. బస్సు వస్తే వచ్చింది. మిమితంగా భోంచేసి పోదామన్నారు. చిత్రం! మాస్టరుగారు భోంచేసి తాంబూలం సేవించేటప్పుడే బస్సు వచ్చింది. ఇద్దరం నెల్లూరు వెళ్ళాము.

ఇక్కడ చిత్రమేమిటంటే ఒక్క పైసా కూడా చందారాని ఆ గ్రామానికి మాస్టరుగారు వచ్చారు. అయితే ఆ గ్రామంలో భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారు తరచుగా ఆతిథ్యం స్వీకరించేవారు. నేను చేసిన తప్పంతా ధనవంతుల ఇండ్లకు కాకుండా పేద భక్తుల ఇండ్లకు తీసుకు వెళ్ళివుంటే తప్పక కొంత నిధి సాయినాథునకు సమర్పించి యుండేవారు. ఆనాడు మాస్టరుగారిని చూచిన తొమ్మిదవ తరగతి విద్యార్థి కాలాంతరములో మాస్టరుగారి భక్తుడై గొప్ప ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా స్థిరపడ్డాడు. అతడే శ్రీ గొట్టె వేణుగోపాల్. ఈ విద్యార్థిని తన బృందంలో కలుపుకునేందుకే మాస్టరుగారు ఆ గ్రామము వచ్చారేమో అనిపిస్తుంది.

ఒకరోజు శ్రీనివాసులురెడ్డిగారు అడిగారట ''సార్! మన వేద ఋషులు తపస్సు చేసి ఏమి పొందారో అది మీరు పొందారా?'' అని. అందుకు శ్రీ మాస్టరుగారు గుండెలపై చేయి వేసుకొని ''నిస్సంశయముగా పొందాను'' అని ఎంతో గట్టిగా చెప్పారట.

## దయానిధి

కలిచేడులో ఒక అమ్మాయి కుటుంబం చాలా బీదరికంతో అగచాట్లు పడుతున్నారు. ఆ అమ్మాయిని మాస్టరుగారి ప్రెస్‌లోగాని ఇంట్లోగాని ఉంచితే

ఆమె తల్లిగారికి కొంత ఇబ్బంది తీరుతుందని తలచి మాస్టరుగారిని ఆ విషయం అడిగాను. వారు వెంటనే ఒక వ్యక్తిపేరు చెప్పి ఆ విషయం వారిని అడగండి. ఆయనను కాదని నేనేమి చెప్పలేనన్నారు. వారిని కనుక్కుంటే మగవాళ్ళనయితే ఒకరుకాదు గదా ముగ్గురినైనా తీసుకురండి. ఆడవాళ్ళయితే వీలే లేదని ఖరాఖండిగా చెప్పారు. ఐదవనాడు మాస్టరు విద్యానగర్ మందిరంలో ఉపన్యాసానికి వస్తున్నారు. ఆరోజు ఆ అమ్మాయి తల్లిగారిని మాస్టరుగారితో నేరుగా మాట్లాడమని చెప్పాను. ఆమె తన కష్టం మాస్టరుగారితో ఏకాంతంగా చెప్పుకునే వీలే దొరకలేదు. చివరకు విధిలేక ఆమెను పరిచయం చేసి ''రెండు నిముషాలు ఆమె మీతో మాట్లాడాలంటుంది సార్'' అని చెప్పాను. ఆ రెండు నిముషాలు ఆమె ఏమీ మాట్లాడలేక కళ్ళునిండా నీళ్ళు పెట్టుకున్నది. ఆమె దయనీయమైన పరిస్థితి మాస్టరుగారి హృదయాన్ని ఎంతగా కదిలించిందో చెప్పలేను. వెంటనే నన్ను పిలిచి ''ఆ అమ్మాయిని రేపే నీవు తీసుకువచ్చి ఒంగోలులో వదలిపెట్టు'' అని వారి అంగీకారం తెలిపారు. అపారమైన వారి దయ అలాంటిది. ఆ అమ్మాయికి సుమారు పది సంవత్సరాలు ఆ విధంగా మాస్టరుగారిని సేవించే భాగ్యం కలిగింది. మాస్టరుగారి మహాసమాధి అనంతరం కూడా ఆమె కొన్నాళ్ళు వారి సేవలోనే ఉండే భాగ్యం కలిగింది.

## టిఫిన్ అన్నంలాగ తినడం

మాస్టరుగారు ఎంత గొప్ప ఆత్మజ్ఞానియైనాగాని నా గ్రుడ్డికండ్లకు వారొక ప్రేమమయుడైన వ్యక్తిగానే కన్పించేవారు. ఒకరోజు చింతా లక్ష్మి నారాయణగారి బిడ్డ మిద్దెమీదనుండి క్రింద పడిపోతుందంటే సాయినాథుడు ఆ బిడ్డను తన స్వహస్తాలతో పట్టుకొని సన్‌షేడ్‌మీద కూర్చోబెట్టి అదృశ్యమయ్యారు. ఆ బిడ్డను చూడాలని నేను, దేవయ్య మాస్టరుగారిని ఒంగోలునుండి ఉలవపాడు తీసుకువచ్చాము. అంతటి మహనీయమూర్తిని ఇలాంటి పనులకు అల్పుడనైన నేను అంతదూరం తీసుకురావడమేమిటి? అలా రావడమే వారి గొప్పదనం. అదే శ్రీ స్వామివారు చెప్పిన సాధారణత్వం.

వారి మేధస్సు ఎంత సునిశితంగా పనిచేస్తుందో చూడండి - దేవయ్య నేతిక్రియ అనే ఒక యోగసాధనను గూర్చి చెపుతూ టిఫిన్ చేశాక ఒక



అరగంటసేపు, అన్నం తిన్నాక రెండుగంటలసేపు ఆ నేతిక్రియ చేయరాదని చెపుతున్నాడు. వెంటనే మాస్టరుగారన్నారు ''టిఫిన్ అన్నం లాగ తింటే?'' రెండుగంటలు చేయరాదని దేవయ్య చెపుతున్నా అక్కడ వున్న మేమంతా విరగబడి నవ్వుతున్నాము. కాని మానవాళినంతా మాస్టరుగారు ఆ మాట ద్వారా హేళన చేస్తున్నారని అలాగే టిఫిన్ చేస్తారనేది నగ్నసత్యం. మాస్టరగారిలాగ టిఫిన్ టిఫిన్‌గానే తీసుకునేవారు చాలా కొద్దిమంది మాత్రమే ఉంటారు.

విద్యానగర్‌లో మాస్టరుగారు తమ నివాసానికి ఒక కిలోమీటరు దూరములోనున్న ఒక తోటలో అర్ధరాత్రివేళ వెళ్ళి ధ్యానం చేసేవారు. అక్కడ తీవ్రబాధలో వున్న మనిషి మూలుగుల శబ్దం వినిపించేదట. ఒకటి రెండు రోజులు వారేమీ పట్టించుకోలేదు. ఆ తర్వాత గూడా అలాగే వినపడుతుంటే చుట్టుప్రక్కల చెట్లలో ఆ గ్రుడ్డివెన్నెలలో పరిశీలించారట. అక్కడ ఒక మనిషి గుండెల్లో బాకు దిగబడి రక్తసిక్తంగా, కళ్ళు మూసి మూలుగుతున్న దృశ్యం గోచరించిందట. తర్వాత విచారిస్తే - కొన్ని సంవత్సరాల క్రిందట అక్కడొక మనిషిని అదేవిధంగా హత్యచేసిన మాట వాస్తవమని తెలిసింది.

ఒకరోజు గూడలి కొండమీదనుండి రాత్రి 4 గంటలవేళ పాదరక్షలు లేకుండా మాస్టరుగారు గృహోన్ముఖులై వస్తున్నారు. పాదరక్షలు ధరించిన ఒక విద్యార్థి ఎదురై, ''పాదరక్షలు లేకుండా ఈవేళగాని వేళ ఎక్కడనుండి వస్తున్నారు సార్. పురుగు పుట్రా ఉంటాయి. చెప్పులేసుకోకూడదా?'' అంటూ మాట్లాడుతున్నాడు. ఆ విద్యార్థి పాదం ప్రక్కకు పెట్టాడో లేదో, అతని కాలు తేలు తలపైబడింది. కొండెతో అతనిపాదం ప్రక్కన కుట్టింది. కెవ్వునకేక పెట్టాడట. ''చూచావుగా, శివుని ఆజ్ఞ లేకుండా చీమైనా కుట్టదంటే ఇదే'' అంటూ మాస్టరుగారు ఆ విద్యార్థిని తన రూముకు తీసుకువచ్చి విభూతినిచ్చి బాధ నివారించారు.

గొలగమూడి స్వామివారి మందిర శంకుస్థాపనరోజు వేకువఝామున మూడుగంటలకు అందరమూ మాస్టరుగారితో రోడ్డున వస్తున్నాము. రోడ్డు కడ్డంగా వస్తున్న తేలును చూచిన ఒక విద్యార్థి చెయ్యి అడ్డం పెట్టి అందరిని ఆపేశాడు. అంతలోనే రాయి, చెప్పు తీసుకోబోతున్నారు విద్యార్థులు. కానీ

మెరుపువలె మాస్టరుగారు ఆ తేలును తన చేత్తో ప్రక్క కంపలోకి చటుక్కున తోసేశారు. మనమలా చేయగలమా? అదే శివుని ఆజ్ఞలేక చీమైనా కుట్టదనే విషయంపై వారి విశ్వాసానికి మచ్చుతునక.

## శారీరక సుఖాలను తిరస్కరించడంలో వారికి వారే సాటి

శ్రీ వెంకయ్యస్వామివారి సమాధి మందిర శంకుస్థాపనకు గొలగమూడి వచ్చారు మాస్టరుగారు. ఊరి చివర గొలగమూడయ్య దేవాలయములో శ్రీ స్వామివారి సన్నిధిలో అందరము పడుకోవాలనుకున్నాము. మాస్టరు గారికని అడిగితే ఒక ప్రబుద్ధుడు ఒక చాప తెచ్చాడు. తీరా చూస్తే అది చింతపండు గోతానికి వాడిన ఈతచాప, ఈతముళ్ళ మయం. మనమైతే వేసుకోలేము. సరే, ఆ చాపపరచి దానిపై బెడ్‌షీటు వేశాను. మిగిలిన వారంతా నేలమీదనే పడుకోవాలి. వారికి చాపలు, దుప్పట్లు లేవు. మాస్టరుగారు చాప దగ్గరకొచ్చి ఎంత చెప్పినా వినకుండా ఆ దుప్పట్లుతీసి మనవాళ్ళను పరుచుకో మని విసిరివేశారు. ఆ ముళ్ళచాపపై వారికి పక్క ఎలా కుదిరిందో ఆశ్చర్యం. ఉదయంవరకు కదిలితే ఒట్టు. కదిలితే ముళ్ళు గుచ్చుకుంటాయనో ఏమో. నేనైతే నేలమీదనైనా పడుకుంటానుగానీ ఆ ముళ్ళచాపమీద చస్తే పడుకోలేను.

ఇదేవిధంగా విద్యానగర్‌లో ఉండేటప్పుడు గాలిరాని ప్రదేశంలో కూర్చునేవారు. ఉత్తరం ద్వారమునకు ఎదురుగా కూర్చుంటే గాలి వస్తుంది. కుడివైపు చివరకు కూర్చుంటారు. గాలే తగలదు. లక్ష్మమ్మ ఫ్యాను తెచ్చి పెడితే తీసేసిందాకా వప్పుకోలేదు. ఒక్కొక్కరోజు 2 నిమిషాల్లో టిఫిన్ కాఫీ పూర్తిచేస్తే, ఒక్కొక్కరోజు అదీలేదు. మనుషులతో మాట్లాడుతూ కాలేజి టైం అయిందని వెంటనే చొక్కా, ఫ్యాంటు తగిలించుకుని వెళ్ళిపోయేవారు. మాస్టరుగారు కాజువల్‌గా అన్నమాటలు యధాతథంగా జరగడం చిత్రం.

శ్రీ వెంకయ్యస్వామివారి సమాధి మందిరం శంకుస్థాపనప్పుడు శ్రీ స్వామివారు ఊరిచివర గొలగమూడయ్య దేవాలయంలో వున్నారు. సాయి భక్తులంతా రాత్రికి స్వామివారి సన్నిధిలో పడుకోవాలంటారు. మాస్టరుగారికి చెప్పమని, వారినీ అక్కడికి తీసుకురమ్మని నన్ను పురమాయించారు. మాస్టరు గారు మాత్రం అక్కడ చీకటి, మంచినీళ్లు చిక్కవు. ఇక్కడే ఆశ్రమం దగ్గర



పడుకుందామన్నారు. కానీ మూర్ఖుడనైన నేను మంచినీళ్ళు ఒక బిందెతో తెచ్చి పెడతానని గనుక స్వామి సన్నిధిలో పడుకుందామని మొండికేశాను. రెండు మూడుసార్లు సూచనప్రాయంగా అయిష్టం వెల్లడించి, సరే నీ యిష్టం పదమన్నారు.

వద్దుబాబోయ్ ఆ శ్రమ :- ఆశ్రమం నుంచి గొలగమూడయ్య దేవాలయానికి చిమ్మచీకట్లో పోవాలి. వీధిదీపాలు లేవు. దోవ తప్పుగొట్టి తిరిగిన వీధే మూడుమార్లు తిరిగి రాళ్లు ఎదురుతగిలి మాకే ఏడుపొచ్చింది. కానీ ఆ కరుణామయుడు ఒక్కమాటైనా అనలేదు. ఎట్లాగో చేరాము. వెళ్లగానే మంచినీళ్లు అడిగారు భక్తులు. స్వామి సేవకుల దగ్గర బిందె ఉందిగానీ అందులో నీళ్ళన్నీ ఖాళీచేసి వున్నారు. బిందె తీసుకుని ఊర్లోకి పోయాను. గ్రామస్తులందరూ తాళాలువేసి ఆశ్రమానికి వెళ్ళారు హరికథ అని. కుక్కలు పైనబడుతున్నాయి. నీళ్ళు తెస్తాననే బాధ్యత నాదన్నానుగదా - తిరిగిన ఇల్లు తిరగకుండా గాలించాను. చివరకు ఒక ఇంట్లో ఎవరో వుంటే వెళ్లబోయాను. చీకటిలో చూడక కత్రతుమ్మ కంపమీద అడుగేసి ముల్లు ఒక అంగుళం దిగబడి కూలబడ్డాను. రక్తం కారింది. ఆ ఇంట్లో నీళ్ళులేవు. ఆమె నా అవస్థ చూచి పక్కింటిలో రెండుచెంబులు నీళ్ళు తెచ్చి యిచ్చింది. బ్రతుకుజీవుడా అంటూ కన్నీటితో తిరిగివచ్చి గుట్టుగా మనసులో క్షమాపణ చెప్పుకున్నాను.

మాస్టరుగారూ ఈవిషయమంతా మీకు ముందే తెలుసా అంటే ఆయన తెలుసునంటారా - అలా అనరు. ''అన్ని డీటైల్స్ కలిసి ఇలాగైతే బాగుండదు, ఇదైతే బాగుండును అని తడుతుంది. Wait and Seeలో డీటైల్స్ అన్నీ తర్వాత అనుభవానికి వస్తాయి'' అని క్లుప్తంగా చెప్పారు.

## మాస్టరుగారు మాకు మిఠాయి పెట్టడం

ఒకరోజు రాత్రి పదిగంటలయింది. సన్నని వాన ఉంది. సత్సంగ గదిలో నేను, ప్రసాద్, దామోదర్, మరొకరు, నలుగురమే ఉన్నాము. మాస్టరు గారింటిలో కూడ ఎవ్వరూలేరు. మాస్టరుగారు ఒక బిందెనీళ్ళు పట్టే రెండు ప్లాస్టిక్ బక్కెట్లు రెండుచేతులా పట్టుకొచ్చారు. ఆ బక్కెట్లలో ముప్పావు వంతు

వరకూ అంగట్లోని అన్ని రకాల మిఠాయిలు కలగాపులగంగా ఉన్నాయి. ''ఇవన్నీ తినేసెయ్యాలోయ్'' అంటూ మాకు మనిషికొక న్యూస్ పేపరిచ్చి వాటినిండా ఆ మిఠాయిలు పెట్టి తినమన్నారు. మేము అవి ఎక్కడివి, ఈ టైంలో పెడుతున్నారేమిటి? అని అడగకుండానే నవ్వుకుంటూ తినసాగాము. ఎంతని తినగలము? అన్నీ తీపి పదార్థాలే. మేము తింటుంటే మాస్టరుగారు మరలా మరలా పెడుతూనే ఉన్నారు. చివరకు తినడం ఆగిపోయి ''ఇక మావల్లకాదు సార్'' అన్నాము. ''ఒరేయ్! ఇవన్నీ బస్టాండుకు తీసుకుపోయి అందరికీ పెట్టేసి రావోయ్'' అని ప్రసాదుతో అన్నారు. ప్రసాదు ఆ బక్కెట్లు తీసుకుపోయాడు. అక్కడ వర్షం వల్ల మనుషులేగాదు, కుక్కలు కూడా లేవని తిరిగి వాపస్ తెచ్చాడు. తెస్తూనే ''సార్, రేపటికి ఉంచుకోవచ్చా'' అని అడిగాడు. ''ఓ! ఉంచుకోండి'' అంటూ తిరిగి మా నలుగురికీ మిగిలినవన్నీ పంచిపెట్టారు. కానీ మాస్టరుగారు ఒక రవ్వకూడ నోటిలో వేసుకోలేదు. మాస్టరుగారు ఆవిధంగా ఎందుకు పెట్టారో ఈనాటికీ అర్థం కావడం లేదు. ఏ ధాన్యం గింజ ఎవరి నోటిలోకి పొయ్యేది వ్రాసిపెట్టియున్నట్లే ఈ మిఠాయిలు మేము తినడం ముందు నిర్ణయమే కాబోలు.

## ఒక యువకుడు స్నానం చేయకుండా వచ్చి మాస్టారుగారికి అన్నం వండాడు!

మాస్టారుగారి సత్సంగానికి క్రమం తప్పకుండా నిత్యం వచ్చే ఒక యువకుడు ప్రసాదు అనేవాడు : 'మహనీయులు మన అంతరాత్మకు ప్రాధాన్యమిస్తారేగానీ బాహ్యడంబరాలకు కాదు' అని. విద్యానగర్ సాయిమందిర నిర్మాణం జరుగుతున్నరోజులు. అమ్మగారు బనగానిపల్లెకు వెళ్ళి ఉన్నారు. ఒకరోజు మాస్టారుగారు కాలేజీకి వెళ్ళి ఉన్నారు. ప్రసాదు స్నానం చెయ్యకుండానే బియ్యం కడిగి అందులోనే కూరగాయలు వేసి పొయ్యిపైన ఆ బియ్యం గిన్నెపెట్టి నాతో మాట్లాడుతూ ఉన్నాడు. మాటల సందర్భంగా మాస్టారుగారికి అన్నం వండుతున్నాను అని చెప్పాడు. అయితే స్నానం చేయకుండానే అన్నం ఎలా వండుతున్నావని అడిగాను. నాకు ఒంట్లో బాగా లేదు. ఇటువంటి పరిస్థితిలో మాస్టరుగారు స్నానానికి ప్రాధాన్యతనివ్వరు అన్నాడతడు. మాస్టారు గారు వచ్చి ఆ యువకుని చూచాడు. అప్పటికీ అతను స్నానంచేసి బట్టలు



మార్చుకోలేదు. కానీ ఆయన ఏమీ అనలేదు. చక్కగా అన్నం తినేశారు. మాస్టారుగారి అంతరంగమెలాంటిదో తెలుసుకోవడం నాలాంటి మలిన మనస్కునకెన్ని జన్మలకైనా సాధ్యమా? సాధ్యమే కాదు!

శ్రీ సిహెచ్.శ్రీనివాసులురెడ్డిగారు ఇలా చెపుతున్నారు. ఒకరోజు శ్రీ మాస్టరుగారు మాటల సందర్భంలో చెప్పినమాట అవధూతలు అందరికీ వర్తించడమెంతో గొప్ప విషయం.

''మనం గృహస్థులం గనుక చాలా గోప్యంగా ఉండాలి. మన ఆధ్యాత్మిక శక్తి లోకానికి తెలియనివ్వకూడదు. ఎవరికైనా రాబోవు ఆపదలు తొలగించవచ్చు. కానీ మనం తొలగించినట్లు వారికి తెలియకూడదు'' అన్నారు. ఈ విషయంలో పూజ్య శ్రీ మాస్టరుగారే కాకుండా బ్రహ్మచారి అయిన శ్రీ వెంకయ్యస్వామివారు తాను రక్షించినట్లు సుతరాము అంగీకరించేవారుకాదు. కంచి వరదరాజస్వామివారిపైన, నెల్లూరు రంగనాయకుల స్వామివారిమీద, పెంచలుకోన నృసింహస్వామివారిపై చెప్పేవారు. ఆ విధంగా తాను మహాసమాధి చెందేవరకు గోప్యంగానే ఉండేవారు. శ్రీ సాయి అల్లామాలిక్ అని, ఆ ఫకీరే రక్షిస్తారని చెప్పేవారుగదా! ''స్వప్నదర్శనమిచ్చి మీరిలా ఆదేశించారు సార్'' అని శ్రీ మాస్టరుగారితో నేననేకసార్లు చెపితే వారు ఒకే ఒక మాటతో కొట్టేశారు. ''ఆయనకేమీ పనిలేదు. నా రూపంలో వెళ్ళి అనేకమందికి అలా చెపుతుంటారు. నేనూ మీలాంటివాడినే. నాకలాంటి సామర్థ్యం లేదు'' అని బొత్తిగా అంగీకరించేవారుకాదు.

సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః
ఆచార్య శ్రీ భరద్వాజ గురవే నమః

# ఆధ్యాత్మికత

## చపాతీలు నిరాకరణ

అప్పుడు మాస్టరుగారు వెంకటగిరిలో ఉన్నారు. ఒక గురువారం వారికి రాత్రి టిఫిన్‌గా చపాతీలు తీసుకువెళ్ళాలని తలచాను - రాత్రిపూట వారెప్పుడూ తినేవారు గనుక. ఒక కిలో గోధుమపిండి ఒక పొట్లం, అరకిలో గోధుమపిండి మరొక పొట్లం తెచ్చి ఇంట్లో యిచ్చి, 'కిలో గోధుమ పిండి చపాతీలు చేసి ఇవ్వండి. అన్నీ వెంకటగిరి తీసుకుపోతాను. ఈ అరకిలో పిండి మీరు చేసు కోండి. కిలో పిండిలో ఒక్కటి కూడా తీసుకోవద్దు'ని చెప్పి అలానే చేయించి పొట్లం కట్టుతున్నాను. నా కుమారుడు 4 సం॥ల వాడు చేయి చాపాడు. మా అమ్మ వాడికొక చపాతీ ఇవ్వబోయింది. నేను అడ్డం తగిలి ఇవ్వకుండాచేసి ఆమెను కాస్త మందలించాను. ఆ చిన్నారి వెధవ చిన్నబుచ్చుకుని వెళ్ళాడు. అది చూచి నా కుమార్తె, నా భార్య కాస్త బాధపడ్డారు. వెంకటగిరి చేరాక రాత్రి ''ఒరేయ్! ఈరోజు అన్నం తినాలనిపిస్తుందిరా'' అని అన్నం పెట్టించుకొని తింటున్నారు. వారితోటి మరి నలుగురు తింటున్నారు. అందరికీ నేనే వడ్డిస్తున్నాను. ''మీకొరకు చపాతీలు తెచ్చాను సార్! ఒక్క ముక్కయినా తిన''మని ముక్కలు చేసి ప్లేటులో పోసి దగ్గర పెట్టాను. అలానే తింటానంటూ వాటిలో చెయ్యి కూడా పెట్టకుండానే మజ్జిగతో తిని వెంటనే తన జేబులోని కిళ్ళీ తీసి నములుతున్నారు. నా మనసు బాధపడింది. ఆ క్షణంలో ఎందుకు అలా జరిగిందో తెలియలేదు.

ఆ తర్వాత ట్రిప్పులో నేను వెంకటగిరికి పోతూ బస్‌కొరకు వేచి యున్నాను. నా అన్నం నేను తీసుకుపోవడం అలవాటు. నేను ఉప్పు, కారంలేని ముక్కలే తింటాను గనుక ఉడకబెట్టిన అరటికాయ ముక్కలే అన్నం పైన ఉన్నాయి. ఒక ముక్క తీసి నోట్లో వేసుకున్నాను. వెంటనే ''ఛ! ఈ ముక్కలు



కూడా మాస్టరుగారికి సమర్పించే భాగ్యం లేకుండా ఎంగిలి చేశానే'' అని బాధపడిపోయాను. వెంకటగిరి చేరగానే రూములో మాస్టరుగారు తప్ప ఎవ్వరూ లేరు. వారు తలస్నానం చేస్తున్నారు. నా గొంతువిని కుశలప్రశ్నలడిగి తల తుడుచుకుంటూ వస్తున్నారు. అప్పుడు గంట సాయంకాలం ఆరు అయింది. ''వీళ్ళు రాత్రంతా నన్ను తినేశారు సుబ్బరామయ్యా, అన్నం తిని ఒక్క నిద్రపోతే బాగుండును'' అని అన్నారు. ''తినండి సార్'' అన్నాను. వెంటనే వారు ప్రక్కనున్న డైనింగ్ టేబుల్ దగ్గర కుర్చీలో కూర్చున్నారు. నా అన్నం వడ్డించి ఉప్పుకారం లేని ముక్కలు పెట్టి, పచ్చడి ఊరగాయతో అన్నం తృప్తిగా భోంచేశారు. చివరలో మామూలుగా వారికి తెచ్చే టిఫిన్ కారియర్ వచ్చింది. ''అరే! ఇదెక్కడిది'' అన్నారు. ''ఇప్పుడు మీరు తినిన అన్నం నా అన్నం సార్'' అని చెప్పి నా చపాతీల అనుభవం, ఇప్పటి దబ్బలు ఎంగిలి చేయడం కూడా చెప్పాను. ''అంతే మరి! ఎవరి మనస్సు బాధపెట్టకూడదు. అందుకే బాబా అలా చేశారు. ఇది మనకు మంచి పాఠం'' అని చెప్పారు. గనుక వారెంతటి సిద్ధపురుషులో, వారి బోధనాదక్షత ఎంత మధురమో చూడండి.

### శేషయ్యకు శాలువ కప్పడం

నా కుమారుడు శేషసాయికి చిన్ననాటినుండి నరాల బలహీనత, చదువంటే విముఖత, డబ్బు అసలు లెక్క తెలియదు. అప్పుడు వాని వయసు 14-15 సం॥ ఉంటుంది. ఒకరోజు మాస్టరుగారి దగ్గరుండే హరి, ''సార్, మీరు అందరికీ చేస్తారుగాని పాపం సుబ్బరామయ్యగారి పిల్లవానికి ఏమీ చేయలేదు సార్'' అని అన్నాడట. అందుకు మాస్టరుగారు, ''నేనేమి చేసేదోయ్. అసలు సుబ్బరామయ్య నన్నావిషయమే అడగకనే పోయెనే. అడగనిదే నేనెలాచేసేది?'' అన్నారట. ఈ విషయం హరి నాకు జాబు వ్రాసి పిల్లవానిని తీసుకువచ్చి ఒక్కసారి మాస్టరుగారిని అడగండి. తప్పక చేస్తానన్నారు అని లెటర్ వ్రాశాడు. నేను మా అబ్బాయిని తీసుకు పోయాను. కానీ చిత్రంగా వారి గడప త్రొక్కాక ఆ విషయం వారిని అడగబుద్ధి పుట్టలేదు. నేనడిగితే వారిచ్చేటట్లుంటే ఈ స్వల్ప విషయం అడగడమేమిటి? ఆ పిల్లవాని బాధ్యత వారిని తీసుకోమని అడగదలచాను. మరునాడు మాస్టరుగారిని నేనేమీ

అడగకుండానే వచ్చేస్తున్నాను. చివరగా అబ్బాయి మాస్టరుగారికి నమస్కరిస్తుంటే ఊది ఇచ్చి ఒక ఉలన్‌శాలువ వానికి కప్పారు. వాని విషయం నేనేమీ అడగలేదు.

చిత్రంగా వాడు తెల్లవారినుండి 3-45 గంటలకు నిద్రలేచి చన్నీటి స్నానం చేసి నేరుగా శ్రీ స్వామివారి సమాధి మందిరానికి వచ్చి ఉదయం 7 గం॥ల వరకు మందిరంలో పనిచేస్తుండేవాడు. అంతకుముందు ఉదయం 8 గంటలకు నిద్రలేచేదే కష్టమయ్యేది. నిద్రలేపితే చాలా బాధపడిపోయేవాడు. అలాగే రెండునెలలు ఉదయాన్నే 3-45 గంటలకే నిద్రలేచేవాడు. ఆ తర్వాత ఒకసారి జ్వరమొచ్చి ఆ అలవాటు తప్పిపోయింది. ఆ తర్వాత అదే టైమునకు నిద్రలేపి పంపకుండా మేమే అశ్రద్ధ చేసినందున తిరిగి మామూలయ్యాడు. ఇందులో చిత్రమేమిటంటే నేనడగకుండానే శాలువ కప్పడం, రెండవది కప్పిన తెల్లవారినుండి ఎవరి ప్రమేయమూ లేకుండా నిత్యం 3-45 గంటలకే నిద్రలేవడం.

## సంకల్పసిద్ధి

ఒంగోలులో ఒక ఇంజనీరుగారుండేవారు. అదేమి చిత్రమోగాని ప్రతిరోజూ వారి జేబులోని డబ్బులలో కొంత మాయమవుతుండేది. వారెంత జాగ్రత్త వహించినా అలానే జరిగేది. ఆవిధంగా అతడెంతో ధనం నష్టపోయాడు. తన దగ్గర డబ్బు ఉంచుకోకుండా ఎప్పుడూ తనకొక మనిషిలేనిదే ఎక్కడకూ వెళ్ళలేని పరిస్థితి అయింది. అలాగే వారి చేతిగడియారం కూడా మోసం చేసేది. ఒక్కొక్కసారి ఎక్కువ టైం చూపేది. ఒక్కొక్కసారి తక్కువ చూపేది. రిపేరర్ చూసి ఏ దోషమూ లేదని చెప్పేవాడు. ఇతరులు పెట్టుకుంటే సరిగ్గానే ఉండేది. వారెన్నో మ్రొక్కుబడులు, పారాయణలు, మంత్రగాళ్ళను ఆశ్రయించినా ప్రయోజనం లేకపోయింది. చివరకు శ్రీ మాస్టరుగారిని ఆశ్రయించారు. మాస్టరుగారు కొద్దిగా విభూతి పొట్లం కట్టి వారికిచ్చి దానిని వారిజేబులో ఎప్పుడూ ఉంచుకునేట్లు చూడమని చెప్పారు. అలా చేయగానే వారి రెండు బాధలూ తొలగాయి.

మా కుమార్తె బ్యాంక్ ఇంటర్వ్యూకు పోతున్నది. మాస్టరుగారి ఆశీస్సులు కోరి నేను ఒంగోలు వెళ్ళాను. వారికి విషయం చెప్పి వారి చేతితో



ఊది తీసుకుని ఇంటికి రాబోతున్నాను. మాస్టరుగారు నాకు మరొక చిన్న ఊది పొట్లం ఇచ్చి ''ఆమె ఇంటర్వ్యూ గదిలోకి పొయ్యేటప్పుడు ఈ ఊది పొట్లం ఆమె చేతిలోని పర్సులో ఉండేలా చూడు. ఆమె తొందరలో ఉంటుంది. పొట్లం బాధ్యత మీరు చూడండి'' అని చెప్పారు. అలాగే చేశాను. ఇంటర్వ్యూలో ఫార్మసిస్టులను డాక్టరు ప్రశ్నించవలసివుంటే ఇతర ఆఫీసర్లు ఈమెను ప్రశ్నించి ఆ ప్రశ్నలకు ఈమె చెప్పలేని స్థితిలో ఊది పనిచేసింది. వెంటనే డాక్టరుగారు అందుకుని ఆమెను ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రతిప్రశ్నకు ఆమె చాలా చక్కగా జవాబు చెప్పింది. ''ఈ సమాధానాలన్నీ నీకెలా తెలిసాయి'' అని ఆ డాక్టర్ ఆశ్చర్యపోయాడు. కానీ లంచాల కారణంగా మాకు సెలక్షన్ రాలేదు. లంచాలు తీసుకున్నారని కేసు జరిగింది. ఒకటిన్నర సంవత్సరానికి ఇంటర్వ్యూ మార్కులు లేకుండా వ్రాతపరీక్ష మార్కులతోనే పోస్టింగులు ఇచ్చారు. అందులో మా అమ్మాయికి కూడా వచ్చింది.

## నా సిగరెట్టు నాకివ్వు

ఒక రాత్రి పదిగంటలకు విద్యానగర్ వెళ్ళే బస్సు తప్పిపోయినందున సిహెచ్.శ్రీనివాసులురెడ్డిగారు గూడూరు బస్టాండులో ఆలోచిస్తున్నారు. చాలా బలహీనంగా వున్న, మన ప్రపంచ గుర్తింపులేని ఒక వ్యక్తి అతని కంటబడ్డాడు. ఈయన మహనీయుడై ఉంటాడేమో అని టీ ఇచ్చారు. అతను టీ గ్లాసు పట్టుకుని నేలమీద కూర్చున్నాడు. వెంటనే రెడ్డిగారు కూడా వారి దగ్గర నేలపై కూర్చుని ఉదయం 4½ గంటలవరకు టీ, సిగరెట్లు ఇప్పిస్తూనే ఉన్నారు. వారు తీసుకుంటున్నారుగానీ ఏమీ మాట్లాడలేదు. 4½ గంటలకు తన బస్సు వస్తుంది. తన దగ్గర ఇక ఒకే ఒక సిగరెట్టు వుంది. దాన్ని శ్రీ మాస్టరుగారికి ఇవ్వాలని జేబులో ఉంచుకొని బస్సు ఎక్కారు. తర్వాత ఆ సిగరెట్టు విషయమే మరచిపోయాడు. విద్యానగర్‌లో మాస్టరుగారి దర్శనం చేసుకొని కొంతసేపు మాట్లాడి ఇంటికి వెళ్ళబోతుండగా మాస్టరుగారు, ''రేయ్ - నా సిగరెట్టు నాకిచ్చి వెళ్ళు'' అన్నారు. ఆ సిగరెట్టు మాట మరచిపోయినందున అప్పటికే అది చెమటకు తడిసి, నలిగిపోయింది. దాన్ని మాస్టరుగారికి సమర్పించగానే మాస్టరుగారు ఒక సిగరెట్టు ప్యాకెట్ రెడ్డిగారివైపు విసరి, ''ఒకటిచ్చి పది కొట్టెయ్యడమంటే ఇదే కాబోలు'' అన్నారు.

ఒకరోజు శ్రీనివాసులురెడ్డిగారిని సమయ సందర్భాలు లేకుండా ''నీవు భగవద్గీత వింటావా'' అని, ''చివటం అమ్మగారినుండి కబురొచ్చిందోయ్. ఎక్కడికో సుదూర ప్రాంతాలకు వెళ్ళిపోతున్నారట!'' అని మాస్టరుగారన్నారు. శ్రీనివాసులురెడ్డిగారు అదేరోజు చివటం బయలుదేరి వెళ్ళారు. అమ్మగారి దర్శనానంతరం రెడ్డిగారిని తనతో రమ్మని సైగచేసి ఒకరి ఇంట్లోకి తీసుకు వెళ్ళారట. చిత్రం! అక్కడ రేడియోలో భగవద్గీత వస్తున్నదట. అది వింటూనే రెడ్డిగారి వళ్ళు జలదరించిందట. ఎందుకు? శ్రీ మాస్టరుగారు విద్యానగర్‌లో అన్నమాట చివటంలో అమ్మ సన్నిధిలో వాస్తవమవుతున్నది గనుక. ఆ తర్వాత మూడురోజులకే చివటం అమ్మగారు సమాధి చెందినట్లు తెలిసింది. మాస్టరుగారికందిన కబురుయొక్క అర్థమేమిటో అప్పుడు తెలిసింది.

## కిరిణీపండు

నాదొక వింత జంతు స్వభావం. నేనెపుడూ మాస్టరుగారికి పూలుగాని, పండ్లుగాని సమర్పించి ఎరుగను. వారిచ్చిన ప్రసాదాలు మాత్రం కమ్మగా తినే అలవాటే. ఒకరోజు గూడూరు బస్టాండులో 50 పైసలిచ్చి చాలా చిన్న కిరిణీపండు (కర్బూజపండు) కొని దీన్ని మాస్టరుగారు తప్పక తినాలి అనుకొని బస్సులో కూర్చుని పండు చేతపట్టుకుని నామస్మరణ చేస్తూ విద్యానగర్ వెళ్ళాను. పోతూనే రెండుచేతులు చాపి నా చిన్న కిరిణీపండు అందు కొని దాన్ని అందరి నివేదనలతోపాటు కాకుండా ఒక ప్రక్కన పుస్తకాల్లో పెట్టారు. హమ్మయ్య! ఈ పండు మాస్టరుగారు తప్పక తింటారనుకున్నాను. ఇంతలో మందిరం దగ్గర ఏదో పని ఉండి వెళ్ళి వచ్చేసరికి ఆ పండు అక్కడ లేదు. ఆ పండును ఎవరికో ఇచ్చేసారనుకున్నాను.

రాత్రి భోజనాలయ్యాక మాస్టరుగారు సత్సంగరూములో కూర్చుని ''ఆ ప్రసాదం ఇస్తారూ'' అన్నారు. ఒక ప్లేటులో తొక్కవొలిచి చిన్న చిన్న ముక్కలుగా తరిగిన కిరిణీముక్కలు తెచ్చి మాస్టరుగారి చేతికిచ్చారు. మాస్టరుగారు ఒకటి రెండు ముక్కలు తిని నాకూ ప్రసాదంగా ఇచ్చి మిగిలినవి ఇంట్లోకి పంపారు. ఆవిధంగా నామస్మరణను ఆ పండుద్వారా అంగీకరించారు.



## నా గుండెలమీద వ్రాయడం

శ్రీ వెంకయ్యస్వామివారి అవధూతలీల రెండవ ముద్రణ ప్రచురణ విషయంలో శ్రీ మాస్టరుగారికి, ఆశ్రమ కమిటీ వారికి భేదాభిప్రాయముల వలన, వీరిద్దరి మధ్య నేను చిక్కుకున్నాను. శ్రీ మాస్టరుగారు తన పేరు అవధూతలీల గ్రంథంలో లేకుండాచేసి పుస్తకమంతా మార్చివ్రాసి ప్రచురించు కోమంటారు. ఆశ్రమంవాళ్ళు ఆ పని నన్ను చేయమంటారు. అది నాకు సాధ్యమయ్యే పనికాదు. ఆరాధన దగ్గరకొస్తున్నది. తొందర చేస్తున్నారు. నేను వ్రాయకుంటే మరొకరిచేత వ్రాయిస్తారు. అందులో ఎన్నో అవివేక ప్రసంగాలతో భాషాడాంబికంతో పుస్తకం చెడిపోతుందని నా బాధ. నేనే వ్రాస్తామంటే పేనా కదలదే! నా మానసిక బాధ వర్ణనాతీతం. తట్టుకోలేక నా బాధంతా లెటర్ వ్రాసి పోస్ట్ చేశాను. ఆ లెటరు వారికి చేరకముందే - ఆనాటి రాత్రి మాస్టరుగారు నాకు స్వప్నదర్శనమిచ్చి, నా గుండెలపై చాకీసుతో ఏమో వ్రాస్తూ, నాకు ఏదో బోధిస్తున్నారు. నా మనసు తేలికపడింది. తెల్లవారి వెంటనే ఒంగోలు వెళ్ళి మాష్టరుగారికి నాటిరాత్రి నాకు కల్గిన స్వప్నాన్ని గూర్చి చెప్పాను. ''ఏమో! సాయినాథుడు నా రూపంలో వచ్చి అలా భక్తులకు ఊరట గల్గిస్తుంటాడు - ఇంకేమీ ఫర్వాలేదు. స్వామి వారి చరిత్ర ద్వితీయ ముద్రణకు రచన సాగించు'' అని అన్నారు. మీరే అలా వచ్చారంటే వారు సుతరాము అంగీకరించలేదు. నేను వ్రాయలేనని మొండికేశాను. అప్పుడు వారు దయతో ఎలా వ్రాయాలో కొన్ని గైడ్‌లైన్స్ చెప్పి కొన్ని చిట్కాలు చెప్పి తప్పక వ్రాయమని ఆశీర్వదించారు. వారి దయవల్ల అలానే జరిగింది.

ఇచ్చట గమనించవలసినదేమంటే నా లెటరు వారికి చేరకముందే నాకు స్వప్నాదేశమిచ్చి ఊరడించడమంటే వారు సర్వగతులు, సర్వసాక్షిగా ఉండనిదే అలా జరుగదు గదా!

వారి మహాసమాధి అనంతరం కూడా వారు తన్నాశ్రయించిన వారి మంచిచెడ్డలన్నీ జాగరూకతతో గమనిస్తున్నారు. వారు మనమధ్యనున్నన్ని రోజులు నన్ను నరసోబావాడి వెళ్ళిరమ్మని అనేకసార్లు చెప్పారు. కానీ నేను వెళ్ళలేకపోయాను. వారు మహాసమాధి చెందాకనైనా వారి ఆజ్ఞను పాటించా

తలచి నేను నరసోబావాడి వెళ్ళాను. వెళ్ళిననాటి రాత్రే మాస్టరుగారు స్వప్నదర్శనమిచ్చారు. అందులో - మాస్టరుగారు అల్లంత దూరంనుండి నాకెదురుగా నడచి వస్తున్నారు. వీరు మహాసమాధి చెందారుగదా - మరిప్పుడిలా వస్తున్నారేమిటి? అని ఆశ్చర్యంతో చూస్తూ ముందుకు నడుస్తున్నాను. నా భావాన్ని గమనించిన మాస్టరుగారు 'ఇలా రాగలగడమే నా గొప్పదనం' అన్న భావం వ్యక్తంచేస్తూ నవ్వుతూ నన్ను సమీపించారు. ఇది భ్రమా? నిజమా? అని నేను మాస్టరుగారి చేతులు, నడుము, కాళ్ళు వత్తి వత్తి చూస్తూ చివరకు పాదాలపైబడి గట్టిగా మోకాళ్ల దగ్గర వాటేసుకున్నాను. ఆ తన్మయత్వం, సంబరంలోనే మెలకువ వచ్చింది. నరసోబావాడి సత్రంలో నేనున్నాను. మాస్టరుగారు మాత్రం సాక్షీభూతులుగా వుండి ''కనీసం ఇప్పుడైనా నామాట పాటించావు - సంతోషం'' అని ఆశీర్వదించారని సంతోషించాను.

## శరీరభ్రాంతి

పూజ్యపాదులు శ్రీ మాష్టరుగారు పనిచేస్తున్నా వారికి శరీర భ్రాంతే ఉండేది కాదు. ఒకరోజు రాత్రి పొదలకూరులో ఇష్టాగోష్టిగా మాట్లాడుతున్నారు. రాత్రి పదిగంటల ప్రాంతంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేసే కొంతమంది భోజనం చేసి వచ్చి సంభాషణలో పాల్గొన్నారు. రాత్రి ఒంటిగంట అయినా మాష్టరుగారు యథాలాపంగా మాట్లాడుతూనే ఉన్నారు. సంభాషణ చాలా తీవ్రస్థాయిలో ఇష్టా పూర్వకంగా సాగుతుంది. మాష్టరుగారు భోంచేయలేదు గనుక మేము నలుగురం భోంచేయలేదు. మాకు చాలా తీవ్రంగా ఆకలవుతున్నది. రెండు మూడుమార్లు మాష్టరుగారికి చెప్పినాగాని సంభాషణ ఆపలేదు. తర్వాత వారు 'పెట్టేయ్ తినేస్తాను' అన్నారు. ఇట్లా కాదని కలిపి ముద్దలు చేతిలో పెడుతుంటే కూర్చున్నచోటనే తింటూ మాట్లాడుతూనే ఉన్నారు. ఒక గిన్నెలో చెయ్యి కడుక్కునేటట్లు నీళ్ళు పోశాను. అప్పుడు మేము భోంచేశాము. ఆ తర్వాత ఎప్పుడో సంభాషణ ముగించారు. ఇంతమందిలో ఇలా తింటున్నానే అనే ఆలోచనే వారికి లేదు. వారికి ఆ సమయంలో శరీరభ్రాంతే పూర్తిగా లేదని తోస్తుంది. అట్టి మహనీయమూర్తి సాంగత్యముతో మా జన్మ పావనమైందని విశ్వసిస్తాను.



## అనుక్షణం ఆత్మలో

మా మిత్రుడు, అతని భార్య అప్పుడప్పుడూ తీవ్రంగా తగాదా పడేవారు. ఆమె నోరు, అతని చెయ్యి బాగా పనిచేసేవి. ఒకరోజు నిష్కారణంగా నిందారోపణకు గురియైన ఆమె చాలా బాధతో దుఃఖిస్తూ తన బాధ నాదగ్గర వెళ్ళగక్కింది. నేనామె బాధ చూడలేక ఒక ఇన్‌లాండ్ కవరిచ్చి తన బాధనంతా వ్రాసి మాష్టరుగారికి తెలుపమన్నాను. ఆమె తన హృదయవేదన ఏమని వర్ణించిందో చెప్పలేను. కానీ ఆ లెటర్ పోస్టులో వేసిన మరుక్షణమే తనకు తన బాధంతా తీసివేసినట్లయిపోయి మనసుకు ఎంతో ఉల్లాసంగా హాయి కలిగిందట. ఒక అరగంటలో తిరిగి నా దగ్గరకు నవ్వుతూ వచ్చి తన చిత్రమైన అనుభవాన్ని ఏకరువు పెట్టింది. లెటరు వ్రాసిన మరుక్షణంలో మనసు తేలికపడటమేమిటి?

మాష్టరుగారు సర్వగతులు, సర్వజ్ఞులు, సర్వసమర్థులు అని తెలుస్తుంది. ఈ విషయం వారికి చెపితే వారు సుతరాము తన గొప్ప నంగీకరించనే అంగీకరించరు.

**మాష్టరుగారంటే ఈమెకున్న గొప్ప గౌరవభావానికి ఒక ఉదాహరణ :** ఒకరోజు మాస్టరుగారు కలిచేడు వచ్చారు. ఆ రాత్రికి టిఫిన్ వారింట్లో ఏర్పాటు చేశాను. కొన్ని కారణాల వలన మాస్టరుగారు రాత్రి ఒంటిగంట ప్రాంతంలో వారింటికి వెళ్ళారు. ఆ వేళగాని వేళలో ఆమె తన స్నేహితురాలితో కలసి చపాతి చేసేందుకు సర్వం నట్టింట సిద్ధంగా పెట్టుకొని కూర్చొని వుంది. అలాంటి భక్తిభావాన్ని భక్తుల హృదయాలలో నెలకొల్పిన మాస్టరుగారి కరుణామయ హృదయానికి అనంతకోటి ప్రణామములు.

## కలిచేడు మందిరంలో ఈశాన్యదిక్కు

కలిచేడులోని భక్తులు సాయిమందిరానికని స్థలం కొన్నారు. ఆ స్థలంలో మాస్టరుగారు పాదం పెడితే సత్సంగం మొదలుపెట్టాలని తలచాను. రాపూర్ గోపాల్ పెండ్లికి కలిచేడు వస్తే మాస్టరుగారిని మందిర స్థలానికి తీసుకుపోయాను. స్థలం నాలుగువైపులా చూచి, ''కొబ్బరికాయ ఏది?'' అని చేయి

చాపారు. తెచ్చేందుకు నేను ప్రక్కనున్న మాయింటికి పోయాను. నేను వచ్చేలోగా మరొకరి దగ్గర టెంకాయ ఉంటే తీసుకొని కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. నేను తెచ్చిన పసుపు, కుంకుమ ఒక చోటవేసి అక్కడ చిన్నరాయి వేయించి దానిపై టెంకాయ కొట్టారు. చిత్రం! టెంకాయ ఖచ్చితంగా రెండుగా పగిలింది.

అంతకంటే చిత్రమేమంటే వాస్తు శాస్త్రజ్ఞులు వచ్చి మేమేమి చెప్పకుండానే మాస్టరుగారు టెంకాయకొట్టిన స్థలాన్నే శంఖుస్థాపన స్థలంగా నిర్ణయించారు.

## పుట్టినరోజు పండుగ - రక్తబేదులు

సాయిభక్తులందరూ కలసి మాస్టరుగారి పుట్టినరోజు పండుగ విద్యానగర్‌లో ఎంతో కోలాహలంగా ఆనందంగా చేసుకొనే రోజులవి. కనీసం రెండు గంపలనిండా పోళీలు చేయించేవారు. (మాస్టరుగారి ఖర్చుతో) తిన్నవారికి తిన్నన్ని, వద్దనే కొద్దీ పెట్టించేవారు. ఇండ్లకు పోతుంటే ఆ వచ్చిపోయే భక్తులకేగాక వారి గ్రామములోని సత్సంగీయులందరికీ దండిగా ప్రసాదమని పోళీలు పంపేవారు. ఆరాత్రంతా భజన, పారాయణ, సత్సంగాలతో జాగరణ చేసేవాళ్ళము.

ఒక సంవత్సరం రాత్రివేళ భజన జరుగుతుంది. మాస్టరుగారు కనీసం ఇరవైసార్లయినా సత్సంగం రూమునుండి ఇంటిలోకి వెళ్ళి వస్తున్నారు. ఇంటిలో ఎవరికో ఆరోగ్యం బాగులేదు కాబోలు అని అందరూ అనుకొన్నారు. తెల్లవారి అందరూ వారి వారి గ్రామాలకు వెళ్ళిపోయారు. ఎప్పుడో మాస్టరుగారు ఒంటరిగా ఉంటే నేనే అడిగాను : ''రాత్రంతా తరచుగా ఇంటిలోకి వెళ్ళి వస్తున్నారు. ఎవరికి బాగాలేదు సార్?'' అందుకు మాస్టర్‌గారన్నారు ''నాకే సుబ్బరామయ్యా! రాత్రంతా రక్త విరేచనాలు!'' ''అన్నిమార్లు రక్తవిరోచనాలైతే మీరు విశ్రాంతిగా పడుకోకుండా మాముందెందుకు సార్ కూర్చోవడం!'' ''భలేవారే మీరంతా మీ ఇల్లు వాకిలీ వదలి రావడమూ, నేను పడుకోవడమా'' అన్నారు. శరీరానికంటే ముందు మనసే అలసిపోతుందని వారు చెప్పిన మాట అక్షరాలా నిజమని నిరూపించారు. మనసు అలసిపోలేదు గనుక మా ఎదుట అంత బలహీనతలోనూ కూర్చోగలిగారన్నమాట.



## బి. ఇడి కాలేజీలో మీటింగు

బి.ఇడి. కాలేజ్ - విద్యానగర్‌లోని నాస్తిక విద్యార్థులందరూ నాస్తికులచేత ఒక ఉపన్యాసం ఇప్పించారు. ఆస్తిక విద్యార్థులందరూ మాస్టరుగారిచేత ఉపన్యాసం ఇప్పించాలని తేదీ నిర్ణయించి కాలేజంతా తెలియపరచారు. మీటింగు ఇక మూడురోజులుందనగా మాస్టరుగారికి విపరీతంగా జ్వరం! మందులు వాడుతున్నా తగ్గడం లేదు. అన్నం బొత్తిగా తినడం లేదు. ఆరోజు మీటింగుకు పోవద్దని ఎంత చెప్పినా వినలేదు. మోటారుసైకిల్‌పై తీసుకు వెళ్ళారు. మూడుగంటలసేపు వేదికపై నిలుచొని బ్లాక్‌బోర్డుమీద బొమ్మలతో వివరిస్తూ ఉపన్యాసం సాగించారు. మధ్యలో అడ్డుప్రశ్నలు వేసే విద్యార్థులది పెద్దబాధ. ఒకరి అడ్డుప్రశ్నకు సమాధానం చెపుతుంటే, మరొక విద్యార్థి మరొక అడ్డుప్రశ్న వేశేవాడు. అంతా విన్నాక ప్రశ్నలడగండి అని ఎన్నిమార్లు చెప్పినా అంతే. ఒక గంటలో ముగియవలసిన ఉపన్యాసం అడ్డుప్రశ్నల మూలంగా మూడుగంటలు పట్టింది. ఇంతసేపు మాస్టరుగారు అంత బలహీనంగా ఉన్నా ఏమీ తొట్రుపాటు లేకుండా ఉపన్యాసం ముగించారు. ఇంటికి వచ్చాక బొమ్మలాగా అలాగే కూర్చుండిపోయారు. చూపు ఎక్కడో లయమయింది. నేను పెద్ద కర్పూరం గడ్డ దిష్టితీసి బయటపడేస్తే అది మండుతూ వుంది. ఎప్పుడో మనలోకంలోకొచ్చి, 'బయట ఆ మంటేమిటి?' అన్నారు. మనసు అలసిపోకుంటే శరీరమే అలసిపోదు అనే వారి మాటకు వారే చక్కని ఉదాహరణయ్యారు.

## మరణభీతిలేని మాస్టారు

శ్రీ మాస్టరుగారు విష్ణుమూర్తి అవతారమని శ్రీ పాకలపాటి గురువుగారు, మరియు శ్రీ స్వామివారి సేవకులు శ్రీ రోసిరెడ్డిగారు చెప్పినాగాని నాకు మాత్రం వారు మామూలు మాస్టరుగారే. ఈరోజు అనేక మంది చెప్పే అనుభవాలు ఆరోజు వారివారికి జరిగి వున్నాగాని అవి నా చెవిన పడలేదు. ఒకవేళ నాకు అనుభవం వస్తే మాస్టరుగారు దాన్ని అంగీకరించకుండా నా రూపంలో బాబానే అలా చేస్తుంటారనేవారు. గనుక ఈ క్రింది విషయాలు ఎంత గొప్పవో చూడండి. ''మానవులకు అన్నిటికంటే గొప్ప భయం

మరణభీతి'' - అని మాస్టరుగారే ఒకప్పుడన్నారు. వారా మరణభీతినుండి వైదొలగి - మన మధ్య వారుండగనే శుద్ధ చైతన్యరూపులుగా లోక వ్యవహారం నడుపుతుండేవారు.

1. ఏప్రెల్ 12వ తేదీలోగా వచ్చి మాట్లాడిపొమ్మని ఒకటికి రెండు జాబులు వ్రాయించినా నేను పోలేదు. మూడవజాబు వారే స్వహస్తాలతో వ్రాస్తే కుటుంబమంతా వెళ్ళాము. ఎప్పుడూ ఇవ్వనన్ని గుడ్డలు (క్రొత్తబట్టలు) ఒక చాకలిమూటన్ని ఇచ్చారు. ''ఎందుకు సార్ ఇన్ని'' అంటే ''ఏమి నీకు బరువా! మనిషిని పంపుతాలే'' అని నవ్వారు. అదే వారిచ్చే చివరి కానుకని నాకు తెలియదాయె. ఈవిధంగా ఎందరికో 12 తర్వాత తానుండననీ, ఈ లోపలే వచ్చిపొమ్మనీ వ్రాశారు.

అంటే తాను ఫలానారోజు ఫలానా టైంకు శరీరం త్యజించబోతున్నానని వారికి క్షుణ్ణంగా తెలిసినా ఎవ్వరికీ అంతుబట్టనివ్వలేదు. పూజ్యశ్రీ మహల్సాపతిగారు, శ్రీ రోశిరెడ్డిగారు, శ్రీ పోలిరెడ్డిగారు శరీరం త్యజించినట్లుంది. మరణభీతి లేకపోవడం అంటే ఏమిటో ఆచరించి చూపిన శుద్ధచైతన్యమూర్తివారు. నేటికీ ఆర్తులకు భౌతిక దర్శనమిచ్చి ఆదుకుంటున్న ఘనులువారు.

## సాయిపేట డాక్టర్ వెంకటేశ్వర్లుగారు

సాయిపేట డాక్టరు శ్రీ వెంకటేశ్వర్లుగారు తన దివ్యానుభవం ఇలా చెపుతున్నారు. వీరొక సమస్యను గూర్చి శ్రీ మాస్టరుగారి సమాధికి విన్నవించాలని ఒంగోలు మందిరం సమీపానికి వస్తున్నారు. మాస్టరుగారి సమాధి దగ్గరకొచ్చాక తనపైనున్న టవల్ ఎక్కడో మార్గమధ్యంలో పడిపోయిందని గుర్తించారు. తాను వచ్చినపని గూర్చి శ్రీ మాస్టరుగారి సమాధికి విన్నవించుకొని పోతున్నాడు. పోయిన తన కండువా దొరికితే తన పని సఫలమౌతుందని గుర్తని, అట్లా దొరకకుంటే తన పని కానట్లు గుర్తని భావిస్తానని చెప్పుకొని బయలుదేరి వెళ్ళిపోతున్నారు. నడిచిపోతూ తీవ్రమైన ఆలోచన కల్గి తాను వచ్చిన మార్గాన పోకుండా మరొకవీధిగుండా పోతూ ''ఇదేమిటి ఇలా వచ్చేశానే, నేను మందిరానికి ఏ మార్గాన



వెళ్ళానో, అదే మార్గాన వెతుక్కుంటూ వెళితేగదా టవల్ దొరుకుతుంది'' అని అనుకుంటూనే ఇంకొంతదూరం ముందుకు వెళ్ళాడు. చిత్రంగా అక్కడొక వ్యక్తి తన టవల్ చేతపట్టుకొని ''ఇది మీదా, మీదా'' అని అక్కడుండే ఇళ్ళ వాళ్ళనడుగుతున్నాడు. వాళ్ళు మాదిగాదని చెపుతున్న దృశ్యం చూచాడు. వెంటనే వెళ్ళి ఆ టవల్ తనదని చెప్పి దాన్ని తెచ్చుకున్నాడు. అనతికాలంలో వారి పని పూర్తయింది. ఈవిధంగా మాస్టరుగారు మహాసమాధి అనంతరంకూడా తన భక్తులను అనుగ్రహిస్తున్నారు.

D. రఘురామరాజు అనే మాస్టరుగారి విద్యార్థి యిలా వ్రాస్తున్నారు : ''నేను విద్యానగర్‌లో డిగ్రీ చదివేరోజుల్లో - ఉదయగిరి నివాసులు చాలా గొప్పవారని చెప్పుకొనే జలాలుద్దీన్ బాబాగారు ఉదయగిరి వచ్చారని చెప్పాను. అట్లయితే నీవు గూడా వారిని ఒకసారి దర్శించమని మాస్టరుగారు చెప్పారు. వేసవి సెలవులకు నేను ఉదయగిరి వెళ్ళి బాబాగారిని దర్శించగానే వారు నన్ను వారి సన్నిధిలో నలభైరోజులు ఉండమన్నారు. సెలవులలో అలాగే వున్నాను. వారు ఖురాన్‌నుండి నాకొక మంత్రం చెప్పి నిత్యం రాత్రి 12 గంటల సమయంలో ఈ మంత్రం జపించమన్నారు. అందుకు పాటించవలసిన నియమాలు చెప్పారు. అంతేగాక ఈ మంత్రం ఎవ్వరికీ చెప్పకూడదని కూడా చెప్పారు. అదేవిధంగా నేనా మంత్రం జపిస్తుంటే ఒకరోజు రాత్రి ఒక పాము వచ్చి నా కుడికాలు తొడ ఎక్కే ప్రయత్నం చేస్తున్నది. నేను కళ్ళు తెరచి ఆ పామును చూచి భయపడ్డాను. వెంటనే బాబా నాకు వివేకం ప్రసాదించారు. ఇది కరిచేటట్లయితే ఈ పాటికే కరిచే వుండును. లేకపోతే ఏమీకాదు అని మరల కళ్ళు మూసుకొని జపం చేస్తున్నాను. ఆ పాము వెళ్లిపోయింది.

నేను తిరిగి విద్యానగర్ వచ్చి జలాలుద్దీన్ బాబాగారు నాకు మంత్రమిచ్చి జపించమన్న విషయం వగైరా మాస్టరుగారికి చెప్పాను. ఆ మంత్రమేమిటో తనకు చెప్పమన్నారు మాస్టరుగారు. ''సార్! అది వారి ఆదేశం లేకుండా ఎవ్వరికీ చెప్పకూడదట'' అని చెప్పాను. ''నాకు కూడా చెప్పవద్దన్నారా?'' అని అన్నారు. నేను వారిని విడమరచి అడగలేదు, కనుక తమకు ఆ మంత్రం చెప్పే ధైర్యం నాకు లేదన్నాను.

అపుడు అమ్మగారి గదిలోనుండి పాత సిగరెట్టు ప్యాకెట్ తెప్పించి ఆ ప్యాకెట్‌పై వ్రాసిన మంత్రాన్ని నాకు చూపిస్తూ, ''ఇదేగదా నీకు ఆయనిచ్చిన మంత్రం'' అని నాకు చూపించారు. చిత్రం - జలాలుద్దీన్ బాబాగారు నాకిచ్చిన మంత్రం అదే!

నేను నలభైరోజులు ఆ యోగి దగ్గర వుంటానని, వారు నాకా మంత్రం యిస్తారని ముందుగానే వ్రాసిపెట్టారు. ''ఒరేయ్! నీవా మంత్రం జపించవద్దు. ఆపేయ్. నీలో ఇంకా రాగద్వేషాలు చావలేదు. ఇంకొన్నాళ్ళు నీవా మంత్రం చేశావంటే నీ నోటిగుండా పలానివాడు చావాలంటే చస్తాడు. ఏమంటే అది జరిగిపోతుంది. గనుక నీవా మంత్రం చేయవద్ద''న్నారు. ఆ మంత్రం నాకు యివ్వకముందే వ్రాసియుంచిన ఆత్మజ్ఞానియైన మాస్టరుగారి మాటే నాకు శిరోధార్యమని ఆ మంత్రం జపించడం మానేశాను.

పరమ కరుణామయుడైన శ్రీ మాస్టరుగారు వారి మహాసమాధి అనంతరం కూడా స్వప్నదర్శనమిచ్చి నన్నాదుకొనడం ఎంత చిత్రమో! మా రెండవ పాపకు ఏమి పేరు పెట్టాలా అని ఆలోచిస్తున్నాను. మాస్టరుగారు స్వప్నదర్శనమిచ్చి 'దాక్షాయణి'' అని పేరు పెట్టమన్నారు. ''సార్! ఇది లక్ష్మి సహస్రనామాలలో వుందా'' అని అడిగాను. ''ఉంది, చూచుకో'' అన్నారు. తెల్లవారి చూస్తే అలాగే వుంది. ఆమెకాపేరు పెట్టాను. ఇక్కడ గమనించవలసిన దేమంటే నేను వారిని ప్రార్థించకున్నా సమయానికి నా సమస్యకు స్వప్న దర్శనమిచ్చి ఆదేశాన్నందించడం.

ఆ పరమ కారుణ్యమూర్తికి అనంతకోటి సాష్టాంగ దండ ప్రణామాలు.



సమర్థ సద్గురు సాయినాథాయ నమః
ఆచార్య శ్రీ భరద్వాజ గురవే నమః

# లెటర్స్

శ్రీ మాస్టరుగారు వ్రాసిన ఈ లేఖలలోని విషయములు మనం ఊహించలేనంతగా మానవజాతి ఉద్ధరణకు ఎంతగానో ఉపకరిస్తాయి. వాటిలో మాస్టరుగారు వ్రాసిన ఒక్కవాక్యం మాత్రం ప్రతివారికీ ఉపయోగపడేదేనని గుర్తించ మనవి. ఆ వాక్యం ఏమంటే - శ్రీమతి సుబ్బమాంబగారికి వ్రాసిన లెటరులో వ్రాశారు - ''మీ యత్నం కావాలి, ప్రతి అవకాశాన్ని బాబా పిలుపుగా భావించి యత్నించండి. యత్నంతోటే అవుతాయని కాదు. **యత్నించవలసిన మన ఖర్మను నివారించుకొనుటకే.** యత్న ఫలితాలు వారి వారి బిడ్డల ప్రారబ్ధాలమీద కూడా ఆధారపడుతాయని గుర్తించాలి.''

మేమెన్నో వివాహ ప్రయత్నాలు చేశాము. కావడం లేదని, మరికొందరు - పని అయినట్లే ఉంటుంది కాని కాదు, నోటిదాకా వచ్చి పోతుందని వాపోయేవారికి - శ్రీ మహావిష్ణువే మనమధ్య అవతరించి మన మేలుకోరి సాక్షాత్తు వారి కలంనుండి వెలువడ్డ సలహా ఇది. ఇందలి సలహాను సంతోషంగా ఆచరించడమొక్కటే మనకు శ్రేయస్కర మార్గమని అందరము గుర్తించి ఆ సద్గురుమూర్తికి మనస్పూర్తిగా సర్వస్వశరణాగతి చేద్దాము.

## 18-11-82న పూజ్య మాస్టరుగారు నాకు వ్రాసిన ఉత్తరం

చిరంజీవి సుబ్బరామయ్యకు

ఆశీస్సులు. ఆవేదన పూర్వకమైన జాబు, లక్ష్మిద్వారా చేసిన కబురు అందాయి. ''సాయి ప్రబోధామృతము'' జాగ్రత్తగా చదివితే యోచనను ఎలా పటిష్టంగా చేసుకోవాలో తెలుస్తుంది. ఇది జగత్తు అన్న భావం

పోయి క్రమంగా అన్నిరూపాల్లో ఉన్న ఒక్క సత్యంమీద మనస్సు నిలుస్తుంటే చాలు. ఇది క్రమంగానే కుదురుతుంది. ఓరిమి, నిష్ఠ ఈ యత్నములో వహించుట దక్షిణ. ప్రాకృతికమైన అవసరాలను గూర్చి మీరుగా నిగ్రహించ వద్దు. మనస్సు పారాయణలోనో, భావపూర్వకమైన నామజపం, పూజ, నామ లేఖనాలలోనూ, కర్తవ్య నిర్వహణలోను తెరిపి లేకుండా నిమగ్నమై, మిగిలిన సమయాన్ని సద్గ్రంథ పఠన, వాటిలోని భావాన్ని మననం చేస్తూ వాటిలో చెప్పిన రీతిన ప్రపంచాన్ని మనం దర్శించే పద్ధతి మార్చేలా యత్నించడం - ఇదీ కర్తవ్యం.

ఆసనాలు, లీలాస్మరణతోపాటు సాయిరూపాన్ని దర్శిస్తూ వారి సన్నిధిని భావన చేస్తుంటే చాలు. అన్నీ అవే సమకూరుతాయి. మన యత్నం సడలింపు చేయకూడదు. మనలో పరిణతి రాలేదని అతిగా ఆరాటపడటంకూడ ధ్యానంలో అంతరాయమే. పరిణతి కోసం తపన, కృషియొక్క తీవ్రత, సమర్థతలో మాత్రమే ప్రకటమవ్వాలి. ''నీవేది చేసినా క్షుణ్ణంగా చేయి''. శ్రీ వెంకయ్యస్వామిగాని, మరెవ్వరి సన్నిధిగాని మనం పొందలేకపోయామని వాపోవద్దు. సాయి అది అప్పుడు మనకవసరమని తెలిస్తే తప్పక ప్రసాదిస్తారు. ఆ నమ్మిక చాలు. కలిగిన స్థితికి కృతజ్ఞతాభావంతో మిగిలిన సమయాలను నింపుకోవాలి. అసలైన స్థితి మన నిజతత్వం. కాని దాన్ని విస్మరింపజేసేవి మన భావాలలోని అపరిపక్వత. యోచనద్వారా భావాలు మారుతాయి. కుటుంబమున్నది గనుక ఉద్యోగానికి అంటిపెట్టుకోవడం లోపంకాదు. నిరంతరం సాధనలో ఉండగల్గడమెంతో యత్నంతోగాని కుదరదు. అంతవరకు ఉద్యోగం లేకుండా వుంటే మనస్సులో వ్యర్థమైన యోచనలూ, చింతలూ ఎక్కువై ఈ కొద్దిసాధనకూడా కష్టమవుతుంది. అందుకే సాయి అదే పని చేస్తున్నారు. ఎక్కువసేపు సాధన చేయగలస్థితి కల్గేదాకా అది అవసరం. అది కల్గినకొద్దీ పరిస్థితులను ఆ సాధనే మార్చుకొంటూ అవకాశాన్ని పెంచుతుంది. అది సాయి అదృశ్య అభయహస్తం.

ఆశీస్సులతో
భరద్వాజ



## 8-4-83న పూజ్య మాస్టరుగారు నాకు వ్రాసిన లెటరు

చిరంజీవి సుబ్బరామయ్యకు

ఆశీస్సులు. సాయికరుణతో ప్రగతి చెందుతున్న మీ పవిత్రకృషికి సంతోషం. సాయికి కృతజ్ఞత. ఎమ్.ఒ.చేరినది. పి.సి.కూడా చేరినది.

షిరిడీలోలాగే విగ్రహముండాలంటే బొంబాయిలోని తాలిం అనే శిల్పి చేయాలి. అతడికి వ్రాసి తెలుసుకోవాలి. Barbed Wire fencing వేసి లోపల బాబాకు వేదిక ఆనించే గోడ (గూడుతో) కట్టేసి దాని ఉత్తర దక్షిణ గోడకు రెండు అడుగులు లోపలికి Asbestos sheets వేసి తర్వాత యథాస్థానంలో గోడలు లేపాక షెడ్ తీసివేయవచ్చునేమో చూడండి. అప్పుడు ప్రతిష్ఠించిన సాయిని కదలించనక్కరలేదు. చి॥ రమణయ్య ద్వారా మీరు ఆలోచించి ఒక సూచన చేయమనండి. అంత చిన్న (కలిచేడు) గ్రామానికి ఆ ప్రాంతంలో సాయిప్రచారం జరుగకముందే అంత ఖర్చుతో మందిరము, విగ్రహము పెట్టడము, దానికి పూజాది నిత్యవిధులకు నిధులకొరకు ఇబ్బంది పడడంకంటె తాత్కాలికంగా ఒక సత్సంగహాలు శాస్త్రీయ పూజ విధిగా చేయనవసరంలేని రీతిన కట్టుకొని ఈవిధులను ఒకరిద్దరు శాశ్వత ప్రచారకులు మరియు పూజారులుగా నియమించి జీతమిచ్చేందుకే నిధులు ఉపయోగించి ప్రచార కార్యక్రమానికి రమణయ్యకు నేనిచ్చిన లిస్ట్‌లోని వసతులు కల్పిస్తే ఎక్కువ వినియోగముంటుంది. క్రిస్టియన్ మిషనరీస్ ఇలా చేయడం వలననే ఎక్కువ విస్తారంగా ప్రజలను తమ సిద్ధాంతంలోకి లాక్కోగల్గుతున్నారు. వసతులు గల సత్సంగ హాలు, ఆశ్రమము మరియు ప్రచార కేంద్రము, హోమియో సేవాకేంద్రము మరియు పాఠశాల అయితే దశాబ్దంలో ప్రాంతాన్ని మార్చవచ్చు. అది కమీషనర్‌గారితో మాట్లాడండి. అవసరమనుకుంటే 17నుండి 20 మధ్యలో నేను వచ్చి మాట్లాడాలన్నా మాట్లాడుతాను. అందరికీ ఆశీస్సులు.

ఇట్లు
భరద్వాజ

## సుబ్బమాంబగారి లెటర్

21-5-83న పూజ్య మాస్టరుగారు శ్రీమతి టి.వి.సుబ్బమాంబ గారికి వ్రాసిన లేఖ

అమ్మా! నమస్కారములు. మీరు ఆత్రుతతో వ్రాసిన లేఖ చేరినది. చి॥ప్రసాదుకు ఇప్పుడే తగు జాబు వ్రాసాను. శ్రీ సాయికి కూడా చెప్పాను. ఆయన దయవలన చిరంజీవి క్షేమముగా ఉండగలడని ఆశిస్తాను.

మీకు నేను గట్టిగా చెప్పేదిదే. మీ కుటుంబ సమస్యలన్నింటినీ బాబాకు నివేదించి నిశ్చలంగా బాబాను స్మరిస్తూ ఎటునుండి ఏ అవకాశమొస్తే దానిని బాబా పిలుపుగా స్వీకరించండి. మీకు తోచిన యత్నం మీరు చేస్తుండండి. తనను నమ్మినవారికి అన్నవస్త్రాలు లోటుండదని సాయి ప్రతిజ్ఞ. ఎంత కలవారైనా అనుభవించేది, కోరేది వీటినే. ఇక తక్కిన బాధ్యతలు కూడా అంటే బిడ్డలవి ఆయనే చూడగలరు. కాని మీ యత్నం కావాలి. ఫలితం బాగున్నా పొంగక, బాగుండకుంటే కృంగక, చేయడం ధర్మం గనుక దానిని బాబా ఆజ్ఞగా భావించి యత్నించడమే. యత్నంతోటే అవుతాయని కాదు. యత్నించవలసిన మన ఖర్మను నివారించుకొనుటకే. యత్నఫలితాలు వారి వారి బిడ్డల ప్రారబ్ధాలమీద కూడా ఆధారపడుతాయని గుర్తించాలి. అనుకోకుండా మీ గర్భాన పుట్టినంత మాత్రాన సృష్టి అంతటికీ ఏ ధర్మాలున్నాయో అవి వారికీ ఉంటాయికదా? అది మరచి అతివ్యామోహంలో వారి ప్రారబ్ధం ఎలా ఉన్నా మన కోరిక నెరవేరాలంటే ఎలా? అది రామ, కృష్ణాదులకే చెల్లదు. కనుక ఏ వత్తిడైనా జగత్తులో ఇతరులకొస్తే ఎలానో, మనవారికొచ్చినా అలానేనని మీరు గుర్తించుకొనే సాయిని సేవించుకోవాలి. వారి బాధలు పూర్తిగా నివారణ కావాలంటే వారు బాబాను అంతగా ధ్యానించాలి గదా? వారి బదులు మనం చేసేది కొంతవరకే గనుక ఆశ, ధైర్యాధైర్యాలు వద్దు. ఏమీ యోచించకుండా ఏది ఎవరికి జరుగుతున్నా అది సృష్టిలో ఎవరికో వారి ప్రారబ్ధానుసారం జరుగుతుందని తలచి మన సాధనను కొనసాగించాలి. లేకుంటే దైవంమీదకంటే వీరిమీదే ప్రీతైతే ఎలాగ? వారూ సాధనచేసి దైవ స్వరూపులయ్యేదాకా వారి బాధలు పూర్తిగా ఎలా నివారణ కాగలవు? మన బిడ్డ వచ్చింది గనుక పంట రేపే రావాలంటే రాదుగదా? మనకు ఈ లంపటంలో సాధన కుంటుపడితే జన్మలు



తప్పవు. జన్మలున్నంతవరకు ఈ మమకారాలుంటాయి. ఇంకెప్పుడు మనం విముక్తికి సంపూర్ణంగా యత్నం చేసేది? అందుకే రామకృష్ణ పరమహంస అంటారు - నా సమస్యలన్నీ తీరాక నేను హృదయపూర్వకంగా సాధన చేస్తాననడం సముద్రములో అలలు ఆగాక స్నానం చేస్తాను అన్నట్లుంటుంది అని. అది మాయ ఆడే ఆట. సృష్టిలో సర్వజీవులూ సమానమేననీ, వాటి కర్మ సాధనలే వాటినుద్ధరించాలనీ గుర్తించి ధర్మాన్ని నిర్లిప్తంగా చేస్తుండనిదే ఆయన దయను పొందేదెలా? నిజానికి భగవంతుడొక్కడే మనవాడు. ఆత్మగా సదా మనతో ఉంటాడు. తక్కిన వారంతా అప్పులు రాబట్టుకోవటానికి జన్మ జన్మకీ క్రొత్తవారొచ్చి పోతుంటారు. ఇది దృఢంగా గుర్తిస్తే గాని సాధన చేయలేము. ఈ వ్యామోహాలు వీడకుంటే బాబా - బాబా ఎలా అయ్యేవారు? మన సంగతీ అంతే. ఎవరి సంగతి వాళ్ళది. ఈ విషయాలు సదా జ్ఞప్తి యందుంచుకోండి. బాబా దయ చూపగలడు. సబూరి, నిష్ఠ కావాలి గదా?

ఇట్లు
భరద్వాజ



సమర్థ సద్గురు సాయినాథాయ నమః
ఆచార్య శ్రీ భరద్వాజ గురవే నమః

# శ్రీ మాస్టరుగారు నాకిచ్చిన దివ్యనిధి

మనకుండే లౌకిక సిరిసంపదలన్నీ మన కర్మాధీనమై నశించినా నశించవచ్చు. మనం కుచేలునకంటే పేదరికాన్ని అనుభవించినా అనుభవించవచ్చు. కాని సిద్ధపురుషులు మనకిచ్చిన ఆశీస్సులు అనేవి శాశ్వతమైన పెన్నిధి. వారి సంపర్కమువలన ఎట్టి సాధనలూ చేయనవసరము లేకుండా మన సంస్కారాలన్నీ మారి మనము మనలోని ఆత్మను ఆవరించియున్న మాలిన్యాన్ని నిర్మూలించుకోగల్గడం తథ్యం. లౌకికుల దృష్టిలో మనం తేలికగా కనిపించినా, శరీరత్యాగానికి ముందు మనం అనుభవించే మానసికశాంతి, ఆత్మానందము ఎవరికి వారే అనుభవించాలి గాని వ్రాయసాధ్యముగాదు. సిద్ధ పురుషుల దర్శన ఆశీస్సులవలన మన సంస్కారాలు మారుతున్నాయి గనుక మరుజన్మలో కూడా మన ఆత్మ వికాసం కుంటుబడే ప్రసక్తే ఉండదు. అయితే శ్రీ వెంకయ్య స్వామి వారు చెప్పినట్లు ''అందరికీ పంట పండించాను. దొంగలుపడి దోచుకోకుండా చూచుకోండయ్యా''. ఆ పంటను సంరక్షించు కునే బాధ్యత మాత్రం మనమీద ఉంది. అట్టి మన బాధ్యత గూడ మనం వారి కృపతోనే సక్రమంగా నెరవేర్చుకోగలము. అట్టి సంపూర్ణ శరణాగతి మనకనుగ్రహించమని శ్రీ మాస్టారురూపంలో వచ్చిన ఆ శ్రీ మహావిష్ణు మూర్తిని ప్రార్థిద్దాము.

ఇంతటి అత్యుత్తమ పెన్నిధి నాకనుగ్రహించిన శ్రీ మాస్టరుగారికి రిక్తహస్తములతో ప్రణామములు మాత్రమే సమర్పించగలుగుచున్నాను.

## మాస్టరుగారు నాకిచ్చిన నిధి

''శ్రీ సాయి పిలిస్తే పలుకుతారు - పిలిచి చూడు నీకు ఆ సత్యం అనుభవమైతే నీవు గట్టిగా విద్యార్థులకు ఛాలెంజింగ్‌గా చెప్పగలవు'' అని మాస్టరుగారు చెప్పి ఈ క్రింది సన్నివేశాలలో శ్రీ సాయిని పిలవడం వారు పలకడం జరిగింది. భగవంతుడు పిలచిన వెంటనే పలుకుతాడు అనే సత్యం



మాటలుగా మాత్రమేగాక కార్యరూపంగా నాకు మాస్టరుగారు ఇచ్చిన అపురూపనిధి. ఈ ద్విపాద పశువునకు అంతకంటే గొప్ప తరగని నిధి ఏముంది?

1. మా తల్లిగారికి నిముషాలమీద మోకాలు వాచి పెడబొబ్బలు పెడుతున్నది. కనీసం తాకనివ్వడం లేదు. కలిచేడు ఆస్పత్రికి మంచంలో తీసుకుపోతే ఎక్స్‌రే తీసి వెంటనే నెల్లూరు తీసుకు పొమ్మన్నారు. నెల్లూరంటే వేలసంఖ్యలో రూపాయలు ఉండాలి. ఆ ఆపద సమయంలో సాయినాథుని వేడుకొని రాత్రి పది గంటలకు ఆమెను నడిపించమని అందుకుగాను ముందుగానే ఒక గంట నామ జపం చేస్తానని మొక్కుకుని నామం చేశాను. ఆశ్చర్యం! రాత్రి ఎనిమిది గంటలకే నడచి ఇంట్లోకి వచ్చేసింది. తర్వాత గూడ ఏమందూ వాడలేదు. నాలుగురోజులలో వాపు, నొప్పి పూర్తిగా తగ్గిపోయింది.

2. వేసవి సెలవులు వృధా పుచ్చకుండా ఎవరైనా మహనీయుల సన్నిధిలో గడపదలచాను. ఎవరి దగ్గర ఉండాలో తెల్చుకోలేక నా తల వేడెక్కి బి.పి. వచ్చేటంత తీవ్రంగా ఆలోచించి బాధపడ్డాను. చివరకు మానసిక బాధ తట్టుకోలేక శ్రీసాయినాథునే శరణువేడాను : ''బాబా! సాయిలీలామృతం మాస్టరుగారు వ్రాసిన మొదటి ముద్రణ గ్రంథం తెరుస్తాను. తెరిచిన చోట ఎడమవైపు పేజీలో మొదటి లైనులో ఏ గ్రామం పేరుంటే ఆ గ్రామంలో ఉంటాను. ఏ గ్రామం పేరూ లేకుంటే ఎక్కడికీ పోనక్కరలేదని ఇక్కడనే ఉంటాను'' అని గ్రంథం తెరువగానే 96వ పేజీ తెరుచుకున్నది. మొదటి లైనులో - ''నేను ప్రథమంగా షిరిడీ దర్శించాను'' అని ఉంది. ఆనందము, ఆశ్చర్యము ముప్పిరిగొని ఈలోకమే మరచి పోయాను. కానీ షిరిడీకి పోతున్నానంటే ఇంటిల్లిపాది ఆరుటిక్కెట్లకు బయలుదేరుతామని గోలపెడుతారు. అందరినీ తీసుకుపోయే ఆర్థికస్తోమత లేదు. ఇలాంటి వాటికి అప్పు చేయవద్దని బాబాగారి ఆజ్ఞగదా! ఈ విషయం రహస్యంగా ఉంచి విద్యానగర్ వెళ్ళి కూర్చున్నాను. మాస్టరుగారికి కూడా చెప్పలేదు. ఎవరైనా షిరిడీపోతుంటే మాస్టరుగారే నన్ను కూడా పంపుతారని ఆశ.

అంతకుముందు నాలుగునెలలనాడు లీవ్‌ట్రావెల్ కన్సెషన్ - (LTC) ఇమ్మని మా డిపార్ట్‌మెంటు వారినడిగితే డబ్బులేదని, అడ్వాన్సు ఇచ్చే వసతి లేదనీ, వెళ్ళి వచ్చాక బిల్లులు పెడితే మొత్తం పైకం ఇస్తామనీ చెప్పి నాకు వ్రాసి, ఫైల్ తీసేశారు.

శ్రీ సాయినాథుని అదృశ్యహస్తం పనిచేసి అందరు ఉద్యోగులూ L.T.C. కొరకు వత్తిడి తేవడము, కమీషనరు ఇస్తానని అంగీకరించిన అరగంట లోగా నలభై అప్లికేషన్లు, నాలుగు లక్షల రూపాయలకు సరిపడా రావడం - ఆ అప్లికేషన్లలో నేను సీనియర్‌ని గనుక నాకు పన్నెండువందల రూపాయలు శాంక్షన్ చేసి విద్యానగర్‌కు టెలిగ్రాం ఇచ్చారు. ఆవిధంగా శ్రీ సాయి పిలిచిన వెంటనే నా సమస్యకు సమాధానమే గాక ప్రయాణపు ఖర్చులు గూడ ఇచ్చి ప్రథమంగా నాచేత షిరిడీ దర్శింపజేశారు.

3. మా మరదలు పసరికలు వచ్చి చావుబ్రతుకుల్లో వుంది. ఆమె భర్త ఆమెకు మద్రాసులో వైద్యం చేయించాలంటాడు. ఆమె తండ్రి నెల్లూరులో నాటువైద్యం చేయించాలంటాడు. వాళ్ళిద్దరూ వగదెంచుకోలేక నన్ను పట్టుకున్నారు. ఎందుకోగాని నాకు మాత్రం ఏ సలహా చెప్పినా రెండవపార్టీ నన్ను నిందిస్తుందని - ఆమె చనిపోయేటట్లుందని తోస్తూ ఏమీ చెప్పలేక మానసిక బాధ అనుభవించలేక సతమతమై పోతున్నాను. ఆమె భర్తగారు, తండ్రిగారు నన్ను తినేస్తున్నారు. ఇక నేను భరించలేక ''సాయీ, నన్నీ మానసిక బాధనుండి తప్పించు. సాయి లీలామృతం పుస్తకం తెరవగానే ఎడమప్రక్క మొదటిలైనులో నీ సలహా కావాలి'' అని చెప్పుకొని మాస్టరుగారి రెండవ ముద్రణ సాయిలీలా మృతం తెరువగానే 130వ పేజీ తెరుచుకుంది. మొదటి వాక్యం - ''ఏ చికిత్సా అవసరం లేదు'' అని ఉంది. ఇంత పెద్ద గ్రంథంలో మొదటిలైనులోనే నా ప్రశ్నకు సమాధానం దొరకడం ఎంత చిత్రాతిచిత్రమో అనుభవించిన నాకు మాత్రమే తెలుస్తుంది.

4. కలిచేడు సాయిమందిర కమిటీ తయారవాలని అందరూ నన్ను సెక్రటరీగా ఉండమని బలవంతం చేస్తున్నారు. నాకు ఇష్టంలేక వారి సందేశం ఇమ్మని ''బాబా! నేను ఈ సత్సంగంలోని వ్యక్తులతో పడలేను. మీరు ఆజ్ఞాపిస్తే ఉంటాను. మాస్టరుగారి సాయిలీలామృతం మూడవ ముద్రణ గ్రంథం తెరువగా వచ్చే ఎడమ, కుడి పేజీలలో ఎక్కడైనా 'సాయిమందిరం - చేపట్టడం' అనే రెండు మాటలు ఉండాలని తెరువగానే 242వ పేజీ తెరుచుకుంది. అక్కడ - బాబా నివసించిన శిథిల మసీదుకు మరామ్మత్తు జరుగుతున్నది. అందరూ శ్రమదానం చేశారు'' అని ఉంది. నాకు కమిటీతో పనిలేదు. శ్రమదానమే బాబా చేయమని ఆజ్ఞ ఇచ్చారని చెప్పినా కమిటీవారు వినలేదు. సభ్యులను ఎన్నుకొనే ప్రథమ సమావేశంలో ఒక వ్యక్తి రాకుంటే వారిని తీసుకురమ్మని నన్ను పంపారు. మేము వచ్చేలోగా ప్రెసిడెంట్, సెక్రటరీ, ట్రెజరర్ ఎన్నుకోబడి పేర్లు కూడా వ్రాసేసారు. నన్ను చూస్తూనే! 'అరే! సుబ్బరామయ్యగారిని మరచేపోయాము. ఎన్నుకున్న సెక్రటరీ గారికి మరొక పోర్ట్‌ఫోలియో ఇచ్చి సుబ్బరామయ్యగారిని సెక్రటరీగా ఉంచాలని మొదట వ్రాసినవారి పేరు కొట్టేసి నా పేరు వ్రాయ'మన్నారు. వెంటనే ఒక పెద్దమనిషి 'శుభమా అంటూ వ్రాయడం, కొట్టి వేయడం బాగులేదు. పని సుబ్బరామయ్యగారే చేస్తారు. ప్రస్తుతం పేపరులో వ్రాసినది కొట్టవేయవద్ద'ని నన్ను సామాన్య సభ్యుడుగా వ్రాసుకున్నారు. ఆవిధంగా బాబాగారిచ్చిన సలహాను వారే నాచేత ఆచరింపజేస్తున్నారు.

**ఎవ్వరూ నమ్మశక్యముగాని సలహా :** నేను మాస్టారి ఆదేశానుసారం నిత్యం ఇంట్లో 5½ నుండి 7 గంటల వరకు సత్సంగం, రాత్రి 8 గంటల నుండి ఆ గ్రామములోని రామాలయంలో సత్సంగం, మధ్యాహ్నం 1 గం-2 గంట మధ్య స్కూలులో సత్సంగం, ఉదయం 6 గం. నుండి 9 గం. వరకు ఇంట్లో పూజ, పారాయణ ధ్యానం చేసుకునే రోజులవి. ఒక్కక్షణం తీరికలేదు. నా సహ ఉపాధ్యాయులు, హెడ్మాస్టరు అకౌంట్ పరీక్షకు రమ్మని, ఏమీ చదువనక్కరలేదని, నిత్యం ఒక అరగంట వారితో ఉంటే వారు చెప్పుకునే విషయాలు విని పరీక్ష వ్రాయవచ్చని నే చెప్పినా వినకుండా నా పరీక్షఫీజు వారే కట్టేవారు. వారు బాగా తయారై పరీక్షకు వచ్చారు. నేను పై బాబా కార్యక్రమాలు మానలేక ఒక్కరోజుకూడా వారి చర్చలు వినలేదు. నేనుగూడా పరీక్షకు వెళ్ళాను. అందరమూ ఫెయిలయ్యాము.

రెండవసారి మరలా అట్లాగే నా ఫీజుకూడా వారే కట్టారు. చర్చిలలో వినడమే కాదు, పరీక్షకు కూడా రానని ఖండితంగా చెప్పాను. పరీక్షకు వచ్చి తీరాలని వాకిటముందు కదలకుండా కూర్చున్నారు. ఇక తప్పుకోలేక సాయి బాబానడిగి పరీక్షకు పొమ్మంటేనే వస్తానన్నాను. నేను తప్పించుకొనే మార్గం చెపుతున్నానని వాళ్ళు నవ్వుకుంటూ వెళ్ళారు. నేను బాబాను ఆశ్రయించాను. ''బాబా! నేను బస్సువారికి, లాడ్జింగ్‌వారికి ఇతరులకు ఎంతెంత బాకీ ఉంటే అంతా చెల్లించి వస్తాను. కానీ సత్సంగాలు, నీ సేవ మాని పరీక్షకు ఇప్పుడు చదువలేను. మీరు పరీక్షకు పొమ్మని చెప్పేందుకు నిదర్శనగా సాయిలీలామృతం తెరువగానే షేవాడే అనుభవంగాని, దాసగణు పోలీస్ ఇన్‌స్పెక్టర్ పరీక్ష పాసయిన సన్నివేశంగాని రావాలి. వాటిలో ఏ ఒక్కటీ రాకుంటే నేను పరీక్షకు పోను అని చెప్పుకొని సాయిలీలామృతం తెరిచాను. నమ్మశక్యముగాని విధంగా దాసగణు పరీక్ష పాసయినట్లు వచ్చింది. పరీక్షకు పోయాను. చిత్రం! పరీక్ష పాసయ్యాను. ఒక్కరోజు వారి సేవమాని నేను చదువలేదు. ఎందుకు పాస్ చేయించారో వారికే ఎరుక. ఇవేకాకుండా మానసిక గ్లాని కల్గిన ప్రతి సమస్యకు బాబాను ఆశ్రయించడం, చక్కని సందేశం లభించడం, ఆ సందేశం సత్యమై నిరూపించడం. నేనెన్ని సాధనలు చేసినా, ఎందరు నకిలీ గురువుల నాశ్రయించినా ఇలాంటి తరగని, చెరగని, పెన్నిధి, నిధులకే పెన్నిధియైన సాయిసన్నిధి నాకు ప్రసాదించిన పూజ్యపాదులవారికి ఏమిచ్చి ఋణం తీర్చగలను!

గ్రంథ విస్తారభీతిచే కుదించి వ్రాశాను. క్షమించ మనవి. శ్రీ మాష్టారి సహచర్యము, సలహాలు లేకుంటే నేనొక ద్విపాద మృగాన్నై సంచరించి, ఇంకెన్నో జన్మలకు సరిపడే పాపకర్మఫలం సిద్ధం చేసికొని యుండేవాణ్ణే.

అనంత కరుణామూర్తయే నమః

## శ్రీ నారాయణ మహరాజ్‌గారు

నేను దర్శించిన మహాత్ములలో మొదటివారు శ్రీ నారాయణ మహరాజ్‌గారు. వీరు వాకాడు గ్రామంలో యజ్ఞం చేయిస్తుంటే దర్శించాను. అచ్చట శ్రీ నారాయణ మహరాజ్‌గారికంటే ముందు పూజ్యపాదులు



శ్రీ మాస్టరుగారు దర్శనమిచ్చారు. వెంటనే వారు మమ్ముల గురించి, మా గ్రామస్తుల గురించి కుశలప్రశ్నలు వేస్తున్నారు. ''సార్, నేనెవరో మీకు గుర్తున్నానా సార్'' అన్నాను. ''భలేవారే, మీరు కలిచేడు టీచర్ గదండీ'' అన్నారు. వెంటనే నేను నిరుత్తరుడయ్యాను. కారణం అంతకు మూడురోజుల క్రితమే నేను మొదటిసారి మాస్టరుగారితో కొన్నిగంటలసేపు మాత్రమే గడిపాను. నేనింకా వారికి గుర్తుంటానని ఊహించలేదు. కాలేజీకి వెళ్ళాలని మాస్టరుగారు యజ్ఞం దగ్గరనుండి వెళ్ళిపోయారు. మేమెంతోసేపు శ్రీ నారాయణ మహరాజ్‌గారి సన్నిధిలో వారిప్రక్కనే కూర్చునే భాగ్యం కలిగింది.

**మరుపురాని సన్నివేశం :** ఆ రాత్రికి మేమక్కడే ఉన్నాము. అన్నివేల జనంలో ఒక వయోవృద్ధులు తలనెరసి వెంట్రుకలు మెడ తాకుతున్నాయి. తెల్ల మాటీ బనీను వేసుకొని, తెల్లపంచ కట్టుకొనియున్నవారు నన్ను పలకరించి, ''నీవు పెసల వాళ్ళ అబ్బాయివికదా?'' అన్నారు. నేను అవును అని చెప్పి ఆ జనసందోహంలో ప్రక్కకు తిరిగి వారెవరని అడిగేలోగా వారదృశ్యమైనారు. ఆ ప్రాంతమంతా వెతికి మానుకున్నాను. ఆవిధంగా మాస్టరుగారే నన్ను పలుకరించారని, అదే వారి ఆశీర్వాదమని నమ్ముచున్నాను.

## జిల్లేళ్ళమూడి అమ్మగారు

నేను, శ్రీమతి టి.వి.సుబ్బమాంబగారు చివటం అమ్మగారి దర్శనార్థం వెళుతూ మాస్టరుగారి ఆశీస్సులు తీసుకొని బయలుదేరాము. రైలు ప్రయాణంలో నామస్మరణే మా ధ్యేయం. ముందు బాపట్లలోదిగి జిల్లేళ్ళ మూడి వెళ్ళాము. మధ్యాహ్న భోజనవేళ భోజనం చేసి అమ్మ దర్శనానికి వెళ్ళేసరికి పెద్ద క్యూ వుంది. ఆ క్యూలో నిలుచుంటే ఇక మాకు ఆనాటికి తణుకు రైలు అందదు. అట్లని అంతదూరం వచ్చి అమ్మను దర్శించకుండా పోలేము. అమ్మగారి రూము ద్వారం దగ్గర నిలుచుని మూడు నాలుగుసార్లు క్యూలోని వారిచే చీవాట్లు తిన్నాము. కానీ మాకు తెలియకుండానే మేము తిరిగి అక్కడికే వస్తున్నాము. కానీ లోనికి ప్రవేశం లేదు. ఒక అరగంట తర్వాత అమ్మగారి పెద్దకుమారుడు రూములోకి పోతూ ''రండి పోదాం'' అంటూ నన్ను చెయ్యి పట్టుకొని లోపలికి తీసుకుపోయారు. నావెంట సుబ్బమాంబగారూ వచ్చారు. నేను లోనికిపోతూనే అమ్మగారి పాదాలపై

శిరముంచి నమస్కరించాను. ప్రక్కనున్నవారు అమ్మను తాకరాదని వారిస్తున్నా నాకు వినపడడం లేదు. అమ్మ నా తల నిమిరి ఆశీర్వదించారు కానీ తాకినందుకు నన్నేమీ అనలేదు. భోంచేశారా అని అడిగారు. భోంచేశామని చెప్పి రూము బయటకొచ్చేశాము. బాపట్లకు వెళ్ళే వ్యాన్ అప్పుడే వెళ్ళి పోయిందట. ఇక బస్సుకొరకు మూడుమైళ్ళు నడవాలి. సరే నడచి వస్తున్నాము. ఊరి వెలుపల వ్యాన్ ఆగివుంది. ఎంతో ఆత్రుతతో వెళ్ళి అడిగాము. అందులోని వారు వీలుకాదంటే కాదన్నారు. వ్యాన్ డ్రైవర్ ఇదంతా చూస్తూనే వున్నాడు. వాళ్ళను ఎక్కించుకోకుంటే వ్యాన్ కదలదన్నాడు. ఇక చేసేదిలేక సర్దుకొని ఎక్కించుకున్నారు. బాపట్ల రైల్వేగేటు వేసినందున వ్యాన్ ఆగింది. అప్పటికే తెనుకు రైలు అరగంట లేటు. టౌనులో మూడు కిలోమీటర్లు పోతేగాని వ్యాన్ రైల్వేస్టేషన్ చేరదు.

ఈ ప్రయాణానికి మరొక అరగంట ఆలస్యము. ఇక రైలు అందే ప్రసక్తే లేదు. నాకు తెలియకుండానే వ్యాన్ దిగి అక్కడున్న బంకు అతనిని అడిగాను. అదే రైల్వేస్టేషనని, అడ్డతోవన పోవచ్చని అయితే మూడు ప్లాట్‌ఫారాలు దాటాలని చెప్పాడు. వెంటనే సుబ్బమ్మాంబగారికి చెప్పి తిన్నగా వెళ్ళాము. నేను పరుగున వెళ్ళి టిక్కెట్లు తెచ్చి, కదిలే రైలులో ఎక్కి కూర్చున్నాము.

1. అమ్మగారి దర్శనం దగ్గర అమ్మగారి కుమారునకు మేము ఎవరుగా కనబడ్డామో ఏమో నన్ను చేయిపట్టుకొని లోపలకు తీసుకు వెళ్ళారు.
2. వ్యాన్‌లో మమ్ములను ఎక్కించుకుంటేనే వ్యాన్ కదులుతుందని డ్రైవర్ చెప్పడం.
3. రైల్వేగేటుదగ్గర నేను సకాలంలో వ్యాన్‌దిగి అడ్డత్రోవన పోవడం - ఇదంతా మాస్టరుగారు మమ్ములను కూడావుండి తీసుకు పోవడంగాక మరేమై ఉంటుంది? అట్టివారి దివ్యమైన శక్తి గుర్తించలేని మా గ్రుడ్డికళ్ళకు ఎన్నిచేసినా ఏమి ప్రయోజనం?

## శ్రీ రంగన్నబాబుగారు

శ్రీ రంగన్నబాబుగారు - (గుంటూరు) గారిని విద్యానగర్‌లో దర్శించాను. కాని ఏ ప్రత్యేకతలేదు. కొన్నాళ్ళ తర్వాత శ్రీ ముమ్మిడివరం బాలయోగిగారి దర్శనార్థంపోతూ శ్రీ మాస్టరుగారి ఆశీస్సు లడిగాను. మార్గమధ్యంలో గుంటూరులో శ్రీ రంగన్నబాబుగారిని దర్శించమని, వారు ఉదయం 6 గంటలకు ఫలానా సెంటర్‌గుండా పోతారని చెప్పారు. నేను, నా మిత్రుడు శ్రీ టి.వి.శేషగిరిరావుగారు ఆ సెంటర్‌లో వేచియున్నాము. చాలా ఖచ్చితంగా వారా సెంటర్ దగ్గరకు వచ్చారు. వెంటనే నేను వారికి పాదాభివందనం చేశాను. ''ఏందయ్యో, నీవు ఎవరనుకొని నమస్కారం చేస్తున్నావో ఏంటో! నేను కాదయ్యా'' అన్నారు. ''మీరు శ్రీ రంగన్నబాబు గారు కదండీ. మిమ్ములను విద్యానగర్‌లో చూచాను. భరద్వాజ మాస్టర్‌గారు మమ్ములను మీదగ్గరకు పంపారు'' అని చెప్పగానే, వారెంతో సంతోషంగా ''ఆ స్వామి బాగున్నారా'' అని అడుగుతూ మమ్ములను వారి రూముకు తీసుకువెళ్ళారు.



నాతో వచ్చిన శ్రీ శేషగిరిరావుగారిని రూములో ఉంచి నన్ను తీసుకొని స్నానానికి వెళ్ళారు. రెండు బక్కెట్లనిండా నీరు చేదిపోసి నన్ను స్నానం చేయమన్నారు. ''ఇదేంటి బాబుగారు, మేము మీకు చేదిపోయాలి గాని మీచేత మేము చేదించేదెలాగండీ'' అని నేను స్నానం చేయలేదు. ''మీరు నాకు చేది పోస్తే రాములవారు వప్పుకోరయ్యా - నేనే మీకు చేది పోయాలట. అది అంతే. కానీయ్, కానియ్''మని తొందరచేశారు. వారిచేత అంతకంటె ఎక్కువగా చెప్పించుకోరాదని నేను స్నానం చేస్తున్నాను. ''నేను భాగా ఉండే రోజుల్లో నూటయాభై, రెండువందల బిందెలనీళ్ళు చేది ఈ పెద్దతొట్లకు పోసుకొని ఆ నీరంతా నా స్నానానికి వాడేవాణ్ణి. ఇప్పుడు పదిబిందెల నీళ్ళతో సరిపెట్టుకుంటాను'' అని చెప్పారు. స్నానం అయ్యాక రూముకొచ్చాము. వారు తిరవణి, త్రిచూర్ణము కలిపి నుదుట నామాలు దిద్దుకోబోతూ ''అయ్యా, నీకు కూడా బొట్టు పెట్టేదా?'' అని అడిగారు. ''పెట్టండి బాబు గారు'' అంటూ వారి దగ్గరకు వెళ్ళి నిలుచున్నాను. వారికంటే ముందు నా నుదుట నామాలు దిద్దారు. తర్వాత వారూ ధరించారు. నాతో వచ్చిన శ్రీ శేషగిరిరావుగారిని ఆ రూములోనే ఉండమని క్రింది బ్రాహ్మణులు భోజనానికి పిలిస్తే భోంచేయమని చెప్పి నన్ను తీసుకుని ఊర్లోకి వెళ్ళారు. అదొక మరువరాని మధురానుభవం.

బాబుగారు : అయ్యా, గంటెంత?

నేను : ఎనిమిదిన్నర బాబుగారు.

బాబుగారు : ఈ మార్గంలో ఈపాటికి రైలు రావాల్నే! రైలు వెళ్ళి పోయిందా ఏమిటబ్బా?

అప్పుడే రైలు కూత వేస్తూ వస్తున్నది.

బాబుగారు : అయ్యా! నాకు గడియారం లేదుగాని గంట మాత్రం ఖచ్చితంగా తెలుస్తుంది. మీ గడియారాలైనా తప్పు పోవచ్చునేమో. నేను ఊరంతా ఇలాగే నడిచి తిరుగు తానయ్యా.

నేను ఊర్లో చాలా దేవాలయాలు తిరుగుతానయ్యా అంటూ ఒక దేవాలయంలో ప్రవేశించారు. అక్కడ ప్రదక్షిణం చేసి నమస్కారం చేసుకొని బయలుదేరాము. ఒక పెద్ద భవనంలో ప్రవేశించారు. ఆ ఇంటివారు చెప్పలేనంత ఆప్యాయంగా వారికెదురేతెంచి నమస్కరించి లోపలకు తీసుకు వెళ్ళారు. బాబుగారు అక్కడున్న సోఫా కం బెడ్‌మీద ఆశీనులయ్యారు. నేను క్రింద నేలపై కూర్చున్నాను. వెంటనే వారు నా జబ్బ పట్టుకొని లేపి, ''భలేవాడివే, వాళ్ళంత ఖర్చుపెట్టి కుర్చీలేసుంటే నీవు క్రింద కూర్చుంటే ఎట్లా?'' అని నన్ను సోఫాలో కూర్చోబెట్టారు. వారితో సమాన సీటులో కూర్చోవాలంటే నాకు చాలా బాధ అయింది. సోఫా అంచున కూర్చున్నాను. సరిగ్గా కూర్చోమని నన్ను వెనక్కు నెట్టారు. ఇక తప్పదని కూర్చున్నాను. నీవు ఇక్కడే ఉండు. నేనిప్పుడే వస్తానంటూ వారు ఇంట్లోకి వెళ్ళారు. వెంటనే ఒకామె ప్లేటునిండా ఇడ్లీలు, చట్నీ, కారం తెచ్చి నా ముందుంచి తినమంటు న్నది. ఇవన్నీ ఎందుకమ్మా వద్దన్నాను. బాబుగారు తిరిగి వెనక్కొచ్చి, ''ఏం ఫరవాలేదు. రాముని ప్రసాదం. తిను'' అంటూ ఆ ప్లేటు నా ముందుంచి వెళ్ళారు. ప్రసాదంగానే భావించి ప్లేటు ఖాళీ చేశాను. వెంటనే పెద్ద గ్లాసుడు కాఫీ ఇచ్చారు. అవీ త్రాగేశాను. ఈలోగా బాబుగారు వచ్చారు. ''ఇదయ్యా నా కార్యక్రమము. ఒకచోట స్నానం, ఒకచోట టిఫిను, ఒకచోట భోజనం మరొకచోట విశ్రాంతి అంటూ వచ్చేశారు. ఒక అరమైలు నడిచాక, ''అమ్మాయ్'' అంటూ ఒక ఇంట్లో ప్రవేశించారు. అదొక చిత్రమైన



అనుభూతి - తండ్రి వస్తే బిడ్డలు చూపే ఆదరణ, స్నేహితుని ఎడల మరొక స్నేహితుడు చూపే ఆదరణకంటే ఎన్నోవేలరెట్లు ఎక్కువ ఆదరణ, ఆప్యాయత, అభిమానమూ ఆమె ముఖంలో కనబడుతున్నాయి. ఆమె మజ్జిగ చేత్తో చిలుకుతుంది గాబోలు. చెయ్యంతా వెన్న మజ్జిగ కారుతున్నది. ''అమ్మాయ్'' అన్న బాబుగారి గొంతు వినగానే పరుగున వచ్చి తలుపు తెరచి, ''రండి బాబుగారు, రండి. రండి'' అంటూ నమస్కరించింది. ఒక చేత్తో కుర్చీ లాగి కూర్చోమంది. ''ఇవన్నీ ఎందుకూ? ఎందుకో పిలిచావటగా'' అంటూ ఆమెతోటి ముందుకు వెళ్ళారు. ''అమ్మాయి పెండ్లి కుదిరింది బాబుగారూ. మీకు చెప్పాలని'' అని ఎంతో సంతోషంగా చెప్పింది. ''శుభం. మంచిది. అయితే నేను వెళ్ళొస్తా'' అన్నారు. ఆమె టిఫిన్ చేసిపొమ్మని అర్థించింది. ''ఇప్పుడే తినివచ్చా, వెళ్ళొస్తాను'' అంటూ నాతోటి నడిచారు. నన్నొకరింటికి తీసుకువెళ్ళారు. ఆయన బాబుగారి భక్తుడు. ఇది నిరంతరము గుర్తుండవలసిన సన్నివేశము.

ఆ భక్తుని దగ్గర బాబుగారు డబ్బు ఉంచి పెడుతారు. బాబుగారు ఇవ్వమన్నవారికి ఇచ్చి లెక్క వ్రాసి పెట్టాలి. వారెప్పుడెంత ఇస్తే అంత జమ వ్రాసి పెట్టాలి. అది వారి సేవ.

ఆ భక్తుని తల్లియైనది మరొకరైనది నేను బాబుగారిని అడిగి తెలుసుకోలేదు. ఆమెకు ప్రపంచంలోలేని పిచ్చి. వివస్త్రయై దిగంబరంగా ఉంది. సుమారు యాభై సం॥ వయసు. పెద్దగా అరుస్తుంటుంది. పెద్ద హాలును గోడగట్టి రెండుసగాలుగా విభజించి తలుపుపెట్టారు. ఆ తలుపునకు రెండు వైపులా గొళ్ళెం పెట్టే ఏర్పాటుంది. బయటనుండి కమ్మి సహాయంతో గొళ్ళెం పెట్టవచ్చు. ఆమె మలమూత్ర విసర్జన, అన్న పానీయాలూ అన్నీ అందులోనే. ఆమె ఒకరూములో ఉన్నప్పుడు మరొకరూము శుభ్రం చేస్తారు. రాత్రింబవళ్ళు ఆమె అలా అరుస్తూ తిరుగుతూంటుంది. సంకల్పమాత్రం చేత జబ్బులు తగ్గించగల బాబుగారు ఆమెనలా ఎందుకు ఉపేక్షించారో మనకెలా తెలుస్తుంది? ఆమె విషయమేమిటని బాబుగారిని అడిగేందుకు నాకు నోరు రాలేదు. మనం అలాంటి దౌర్భాగ్యపు స్థితిలో లేకుండా ఉండేటట్లు భగవంతుడు మనలను సృష్టించాడు. ఆమెను చూచైనా మనం మన కాలాన్ని

సద్వినియోగం చేసుకోవాలని బాబుగారు నాకు ఉపదేశిస్తున్నారని తలంచాను. ఆ మధ్యాహ్నం ఒకరింట్లో భోంచేసి సాయంకాలానికి రూముచేరాము.

## ముమ్మిడివరం బాలయోగిగారు

మేము ముమ్మడివరంలో మా సంచులు ఎవరింట్లో వుంచాలన్నా వీలు కాలేదు. చివరకు ఒక హరిజనుని ఇంట్లో వుంచి అక్కడే మేము తెచ్చుకున్న ఫలహారం తిని దర్శనానికి వచ్చాము. సంచులు పెట్టేందుకు మేము పడ్డ బాధలే జీవితాంతం మాస్టరుగారు నాకు చెప్పక చెప్పిన బోధ అయింది. ఆ సన్నివేశం గొలగమూడిలోని నా ప్రవర్తననంతా మలచిందనడంలో అతిశయోక్తి లేదు. అంటే మా ఇంట్లో ఎందరెన్ని సామానులు పెట్టినా తిరస్కరించని విధంగా మలచిందన్నమాట.

శ్రీ బాలయోగిగారి దర్శనానికి మేము వెళ్ళేసరికి సుమారు రెండు కిలోమీటర్ల దూరం క్యూ ఉంది. అంతసేపు మేము క్యూలో నిలబడి దర్శనం చేసుకోగలమా? అది మావల్ల అయ్యే పనేకాదు. మేము క్యూ చూస్తూ అది మొదలయ్యే చోటికి వెళ్ళాము. అక్కడివారు కొందరు క్యూలో కూర్చొని ఉన్నారు. మేమక్కడి నిలబడి తమాషా చూస్తున్నాము. అక్కడ కూర్చున్న వారిలో నలుగురు క్యూలోనుండి లేచి వెళ్ళిపోయారు. వెంటనే మేమాస్థలంలో కూర్చున్నాము. మాకొరకే మాస్టరుగారు ఆరూపాలలో అక్కడ కూర్చొని, మేము రాగానే లేచి మాకు స్థానమిచ్చారని కృతజ్ఞత తెలుపుకున్నాము. క్యూలోని మొదటి పదిమందిలో మేమున్నాము. మాస్టరుగారి దయకు నేనర్హుడనయ్యేదెప్పుడో మరి. ఎన్ని విన్నా, ఎన్ని జరిగినా వారాదేశించినట్లు నా కాలాన్ని, మనస్సును భగవంతుని పరం చేయలేకున్నాననే కొరత నన్ను వెంటాడుతూనే వుంది. భగవంతుడు నిజంగా మననుంచి కోరేదేమిటి? అన్న ప్రశ్న వారే వేసి వారే జవాబు చెప్పేవారు.

''భగవంతుడు మననుంచి నిజంగా కోరేది మనస్సు, కాలము.'' వీనిని సమర్పించి ధన్యులు కమ్మనేవారు. మనకు తీరినప్పుడు వారికి సేవ చేయడం మాని రోజులో నిత్యం ఒక నిర్దుష్టమైన కాలం వారికి సమర్పించండి. కాలాన్ని మనమర్పిస్తే మన మనస్సును వారు స్వీకరిస్తారని చెప్పేవారు.



## శ్రీ చివటం అమ్మగారు

రాత్రి 12 గం॥ ప్రాంతంలో తణుకు రైల్వేస్టేషన్‌లో దిగి అక్కడే పడుకున్నాము. ఉదయం 4 గంటలకే లేచి తలస్నానాలు ముగించి నామస్మరణతో చివటం బయలుదేరాము. ఉదయం 5 గంటలవడం వలన చిన్న చిన్న అరటిపండ్లు, ఖర్జూరం పండ్లు మాత్రమే దొరికాయి. అమ్మగారి కుటీరం ముందు నిలుచున్నాము. రేకుతలుపు వేసి వుంది. లక్ష్మక్క పరుగున వచ్చి కుశలప్రశ్నలడిగి 'తలుపు తీస్తాను. శబ్దం చేయకుండా కూర్చోనుండండి. అమ్మ బయటికొచ్చినప్పుడు దర్శనం చేసుకొ'మ్మని చెప్పి వెళ్ళిపోయింది. అమ్మగారి గదికి ఎదురుగుండా మేమిద్దరం కూర్చొని నామం చేసుకుంటున్నాము. ఐదు నిముషాలలోగా లోపలనుండి అమ్మ ''సాయిబాబా, సాయిబాబా'' అని బిగ్గరగా పిలిచింది. మరొక ఐదునిమిషాలలో ధన్‌మని తలుపు తీసుకొని అమ్మ బయటికి వచ్చి మా ఇద్దరి మధ్య కూర్చుని మా ఇద్దరి మెడలమీద చేతులు వేసింది. నావరకు నేను మంచుగడ్డలా స్తంభించి పోయాను. రెండు నిముషాలకు తెప్పరిల్లుకొని అమ్మకు పాదాభివందనం చేశాము. మేము తీసుకువెళ్ళిన అరటిపండ్లు, ఖర్జూరం పండ్లు అమ్మ ముందుంచాము. వాటిని అమ్మ ప్రక్కన గూటిలోని గణపతికి నివేదించి అరటిపండు కొరికి మాకు ప్రసాదించ మొదలుపెట్టారు. సుమారు ఒక డజను ఆ చిన్న అరటిపండ్లు తినేశాను. ఇక ఖర్జూరపు పండు కూడా అలాగే కొరికి ఇస్తున్నారు. దాన్నికూడా వందగ్రాముల దాకా తినేసాను. ఇంతలో మూడు ప్లేట్ల ఇడ్లీలు, ఎర్రకారం వచ్చాయి. అమ్మ స్వల్పంగా కొరికి తింటూ మిగిలిన ఇడ్లీ అంతా మాకే పెట్టేశారు. మూడవ ప్లేటు అలాగే వారి చేత్తోనే మాకు పెట్టసాగారు. ఆ తర్వాత మూడు పెద్ద లోటాల కాఫీ. అమ్మ స్వల్పంగా త్రాగి మాకిస్తున్నారు. అవీ పొట్టలో కుక్కేశాను. అమ్మ పెడుతుంటే వద్దు అనలేకుండా తినేశాను. మధ్యాహ్నం భోజనాలు కూడా అంతే. మామిడిపండు గాని, ఊరగాయగాని నా శరీరానికి గిట్టవు. అన్నంలోకి ఎర్రని మామిడికాయ ఊరగాయ, గట్టి పెరుగు, అమ్మ తింటూ మాకు చేతిలో పెట్టసాగారు. తిని తిని, ఇక తినలేక పొట్టలేదని సైగచేశాను. మిగిలిన అన్నమంతా కుక్కకు పెట్టమని సైగచేశారు. అలాగే చేశాను. అంత మామిడికాయ ఊరగాయ తింటే

నాకు మూత్రవిసర్జన కాదు. చాలా బాధపడిపోతాను. కాని అమ్మ పెడుతున్నదని ప్రాణానికి తెగించి తిన్నాను. ఏమీ చేయలేదు. ఎంత చిత్రమో! అంతటి మహాతల్లికి నేనొక పరీక్ష పెట్టాను. నాది చిన్నపిల్లల మనస్తత్వం. రెండు కలకండ పొట్లాలు బజారునుండి తెచ్చి, ఒకటి సుబ్బమాంబగారిది. మరొకటి నాది అమ్మ ముందుంచాను. సుబ్బమాంబగారి పొట్లంపై కాగితానికి బొమ్మ వుంది. ఈ పొట్లమంతా అమ్మతాకి ఆమెకివ్వాలని, నా పొట్లంనుండి కొంచెం కూడా నాకు పెట్టకుండా అంతా ఇతరులకు పంచెయ్యాలని అనుకున్నాను. ఎంత చిత్రమో! అమ్మ సరిగ్గా అలానే చేశారు.

నేను సుధీంద్రబాబుగారిని దర్శించివస్తానని అమ్మకు చెప్పి తణుకు వెళ్ళాను. నేను వచ్చేసరికి రాత్రి పదిగంటలయింది. ఊరంతా మాటుమణిగి నిశ్శబ్దంలో మునిగిపోయింది. ఈ టైంలో అమ్మను పిలవడం ఇష్టంలేక బయట రేకుతలుపు దగ్గర నిలుచుని ఎక్కడ పడుకోవాలా అని చూస్తున్నాను. అమ్మ తలుపు తెరచి నన్ను లోపలకు రమ్మని సైగ చేసింది. లోపలికి వెళ్ళి నట్టింట ఉన్న దీపం, నీళ్ళు, విస్తరి, అన్నం, కూరలు చూచి నాపై నాకే అసహ్యం వేసింది. ఏనాడైనా వచ్చిన అతిథికి అంత ఆప్యాయంగా ప్రేమతో భోజనం పెట్టానా? కనీసం మా తల్లిగారైనా ఆవిధంగా నాకోసం ఏనాడైనా ఎదురుచూచి ఉంటారా? ఆ మహనీయమూర్తికి నాపై ఇంత ప్రేమ ఎందుకు కలిగింది? ఊహించండి! అది కేవలం మాస్టరుగారి కృపవలననే!

ఆరోజు రాత్రి నేను రామాలయంలో పడుకున్నాను. రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో కొందరు స్త్రీలు గుంపుగా వెళ్ళి చివటం అమ్మగారి శరీరానికి నూనె మర్దన చేస్తున్నారు. నేను మందిరంలోనుండి తపన పడిపోతూ ఆ సేవ నేనుకూడా చేయాలని తీవ్రంగా అనుకొనుచున్నాను. కానీ వారి ఏకాంతసేవలోకి వెళ్ళే ధైర్యం లేదు. ఇంతలో అమ్మ ఒకరిని పంపి నన్ను తీసుకురమ్మన్నారు. నేను వెళ్ళగానే నూనె ఇచ్చి వారి శరీరానికి మర్దన చేయమన్నారు. హద్దులులేని కృతజ్ఞతాభావంతో నామం చెపుతూ మర్దన చేశాను. అమ్మ నిజంగా మా అమ్మే అయింది. నా మనసులోని కొరత తీర్చగలవారు మా అమ్మగాక మరెవరికి సాధ్యం!



వీడ్కోలు సమయం వచ్చింది. అంతవరకు నేనెంత ప్రయత్నించినా వారు స్త్రీమూర్తియని, నేను పురుషుడననే భావం నాకు పోలేదు. వారి పాదాలు తాకి నమస్కరించాను. అంతే! ఇక నాకు ఈలోకం తెలియలేదు. అమ్మ కూర్చొని ఉన్నారు. నేను ఆమె గుండెలమీద తలమోపి చిన్నబిడ్డలాగా ఏడుస్తున్నాను. వారు నా తల, వీపు నిమురుతూ ఉన్నారు. అలా వెక్కి వెక్కి ఏడుస్తూ ఎంతోసేపు ఉన్నాను. చివరకు నా భావావేశం తగ్గగానే దూరంగా వచ్చి కూర్చొని కన్నీళ్ళు తుడుచుకుంటున్నాను. బండికి టైమైందని అమ్మ సైగ చేశారు. మాస్టరుగారికిమ్మని అమ్మ దండిగా బెల్లం, కలకండ ఇచ్చారు. అవి తీసుకొని అమ్మవైపు చూస్తూ వెనక్కు అడుగులేస్తూ వస్తుంటే అమ్మే చెయ్యి ఊపుతూ వీడ్కోలు చెప్పారు. ఇలాంటి మధురస్మృతులను అనుగ్రహించిన మాస్టరుగారికి ఎన్ని జన్మలకైనా ఋణగ్రస్తుడనే గదా!

## శ్రీ సుధీంద్రబాబుగారు

శ్రీ చివటం అమ్మగారి దర్శనానికి పోతుంటే ''ఒకరోజు శెలవు పొడిగించైనా సరే ఆ చుట్టుప్రక్కల ఎక్కడ ఉన్నా సరే సుధీంద్రబాబుగారిని దర్శించిరమ్మని' శ్రీ మాస్టరుగారు చెప్పారు. వారి కృపవలన బాబుగారు తణుకులోనే ఉన్నారు. అమ్మగారికి కూడా చెప్పి బాబుగారి దర్శనానికి తణుకు వెళ్ళాను. నేను బాబుగారి సన్నిధిలో ఉండగలిగింది ఇరవై నిముషాలే అయినా వారు నాకిచ్చిన సందేశం మాత్రం ఇరవై జన్మలకు పైన ఉపయోగకరమైనది. బాబుగారు ఒక గదిలో ఉన్నారు. గదినిండా క్రిక్కిరిసి జనం కూర్చొనున్నారు. ఫ్యానువేసి తలుపులు బిగించి బయట ఒకరిని కాపలా ఉంచారు. లోనివారంతా బయటికి వస్తేనే బయటివారికి దర్శనమని ఆ కాపలా మనిషి చెప్పారు. నేను నామస్మరణ చేస్తూ మూసియున్న తలుపుకు మూడడుగుల దూరంలో కూర్చొనున్నాను. రెండు నిముషాల్లో బాబుగారు తలుపు తీసుకొని బయటికి వచ్చి నాముందు కూర్చున్నారు. నేను వెంటనే పాదాభివందనం చేశాను. వారిని ఫోటోలో చూచాను గనుక. ''మిమ్ములను ఇక్కడికెవరు పంపారు?'' అని అడిగారు. శ్రీ భరద్వాజ మాస్టరుగారు అని చెప్పగానే వారు ''ఆయన పెద్ద దొంగ. తనదంతా దాచిపెట్టుకొని మాది బయటవేస్తుంటాడు'' అన్నారు.

నాకిచ్చిన సందేశం "Don't care for the world. Go ahead as your will says" 'అరటిపండిస్తే మంచివాడంటారు. ఇవ్వకుంటే పిసినారి అంటారు. వీళ్ళనేంటి మనం లెక్కచేసేది' అని ముమ్మారు పలికి తిరిగి 'Now you can go' అన్నారు

మేము వెంటనే బయలుదేరి రైల్వేస్టేషన్ పైబడి; అతిత్వరగా సుబ్బమాంబ గారిని హైదరాబాద్ రైలెక్కించాను. అన్నివేళలందూ ఈ సందేశమే నాకు అమోఘమైన వరము.

## శ్రీ అనసూయామాత (పారడసింగా)

దేహస్ఫురణే లేని అమ్మ సన్నిధి చేరికూడా నేను నా చిన్నపిల్లల మనస్తత్వాన్ని వదలేకపోయాను. ఆరతి సమయంలో అమ్మచుట్టూ అనేక నైవేద్యాలు పెట్టియున్నారు. నేను రెండు చిన్న మామిడిపండ్లు సమర్పించాను. రూమంతా క్రిక్కిరిసియున్నారు భక్తులు. అమ్మ ఒక్కొక్క నైవేద్యం కొద్ది రుచిచూచి విసిరేస్తున్నారు. వారి వారి అదృష్టంకొద్దీ దొరుకుతున్నాయి. ఒకసారి అమ్మ టెంకాయచిప్ప పగులగొట్టే చిన్న గుండ్రాయి విసిరికొట్టారు. అది ఒకామె నుదుటికి తగిలింది. ఆమె తల పగిలిందనుకున్నరు అందరూ. చిత్రం ఒక రూపాయి బిళ్ళంత బొప్పిపోవడం తప్ప ఆమెకు కూడా పెద్దగా నొప్పి పుట్టలేదు. ఆ చర్య అందరికీ ఆశ్చర్యమేసింది.

''అమ్మ పాటలు పాడుతూ ఎవరెవరి నివేదనలో తీసుకుంటున్నారు గాని నా మామిడిపండ్లు తాకలేదే'' అని నేను మనస్సులో అనుకున్నానో లేదో వెంటనే నా మామిడిపండ్లలో ఒకదానిని కొద్దిగా కొరికి టెంకను గాలిలోకి వెళ్ళేటట్లు అలా తాటను వత్తారు. ఆ టెంక అనేకమంది చేతులు తగిలి ఎవరికో దొరికింది. ''ఈ దఫా నా పండే అమ్మ తినాలి. నా ప్రయత్నమేమీ లేకుండా ఆ టెంక ప్రసాదంగా నాకే దొరకాలి'' అని అనుకున్నాను. వెంటనే అమ్మ నాపండే తిని టెంక గాలిలోకి వదిలారు. అది ఎందరి చేతులో తగిలి చివరకు నా ప్రయత్నం లేకుండా నా వడిలోనే పడింది. ఇలాంటి దివ్యాను భూతులు మాస్టరుగారి కృపకు నిదర్శనాలు.

## శ్రీ పూండిస్వామివారు

శ్రీ పూండిస్వామివారిని దర్శించాలని చాలామార్లు మాస్టరుగారి ఆశీస్సులడిగాను. వారనుమతించలేదు. ''ఇప్పుడు వద్దు. నీవా ప్రాంతానికి



పనిమీద వెళ్ళినపుడు చూచి వద్దువులే'' అనేవారు. అందరినీ వెళ్ళి చూచి రమ్మంటున్నారు. నన్ను మాత్రం పంపలేదు. వారు నన్ను పంపలేదని నాకేమీ కొరత ఉండేదిలేదు. ఒకసారి పదవ తరగతి పేపర్లు దిద్దేందుకు చిత్తూరు వెళ్ళాను. అప్పుడే పూండికూడా వెళ్ళాను. నాకు సరిగా ధ్యానం కుదరడం లేదని చెప్పుకున్నాను. మరలా రమ్మని చెప్పారు. సరిగ్గా భొట్టు పెట్టినట్లు మరు సంవత్సరం పేపర్లు దిద్దటానికి చిత్తూరు వెళ్ళి స్వామివారిని దర్శించి మరలా ధ్యానం సరిగా కుదరడంలేదని చెప్పుకున్నాను. ''బాగుంటుందిలే'' అన్నారు. అంతే! ఇంటికి వచ్చింది మొదలు ఉదయం 6 గంటలనుండి 9 గంటలవరకు కాలగతి తెలియకుండా ధ్యానం కొనసాగేది. ఇంటిలోని వాళ్ళు తలుపుతట్టి నన్ను బడికి పంపేటంత గాఢంగా కుదరసాగింది. ఈ అనుగ్రహం తననుండి వచ్చినట్లు ఉండకూడదని వారిద్వారా మాస్టరుగారే ఇప్పించారు.

ఈట్రిప్పులో మరొక గొప్ప విషయం జరిగింది. రాత్రి 1 గం॥ ప్రాంతంలో మూత్రవిసర్జనకు పోవాలని లేచి శ్రీ స్వామివారికి వేసిన గోనెపట్టల తెరయొక్క రంధ్రంగుండా శ్రీ స్వామివారిని చూచాను. వారి వంటిపైన నూలుపోగైనా లేదు. నిర్వికారంగా చక్కగా కళ్ళు తెరచి కూర్చొనున్నారు. వారి భుజంపైన పిల్లి కూర్చుని వున్నది. నేను డ్రాయరు, ప్యాంటు, బనీను, షర్టు, చలి బనీను, దుప్పటి ధరించి ఉన్నా గడగడ వణికిపోతున్నాను. దేహస్ఫురణలేని మహాత్ములెలా ఉంటారో చూపించారు మాస్టరుగారు. ఈ దృశ్యం జీవితాంతం స్థిరంగా నిలచిపోయింది. ఇదంతా మాస్టరుగారి కరుణగాక నా అర్హతా? కానే కాదు. అంతావారి దయే.

## శ్రీ కంచి పెద్దస్వామివారు

పూజ్య మాస్టరుగారు బస్సులో కొంతమందితో కర్నూలు వస్తామని, నన్ను గొలగమూడి నుండి నేరుగా కర్నూలు రమ్మని చెప్పారు. అప్పుడు శ్రీ కంచి పెద్దస్వామివారు కర్నూలులో చాతుర్మాసవ్రతం చేస్తున్నారు. నేను బస్సులో నా జేబ్‌బాగ్ పోగొట్టుకొనిన కారణంగా ఉదయం పదిగంటలకు కర్నూలు చేరాను. కానీ మాస్టరుగారు కొన్ని కారణాలవలన కర్నూలు రాలేదు. నేను వెళ్ళేసరికి శ్రీ స్వామివారి దర్శనమైపోయింది. ఇక రేపు ఉదయం ఆరు గంటలకు మాత్రమేనట. నేనంతసేపు అక్కడ ఉండలేను. కారణం నా సంచిపోయింది. మానసికంగా పిచ్చిపట్టిపోయింది. అక్కడొకాయన ఒక

అరగంటలో చిన్నస్వామి వారి దర్శనం చేయిస్తాను. వారికి నమస్కరించుకోమన్నారు. విధిలేక సరేనన్నా నాకుమాత్రం చాలా తీవ్రంగా బాధగానే ఉంది. అది పెద్దస్వామివారు దర్శనమిచ్చే గేటని తెలియక అక్కడే కూర్చుని బాబాను తీవ్రంగా నిందిస్తున్నాను. ''ఒక్కక్షణంలో నా సంచి పోగొట్టిందిగాక శ్రీ స్వామి వారి దర్శనం కూడా లేకుండా చేశావు'' అని అనుకుంటూ కూర్చున్నాను. దడాలుమని రేకు తలుపు తెరుచుకున్నది. అక్కడున్న పనివారు, ''అరే స్వామి వారు బయటికొచ్చారు'' అని అరిచారు. ఏమీ తెలియని స్థితిలో వారికి పాదాభివందనం చేశాను. పది నిముషాల అనంతరం వారు యథాప్రకారం తలుపు మూసేసుకున్నారు. ఈవిధంగా వారి దర్శన ఆశీస్సులు సమయంగాని సమయంలో నాకు లభించాయంటే అది మాస్టరుగారి కృపగాక మరేమిటి!

## శ్రీ మాయి అమ్మగారు

శ్రీ మాయి అమ్మగారు సేలంలో ఉన్నారు. వారి దర్శనానికి వెళతానంటే ''శుభం, శుభం, వెళ్ళిరా'' అన్నారు మాస్టరుగారు. అప్పుడు మా కుమార్తె తిరుపతిలో ఉద్యోగం చేస్తున్నది. 'నేను రాను, మీరు వెళ్ళిరండి' అని వ్రాసింది. తీరా మేము తిరుపతి వెళ్ళేసరికి బస్టాండులో ఉంది. నేనుకూడా చిత్తూరువరకు వస్తానని చెప్పింది కానీ మాస్టరుగారి దయ ఆమెకెంత ఉందోగాని సేలం వచ్చి అమ్మను దర్శించుకుంది. మహనీయుల కృపకిది నిదర్శనం. మేము అమ్మను దర్శించేసరికి ఎవరో ఒక భక్తుడు అమ్మకు సుమారు ఒక అరగంటసేపు తలదువ్వి వెళ్ళాడు. రాజేంద్రన్‌గారు అమ్మను తాకకుండా దూరంగా కూర్చోమని ఆంక్ష విధించారు. నాకుమాత్రం అమ్మకు తలదువ్వాలనే తీరని కోరిక పీకుతోంది. మూడవనాడు మధ్యాహ్నం రాజేంద్రన్ కూరలకు బజారు వెళ్ళాడు. వారి శ్రీమతి నిద్రపోతున్నది. అమ్మ ఆరుబయట కుర్చీలో కూర్చొని క్రాపు దువ్వెన తీసుకొని తల దువ్వమని పదే పదే సైగచేస్తున్నది. ప్రాణానికి తెగించి దువ్వసాగాను. వీపు గీరమని అమ్మ చొక్కా తొలగించుకుంది. గీరుతున్నాను. రాజేంద్రన్ వస్తున్నాడు. వారు కొంతదూరాన ఉండగానే నా చర్యకు సారీ చెప్పాను. నవ్వుతూ కానివ్వండి, కానివ్వండి అని ప్రోత్సహించారేగాని నన్నేమీ అనలేదు. అమ్మ ఆజ్ఞలేనిదే నేనలా చేయలేనని వారు కూడా గ్రహించారు.



మేము తీసుకువెళ్ళిన బిస్కెట్లు, రొట్టెలు అన్నీ రాజేంద్రన్‌గారు కుక్కలకే పెట్టేశారు. అది వారి పద్ధతి. మన నివేదన అమ్మ ఏదీ తినలేదని నాకు చాలా బాధగా ఉంది. మూడవనాటి సాయంత్రం భజనచేసి అరటిపండ్లు, బిస్కెట్లు టీపాయ్‌మీద పెట్టి అమ్మకెదురుగా ఉంచి ఆరతిచ్చి అందరికీ ఆరతి చూపేలోగా అమ్మ ఒక అరటిపండు తీసుకొని తన చిగుళ్ళతో చీల్చి తినబోతుంది. రాజేంద్రన్‌గారు అది చూచి పరుగునవెళ్ళి అరటిపండు వలచి పండంతా కొద్ది కొద్దిగా అమ్మకు పెట్టారు. అప్పుడు రాజేంద్రన్‌గారికి నామీద ఎంతో అభిమానం కలిగింది. నా భుజాలమీద చేయివేసి తట్టారు. అమ్మగారు తనకై తానే అరటిపండు తినడంతో వారికి నా ఎడలగల భావం మారింది.

అమ్మగారి సన్నిధిలో మూడురోజులుంటే నాకు బాహ్య ప్రపంచం తెలియడమే లేదు. బలవంతంపై రాజేంద్రన్‌గారితోటి భోజనానికి కూర్చుంటున్నానేగానీ నా కళ్ళు మూతలుపడి మనసు ధ్యానస్థమై అసలు అన్నమే తినలేకున్నాను అది గమనించిన రాజేంద్రన్‌గారు నాకు అన్నం వడ్డించవద్దని వారి శ్రీమతిగారికి సైగ చేశారట.

ఇక అరగంటలో అమ్మను వదలి వచ్చేస్తాము. నేను అమ్మ కొరకని తీసుకువెళ్ళిన పదిశేర్ల బియ్యం తిరిగి తీసుకుపొమ్మని రాజేంద్రన్‌గారు పదేపదే చెప్పారు. ఇక తప్పదని బియ్యం సంచి దగ్గరకెళ్ళాను. ఎందుకో తెలియని విధంగా దుఃఖం పొర్లుకొచ్చి కన్నీరు కట్టలుతెంచుకుంది. వెక్కివెక్కి ఏడుస్తున్నాను. పాపం రాజేంద్రన్‌గారు నా పరిస్థితి గ్రహించి, నా భుజంమీద చేయివేసి బియ్యం ఉంచివేయమని, అవి అమ్మకే పెడతాననీ చెప్పారు.

అమ్మగారి ఫోటో చిన్నదైనా ఇవ్వమని వారినడిగాను. బీరువా అంతా గాలించినా దొరకలేదు. తరువాత పంపుతానన్నారుగాని నేను వారికి అడ్రసు ఇవ్వలేదు. ఆరునెలల తర్వాత నెల్లూరు భక్తుడు వెళితే గొలగమూడిలో ఒక సాయిభక్తుడున్నాడు. ఆయనకివ్వమని అమ్మగారి ఫోటోలు పంపాడు. అమ్మగారు పంపిన ఫోటోలు నాకు చేరకుండా ఎలా ఉండగలవు? ఇలాంటి అనుభూతులన్నీ కేవలం మాస్టరుగారి కృపవలననే మిగిలాయిగాని నా అర్హత వల్ల కానేకాదు.

## శ్రీ రామిరెడ్డి తాతగారు

నేను తాతగారింటికి వెళ్ళేసరికి ఉదయం 6 గంటలు. వారి ఫోటో చూచానుగాని వారిని అంతకుముందు చూడలేదు. అప్పుడే నిద్రలేచి మంచంమీద కూర్చోనున్నారు. శరీరంమీద ఒక నూలుపోగు లేదు. ఎర్రని పెద్ద నేత్రాలు, నల్లని శిరోజాలు. విరబోసుకునియున్నారు. నేను తీసుకుపోయిన కదంబం పూలదండ వేయబోతే వద్దన్నట్లు భంగిమ చేశారు. కానీ నేను మెడలో పూలమాలవేసి పాదాభివందనం చేసి కూర్చున్నాను. అప్రయత్నంగా నా కన్నులు మూతబడుతున్నాయి. నిశ్శబ్దంగా నామజపం సాగించాను. నాకు కాఫీ ఇప్పించి వారు త్రాగి పంచ, కండువా ధరించి బయటకు వెళుతున్నారు. వారి వెనుక నేనూ నా సంచితో బయలుదేరాను. పదిబారల దూరంలోని సెంటర్‌లో నిలబడ్డారు. వారేమార్గాన పోతారోనని నేను గోడకానుకొని నామం చెప్పుకొనుచున్నాను. నా కళ్ళు తెరిచేసరికి నాముందు నిలబడియున్నారు. ఎంతో భయము, ఉత్సాహంతో నామం తీవ్రంగా చేస్తూ కన్నులు మూసేశాను. మరలా కన్నులు తెరచేలోగా తిరిగి ఇంటికిపోతున్నారు. వారు మంచంమీద, నేను క్రింద కూర్చున్నాము. నేను నామస్మరణ తీవ్రంగా చేస్తున్నాను. నేను తీసుకువెళ్ళిన తీపి పదార్థాలన్నీ తినేసి నాకు ప్రసాదమిచ్చారు. నాకు సెలవిప్పించమని అర్థించాను. వారు మౌనం వహించారు. ఉదయం 11 గంటలు అయింది. తాతగారు జొన్నసంకటి, కూర తింటున్నారు. నాకు పెట్టబోతే ఉప్పు, నూనె తిననని చెప్పాను. వాళ్ళ తల్లిగారు ఉప్పు, నూనె లేదని రాగిరొట్టె తాతగారిచేతికిచ్చారు. కొంత వారు తిని కొంత నాకు పెట్టారు. ఈలోగా సిగరెట్లు, బీడీలు చాలా కాల్చి నాకు ఇచ్చారు. వారి ప్రసాదమని తాగాను. తిరిగి ఊరి బయటకు వెళ్ళారు. నేను వెనకాలే పోతున్నాను. ఒకచోట నిలబడి, ''అన్నా ఇక పోతే పోలా'' అన్నారు. నేనక్కడే పాదాభివందనం చేసి వెనక్కు తిరిగాను. తాతగారు చిత్రంగా నాకంటే ముందు నడచి ఇంటికి వచ్చారు. వచ్చిన ఐదు నిముషాలకు ''ఇక పదన్నా'' అన్నారు. నేను బస్టాండు చేరేసరికి నెల్లూరు బస్సు సరిగ్గా బయలుదేరింది. ఇదంతా మాస్టరుగారు ఎనలేని కరుణతో ఆ రూపంలో నాకనుగ్రహించిన ఆశీస్సులు మాత్రమేగాని నా గొప్ప ఏముంది? 5½ గంటలసేపు కాలగతి తెలియకుండా ఉండగల్గడమేగాక వారి తల్లినుండి అనేక వారి దివ్యలీలలు వినగలిగాను.



సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః
ఆచార్య శ్రీ భరద్వాజ గురవే నమః

# హాత్ దరూన్ చలాల్

అంటే చేయిపట్టుకొని నడవండి అని అర్థము.

అంటే గురువాజ్ఞలను పాటించండి అని అర్థము.

పూజ్యపాదులు వారిగురువుగారైన శ్రీసాయినాథుని చేయి పట్టుకొని ఎలా నడిచారు? అది మనం తెలుసుకొని మనంగూడ అదే విధంగా శ్రీమాస్టరు ఆచరించి చూపిన, శుభ్రమార్గంలో నడిస్తే తప్పక గమ్యంచేరుతామని నాగపూరు సమీపమందు పారడ్‌సింగాలో విజయం చేసిన శ్రీ అనసూయ మాతగారు మనకు ఒక ఆజ్ఞను జారీచేశారు ''హాత్ దరూన్ చలాల్'' అనే ఈ వాక్యముతో.

బాబా తనదంటూ ఒక ఇల్లు లేకుండా వేపచెట్టుక్రింద, మసీదులోను నివసించారు. ఆ మసీదు తనది అనే భావం బాబాకు కలలోగూడా లేదు. అందుకే నానావల్లీ వచ్చి లేవమని బెదిరిస్తే, చిన్నపిల్లవానివలె లేచి తన ఆసనం ప్రక్కకు వచ్చేశారు. అదేవిధంగా మాస్టరుగారు కూడ ఆచరించి చూపారు. అయితే తనకు ఋణానుబంధాలననుసరించి భార్యాబిడ్డలున్నారు గనుక బాడుగిండ్లను ఆశ్రయించారు. ''మీకు గాకున్నా మీ బిడ్డలకొరకైనా ఒక ఇల్లు కట్టుకోండి సార్!'' అంటే మాస్టరుగారన్నారట ''బాబా సంకల్పం అలా వుంటే అన్నీ అవే సమకూరుతాయి. మనం తాపత్రయపడడమెందుకు?'' గమ్యంవైపు ప్రయాణం సాగించే కృషిలో వారెన్ని కష్టాలు అనుభవించినా వాటిని కష్టాలుగా భావించి ఎరుగరు. వారు కష్టము, సుఖము అనే ద్వంద్వాలను దాటి ప్రయాణంచేస్తూ మనకు బోధించాలనే నిరంతర తపన తప్ప అన్యంపట్టదు.

ఒంగోలు సంతపేటలో ఒక పాత పెంకుటింట్లో కాపురంపెట్టారు. ద్వారకనాథ్ పురిటిబిడ్డ. ఆ ఇల్లు కూలిపోతుందని ఎవ్వరూ బాడుగకు చేరలేదు. పెంకులనుండి అప్పుడప్పుడూ తెల్లసున్నంరాలి పడుతుంది. బిడ్డ కళ్ళలో

పడుతుందని పాల్థిన్ గోతాలు జాయింట్ చేసికుట్టి మంచం పై భాగాన ఇంటికప్పుకు కట్టించారు. ఆ ఇంట్లో కనీస వసతులు గూడ లేవు. ఆ ఇంట్లో ఎన్ని అవమానాలు పడవలసి వచ్చాయో! ఆ మహనీయుడు వాటి నన్నింటినీ వీసమంతైనా లెక్కచేస్తున్నారా? బాబావారు అక్కడుండమన్నారట. ఉద్యోగం లేదు, ప్రెస్ పనిచేయడంలేదు. ఇల్లు జరిగేది యమబాధగా ఉంది. ఆర్థికంగా ఉడతా భక్తిగా సమర్పించాలని మాస్టరుగారిని నేనడిగితే ''మీరెక్కడుంటే అక్కడ సత్సంగం చేయండి. అదే నాకు లక్షలిచ్చినట్లు'' అన్నారు. అలాంటి దయనీయ పరిస్థితులలో అలాంటిమాట నేనెన్ని జన్మలెత్తినా అనగలనా! ఓ ప్రేమమూర్తీ! నీకివే నా రిక్తహస్త సాష్టాంగ దండ ప్రణామములు.

నిరంతర ధ్యాసే తన లక్ష్యం - బాహ్యాబాధలు తలపులకేరావు. ఇదే గాబోలు మిలారేపా వారికిచ్చిన దివ్యసందేశం. అందుకే మాస్టరుగారు అన్నారు : ''ధ్యాసలేకుండా గడిపిన క్షణాలలోని మనోవికారాలు జన్మ పరంపరలను పేనే తాళ్ళని గుర్తించి జాగరూకతతో విషాన్ని త్యజించినట్లు త్యజించు'' బుద్ధుడు చెప్పినట్లు శ్రద్ధ కాదు కేవలశ్రద్ధ, భక్తికాదు కేవలభక్తితో మాస్టరుగారిలాగ మనం కృషి సల్పనిదే, శ్రీ అనసూయమాతగారు చెప్పినట్లు ఎన్నాళ్ళు భజనలు చేసినా మనసును నిగ్రహించలేము. ఆచార్యులవారు ఆచరించి చూపిన 'హోత్ దరూన్ చలాల్' చేస్తే తప్ప.

ఓం సద్గురు ఆచార్యదేవోభవ. శరణం, శరణం.

ఇలాంటి కష్టకాలంలో లౌకికులవలె తన ప్రారబ్ధాన్ని నిందించుకుంటూ, ఆ కష్టాలకు బాహ్యమైన కారణాలనుగూర్చి నిందిస్తూ కూర్చున్నారా? లేదు. సాధకుడు తనకు అనుకూలంగా లేని సమయంలో ఏపని చేసినా కలసిరాదు గనుక ఆకాలాన్ని తీవ్రమైన భగవచ్చింతనకు వినియోగించుకొని గొప్పవాడుగా బయట పడుతాడని చెప్పేవారు మాస్టరుగారు. గనుక తనకు ప్రతికూలమైన ఈ కాలాన్ని బాబాను నిందిస్తూ కూర్చునేందుకు అందరిలాగా వాడుకోకుండా బాబాగారి దివ్యలీలలు, మౌనబోధలు, ఆచరణలనుగూర్చి తీవ్రాతి తీవ్రంగా యోచిస్తూ తయారుచేసిన సాయి ప్రబోధామృతమను అమృతకలశాన్ని ప్రపంచానికి అందించారు. అంతేగాని సంఖ్యాపరమైన పారాయణొక్కటే



మనలనుద్ధరిస్తుందని, పారాయణ మాత్రమే యాంత్రికంగా చేస్తూ కూర్చోలేదు. గనుక మనలనుగూడా సంఖ్యాపరమైన యాంత్రిక పారాయణలుమాని త్రికరణ శుద్ధిగా (శరీరం (కళ్ళు) వాక్కు (నోరుచదవడం) మనస్సుతో) ఆలీలను గూర్చి యోచించడమనే తీవ్ర కృషిసల్పి మనకు బాబా ఇచ్చిన భావాలు వ్రాసిపెట్టు కుంటుంటే బాబాగారి కృప శీఘ్రమే కలుగుతుందని వారి ఆచరణద్వారా బోధించారు.

''నా పంచన చేరినవారికి పాయసం వడ్డించడం నా విధి. వారికి చేత నయితే జుర్రుకుంటారు. లేకుంటే చీమలు, ఈగలు ఎవరికి ప్రాప్తముంటే వారికి లభిస్తుంది'' అన్నారు మాస్టరుగారు. ఎంత గొప్పభావమిది? ఎంతటి అర్థం ఇమిడి ఉంది! వారిని ఆశ్రయించి అణకువతో అడిగిన వారికే వారు బోధించేవారు. పని గట్టుకొని అనర్హులకు చెప్పాలని వారెప్పుడూ ఆశించలేదు. బాబాగారు నాదగ్గరకు ఎవరిని పంపితే వారికే పాయసం అనే బోధ లభిస్తుంది. జీర్ణమవుతుంది. లేకుంటేలేదు. నేను మాత్రం బాబాగారి ఆజ్ఞననుసరించి పాయసం వడ్డించే నా విధి తప్పక సక్రమంగా నెరవేర్చి తీరుతాను'' అన్నారు.

''హరి పాలకుండ నా నెత్తినపెట్టి పంపాడు. ఈ జనం నాపై రాళ్ళు రువ్వుతున్నారు. ఏం చేస్తాం. మనం మాత్రం మన కర్తవ్యం సక్రమంగా నిర్వర్తించాల్సిందే'' అంటారు బాబా. అదే మాస్టారు ఆచరించి చూపారు. బాబాగారు వారిని సద్గురువుగా ధర్మప్రచారం చేయమని ఆదేశించారు గనుక ఆ కార్యాన్ని వారు తన్నాశ్రయించిన వారి స్థాయిననుసరించి బోధించేవారు. ఎలాగ? నిర్విరామంగా రాత్రిపగలు తెలియకుండా - ఉదయం నుండి సాయంత్రం 4 గం॥వరకు! నా కుమార్తె వీరింట్లో ఇరవైరోజులుండే భాగ్యం కలిగింది. ఆమె చెపుతుంది - ''ఉదయం కూర్చుంటే ఇక అంతే. కాలకృత్యాలకు కూడా లేచిరారు - కాఫీ మాత్రమే తీసుకుంటుంటారు. అదీ గుక్కెడు గుక్కెడే''. అలా సాయంత్రం ఎప్పుడు లేచి వస్తారో ఎవరూ చెప్పలేరు. అమ్మగారు సైగచేసి పిలుస్తారని ఆవైపు కూడా చూడరు. ఢిల్లీ మొదలైన దూరప్రాంతాలవారు అందరూ తృప్తిగా విని వెళ్ళిపోతే లేచి లోపలికి వస్తారు'' బాబాగారి ఆదేశాన్ని అలుపూ, సొలుపూ లేకుండా అకుంఠిత దీక్షతో అందరిలో తన గురువుగారిని దర్శిస్తూ, ఒకే సత్యాన్ని (విషయాన్ని) దానిని

వినేవారి స్థాయినిబట్టి - విద్యుల్లతా మెరుపులవంటి ఆమహనీయుని మేధస్సు నుండి జాలువారిన విషయాలు కూడా వివిధంగా ఉండేవి.

ఒకసారి పన్నెండుసంవత్సరాలకు లోబడిన పిల్లలందరినీ మాస్కూలు నుండి వారి దర్శనార్థం విద్యానగర్ తీసుకపోయాను. వెంటనే సాయంత్రం 6 గంటలకు నన్నేదో పనిమీద పంపారు. నేను తిరిగివచ్చేసరికి రాత్రి పదిగంటలైంది. అక్కడి దృశ్యము చూచి నేను ఆశ్చర్యచకితుడనైనాను. ఈ పిల్లలంతా పిల్లలకోడి రెక్కలసందు దూరిన కోడిపిల్లలలాగ మాస్టరుగారికి తగులుతూ చుట్టూరా కూర్చొని బాహ్యస్మృతి లేకుండా వారుచెప్పే విషయాలు చెవులు రిక్కించుకొని వింటున్నారు. ''సార్! వీళ్ళు అన్నం తిన్నారా లేదా?'' అన్నాను ఆశ్చర్యంగా. ''లేదు. కృష్ణమూర్తి ఇంటికి తీసుకుపోండి'' అన్నారు. లేచి రమ్మంటే వాళ్ళు వస్తున్నారా! 'ఆ తర్వాత ఏమైంది చెప్పండి సార్' అంటున్నారు - కనీసం 4 గం॥ల సేపు ముక్కుపచ్చలారని ఆ చిన్నారులతో అంత జిజ్ఞాస, కుతూహలం కలిగించే విషయాలు ఏమి ముచ్చటిస్తున్నారో! పిల్లా, పాప, ముసలీముతకా అందరికీ సవివరంగా, సమానంగా ప్రేమతో బోధిస్తున్నారు.

గురువుగారి ఆజ్ఞలను ఎలా ఆచరించాలో, అలా ఆచరిస్తే గమ్యం ఎలా చేరుకోగలమో వారాచరించి చూపి మనలనూ అలాగే చేయమని ప్రబోధిస్తున్నారు. అంతేగాని, వారాచరించి చూపిన మార్గానికి భిన్నంగా మనమాచరిస్తుంటే - వారికంటే మనమే గొప్పవారమని తలవాలా?

విద్యానగర్ మందిర నిర్మాణమప్పుడు అనేకమంది లక్షాధికారులొచ్చి మందిరమంతా మేమే నిర్మిస్తాము. మీకు శ్రమే అక్కరలేదు మందిరంపై మా శిలాఫలకం వేయాలంటే మాస్టరుగారు సుతరామూ అంగీకరించలేదు. మీరు నిర్మించాలంటే నిర్మించండి, ఏ అడ్డంకూలేదు. కానీ మీ శిలాఫలకం మందిరం మీద వేయడం జరుగదని నిక్కచ్చిగా చెప్పేశారు. గనుక భిక్షతోనే నిర్మాణం జరిగింది. అక్కడి మందిరంపై పేర్లులేవు. కానీ మనలో కొందరీనాడు ఆశ్రమ నిర్మాణానికి విరివిగా చందాలిస్తే మీపేర్లు గోడలపై శాశ్వతంగా వ్రాసిపెడుతామని చెపుతున్నారు. నేడు మనకు వారి భౌతిక సాన్నిధ్యము లేకున్నప్పటికీ వారు సర్వగతులై మన ఆచరణను సంపూర్ణంగా చూస్తున్నారు. శ్రీమాస్టరుగారు



ఆవిధంగా శిలాఫలకాలు వేసేందుకు నిరాకరించుటకు బృహత్తరకారణం లేకపోలేదు. జ్ఞానేశ్వర్ మహారాజ్ అను మహనీయుడు పన్నెండు సంవత్సరముల ప్రాయములోనే దున్నపోతు నోటినుండి ఏకధాటిగా వేదమంత్రాలు చెప్పించారు. నిర్జీవమైన మొండిగోడపై కూర్చొని కదిలిపొమ్మంటే ఆ గోడ కదలి పోసాగింది. ఆ మహనీయుడు భగవద్గీతకు వ్యాఖ్య వ్రాశారు. అదే జ్ఞానేశ్వరీ భగవద్గీత. అందులో వారంటారు - ''ధర్మకార్యం చేస్తూ పేరు ప్రఖ్యాతులుకోరేవారు అధర్మకార్యం చేసినట్లే అవుతుంది''. గనుక శ్రీ మాస్టరుగారు శిలాఫలకాలు తిరస్కరించారు. అట్టి వారి దివ్య ఆచరణను మనం చేయకుండానే గట్టెక్కడం సాధ్యమా!

''మందిరాలు, ఆశ్రమాలు ఎంత అందంగా నిర్మించామన్నది లెక్కగాదు. ఆ నిష్కామ కర్మద్వారా మనలోని బలహీనతలు ఎంతవరకు గుర్తించాము - ఎంతవరకు నిర్మూలించే కృషిచేశాము - ఎంతవరకు నిర్మూలించామన్నదే లెక్క. సంపూర్ణంగా బలహీనత వదలకున్నా వదిలించుకోవాలన్న సంస్కారమైనా మనలో ఎంతవరకు ఈ జన్మ కేర్పడింది అనేది మనకు లెక్క''. అనేవారు.

''ఏ విషయమైనా ఇతరులనుండి తెలుసుకోవడం చింకిగుడ్డలు దొంగిలించడం వంటిదని, స్వానుభవంద్వారా పరీక్షించి తెలుసుకోవడం జరీశాలువ బహూకరణ పొందడం వంటిది'' అని బాబాగారు మనకు నేర్పారు. గనుక మాస్టారు బాబాను పరీక్షించదలచారట. ''నా భక్తునికి అన్న వస్త్రాలకు లోటు లేదు'' అనే వాక్యం బాబా ఎలా చెల్లించుకుంటారో చూడాలని తన దగ్గరున్న డబ్బంతా ఒక్కపైసా లేకుండా షిరిడీ హుండీలో వేసేశారట. అప్పటి వరకు తన దగ్గర డబ్బు ఉంటే, హోటలుకు పోతేనే అన్నం, టిఫిన్, టీ దొరికేవి. కానీ ఇప్పుడు తన దగ్గర చిల్లిగవ్వ లేదు. అయితే విశ్వచైతన్యమే తానైన బాబాగారు ఎవరినో ఒకరిని ప్రేరేపించి మాస్టరుగారు ఎక్కడ కూర్చుంటే అక్కడికే అన్నం, టిఫిన్, టీ అన్నీ సప్లయి చేస్తున్నారట. ఎంత చిత్రమైన అనుభవం! శ్రీ వివేకానందులవారు రైల్వేస్టేషన్‌లో కూర్చొని దైవాన్ని పరీక్షిస్తే, ఇప్పుడు మాస్టారు మరొక క్రొత్తభంగిమలో దైవాన్ని పరీక్షించారన్నమాట. మనలను గూడా అలా పరీక్షించి బాబాగారి కరుణను, అదృశ్యహస్తాన్ని రుచిచూడ మంటున్నారు. ఈ పరీక్షలో ఒక కండిషన్ ఉందట. అదేమిటంటే మన

మనస్సులోగాని, మాటలలోగాని బాబా విషయం తప్ప అన్యముండరాదట. అలాచేసిన వారికి అంతులేని ఆనందం తథ్యం.

''ఉన్న డబ్బంతా ఇలా బాబా విషయాల ప్రింటింగ్‌కే తగలేస్తున్నారు సార్'' అని స్నేహితులనేవారు. కానీ ఒకనాటి స్వప్నంలో "Pen is a mighty investment" అని తామ్రశాసనం చూపారట బాబా. (రచన గొప్ప పెట్టుబడి) మనందరినీకూడా ఆ రచనా యజ్ఞంలో పాలు పంచుకోమని మాస్టరుగారి అభిమతము. మన డబ్బుతో మానవుల హృదయాలను ధర్మాచరణకు ప్రేరేపించగలమా? అది దుస్సాధ్యము. కానీ మాష్టారి రచనలు ప్రపంచ వ్యాప్తంగా మానవ హృదయాలను ధర్మాచరణకు ప్రేరేపిస్తున్నాయి. ఎందరికో కష్టాలు తీరుస్తున్నాయి. గనుక అలాంటి ఉత్తమ జ్ఞానయజ్ఞంలో మన పేరు ప్రఖ్యాతులతో నిమిత్తంలేకుండా (జ్ఞానేశ్వర్ మహారాజ్ చెప్పినట్లు) పాలుపంచుకుంటే మనకు బాబాగారి కృప వద్దన్నా కల్గుతుంది. ఎట్లాగంటే - బాబాగారిని దర్శించాలని శ్రీమాస్టరుగారి తండ్రిగారైన శ్రీమాన్ అనంతాచార్యులవారు ఎప్పుడూ కోరలేదు. కానీ వారి ధర్మాచరణకు సంప్రీతుడైన బాబా వారికి భౌతిక దర్శనం ప్రసాదించారు. ఒకరోజుకాదు వరుసగా పదిహేను రోజులు వారి హృదయాన్ని అంతులేని ఆనందంతో ముంచేశారు. మనమూ వారిలాగ ధర్మమాచరిస్తే మనకూ అలాంటి ఆనందం అనే పాయసం వడ్డిస్తారు సాయిమాస్టర్‌గారు.

''మట్టి మట్టిలో, శ్వాస వాయువులో కలసిపోతాయి. ఈ అవకాశం మరలా రాదు. ఈ వచ్చిన సదవకాశాన్ని ఆస్తిపాస్తులు వెనకేసుకునే పిడకలేరుకునే పనికి స్వస్తి చెప్పి సద్గురుని తెలుసుకునే కృషిచెయ్యి. తెలుసుకున్నాక వారిని త్రికరణశుద్ధిగా సేవించు, ధనము అశాశ్వతం, భగవంతుడిచ్చింది తరుగదు. మానవులిచ్చింది నిలువదు'' అన్న బాబాగారి ఆజ్ఞాబద్ధులైన శ్రీ మాష్టారు ఈ జ్ఞానయజ్ఞంలో సమిధగా కరిగిపోయారు. నెలకు ఇరవైరోజులకు పైగా పర్యటనలు, సత్సంగాలు, ఉపన్యాసాలు మిగిలిన రోజులే భార్యాబిడ్డల సంరక్షణ. అంత నిర్విరామంగా ప్రజలందరికీ తన కన్నబిడ్డలకువలె జ్ఞానదానంచేసి గురువుగారిని మెప్పించారు గనుకనే బాబాకు వారు ముద్దుబిడ్డడైనారు. శ్రీ అక్కల్‌కోటస్వామివారు పూలపల్లకిలో తన ప్రక్కన కూర్చోబెట్టుకున్నారు!



''రుచులకు పోవద్దు, ఒకటి రెండు రకాలతో తృప్తి చెందు ఏమీ, ఒకటి రెండు పూటల ఉపవాసం కూడా భరించలేవా? నేను పన్నెండు సంవత్సరాలు వేపాకు తిని గురుసేవ చేశాను'' అన్న శ్రీసాయినాథుని ఆజ్ఞలను శ్రీ మాష్టారు ఎంత చక్కగా ఆచరించారో చూడండి!

భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి ఆజ్ఞమేరకు ఏవిధమైన చమురు లేకుండా ఏదైనా తినాలి నేను. బాబాగారి ఆజ్ఞకు సరియైన అర్థం చెప్పమంటే శ్రీ మాష్టారు ఉప్పు, పులుపు, కారం లేకుండా తినమన్నారు. గనుక ఉప్పులేని మజ్జిగన్నంలో ఉప్పు, పులుపు, కారంలేని కూరగాయదబ్బలు ఉడికినవి తినడం అలవాటు నాకు. ఒకరోజు వెంకటగిరిలో మాష్టారితోపాటు మరి నలుగురికి ఒకేపంక్తిలో వడ్డిస్తున్నాను. మాష్టారు నవ్వుతూ భోంచేస్తున్నారు. కాస్తయినా నేను తెచ్చుకున్న పదార్థం పెట్టాలని ఉప్పు, కారంలేని నా ఉడికిన అరటికాయ దబ్బలు మాస్టరుగారి విస్తర్లో వడ్డించాను. అవి తినేశారు. అదేవిధంగా నేను తెచ్చుకున్న కూరంతా తినేశారు. ఓరిదేవుడా! వారికి రుచి అసలు తెలుస్తుందా? రుచిని పట్టించుకోకుండా తినడం నరనరాల్లో జీర్ణించుకుపోయింది. 'ఎప్పుడైనా కూర ఎలా ఉందిసార్?' అంటే 'చాలా బాగుంది' అంటారు. బ్రహ్మచారిగా ఉండి తన వంట తాను చేసుకునేటప్పుడు బియ్యం, కూరగాయలు, ఉప్పు, కారం, అన్నీ ఒకే పాత్రలో వేసి ఉడికించి పెరుగువేసుకొని చాలా స్వల్పంగా తినేవారట. వివాహమయ్యాక అమ్మగారి రుచికరమైన వంట గూడ ఆయనపై ఎట్టి ప్రభావమూ చూపించలేదు.

అందుకే గాబోలు బాబా రుచి, విచక్షణ లేకుండా అన్నీ కలిపి తినేవారు. మాస్టరుగారు విద్యానగర్‌లో బాబా నివేదనలన్నీ కలిపేసి ప్రసాదం పంచే వారందుకే గాబోలు! మనలనుగూడా అలాగేచేసి పరిశుద్ధ మనస్సుతో సాయిని పట్టుకోమంటున్నారు.

## నిర్ణీత కాలము

మాస్టరుగారు అనేకమార్లు మనకు ఇష్టమొచ్చినప్పుడూ, తీరిక వున్నప్పుడూ గురుసేవ చేయడం తగదని గట్టిగా హెచ్చరించేవారు.

అందుకు ఉదాహరణగా ఇద్దరు భక్తుల వృత్తాంతం చెప్పేవారు. ఒకడు, ''బాబా మీ చిలుము గొట్టములో మీ పొగాకు వేసి మీ ధునిలోని నిప్పుతోనే అంటించి రోజూ ఇస్తాను నేను. తమకేమీ ఇవ్వలేని బీదవాడను స్వామీ'' అని చెప్పుకున్నాడట. బాబా, ''సరే అలాగే ఇవ్వమన్నారట'' ఇతడు నిత్యం పది నిమిషాలు ముందుగానే వచ్చి నిలబడి తన షెడ్యూలు కాలం కాగానే తనసేవ చేసుకొని వెళ్ళేవారట. కొంతకాలానికి అతని భక్తి విశ్వాసాలకు బాబా సంతసించి అతనికి సర్వం సిద్ధించాలని ఆశీర్వదించారట. అతనికలాగే జరిగిందట.

మరియొకటి గురుచరిత్ర నుండి : ఒకడు శ్రీగురుడు స్నానానికి వచ్చే సమయానికి హాజరుగా మార్గాన కాచుకొనియుండి శ్రద్ధగా ఆ తోవలోని ముండ్లన్నీ నిత్యం తీసేసేవాడట. కొన్నాళ్ళకు శ్రీగురుడు సంతసించి అతనిని ఆశీర్వదించారట. గనుక సకాలంలో సేవ చేయడం చాలా ముఖ్యమని చెప్పేవారు. మనకు తీరికైనప్పుడు సేవచేయడం సరైన పద్ధతి కాదని చెప్పేవారు.

ఇలా సకాలంలో ఎందుకు చేయాలో గూడా వివరించేవారు. మనకు తీరికైనపుడు సేవచేయడం వలన మన మనస్సు ఆసేవ చేసినంతసేపు మాత్రమే వారిచెంతనుండి తర్వాత మన పనిలో నిమగ్నమవుతుంది. నిర్ణీత కాలంలో చేయాలంటే - ఆ కాలానికి ఒక గంట, అరగంటముందు నుండే మన మనస్సు గురుసేవను మనకు గుర్తుచేస్తూ - ఆ గురుసేవ చేయని టైంలోకూడా మనధ్యాస గురువుపై లగ్నమయ్యేటట్లు చేస్తుందని చెప్పేవారు.

శ్రీ మాస్టరుగారు దైవప్రార్థనకు నిర్ణీతకాలం ముఖ్యమని ఆ విషయాన్ని అంత చక్కగా పాటించేవారు. విద్యానగర్‌లోగాని, ఒంగోలులో గాని ఉదయ హారతికి మాకంటే ముందు మాస్టరుగారు వచ్చి కూర్చుంటే మాకే సిగ్గేసేది. వారు పగలంతా వచ్చిన భక్తులతోను, రాత్రి రచనా వ్యాసంగములోను వుండి ఎప్పుడు నిద్రపోతారో తెలియదు. కానీ ఉదయాన్నే మాకంటే ముందే సత్సంగ రూములో వారుండడంతో మాకు ఎంతో లజ్జాకరంగా ఉండేది.

నిత్యం చేసే సాధనలకు నిర్ణీతకాలాన్ని పాటిస్తుంటే రూపాయకు రూపాయ ఫలితము. కాలనిర్ణయం లేకుండా తీరికైనప్పుడు చేయడం వలన రూపాయి రావలసినచోట పదిపైసలొస్తుందనేవారు.



## త్వమేవమాతాచ

''త్వమేవ మాతాచ పితాత్వమేవ త్వమేవబంధుశ్చ సఖాత్వమేవ
త్వమేవ విద్యా ద్రవిణంత్వమేవ త్వమేవ సర్వం మమ దేవ దేవ.''

ఈ శ్లోకం నిత్యం వల్లించి చేతులు జోడించడం తప్ప ఆచరణలేదు. డాక్టరుగారు వ్రాసిచ్చిన మందులచీటిని ఎన్నిమార్లు వల్లించినా జబ్బు తగ్గదుగదా? ఆ మందులు తిని పథ్యముండాలి. అదిగదా ఆచరణ అనే వారు మాస్టరుగారు. ఈ ఒక్క శ్లోకభావాన్ని లోతుగా హృదయగతమయ్యేటట్లు (మనసుకు మాత్రంకాదు) మననంచేసి శ్రీమాస్టరుగారు ఆచరించినట్లు ఆచరించగల్గితే ఇక సాధనలన్నీ పూర్తి అయినట్లే. భగవంతుడే పూర్తి చేయిస్తాడు. ఇందులో చివర సర్వం అని ఉన్న ఒక్క పదము చాలా ముఖ్యము. తల్లి, తండ్రి బంధువులు --- సర్వం - అంటే జీవ, నిర్జీవులన్నీ నీవే అని అర్థం. అన్నీ - అంటే మనం కూడా అని కూడా అర్థం. అన్నీ ఆయనే అయినప్పుడు రాగద్వేషాలు ఎవరిపైన, దేనిపైన వహించాలి. రాగద్వేషాలు పోతే కావాలి అనే కోరికే లేదు. ఆశేలేదు. 'ఆశపోతే అంతా పోతుండ్లాయ్యా' అన్న శ్రీ వెంకయ్యస్వామివారి వాక్యం సత్యమై పోయింది. అప్పుడు అంతరాత్మలోని అడ్డంకు తొలగి అందరినీ ప్రేమించగలుగుతాము - మాస్టరుగారిలాగ అందరికీ సేవచేస్తాము. ఆసేవ ఎవరికి చేస్తున్నామన్న భావన ఉంటుంది? సాయినాథునకేగదా. ఆ వచ్చినవాడు చెడ్డవాడేకావచ్చు - అతని చెడు ప్రవర్తనకు మనకు అతనికి పూర్వజన్మలో ఉన్న ఋణానుబంధమే కారణము. దీన్నే మాస్టరుగారు చెపుతారు - అతడు అందరికీ మంచివాడే కానీ మంచివాళ్ళమైన మనపట్ల అలాచెడ్డగా ప్రవర్తిస్తాడు. ఎందుకని? పూర్వజన్మ ఋణానుబంధంవలన, బ్యాంకులో అప్పు తెచ్చుకొని తిని తీర్చేటప్పుడు బాధెందుకు? అంటారు. ఎవరి చెడు కర్మ ఫలితాన్ని వాడే అనుభవించి తీరుతాడు. మనం మాత్రం మన దృష్టి పై శ్లోకంలో చెప్పినట్లు ఈ రూపంలో బాబానే ఇలా చేస్తున్నాడు. అంతా మన మంచికే అనుకొని నిర్లిప్తంగా ఉండడమే సాధన. మనసులోకూడా భేదభావం లేకుండా ఉండడమే సాధన పరాకాష్ట. భేదభావం వస్తుంది మొదట. కానీ వెంటనే వివేకం మేల్కొని మాస్టరుగారి మాటలు, వారి ప్రవర్తన గుర్తుకు తెచ్చుకొని బాబాకు మన తప్పుచెప్పుకొని, ఇలాంటి బేధభావం తిరిగి మరొక్కసారి రాకుండా చేయితండ్రీ అని

హృదయపూర్వక పరితాపంతో ప్రార్థన చేస్తూ వివేకానందుడు, మాస్టరుగారు, మిలారేపాలు చేసుకున్న ప్రాయశ్చిత్తాలు చేసుకోగలిగితే గట్టెక్కుతాను. లేకుంటే నా కారుకు స్పీడు లేదు. గమ్యం చేరడం ఆలస్యమవుతుంది. ఈ ఆలస్యంతో తిరిగి కర్మ బంధంలో చిక్కి జన్మలు పొడిగించుకుంటాను.

జన్మపరంపరలనే విషవలయం నుండి బయట పడాలి అనే తీవ్రాతి తీవ్రమైన హృదయపూర్వక నిశ్చయం గల అలివేలు మంగతాయారమ్మ (అమ్మగారు) లాగ తుఫానులకు సహితం చలించని దృఢ సంకల్పం కావాలి. అది పుణ్యంవల్లనే, సద్గురుసేవవల్లనే లభిస్తుంది. అందరి ఎడల ప్రేమభావం వహించి సేవించి తరించడమే మాస్టరుగారు నాకు బోధించిన, నేర్పించిన, ఆచరించి చూపిన అత్యుత్తమ మార్గం. ఆచరిస్తే తరిస్తాను. వారి పంచకు చేరితే పాయసం వడ్డించారు. జుర్రితే అంతులేని ఆనందం - ఎంత జుర్రుకుంటే అంత ఆనందం. ఆ అమృతం అందరికీ సమానంగానే పంచబడినా వారివారి పుణ్యాన్ననుసరించి సొంతంచేసుకుంటారు. గనుక పుణ్యంకొరకు కనీసం త్రికరణశుద్ధిగల పూజైనా చేయి. మొదటి క్లాసైనా పూర్తిచేస్తావు అంటారు మాస్టరుగారు, నమో - సద్గురు దేవా!

ఎన్నో సంవత్సరముల నుండి శ్రీమాస్టరుగారు ప్రసాదించిన ఉదయ ప్రార్థన నిత్యం నోటితో చదవడం తప్ప లోతుగా సరైన అర్థాన్ని మననంచేసి ఆచరిస్తున్నానా? లేనేలేదు. పోనీ ఆచరించకున్నా ఫరవాలేదు. ఆచరించే ప్రయత్నమైనా చేస్తున్నానా? అదీలేదు. మరి గురువుగారు చెప్పినదాన్ని ఆచరించకుండా నోటితో వల్లిస్తుంటే గట్టెక్కే మాట ఏముంది? డాక్టరిచ్చిన మందు తిని పథ్యముండకుండా ఆ మందుచీటీ నిత్యం వల్లిస్తుంటే జబ్బు ఎలా తగ్గుతుంది?

ఉదయ ప్రార్థనలో ''నే చేయు పనులన్నీ నీ సేవలే అగుగాక'' అంటున్నాను. ఇల్లు చిమ్ముకోవడం, వంట, రచనావ్యాసంగం, శ్రీస్వామివారి పూజ, శ్రీస్వామివారి భక్తులతో ముచ్చటించడం ఇవన్నీ పనులేగదా. మరి ఇవన్నీ నిజంగా వారి సేవలు అయ్యేదెలాగు? ఆ సేవలు వారు స్వీకరించడమెలాగు? అనేది కొంతకు కొంతైనా ఇరవైసంవత్సరాల తర్వాత ఇప్పుడు తోచింది. శ్రీస్వామివారి ఆజ్ఞప్రకారం గొలగమూడిలోని కోనేరుదాటిపోకుండా



ఈ పుణ్యభూమిలోనే ఉండసాగిన తర్వాత కాస్త అర్థమైంది. ''హోత్ దరూన్ చెలాల్'' చేసిన కొద్దీ కాస్త కాస్త ముందుకు జరిగే అవకాశమొస్తుంది.

''గురువుగారు చెప్పినట్లు వారి ఆజ్ఞలను పాటించు, ఆచరించు. గురువుగారు చేసినట్లు చేయవద్దు'' అనేది పెద్దలమాట. గత ఇరవై సంవత్సరాలనుండి ఎన్నిమార్లు ఈ సూత్రం చదివినా, ఎన్నోమార్లు ఇతరులకు నేనుచెప్పినా, అందలి భావం మాత్రం ఇప్పుడు తెలిసినంత విశాలంగా అప్పుడు తెలిసేది లేదు. ఇప్పుడైనా సంపూర్ణంగా గ్రహించానని నమ్మకమేముంది! బాబాగారు విష్ణుసహస్రనామ పుస్తకం షామాగారికిచ్చి నిత్యం అర్థం తెలుసుకొని ఒకటి రెండు నామాలనైనా క్షుణ్ణంగా హృదయగతమయ్యేటట్లు మననం చేయమన్నారు. శ్రీ మాస్టరుగారు అనేకమందికి చెప్పినట్లు నాకు కూడా టి.టి.డి.వారు ప్రచురించిన విష్ణుసహస్రనామ పుస్తకం తెచ్చి అర్థం మననం చేయమన్నారు. తెచ్చి చదివానుగాని నిత్యం కొంతసేపైనా మననం చేయలేదు. బాబాగారుగాని, శ్రీమాస్టరుగారుగాని నిత్యం ఎందుకు మననం చేయమన్నారో ఈరోజు కొంతకు కొంతైనా అర్థమవుతుంది. భగవంతుని విశ్వ ప్రేరణాధికుడు, సర్వప్రేరణాధికుడు అనికూడా అంటారు. ఈ నామాటల అర్థం హృదయగతమయితే ఇక అహంకారమునకు తావేలేదు. హృదయగతమవడమే కష్టము. ప్రతిమాట కూడా దిల్ కే బాత్ (హృదయాంతరాళమునుండి వచ్చేమాట) ఔర్ దిమాక్ కే బాత్ (మనసునుండి వెలువడేది) అని రెండు రకాలుగా వచ్చే అవకాశముంది. ''భగవంతుడు విశ్వప్రేరణాధికుడు. విశ్వాన్ని తన ఇచ్ఛానుసారం నడిపించేవాడు. అంతా ఆయన ప్రేరణవల్లనే జరుగుతుంది.'' ఈ భావం తగినంత లోతుగా హృదయగతమయితే ఇక మననం చేసేదేమీ ఉండదు. ఆ పరమేశ్వరుని శక్తిని అత్యంత కుతూహలముతోను, ఆశ్చర్యముతోను గమనిస్తూ నిశ్చలంగా అలా కూర్చోనుండి పోవడమే జరిగేది. ఎవరినీ తప్పు పట్టలేము. ఆ సర్వప్రేరణాధికుని చేతిలో - అవతలి వారు కీలుబొమ్మలు మాత్రమే. ఆ సర్వేశ్వరుడు ఆడించినట్లు ఆడడం తప్ప మరేమీ చేయలేరు.

ఆ విధంగా విశ్వవిభుని తత్వం వంటబడితే మన అహంకారం సమూలంగా చస్తుంది. సర్వస్య శరణాగతి కుదురుతుంది. శాంతి, ఆనందం లభిస్తుంది. అప్పుడే మనం 'హోత్ దరూన్ చలాల్' చేసినట్లు - అంటారు

శ్రీమాస్టరుగారు. ఈలోగా పారాయణలు ఎన్ని చేశాము అని లెక్క వేసుకోకుండా - పరాయణత్వంతో పారాయణ చేసి ఆమహామహుని తత్వమెంత వంటబట్టి ఆచరించుచున్నామో లేక ఆచరించే ప్రయత్నం చేస్తున్నామో చూచు కోమంటారు మాస్టరుగారు.

''సాయి మందిరం చుట్టూ ఎన్ని ప్రదక్షిణలు చేశామన్నది లెక్క వేసు కోవడం కాదు. ఆ ప్రదక్షిణలలో ఎన్నిప్రదక్షిణలు చేసినంతసేపు మన మనస్సు వారి దివ్య పాదారవిందములపై నిలచిందో చూచుకో'' అన్నారు మాష్టారు. అందుకని మాష్టారు నాకు ''ప్రదక్షిణల సంఖ్యాగాకుండా టైం పెట్టుకొని నీ మనస్సు శ్రీస్వామివారిచుట్టూ ఏమారకుండా తిరిగేటట్లు చూడు'' అని ఆదేశించారు.

విష్ణు సహస్రనామం అర్థసహితంగా మననం చేయగా చేయగా మన పుణ్యం అధికమవుతూ వస్తుంది. తగినంత పుణ్యం మన లెక్కకు చేరగానే మన మనస్సు అన్యచింతల జోలికి పోకుండా భగవంతుని చెంత నిలుస్తుంది. బహిరంతర్ వ్యాపినే నమః అనగానే మనచుట్టూ బయట, లోపలకూడ - ''అందుగల డిందులేడని సందేహము వలదు'' అన్నట్లు - అంతా ఆయనే అయితే ఇక ఈ మనస్సు దేనిని గూర్చి ఆలోచిస్తుంది. పర్యవసానం మనోనాశమే.

సర్వ సమర్థ సద్గురు ఆచార్య భరద్వాజ గురవేనమః

## ఒక్క దూలపు ఇల్లు

మనందరికీ ఆస్తిపాస్తులు, బంధుమిత్రులు ఆధారం. మరి బాబాకు ఆధారం ''అల్లా'' మాత్రమే. అలాగే మాస్టరుగారికి ఆధారం బాబాగారు మాత్రమేకాని మనలాగా ఆస్తిపాస్తులు, బంధుమిత్రులు మాత్రం ఆధారంకాదు. సర్వజీవుల హృదయాలు భగవంతుని ఏడవ నిలయాలని తాజుద్దీన్ బాబాగారు చెప్పారు. గనుక అన్ని జీవులను భగవంతుని ప్రతిరూపాలుగా ఆదరించాలోని చీదరించుకోవడం, కసిరికొట్టడం తగదు. అందుకే నానాసాహెబ్ చందోర్కర్ బిచ్చగత్తెను కసిరి కొడితే బాబా వారికి పాఠం నేర్పింది. నామాట వినని వారితో నాకేం పని? అని మందలించిందికూడా అందుకే. అందుకే మాస్టరుగారు



బిచ్చగాళ్ళను నాలాగ కసిరికొట్టకుండా ఎంత ఆదరంగా చూచేవారో! తన దగ్గరున్న పండ్లలో మేలుపండ్లు, పెద్దపండ్లు వారికి ఆదరంగా నవ్వుతూ ఇచ్చేవారు. బాబానే ఆ రూపంతో స్వీకరిస్తున్నారని మనస్సులోనే నమస్కరించు కునేవారు. బిచ్చగాళ్ళనేకాదు, తనను ఆశ్రయించిన ప్రతిఒక్క ప్రాణిని ఎంతో ఆదరంగా చూచేవారు. వారి ఆదరణ పొందిన వారికే అదెంత మధురంగా ఉండేదో తెలుస్తుంది. మిగిలిన వారికి ఈ వ్రాత ద్వారా నేనెలా ఆమాధుర్యాన్ని వర్ణించగలను! విద్యానగర్‌లో ఒక పింగాణి ప్లేటునిండా అన్నం పెట్టి కుక్కల ముందుంచితే అవి తనివితీరా తిని హాయిగా సత్సంగం రూములో పడుకునేవి. వంట వారొక్కరికోసమే చేసుకున్నా కనీసం నలుగురికి సరిపడా వండేవారు. లేకుంటే కుక్కలకు అంత అన్నం ఎలా పెట్టేవారు? ఆవిషయం గుర్తుకొస్తే నామీద నాకే అసహ్యమేస్తుంది. ఒక్క పిడికెడు మెతుకులు నేలపైన పారేసే నాప్రవర్తనకు ఆప్రేమమూర్తి యొక్క ప్రవర్తన ఏమర్థమై చస్తుంది! మాస్టరు గారిలాగ ప్రవర్తన అలవరుచుకోకుండా ఎన్నిమార్లు ఆరతులు పాడినా, పూజలు చేసినా, ధ్యానాలుచేసినా నాకేమి మేలుగలుగుతుంది?

అందుకే శ్రీ వెంకయ్యస్వామి వారంటారు ''ఆకలై కొంగుపట్టే వారికి అన్నం పెట్టు - బ్రేవ్‌మని తేపేవారికి కాదు'' అని, ఆకలయ్యే వారిలోని ఆకలి భగవంతుడే గనుక ( భగవద్గీత) అలా అన్నారు.

ఈ విషయాన్నే శ్రీ వెంకయ్యస్వామివారు చాలా చక్కగా చెప్పారు. ''సాధన చేసుకుంటూ ఏ ఊర్లోఉండమంటారు స్వామి?'' అని అడిగిన సాధకునకు ''ఒక్క దూలపు ఇల్లు వేసుకొని ఏ ఊర్లోనైనా ఉండవచ్చు'' అని పదేపదే చెప్పారు. ఇంటికి ఆధారం దూలము గనుక మనకు ఒక్కదైవమే ఆధారంగా జీవించాలి. అన్నిజీవులలోను, మన బయట, లోపల, సర్వత్రా సర్వదా మనతో ఉన్న దైవాన్ని నిరంతరం గుర్తిస్తుండాలి. ఈ సర్వ జగత్తుకు ఆధారం ఒక్కదైవమే అనీ, ఆదైవశక్తే ఇన్ని రూపాలుగా ప్రకటమైందని చింతిస్తూ, ఈ విధంగా మన రాగద్వేషాలు, ఇష్టాఇష్టాలు, అన్ని రకాలైన ద్వంద్వాలను అట్టే మన దృష్టితో కరిగించివేసి ఆ ఒక్క సత్యాన్నే ఆధారంగా, ఆలంబనగా అదే ధ్యేయంగా సాధన సాగించేందుకు ఎక్కడైనా ఉండవచ్చుని

శ్రీస్వామివారు అన్నారు. దాన్నే మాస్టరుగారు చేసి మనకు చూపారు. ఆ చేతల ద్వారా మౌనబోధచేశారు. మనలనుగూడా అలా ఆచరించి తరించమన్నారు.

ఓం జ్ఞాన ప్రదాత్రే నమః

సద్గురువుయొక్క మహిమను లోకానికి వెల్లడిచేసి మానవు లందరూ వారిద్వారా శాంతి, సౌఖ్యాలు పొందేటట్లుచేయడం సచ్ఛిష్యుని యొక్క విధియని గురుగీత చెప్పింది. బాబాగారు తన ద్వారా ప్రకటమయ్యే మహిమంతా తన గురువుగారిదేనని చెపుతూ నిరంతరం వారిని స్మరించేవారట. శ్రీమాస్టరు గారు కూడా నిరంతరం విసుగు, విరామం లేకుండా ఎంతో ఉత్సాహంతో అను క్షణం బాబాను గురించి లోకానికి చెపుతూ అందరూ బాబాకృపకు పాత్రు లయ్యేటట్లు సహకరించేవారు. మనలను గూడా అలాగే చేయమని ప్రోత్సహించేవారు. మరి మనం మాస్టరుగారిలాగా బాబాగారి కృప రుచి చూడకుండానే వారు చెప్పినంతగా సవాలు చేసినట్లు చెప్పగలమా! చెప్పలేము. గనుక ముందు అలాంటి బాబాకృపను చవిచూచేందుకు తగు కృషిచేయమని, తర్వాత లోకానికి వెల్లడిచేయకుండా ఉండలేమనీ చెప్పేవారు.

ఈ గుత్నంలో ఆయా భక్తులు కష్టాల నెదుర్కోవడం తప్పదు. అయితే కంటికి [illegible] పుల్ల ఉన్నదని తెలుస్తూనే నేను నేరు[illegible] అంటే నేరుగానే పోతానం[illegible] - కన్నుపోతుంది. ప్రక్కకు తప్పుకునే ప్రయత్నం చేయవద్దని భగవంతుడు చెప్పాడా? చెప్పలేదే. అసలు గురుమహిమను లోకానికి చాటే పనిమాత్రం ఈ కష్టాలకు వెరచి మానరాదట. లోకంలో ఎక్కువమంది నాలాంటివారు ఈప్రక్కకు తప్పుకునే ప్రయత్నం అనే ముసుగును ఆసరాగా చేసుకొని ఇక గురుమహిమను లోకానికిచాటే ప్రయత్నానికే స్వస్తి పలుకు తుంటారు. నిజమైన భక్తునకు, దైవీసంపదలో మొదటి గుణమైన అభయం (భయములేని) గల భక్తునకు శ్రీమాస్టరు గారి ఆచరణే గొప్ప బోధ అవుతుంది. తాను ఉద్యోగం మానుకొని బయటకు రావలసి వచ్చినా, బాడుగిల్లు సరైనది దొరకక ఇరుకు ఇంట్లో ఉండవలసివచ్చినా సరే గురు మహిమను చాటే తన ధర్మానికి స్వస్తిపలుకలేదు. క్రీస్తు చేసినది కూడా ఇదే. ధర్మప్రచారంలో నిమగ్నమై రాజభటులకు దొరకకుండా గ్రామగ్రామాలకు



పోతూ ధర్మబోధ చేశారు. అందరు మహనీయులకు ఇది తప్పలేదు. తగవులాటలొస్తాయని మా గ్రామంలోని రామమందిరంలో సాయిచరిత్ర చదువనని నేను మొండికేస్తే ఆ తగవులాటలు తప్పుకొనే సులువులు చెప్పి నాచేత సాయిచరిత్ర అక్కడ చదివించి తీరారు. గురుమహిమను చాటడంలో వారు వహించిన దీక్ష ఎంత కఠోరమైనదో గదా!

## ప్రేమకు పెన్నిధి

ఈ మహనీయమూర్తి ప్రేమను ఎలా అందివ్వాలో ఆచరించి, ఆ విధంగా మనమూ ఆచరిస్తే భగవంతుని నిజమైన బిడ్డలమవుతామని, తన ఆచరణద్వారా బోధించారు. మహల్సాపతిని నేలపైవిడిచి తాను చెక్కమీద పడుకొన నిరాకరించి నపుడుగాని, వచ్చిన నైవేద్యాలలో పండ్లు తీసి కొందరు బిడ్డలకు పెట్టడంలోను, షామాకు విష్ణుసహస్ర నామ పుస్తకం, పూజా విగ్రహాలు ప్రసాదించినపుడు పలికిన మాటలనుండి శ్రీ మాస్టరుగారు ఎంతెంత గొప్పసందేశాలు ఎంత గొప్పగా హృదయగతం చేసుకొని ఆచరించి చూపారో నేనెలా వ్రాయగలను?

విద్యానగర్ మందిర నిర్మాణం జరుగుతున్నది. వేసవి శెలవలని, బాబా సేవచేయాలని, మాస్టరుగారి సన్నిధిలో ఉండాలనీ ముప్పైమందికి పైగా విద్యార్థులు వస్తూపోతున్నారు. అక్కడ సరైన హోటలులేని కారణంగా ఆ ఉండే హోటలుకు 'హోటల్ ప్రారబ్ధ' అని పేరు పెట్టారుఈ విద్యార్థులు. ఎందుకంటే మన కర్మకొద్దీ ఇలాంటి దౌర్భాగ్య హోటలు దొరికింది అని. నా అన్నం నేను వండుకొని తింటున్నాను. నాకొక పావుసేరు వేసి వండు, నాకొక పావుసేరువేసి వండు అంటూ మొత్తం ఎనిమిది కిలోల బియ్యానికి వండి నవ్వుకుంటూ పచ్చడో, గంజో కడుపు నిండా తింటున్నాము. అదీ మాస్టరుగారి ప్రక్కఇంట్లో. ఒకరోజు ఈ విషయం మాస్టరుగారి పనిపిల్ల అమ్మగారి చెవిన వేసింది. అమ్మగారు మాస్టరుగారికి చెప్పారు. ''ఏమిటి, చాలా అన్నం వండి గుడ్డమీద పోసి వున్నావట'' అని అడిగారు. నేను విషయం చెప్పాను. ''మీకు శ్రమ గదండీ'' అన్నారు. బాబాసేవలో శ్రమ ఏముందిలే సార్ అన్నాను. అంతే! ఆరోజు నుండి సంస్థానం లెక్కలో కావలసినవన్నీ తెచ్చుకొని కమ్మగా తింటూ బాబాను సేవించండి అని గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆహా! ఇక పచ్చడి, గంజి ఎందుకు? సర్వం

సంస్థాన లెక్కలో తెచ్చుకొని కమ్మగా తింటుంటే అంతటితో ఊరుకున్నారా ఆ ప్రేమమూర్తులు. వచ్చిన ఆడవాళ్ళచేత నిత్యం దండిగా పచ్చడి చేయించి పంపేవారు. నోరు చవిచెడి ఉన్న మేము వట్టి పచ్చడే తినేసేవాళ్ళం. సాయం కాలానికి ఖాళీ. పాలుతోడుపెట్టి కనీసం మూడు లీటర్లు-గిన్నె బోర్లా త్రిప్పినా జారిపడనంతటి గట్టి పెరుగు నిత్యం పంపేవారు. మా కరువుతీరా తిన్నాము. అమ్మగారు బనగానిపల్లెకు పోతే ఈ పనులు - పచ్చడి, పెరుగు - మాస్టరుగారే చేసేవారు. పచ్చడైతే ఎవరైనా దంచుతారు, పర్యవేక్షణ మాస్టరుగారిదే, లేకుంటే ఆ రుచిరాదు. వారుండే తీరికలేని సమయంలో నిత్యం వారే పాలుకాచి స్వహస్తాలలో తోడుపెట్టి పిల్లులకు దొరకకుండా జాగ్రత్తచేసి దాచడం అంటే వారికి మా ఎడల ఎంత ప్రేముందో! మేమంతా వారికి బాబా రూపాలమే గాబోలు! లేకుంటే మాకు అలాంటి సేవలు చేయరు.

శ్రీ మాస్టరుగారి మరదలు అనసూయమ్మగారి వివాహానికి నేను, జయ రామయ్యగారు వంటలకు ఇన్‌చార్జ్. నాలుగు గంపల లడ్లు అమ్మగారే చేయించి పంపారు. బంతిమీద వడ్డనకు ఒక్క గంప కూడా పూర్తిగా ఖర్చుకాలేదు. వివాహం తర్వాత పాత మిత్రులంతా కులాసాగా మిగిలిన లడ్లగంపల మీద తమ పవిత్ర హస్తాలను చాచారు. బంతిమీద ఖర్చయిందిగాక మరొక గంప ఖాళీ అయింది. నేను కాపలాదారుణ్ణి. వీళ్ళను తీసుకోవద్దని చెప్పలేను. మాస్టరుగారు ఏమంటారోనని భయం. వెళ్ళి మాస్టరుగారికి చెప్పాను. ''తిననీ, తినేందుకే గదా చేయించింది'' అన్నారు. మైగాడ్ - నా వక్రబుద్ధికి నాపై నాకే సిగ్గేసింది. వెంటనే అమ్మగారిని ''నీకెన్ని కావాలి లడ్లు'' అని అడిగారు. ''నాకెందుకు'' అన్నారు. ''ఎవరికైనా పని వారికి వగైరా ఇవ్వాలేమో'' అన్నారు. అట్లాగయితే ఉంటే ఒక వంద ఉంచమనండి'' అన్నారు అమ్మగారు. సుబ్బరామయ్యా అమ్మగారి కోటా రెండువందలు ఉంచి మన ఇంటికి చేర్పించు. జయరామయ్యగారి స్కూలులో పనిచేసే వాళ్ళందరికీ వాచ్‌మన్‌తో సహా తలా ఐదులడ్లు వారికోటా వారికిచ్చెయ్. ఈ వెన్యూ వాచ్‌మన్‌లు ఎందరున్నారో అడిగి వారికికూడా ఇవ్వు. నీవు ఇంటికి ప్రసాదంగా కొన్ని తీసుకపోయి మీ గ్రామంలో సత్సంగంలో అందరికీ నేనిచ్చానని ప్రసాదంగా ఇవ్వు. మిగిలినవన్నీ అందరినీ తిననీ'' అన్నారు. ఈ విధంగా నేను ఎన్ని జన్మలెత్తినాగాని లడ్డు ప్రేమతో పంచగలనా! పంచినా పంచగలనేమో కాని



వారిలాంటి ప్రేమభావం వహించగలనా! అదే సాధన పరాకాష్ట. 'నేను నీలో ఉన్నాను. నీవు నాలో ఉన్నావు. అలా భావనచేస్తుంటే అడ్డుగోడ కూలిపోతుంది' అన్నారు బాబా. దానిని ఆచరించి చూపారు మన మాస్టర్.

విద్యానగర్ - సాయి మందిర ప్రారంభోత్సవానికి కావలసిన వాటికంటే రెట్టింపు కూరగాయలు, బూడిద గుమ్మడి కాయలు వచ్చాయి. కార్యక్రమం తర్వాత చాలా మిగిలిపోయాయి బూడిద గుమ్మడికాయలైతే వందల సంఖ్యలో మిగిలాయి. కమిటీ సభ్యులను సంప్రతించనిదే మాస్టరుగారు ఏమీ చేయరు. ఒక్కొక్కరు ఒక్కొక్క సలహా - ఒకరు కోటలో కూరగాయల అంగళ్ళ వాళ్ళకు అమ్ముదామంటే, మరియొకరు చార్జీలు అయినా పర్వాలేదు గూడూరు తీసుకుపోయి అమ్ముదామని, ఇలా ఇంకెన్నో సలహాలిచ్చి పోయారు. మాస్టరు గారు నన్ను పిలచి ఒక లిస్టు పేర్లు నాచేతికిచ్చి - ఆ ఇల్లు ఏ ఏరియాలో ఉందో విశదంచేస్తూ వాళ్ళందరికీ అడిగిన వాళ్ళకు అడిగినన్ని బూడిద గుమ్మడికాయలు నీవే స్వయంగా తీసుకువెళ్ళి వాళ్ళఇండ్లకు చేర్చు. ఇంకెవరైనా అడిగినా ఇచ్చెయ్. నాకు చెప్పనక్కరలేదు. కూరగాయలుకూడా అంతే. అన్నీ సాయంకాలమునకు ఖాళీ అయిపోవాలని ఆజ్ఞాపించారు. అన్నీ అలాగే ఖాళీ చేశాను. తెల్లవారి నాకొక క్లాసు తీసుకొని పాఠం చెప్పారు. మాస్టరుగారి అన్నయ్య క్రిష్ణమాచారిగారు ఏదో యజ్ఞం చేస్తుంటే శ్రీపాకలపాటి గురువుగారిని ఆహ్వానించారట, గురువుగారు వాళ్ళకు కూరగాయలు పంపుతాను లారీ పంపమన్నారట. గురువుగారి ఆజ్ఞ మేరకు అక్కడి పల్లె జనులు ఒక్క లారీ కూరగాయలు పంపారట. యజ్ఞం తర్వాత చాలా కూరగాయలు మిగిలి పోయాయట. ఈ కూరగాయలు ఏమి చేయబోతున్నారో చూడాలని శ్రీపాకలపాటి గురువుగారు వంటశాలవైపు వెళ్ళారట. ఆ సమయంలో శ్రీ కృష్ణమాచార్యులుగారు తన దగ్గర సెలవు తీసుకొని ఇండ్లకు పోయే ప్రతివారికి వారు తీసుకుపోగలిగినన్ని కూరగాయలు ప్రసాదంగా పంచేస్తున్నారట. శ్రీ పాకలపాటి గురువుగారదిచూచి, 'శభాష్ మంచిపని చేస్తున్నావు. భగవంతుడు మనకిచ్చినదాన్ని ప్రేమతో ఇతరులకివ్వాలి. మీరేంచేస్తున్నారో చూచేందుకే నేనిక్కడికొచ్చాను' అని వారి పనికి మెచ్చు కున్నారట. వారన్నమాట మనకు మార్గదర్శక సూత్రం. ఇవి అమ్మితే బాబాకు మనమీద అసహ్యమేస్తుంది. ఈ కూరగాయల్ను, గుమ్మడికాయలు తీసుకున్నవారు ఎంత సంతోషిస్తారు? వారు ఇంతకు ముందు బాబాకు చేసిన

సేవకు ప్రతిఫలంగా మనమేమి ఇవ్వగలము? మనకొచ్చిన ఎందరో అతిథులను తమ ఇండ్లలో ఉంచుకున్నారు. మందిర నిర్మాణానికి ఎప్పుడు ఏవస్తువడిగితే అది ఇవ్వడమే గాక వారు స్వయంగా వచ్చి తమ చేతులకష్టం బాబాకు సమర్పించారు. ఇదంతా మనంచెప్పి చేయమన్నామా! బాబా వారిచేత చేయించు కున్నారు. ఈ కూరగాయలు ప్రేమతో వారికిస్తే బాబా ఎంత సంతసిస్తారో! అని ముగించారు.

అది వారి ప్రేమ తత్వ ఆచరణ. అలాంటి ప్రేమను నా హృదయంలో నాటారు కాని దానికి నీరుపోసి ఎరువుపెట్టి పెంచుకుని ఫలితం అనుభవించే పని నేను చేయలేకుంటే వారు నాటిన విత్తనాలు కుళ్ళిపోతాయి. నష్టం మనకేగాని వారికేముంది?

## వాస్తుపాఠం

ఒంగోలు వచ్చాక గూడ అమ్మగారి ఆరోగ్యం ఎక్కువగా పాడయింది. అప్పుడు సంతపేట, ఒంగోలులో ఒక బాడుగింట్లో ఉన్నారు. ఆ ఇంట్లో వాస్తు దోషాలున్నాయని అందువల్ల అమ్మగారికి అనారోగ్యమని - వాస్తు దోషాలు లేని ఇంట్లో కాపురం పెడితే అమ్మగారి ఆరోగ్యం బాగవుతుందని వాస్తు ప్రముఖులు శ్రీ మాస్టరుగారి చెవులు కొరికేస్తున్నారు. సూక్ష్మప్రాయంగా శ్రీ బాబాగారి విషయం చెప్పినా వారి కెక్కడంలేదు. ఆత్మీయులందరికి వినగలిగితే ఒక పాఠం చెప్పదలచారు. ఎలాంటి ఇంటిలో ఉంటే అమ్మగారి ఆరోగ్యం బాగుంటుందో ప్లానుగీచి ఇవ్వమన్నారు. అలాగే ప్లాను సిద్ధంచేశారు. శ్రీ మాస్టరుగారి కృపతో ఎలాంటి తప్పులు లేకుండా వాస్తువాళ్ళు చెప్పినట్లు లాయరుపేటలో కట్టించిన ఒక ఇంట్లోకి కాపురం మారారు. గోరంత కూడా అమ్మగారి ఆరోగ్యం మెరుగవలేదు.

శ్రీ మాస్టరుగారే అనేకమంది గృహాలకు వాస్తు దోషాలు ఉన్నాయని చెప్పి వాటిని సరిచేయించారు. మరి వారి కేసులో మాత్రం బాబాగారికి వకాల్తా ఇచ్చారు. ఇది మనందరికీ పాఠమే. అనేక జన్మల కర్మలను ఈ జన్మలోనే క్షాళనచేసి అమ్మగారికి జన్మరాహిత్యం ప్రసాదించాలని బాబాగారి నిర్ణయం, పూజ్యశ్రీ మాస్టరుగారి అభిమతము అయితే ఇక ఏ వాస్తులు ఏమి చేయగలుగుతాయి?



శ్రీమాస్టరుగారి సమక్షములో నాకు అమ్మగారికి జరిగిన సంభాషణ మనం వినకుండా ఈ వాస్తుపాఠం సంపూర్ణం కాదు.

మాటల సందర్భంలో అమ్మగారు అన్నారు ''నా బిడ్డలకు అన్నం పెట్టుకోలేకుండా పోయాను'' అని వున్నా, అమ్మగారు బాగున్నపుడు ప్రతి చిన్నసేవకూడా మాస్టరుగారికి అమ్మగారే చేసేవారు. ఇతరులు చేస్తే సుతరాము అంగీకరించేవారు కాదు.

వెంటనే నేనన్నాను ''అమ్మగారూ! మీ ఆరోగ్యం బాగవ్వాలని శ్రీ స్వామివారికి చెప్పుకొని ఒక్క టెంకాయ నాచేతికివ్వండి. దాన్ని నేను శ్రీస్వామివారి ధునిలో సమర్పిస్తాను. మీ ఆరోగ్యం బాగవకుంటే నా తల గొరిగించి ఒంగోలంతా గాడిదమీద ఊరేగించండి'' అన్నాను. అమ్మగారు అన్నారు గదా ''కావాలంటే ఎన్ని టెంకాయలైనా శ్రీస్వామివారి అగ్నిహోత్రానికి పంపిస్తాను. కాని ఆ సంకల్పం చెప్పి మాత్రం ఒక్కటికూడా ఇవ్వను. నాకేది శ్రేయస్కరమో అది మాత్రమే చేయమని ప్రార్థిస్తాను'' అని అన్నారు. ఈ సంభాషణ వింటున్న మాస్టరుగారు ''ఒక్కటి ఇవ్వరాదూ'' అని నవ్వారు. ''ఇస్తాలేండి'' అంటూ నవ్వుతున్నారు అమ్మగారు.

జన్మరాహిత్యమే అమ్మగారి ప్రధాన కోరిక!

బాబాగారు సర్వజ్ఞులు, సర్వ సమర్థులైయున్నారన్నదే మనం హృదయ పూర్వకంగా విశ్వసించిన మాటే నిజమైతే, మరి ఇక వారినేమిమ్మని అడుగగలము?

''శ్రీ స్వామివారి దగ్గర నోరు విప్పేవు, భ్రష్టయిపోతావు'' అన్న రోశిరెడ్డి మాటలకు అమ్మగారి ఆచరణ సరిపోయింది గనుక ఇది మనందరికీ చక్కని పాఠం.

## నిష్కామ కర్మ

భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారు మనమధ్య ఉండగానే వారి దివ్యచరిత్ర ప్రచురించమని శ్రీస్వామివారి హ్యూమానిటేరియన్ మిషన్ వారికి

మాష్టరుగారు ఎంతోదూరం చెప్పారు. వారిని గురించి కరపత్రాలు ఎక్కువగా వేయించి నెల్లూరు మరియు చుట్టుప్రక్కల గ్రామాలకు, శ్రీస్వామివారు సంచరించే గ్రామాలలోను ప్రతి ఇంటికి ఆ కరపత్రాన్ని చేర్చమని బలవంతంచేశారు శ్రీమాష్టరుగారు. కానీ శ్రీస్వామివారు చాలా గుప్తంగా ఉంటారు గనుక తన మహిమను వెల్లడిచేయడం వారికి ఇష్టముండదు. ఆ వెల్లడి చేసేవారు శ్రీస్వామివారి ఆగ్రహానికి గురికావలసి ఉంటుంది గనుక మేము ఆపని చేయలేమన్నారు. అందుకు మాష్టరుగారు అన్నారు : 'ఆ కరపత్రాలు నేను పంచినట్లు నాపేరు వేయండి. ఏమౌతుంది? ఎంతోమంది బాగుపడుతుంటే నేనొక్కడిని నాలుగుజన్మలు వెనక్కు పోయి వస్తాను. నష్టమేముంది?'' అన్నారు. అందుకే వారు విద్యానగర్ మందిర ప్రారంభమప్పుడు విడుదలచేసిన సద్గురు దర్శనం అనే సావనీర్‌లో శ్రీవెంకయ్యస్వామివారి ఫోటో మరియు వ్యాసము ప్రప్రథమంగా ప్రచురించి కొన్నివేలమంది దర్శించుకునే భాగ్యం కలిగించారు. అది వారి నిష్కామ కర్మకు గీటురాయి. వారిలాగ మనలనుగూడా ఆచరించమని ప్రభోదించారు.

ఇతరులు మేలు పొందే నిర్విరామ కృషి చేయడం మనవంతు. ఆ కృషిద్వారా ఎందరు మేలు పొందారు అన్నది మనకవసరంలేదు. మేలు పొందడం పొందకపోవడం బాబా ఇష్టం. కృషి చేయడమే మనవిధి. జ్ఞానేశ్వర్ మహరాజ్ అంటారు. నిష్కామకర్మ చేసేటప్పుడు ప్రతిఫలాపేక్ష లేకుండా ఎంత సహజాతి సహజంగా ఉండాలంటే అరచేతులలో రోమాలు మొలవకపోవడం ఎంత సహజమో నిష్కామకర్మలో మనకు మన కర్మ విఫలమైందా, సఫలమైందా అనే చూపే లేకుండా భగవంతుని ప్రీత్యర్థం ఇతరులు బాగుపడే కార్యం చేస్తుండడమే. అది ఎంతో గొప్పగా చేశారు గనుకనే మాష్టరుగారి తండ్రిగారు పిలువకున్నా సాయి వారికి పదిహేనురోజులు వరుసగా భౌతిక దర్శనమిచ్చి అనుగ్రహించారు.

## బిడ్డల పెంపకం

ఒకరోజు మాటల సందర్భంగా మాష్టారు అన్నారు : ''సంఘానికి ఉపయోగపడే వారిగా మన బిడ్డలను క్రమశిక్షణ ఇస్తూ పెంచి పెద్ద చేయాలి. చిన్నవారుగా ఉండేటప్పుడు బయటి ప్రపంచంయొక్క చెడు సంస్కారాలు వారిమీద పడి వారు చెడిపోయే ప్రమాదముంది. మన విధ్యుక్త ధర్మం మనం చక్కగా నెరవేర్చి మన బిడ్డల నీడలో పదిమంది సుఖాన్ని పొందేటట్లు పెద్దచేయాలి. పెద్దయినాక ఇక ఏ సంస్కారాలూ వారిపై పనిచేసి వారిని చెడు మార్గానికి లాగలేవు. మన ప్రయత్నముతోనే వారు వివేకానందులుగా రూపుదిద్దుకుంటారనికాదు. బాధ్యతగల పౌరులుగా మన విధి చక్కగా నెరవేర్చాలి. అదే భగవంతునకు మనమిచ్చే చెరగని తరగని నీరాజనం. అశాశ్వత మైన పూలుపండ్లు మాత్రమేకాదు. ఏమాత్రమూ లొసుగులేని మన కృషి మనం చేస్తే చేయవలసిన మన కర్మ నివారణౌతుంది. వారిని సత్‌పౌరులుగా బాబానే తీర్చి దిద్దుతారు. మనం విత్తనం వేసి వదిలేస్తే ఎలా? ప్రాప్తముంటే పెద్దచెట్టవు తుందంటే అది సరైన పద్ధతికాదు. పశువుల నోటి కందకుండా చెట్టును అన్ని విధాల సంరక్షించాల్సిన బాధ్యత మనయందుంది. అది విస్మరిస్తే బాబా మన నీరాజనం స్వీకరిస్తారా? పాలుమాలికవలనగాని, ఇప్పుడే గొప్పగా దేవుని రాజ్యం సాధించాలనిగాని తలచి బిడ్డలను సరైన పద్ధతిలో పెంచకుండా వదిలేస్తే వారు సంఘ విద్రోహులైనవారుగా మారి సంఘానికి చీడపురుగులైతే ఆ పాపానికి కారకులం మనం కాదా! మన బాధ్యత చక్కగా నెరవేర్చిన తర్వాత వారలా తయారైనా ఆ పాపం మనదికాదు'' అని ముగించారు.



## చెప్పక చెప్పిన సత్యం

జన్మ పరంపరలకు కారణం - ఋణానుబంధం, అందుకు కారణం రాగద్వేషాలు అంటే మరొక నాజూకైన పేరు ఇష్టాఇష్టాలు (ఇష్టము - అయిష్టము) ఈ ఇష్టా ఇష్టాలవల్ల ఒకవైపు పునర్జన్మ, మరొకవైపు ఈ జన్మలోనే **unrest**, అసంతృప్తి, చికాకు, విసుగు, శత్రుత్వం నుండి సర్వ అనర్థాలు వస్తాయి. కనుక పై బాధలు లేకుండా కనీసం ఈ జన్మలో సుఖంగా బ్రతకాలంటే ఇష్టాఇష్టాలు లేకుండా జీవించడం నేర్చుకోవాలి. అలా నేర్చుకోవడం మాష్టరుగారి జీవితకాలంలో వారితో పరిచయం, వారిని ఆ విధంగా పరిశీలించి ఆకళింపు జేసుకొని తెలుసుకోవడం చాలా అవసరం. వారి జీవితంలో ఏ ఒక్క సంఘటనగాని వారి ఇష్టాఇష్టాలమీద జరుగలేదు. అన్నీ వాటంతటవే జరిగాయి. ఉదా : షిరిడీ ప్రథమదర్శనం, జిల్లెళ్ళమూడి ఆశ్రమ నివాసం. చీరాల స్వామివారి

దర్శనం, వివాహం, విద్యానగర్ మందిర నిర్మాణం, విద్యానగర్ నుండి ఒంగోలు ఆగమనం. ప్రెస్ నిర్వహణ, పుస్తక ప్రచురణ, ఒంగోలులో నివాస గృహాల మారకం. వీటన్నింటిలోని ఇష్టాఇష్టాలు లేకుండా తృప్తిగా కాలం గడిపేయడమే. వచ్చిన వారికి హాయిని, చిత్తశాంతిని పంచడం. సూక్ష్మమైన సన్నివేశాలలో వారు ఇష్టాఇష్టాలు లేకుండా ఎలా జీవించారో వ్రాయాలంటే ఒక గ్రంథమే చాలదు. ధర్మాన్ని ఆచరిస్తూ, ఆచరింప ప్రోత్సహిస్తూ, ఆనందంగా కాలం గడపడమే మనం వారిని చూచి నేర్చుకోవలసింది. ఇలా ఇష్టాయిష్టాలు లేకుండా జీవించాలంటే మన కొరకు మనం బ్రతకడం నేర్చుకోవాలి. ఇలా బ్రతికితే వాళ్ళేమనుకుంటారో అనే ఆలోచన పూర్తిగా మానివేయాలి. అంటే ఇతరులకొరకు బ్రతకడం మానివేయాలి. పరోపకారార్థం జీవించడం మానమని అర్థంకాదు. ప్రక్కింటివారికి బొచ్చుకుక్క ఉంది గనుక మనమూ ఒకటి పెంచుకోవాలి, లేకుంటే నామోషీ అనే భావన పూర్తిగా విసర్జించాలి. సుధీంద్రబాబుగారు - చివటం - చెప్పినట్లు - Don't care for the world, go ahead as your will says అరటిపండిస్తే మంచివాడంటారు, ఇవ్వకుంటే పిసినారి అంటారు. వీళ్ళనేంటి మనం లెక్క జేసేది అన్నట్లు జీవించగలిగితే అంతా ఆనందమే మిగులుతుంది అని మాస్టరుగారి జీవిత సహచర్యం బోధిస్తుంది.

''వినగలిగితే చెట్టునుండి రాలిపడే ప్రతి చిన్న ఆకుకూడ ఒక దివ్య సందేశం అందిస్తుంది'' అంటారు శ్రీమాస్టారు. మన ఆలోచనాస్రవంతి వేగం ఎంత తగ్గితే మన బుద్ధి అంత ఎక్కువగా వికాశం పొందుతుంది. ఆశ ఎంత చస్తే అంతగా ఆలోచనా స్రవంతి వేగం తగ్గుతుంది. ఈ ఆశ చావాలంటే వివేక విచారాలు కావాలి. ఆ వివేక విచారాలు మన పుణ్యకర్మల మోతాదులో సంప్రాప్తమౌతాయి. పుణ్య కర్మల మోతాదునుబట్టి మహనీయుల దర్శన ఆశీస్సులు లభిస్తాయి. వారనుగ్రహించిన ఆశీస్సులు మన శ్రద్ధాభక్తులనుబట్టి నిలుపుకొని వృద్ధి చేసుకోగలుగుతాము. అలా నిలుపుకున్నవారు చెట్టునుండి రాలిపడే ఆకు ఇచ్చే సందేశాన్ని అర్థం చేసుకొని ఆచరిస్తారు. అందుకే పుణ్యకర్మ లాచరించమంటారు సాయిమాస్టర్.

శ్రీ మాస్టరుగారు చెప్పినట్లు ఆచరించకుంటే ఏమౌతుంది? ఈ మాటకు సమాధానం సరిగ్గా శ్రీ అనసూయామాతగారు చెప్పారు. ''భజనలు



చేస్తున్నారు, ఏమీ కావడం లేదు'' అని, అయితే గట్టెక్కేది ఎలాగంటే 'హాత్ దరూన్ చెలాల్ అన్నారు. ''గుర్వాజ్ఞలు పాటించండి''.

మనం శ్రీ మాస్టరుగారు ఆచరించి, బోధించిన మార్గంలో నూటికి నూరుపాళ్ళు సంపూర్ణంగా ఆచరించలేకపోయినా ఫర్వాలేదు. మాస్టరుగారు చెప్పినట్లు ఆచరించలేకున్నామే ఈ భవరోగం నిర్మూలనమవడం ఎట్లా? అనే పరితాపమైనా తీవ్రస్థాయిలో పొందితే ఆపరితాపం ఈ జన్మకు మనలో ఒక సంస్కారంగా మిగిలిపోయి మరుజన్మకు అది మేల్కొని ఆచరణకు సాధ్యమవుతుంది.

నమో నమస్తే శ్రీ సాయి మాస్టర్‌గారూ!



# నాకు తెలిసిన మాస్టారు
## (రెండవ భాగము)



# నాకు తెలిసిన మాస్టారు

## అందము :

అందము అంటే మనలను భ్రమ పెట్టే చర్మం మాత్రమే. చర్మము తీసిన శరీరాలన్నీ ఒక్కటిగానే ఉంటాయి. చర్మం తీసిన శరీరాల గురించి మననము చేస్తుంటే ఇక అందము ప్రసక్తే రాదు. కసాయి వాని అంగడిలో చర్మము తీసిన మేక శరీరాలు ఎన్నో వ్రేలాడ తీసి ఉంటాయి. ఇవన్నీ ఒకేవిధంముగా ఉంటాయి గదా! ఈ దృశ్యం మరలా మరలా ధ్యానిస్తే మనసుకు అందం గొడవపోతుంది. అంటారు మాస్టారు గారు.

## మానవుని ప్రధమ శత్రువు :

'సోమరితనం' మానవుని ప్రధమ శత్రువు. సాధనలో మొదట మనం ప్రయత్నించవలసింది ఈ సోమరితనం నిర్మూలనాన్ని గురించే. ఇది సర్వ అనర్థాలకు హేతువు. శరీరానికి లేని బాధలన్నీ ఉన్నట్లు కల్పించి, మనలను సాధనకు విముఖులను చేస్తుంది. ఇది ఏక్షణాన్నయినా మనమీద దాడి చేయవచ్చు, ఆధిపత్యం వహించవచ్చు కనుక అనుక్షణమూ దీనితో పోరాడుతూ ఉండవలసిందే. ఈ శత్రువును వశం చేసుకోకుండా నిర్విరామకృషి వీలుకాదు. శ్రీసాయిగాని, వెంకయ్యస్వామివారు కాని ఒక్కక్షణం కూడ ఏమారకుండా అగ్నిని వ్రేల్చటం మరియు ఇతర పనులలోనూ నిమగ్నమయ్యేవారు. శ్రీ స్వామి వారు కొన్నాళ్లు నడవడం, వేలిముద్రలు వేయడం వంటి పనులు చేస్తుండేవారు.

## గురువును కావాలనే గుబులు పుట్టకుండ ఉండు గాక !

ఈ మాటకు ప్రత్యక్షఅనుభవం వివరించారు మాస్టారుగారు. పేరు వ్రాసేందుకు వీలులేని ఒక పెద్దమనిషి శ్రీ మాష్టరు గారిని ఆశ్రయించి, ''మిమ్మల్ని నేను గురువుగా స్వీకరించాను. కనుక నాకేదైనా ప్రత్యక్షంగా అనుగ్రహించి రక్షించండి.'' అని సతాయించసాగాడు. ''ప్రస్తుతానికి నీకలాంటి అవకాశమే లేదు. ఇంకా కొన్నాళ్లు నీవు మామూలు సాధనలు చేయాలి'' అని శ్రీమాష్టారు ఎంత చెప్పినా వినిపించుకోకుండా కొన్నాళ్లపాటు సతాయించాడు. అప్పడు మాష్టారు గారు అతనికి ఒక చిన్న సాధన చెప్పి ఒక్కవారం చేయమన్నారు. అదేమిటి? ఆ సమీపంలోని చేలల్లో ఉండే మేడి చెట్టు క్రింద ఏడు రోజులు ఏమారకుండా ఉండి బాబానామం స్మరించమన్నారు. ఆ చెట్టుకు, దానిక్రింద , పెద్ద పెద్ద కట్టు చీమలు

విపరీతంగా ఉండేవి. ఆ సాధకుడు ఒక్కరోజు కూడా అక్కడ ఉండకుండా, మాష్టారికి చెప్పకుండానే వారి స్వగ్రామం వెళ్ళిపోయాడు.

నిజమైన శ్రద్ధ ఉంటే ''గెమాక్సిన్'' అనే చీమల మందు చెట్టు చుట్టూ చల్లితే ఇక చీమలు రావు. చీమలు పోవటానికి ఏదైనా ఉపాయం చెయ్యాలి గాని వెళ్ళిపోవటమే మార్గమా? ఆ సాధకుని ఆలోచనలన్నీ మాష్టారికి తెలుస్తూనే ఉన్నాయి.

ఈ సాధకుడు తన గ్రామంలో ఒక ఆశ్రమం స్థాపించి అనేక మందిని ఆకట్టుకున్నాడు. మాష్టారి దగ్గర విన్న మాటలన్నీ వల్లె వేస్తూ గొప్పగా చెలామణి కాసాగాడు. తన గొప్ప శ్రీమాష్టారికి చూపుకునే మిషతో తన ఆశ్రమంలో ఒక ఉపన్యాసం ఏర్పాటుచేసి శ్రీ మాష్టారిని ఉపన్యాసించేందుకు ఆహ్వానించాడు.

పదిమంది ఎదుట ఆ సాధకుణ్ణి బాగా మెచ్చుకున్నారు మాష్టారుగారు. ఆనాటి రాత్రి సత్సంగంలో శ్రీమాష్టారు మాట్లాడుతుంటే ఆశ్రమ వాసులంత తన్మయులై కాలగతి తెలియకుండా వింటూనే ఉన్నారు. రాత్రి 2 గంటలకు సత్సంగం ముగించి తిరిగి ఉదయం 5 గంటలకు ధ్యానానికి కూర్చోవాలని చెప్పి సత్సంగము ముగించారు మాస్టారు గారు. ఆశ్రమాధిపతితో సహా అందరూ ఆదమరచి నిద్రపోయారు. 5 గంటలకు ఒక్కరూ నిద్రలేవలేదు. శ్రీ మాష్టారు ఒక్కరే వచ్చి 5 గంటలకు ధ్యాన మందిరంలో ధ్యానం చేస్తున్నారు. 6 గంటల పైన ఒక్కొక్కరే వచ్చి ధ్యానంలో కూర్చొనియున్న మాష్టార్ని చూచి ఒకవైపు ఆశ్చర్యము మరొక వైపు తమ ప్రవర్తనకు సిగ్గుతో తలవంచుకున్నారు. ఎప్పుడో 7 గంటలకు మాష్టారుగారు ధ్యానం నుండి లేచారు. అందరూ ఊరికే కూర్చొని ఉన్నారు గాని ఒక్కరూ ధ్యానం చేయడం లేదు.

''అయ్యో! పాపం!'' రాత్రి చాలా ప్రొద్దుపోయేవరకూ మేలుకొని ఉన్నందున సకాలంలో మీరు ధ్యానానికి లేవలేక పోయారు.'' అనే ఊరడింపు మాటలతో ఆ గురువుగారి సత్తా బయటపెట్టారు శ్రీ మాష్టారు. కాస్త ఆలస్యంగా నిద్రపోయినందుకే సకాలంలో నిద్రలేవలేకపోయిన గురువుగారి సత్తా ఏమిటో అందరికీ అర్ధమయింది.

గురుత్వమనేది తనకుతాను వహించవలసినది కాదని, భక్తులే వారి వారి అనుభవాల ద్వారా ఎవరినైనా గురువుగా స్వీకరించవలెనని నిరూపించారు. అందుకే సాయి ఎందరెన్ని పొగడినా నేను అల్లాకు బానిసనని చెప్పేవారు. అలా స్వతఃసిద్ధమైన నిరహంకారం సొంతం చేసుకున్న మహనీయులే గురు పీఠానికి అర్హులని శ్రీమాష్టారు పై



అనుభవంలో మనందరికీ స్పష్టం చేశారు. కనుకనే గురువును కావాలనే గుబులు నాకు పుట్టకుండునుగాక అని చెప్పేవారు.

## రాజద్రోహం

ఒకరోజు మాటల సందర్భంలో రాజద్రోహమంటే ఏమిటో వివరించారు మాస్టారు గారు. ప్రభుత్వానికి చెల్లించ వలసిన టాక్సుగాని, ఇతరత్రా ఏదైనా ధనం చెల్లించకుంటే అదంతా రాజద్రోహమవుతుంది. ప్రభుత్వమంటే మనలను పాలించే రాజు అని అర్ధం. రాజుగారికి చెల్లించవలసిన సొమ్ము చెల్లించకపోవడం రాజద్రోహమన్నమాట. మనలను ఒక ఆఫీసులో నియమిస్తే అడిగే వాడులేడని ప్రభుత్వ వస్తువులు సొంతం చేసుకోవడం నమ్మక ద్రోహమవుతుంది. ప్రయివేటు పర్సన్ దగ్గర పనిచేస్తూ అలాంటి ద్రోహం చేస్తే ఆ వ్యక్తి ఒక్కనికే బాకీ పడతాము. ప్రభుత్వానికి ఋణపడడమంటే ప్రజలందరికీ ఋణ పడటమన్నమాట. ఇలాంటి వ్యక్తులు ''కర్టిస్'' దంపతులవలె ఈలోకంలో చాలా గొప్పగా గౌరవ మర్యాదలు పొందవచ్చు. కానీ బాబా ముందు చాలాహీనులు, తుచ్ఛులుగా కనిపిస్తారు. పేదవాడైన ''పురంధరేని'' బాబా ఎంతో గొప్పగా ఆదరించారు, కానీ కర్టిస్ దంపతులతో మాట్లాడను గూడ మాట్లాడలేదు. అందుకు వారి అహంకారమొక్కటే కారణం గాదు, వారార్జించిన సంపద అంతా అలాంటిదే ఉంటుంది. కనుక మనం గవర్నమెంటు కాగితాలు సొంతం చేసుకోవటం ఇతర వస్తువులు అపహరించడం వంటివి దానం చేయడంవంటివి ఎంత ఘోరమైన అపచారాలో యోచించండి.

ఇదే విధంగా మన కర్తవ్య నిర్వహణలో గూడ ఎంతో జాగ్రత్త వహించాలి. బాబాను యజమానిగా భావించి మసలు కొంటే వారి అండ మనకెప్పుడూ ఉంటుంది. మన ఇష్టమొచ్చినట్లు మనం నడుచుకుంటే బాబా వారిష్టమొచ్చినట్లు వారు నడుచుకుంటారు. ఆ మహనీయున్ని, మనమిచ్చే తుచ్ఛమైన కానుకలతో సంతృప్తి పరచగలమా ? రాణిగారి బంగారు కాసుల బిందెను త్రిప్పికొట్టిన రాజరికం కదా బాబాది అని ముగించారు. మాస్టారు గారు.

## సాధకులు పతనం గురించి :-

సాధకులు వారున్న పవిత్ర స్థితి నుండి ఎంతో చిత్రంగా క్షణాలలో క్రిందకు దిగజారిపోయే అవకాశం ఎప్పుడూ పొంచి ఉంటుంది. మిద్దెపైఉండే పిల్లవాడు దారం కొస పట్టుకొని పొరపాటున దారపు ఉండను వదిలేస్తే ఏమౌతుంది ? ఆ ఉండను పట్టుకోవాలని దారం లాగే కొలది

అది నేలను తాకేటంత వరకు చేతికి దొరికే ప్రశక్తేలేదు, అలాగే ఉంటుంది సాధకుల దిగజారు తనం. ఎంత పవిత్రంగా ఉంటే పతనానికి అవకాశం కూడా అంత ఎక్కువగాను ఉంటుంది. కనుక పవిత్రత పెంచుకునే కొద్దీ అది నిలుపుకొనే జాగ్రత్త కూడా అంత ఎక్కువగా వహించాలి. అన్నారు. మాస్టారు గారు ''అలా ఎందుకు పతనం అవుతారు సార్'' ? అన్నాడొక విద్యార్థి ''అందుకు అనేక కారణాలు 1) బాబా చరిత్ర ను ప్రభోధామృతాన్ని మరవడం ఒక కారణము 2) తద్వారా బాబా అంటే ఏమిటో మరవడం 3) అనుక్షణం ఉండవలసినంత జాగ్రత్తగా ఉండక పోవడంతో, వెనుకటి మన సంస్కారాలకు ప్రస్తుత పరిస్థితులు తోడై ఇంకా ఇంకా పాపపు పనులు చేయిస్తాయి. ఇవన్నీ కలసి నీటిలో ప్రయాణించే పడవను గాలి వెనక్కు నెట్టినట్లు మనలను పతనం చేస్తాయి. ఆధ్యాత్మికతలో ఆరూఢులైనంత వరకు ఎంతో జాగ్రత్త అవసరం. ఆ రూఢులయ్యాక ఆ జాగ్రత్త సత్వ సిద్ధమైపోతుంది. ఇంకా పక్కాని కొస్తే వారే భగవంతుడు కనుక ఇకపడిపోయే ప్రశక్తే ఉండదు. కనుక ఆ రూఢులైనంత వరకు అనుక్షణము సాధనతో పాటు జాగ్రత్త కూడా చాలా ముఖ్యము. అందుకే ఆధ్యాత్మిక సాధనను కత్తిమీద సాములాంటిది అన్నారు బాబా'' అని ముగించారు. మాస్టారు గారు.

## పారాయణ, పూజ, స్నానాల ఆవశ్యకత

సిద్ధపురుషులు చెప్పినట్లు చేయ్యాలి గాని, వారు చేసినట్లు మనం చేయకూడదు. స్నానం చేసే వీలుండి చేయక పోతే అది సోమరితనం అవుతుంది. స్నానానికి వీలే లేకుంటే అది సాకుగా తీసుకొని పారాయణ పూజ మానటం చాలా ఘోరమైన అపచారం. ''అపవిత్రవ పవిత్రోవా'' అనే శ్లోకం చెప్పకొని, నెత్తిన నీరు చల్లుకొని, నిత్య పారాయణ, పూజ యధావిధంగా జరుపుకోవాలి, నిత్య కార్యక్రమము ఎట్టి పరిస్థితులలోను తారుమారు చేయటం, మాని వేయుటమే వంటివి తగవు'' అన్నారు శ్రీ మాస్టారు.

కాలం సద్వినియోగము చేసుకోడటము గురించి మాస్టారు తన పరంగా చేసుకొని చెప్పిన కొన్ని ఉదాహరణలు ''కాలం సద్వినియోగము చేసుకోవాలి, విషయము తెలుసుకోవాలి అనే జిజ్ఞాస ఎంతో ఎక్కువగా ఉండేది నాకు. రోజుకు మూడు, నాలుగు రకాల పుస్తకాలు చదువుతుండే వాడిని, నిత్యం, పండ్లు తోముకుంటూ ఆ పదినిముషాలు ఒక పుస్తకం చదివే వాణ్ణి, అలాగే లెట్రిన్‌కు వెళుతన్నప్పడు మరోపుస్తకము తీసుకు వెళ్ళి ఆ సమయములో చదువుతూ వుండేవాడిని. నిత్యం కాలేజీకి వెళ్ళి



వచ్చేటప్పడు కూడ ఏదో ఒక పుస్తకము చదివేవాణ్ణి అందువలన చాలా విషయములు తెలుసుకునే అవకాశం, టైం కలసివచ్చేది'' అన్నారు.

మాస్టారు గారు పుస్తకాలు చదివేటప్పడు కొన్ని ముఖ్యమైన విషయాలు అండర్ లైన్ చేయటం చాలా త్రిల్లింగ్ గాను, చిత్రంగాను ఉండేది. అండర్ లైను చేస్తున్నప్పడు, పెన్నులోని రీఫిల్ అయిపోతే మరోక రీఫిల్ వెతుక్కుంటూ టైము పాడుచేసుకోరు వెంటనే తన సమీపములోని సిగిరెట్టు కాల్చుకొని పారవేసిన అగ్గిపుల్ల కొసతో ఒక గీత గీసేవారు. గీచిన పుల్లలే లేకపోతే ఆ పేజీపైన మడచి చదువుతూ వెళ్ళి ఎప్పడో మరలా పెన్ను దొరికి నప్పడు వాటిని అండర్‌లైను చేసేవారు.

**విశ్వాసము :** ఒక సారి మాటల సందర్భములో మాస్టారు గారు ఈ విధముగా అన్నారు. ''కుస్తీ నేర్పించే గురువు తన శిష్యునికి అన్ని పట్లు నేర్పినా ఏదో ఒక పట్టు మాత్రము నేర్పడు ఎందుకు ? శిష్యుడు ఏనాడైనా అహంకరించి గురువుపై తిరగబడి చాలెంజ్ చేస్తే అప్పడు గురువు ఆ పట్టు ద్వారా శిష్యున్ని అవలీలగా ఓడిస్తాడట.'' దీని ఆధారమే ద్రోణాచార్యుడు అర్జునుడికి ''శబ్దబేధి'' విద్య నేర్పకపోవటములోని రహస్యం. ''గడ్డిపోచనైనా గురువు పెట్టుకుంటే గమ్యం చేరుతావో లేదో చూడు.'' అన్న బాబా గారి మాటకి నిదర్శనం ఏకలవ్యుడు, మట్టి బొమ్మను ముందుంచుకొని, హృదయములో సంపుర్ణ విశ్వాసముంచి సాధన కొనసాగించిన ఏకలవ్యుడు అర్జునుడికి తెలియని శబ్దబేధి విద్యను సాధించగలిగేడు. కనుక ప్రత్యక్ష సాన్నిధ్యం కంటే అంతరంగంలో ఏకలవ్యునికి గల పట్టుదల విశ్వాసము కావాలి. అట్టి విశ్వాసము గలవాని హృదయంలోని విశ్వగురుడే సర్వ విద్యలూ నేర్పుతాడు.'' అని ముగించేరు మాస్టారు గారు.

## సర్వభూత హితేరతే

గొలగమూడిలో ఒక సాధకుడు ఉన్నాడు. తన బాధల గురించి శ్రీ వెంకయ్య స్వామి వారికి ప్రార్ధన చేయి మంటూ నన్ను అనేక సార్లు అడగటం జరిగింది. నేను అలా చేయకూడదు మీరే స్వామి వారిని ప్రార్ధించండి అని అంటే వినడు, పోనీ ప్రతి రోజూ ఒక అరగంటసేపు నా వద్దకు వచ్చి, ఇక్కడ జరిగే సత్సంగములో పాల్గొనమంటే ఒప్పకోడు. నేను సాధకుణ్ణి మీరే వచ్చి మా యింట్లో సత్సంగము చేయండి అని అంటాడు. నాకు కోపం వచ్చి వెళ్ళటం మానివేశాను. ఒక రోజు మాస్టారి ఫోటో కేసి చూస్తూ కూర్చొని నేను అతని విషయంలో ఏమి చేయాలి. అని ఆలోచిస్తున్నాను.

ప్రతి రోజూ ఇంటిదగ్గర జరిగే సత్సంగానికి ఒక అరగంట రమ్మంటే రాడు నేనే వాళ్ళింటికి వెళ్ళాలిట ఎందుకు వెళ్లాలి అని అహం అడ్డువచ్చి నేను వెళ్ళకుండా ఉండిపోయినాను.

ఒక రోజు మాస్టారి గారి ఫోటో ముందు కూర్చొని వారి నేత్రాలలోకి తదేకంగా చూస్తూ కూర్చున్నాను. వెంటనే మాస్టారు గారు తాను ఆచరించి చూపిన సన్నివేశం ఒకటి మదిలో మెరిసింది.

M.Sc., Physics పాసైన వెంటనే ఒక తను తను సన్యసించి పన్నెండు సంవత్సరాలు మౌనంగా ఉంటూ, ఉడకని ఆహారం తీసుకోవాలని నిర్ణయించుకొని దీక్ష ప్రారంభించాడు. మూడు సంవత్సరాలు గడిచే సరికి కాళ్ళు పట్టుకుపోయాయి. ఎందుకు ఈ దీక్ష శరీరము స్వాధీనము తప్పిపోతున్నది వదిలి వేయమని ఎందురు చెప్పినా వినలేదు. చివరకు వారి గురువు చెప్పినా వినలేదు. పట్టుదలగా దీక్ష కొనసాగించాడు. ఆ గురువు కూడా తన దగ్గర నుండి అతనిని తరిమివేశారు.

అలాంటి వ్యక్తి దగ్గర ఒక రోజు మాటల సందర్భములో ''సాయిబాబా'' గురించి ప్రస్తావన వచ్చింది. సాయిబాబా ''ఒక దుమ్ము'' రేణువు అని చాలా చులకనగా మాట్లాడేడు. ఈ విషయం నేను మాస్టారి గారితో చెప్పేరు. దానికి మాస్టారు గారు ఒక రోజు నిర్ణయించి ఆయనను ఇక్కడకు తీసుకురండి సాయి గురించి మాట్లాడదాము. ఆ విషయము కూడా ముందుగా ఆయనకు తెలియజేయండి అని చెప్పేరు. ఆ సాధకునికి ఆ విషయము చెపితే నేను మాస్టారు దగ్గరకు రావాల్సిన అవసరం లేదు అన్నారు. ఆ విషయమే మాస్టారి గారితో చెప్పేను. అందుకు మాస్టారు గారు అతనినే ఒక రోజు నిర్ణయించమనండి ఆరోజు నేనే అతని దగ్గరకు వచ్చి మాట్లాడతాను అన్నారు. దానికి కూడ ఆ సాధకుడు అంగీకరించలేదు.

మాస్టారిగారి ప్రేమతత్వం ఎంతటిదో చూడండి, విషయం తెలియచేయటానికి ఎక్కడికైనా వెళ్ళటానికి వారు సంసిద్ధులో, వెంటనే నా విషయంలో పరివర్తన కలిగి, నేనే మా ఊరిలోని సాధకుని దగ్గరకు వెళ్లాలని నిర్ణయించుకున్నాను. అది మాస్టారి గారి ప్రేమ తత్వం.

## శ్రీ మాస్టారి సాధారణత్వం :

ఒక్కొక్కసారి మా బలవంతము మీద మాస్టారు గారు మాతో పాటు ఈత కొట్టడానికి వచ్చేవారు. వచ్చేటప్పుడు వారి కుమార్తె చి.. వేదవతిని కూడ తీసుకువచ్చేవ ు. తీరా వారు నీటిలోకి దిగి చి॥ వేదవతి నడుముకు కూడ ఒక టవలు కట్టి పట్టుకొని ఈతకొట్టమనేవారు మేమంతా భయం



భయంగా దూరంగా నుంచుంటే దోసిలితో మా మీద నీళ్లు చల్లి, మూతి ముడుచుకుని మునగటం కాదోయ్ జలక్రీడ అంటూ మమ్మల్ని అందరినీ సరదా చేస్తూ ఒకళ్ళ మీద ఒకళ్లు నీళ్లు చల్లుకుంటూ గడిపే వాళ్లము. నేనింత గొప్ప వాణ్ణి వీళ్ళతోటి ఈతకొట్టటమేమిటి అనే భావం ఎంత వెతికినా వారిలో కనిపించదు. భగవంతుడు ఒక్కడే గొప్పవాడు అనే భావం వారిలో అణువణువునా జీర్ణించుకుపోయిన సాధారణతత్వమది.

## దైవకృప

దైవకృప కుంభవృష్టిగా మనపై వర్షిస్తున్నా నూనె పూసుకున్న మనవంటిపై ఒక్క చుక్క నీరు నిలువనట్లు దైవ కృప కూడా మనపై నిలవటం లేదు. మన పాపకర్మలే మన ఒంటికి అంటిఉన్న నూనె. అలాంటప్పుడు జాగ్రత్తగా పాపఖర్మల జోలికి పోకుండా పుణ్య కర్మలాచరిస్తూ పుణ్యం పెంచుకుంటూ పోతే, తప్పక సాయి బోధను హృదయగతం చేసుకొని ఆచరించగలుగుతాము. మనమెంత పాపులమైనా శ్రీ సాయిని హృదయపూర్వకంగా ప్రేమతో ఆశ్రయిస్తే తప్పక మనలను గమ్యం చేరుస్తానని సాయి వాగ్దానం చేశారు. నా దగ్గర కొచ్చేవన్నీ సొక్కుపోయినవి, అరిగిపోయిన చెల్లని నాణాలే అయినా నేను వాటిని తిరిగి కరిగించి మూసపోసైనా నా ధర్మం నెరవేర్చి తీరుతాను. అని ఆ మహనీయుడు ప్రతిజ్ఞ చేశారు. కనుక ఇప్పడైనా మనం, మన గత ప్రవర్తనకు పశ్చాత్తప పడి సాయిని నమ్మి స్మరిస్తుంటే, వారు చెప్పిన శుభ్రమార్గంలో నడవ ప్రయత్నిస్తుంటే వారు మన అండన తప్పక ఉంటారు. గమ్యం చేరుస్తారు.

సద్గురువులు పరమ దయామయులు కనుక వారు మన కనుగ్రహించే భిక్షంతా నిలుపుకోవాలంటే మన ''జోలె''కి చిల్లి ఉండకూడదు కదా! మనలోని మానవ నైజమైన దుర్గుణాలే ఆ చిల్లులు. ఆ దుర్గుణాలు వదిలి పెట్టే తీవ్ర ప్రయత్నమే మనం చేయవలసింది. ఆ చిల్లులున్నంతవరకు మనం వారు చెప్పిన శుభ్రమార్గంలో నడువలేము.

## సర్వవ్యాపకుడు - సాయి మాస్టర్

సాయి సన్నిధిలో -- స్థానము - ''మీరున్న చోటు'' అని మాస్టరు గారు వ్రాస్తే, స్వానుభవం లేని నాకు నూటికి ఐదువంతులే అర్థమయింది. ౧౯౯౯ లోను ౨౦౦౦ సం..లోను పొందిన అనుభవాల ద్వారా వారి యొక్క దివ్య స్థితి నూటికి యాభైవంతులైనా అర్ధమయిందని తలంచుచున్నాను.

ప్రతి నిత్యం సాయంకాలం 6½ గం॥లకు శ్రీ మాస్టారి చిత్రపటం ముందు కూర్చొని ధ్యానమో, పారాయణో చేయడం అలవాటు. ఒక రోజు వారి చిత్రపటంతో తమాషాగా ఓ మాట చెప్పాను. ''రోజు చక్కెర పెడితే తినిపోతారు. ఈ రోజేదయినా మంచి మాట చెప్పండి సార్'' అని చెప్పి, '' ఈ పుస్తకంలో పుల్ల పెడతాను ఎడమవైపున మొదటి లైనులో ఉన్న వాక్యమే మీ సందేశంగా భావిస్తాను''. అని చెప్పి, అక్కడున్న పుస్తకంలో పుల్ల పెట్టగానే ఎడమవైపున ''ఇచ్చిన సదవకాశం సద్వినియోగం చేసుకోకుంటే బూడిదై రాలిపోతావు'' అన్న వాక్యం ఉంది. నిజానికి ఇది నాకెంతో సరిపోయిన మాట. సదవకాశం సద్వినియోగం చేయకుండా దుర్వినియోగం చేస్తున్నాను. నాలాంటి అవకాశం అందరికీ రాదు. ఇంట్లో ఎలాంటి సమస్యలూ లేవు. ఆరోగ్యం, శక్తి చక్కగా ఉన్నాయి. మాటకు ఎదురు చెప్పని భార్య, కుమారుడు, అన్నానికి దిగులు లేకుండా పెన్షను, ఇన్ని వసతులున్నా వీటిని సద్వినియోగం చేసుకొని తీవ్ర సాధనలో నిమగ్నం కాలేదని చెపుతున్నారు. మనం ఏమారి ఉన్నా వారు మాత్రం మనలను అప్రమత్తంగా ఉండమని చురకలేస్తూనే ఉన్నారు. వారి మాటను ఆచరిస్తే మేలు పొందుతాము. లేకుంటే అవకాశం చేతులారా పోగొట్టు కుంటామని హెచ్చరిస్తునే ఉన్నాయి.

మరుసటిరోజు మరలా 6½ గం॥ సాయంత్రం వేళ తిరిగి నిన్నటిలాగే అడిగాను. ''నిన్న బాగా కమ్మగా కొట్టారు సార్, ఈ రోజు ఈ చెంపకూడా కొట్టండి'' అని తిరిగి పుస్తకంలో అలాగే పుల్ల పెట్టాను. చాలా ఆశ్చర్యకరంగా పలికారు మాస్టారు గారు.

''మాయ ఎవ్వరినీ తనంత తానుగా అతిక్రమింపనివ్వదు. నీ ప్రత్యేక ప్రయత్నము ద్వారా మాయను అతిక్రమించాలి''.

''మాయ''ను అతిక్రమించే ప్రత్యేక ప్రయత్నం నేను చేయడం లేదని చెపుతున్నారు మాస్టారు గారు. నిజమే నామకార్ధం కూర్చొని పూజ, ధ్యానం చెయ్యడం తప్ప, వారికున్న కఠోరమైన దీక్ష నాకు లేదని అర్ధం అయింది. ప్రత్యేక ప్రయత్నమంటే ఏమిటో వారు అనేకసార్లు చెప్పేవారు. భూమి నుండి చంద్రమండలం వెళ్ళే వాహనం భూకక్షదాటి స్పేస్ లోనికి ప్రవేశించాలంటే జరిగే ప్రయత్నం వంటిది. ప్రత్యేక ప్రయత్నమంటే మొత్తం భూకక్షలో ప్రయాణించేందుకు ఎంత ఇంధనం పట్టిందో ఆ కక్షను దాటి స్పేస్‌లో ప్రవేశించేందుకే అంతకంటే ఎక్కువ ఇంధనం కావాలట. అని ప్రత్యేక ప్రయత్నానికి ఉదాహరణగా చెప్పేవారు. కనుక ప్రస్తుతం నేను చేసే ధ్యానం పూజ నామకార్ధం సాధన. అది చాలదు ప్రత్యేక శ్రద్ధ, ప్రయత్నం



చేయాలని వారాదేశిస్తున్నారు. ఆ ఆదేశాన్ని పాటించే శక్తి నిమ్మని వారి పాదాల దగ్గర కన్నీటితో విన్నవిస్తున్నాను.

పై సందేశాల తర్వాత ఒక సంవత్సరం నేనేమో మరలా అడుగలేదు. సంవత్సరం తర్వాత సంక్రాంతి పండుగ రోజున ''సార్! ఈ రోజు దేశమంతా పండుగ జరుపుకుంటున్నారు. ఈ సంతోష సమయములో మీరేదైనా ఒక మాట చెప్పండి'' అని నమస్కరించి అక్కడున్న ''అవధూత లీల'' ఇంగ్లీషు గ్రంధములో పుల్ల పెట్టి తెరిచాను. శ్రీ అక్కిం వెంకట్రామరెడ్డి గారు శ్రీ వెంకయ్య స్వామి వారి తోటి మామిళ్ళ కోన అనే కోనలోనికి ప్రవేశించిన విషయం వర్ణిస్తున్నారు. ''అది చాలా ఇరుకైన గుహ మానవులు లోనికి ప్రవేశించడానికి వీలుకాదు అనేకమంది ప్రయత్నించి విఫలమైనారు, కానీ శ్రీస్వామివారు వెళ్ళారు కనుక గుహ చాలా విశాలంగా తెరుచుకొని మార్గమిచ్చింది. మార్గమంతా మామిడి పండ్లు జానెడెత్తున రాలిపడి ఉన్నాయి. పైన గుత్తులుగా వ్రేలాడుతూ తలకు తగులు తున్నాయి. శ్రీ స్వామివారు మన కర్ధంకాని భాషలో అక్కడున్న ఈశ్వరునితో మాట్లాడుచున్నారు. రెడ్డిగారు ఆప్రక్కనున్న కోనేటిలోకి తొంగి చూస్తే అక్కడ రాసులు రాసులుగా వెండి, బంగారు నాణాలున్నాయి!'' అది వర్ణన. ఆరోజుకు నాకేమీ అర్ధం కాలేదు. తెల్లవారి కొంత అర్ధమైంది. మానవులకు దుర్భేద్యమైన గుహ లోనికి స్వామి వారితోటి వెళ్ళినందున వలన, లోపలికి పోగలిగాడు. మానవులకు అలవికాని ఆధ్యాత్మిక బాట శ్రీ స్వామివారిని వెంబడిస్తే భక్తికి ముక్తికి, ఢోకాలేదని తెలుపుటే అక్కడి శివుని దర్శనము, మామిడి పండ్లు కోనేటిలోని ధనపు రాసులు సంకేతమని అర్ధమయింది.

పై అనుభవం ఒకవైపు, సంతోషము మరొకవైపు బాధ కలుగజేశాయి. అడిగిన వెంటనే శ్రీ మాస్టారు సందేశ మిచ్చినందుకు సంతోషము. నేను శ్రీ స్వామివారిని అనుసరించడం లేదని గదా ఈ సందేశమివ్వడం, అనుసరించడం ఎలాగో తెలియక బాధ కలుగసాగాయి. ఒకవారం గడచింది. నేను సైకిలుపై ఇటుకలు తీసుకుపోతున్నాను. నా గుడ్డలన్నీ మట్టితో నిండియున్నాయి. తల గుడ్డ, చలి బన్నీను చాలాఅసహ్యంగా ఉన్నాను. నాకు తెలిసిన ఒక మిత్రుడు ఎదురొస్తున్నాడు. ''అబ్బా ఈ గెటప్ లో ఈయన కనిపించాడే'' అని మనస్సులో అనుకున్నాను. వెంటనే మాస్టారి గొంతు వినబడుతుంది. ''ఇదేనా నీవు శ్రీ స్వామి వారిని అనుసరించడం'' ఆ శబ్దం చెవున బడగానే నాకు తెలియకుండానే సైకిల్‌కు బ్రేకులు పడ్డాయి. వెంటనే మనసులో మెదిలింది. శ్రీ స్వామివారు చచ్చిన వారిని బ్రతికించే స్థితిలో ఉన్నారు. వారీ విధంగా ఏనాడైనా గెటప్ గూర్చి

చింతించారా ? నా గెటప్ బాగుంటే ఈ మిత్రుడు నా పెన్షను ఏమన్నా పెంచుతాడా ? గెటప్ బాగుండకపోతే తగ్గిస్తాడా ? నేను ఆయనకోసం జీవిస్తున్నాను. సార్ ఇలాంటి భావాలు ఇక రానీయను'' అనుకొని బ్రేకులు వదిలేశాను. ఆ మిత్రుడు నన్ను చూడకుండానే వెళ్ళిపోయాడు. అది మొదలు ఎన్నోమార్లు నా ప్రవర్తనలోని దోషాలు సరిచేసే విధంగా ఆత్మ ప్రేరణ ద్వారా సందేశాలందిస్తూ వారి సర్వవ్యాపకత్వాన్ని తెలియ పరుస్తున్నారు మాస్టారు గారు.

''మనకు ధనమున్నదని ఇంద్రియ సుఖాలను అనుభవిస్తుంటే భవిష్యత్తులోని మన వనరులను మనమే దుబారాగా ఖర్చుచేస్తున్నామని అర్థము. అలా చేసినందున మనలను మనమే ఆధ్యాత్మికతకు అనర్హులను చేసుకుంటున్నామని గుర్తించు''- అన్నారు మాస్టారు గారు.

వినగలిగితే, రాలిపడే చిన్న పండుటాకూ.ఒక సందేశమిస్తుంది. ఆ సందేశం విని అర్థం చేసుకోవటం అనే అర్హత మనకుండాలి. ఆ అర్హత సాధించడమే సాధన. సత్వగుణం పెరిగే కొద్దీ ఈ అర్హత పెరుగుతుంది. చలనమే చైతన్య లక్షణ మనుకుంటే చలనం లేని ప్రతి చెట్టు మొదటిలో పోసిన నీరు, చిటారు కొమ్మకు చేరే చలనమును మనం 'ఆస్మాసిస్' అన్నాము. మరి ఆ చలనం అలా సృష్టించిందెవరు ? వాతావరణమంతా గాలి ఉంది. గాలిలో ఆక్సిజన్, హైడ్రోజన్, కార్బన్‌డైఆక్సిడ్, నైట్రోజన్, జడవాయువులు, నీటి ఆవిరి ఉన్నాయి. వీటన్నింటిలోను అణుస్థాయి, పరమాణుస్థాయిలోకి వెళ్ళి చూడగల్గితే అన్నింటిలోను ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్‌లే ఉన్నాయి. పదార్థానికి మరియొక పదార్థానికి వీటి సంఖ్య మాత్రమే భేదము. ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్ అని మూడు పేర్లు మనం పెట్టాము. వాటి మూడింటిలోను గల తరంగ దైర్ఘ్యముల భేదమే మూడుగా కనిపించేటట్లు చేస్తుంది. నిజానికి ఆ మూడూ ఒకే శక్తి రూపాలే అని వివరించారు, మాస్టారు గారు ఒకసారి.

## ఒకే దెబ్బ రెండు పిట్టలు

ఒకే పనిలో అనేక బోధనలు వినిపించే మహనీయ మూర్తి మాస్టారు గారు.

సాయికి సమర్పించిన ప్రతిపైసా వెనుక దాన్ని సంపాదించడములో ఆ వ్యక్తి పడ్డ శ్రమంతా ఇమిడి ఉంటుంది. కనుక మన దగ్గర కొచ్చిన ఏ వస్తువునైనా వృధా చేయడం, పారవేయడం తగదని చెప్పేవారు. ఒక చిన్నదారం ముక్కనుండి కాగితాలు, కంకర రాళ్ళు అన్నీ శ్రమ ఫలితాలే. భగవత్ ప్రసాదాలే. వీటిలో వేటినీ మనం తయారుచేయలేము గదా



మనదగ్గరకు భగవంతుడే పంపారు. వాటిని సద్వినియోగం చేసుకో, భగవంతుడు మెచ్చుకుంటాడు అనేవారు.

విద్యానగర్ సాయి మందిర నిర్మాణములో మిగిలిపోయిన గ్రానైట్ రాతిముక్కలు సుమారు రెండు లారీలకు సరిపోయేవి చిందర వందరగా పడి ఉన్నాయి. వాటిని కంకర కొట్టిస్తే స్లాబుకు పనికొస్తాయని రూ.. ౬౦౦/- అడ్వాన్సు ఇచ్చారు. పనివాళ్ళు ఒకే ఒక్క రోజు పనిచేసి తర్వాత నెలల తరబడి రాలేదు. మాస్టారు గారు. ఎందరిని పంపినా పని జరుగలేదు. చివరకు ఆ కంకర కొట్టించే పని నాకు అప్పగించారు. మొదట అడ్వాన్సు తీసుకున్న వాళ్ళు రాకుంటే మా కలిచేడు నుండి మనుషులను తీసుకు వచ్చైనా కొట్టించమన్నారు. ఆ రాతిముక్కలు సద్వినియోగం అయ్యేటట్లు చూడమన్నారు. అలా ఎందుకు చేయాలో చెప్పారు.

ఇక్కడ ముందు నిర్ణయం ఎలా ఉంటే అలాగే జరుగుతుంది. అనగానే ఇక ప్రయత్నమే అవసరం లేదు గదా అనేవాళ్ళే ఎక్కువమంది. మనం ఇప్పడు చేసే ప్రయత్నము కూడా ముందు నిర్ణయంలో భాగమని గుర్తించమంటారు మాష్టారుగారు. కనుక మనం చివర వరకు ప్రయత్నం చేసి తీరాలంటారు. ప్రయత్నం చేయకుండా సోమరులమైతే మరుజన్మకైనా ఆకృషి చేయనిదే ఆకర్మ మనలను వదలదంటారు.

మొదట అడ్వాన్సు తీసుకున్న వారి దగ్గరకు నాలుగైదుసార్లు పదిహేను కిలోమీటర్లు వెళ్ళినా వాళ్ళు ప్రతిసారి రేపు వస్తామని వాయిదా వేస్తారు గాని రారు. చివరకు అడ్వాన్సు తీసుకున్న వాని భార్య అసలు విషయం చెప్పింది. ''అక్కడకొస్తే ఆ మెస్‌లో అన్నం పెట్టిస్తారు. మెస్ అన్నం తింటే మేము ఆస్పత్రి పాలవుతాము స్వామి'' అని చెప్పింది. మెస్‌లో అన్నం చాలినంత పెట్టరు. పెట్టిన దానిలో ఉప్పు, కారం, పులుసు కాయకష్టం చేసే వారికి సరిపడా ఉండదు. ఈరోజు ఇద్దరు పనివాళ్ళు రండి నేనే స్వయంగా అన్నం వండి పెడతాను. మీకు నచ్చితే రేపటి నుండి రండి లేకుంటే రావద్దని చెబితే, ఆ నాటికి ముగ్గురొచ్చారు.

నేను వంటచేసి పెట్టాను. ఇట్లా ఉంటే ఎన్నాళ్ళయినా ఇక్కడే పనిచేస్తాము స్వామి అని ఒక వారం వచ్చి నాలుగు యూనిట్ల కంకరకొట్టి వారికి రావలసిన పైకం తీసుకుపోయారు. వాళ్ళు వెళ్ళేటప్పుడు మాష్టారు చూపిన ధాతృత్వం మరచినా మరపురాదు. వాళ్ళకు రావలసిన దానికంటే ముప్పై రూపాయలెక్కువ ఇచ్చారు. దానికే వారి ముఖాలు ఎంతో సంతోషంతో వెలిగిపోయాయి. టవలు పట్టమని కొబ్బరి చిప్పలు, ఆపిల్ పండ్లు, మామిడి పండ్లు, బాబా నివేదనకు వచ్చిన వాటిలో సగం వాళ్ళకే

ఇచ్చారు. ఆనందంతో తబ్బిబ్బైపోయారు.

వాళ్ళే కంకరకొడతారనేది ముందు నిర్ణయమైనా చివర వరకు మాష్టారు ఒక్కరే ఆ ప్రయత్నం కొనసాగించారు. సెక్రటరీ వగైరాలు మధ్యలో మానేశారు. ఆ రాతిముక్కలు పోతే పోయ్యాయిలే, 600 రూ.. వాళ్ళకు బాకీ అనుకుందాం అంటారు వాళ్ళ సోమరి తనం వలన మనమిప్పడు ప్రయత్నం మానినా మనం చేయవలసిన ఆకృషి వచ్చే జన్మకైనా వెంటాడుతుంది. అంటారు మాష్టారు గారు.

## నిర్భీతికి నిదర్శనము

కొంచెం పెద్దవారు అని సంఘంలో పేరుతెచ్చుకొన్నవాళ్ళను గురించి తక్కువగా మాట్లాడడం మంచిది కాదనే భయం చేతను, అందరు వారిని మహనీయులంటుంటే మనం కాదనడం సబబు కాదని, సామాన్యులందరూ నోరునొక్కేసుకొని తమ భావాలను నిర్భయంగా ప్రకటించలేకపోతారు. కాని శ్రీమాష్టర్‌గారు నిర్భయంగా ఆ మహనీయులని పిలువబడే వారిముందే తన భావాలను తెలియజేయడం ఎంతగొప్ప విషయమో ఆలోచించిన కొద్దీ అర్థమవుతుంది.

ఒంగోలు సాయిమందిర్ మహరాజ్ శంకుస్థాపనకు బషీర్ బాబాగారిని తీసుకువచ్చారు. వీరు కడప సమీపంలోని రాంసాయినగర్ లో అమాయకులచేత గొప్ప సిద్ధ పురుషుడని పిలువబడేవారు. ఒంగోలు లో వేదికమీద మైకు ముందు కొచ్చి వారిని గూర్చి ''అపర సాయిబాబా అవతారము'' ''సాయి మహరాజ్'' అని అనేక నామావళులతో వారిని స్తుతించారు. కార్యక్రమం అయిపోయాక సత్సంగముంటుందని శ్రీమాష్టర్ గారే మైకులో చెప్పించారు. సత్సంగానికి కనీసం రెండువందల మందికి పైగా భక్తులున్నారు. శ్రీబషీర్‌బాబాగారు కుర్చీలో కూర్చున్నారు. శ్రీమాష్టర్‌గారు నేలపై పరచిన చాపమీద కూర్చొని సత్సంగము ప్రారంభించారు. తన ప్రసంగములో మాష్టర్‌గారు, సాయి గురించి ''కొంత తెలిసిన వారమైనా మనమే ప్రజలకు, బషీర్‌బాబాగారిని సాయిమహరాజ్ అని, సాయి అవతారమని అనడం మంచిదికాదు. సాయినాధునికి ఎవ్వరూ సాటిరారు. అని నిష్కర్షగా చెప్పారు.

శ్రీమాష్టరుగారి మాటలు విన్న బషీర్‌బాబాగారు బాగా బాధపడి పోయారు. తనముందే తనను తక్కువచేసి మాట్లాడుతున్నాడని తలచి శ్రీమాష్టరుగారితో కొంతసేపు వాదించారు. వాదనకు తట్టుకోలేక చివరకు ''నీవు భయపడి విద్యానగర్ నుండి పారిపోయివచ్చావు'' అని



ఆరోపించారు. అందుకు మాష్టరుగారు '' నేనేమి భయపడిరాలేదు. సాయి ఆజ్ఞప్రకారం వచ్చేశాను.'' అని చెప్పారు. సాయి ఏవిధంగా ఆజ్ఞాపించారని బషీరుబాబా అడుగలేదు. మాష్టరుగారు వివరణ చెప్పలేదు. భయపడి, పారిపోయి అనే మాటలు బషీరుబాబా తరచు వాడారు. కానీ శ్రీమాష్టరుగారు తొణుకు బెణుకు లేకుండా సమాధానం చెప్పారు. చివరకు బషీరుబాబా మాష్టరుగారికి చెప్పకుండానే సభలోనించి నిష్క్రమించారు. అందరిచేత అంతగా కీర్తింపబడిన బషీరుబాబాగారు వెళ్ళిపోతుంటే శ్రీమాష్టరుగారు నమస్కారం కూడ చెప్పనిది ఇది ఒక్క సన్నివేశమేమో ననుకుంటాను.

సాయినాధుడు కూడ భగవంతుడెంత గొప్పవాడో! వారితో ఎవ్వరూ సరిరారు అని, నేను భగవంతుని బానిసను అని అన్నారు, కానీ శ్రీబషీర్‌బాబాగారు తనను మహరాజ్ అనకూడదన్న శ్రీమాష్టర్‌గారిపై ''పిరికివాడివి, భయపడి పారిపోయి వచ్చావు'' వంటి మాటలు అన్నారు. కానీ మాష్టరుగారు వారిని వేలెత్తి చూపుతూ ఒక్కమాట అనలేదు. సిసలైన మహాత్ములెలా ఉంటారో నిరూపించారు శ్రీమాష్టరుగారు.

## శ్రీ సాయి నాధుడు ఒకే సత్యం ఒకే మాట, శ్రీ స్వామి వారు ఒకే సత్యం ఒకే మాట, శ్రీ మాష్టరు గారు ఒకే సత్యం ఒకే మాట

శ్రీ మాష్టరుగారు ఎన్నోసార్లు నన్ను శ్వాసను గమనిస్తూ విరామ సమయంలో ఈ సాధన చేస్తూ ఉండమనేవారు. నాకు వారు చెప్పేమాట ఆ రోజుల్లో సరిగ్గా అర్థమయ్యేది కాదు. కనుక శ్వాసను గట్టిగా లాగి వదిలేవాణ్ణి. రెండుసార్లు చేసే సరికి విసుగుపుట్టి ఆ సాధన వదిలివేశాను.

౧౨౨౮ జనవరి ౧వ తేది శ్రీ స్వామి వారి ప్రసాదం కొంచెమైనా తీసుకోవాలనుకున్నాను. కారణం రోజూ విభూతి, తీర్థం తప్ప ఏమీ తీసుకోను. కారణం ప్రసాదాల్లో నేను తినరాని నూనె, ఉప్ప తప్పక ఉంటాయి. జనవరి ౧వ తేదీన నేను పూజచేసి బయటికి వస్తూ ప్రసాదాలు పెట్టేచోటు చూస్తే అక్కడ మనిషి లేడు. నేను బయటకు వచ్చానే గాని ప్రసాదం తీసుకోలేదని మనసులో కొరతగానే ఉంది. రోడ్డెక్కగానే ''ప్రతిక్షణము నా ప్రసాదం తింటూనే ఇంకా ప్రసాదం, ప్రసాదం అని కొట్టుకులాడు తున్నావే'' అని వినపడుతుంది. ఇది స్వామివారి మాట. కొట్టుకలాడడం అనే పదం నెల్లూరు ప్రాంతీయపదం, 'క్రేజీ' అని అర్థం. అన్నం, టిఫిన్‌లు రోజుకు నాలుగు మార్లు కాకుంటే ఐదు మార్లు తింటాము. ప్రతి క్షణము తినడమేమిటి అని నా తల తిరిగి పోయేటట్లు

ఆలోచనలో పడ్డాను. పది అడుగులు నడవగానే కోటి సూర్యుల వెలుగు వలె నా మసులో మెరిసింది. ఏమని? నిరంతరం శ్వాసించనిదే జీవించలేము. మనము శ్వాసించే ప్రాణవాయువును తానేనని శ్రీ స్వామివారు చెపుతున్నారు. దీనినే మాష్టరుగారు శ్వాసను గమనించు అని ఆనాడు చెప్పారని గుర్తుకు వచ్చింది. అలా నిరంతరము శ్వాసను గమనిస్తూ శ్రీ స్వామి వారిని గుర్తిస్తూ ఉండటమే సాధన.

౨౪-౮-౯౮న శ్రీస్వామి వారి ఆరాధన. ఆ రోజు శ్రీస్వామి వారి సంకల్పంగా నా చేతికి ఒక పుస్తకం వచ్చింది. అది పిరమిడ్ ధ్యాన కేంద్రము వారు పంచి పెట్టారు. అందులో మొదటి పేజీలో శ్రీ మాష్టరుగారి ఫోటో వారి సందేశము వేశారు. ఈ ధ్యానకేంద్రం వారి ధ్యేయం ఒక్కటే మన ధ్యాసంతా శ్వాస మీద సాధ్యమైనంత సేపు నిలపడం ఇదే సాధన. ఇది మనో నాశనానికి దారితీసి ఆత్మ జ్ఞానం యిస్తుందని శ్రీ సుభాష్ పత్రిగారు ఉద్యమం నడుపుతున్నారు. ఆత్మజ్ఞానానికి ముందు కొంత సాధన చేసిన వారికి బి.పి. షుగర్ మొదలైన వ్యాధులు నయమవడం నిద్రరాని వారికి నిద్రపట్టడం ప్రత్యక్ష అనుభవాలు. కనుక శ్రీమాష్టరు గారు చెప్పినది, శ్రీ స్వామి వారు చెప్పినది, శ్రీ సాయి చెప్పినది ఒకే సత్యం. అదే సంస్కారానికి తగిన సాధన అని ఈ త్రిమూర్తుల నిర్ణయమన్నమాట. విషయం నేను గుర్తించక ముందు ఇరవై సంవత్సరముల నాడే శ్రీ మాష్టరుగారు నాకు చెప్పారు.

## ఆశీర్వాదము - అర్హత

ఒకసారి నేను ఎందుకు వ్రాశానో గుర్తులేదు. ఎవరినో ఆశీర్వదించినట్లు పుస్తకము మీద వ్రాశాను. అంటే ''నూతన సంవత్సరములో సర్వశుభములు నీకు కలుగుగాక'' అన్నట్లుగా వ్రాశాను. కరెక్టుగా ఆపదం గుర్తులేదు. అది మాష్టరుగారు చూచి ''అలా మనం వ్రాయకూడదు. అలాంటి ఆశీర్వాదం బాబా తప్ప మనం వ్రాయకూడదు'' అన్నారు. అయితే మనం ఏమని వ్రాయాలి సార్ అని అన్నాను. ప్రార్థిస్తున్నాను అని వ్రాయాలి అని చెప్పారు. కనుక అది మొదలు నేను అలాగే వ్రాస్తాను

మాస్టరు గారు అయితే ''జరుగుగాక'' అని వ్రాస్తారు. కనుక వారే బాబా అనేమాటను వారు అంగీకరించినట్లే అయింది. కానీ నేను వారిని మీరు అలా వ్రాస్తారు గాదా. మీరు బాబాతో సమానమే గదా దాని అర్థం, నేను బాబాతో సమానం కాదంటారే. బాబా ఎంత గొప్పవారో వారితో



ఎవ్వరూ సరిపోరు అని అంటారు ఎందుకు? అని నిలదీసి అడగలేక పోయాను.

## భిక్షాటనము పరమార్థము

విద్యానగర్ మందిర ప్రారంభోత్సవానికి ముందు తన పరిచయస్తులందరికీ తలా ఒక గోతం, ఒక రసీదు పుస్తకం ఇచ్చి వారి వారి చుట్టుప్రక్కల భిక్ష స్వీకరించమంటున్నారు. ఆ పని నాకు పెట్టలేదని చాలా సంబర పడుతున్నాను. కారణం నాకు అలా భిక్షకు వెళ్లడం అలవాటు లేదు. రెండోవది టీచర్ పని చేస్తున్నాని ఒక అహంకారం, కనుక భిక్షకు పోవడం నామోషీగా తలచేవాణ్ణి. చిట్ట చివరకు నాకూ ఒక గోతం, రసీదు పుస్తకం ఇచ్చారు. ''సార్! మా వూరిలో ఎవ్వరూ ఇవ్వరూ, నేను మాత్రం నా శక్తి కొద్దీ తెచ్చి సమర్పిస్తాను'' అన్నాను. అప్పడు మాస్టరు గారు నాకు క్లాస్ తీసుకున్నారు.

''మనం ఇచ్చేవాటితోనే సాయికి డబ్బు దండిగా సరిపోతుందని కాదు. ఈ భిక్షా కార్యక్రమం ద్వారా మన అహం నశించేందుకే ఈ కార్యక్రమం పెద్దలు ఏర్పాటు చేశారు. నీవు మీ గ్రామంలో చిన్న, పెద్దా, బీద, బిక్కు అందరి ఇండ్లకు వెళ్ళు. బియ్యం దగ్గర నుండి ఉప్ప వరకూ వారి ఏదిస్తే అది, ఎంత ఇస్తే అంత ప్రేమతో తీసుకో, వాళ్ళు వాయిదా వేస్తే ''అమ్మా మీకు వీలుంటే ఇంటికి పంపండి. నేను మాత్రం ఇకరాను. మీకు ఇవ్వాలనిపిస్తే ఏది ఉంటే అది, ఎంత ఉంటే అంత ఇవ్వండి. ఇప్పడే తీసుకుపోతాను అని చెప్పు. ఎవ్వరూ ఇవ్వకుంటే అది సాయి సంకల్పమని సంతోషముగా వచ్చేయి. ''భిక్ష చేయటం మన అహంకార నిర్మూలనకు ఉద్దేశించిన కార్యక్రమమని మరచి పోవద్దు ఒకే సత్యం ఒకే మాట సుమా!'' అని చెప్పారు మాష్టరు గారు.

స్కూలు పిల్లలందరినీ తీసుకొని బయలుదేరాను. ౫౦౦ రూ.. డబ్బులు, 4 బస్తాల బియ్యం, ½ కిలో నెయ్యి, 43 కిలోల నూనె వచ్చాయి. నెయ్యి ఇచ్చిన తల్లి పుణ్యమెమో గాని ప్రారంభోత్సవ మొదటి యజ్ఞానికి ఆ నెయ్యినే వాడేవారు.

## వేద విదుడు :

౧. ఉద్ధరే దాత్మ నాత్మానాం.........

౨. అనన్యాశ్చింత యంతో మాం.........

౩. తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా.........

౧ వ శ్లోకంలో ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి అన్నారు.

౨వ శ్లోకంలో అన్యచింతలు మాని నన్నేశరణు పొందిన వారి యోగక్షేమములు నేనే చూస్తాను.

౩వ శ్లోకంలో నమస్కారము, పరిప్రశ్న, సేవల ద్వారా గురువు నాశ్రయించి గురువు నుండి జ్ఞానము పొందు.

శ్రీ మాష్టరు గారికి పది సంవత్సరముల లోపలే వయస్సు వారి తండ్రిగారైన శ్రీ అనంతాచార్యులు గారు గీతోపన్యాసాలు చేసి గీతను పూర్తి చేశారు. ఆనాడు అందరూ వారిని గురువుగా పూజించి నూతన వస్త్రములిచ్చి వెళుతున్నారు. మిగిలిన కుమారులు ముగ్గురూ గీతోపన్యాసాలు వింటున్నా, మాష్టరు గారు వినకుండా బంతి తీసి గోడలకు కొడుతూ ఆడుతుండేవారు. శ్రీ అనంతాచార్చులు గారు వీరిని మందలించరు. అలా గడిచిపోయాయి రోజులు. చివరి రోజున ఒక పెద్దాయనను నిలబెట్టి మాష్టరు గారు ఆ చిన్న వయస్సులో ఒక ప్రశ్న అడిగారట. ''తాతగారు శ్రీ కృష్ణునికి పిచ్చా ఏమిటి'' అన్నారట. ఓరి భడవా ఎంతమాటన్నావురా. ఎందుకలా అన్నావు అని అడిగారట. అందుకు మాష్టరుగారు పై మూడు శ్లోకాలు భావం చెప్పి ఇంతకీ కృష్ణుడు మనలను ఉద్ధరిస్తాడా లేక గురువు ఉద్ధరిస్తాడా లేక మనకు మనమే ఉద్ధరించుకోవాలా? అని అడిగేసరికి ఆ తాతగారికి నిజంగానే మతిపోయింది. ''మమ్ములనైతే ప్రశ్నిస్తావు. మీ నాన్నగారికి ఈ ప్రశ్న అడగలేకపోయావా? అని అన్నాడు గాని పాపం ఈ శ్లోకాల సమన్వయం అర్థం ఏమిటో తెలియలేదు. మూడు శ్లోకాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి కదా! రాత్రంతా యోచించి చివరకు తెల్లవారి అనంతాచార్యుల దగ్గరకొచ్చి తన సందేహం అడిగారు. వెంటనే వారు ఈ ప్రశ్న ఎవరికి కలిగిందో వారినే సమాధానము అడగకూడదా? అని అన్నారట. మీ భరద్వాజే అడిగారండి వేలెడు లేడు ఎంత చిక్కు ప్రశ్న తెచ్చాడు అని అన్నారట. వాడి ద్వారానే ఆ ప్రశ్నకు సమాధానం చెప్పిస్తాను. మీరు రేపు రండి అని పంపేశారట. ఎన్నో సార్లు ఎంతో లాలనగా వాళ్ళ తండ్రిగారు అడిగినా చెప్పలేదట. చివరకు అన్నం దగ్గర నీకు తెలిసింది చెప్పు. మిగిలింది నేను చెబుతాను అని నిలదీశారట. అప్పుడు మాష్టరు గారే సమన్వయం చెప్పారట ఎలాగ?

''సరైన విధంగా గురువును ఆశ్రయిస్తే గురువు సాధన ఎలా చేయాలో చెబుతారు. వారు చెప్పినట్లు చేయవలసింది మనమే కదా. అలా చేస్తుంటే మనం చేసేది ఒప్పో, తప్పో చూసి మనల్ని భగవంతుడే సరిచేసి యోగక్షేమాలను ప్రసాదిస్తారు అని చెప్పారట.''



అది అక్షరాల సరైన వ్యాఖ్య అని శ్రీ అనంతాచార్యులు గారు అంగీకరించారట.

చూడండి పది సంవత్సరముల లోపలే భగవద్గీతలో మూడు చోట్లగల మూడు శ్లోకములను కలిపి ప్రశ్న వేయడం. ఆప్రశ్న మొదట నాలాంటి వారికే తికమక పెట్టడం, ఆ చిన్న వయసులోన ఆ జటిల సమస్యను అతి తేలికగా సమన్వయించ గల మేధాశక్తి అది. భగవద్గీత అంతా విన్నాక ఆ ప్రశ్న వచ్చినా అర్థముంది. బంతి ఆడుకుంటూ అసలు వినకుండానే అలాంటి జటిల సమస్యను తయారు చేసి తిరిగి సమన్వయం చెప్పారు. కనుక వారు శ్రీ మహావిష్ణువు యొక్క అవతారమని ఋజువు చేశారు. ప్రహ్లాద కుమారుడు ''చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ'' అన్నట్లుంది - ఆ సంఘటన.

## దివ్య సందేశం

౧౯౯౯ సం॥ జనవరి ౧ వ తేది సాయంకాలం 6½ గం॥లకు మాష్టారి చిత్రపటం ముందు కూర్చొని క్రొత్త సంవత్సరము కనుక ఏదైనా సందేశమివ్వమని అడిగాను. అక్కడున్న అవధూత లీల ఇంగ్లీషు ఎడిషన్‌లో పుల్ల పెట్టి తెరుస్తాను, ఎడమ వైపు మొదట లైనులోనే ఉండాలని విన్నవించాను. చిత్రంగా 160వ పేజీ తెరుచుకొంది. Always followed Sri Swamy, served him. When ever Swamy stopped, he went in search of that area and gathered leaf vegitable and soon. ఇది పోలిరెడ్డిగారి విషయం. పోలిరెడ్డి వలె నన్ను కూడా ఎల్లప్పుడూ శ్రీ స్వామి వారిని వెంబడించి పొమ్మన్నారు. ఇది చాలా విచిత్రము మరియు గొప్పదైన సందేశము.

పోలిరెడ్డిగారి విషయములో వారి సర్వబాధ్యతలు శ్రీ స్వామివారే వహించారు. పోలిరెడ్డి గారు నోరు తెరచి నాకు ఫలానా విషయం కావాలి స్వామి అని అడిగింది లేదు. ఏమీ కోరని భక్తే నిజమైన భక్తి అన్న మాటకు వీరే నిజమైన ఉదాహరణ. చివరి క్షణాలలో ముమ్మారు ఓంకారం చేసి తనువు చాలించిన భాగ్యశాలి. శ్రీ స్వామి వారు పర్యటనలో ఉన్నారు కనుక వారికి తెలుపలేకున్నామే అని భక్తులు బాధ పడుతున్నారు. కానీ సర్వజ్ఞ మూర్తికి తెలియనిదేముంది. పోలిరెడ్డి తనువు చాలించినది మొదలు గంగ ముట్టకుండా ఆశ్రమం చేరి వారి స్వహస్తాలతోనే పోలిరెడ్డి దేహాన్ని సమాధి చేశారు. పోలిరెడ్డి లాగా నేను కూడా శ్రీ స్వామి వారిని వెంబడిస్తే అంతటి భాగ్యం నాకు కలుగుతుందని శ్రీ మాష్టారు గారు అభయమిస్తున్నారు. అలా వెంబడించే శక్తిని యిమ్మని ప్రార్థిస్తున్నాను.

## సాయికృప సాధన లేనందున సాధన చక్కగా చేయలేకున్నాను అన్న భక్తునితో

సాయి కృపలేదని ఎందుకు చెబుతావు. ఆయన కృప అందరి పైన అనుక్షణం కుంభవృష్టిగా కురుస్తూనే ఉంది. మనమే దాన్ని రిసీవ్ చేసుకునేందుకు సంసిద్ధంగా లేము. సాయి ఆజ్ఞలకు భిన్నంగా నడుచుకుంటున్నట్లు నీ కెప్పడూ తెలియదా? అన్నారు మాస్టారు గారు.

''ఎందుకు తెలియదు సార్ ఎన్నో సార్లు తెలిసినా దాన్ని వదలగొట్టమని సాయిని ఎన్నోసార్లు ప్రార్థించినా ఆ బలహీనత నన్ను వదలడం లేదు.'' అన్నాడు అతను. అందుకు మాస్టర్ గారు బలహీనత నిన్ను వదలకుంటే నీవు ప్రాయశ్చిత్తం ఎంతవరకు చేసుకున్నావు ? ప్రాయశ్చిత్తమంటే మామూలుగా తగిలీ తగలనట్లు చెంపలేసుకోవడం కాదు. వివేకానందుని వలె శిక్ష విధించుకోవాలి. వివేకానందుడేమి చేశాడు? ఒక రోజున అందమైన స్త్రీని చూచి భగవంతుడు ఎంత అందం సృష్టించాడు అని అనుకున్నాడట వివేకానందుడు. వెంటనే వారిలో వివేకం మేల్కొని, చ! ఎంత ఘోరమైన స్థితికి దిగజారాను. ఈ సృష్టంతా భగవంతుడే అయితే అందం అనీ అందవికారమనీ రెండున్నాయా. శ్రీరామకృష్ణుల శిష్యుడనైయుండి అద్వైతము నుండి ద్వైతానికి పడిపోయాను. ఈనాడు ఇది అందమని భావించాను. రేపు కావాలని కోరుతాను. కనుక ఈ క్షణాన్నే ప్రాయశ్చిత్తం చేసుకోవాలని, దోశల పెనం ఎర్రగా కాలబెట్టి దానిపైన కూర్చున్నాడట. పిర్రలపై పుండ్లుపడి ఆరునెలలు బోర్లాపడుకొని చికిత్స చేసుకున్నాడట. అట్లాంటి ప్రాయశ్చిత్తాల ద్వారా మన హృదయపూర్వక కోరికను బాబాకు తెలియపరచుకోవాలి. అంతేగానీ నోటితో కోరినంత మాత్రాన అది లభించదు. అలాంటి ప్రాయశ్చిత్తాలు చేసికొని చూడు.'' చెప్పారు మాస్టారు గారు.

## సాయి రూపం

శ్రీ మాష్టరుగారికి ఈ విశ్వమంతా సాయి రూపంగానే కనిపించేది. అందరిలో సాయిని చూడడమే వారి ధ్యేయంగా ఉండేది. ఆ ప్రయత్నములో వారు అన్నపానీయాలు మరచిపోయేవారు. కాలేజీ ఉద్యోగం వదలి వారు ఒంగోలులో ఉన్నప్పడు వారిని చూడాలని ఎంతో దూరప్రాంతాల వారు అనేక సమస్యలతో సతమతమవుతూ వారి దర్శనార్థం వచ్చేవారు. ఆర్తులు, జిజ్ఞాసువులు, అర్థకాములు అన్ని రకాలవారూ తండోపతండాలుగా వచ్చేవారు. వారు ఎక్కడెక్కడనుండో రైలులో రిజర్వుచేసుకొని వచ్చేవారు.



ఆటైంలో తిరిగి పోకుంటే ఆ టిక్కెట్లు వృధా అవుతాయి. మరలా రిజర్వేషను ఎప్పడు దొరుకుతుందో చెప్పలేము. అందుకని శ్రీమాష్టరుగారు ఒక్కొక్క రోజు ఉదయం 4 గం..లకు కూర్చుంటే సాయంకాలం 4 గం.. వరకు, అందరూ వెళ్ళిపోయేంత వరకు అలానే కూర్చొని వుండిపోయేవారు. సైగచేసి పిలవాలని అమ్మగారు ఎదురు చూడవలసిందే కాని, వారు మాత్రం ఆమెవైపు కూడా చూడరు. అలా చూస్తే రమ్మని సైగచేస్తారని వారికి తెలుసు. లేచి యూరిన్‌కు కూడా రారు. కాఫీ, టీ త్రాగరు. అన్నం, టిఫిన్ అసలే లేదు. కాఫీలు, టీలు త్రాగుతుంటే యూరిన్‌కు పోవలసి వస్తుందని అలా త్రాగకుండా ఉండేవారు. విజిటర్స్ మాత్రం ఒక బ్యాచ్ తర్వాత ఒక బ్యాచ్ వస్తూనే ఉండేవారు. ఒక్కొక్క రోజు సాయంత్రం ౬ గం..లకు అందరూ విజిటర్స్‌ను బాబాగారే లేకుండా చేస్తే వారు లోపలికి వచ్చేవారు. అమ్మగారు అనేవారట ''యూరిన్‌కు కూడా లేచి రాడమ్మాయ్. ఇలా చూడరే. చూస్తే పిలుస్తానని తెలుసు'' అనేవారు. మాకువార్తె మాష్టరుగారింట్లో రెండు నెలలుండే భాగ్యం కల్గింది. ఆమె చెప్పింది ఈవివరమంతా.

## ఆచరించి చూపిన ఆత్మజ్ఞాన మార్గం

శ్రీ రమణ మహర్షి, శ్రీరామకృష్ణ పరమహంస, శ్రీ ఉపాసనీ బాబాగారు, ఎన్నో నెలలు, సంవత్సరాలు సమాధి స్థితిలో ఉన్న తర్వాతనే వారిలో సిద్ధులు ప్రకటమవడం, ఆత్మజ్ఞానులుగా భాసించడం జరిగింది. మరి మాష్టరుగారు ౧౯౬౩ సం..లో ౫ గం.. సేపు సమాధి స్థితి అనుభవించిన కొన్నిరోజులు తర్వాత ఇంటికి వచ్చాక కూడా మెలుకువలో కూడా తనకు ఆ దివ్యానుభూతి అలాగే ఉండేదని చెప్పారు. అంతేగానీ మరలా అలాంటి సమాధి స్థితికొరకు వారు ప్రయత్నించినట్లు రుజువులేదు. బాబా చెప్పినట్లు తన మనస్సు, హృదయం నిరంతరం బాబా స్మరణలో నింపుకున్నారు. ఈ చూడబడేదంతా కూడ బాబారూపంగా చూస్తూ తదనుగుణంగా నడుచుకొంటూ ఉండిపోయారు. మీకు బాబా అప్పడప్పడూ కనిపిస్తుంటారా సార్ అని అడిగిన భక్తులతో ''అసలు వారిని ఆరూపంలో చూడాలని నాకెప్పడూ అనిపించదు. ఎందుకంటే తల్లి చంకలో ఉన్న బిడ్డ కేరింతలు కొడుతూ, నవ్వుతూ ప్రపంచాన్ని చూడడడంలో సంతోషంగా కాలం గడిపేస్తుంది. తల్లి మొహం ఎప్పడూ చూడడు. తల్లికి దూరంగా ఉన్న పిల్లవాడు మాత్రమే తల్లి మొహం చూడాలని తహతహలాడుతూ ఏడుస్తుంటాడు'' అని చెప్పేవారు. కనుక ఆయనలాగా మనంకూడా అంతటా ఉన్న బాబాను చూచి ఆనందించే

అభ్యాసం చేస్తుంటే రాగద్వేషాలు తగ్గి మనస్సు ప్రశాంతత పొందుతుంది. అందుకు మొదట, నిరంతర నిష్కామకర్మే ప్రధానమన్నారు. శ్రీ మాష్టారు చెప్పినట్లు చేస్తుండడమే మన కర్తవ్యం కావాలి. అన్నం తినబోయేముందు కాకబలికి సమర్పిస్తూ, ఆ అన్నం బాబా కృపవల్ల ఎలా వచ్చిందో వివరంగా స్మరించి కాకబలికి పెట్టుఅంటారు మాష్టారుగారు. అన్నం వండినంతసేపు నామం స్మరించు. అన్నం తిన్నంతసేపు నామం స్మరించమంటారు. ఈ ప్రాధమిక పాఠాలే నేర్చుకోకుంటే అంతా బాబాగా చూసే శక్తి ఎలా వస్తుంది మనకు?

మాష్టారుగారు ఒకరోజు మాటల సందర్భంలో ఇలా చెప్పారు. ''నేను ద్వారకామాయిని చిమ్మేవాడిని, అందుకుగాను నేను అక్కడి సేవకులు చెప్పిన టైంలో వెళ్లేవాడిని. ఇది మనందరికీ ఆచరణీయమైన పని. రాధా కృష్ణమాయి బాబా తిరిగే వీధులన్నీ చిమ్మి నీళ్ళు చల్లి ముగ్గులు పెట్టేవారు. ఆ తల్లి శ్రద్ధను చూచి ఆ గ్రామస్తులు తమ చిన్న పిల్లలను వీధులలో దొడ్డికి కూర్చోబెట్టడం , చిమ్మిన కసువు వీధులలో పోయడం లాంటి పనులు మానేశారు.

మరొకరోజు మాటల సందర్భంలో చెప్పారు.

మన ఇంటిలో పారాయణ, పూజ చేసుకుంటే పదిపైసలు ఫలితమొస్తుంది. అదేపని మన గ్రామంలోని ఒక మందిరంలో చేస్తే రూపాయి ఫలితముంటుంది. అదే పని మహాపుణ్యక్షేత్రాలైన కాశీ, తిరుపతి, శ్రీశైలం లాంటి చోట్ల చేస్తే వంద రూపాయల ఫలితముంటుంది. అదే పని షిరిడీ, గొలగమూడి లాంటి సద్గురుసన్నిధిలో చేస్తే ఫలితం అనంతంగా ఉంటుంది. అని చెప్పారు మాష్టారుగారు.

ఈ మహనీయులు సూర్యచంద్రులున్నంత వరకు ఉంటామని వాగ్దానం చేసియున్నారు కనుక ఆ మహనీయుల సమాధుల చెంత గాని, మన మధ్య జీవించియున్న మహనీయుల సన్నిధిలో కాని చేసుకునే భక్తి, సాధనలకు ఫలితం అనంతంగా ఉంటుంది. ఇది మనమెప్పడూ గుర్తుంచుకొనవలసిన విషయం అన్నారు. అందుకే కాబోలు వారు తన వివాహ విషయమై సందేశం కోరి సాయి సమాధి చెంత పారాయణ, ప్రదక్షిణలు చేశారు మాష్టారుగారు. నన్ను కలిచేడు రామాలయంలో పూజ, పారాయణ, సత్సంగం చేయమని చెప్పేరు.

శ్రీమాష్టరుగారు ఒకసారి అంటారు, ప్రపంచంలోని అందరూ, అంటే ఆశ్రమాధిపతులు, పీఠాధిపతులు, టాటా-బిర్లాలు, మధ్య తరగతి



మనుషులు, చివరకు పేదవారి వరకూ అందరూ అనుక్షణం ఒక విషయం మరచిపోతున్నారు. అదే అనుక్షణం మనం మృత్యువుకు దగ్గరపడుతున్నామన్న విషయమే. ఈ విషయం అనుక్షణం గుర్తుంచుకొని, చేయవలసిన దానిని వాయిదా వేయకుండా చేయి. ఇక్కడ చేయవలసింది లౌకికమైన పని మాత్రమే కాదు, సాధనాపరంగా చేయవలసిన పని అనికూడా అర్ధం చేసుకోవాలి.

శిరిడీ హారతులలో ''వ్యర్ధం చేసితి నావయసంతా – చివరకు తోడు ఎవ్వరూ రారు''. అని నిరంతరము పాడుతాము కానీ, ఈ మాటను లోతుగా ఆలోచించి హృదయగతం చేసుకుంటే మాష్టరుగారు చెప్పిన కనీస సాధనలైనా చేస్తాము. కనీస సాధనలు ఏమి చెప్పారంటే 1. నిత్యం హారతులు చేయడం 2. టైం ప్రకారం ఎన్ని పనులున్నా నిత్యం పూజ చెయ్యడం 3. నిత్య పారాయణ 4. కాక బలికి సమర్పించేటప్పడు ఆ ముద్ద మన దగ్గరకు రావాలంటే ఎన్ని జీవులు కృషిచేయాలి – జీవులంటే జీవులలోని పరమాత్మ శ్రమ చేస్తేనే మనకా ముద్దవచ్చింది. ఇంకెన్ని జీవులు శ్రమ చేస్తే అది జీర్ణమై వంటబడుతుందో అని గుర్తించి ఆ భగవంతుని ఎడల కృతజ్ఞత భావంతో సమర్పించడమే కాకబలి. దీనిని నిత్యం ప్రతిపూట వివరంగా హృదయపూర్వకంగా స్మరించడం అంటారు. 5. అన్నం తిన్నంత సేపైనా నామస్మరణ చెయ్యడం 6. స్నానం, మలమూత్ర విసర్జన చేసేటప్పడు నామం మరువద్దు. మృత్యువు మనల్ని ఎంతగా మ్రింగిందో గుర్తించి మసలుకో అని చెప్పేవారు.

బాబా చేసిన మేలుకు మనమెలా కృతజ్ఞత తెలుపుకోవాలో చెపుతూ ఉదాహరణకు కొత్తపాలెం వాస్తవ్యులు రాంరెడ్డిగారి విషయం చెప్పారు మాష్టారుగారు. వీళ్ళ రెండవ అమ్మాయి మల్లేశ్వరి రోజుల బిడ్డగా ఉండగా చేయిజారి క్రింద పడి అంగవైకల్యం ఏర్పడింది. బిడ్డ బ్రతికింది. నడుముకు క్రింది భాగం స్వాధీనంలో లేదు. ఏడు సంవత్సరాల వరకు బిడ్డకు కొన్ని లక్షలు ఖర్చుపెట్టినా నడవలేకపోయింది. ఒకరోజు బాబాకు నివేదించిన పాయసం ఆపాపకు మాష్టరుగారు పెట్టారు. తెల్లవారినుండి నడవసాగింది. అందుకు కృతజ్ఞతాపూర్వకంగా ఆబిడ్డ తండ్రియైన రామిరెడ్డి గోపాల్ గారు మూడు సంవత్సరాలకు పైగా చేల లోనికే కాదు, వీధులలోనికి కూడా పోకుండా వెయ్యి పదహారు సార్లు శ్రీసాయి లీలామృతం పారాయణలు చేశారు. అలాగే మనం కూడా మనకు మంచి ఆరోగ్యం, చదువు, బుద్ధి కుశలత ఇచ్చినందుకు, తినటానికి తిండి, ఉండడానికి ఇల్లు, కట్టుబట్టలు లేని నిరుపేదలకంటే మంచి స్థితిలో మనల్ని

ఉంచి నందుకు బాబాకు కృతజ్ఞతా పూర్వకంగా పారాయణ చేయాలి. భజన చేయాలి. నిత్యం తప్పని సరిగా కొంత సమయాన్ని బాబాకు సమర్పించాలి. అలా కూడా చేయలేకపోతే మనం బాబాకు కృతజ్ఞత ఎలా చెప్పాలి. మనకు పనికి రాని ధనం బాబా కార్యలకు దానం చేసానను కోవడం కృతజ్ఞత ఎలా అవుతుంది'' అని వివరించారు.

## శ్రీ మాష్టారి అతిముఖ్యమైన బోధ.

మాష్టారుగారు ''ఎప్పడూ క్రింద చూడు పైకి చూడకు'' అనేవారు. అంటే ఇదేమిటి ఈ మాట విరుద్ధముగా ఉన్నదని తలచవద్దు. సందర్భాన్ని బట్టి వారి భావం మారుతుంది. మనకంటే క్రింది స్థాయిలో గల ఆర్థిక స్థితిగలవారిని, ఆరోగ్య స్థితి గలవారిని, విద్యా స్థాయి గలవారిని చూచి సంతృప్తిచెందు. భగవంతునికి కృతజ్ఞతలు తెలుపుకో. తిండి, గుడ్డ, గూడు లేక ఆరోగ్యము లేక, చదువులేక ఎంతో దయనీయమైన స్థితిలో నున్న వారి సంఖ్య ఎంత ఎక్కువగా ఉంటుందో ఒక్కసారి ఆలోచించు''. వారితో పోల్చుకుంటే మనమెంత ఉన్నత స్తితిలో ఉన్నామో చూసి సంతోషముతో భగవంతునికి కృతజ్ఞత చెప్పకోవాలి. ప్రతి ఒక్కసారి తృప్తి, శాంతి, ఆనందముతో గడిపేందుకు ఈ ఒక్కమాట ఎంతగొప్పగా మనకు ఉపయోగపడుతుందో ఆలోచించు. ఈ విషయాన్ని అమృత లేఖావళి మొదటి ఎడిషన్ ౨4 వ పేజీలో వ్రాశారు.

శ్రీమాష్టారి మాటల్లో - ''జీవితంలో ఎవరెంత తృప్తి, శాంతి, ఆనందము అనుభవించారు, ఇతరులకిచ్చారు అన్నదే లెక్కగాని ఎవరెంత సంపాదించారు, నిల్వ చేసారు అన్నది కాదు'' అంటారు మాష్టారు. ఇష్టము, అయిష్టము లేకుండా జీవించడం అనే జీవన కళ తెలిస్తే అంతా ఆనందమే'' అంటారు శ్రీమాష్టరుగారు.

## ఆధ్యాత్మిక చింతనకు అడ్డుచెప్పే తల్లిదండ్రుల గూర్చి

శ్రీ వెంకయ్యస్వామి గారు నాకున్న ఆయాసం బాధను ఏ డాక్టర్లూ తగ్గించలేని పరిస్థితిలో తగ్గించారు, శ్రీమాష్టరుగారు, స్వామి సన్నిధి వదలి పెట్టవద్దు, సాధ్యమైనంత సేపు వారి సాన్నిధ్యంలో ఉండు, నిప్పు దగ్గర కూర్చున్న వ్యక్తి తన గుడ్డల తడి ఆర్పమని అగ్ని దేవున్ని ప్రార్థించనక్కర లేకుండానే తడి ఆరిపోతుంది. ఆమహనీయుని సన్నిధిలో కూర్చున్నంత మాత్రాన సాధనతో నిర్మూలించుకోలేని సంస్కారాలన్నీ రాలిపోతాయని'' చెప్పారు. నేను ఖాళీ దొరికితే శ్రీస్వామి వారి దగ్గరకు వెళ్ళి కూర్చునేవాడిని. మాతల్లిగారు ఎన్నో అడ్డంకులు చెప్పి నన్ను ఆపాలని చూసేది. నేను చల్లగా



జారుకునే వాణ్ణి. వాడు అట్లా, అట్లా సన్యాసుల్లో కలుస్తాడు కాస్త జాగ్రత్త చేసుకోమని నాభార్యకు చెప్పేది. నా భార్య ఆమాటలు నాకు చెప్పేది. తల్లిమాట తృణీకరిస్తున్నానని లోపల నాకు బాధ కల్గింది. ఒకరోజు శ్రీమాష్టరుగారితో నా బాధ చెప్పకున్నాను. అప్పడు మాష్టరుగారు అన్నారు ఆధ్యాత్మిక మార్గానికి అడ్డు చెప్పేవారు తల్లిదండ్రులు, అన్నదమ్ములందరూ ప్రహ్లాదుని తండ్రి హిరణ్య కశిపుడు, విభీషణుని అన్న రావణుని వంటి వారు. వారు తల్లిదండ్రులు, అన్న దమ్ములేకాదు. మీ తల్లికి కావలసిన అన్న వస్త్రములు సమకూర్చడం వరకు మాత్రమే నీడ్యూటీ ఆ తర్వాత ఆమె మాటలు నీవు పట్టించుకోనవసరం లేదు. నీ పుణ్యం కొద్దీ లభించిన శ్రీస్వామి వారిని వదలవద్దు. నేడు, తల్లిదండ్రులు తన బిడ్డ పేకాట, త్రాగుడుకు అలవాటు పడినా బాధపడరు గాని ఒక అరగంట భజన చేశాడంటే మీతల్లి లాగా తెగ బాధపడడం సహజమే. ఆమె మాటలు నీవు లెక్కచేయవద్దు'' అని బోధ చేశారు.

శ్రీ మాష్టరుగారి మేధస్సును అంచనా వేయడం ఎవరి తరమూ కాదు. కంప్యూటర్ కంటే తొందరగా పని చేస్తుంది మాష్టరుగారి మేధస్సు ఇంతకుముందు ఆధ్యాత్మిక మార్గానికి అడ్డువచ్చే వారిని హిరణ్య కశిపుడు - రావణుడు లాంటి వారని, ప్రహ్లాదుని, విభీషణుని లాగా మనం ప్రవర్తించాలని చెప్పారు.

## మరొక్క ఉదాహరణ

అవధూత లీల గ్రంథములో మరొక మహనీయుని పేరే ఉండకూడదు అని ఒక మనిషి ఒక విప్లవం తెచ్చి, ఇక్కడి ట్రెజరర్‌ను మాష్టరు గారి దగ్గరకు పంపేరు. అవధూత లీల గ్రంధం ౨వ ముద్రణలో అలా వేయాలని, మాట్లాడటానికి వెళ్ళారు. అప్పడు మాష్టరుగారు మాటల సందర్భంలో చెపుతారు. ''శ్రీ వెంకయ్య స్వామివారిని అదే పేరుతో పిలవాలన్నావు. ఇతర పేర్లు ఉండకూడదన్నావు బాగుంది. కౌసల్య సుప్రజా రామా అని ఎక్కడ స్తోత్రం చేస్తారు? శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని గదా. మరి వెంకటేశ్వర స్వామి దగ్గర రాముణ్ణి పిలవడమేమిటి?

దేవునికి అష్టోత్తరాలు, సహస్రనామాలు చదువుతాము అన్ని పేర్లతో పిలవచ్చు. శిరిడి సాయికి హారతిస్తూ జ్ఞాన దేవుణ్ణి, తుకారాముణ్ణి స్తోత్రం చేయడమేమిటి. పాండురంగని కీర్తించడమేమిటి?'' అంటూ ఇలాంటివి కనీసం ఒక ఇరవై పైన గడ గడ అనేశారు. వాటన్నింటిని ఈ ట్రెజరర్ గారు నాకు చెప్పలేక మాష్టరుగారి మేధస్సును మెచ్చుకున్నారు.

## అన్నదాత

మన ఇండ్లలో ఎప్పుడో ఒకరిద్దరు చుట్టాలో, స్నేహితులో వస్తేనే, వెళ్ళేప్పుడు వెళ్తారో అని చూస్తాము. కానీ మాష్టరు గారికి నిత్యం అతిధులుండేవారు. విద్యానగర్‌లో ఉండగా తన దర్శనార్ధం వచ్చిన వారికే కాక నిత్యం కొంతమంది విద్యార్థులు మరియు చదువు చాలించిన కుర్రాళ్ళకు మెస్‌లో తన లెక్కలో భోజనం పెట్టించేవారు. ఆ తర్వాత కొన్నాళ్ళకు టి.డి. కృష్ణమూర్తి గారు అనే భక్తుని ఇంట్లో ఎంతో ప్రేమతో వచ్చిన వారందరికీ సంతృప్తిగా భోజనం పెట్టించే వారు. వారేమి ఇస్తారో వీరేమి తీసుకుంటారో సాయికే తెలియాలి. కానీ ఏ హోటలులో గాని ఇంట్లో గాని వారి లాగా భోజనం పెట్టరు.

తర్వాత ఒంగోలు చేరారు. అమ్మగారు మంచం పట్టారు. ఆర్థిక ఇబ్బంది కల్గింది. కనుక హోటలు, మెస్‌లు వదిలేసి తన దర్శనార్థం వారినందరిని తనతో భోజనానికి ఆహ్వానించేవారు. మాష్టరు గారి ఆర్థిక పరిస్థితి తెలిసిన వారు హోటలు కెళ్ళేవారు. తెలియని వారు ప్రసాదం దొరుకుతుందని మాష్టరుగారితో భోజనానికి వెళ్ళేవారు. మాష్టరుగారితో ఎందరు భోజనానికి వస్తారో తెలియదు కనుక ఎంత సమయమైనా ఇంట్లో ఆడవాళ్ళంతా భోంచేయకుండా అలాగే ఉండిపోయేవారు. మాష్టరుగారు, భక్తులు భోజనం చేసి పోతే ఆడవాళ్ళు వండుకొని తినేవారు. ఇలా నిత్యం అన్న సంతర్పణ సాగించాలంటే ఎంతటి లక్షాధికారికైనా సాధ్యమేనా? అది ఒక్క మాష్టరుగారికే సాధ్యమైంది.

## విహారము

ప్రస్తుతం చాలా గొప్పవారుగా చలామణి అయ్యేవారికి శ్రీమాష్టరుగారు ఒకరోజు ఒక సలహా ఇచ్చారు. ఇది మనందరికీ తెలిసియుండవలసిన విషయం.

''నీవెప్పడూ నిర్విరామంగా పని చేస్తుండాలి. రోజుకు 24 గం.. లలో నిద్రకు 5 గం.. చాలు. మిగిలిన 19 గం.. కాలంలో ఏదో ఒక పనిలో శ్రద్ధతో నిమగ్నమవ్వాలి. నీ వయసు 25 సం.. కన్న తక్కువే కనుక శరీర అవసరాల కంటే ఎక్కువగా తినడం జరుగుతుంది. అంత తినేటట్లు శరీరమే మనల్ని బలవంతం చేస్తుంది. కనుక 1) పారతో పనిచేయడం 2) నీళ్ళ చేది తెచ్చిపోయడం 3) నిర్విరామంగా నడవడం 4) శ్రీస్వామి వారి సమాధికి ప్రదక్షిణలు చేయడం వంటి ఏదో ఒక పనిలో నిమగ్నమవ్వాలి. శరీర అవసరాల కంటే అధికంగా తిన్న ఆహారం నుండి శక్తి విడుదల అవుతుంది.



ఈ శక్తి ఇలాంటి పనుల ద్వారా ఖర్చుకాకుంటే, ఆశక్తి చెడు ఆలోచనల ద్వారా బయటికి పోవడానికి ప్రయత్నిస్తుంది. సాధకునికి అలాంటి ఆలోచనలు అనర్థం. కనుకనే స్వామివారు మనుషుల్లోకి పోవద్దన్నారు. జనంతో కలవడమే కాక వారిని గూర్చిన తలంపులు కూడా మనసులోకి రాకూడదు. శ్రద్ధా భక్తులతో నామం చెపుతూ, పనిచేస్తూ ఈ పని స్వామివారి ఆదేశానుసారం చేస్తున్నామని తలంచాలి. అందుకే శ్రీ స్వామి వారు నిర్విరామంగా అడవులలో నడవడం, పెన్నకు కట్టలు వేయడం లాంటి పనులు చేశారు. సాయి పూల తోటను పెంచి నీరు పోసేవారు. పగటి నిద్ర సాధనకు పనికి రాదు. ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. మన శరీర తత్వానికి పనికి వచ్చే ఆహారమే తీసుకోవాలి. అది రుచిగా ఉందని ఎక్కువ తినరాదు. అందుకే గతంలో యుక్తాహార విహారస్య అన్నారు. విహార మంటే మనం చేసే పని అని అర్థం'' – అని ముగించారు. మాస్టారు గారు

## ఆచరణ ద్వారా బోధ

అనేక మంది తల్లిదండ్రులుతమ బిడ్డలు చెడు సహవాసాలు చేసి చెడిపోయారని కొందరు, జులాయిగా తిరుగుతున్నారని, పట్టుమని పదినిముషాలైనా కూర్చొని చదవరని కొందరు, పాఠం వింటే చక్కగా వ్రాయగలరు కానీ, క్లాసులకే పోరని కొందరూ వాపోవడం చూస్తునే ఉన్నాము. భక్తి అనే ముసుగులో వీరు తమ విద్యుక్తధర్మ నిర్వహణలో ఎంత లోపం చేశారో గ్రహించడం లేదు. ఒకటవ తరగతి నుండి బడికి పంపడం తప్ప బడికి పోతున్నాడా లేదా, చదువుతున్నాడా లేదా, చెడు సహవాసాలు చేస్తున్నాడా, తెలీదు. ఇంటిలో నిత్యం కొంతసేపు చదివించాలి అనే ఆలోచనే లేకుండా బిడ్డలను పెంచి, పదవ క్లాసు ఫెయిల్ అయినాక కొందరు ఇంటర్‌లో ఎక్కడో చేర్చి, తన బిడ్డ కాలేజీకే పోలేదని లెక్చరర్స్ చెబుతున్నారని వాపోయే వాళ్ళందరికీ మాష్టరుగారి ఆచరణే గొప్ప బోధ.

పిల్లలను కని మంచి పౌరులుగా తీర్చిదిద్ది సంఘానికి మేలుచేసే వారుగా తయారు చేసే ఆశయము కంటే గొప్ప భక్తి ఏముంది. అదే శ్రీ భరద్వాజ గారి తండ్రియైన అనంతాచార్యులుగారు తన బిడ్డల విషయంలో చేసి చూపించారు. దానినే మాష్టరుగారు ద్వారక, వేదవతి ల విషయంలో పాటించారు. అక్షరాల దగ్గరుండి ఇంట్లోనే నేర్పారు. ఆయనకు తీరిక ఉండే చేశారా? ఒక ప్రక్క ప్రూపులు దిద్దడం, రెండవ ప్రక్క ఊపిరి సలపని విజిటర్స్, మూడవ ప్రక్క పర్యటనలు, నాల్గవ ప్రక్క పిల్లల చదువులు, ఐదవ ప్రక్క అమ్మగారి ఆరోగ్యము, ఆరవ ప్రక్క పుస్తక మరియు సాయిబాబా

పత్రిక రచనా వ్యాసాంగము. ఇన్ని వత్తిళ్ళలోను పిల్లల చదువు క్రమశిక్షణల యందు ఎంతశ్రద్ధ వహించేవారో. వందమంది విజిటర్స్ కూర్చొని ఉన్నా ఒక ప్రక్క పిల్లల చదువు - ఏమి ఆలెక్క చేశావా లేదా ! ఆ పాఠం వచ్చిందా ! అంటారు. ద్వారకా ఆ పాఠం వచ్చిందా లెక్కల అభ్యాసం పూర్తి చేశావా. తెలియని లెక్కలు అడుగు అంటారు. ఆడుకునే టైంలో వదిలేస్తారు. మిగతా టైంలో తప్పక కూర్చొని చదవాలి. అలా నిత్యం కనిపెడితే బిడ్డలు చెడే ప్రశ్నేలేదు.

ఆరు సంవత్సరాలు, నాలుగు సంవత్సరాల వయసు నుండే ఈపాఠం పూర్తిచేస్తే నీతో కేరంస్ ఆడుతానని, ఈ అభ్యాసం పూర్తిచేస్తే లెక్కలన్ని కరెక్టుగా చేస్తే ఫలానా సినిమాకు తీసుకువెళ్తాననో చెప్పేవారు. ఒక్క దెబ్బ కొట్టకుండా కండ్ల బెదిరింపుతోను, ఆటలతోను, సినిమా చూపిస్తాను అనే ఆశతోను వారిని కృషిచేసి గంటల తరబడి కూర్చోబెట్టే అలవాటు చేశారు. ఇక వాళ్ళు క్లాసుకు ఫస్ట్, సెకండ్ ర్యాంకులు రాకుండా ఎలా ఉంటారు. వేసవి సెలవుల్లో కూడా పిల్లలను వదిలే ప్రశక్తేలేదు. ఢిల్లీనుండి సెంట్రల్ సిలబస్ ప్రకారం పుస్తకాలు తెప్పించి అవన్నీ సెలవుల్లో పూర్తి చేయించేవారు. స్కూలు ఫస్టు వస్తే నీకు ఫలానా కొనిస్తానని ముందుగా చెప్పి, అలా వస్తే తప్పక తన మాట నిలబెట్టుకునేవారు.

కొంచెం పెద్దయ్యాక టి.వి. చూడాలని ప్రక్క ఇండ్లకు పోతుంటే టీ.వి. తెచ్చి ఇంట్లోపెట్టి చూడతగ్గ ప్రోగ్రాములే చూపించేవారు. పౌరాణిక సినిమాలు వస్తుంటే వాటిని గురించి చెపుతూ చూపించేవారు. టి.వి. ప్రోగ్రాంలో సినిమా అయిపోయాక ఆ సినిమాను గురించి ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టేవారు. సరిగ్గా సమాధానం చెప్పలేకపోతే తానే చెప్పేవారు. మరలా టి.వి. లో సినిమా వస్తుందంటే ముందుగానే జాగ్రత్తగా గమనించండి. నేను మరలా ప్రశ్నలు అడుగుతాను. వేదవతి బాగా చెప్తుందో, ద్వారక చెబుతాడో చూస్తాను అనేవారు. ఎన్నడూ సినిమాహాల్ వైపే వెళ్ళని మాష్టరు గారు పిల్లల కొరకు ఫిక్షన్ ఉండే సినిమాలు చూస్తూ పిల్లలకు చూపించి వారికి తెలియని వాటిని వివరించేవారు. వారి కొరకు సముద్ర స్నానంకు వెళ్ళేవారు. చిన్న పిల్లలప్పుడు తగు శ్రద్ధ వహిస్తే పెద్ద వాళ్ళయినాక చెడు సహవాసాలు చేయరు.

ఉచ్చులూరి వారి పాలెం శేషాద్రిగారు చెబుతున్నారు ''నేను బి.ఎ. పాసయ్యాక మాష్టరుగారు నన్ను వ్యవసాయం చూసుకోవడం మంచి వృత్తి. ఒకరికి లొంగి ఉండనక్కర లేదు. ఉద్యోగరీత్యా వచ్చే బానిసత్వం ఉండదు. మన శ్రమతో అనేక వేల జీవుల రూపంలో ఉండే పరమాత్మను



సంతృప్తి పరచ గల్గుతాము. స్వేచ్ఛా జీవనం అని వ్యవసాయాన్నే చూసుకోమన్నట్లు చెప్పేవారు. నేను అందులో స్థిరమైపోయాను. నా భవిష్యత్తు అంతా తెలిసే వారు అలా చెప్పారేమో అని అనుకున్నారు.

మాష్టరుగారు ఒకరోజు చినిగిన చొక్కా వేసుకొని కాలేజికి వచ్చారు. ముందు వరుసలోని అమ్మాయిలు ఆవిషయం గురించి గుసగుసలాడు కొనుచున్నారు. వాళ్ళలో ఒక అమ్మాయి పాపం మాష్టరుగారికి రెండే చొక్కాలు ఉన్నాయి కాబోలు అని అంది. వాళ్ళ మాటలు మాష్టరుగారికి వినిపించే ప్రశక్తే లేదు. కాని మాష్టరుగారు వెంటనే పాఠం ఆపి ''నాకెన్ని చొక్కాలున్నాయో అనే విషయం మాచాకలికి బాగా తెలిసి ఉంటుంది.'' అని అన్నారు. అమ్మాయిలందరూ ఆశ్చర్యంతో స్థబ్దులయ్యారు.

మాష్టరుగారికి ఎవరెన్ని బట్టలు పెట్టినా ఆ విషయం మాష్టరుగారు, వచ్చిన వాళ్ళందరికీ ఈ చొక్కా ఫలానా వాళ్ళు ఇచ్చారు అని చెబుతూ, ఆ బట్టలు చూపేవారు. అలా చెప్పడం వారికెంత సంతోషంగా ఉండేదో.

శ్రీమాష్టరుగారు విద్యానగర్‌లో కాలేజీ విద్యార్థులలో తాను ఒక విద్యార్థిగానే ఉండేవారు. నవ్వుతూ నవ్విస్తూ ఉండేవారు. వారికుండే గౌరవం, మర్యాద, హుందాతనం వారి కిచ్చేవారు విద్యార్థులు.

పరీక్షల టైంలో మాష్టరుగారికి నమస్కరించుకొని, వారి ఆశ్శీస్సులు తీసుకొని పరీక్షకు వెళ్ళాలనే నమ్మకంతో కొందరు విద్యార్థులు శ్రీమాష్టరుగారిని దర్శించుకునేవారు. ప్రసాదం రెడీగా పెట్టుకొని వారు రాగానే విభూతి ప్రసాద మిచ్చి ''విష్‌యు బెస్ట్ ఆఫ్ లక్'' అని చెప్పి పంపేవారు. అందరు లెక్చరర్ల వలె బెట్టుగా ఉండకుండా పరీక్షల టైంలో గేటు దగ్గర నిల్చొని అందరికీ బెస్ట్ ఆఫ్ లక్ అని చెబుతూ చేయి ఆడిస్తుండేవారు. తన సొంత బిడ్డలను పరీక్షకు పంపే తండ్రి వలె కనిపించేవారు. శ్రీమాష్టరుగారితో పరిచయమున్న విద్యార్థులందరికీ వారి తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు కంటే మాష్టరుగారంటేనే ఎక్కువ ప్రీతిగా ఉండేవారు.

వచ్చిన విజిటర్స్‌కు వెంటనే మనం కనబడరాదు. అలా కనబడి మాట్లాడుతుంటే మనం అందరి దృష్టిలో చాలా చులకనైపోతాము. కాబట్టి దర్శనవేళలుండాలి. అర్జంటుగా పోవాలంటే చీటీ లేక విజిటింగ్ కార్డు పంపితే మనం రమ్మంటేనే వాళ్ళు రావాలి. ఆవిధముగా మీరు కూడా చేయమని ఒక సన్నిహితుడు ఒక సారి కాదు కొన్నివందల సార్లు చెప్పినా కాని శ్రీమాష్టరుగారు ఆ సలహాను సుతరాము అంగీకరించలేదు. విశ్వగురుడైన శ్రీసాయినాధుడే ''నా దర్బారు అన్ని వేళలా తెరిచే

ఉంటుంది.'' అన్నప్పడు, వారిసేవకులమైన మనమెలా వ్యవహరించాలి? మనం చులకనైపోవడమేమిటి? మనం ఎవరికంటే గొప్ప. చివరకు చెట్లు కూడ ఇతరులకు సహాయం చేస్తున్నాయి. మనం వాటికి సరిరాగలమా? శ్రీసాయికే లేని ఆ కార్డులు మనకెందుకు అని వారితో విభేదించారు. రాత్రి వేళైనా దర్శనం కావాలంటే వెంటనే లభించేది. మొదటి రూంలో ఉన్న పిల్లలు, ఇప్పడు మాష్టరుగారు నిద్రపోతున్నారు లేపకూడదని చెప్పేవారు. వెళ్ళినవారు వారితో మాట్లాడుతుంటే ఆగొంతువిని మాష్టరుగారు వెంటనే తలుపుతీసి మాట్లాడేవారు.

విజిటింగ్ కార్డులు కోరే నకిలీ సాధువులందరికీ శ్రీమాష్టరుగారి ఆచరణ గొప్ప గుణపాఠమవుతుంది.

**సాయికృప ఉందని - మన ప్రయత్నాలు మానరాదు.**

అనేక కారణాల వల్ల విద్యానగర్ కాలేజీ వాళ్ళు మాష్టరుగారిని వారి సెలవులు అయిపోయినాక కాలేజీలో చేర్చుకోలేదు. సాయిబాబా ప్రచారమైనా మానుకో లేదా మాకాలేజీలో ఉద్యోగమన్నా మానుకోమని నాముందే చెప్పారు. తన తప్పేమిటో తెలుపకుండానే కాలేజీలో చేర్చుకోక పోవడం అధర్మం. కనుక సాయి చేస్తేనే అవుతుందని ఊరకుండలేదు. డైరెక్టర్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌కు తన విషయం విన్నవించారు. వాళ్ళు వెంకటేశ్వరా యూనివర్శిటీలోని ఇద్దరు ప్రొఫెసర్లను, నెల్లూరు జిల్లా విద్యాశాఖాధికారిని కమిటీగా వేసి ఓపెన్ ఎంక్వయిరీ పెట్టారు.

ఓపెన్ ఎంక్వయిరీలో కొన్నిగంటలలోనే ఈ కేసు పూర్వాపరాలన్నీ క్షుణ్ణంగా చర్చించబడడం వీలుకాదు. ఆకమిటీ వాళ్ళు మరొక వాయిదా వేసుకోరని - కాలేజీ మేనేజ్‌మెంటు వారు పెట్టబోయే అభియోగాలు వాటికి సమాధానాలు సుమారు డెబ్బై పేజీల విషయం టైపుచేయించి దానిని జెరాక్స్ తీసి ఇద్దరు ప్రొఫెసర్లకు, విద్యాశాఖాధికారికి సాద్వారానే పంపారు. ముందుగా చదువుకుంటే కేసు క్షుణ్ణంగా అర్థమవుతుందని, ఈ ప్రయత్నానికి బోలెడంత శ్రమ మాత్రమే కాక వెయ్యి రాపాయలకు పైనే ఖర్చు. చివరకు ఓపెన్ ఎంక్వయిరీలో వాళ్ళవాదం ఓడిపోయి శ్రీమాష్టరుగారిని కాలేజీలో చేర్చుకున్నారు. సాయి అండ ఉందనీ ప్రయత్నాలు మానే వాళ్ళందరికీ ఈవిషయం చక్కని గుణపాఠం అవుతుంది.

తన ఉద్యోగ విషయంలో సాయిపై భారంవేసి తాను ఏప్రయత్నమూ చేయకుండా కూర్చోలేదు. తాను తన ప్రయత్నము ఎందుకు చేస్తున్నారో ఒక చక్కని రియల్ సన్నివేశం ద్వారా విశదీకరించారు.



''ఏదో టౌన్ పేరు చెప్పారు. మరచిపోయాను. ఆ టౌన్‌లో పీఠాధిపతుల పెద్ద మఠం ఉందట. అందులో ఆ మఠాన్ని కనిపెట్టుకొని ఉండే బ్రాహ్మణుని మెత్తదనం అలుసుగా తీసుకొని చుట్టుప్రక్కల ఇండ్లవారు దౌర్జన్యముగా చాల వరకు ఖాళీ స్థలం ఆక్రమించుకొని చివరకు ఆ బ్రాహ్మణుని అక్కడనుండి ఖాళీ చేసి వెళ్ళిపొమ్మన్నారట. భగవంతుడు రక్షిస్తాడని ఇన్నాళ్ళు ఉపేక్షించాడు. చివరకు తనను అక్కడనుండి వెళ్ళిపొమ్మన్నారు. ప్రాణాపాయ పరిస్థితి. చేసేది లేక పెద్ద పీఠానికి తన దుస్థితి విన్నవించారట. అక్కడున్న పీఠాధిపతి ఆ బ్రాహ్మణుని కోర్టులో కేసు వెయ్యి, ఆర్థిక సహాయం చేస్తామన్నారట. ఇక వీలులేక కోర్టుకే వేశాడట. అక్కడ న్యాయస్థానంవారు విచారించి ఆ బ్రాహ్మణుని కేసు గెలిచినట్లు తీర్పు చెప్పారు. ఆ బ్రాహ్మణుడు స్థిరంగా ఆస్థలంలో ఉండి పోయాడు. కనుక భగవంతుని దయ మనకున్నా కాని, మన కృషిలోపం ఉండకుండా అన్ని ప్రయత్నాలు క్షుణ్ణంగా చేసి తీరవలసిందే. అలా చేయకుండా భగవంతుడు అన్యాయం చేసాడని అనడం చాలా అపచారం. మనకు అన్యాయం చేసేందుకే భగవంతుడు ఉన్నాడా? కనుక మన కృషి మనం చేసి తీరాలి'' అని తన కేసు హయ్యర్ ఎడ్యుకేషన్ వారికి పంపడంలోని అంతరార్థం వివరించారు మాష్టారుగారు.

ఆధ్యాత్మిక బాటలో రాగద్వేషాలు జయించు అనిచెప్పడం అందరికీ తెలిసిందే. రాగం ఉన్నప్పడే ద్వేషం కూడా వస్తుంది. రాగం లేనప్పడు ద్వేషమే ఉండదు. రాగద్వేషాలు లేని హృదయంలో సాటి జీవులపై నిరవధికమైన ప్రేమ మాత్రమే ఉంటుంది. అలాంటి ప్రేమ మూర్తే శ్రీమాష్టారుగారు. అంతకుముందు నాలుగు రోజులు లాడ్జిలో ఉండేవాళ్ళము. మేము ఒంగోలు వచ్చేరోజు ఉదయాన్నే 5 ½ గంటలకే ఒకరు ఆటోతెచ్చి మమ్ములను లగేజితో సహా వాళ్ళఇంటికి తీసుకువెళ్ళారు. నన్నుమాత్రం వాళ్ళింట్లో ఒక రూంలో ఉండమని శ్రీమాష్టారుతో ఏకాంతంగా మాట్లాడుతున్నారు. ఉదయం 8 గంటలు అయినా వాళ్ళింట్లో వాళ్ళు ఒక్కరూ నాకు కన్పించలేదు. 9 గంటల ట్రైయిన్‌కు మేమువెళ్ళాలి. నేను వాళ్ళ టిఫిన్ తినను కనుక మిల్క్ బ్రెడ్ తినేశాను. 8 ½ గంటలకు వాళ్ళ అబ్బాయి ఆటో తెచ్చి ఎక్కమన్నారు. ఎక్కి స్టేషనుకు వెళ్ళేసరికి రైలు కదలబోతుంది టిక్కెట్లు కొని ఎక్కాము. రైలు కదిలింది.

అది ఎక్స్‌ప్రెస్ రైలు. చాలా స్పీడుగా పోతుంది. ఎక్కడా ఆగడం లేదు. 10 ½ గంటల టైంలో ''సుబ్బరామయ్యా ఈ వచ్చేస్టేషన్‌లో రైలు 2 నిముషాలు ఆగుతుంది. ఫ్లాట్‌ఫారం మీద రెండు ఇడ్లీలు ఉంటే తీసుకురా.

నీవు ఇడ్లీ కోసం అటూ ఇటూ చూస్తుంటే రైలు వెళ్ళిపోతుంది. ౨ నిముషాలకంటే ఎక్కువ ఆగదన్నారు. వారికెంత ఆకలిగా ఉందో రెండు ఇడ్లీలు తెమ్మన్నారు. అయ్యో ''ఈ మహానుభవుడెవరో మాస్టరు గారికి టిఫిన్, కాఫీ కూడా పెట్టకుండానే రైలెక్కించారే'' అనుకున్నాను. చల్లగా ఉన్న ఎండిపోయిన ఇడ్లీలు తెచ్చి వారి చేతిలో పెట్టి ''సార్ మీరు టిఫిన్ చేయలేదా'' అన్నాను. ''పాపం ! వాళ్ళ బాధలు చెప్పకోవడంతో సరిపోయింది''. అని ఒక్కమాట అన్నారే గాని ఆవ్యక్తిని పల్లెత్తుమాట అనలేదు. పైగా పాపం వాళ్ళ బాధలు అని వారి ఎడల సానుభూతి చూపారు. అదే ఇంకొకరైతే ఆయన్ని ఎన్ని దూషించి ఉందురో. అదే మాస్టారి నుండి మనం నేర్చుకోవలసిన ప్రేమ తత్వం.

## సిద్ధ్యే సిద్ధ్యో సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే

''నీవుకోరింది లభించినా లభించకున్నా మానసికంగా సమభావంతో ఉండగల్గడమే యోగమని'' చెప్పారు మాస్టారు గారు. యోగులు అలా ఉండగలరు గాని మనం అలా ఉండలేము అనడం తగదు. ముందు యోగం సిద్ధించి తర్వాత మానసిక సమత్వం రావడం ఉండదు. మానసిక సమత్వం సాధిస్తే యోగం సాధించ బడినట్లే. ఎంతో ప్రయత్నంలో అలాంటి మానసిక సమత్వం సాధించి మనకు ఆచరించి చూపారు ఆచార్యుల వారు. చిన్న విషయంలోలైనా పెద్ద విషయంలోనైనా ఈ సూత్రం అనుక్షణం గుర్తించి సాధకులు ఆచరించి తీరాలి. సర్వానికి యాజమాని భగవంతుడే వారి ఆజ్ఞలేక ఆకైనా కదలదు. మనం దేనికొరకైనా చేసే ప్రయత్నం ద్వారా మన ఖర్మ క్షాళనమవుతుంది. ఆపని నెరవేరడమా లేదా అనేది మన ప్రాప్తాన్ని బట్టి ఉంటుంది. అన్ని పరిస్థితులలోనూ మానసికంగా శాంతిని పోగట్టుకోకుండా ఉండగల్గడమే నిజమైన సబూరి. వారు ఆచరించి చూపి మనలను ఆచరించమంటున్నారు.

ఉదా :- కలిచేడు శ్రీరామాలయం దగ్గర మాస్టారు గారి ఉపన్యాసం పెట్టించాము. వేదికకు బదులు ఒక ట్రాక్టరు ఉపయోగించి మైక్ పెట్టి ఉపన్యసించమన్నాము. తీవ్రమైన చలి, మంచు కాలము ఐదుగురే శ్రోతలు ఉన్నారు. పైన విపరీతమైన మంచు, తొణుకు బెణుకు లేకుండా క్షుణ్ణంగా ఆ ఐదుగురికీ మైక్‌లో చెప్పి దిగారు. ఏమయ్యా ఐదుగురి కొరకు నన్ను తీసుకు రావాలా'' అని ఒక్క మాటైనా అన్నారా ? ఏమీ లేదు. మామూలుగానే ఉన్నారు. అన్నింటికి సాయియే అధికారి. సాయి ఇష్టం అలా ఉంది. అలా జరిగిందని సంతోషంగానే ఉండిపోయారు. అదే నేనైతే ఆర్గనైజర్లను చెడామడా తిట్టేసి వారికి అశాంతి కల్గించి నేను అశాంతి



కల్గించి నేను అశాంతికి గురిఅయి ఉందును.

కలిచేడు హైస్కూలులో ఒకసారి శ్రీ మాస్టారు గారి ఉపన్యాసం పెట్టాము. హైస్కూలు టీచర్లు రెండు వర్గాల వారు ఉన్నారు. ఒక వర్గం ఆస్థికులు, ౨వ వర్గం నాస్థికులు. హైడ్మాష్టర్ గారు నాస్థికుడు, లోతు మనిషి. అవతల వారిని చిత్తు చేయడంలో మేధావి. కానీ తనకంటే మేధావి దైవమని తెలియదు. ఉపాధ్యాయులు మాట కాదనలేక శ్రీ మాస్టారు గారు ఉపన్యాసానికి అంగీకరించారు. గాని అంతరంగంలో అయిష్టతే, సరిగ్గా మాష్టరు గారి ఉపన్యాసం రోజు అదే సమయములో స్కాలర్ షిప్‌లు ఇస్తున్నామని అందరు విద్యార్థులు తల్లిదండ్రులను పిలిపించారు. ఎక్కువ మంది ఉపాధ్యాయులను ఆ పనిలో ఉపయోగించుకున్నారు. ౫౦౦ మంది విద్యార్థులకు ౫౦ మంది మాత్రమే ఉపన్యాసానికి హాజరయ్యారు. ఇంతేనా శ్రోతలు అని ఒక్కమాట అని ఎరుగరు. ఉపన్యాసం అయ్యాక ఆటస్థలంలో గడ్డిమీద కూర్చున్నారు. దారిన పోయే పెద్దలంతా ప్రొగై మైక్ లేకుండానే అక్కడొక ఉపన్యాసం జరిగింది. ఏమి సుబ్బరామయ్యా ఇలా చేశావే అని నన్ను ఒక్కమాట అని ఎరుగరు. అంతా సాయి సంకల్పమని ఎవ్వరినీ ఏమీ తప్ప పట్టలేదు.

ఒకసారి మరలా శ్రీరామ మందిరంలో మీటింగు పెట్టాము. ఇంతకు ముందు జరిగిన అనుభవాల దృష్ట్యా ఇంకొకరైతే మరలా ఉపన్యాసానికి అంగీకరించరు. కానీ మాష్టరుగారు తేదీ చెప్పారు, కర పత్రాలు పంచేము. ఆగ్రామంలోని మాస్కూలు టీచరు ఒక నాస్థికుడు ''దేవుడున్నాడని నిరూపిస్తే లక్షరూపాయలు ఇస్తాను'' అని అట్టల మీద పెద్ద అక్షరాలతో వ్రాసి అన్ని అంగళ్ళు, బంకుల దగ్గర వ్రేలాడదీశారు. మీటింగు రోజు ఉపన్యాసం తర్వాత మైకులో ఎన్ని సార్లు పిలిచినా రాలేదు. పాత విద్యార్థులు కొందరు ఆవ్యక్తి ఫలానా సార్. సిగ్గులేనివాడు ఇకరాడు. మనం పోదామన్నారు. మనం వాళ్ళ ఇంటికి వెళ్ళి మాట్లాడుదామన్నారు. అరవై మందికి పైగా యువకులు మాష్టారిని వాళ్ళింటికి తీసుకు వెళ్ళారు. రాత్రి ౯గంటలకే నిద్రపోతున్నాడు. లేపకూడదు అది సభ్యత కాదన్నాడు గేటులో నిల్చొన్న ఆ టీచర్ తమ్ముడు. ''దేవుడు లేడని బోర్డులు పెట్టి, మాట్లాడుతామని వస్తే రాత్రి ౯ గంటలకు నిద్రపోవడమేనా సభ్యత'' అని మాత్రం అని వెనక్కు వచ్చేశారు మాష్టారుగారు. యువకులు ఇంట్లోకి వెళ్ళి బలవంతంగానైనా బయటకు తీసుకురావాలని ప్రయత్నిస్తే, వారి ప్రయత్నాలు మాష్టరుగారు సాగనివ్వలేదు. తరువాత ఆ టీచర్, అతని తమ్ముడు కొన్ని లక్షలు ప్రజాధనం తిని జైలుపాలయ్యారు. యోగమంటే ఏమిటో మాష్టారి ఆచరణే మనకు పాఠం.

## అహంకారపు అడ్డుగోడలు

ఒకరు శ్రీమాష్టరుగారినుండి చెప్పలేనంత, వ్రాయలేనంత మేలుపొందిన వ్యక్తి. ఈ వ్యక్తియెుక్క వృత్తి నైపుణ్యం పెంచేందుకు మాష్టరుగారు తన అమూల్యమైన కాలాన్ని ఎంత వెచ్చించారో చెప్పలేము. అనామకంగా వీధులలో తిరిగే వ్యక్తిని సంఘంలో గుర్తింపుగల గౌరవస్థానానికి ఎక్కించింది మాష్టరుగారే. ఆ విషయం మన కంటే ఆవ్యక్తికే బాగా తెలుస్తుంది. నిత్యం కనీసం హరతులు తర్వాత మాష్టారి పాదాలు తాకి నమస్కరిస్తుంటాడు. శ్రీమాష్టరుగారు తనకు నమస్కారం చేయమని అడిగారా? లేదు. ఇతరులతో మాట్లాడేటప్పుడూ మాష్టరు గారిని మాగురువుగారు అని చేప్పేవారు. అలాంటి వ్యక్తి ఈ అహంకారపు అడ్డుగోడల వలన చివరకు దూరమయ్యాడు. ఎవరికి? తన గురువుగారికి ఋణానుబంధం తీరి దూరమవ్వచ్చు. కానీ ప్రక్కనే ఉండి పలక్కుండా మానేసి తన గురువుగారిపై దుష్ప్రచారం చేయడమంటే అది కేవలం అహంకారపు అడ్డుగోడల ఫలితమే. అందుకే మాష్టరుగారు చెప్పేవారు - ఎవ్వరికీ తల తాకట్టు పెట్టవద్దు. పూచిక పుల్లనైనా గురువుగా పెట్టుకో నిన్ను గమ్యం చేరుస్తుంది. '' అన్నారు బాబా. దానికి ఉదాహరణే ఏకలవ్యుడు. పై వ్యక్తి అహంకారపు అడ్డుగోడల వలన ఒకరోజు అన్న మాటకు మాష్టరుగారు మానవాళికే ఒక గొప్ప సందేశ మిచ్చి ఎన్నో పాఠాలు ఒక్క వాక్యంలో బోధించారు.

ఒకరోజు పైవ్యక్తి విద్యానగర్ నుండి ఒంగోలు పోతున్నాడు. అపుడు మాష్టరుగారు విద్యానగర్ లోనే కాపురమున్నారు. నెల్లూరులో ఉండే పుస్తకాల కట్టను (సాయి చరిత్రలు) ఒంగోలులో ఒక అడ్రస్‌కు చేర్చమని చెప్పి పంపారు. తన గురువుగారు ఆదేశించిన పనిని ఎంతో భక్తి శ్రద్ధలతో చేయడం పోయి ఆవ్యక్తి ''ఈ బరువులు నేను తీసుకు పోలేనయ్యా'' అని కాస్త చీదరించుకున్నట్లు కష్టంగా అన్నాడు. ఆమధ్యవర్తి ఆవార్తను యధాతధంగా అలాగే చీదరింపు భావంతో అతను ఇలా అన్నాడని మాష్టారికి చెప్పారు. వెంటనే మాష్టరుగారు ఒకే ఒక వాక్యమని ఊరుకున్నారు. ''నేనైతే రెండు గాడిదల బరువు మోసుకుపోయి ఉందును'' అని చెప్పి ఆ తర్వాత ఒక్కమాట కూడా అనలేదు. ఆవ్యక్తితో కూడా ఆ ప్రస్తావనే తెచ్చినట్లు లేదు. ఆ తర్వాత కూడా ఆవ్యక్తి మాష్టరు గారితో చాలా సంవత్సరాలు శిష్యుడు గానే పాదాభివందనాలు చేస్తుండేవాడు. తాను మాష్టరుగారితో పలక్కుండా ఉన్నంత వరకు అలా మంచిగానే ఉండి పెద్ద లక్షాధికారి అయ్యాడు.



తన గురువుగారని ఇతరులకు చెబుతున్నాడు నోటితో కానీ, అచరణలో కానీ తాను శిష్యుడుగా ఉన్నాడా? అందుకే మాష్టరుగారు ''నాగురువు గారి ఆదేశమైతే నేను రెండు గాడిదల బరువైనా సంతోషంగా మోసేవాడిని'' అని అన్నారు. తల తాకట్టు పెట్టినాక ఇక ఏపని చేసేందుకైనా వెనుకాడరాదు. బ్రహ్మంగారి చరిత్రలో చచ్చిన కుక్క డొక్కలోని నీరు త్రాగమంటే సిద్ధయ్యగారు ఒక్కరే త్రాగి శ్రీబ్రహ్మంగారి హృదయంలో కూర్చున్నాడు. శ్రీ గురుచరిత్రలో వీలుకాని వస్తువులు, ప్రకృతిలో ఎక్కడా లభించని వస్తువులు కోరాడు. తన గురువు - నీటికి తడవని పావుకోళ్ళు, ఎవరికైనా సరిపోయే జాకెట్టు లాంటివి. గురువుగారే కాక గురువు గారి కుటుంబ సభ్యులంతా కోరినప్పడు ఆ శిష్యుడు తన బుద్ధితో యోచించాడా, గురువుగారి దయ ఉంటే దొరుకుతాయని బయలుదేరాడే కానీ, ఆజ్ఞాపించిన గురువు గారిని అపహాస్యం చేయలేదు. కనుకనే సాధించగలిగాడు. సాధించిందితన ప్రతాపం వల్లకాదు, గురు కృపవల్ల మాత్రమే. అలాంటి గురుకృప ఎందువల్ల పొందాడు. అహంకారపు అడ్డుగోడలు లేకపోవడం వల్ల సాధించాడు.

ఆవ్యక్తి పుస్తకాల కట్ట తీసుకుపోకుండా నిరాకరించేందుకు అతని అహంకారం ఏవిధంగా అడ్డుపడింది? ఈ కట్టను ఒంగోలు చేర్చాలంటే బస్సులో గూడూరు బస్సు స్టేషన్ నుండి రైలు స్టేషనుకు రిక్షాలో పోవాలి. ఆకట్ట రిక్షావాడొక్కడే రిక్షాలో పెట్టుకోకపోతే తానూ ఒక ప్రక్క పట్టాలి. అలాగే దించేటప్పడు తానే దించుకోవాలి. కూలి నెత్తికెత్తితే రైలు స్టేషన్ బయట పడేస్తాడు. మరలా రిక్షావాని బెడద ఎక్కేటప్పడూ దిగేటప్పడూ తప్పదు. ఆ అడ్రస్ వారి ఇంట్లో పెట్టాలి కదా. రిక్షావాడు ఒక్కడే పట్టలేకుంటే తానూ పట్టాలి. ఆపుస్తకాల మూట పట్టేందుకు తనకు హోదా అడ్డు వచ్చింది. హోదా అనే తన గర్వం హోదాను జాగ్రత్తగా చూచుకుంటూ గురువు గారి మాట గురువు వదిలేశాడు. గురువు అని తల తాకట్టుపెట్టమని మాష్టరుగారు అతనిని ప్రాధేయపడ్డాడా? అహంకారపు అడ్డుతెర తొలగించుకోకుండా ఎన్ని పాదాభివందనాలు చేస్తే, ఎన్ని హారతులు పాడితే ప్రయోజనమేముంటుంది. పుస్తకాల కట్ట ఒంగోలు చేర్చి, ఖర్చులు వందరూపాయలన్నా మాష్టరుగారు సంతోషంగా ఇచ్చిఉండేవారే. డబ్బెంత ఖర్చుచేసినా తాను ఎక్కడో ఒక చోట ఆమూట కాస్త పట్టక తప్పదు. అది తన హోదాకు చిన్నతనం. I.A.S చదివిన మాష్టరుగారు, నేనైతే రెండు గాడిదల బరువు మోసేవాడిని అంటున్నారు. రెండు గాడిదల బరువే కాదు ఎన్ని గాడిదల బరువైనా తన గురువు గారి అజ్ఞ, సేవ కనుక మాష్టరుగారు మోసేందుకు సిద్ధమే అహంకారపు

అడ్డుగోడ తొలగించుకోకుండా ఎన్నిమార్లు పాదాభివందనాలు చేసి ఏమి ప్రయోజనం?

భగవాన్ శ్రీవెంకయ్యస్వామి వారు సత్యం ధర్మం తప్పవద్దని నోరునొప్పి పుట్టేదాకా కొన్ని గంటలు అరచి మానవాళికి తన చరమ సందేశమందించారు. నిజమైన, సత్యమైన పాదాభివందనం చెయ్యి. పాదాభివందనం చేయడమంటే నాతల నీకర్పిస్తున్నానని అర్ధం. తలేకాదు శరీరం కూడా గురువుగారిదే. ఈ శరీరం వారిది కనుక వారి ఆజ్ఞలు తు.చ. తప్పకుండా పాటించాలి. అదే సత్యమైన సాష్టాంగదండ ప్రణామం. అలాకాకుండా చేసే దండాలన్ని అసత్యమైనవే. మాష్టరుగారికి కాని సాయికి గాని, శ్రీస్వామి వారికి గాని నేను నిజమైన సత్యపరమైన సాష్టాంగ నమస్కారం ఒక్కసారికూడా పెట్టలేకున్నానని ఈరోజు తెలుస్తుంది. ఎందుకంటే వారెంతో దయతో నన్ను ఆజ్ఞాపించారు. ఆ ఆజ్ఞలను సత్యమైన పద్ధతిలో జీవితంలో ఒకసారి కూడా తప్పిపోకుండా నేనాచరించలేదు. ఆచరించానని అహంకరించకుంటూ లోకం మెప్పు పొందుతూ అవసరమొచ్చినపుడు ఆ ఆజ్ఞలను నా ఇష్టాను సారం మార్పు చేసుకొని ఆచరించాను. ఓ కరుణా సముద్రులైన గురుదేవ! ఇకనుంచైనా సత్య మార్గములో, తిరుగులేకుండా మీ ఆజ్ఞలు పాటించేటట్లు నన్ను అనుగ్రహించండి.

శ్రీ సాయి, శ్రీమాష్టరుగారు, స్వామివారు ఈ సత్య మార్గమును ఎంత క్షుణ్ణంగా పాటించారో యోచించండి. సాయిని గ్రామంలో అందరూ వెలివేసి, బావిలోని నీరు తన డబ్బాతో ముంచుకోనివ్వకున్నా , తను సత్యమార్గము వదలలేదు. గ్రామంలో ఎన్ని రచ్చలు తగాదాలు వచ్చినా మారలేదు. మాష్టరుగారిని విద్యానగర్ నుండి పంపివేసినా, ఇంట్లో ఆర్థికముగా ఎన్నో ఇబ్బందులు ఎదురైనా, చివరకు తన భుక్తి (ఉద్యోగం) పోయినా తన సత్యమార్గం వదలలేదు. మరి నాకు అన్నీ ఉన్నా ఆశకు బద్దుడనై, గురువుమాటను సత్య మార్గములో పాటించలేకున్నాను. ఈ దీనుడి నీచత్వాన్ని దయతో క్షాళన చేయడమే కదా!

ఒకసారి వెంకయ్య స్వామి వారు తలుపూరు నారాయణ దాసుగారి ఆశ్రమంలో ఉన్నారు. మిట్టమధ్యాహ్నం 1 గంట సమయంలో అక్కడ ఒక్క క్షణం కూడా ఉండవద్దని ఆజ్ఞ అయిందని అక్కడ నుండి వెళ్ళిపోవాలని తనసేవకులను ఎంత మొత్తుకొని పిలచినా ఒక్కరూ రాలేదు. పైగా ఒక ప్రబుద్ధుడు ఆయన మనలను చూస్తే అలాగే అరుస్తుంటాడు. మీరు మొత్తం తెప్పించి చాటుకురండి. అన్నం తిని తర్వాత పోదాం అని పెద్దగా



అరుస్తున్నాడు. వాళ్ళను స్వామి నానా తిట్లు తిట్టి - ఇంకవారు వచ్చితన డోలు అప్పుడు మోయించరని తీర్మానించుకొని వస్తున్నారు. అది చూసి రోశిరెడ్డి, నాగయ్య ఎత్తుకున్నారు డోలీ. అంతటి కష్ట పరిస్థితిలో ఎవ్వరూ డోలి మోయరాకున్నా వారు తన విశ్వగురుని ఆజ్ఞ ఎలా పాటిస్తున్నారో చూడండి. అది సత్యమైన మార్గం. కనుకనే వారికి ఆస్థితిని పొందే అర్హత వచ్చింది. నాలాగా అవకాశము అవసరము కల్గినప్పడు సత్యమైన మార్గం మాని, పబ్బం గడుపుకుంటుంటే ఎన్ని జన్మలు ఎత్తినా, ఎన్ని మార్లు ఎందరు గురువులకు ఎన్ని వేల వేలసార్లు పాదాభివందనాలు చేసినా ఏమి ప్రయోజనము ఉంటుంది. అన్నింటికీ మూలం అహంకారపు అడ్డుగోడ తొలగించుకొని ఆశ చంపుకొని నిర్భయంగా సత్యమైన మార్గం అనుసరించాలిగదా. ఓ దయా మయా! ఈ గ్రుడ్డి వానిని సరైన మార్గాన నడిపించు ప్రభూ.

సాయి చరిత్ర మరొక గొప్ప విషయం బోధిస్తుంది. గురువు ఉపదేశం యొక్క అంతరార్ధం. ఉప- ప్రక్కన; ఆదేశం - ఉండునట్లు చేయుట, ఎల్లప్పడూ మానసికంగా గురువు ప్రక్కనే ఉండడం. మనసు గురువుగారికి దూరమై, శరీరము మాత్రం గురుసన్నిధిలో ఉంటే నిష్ప్రయోజనమే. శ్రీ సాయి పన్నెండు సంవత్సరాలు తన గురువులో ఏమి చూచారు. నిరంతరం తన గురువుగారి రూప ధ్యానమే వారికి అన్న పానీయాలయ్యాయి. గురువు గారిని చూస్తుంటే అన్న పానీయాలే మరచి పోయాను అంటారు సాయి. అదే అసలైన ధ్యానం. ఉప అంటే ప్రక్కన ఉండడం. రాధాభాయికి సాయి బోధించింది అదే. అలా నిరంతరం మానసికంగా గురువుగారి ప్రక్కనుంటే ఇక ఉపదేశమే అక్కరలేదు అంటారు మాష్టరుగారు. వారు అలా వుండి మనకు బోధించారు. మనల్ని కూడా ఆచరించి తరించమంటున్నారు. సాయి సర్వగతుడని నేటికీ భక్తుల అనుభవాలు నిరూపిస్తున్నాయి కనుక వళ్ళు దగ్గర పెట్టుకొని జీవించమంటున్నారు.

## శ్రీ మాష్టారు చెప్పిన పరమ సత్యం

తనకు పని ఒత్తిడివల్ల రెండు మూడు రోజులుగా బొత్తిగా నిద్రలేదని ఈరోజు బాగా నిద్రపోవాలని ''ఇంటిలో పాయసం చేయించాను సుబ్బరామయ్యా'' అన్నారు. మాస్టారు గారు.

''పాయసం తింటే నిద్రవస్తుందా సార్!'' అన్నాను నేను.

''అబ్బో చాలా గాఢంగా నిద్ర వచ్చేస్తుంది'' అన్నారు మాస్టారు గారు.

మరి మనకు అలా రాదేందుకు?

మనమెప్పుడూ నిద్రపోతూనే ఉన్నాము కదా, అని ఆలోచించేను. క్రొత్తగా నిద్రరావడమేముంది. మనమెప్పుడూ నిద్రలోనే జీవిస్తున్నాము. వారు రెండు మూడు రోజులు రాత్రింబవళ్ళు నిద్రపోలేదు కనుక అలా పాయసం తినగానే గాఢంగా నిద్రవస్తుంది. అసలు నిద్రలేకుండా ఇరవైనాలుగు గంటలసేపు మనం హుషారుగా కంట్రోల్ లో ఉండగలమా? ఏమో నేను మాత్రం ఉండలేను ప్రభూ!

''నిద్ర మేల్కున్నా పాతిక లాభమే'' నని శ్రీ వెంకయ్యస్వామి వారు తిరుమల శెట్టి వెంకయ్యగారికి చెప్పారు. కాని అలా రాత్రంతా మేల్కొని స్వామివారి సన్నిధిలో వారి స్మరణలో ఉండాలి కదా! శివరాత్రి జాగరణ అని చీట్లాటకు కూర్చునే ప్రబుద్ధులకేమి వస్తుంది. ఆసంస్కారమే ఇంక కాస్త గట్టి పడుతుంది. అది వారికి కలిగే పాతిక లాభం.

## ఉపన్యాసకులకు, రచయితలకు మాష్టరు గారి మంచి సలహో

మనం వార్తాలాపంలో చూచే నిత్యానంద స్వామిగారు, ప్రకాశానంద స్వామిగారు ఏమిచెప్పినా అదంతా వారు స్వంతంగా చెప్పినట్లు కాకుండా బైబిలు నందు ఇలా చెప్పబడింది, గీతయందు ఇలా చెప్పబడింది, భాగవతము నందు ఇలా చెప్పబడింది అని ఏదో గ్రంధాన్ని అనుకరిస్తూ చెప్తారే గాని తమసొంత మాటలుగా చెప్పరు. కనుక నేను కూడా రిఫరెన్స్ ఇస్తూ ఫలానా గ్రంధములో ఇలా చెప్పబడినది అని చెబుతుంటాను. అలా చెప్పినందువలన ।. మన అహం నిర్మూలన మౌతుంది. మంచి మార్గములో పయనించే వీలు ఎక్కువగా కల్గుతుంది. వినేవారికి ఎక్కువ రిఫిరెన్స్ గానూ ఉంటుంది. కనుక ప్రతివారు గ్రంధాన్ని అనుసరించి చెబుతుండాలి. అయితే ఇక్కడొక చిక్కు ఉంది.

అదే పనిగా శాస్త్రములు చదివి ఆకళింపు చేసుకొని ఎంత సేపూ ఇతరులకు చెప్పాలని చూస్తే మనకు తెలియకుండానే మనలో అహం పెరుగుతుంది. నాకు చాలా తెలుసును అనే భావం ఏమాత్రం ఉన్నా మనపని అయిపోయిందని అర్థం. కనుక మనం చదవడం తెలుసుకునేందుకే కాని, అహం పెంచుకొని అందరికీ అదే పనిగా అనర్హులకంతా భోధించేందుకు కాదని బాగా గుర్తించి మెలగాలి అని ముగించారు.



## ఇతర జీవులను తృప్తి పరచడంలో వారికి వారే సాటి

మాష్టరుగారి మరదలు అనసూయమ్మగారి వివాహం జరుగుతుంది. ఒంగోలు జయరామయ్య గారు, నేను వంటల ఇన్‌చార్జి. వంటవాళ్ళు ఉన్నారు. పెత్తనం మాది. మాష్టరుగారే ఇంట్లో చేయించి మూడు గంపల లడ్లు మాకిచ్చారు. ఒక గంపకు వెయ్యి వేసుకున్నా మూడువేల లడ్లు బంతిమీద వడ్డించేందుకు ఎనిమిది వందల కంటే ఎక్కువ ఖర్చు కాలేదు. భోజనాలైనాక రెండున్నర, మూడు గంటల మధ్యలో కొందరు పాత విద్యార్థులు సత్సంగ సభ్యులు వంటలు తయారు చేసే గదివైపు వచ్చి స్టోరులోని లడ్లు చూచారు. వారి అమృత హస్తాలు లడ్లున్న గంపలపై పడ్డాయి. ప్రతివారూ నాకు బాగా పరిచయమున్న వారే, ఎవ్వరినీ కాదనలేకున్నాను. వీళ్ళను చూచి మరికొందరు వచ్చి మాట్లాడుతూ తినేస్తున్నారు. సుమారు ఆరు ఏడు వందల లడ్లు ఖాళీ అయ్యాయి. నాగుండే దడపుట్టింది. వెంటనే వెళ్ళి విషయం మాష్టరుగారికి విన్నవించాను. ''తిననివ్వు తినేందుకే కదా చేసింది'' అని చాలా తేలికగా అనేశారు. ఇంకొంచెం సేపటికి గంపలుఖాళీ అవుతాయి సార్'' అన్నాను. వారు అమ్మగారితో ''ఏమేవ్! నీకు లడ్లు కావాలా'' అన్నారు. వారు ''నాకు లడ్లెందుకండీ'' అన్నారు. ''ఎవరికన్నా ఇవ్వాలేమోనని'' అన్నారు. ఉంటే కొన్ని ఉంచండి- పని పిల్ల వాళ్ళకు ఇస్తాం అన్నారు. సుబ్బరామయ్యా! అమ్మగారి కోటా వంద - కాంపౌండ్‌లో వాచ్‌మెన్‌లతో సహా ఎందరున్నారో అడిగి అందరికీ తలా రెండు, మన జయరామయ్య గారి స్కూల్‌లో టీచర్స్ మరియు క్లాస్‌లో అందరికీ తలా ఐదు - మీ సత్సంగానికి ఎన్ని కావాలో నీవు తీసుకో. మిగిలిన వన్నీ వాళ్ళను తిననియ్'' అని ఆర్డర్ ఇచ్చేశారు. మొత్తం ముప్పావు గంప లడ్లు గంపతో సహా వదిలేశాను. ఎవరెన్ని తిన్నారో ఎన్ని తీసుకుపోయారో, అన్నీ ఖాళీ అయ్యాయి. ఎన్ని జన్మలెత్తినా నేను అలా నా మిత్రులకు పెట్టగలనా? ఒక్కొక్కరికి ఐదులడ్లు మనసొప్పి ఇవ్వగలనా? సాయికృప నాకెలా కలుగుతుంది. ఆచరణ లేకుండా పోవటం ఎంత దుఃఖ దాయకం.

శ్రీ మాష్టరుగారికి అప్పటికి వివాహం కాలేదు. ఉచ్చులూరు పాలెం శేషాద్రి గారికి అవి పరీక్షల రోజులు. మాస్టరు గారి ఇంట్లోనే చదువు కొంటున్నాడు. కరెంటు పోయింది. వెంటనే మాస్టరు గారు చదువుకున్నవారు ఉద్యోగం చేస్తూ, మనసు చంపుకొని సత్యం, ధర్మం విషయంలో సంఘాన్ని ఎదుర్కొనుచూ ఎలా ఉద్యోగం చేస్తూండాలో, అందులోని కష్టనష్టాలు చెప్పకొస్తున్నారు. ఈలోగా కరెంటు వచ్చింది.

వెంటనే మాస్టరు గారు ప్రక్కకు వెళ్ళి శేషాద్రి గారికి చదువుకునే వీలు కలిగించారు. కానీ ఇదే విధంగా మూడు, నాలుగు సార్లు కరెంటు పోయి మరలా వచ్చింది. కరెంటు పోగానే మాస్టరు గారు తాను చెపుతున్న విషయం ఆపిన చోటనుండి కొనసాగించేవారు. వారు చెప్పదలచుకొన్నది పూర్తి అయిన తర్వువాత కరెంటు పోలేదు. ఆ విధంగా వారి సంకల్పం పూర్తయినంత వరకు ప్రకృతి కూడ సహకరించింది. వారు చెప్పినట్లే నా జీవితం, **B.A.** పాసైకూడా ఉద్యోగం చేయకుండా వ్యవసాయం చూసుకుంటూ మాస్టరు గారు చెప్పినట్లు ఉద్యోగస్తులు సత్యం, ధర్మం విషయంలో పడే బాధలు లేకుండా జీవితం సాఫీగా జరిగిపోతుంది. అంటారు శ్రీ శేషాద్రిగారు.

## శ్రీ సాయి నాథుల ఆనందం

శ్రీ సాయిని వారి గురువుగారు బావిలోని నీరు అందకుండా ఐదు గంటలసేపు తలక్రిందులుగా వ్రేలాడ దీసినప్పుడు సాయి ''ఆనందంతో తేలిపోతున్నాను'' అన్నారు. అది ఎలా సాధ్యమయింది అనే విషయమై మాస్టరు గారు ఇలా చెప్పారు.

''నా మాట సంపూర్ణంగా విశ్వసించిన వాడే సఫలుడౌతాడని వారి గురువు చెప్పగానే శ్రీ సాయి మిమ్ములను నేను సంపూర్ణముగా విశ్వసించి నా గురువుగా మిమ్ములను అంగీకరిస్తున్నాను. ఇది మొదలు ఈ మనస్సు శరీరమూ నీవే. వీటి మీద నాకు ఎలాంటి హక్కులేదు అని మనస్సులో చెప్పకొని సాష్టాంగ నమస్కారం పెట్టారట. వెంటనే గురువుగారు శ్రీసాయి యొక్క రెండు కాళ్ళకు గుది కట్టి బావిలోని నీటికి । అ.. ఎత్తులో తలక్రిందకు కాళ్ళుపైకి ఉండేలా వ్రేలాడుతీశారట. ఇప్పడే కదా ఈ మనస్సు శరీరరం నీవేనని సాష్టాంగ పడ్డాను. కనుక చచ్చినా సరే సత్యం తప్పకూడదు. ఈ భావం నుండి వేరుగాకుండా స్థిరంగా ఉండడమొక్కటే సత్యమార్గమని మనస్సులో ఏ ఆలోచనా లేకుండా గురుస్మరణ చేస్తున్నాడు. మనస్సులో ఏ మాత్రమూ చలనం లేదు. కనుకనే వారు ఆ ఆనందంలో తేలిపోయారు. అలాకాకుండా ఇదేమిటి ఈపాడు గురువు ఇలా వ్రేలాడదీశాడు. నన్ను చంపుతాడు కాబోలు అని ఏమాత్రము ఒక్కింత మనస్సులో చలనం కలిగినా ఆనందమే అనుభవమై యుండదు. ఒక్కసారి మనసులో అనుకొన్న భావం నుండి తప్పకోకుండా ఆ భావనకే అంటి పెట్టుకొని ప్రాణత్యాగానికైనా సిద్ధపడ్డాడు గాని సత్యమార్గము వదలి గురువును అనుమానించలేదు. మనస్సు, శరీరము నాకర్పించమని గురువు గారు అడిగారా ? లేదే. నాపైన సంపూర్ణ విశ్వాసముంచమన్నారు.



అంతే సంపూర్ణ విశ్వాసముంచాను అనే దానికి సంకేతమే సాష్టాంగ నమస్కారము. అలా ఒకసారి సాష్టాంగ పడ్డాక మరలా గురువుగారిని అనుమానించడమంటే మనం సత్యమార్గం తప్పిపోతున్నామని అర్థం. మనం సత్యం తప్పేక గురువెంత గొప్పవారైనా వారినుండి మనమేమీ పొందలేము. సత్యమే గురు రూపం దాల్చింది. మనం సత్యం తప్పేమంటే గురువు గారినుండి డిస్ కనెక్ట్ అయ్యామన్నమాట. డిస్ కనెక్ట్ అయ్యాక ఎంత ఓల్టేజి అవతల ఉన్నా మనకేమీ అందదన్నమాట. ఈ సత్య మార్గానికి అడ్డమొచ్చేవే ఆశా, వ్యామోహాలు, అవి తొలగనిదే సత్యమార్గములో పయనించలేము.

ఇప్పడు మనమందరమూ ఆనవాయితీ కొరకు మ్రొక్కుబడి కొరకు చేసే సాష్టాంగ నమస్కారం కాదది. ఈవ్యక్తి చాలా భక్తిపరుడు అని ఇతరులు అనుకునేందుకు చేసే సాష్టాంగ నమస్కారము కాదిది. ఎలాంటి ఇతర భావాలు లేకుండా సత్య సమ్మతంగా తన మనస్సు శరీరం గురువుగారికి అప్పగించినట్లు తెల్పే బాహ్య సంకేతమే ఆ సాష్టాంగ నమస్కారం అన్నమాట. అలా ఒక్కసారి చేశాక ఇక జీవిత కాలంలో ఎన్నడూ ఆభావం నుండి తప్పకోకుండా నిలుపుకోవడమే నిష్ట, సబూరి. అలాంటి చలనం లేని నిండైన హృదయంతో సత్యానికంటి పెట్టుకొని యున్నాడు కనుకనే ఆనందం అనుభవమైంది. ఏ ఒక్క అనుమానమున్నా ఆనందానికి బదులు బాధే అనుభవమై ఉండేది.'' అని ముగించారు మాస్టారు గారు.

''శ్రీ గురు చరిత్ర, శ్రీ సాయి చరిత్ర మనకు రెండు కన్నుల వంటివి'' అంటారు శ్రీమాష్టరుగారు. ఎందుకు? ''ఈ రెండు చరిత్రలలోను నిజమైన గురువెలా ఉంటాడు నిజమైన శిష్యుడు ఎలా ఉంటాడు, ఎలా ఉండాలి, అనే విషయం చక్కగా బోధిస్తాయి.'' కనుకనే ఇవి మనకు రెండు నేత్రాల వంటివి అన్నారు.

గురుచరిత్రలో నామధారకుని దుఃఖము, ఆర్తి గురువును అన్వేషించే సాధకులందరికీ మార్గదర్శకాలు. అంతటి ఆర్తి దుఃఖము గలవానికి గురుదర్శనము కాకమానదు అనేందుకే, నామధారకుడు ఒక ఉదాహరణ.

ఎంతటి కష్టదాయకమైన కార్యమైనా సరే, ఎంత గొప్ప నష్టము వాటిల్లినదైనా సరే చివరకు ప్రాణనష్టమైనా సరే గురువాజ్ఞలను యధాతధంగా పాటించి ప్రయత్నించిన వాడే శిష్యుడు అనే మాటకు అర్హుడు. ఆవిధంగా గురువుయందు, గురువు ఆజ్ఞల యందు సంపూర్ణ విశ్వాసములో గురువును మెప్పించిన వాడే, ఎండిన మేడి కొమ్మ చిగురించగా కుష్టువ్యాధి నయమైన వాని కథ, ఇలాంటి వాడే

వల్లభేషుడు. గురువాజ్ఞ ప్రకారం పంట పండక ముందే భార్య బిడ్డలను, చేను యజమానిని కాదని చేనంతా కోసి వేశాడు. కానీ గురుకృప వలన పంట నాలుగు రెట్లు పొందగలిగేడు.

ఏసద్గురు వైనా తనను గురువుగా చేసుకొనమని మనలను అడగరు. కానీ మన అనుభవాల ద్వారా మనమే వారిని గురువుగా భావించి, సేవించి తరించాలి. గురువుయందు చలనంలేని విశ్వాసముంచడమే గురుచరిత్ర మనకు నేర్పే గొప్ప పాఠము. కనుకనే సాయి చరిత్ర, గురుచరిత్ర మనకు రెండు కన్నులు.

## పరేంగి తావగాహి

దశరథ పుత్రుడు శ్రీరామ చంద్రుల వారికి పరేంగి తావగాహి అనే టైటిల్ ఉంది. తరుల మనసులోని భావము వారు చెప్పకోకముందే గ్రహించువాడని అర్థము. ఒంగోలు సాయి మందిర శంకుస్థాపనప్పడు నేను, జయ రామయ్యగారు వంటల ఇన్‌చార్జి. వంటచేసే చోటనే వంటవాళ్ళు పడుకోవాలి. వేకువ జామున ౩ గంటలకు పొయ్యిలు వెలిగించాలని మేము చెబితే మందిర కమిటీవాళ్ళు వంటవాళ్ళు వాళ్ల ఇళ్లలో పడుకునేందుకు అనుమతి ఇచ్చారు. వేకువజామున వాళ్ళు లేవనందున, జయరామయ్యగారే స్నానంచేసి పొయ్యిలు వెలిగించి పొంగళి, ఉప్మా తయారు చేశారు. వంటవాళ్ళు ౬ గంటలకు వచ్చారు. అలాంటి మహానుభావులు వారు.

వాళ్ళు తెచ్చిన కట్టెలు చాలకుంటే మరి రెండుసార్లు మేమే కొని తెచ్చాము. మాచేతిలో మాష్టారు డబ్బు పెట్టారు. సాయంకాలమునకు మేమిద్దరం రైలుకు బొగ్గువేసే వాళ్ళలాగ ఉన్నాము. మధ్యాహ్నం అన్నం లేదు, స్నానం లేదు. డబ్బు లెక్కచెప్పటానికి పోతే ఎంతసేపటికీ మమ్ములను లెక్క పెట్టలేదు. ఎందుకంటే మా డ్రెస్, గెటప్ అలా ఉంది. ఇవతలకు వచ్చేయబోతుంటే ఎవరో పిలిచి చీటీలు తీసుకున్నారు. ఒక మేధావి ఆచీటీలలో మేము కొన్న వస్తువులన్నీ చూచి కట్టెలు మేము తెచ్చి వేశాముకదా అన్నాడు. కట్టెలు కొన్న అతని అడ్రసు ఇస్తా కనుక్కోండి అన్నాము. అంటే కట్టెలు కొనకుండానే డబ్బు స్వాహా చేసామని ఆమేధావి ఉద్దేశ్యము. చీటీ క్రిందకూ పైకీ చూస్తాడు ౧౦ ని.. లైనా ఏదో ఒకటి తేల్చడు. జయరామయ్యగారు బయటకు రాబోతుంటే కష్టంగా మిగిలిన డబ్బు తీసుకున్నారు. జయరామయ్యగారు వెయ్యిమంది పిల్లలు గల కాన్వెంటుకు కరస్పాడెంట్. ఆయన చాలా బాధపడి నన్ను మాష్టరుగారి దగ్గర ఏమీ మాట్లాడవద్దు అన్నారు. మేము అదే డ్రస్‌లో మాష్టరుగారింటికి వెళ్ళాము.



జయరామయ్యగారి మొహం చూస్తూనే మాష్టారు, ఏంటి అలా ఉన్నారు. భోజనం చేశారా'' అన్నారు. సార్ మీసొంత పనుంటే పిలవండి. మందిర పనికి ఇక పిలవద్దు అన్నారు. జయరామయ్యగారికి మాష్టరు ఇక ఏమి మాట్లాడకుండా ''ముందు మీరు స్నానం చేసి భోంచేస్తేనే పోనిస్తాను'' అన్నారు. తప్పలేదు. జయరామయ్యగారు రిక్షా ఎక్కాక, నన్నడిగి అంతా తెలుసుకున్నారు. ''ఓరి మీదుంప తెగ అలా చేశారా'' అని ఒక్కమాట అన్నారు. అంతే జయరామయ్యగారి మనస్సులో బాధ ఎప్పడో అర్థం చేసుకునే, స్నానం చేయించి అన్నంపెట్టి చల్లబరచి పంపారు. ఆవ్యక్తి స్థాయి ఏంటి, వారు మాట్లాడిన తీరేమిటి. ఇలాంటి వ్యక్తులతో మాష్టారు కాబట్టి ప్రశాంతంగా నెట్టుకొచ్చారు.

## సహనానికి మారు పేరే ఆచార్యులవారు

దైవరాజ్యంలో ప్రవేశించాలంటే అన్ని విషయాలలో సహనమే అవసరం. అంత గొప్పగా సహనాన్ని తన సొంతం చేసుకున్నారు కనుకనే వారు మహాత్ముల ముద్దు బిడ్డడు అయ్యారు. వారు విద్యానగర్ నుండి ఒంగోలు వచ్చిన క్రొత్తలో సంతపేటలోని ఒక పాడు బడ్డ ఇంటిలో చేరారు. అఇంటికప్ప కూలిపోతుందనే మిషతో ఎవ్వరూ అందులోకి కాపురానికి రాలేదు. మాస్టారు గారికి ఇల్లు దొరకనందున, విధి లేక ఆ ఇంట్లోకి చేరేరు. ఆ ఇంటికప్ప పెంకులది. వాలో నుండి తెల్ల సున్న, పెంకు ముక్కలు అప్పడప్పడూ రాలి పడుతున్నాయి. ద్వారక పురిటి కొడుకు. తెల్ల సున్నం కొడుకు కళ్ళలో రాలుతుందని పాలిథిన్ గోతాలు జాయింట్ చేసి కొడుకు మంచం పైన, అన్నాలు తినేచోట, వండే చోట, పైన కప్పకు కట్టారు. ఆ ఇంటికి లెట్రిన్ లేదు. మనుషులు శుభ్రం చేసే లెట్రిన్‌లు. అది ఒక నరకకూపం. అయినా మాస్టరు గారు సహించారు. అక్కడే ఒక రూంలో ప్రెస్ పెట్టారు. ఈ ప్రెస్ తెల్లవార్లూ పనిచేస్తూ శబ్దం చేస్తుంది. ౧౦, ౧౫ రోజులు తరువాత ఇంటి యజమాని తగువు మొదలు పెట్టింది. ప్రెస్ రాత్రి షిఫ్టు పని చేస్తున్నందున, ఆ శబ్దానికి ఆమెకు నిద్ర పట్టదట. నోటికి వచ్చిన మాటలన్నీ మాట్లాడుతూ వెంటనే ఖాళీ చేయమంటుంది. మాస్టరు గారు ఎంతో ఓర్పుతో ఇల్లు వెతుకుతున్నాము. దొరకగానే ఖాళీ చేస్తాము. అని చెప్పేవారు. ఆమె అనే మాటలు సహించలేని కుర్రాళ్ళు ఆమెకు దేహశుద్ధి చేయాలంటారు. మనం వాళ్ల ఇంటిలో ఉండి ఆమెను శత్రువుగా భావించడం తగదు. సాయి మన ప్రవర్తనకు బాధ పడరా ? ఇవన్నీ పూర్వ జన్మ ఋణాను బంధాలు అని తలవాలి. అని ఎంతో సహనంతో కుర్రాళ్లకు చెప్పేవారు.

సాయి దయ వల్ల మంచి ఇల్లు దొరికింది. పాత ఇల్లు ఖాళీ చేసేరు. ఆ ఇంటి యజమానికి కష్టాలు పట్టుకున్నాయి. మాస్టారు గారిని దూషించినందుకే అలా కష్టాలు వచ్చాయి. వెళ్లి ఆయనను క్షమాపణ అడగమని ఆమెకు సలహా ఇచ్చారు. ఆమె వచ్చి కాళ్లపై పడి బోరున ఏడ్చేసింది. మాస్టరు గారు ఆమెను ఎంతో అనునయంగా ఓదార్చి విభూతి ఇచ్చి సాయి చరిత్ర పారాయణ చేయమన్నారు. అలా చేయగానే ఆమె కష్టాలు తీరాయి. ఆ తరువాత కూడా ఆమె కృతజ్ఞతతో మాస్టారు గార్ని దర్శించేది. వారికి అందరూ సాయి రూపాలే. శత్రువులు, మిత్రులు అనేదే లేదు. కనుకనే వారు మహాత్ముల ముద్దుబిడ్డడు అయ్యారు.

## త్రాగుడు మాన్పడం

శ్రీ మాస్టరు గారు ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేసే ఒక పిల్లవాడు చాలా బాగా పనిచేస్తాడు. కానీ సంపాదన అంతా త్రాగుడుకే తగలేసి భార్యను బాగా చితక్కొట్టేవాడు. త్రాగుడు మానాలని అనుకుంటాడు కానీ అది అతని వల్ల కాలేదు. ఏరోజు కూలీ ఆరోజు పూర్తిగా ఇస్తే రేపటికి పనికి రాడని కాబోలు అని రోజూ ౧౦ రూ.. ఇవ్వకుండా రేపు ఇస్తామని చెప్పేవారు. ఒక రోజు ౧౦ రూపాయలు ఆపేందుకు లేదు, డబ్బు అంతా ఇచ్చివేయమని విక్రం గారితో తగువు పెట్టుకున్నాడు. మాస్టరు గారి దగ్గరకు వచ్చి ( త్రాగి వచ్చి) విషయం చెప్పి నా డబ్బులు నాకు పారేయండి అంటూ ''ఓయ్! అని సంభోదిస్తున్నాడు. వెంటనే మాస్టరు గారు ఒక మనిషిని పంపి అతనికి రావలసినదంతా ఇచ్చివేయండి కావాలంటే ఎక్కువ కూడా ఇచ్చి పంపమన్నారు. ఎక్కువ ఇస్తామన్నా అతను తీసుకోలేదు.

మాస్టరు గారు ఏమి సంకల్పించారో ఏమో ఎవరికి తెలియదు. ఆనాటితో అతడు త్రాగుడు పూర్తిగా మానేసాడు. అతని ఇంట్లో సుఖ శాంతులు నెలకొన్నాయి. అది మొదలు అతను మాస్టారి గారికి అందరికంటే గొప్ప భక్తుడయ్యాడు. చిత్రమేమిటంటే మాస్టారు గారే తన త్రాగుడ మాన్పించారని అతను సంపూర్ణంగా విశ్వసించాడు. మాస్టారు గారు విద్యానగర్ కాలేజీలో తిరిగి డ్యూటీలో చేరబోతున్నారు. అక్కడ పూర్వపు వాతావరణం ఎలా ఉందో ఏమోతుందోనని ఒంగోలులో అందరూ భయపడుతున్నారు. త్రాగుడు మానిన ఆకుర్రాడు మాస్టారు గారితో నేను విద్యానగర్‌కుతోడు వస్తానంటాడు. మాస్టారు గారు అతనిని రావద్దని అనునయంగా చెప్పి పంపారు. కాని మాస్టారు గారి కంటే ముందు ఈ కుర్రవాడు విద్యానగర్‌కు వెళ్లి తిరుగుతున్నాడు. మాస్టారు గారు అక్కడికి వెళ్ళేక, ఒక రోజు ఈ కుర్రాడు కనిపించాడు. రావద్దు అంటే ఎందుకు



వచ్చావు అని అడిగితే, విద్యానగర్ ఎలా ఉంటుందో చూడాలని వచ్చాను సార్. నేను ఒంగోలు వెళ్లి పోతున్నానని చెప్పాడు. కాని అయిదు రోజుల వరకు అక్కడ వాతావరణం గమనిస్తూ అనామకుడుగా తిరుగుతూనే ఉండేవాడు. అది మాస్టారు గారంటే అతనికున్న నిజమైన ప్రేమ, భక్తి.

## మహనీయుల చరిత్రల గురించి

ఒక్కొక మహనీయుని చరిత్ర దత్తచరిత్రలోని ఒక్కొక అధ్యాయంగా భావించి పారాయణ చేయాలి. అందరు మహనీయులూ శ్రీ దత్తునిలోని వివిధ రూపాలుగా భావించాలి. అలా చూడగలగడం చేతనైతే మనకు దత్తాత్రేయ తత్వం అనుభవం అవుతుంది. వారంతా ఒకరినుండి ఒకరు వేరు కాదు. అందువలనే రెండు సంవత్సరముల క్రిందట అంటే ౧౯౯౮వ స..లో మాస్టారు గారు నాకు ఒక సందేశమిచ్చారు. రెండు సంవత్సరాల తరువాత జనవరి ౩వ తేదీ శ్రీ వెంకయ్య స్వామి గారు స్వప్నంలో రెండు సంవత్సరముల క్రిందట మాస్టారు గారు చెప్పినది ఏమి చేశావు ? అని ప్రశ్నించారు. రెండు సంవత్సరముల క్రిందట మాస్టారు గారు నాకిచ్చిన ఆదేశం గురించి వెంకయ్య స్వామిగారికి కూడా తెలుసన్నమాట.

బాహ్య రూపాలు జీవన విధానాలు వేరువేరుగా ఉన్నప్పటికి అంతరంగికంగా వారంతా ఐక్యానే అనుభవిస్తుంటారన్నమాట. ఈ అంతరంగిక ఐక్యాన్ని గురించి మరచిపోకుండా భేద భావం లేకుండా మనం నడుచుకుంటుంటే అందరు మహనీయులు మన పురోభివృద్ధికై వారి సహకారాన్ని అందిస్తారన్న మాట. ఇది సాధకులు అందరూ ఏమరుపాటు లేకుండా గుర్తించుకోవలసిన సత్యం.

## తన సమాధి స్థలాన్ని గురించి

ఒంగోలు - సంతపేటలో మూడంతుస్తుల మిద్దెలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో మాస్టారు గారి కాపురమున్న రోజులు. ఒక్కసారి కాకుండా అనేక సార్లు అదే విషయం చెప్పేవారు, తాను సమాధి స్థలం గురించి అలా చెపుతున్నారని అప్పుడు నాకు తెలియలేదు. ''సుబ్బరామయ్య! బాబా నాకు స్థలం చూపించి పాదుకలు స్థాపించు, ఏకట్టడమూ వద్దు. ఇక్కడకు వచ్చి పాదుకలకు నమస్కరించుకొని, కోరుకున్న భక్తుల కోరికలన్నీ నెరవేరుతుంటాయని చెప్పేవారు. యూరిన్‌కు పోవలసిన వారికున్నంత తొందరగా ఉంది, ఆపని చేయాలని చెప్పేవారు. ఇదే మాటను నేను ఒంగోలు వెళ్ళిన ప్రతీసారి చెప్పేవారు.

అట్లయితే పాదుకలెంతసేపు పెట్టాలి సార్ ఇప్పుడే వెళ్ళి పెట్టేస్తే పోలా అనేవాణ్ణి, వారు మాత్రం ఎప్పుడూ ఆకాశం వైపు చూస్తూ నిశ్చలంగా కూర్చునేవారు. ఆ స్థలం ఏదో అప్పుడు నాకు అర్థం అయేది కాదు. ఇప్పుడు బాగా అర్థం అవుతూ ఉంది. మాస్టారి గారి దివ్య శరీరాన్ని భద్రపరచిన పవిత్ర మహాసమాధి స్థలం అది. వారు చెప్పినట్లు ఎలాంటి కట్టడాలు లేకుండానే అసంఖ్యాకులైన భక్తుల కోరికలు తీరుస్తున్నారు. ప్రక్కనే వున్న సాయి మందిరములో కంటే ఇక్కడే ఎప్పుడూ జనం రద్దీగా ఉంటున్నారు. ప్రదక్షిణలు, పారాయణ, సత్సంగాలు అన్నీ ఇక్కడే నిరంతరం జరగుతుంటాయి. ప్రతి నిత్యం వారి దివ్య సమాధికి అభిషేకము, అలంకరణ, పూజా నిండైన భక్తి శ్రద్ధలతో చేస్తున్నారు. ఈ అభిషేకము అలంకరణ పూజ చేసే భక్తులు ఎవ్వరూ ఒక్కపైసా జీతం ఆశించరు. వారు కోరే గొప్ప ప్రతిఫలం. కట్టడాలే కట్టవద్దు అన్న సాయి మాటా అలా నెరవేరింది చూడండి.

## నిత్య సత్యులై నన్ను సంస్కరించడము

తేది 1-5-2000 న 8 గం.. లకు నన్ను కూరగాయలు తెమ్మని నా భార్య చెప్పింది 9 గంటలకైతే అంగడి దగ్గర రద్దీ తగ్గి ఉంటుంది. అప్పడు పోతానులే అన్నాను. 8 ½ గంటలకు ఒకస్నేహితుడు వచ్చాడు. స్వామి వారిని గురించి చెబుతూ కూరలకు వెళ్ళే మాటే మరచి పోయాను. 8 ½ గంటలు అయింది. నా భార్య కోప్పడి, కూరగాయలు వద్దన్నది. నేను వినకుండా వెళ్ళి తెచ్చాను. నిత్యం నా వంట నేనే చేసుకోవాలి. కనుక కూరగాయలు నేనే తరిగే అలవాటు, నామం చెపుతూ తరుగుతాను. ఈ రోజు నా భార్య అలక గురించి ఆలోచనలు దొర్లుతున్నాయి. గానీ నామం చెప్పటం లేదు కత్తిపీట మొద్దుబారి పోయినట్లు బొత్తిగాతెగటం లేదు. ఏమిటి, సడన్‌గా ఇలా అయిపోయిందని ఆలోచిస్తుంటే నామం చేయలేదని గుర్తు వచ్చింది.

ఏపని చేయడానికి అంగీకరిస్తావో ఆపని క్షుణ్ణంగా చేయలేకపోతే అంగీకరించకు అన్న సాయి మాట మాస్టారిదయవల్ల గుర్తుకు వచ్చింది. వంట చేసేది భగవంతునికి నివేదించేందుకు గాని మన పొట్ట నింపుకునేందుకు కాదు. నామ స్మరణ లేకుండా వంట చేస్తే కూరలు తరిగితే భగవంతుడు స్వీకరిస్తాడా. ఎంతపొరపాటు జరిగింది అని రెండు చేతులిచ్చి క్షమాపణ వేడుకొని నామం చెబుతూ కూరలు తరిగాను.

నా ఆలోచనతో నేను కొట్టుకుపోతున్నప్పడు, నేను చేసే తప్పు నాకు తెలపటమే మాస్టారి గారి వాత్సల్యము. అంతటి మహనీయున్ని గురువుగా



పొంది కూడా ఏమి సాధించలేకుండా రాలిపోవడం ఎంత దౌర్భాగ్యమో చూడండి. ఇకనైనా అనుక్షణము మృత్యువుకు దగ్గర అవుతున్నానని గుర్తించి మాస్టారు చెప్పినది ఆచరించి ముందుకు సాగాలనే మాట, మరుపు లేకుండా అనుక్షణమూ గుర్తు చేయమని మాస్టారిని ప్రార్థిస్తున్నాను.

## నిత్య సత్యులు

శ్రీ మాస్టరు గారు చెప్పిన విషయాలు వ్రాయడంలో గొప్ప లేదు. వాటిని ఆచరించడమే గొప్ప, దౌర్భాగ్య సంస్కారాలతో విరజల్లే నేను ఏదీ ఆచరించను. కానీ ఆ మహనీయుడు నన్ను వదలకుండా అనుక్షణం వెంబడించడమే వారి గొప్ప. సంస్కారాన్ని మార్చడమే సాధన అన్నారు మాస్టారు. నాకొక వెధవ సంస్కారం ఉండేది. నేను రాసేటప్పడు రీఫిల్ రాయకుంటే ఆరోజు అంతటితో ముగించేవాడ్ని తేది 2-5-2000 న అలానే రీఫిల్ వ్రాయలేదు. ఇక వ్రాత పని ముగించబోతున్నాను. వెంటనే సాధనంటే ఏమిటో గుర్తుచేశారు మాస్టారుగారు. సంస్కారముల మార్పుకు చేసే తీవ్ర ప్రయత్నం సాధన. కనుక వ్రాత పని ఆపకుండా రీఫిల్ మార్చాను. అయినా వ్రాయలేదు. ముక్కు తీసి ఇంకు ఉందో లేదో చూశాను. ఉంది కాని వ్రాయలేదు. వేరే పాత పెన్ను తీసాను. అదీ వ్రాయలేదు. దీని అంతు తేల్చాల్సిందే అని సగం రీఫిల్ బ్లేడుతో కోసేసాను. అప్పడు వ్రాయడం మొదలు పెట్టింది. రీఫిల్ చాలని భాగానికి మరొక రీఫల్ ముక్క అతుకు పెట్టి వ్రాత సాగించాను.

ఈ విధముగా మాస్టారి మాటలు గుర్తు చేస్తూ మనల్ని ముందుక నడిపంచడమే మాస్టారి పని కాబోలు అన్పిస్తుంది. హే గురుదేవా ! నేనెంత నికృష్టుడనైనా నన్ను వదలక కాపాడుచున్న మీ దయకు నేనేమి ఇచ్చి ఋణ విముక్తుడను కాగలను ప్రభూ !

నా కుమారుడు శేష సాయికి చిన్నప్పటి నుండి ఆరోగ్య సంబంధంగా కొన్ని ఇబ్బందులుండేవి. చేతుల వ్రేళ్ళు వణికేవి. కనుక చొక్కాగుండీలు పెట్టుకోలేడు. లోటాతో మంచినీళ్ళు త్రాగలేడు. హోమియో మందులు కనీసం రెండు సంవత్సరాలు ఇప్పించాము. ఆ డాక్టరు పిల్లవానిలో మార్పు లేనందున చివరి మెడిసన్ మల్టీలాక్ అనేది వేయాలని మాస్టరు గారి సలహా అడిగాను. మాస్టరు గారు వేయమన్నారు. మందు తెప్పించి వెంకయ్యస్వామివారి 40వ రోజు ఆరాధన రోజు గొలగమూడిలో స్వామి వారి సమాధి చెంత మాస్టారు గారి చేతనే వేయించాలనుకున్నాము. స్వామి

వారి సమాధి మందిరం చుట్టూ ప్రహారీ గోడలు అప్పుడు లేవు. చాప పరుచుకొని కూర్చొని ఉన్నాము. సీసా మూత తీసి గ్లాసులోని నీళ్ళలో మూడు బొట్లు మందు వేయబోతున్నారు. ఆ ప్రక్కన పోతున్న ఎద్దులు పోట్లాడుకుంటూ మా పైకి వచ్చాయి. తలా ఒక వైపు చెల్లాచెదరుగా లేచి పోయాము. తిరిగి చాపలు విదిలించి పరుచుకొని కూర్చున్నా. మాస్టారు ఆలోచిస్తున్నారు. ''సార్ మరలా పశువులు వస్తాయేమో'' అన్నాను. నేనేమో మాట్లడకుండా ఇంకా కొంత సేపు ఉంటే వారేమి అందులో ఏవో మందులు వేసి త్రాగించాము.

కానీ ఒక్క సంవత్సరంలోగా పిల్లవాడు జానెడు అంటే 9 అంగుళాలు పెరిగాడు. మీసాలు గడ్డాలు వచ్చాయి. కానీ మానసికంగా ఎదుగుదల లేదు. శారీరకంగా ఎదిగాడు. అది చూచి డాక్టరు అదిరిపోయాడు. ఇక ఎప్పడూ ఎక్కడా ఎలాంటి మందూ ఇప్పించవద్దు. స్వామి దయవలన పిల్లవానికి ఏ ఇతర బాధ రాలేదు. వచ్చి ఉంటే మొదట నింద నేను భరించవలసి ఉండేది అన్నారు. ఆ తర్వాత కొన్నాళ్ళకు మాస్టారి కృప ఎలా కలిగిందో చూడండి.

ఒక రోజు మాస్టారు గారే పిల్లవాడు ఎలా ఉన్నాడు ? అని అడిగారు. ఏమీ మార్పులేదు సార్ అని చెప్పాను. వెంటనే మాస్టరు గారు ''ఒకసారి మద్రాసు తీసుకుపోయి డాక్టరు గారికి చూపమన్నారు. ఏ డాక్టరు దగ్గరకెళ్ళమంటారని అడిగాను. అక్కడి కెళితే పిల్లల స్పెషలిస్టుని చెపుతారు అక్కడ చూపెట్టమన్నార. నేను మొండిగా ''సాయిబాబాను దీక్ష చేసి అడుగుతాను. వారు ఎవరి దగ్గరకు పొమ్మంటే అక్కడకు పోతాను సార్'' అన్నాను. అలా పిలవకూడదు. అది చాలా తప్ప అన్నారు. అదేంటి సార్ సాయిబాబా పిలిస్తే పలుకుతాడు పిలచి చూడమంటిరి కదా ! ఇలాంటి విషయాల్లో కాకుంటే ఇక సాయితో మనకేంటి సార్ పని '' అన్నాను. పిలిస్తే పలుకుతాడు అనే నమ్మకం కుదిరేంత వరకే పిలవాలి. ప్రతి విషయానికీ వారిని పిలవకూడదు. మన పని మనం చేస్తుంటే మనలను ప్రేరణ పెట్టి సరైన మార్గంలో నడిపిస్తారు'' అన్నారు. ఈ మాట నాకేమీ నచ్చక చింతాక్రాంతుడనై ఎక్కడో యోచిస్తూ మాస్టారు నా ముందున్న సంగతి కూడా మరచిపోయాను. కొంతసేపు అయినాక ఆకరుణామయుడే కలుగ జేసుకొని ''మద్రాసు పోవద్దు వాళ్ళమ్మను రోజూ పారాయణ చేయమను'' అన్నారు. బ్రతుకజీవుడా అని ఇక మారు మాట్లాడకుండా తల ఊపేశాను. ఏ పుస్తకం పారాయణ చేయమంటారు. ఎన్ని పేజీలు పారాయణ చేయమంటారు. పారాయణ అయ్యాక ఏమి చేయలి. ఇలాంటి ప్రశ్నలు వేసి ఉంటే చాలా ఇబ్బంది పడి పోయేవాడిని. అలాంటి ప్రశ్నలేమీ అడగకుండా వారే నా నోరు కట్టేశారు.



ప్రస్తుతం ఈ పారాయణ మహత్యమే పిల్లవాడు అన్ని విధాల బాగున్నాడు. డబ్బు విషయంలో లెక్క ఒక్కటే తెలియదు. అది కూడా కాలాంతరంలో సరి చేస్తారు. నిత్యం ఏదో ఒక మహనీయుని చరిత్ర సాధ్యమైనన్ని పేజీలు చదువుతుంది. అనారోగ్యమై చదవలేకుంటే నేను చదివి విన్పిస్తాను. వారి ఆజ్ఞ అలా పాటిస్తుండడమే మన విధి.

## మాస్టరు గారి మంచి మాటలు

మానవులందరూ చిన్నా పెద్ద భేదం లేకుండా ఆశ్రమ వాసులు, పీఠాధిపతులూ, బిర్లా, టాటాలు, కడు బీదవారు మనలాంటి మధ్య తరగతి మనుషులు అనుక్షణం ఒక విషయం మరచిపోతున్నారు - అనుక్షణం మనం మృత్యువునకు దగ్గరౌతున్నామనేది పరమ సత్యం.

కఠోరము, మహాభయంకరమైన ఆఖరి క్షణంలో మరణ భీతికి అనుక్షణం దగ్గరౌతున్నామని మరచి పోతున్నాము.

శ్రద్ధా భక్తులనే సంచులు సర్దుకొని రైలురాగానే వెనక్కు తిరిగి చూడకుండా వెళ్ళాలి. ఆ రైలు మనకోసం ఆగదుకదా ?

శ్రద్ధకు ముందు శరణాగతి ఒక్కటే. హాత్ దరూన్ చలాల్-గుర్వాజ్ఞలను పాటించండి. అన్నారు శ్రీ అనసూయ మాత గారు.

శ్రీ మాస్టరుగారు మన మంచి కొరకు ఏమి చెప్పారు ? మీరెక్కడుంటే అక్కడ సత్సంగం చేయండి. అదే నాకు లక్షలిచ్చినట్లు అన్నారు. అలా చేసి మనం వారి ఋణం తీర్చుకునేందుకు ప్రయత్నం చేద్దాం.

ఇచ్చిన సదవకాశం సద్వినియోగం చేసుకోలేకుంటే బూడిదై రాలిపోతావు అన్నారు. మాయ ఎవ్వరికీ తనంత తానుగా తనను అతిక్రమించ నివ్వదు. నీ ప్రత్యేక ప్రయత్నం ద్వారా అతిక్రమించు అని చెప్పారు. చాలా కనీస సాధనగా నిత్యం నాలుగు వేళలా సాయి హారతులివ్వండి వారు మిమ్ములను రక్షిస్తారు. ఉండే స్థితి నుండి పడిపోకుండానైనా రక్షిస్తారు అని సెలవిచ్చారు.

## పారాయణ, పూజ, ప్రదక్షిణలు చేసే స్థలం

సాధారణ మానవులందరమూ కంటికి కనబడేదే సత్యం అనే ధోరణిలో ఉంటాము. ఏ విషయంలోనైనా ఆత్మ జ్ఞానుల మాటే మనకు శరణ్యము. పై సాధనలు ఎక్కడ చేసినా ఒక్కటే అనే మన పద్ధతి మహనీయుల

సలహాతో పోల్చి చూచినప్పడు మన పద్ధతి ఎంత లోపభూయిష్టమో తెలుస్తుంది.

మన ఇంట్లో పారాయణ చేస్తే 10 పైసల ఫలిత మొస్తే అదే పారాయణ మన గ్రామంలోని ఏదైనా దేవాలయంలో చేస్తే ఒక్క రూపాయి ఫలితమెుస్తుంది. అదే పారాయణ కాశీ, శ్రీశైలం, తిరుపతి వంటి పుణ్యక్షేత్రాలలో చేస్తే పది రూపాయల ఫలితమొస్తుంది. శిరిడి సాయి, గొలగమూడి వెంకయ్య స్వామి లాంటి మహనీయుల సన్నిధిలో అదే పారాయణ చేస్తే ఫలితం అనంతంగా వస్తుంది. అని మాస్టరు గారు చెప్పారంటే వారి సలహాను మన పరిమిత బుద్ధి శక్తితో తర్కించకుండా ఆచరించి మేలు పొందడమే కర్తవ్యము.

పాఠకులు ఏవిధంగా భావించినా భావించవచ్చు. కానీ నేను మాత్రం మాస్టరు గారే నా చేత అలా లెటర్ వ్రాయించి ఆపైన ఊహించ వీలుకాని పనులు జరిగేటట్లు ఆయా వ్యక్తులను ప్రేరేపించారని నా ధృడ నమ్మకము.

నెల్లూరులో ఒక ఇల్లు పోస్టాఫీసుకు అద్దెకిచ్చాము. ప్రక్క ఇంట్లో కాపురం మా మామగారు. పోస్టాఫీసుకు వీళ్ళకు మధ్య ఉమ్మడి గోడ. ఐదు సంవత్సరముల నుండి పోస్టాఫీసు ఖాళీ చేయమంటే చేయరు. మా మామ గారి వైపు స్లాబు పడిపోయింది. తిరిగి స్లాబు పోసుకోవాలంటే ఉమ్మడి గోడ తీసి గట్టిగా పెట్టాలి. రెండు సంవత్సరముల నుండి గోడపెట్టే వీలు లేదు. ఇటుక, ఇసుక తోలించారు. ఎన్నో సార్లు నా దగ్గరకొచ్చి సలహా అడుగుతుంటారు. ఇంటి ఓనర్ విజయవాడలో ఉన్నాడు. అతనికి నన్ను జాబు వ్రాయమన్నారు. వచ్చి కూర్చొని గోడ పెట్టించేటట్లు చూడమని అతనికి జాబు వ్రాస్తూ ఉంటే నా చేతిలోని పెన్ను మరొక విధంగా వ్రాయసాగింది.

''ఇటుక, సిమెంటు, ఇసుక నల్గురు కూలీలు ఇద్దరు మేస్త్రీలు రెడీగా పెట్టుకొని సాయంత్రం 6 గం..లకు గోడ ఊడదీసి తెల్లవారేసరికి గోడ కట్టుబడి పూర్తిచేయ్యండి. గోడ సగం పెట్టాక అవతల మనుషులు ఇటుక ముక్కలు లేకుండా, మనుషులు ఇవతల ఉండి మిగిలిన గోడ పూర్తి చేయండి. తెల్లవారి పోస్టుమాస్టరు అడిగితే రిపోర్టులో నా పేరు వ్రాయించండి. నేను వెళ్ళి మాట్లాడతాను అని లెటర్ వ్రాశాను.

వాళ్ళాలెటరు పోస్టుమాస్టరుకు చూపించి మీరు గోడ కట్టుకునేందుకు సహకరించకుంటే ‥రగపోయేపని ఇది అని గట్టిగా తగవు పెట్టుకున్నారు. ఆ పోస్టుమాస్టర్ బెదిరిపోయి పోస్టల్ సూపరెండెంట్ దగ్గరకు పరిగెత్తాడు. సూపరెంటెండెంట్ గోడ కట్టుకునే పర్మిషన్ ఇచ్చి



నాలుగు రోజులలో గోడకట్టమని ఆర్డరిచ్చాడు. పని పూర్తయిపోయింది. విజయవాడ మనిషిని రమ్మని వ్రాయాలని జాబు వ్రాయబోతూ పై విధంగా వ్రాయడమేమిటి - పోస్టుమాస్టర్ నాపైన రిపోర్టు ఇవ్వాలని పోతే పోస్టల్ సూపరెంటెండెంట్ గోడ కట్టుకునే పర్మిషన్ ఇవ్వడమేమిటి. అంతా మాస్టరు గారి ప్లాను. లోతుగా యోచించే కొద్దీ అంతుబట్టనది ఈ లీల.

## మహా సమాధి అనంతరం భౌతిక దర్శనం

కుమారి లక్ష్మీ ప్రభ గారు హైదరాబాద్ వారు తన దివ్యాను భవాన్ని ఈ క్రింద లెటల్ ద్వారా వ్రాస్తున్నారు.

''మాస్టరు గారిని నేను ఎప్పడూ ప్రత్యక్షంగా చూడలేదు. మాస్టరు గారికి లెటర్స్ వ్రాస్తే -- ఇచ్చేవారు. మాస్టరు గారు సమాధి అయిన తర్వాత మా ఇంటికి భౌతికంగా వచ్చారు. అప్పడు వీధిలో కరెంటు పోయింది. సమయం 7 గం..లకు మాస్టర్ తెల్లపంచా, తెల్లచొక్కా వేసుకొని ఫోటోలో ఉండేవిధంగా ఉన్నారు. మాస్టర్‌తో చిన్న అమ్మాయి కూడా వచ్చింది. ఆ అమ్మాయి వేదవతిలా వుంది. (ఫోటో మా ఇంట్లో ఉంది) ఇక్కడ మా అమ్మాయి లక్ష్మి ఉండాలని అడుగుతున్నారు. నేను అప్పడు వీధిలోనే ఉన్నాను. ఆయనను చూడగానే నాకు తోచలేదు. కళ్ళ వెంబడి నీళ్ళు వచ్చాయి. ఏమి మాట్లాడలేక పోయాను. నన్ను ఇంట్లో అందూ రాజ్ అని పిలుస్తారు. ఈయన లక్ష్మి అని అడుగుతున్నారేమిటి అనుకున్నాను. (మాస్టర్ నాకు లెటర్ వ్రాసేటప్పడు చి.. లక్ష్మీ ప్రభకి అని వ్రాసేవారు) ఆయన అక్కడ ఉండగానే నేను లోపలికి వెళ్ళిపోయాను. మాష్టరు గారిని మా ఇంటిలోని వాళ్ళు కూడా చూచారు. తర్వాత కొంచెం సేపు అయిన తర్వాత మాస్టరుగారు వచ్చారని వీధిలో మిగతా వాళ్ళని అడిగితే మా ఇంటికి ఆ పోలికలున్న వాళ్ళు ఎవరూ రాలేదని చెప్పారు.

**లక్ష్మీప్రభ**

## నిష్ట, సబూరి

"నిష్ట, సబూరి సాయికి సమర్పించాలంటే తప్పక త్యాగమవసరం. త్యాగం లేకుంటే నిష్ఠా సబూరి సమర్పించడం సాధ్యం కాదు." అన్నారు శ్రీ మాష్టారు.

సబూరి అంటే ఓర్పు. మన గౌరవ ప్రతిష్టలు ఏమవుతున్నాయి అనే ఆలోచన వస్తే సబూరి ఆప్రాంతంలో ఉండదు. శ్రీ మాష్టరుగారు ఏనాడుఎవ్వరికీ కీడు తలపెట్టి ఎరుగరు. వారిపై అభాండం వేసి షుమారు నెలరోజులు కత్తిచూపించి బండబూతులు నిత్యంతిడుతున్నాడు. ఒక్కరోజైనా కాస్త కఠినంగా, పరుషంగా శ్రీ మాష్టారు మాట్లాడి ఎరుగరు. ఆ సమయంలో వారికి తన పరువు పోయింది అనే ఆలోచన వస్తే అంతటి ఉదాత్తమైన ప్రవర్తన చూపలేరు. పరువు, ప్రతిష్టలనే మానసిక గొప్పలు త్యాగం చేశారు గనుకనే ఎంతో నిగ్రహంతో ఉండగలిగారు. గనుకనే అది అసలైన సబూరి అని శ్రీసాయి వారిని మెచ్చుకున్నారు - నాబిడ్డ లాంటివాడు అన్నారు.

ఇక నిష్ట విషయంలో త్యాగం ఎంతైనా అవసరం. నిష్ట అంటే అనుక్షణం మన మనస్సును వారిపై లగ్నంచేయడమని అర్థం. అనుక్షణం వారిపై మనస్సు లగ్నం చేయడం చాలా గొప్ప విషయం. కనీసం నిత్యం ఒక గంటసేపైనా వారి పూజ పారాయణ చేయమంటే వీలుకాలేదని సాకులు చెవుతున్నావము. మనకు తీరిక చిక్కినప్పుడు. ఉత్సాహమున్నప్పుడుచేస్తాము. శ్రీ స్వామివారు మాత్రం ఏమారకుండా అనుక్షణమూ మనలను కనిపెట్టి ఉండాలని కోరుకుంటాము. ఇదెంత ధర్మ విరుద్ధమైన మాటో చూడండి. ప్రతి నిత్యం ఒకగంటసేపు వారిని స్మరించాలంటే ఎన్నిపనులడ్డమొస్తాయో చెప్పలేను. ఆటైంలోనే బంధువులొస్తారు. అప్పుడే స్నేహితులొస్తారు, అప్పుడే అర్జంట్ పనులు. కానీ



మనకు ఆపద వచ్చినప్పుడు వీళ్ళెవ్వరూ మనకు సహాయపడలేరు. అప్పుడు శ్రీ స్వామి వారే కావాలి. గనుక నిత్యం నిష్ఠ వారికి సమర్పించాలంటే బంధు మిత్రులనూ., పనులనూ ఆసమయంలో త్యాగం చేసితీరాలిగదా.

గనుక నిష్ఠ, సబూరి లంటే త్యాగం లేకుండా వీలయ్యే విషయాలు కాదు. మనం ఎంత గొప్పగా త్యాగానికి సిద్ధమయితే అంతగొప్పగా దైవ కృప పొందగలుగుతాము. యోగ సిద్ధి పొందిన మహనీయులు వారి దివ్యస్థితి నుండి దిగి మనకు సహాయం చేయాలంటే అమాత్రం త్యాగంలేకుంటే వీలుకాదు. అంతటా, అన్నింటిలోనూ వారే ఉన్నారన్న ఎరుక మనకు వస్తే ఇక దేన్నైనాత్యాగం చేసేందుకు వెనుకాడము. అలాంటి ఎరుక కలిగినంత వరకు జాగ్రత్తగా ఇష్టాఇష్టాలకు దూరంగా ఉండేసాధన సాగించి తరించమన్నారు. లేకుంటే పొయ్యేవాళ్ళను పోనిచ్చేదే గదయ్యా అంటారు.

## పదిమంది లోకిరాకుంటే

పది మందిలోకి రాకుంటే నీలోని దోషాలు బయటపడవు. బయట పడకుంటే ఆదోషాలు నీలోనున్నట్లు గుర్తించలేవు. గుర్తించకుంటే వాటిని నిర్మూలించుకునే కృషిచేయలేవు అన్నారు. పదిమందిలో కంటే టీ కొట్ల దగ్గర, సినిమాహాళ్ళ దగ్గర బాతాఖానీ అనికాదు. సత్సంగాలు, మిత్రులతో కలసి జీవించడం.

ఉదా :- శ్రీ స్వామి వారిని సేవిస్తున్నానని నాకు తెలియకుండానే నాలో గర్వముంది. నేను మంచిదనుకొని మందిరంలో జరుపాలనుకొన్న ఒక కార్యక్రమం ఒకవ్యక్తి నిరాకరించాడు. అక్కడ నుండి వస్తూ నాతోగూడ వస్తున్న వ్యక్తితో ఆ నిరాకరించిన వ్యక్తిని గూర్చి చాలా తక్కువ చేసి మాట్లాడుతూ నిందారోపణ చేస్తూవచ్చాను. ఆ తర్వాత కొంతసేపటికి శ్రీ స్వామి వారే నాకు నాబలహీనతను గూర్చి తెలియచెప్పారు. నాభినందతి

నద్వేషి అనేది నేనాచరిస్తున్నానా. ఇష్టం అయిష్టం లేకుండా జీవించగలుగుతున్నానా. అల్లామాలిక్ - అంతా శ్రీ స్వామి వారేచేస్తున్నారనే భావం నాలో లేదు కదా! ప్రతిచిన్న విషయానికీ గురువు మీద ఆధారపడడమే నిజమైన సాధన గదా? దాన్ని నేనాచరిస్తున్నానా. పై విషయాలన్నీ నా ఆచరణలో ఉంటే ఆ వ్యక్తిని నిందించడం ఎందుకు? నన్నునేనే పాదరక్షతో కొట్టుకున్నంత పనైంది.

ఇంత జరిగినా మరొక రోజు మరొక పొరపాటు చేయనే చేశాను. ఒక స్వామి సేవకునకు షుగర్ వల్ల కాలు తీసేశారు అని ఒకతను చెప్పగానే అతనితో కరచాలనం (షేక్‌హాండ్) ఇచ్చాను. అతనికి కాలుతీసేస్తే నాకు సంతోషమైందని అర్థంగదా, నిజానికి గతంలో అతడు నాకెన్నో ఇబ్బందులు కలిగించి యుండవచ్చు. కానీ అతని ప్రవర్తనంతా గతజన్మ ఋణాను బంధాన్ని అనుసరించి జరిగిందే కానీ అతని మీద మనకెలాంటి భావమూ ఉండకూడదు. ఇది సాధకుని లక్షణము. అతని మీద ద్వేషభావ ముంటే ఆ భావమే మరుజన్మకు విత్తనమై నిలుస్తుంది. కాలు తీసేశారు అనగానే సంతోషమై కరచాలనం చేశాను. అతని ఎడల మనకు గల భావం కార్యరూపం ధరించింది. నాలో ఇలాంటి లోపముంది అనే విషయం నేను మనిషి మొగమే చూడకుండా ఉంటే తెలియదుగదా! అందుకే శ్రీ మాష్టారు పదిమందిలోకి రాకుంటే నీలోని లోపాలు బయటికి రావు అన్నారు.

మనలో కరుడు గట్టిన భావాలు ఎన్ని ఉన్నాయో అవన్నీ బయటికి రావాలి. ఆ భావాలను మన వివేక విచారాలు అనే వరుపురాళ్ళకు గురిచేసి నిర్మూలించుకోవాలి. సంపూర్ణ శరణాగతి అంటే ఏమిటో నోటి మాటలతోకాక మానసిక భావాల రూపంలో మనకు మనమే సరిచూచుకోవాలి. మన భావాలను మనమే సరిచూచుకునే శక్తి సద్గురు కృపవల్లనే కలుగుతుంది. మనకు సాధనపై ఉండే ప్రీతి, ఆర్తి, వల్ల మాత్రమే సద్గురు కృప అనుభవమౌతుంది.



## ఆదిలో అపరాధం

మనస్సు యొక్క చలనాన్ని అరికట్టడమే సాధన యొక్క రహస్యము. అలా చలనాన్ని సంతరించుకున్న మనస్సు ఏమిచేస్తుందో గమనించాలి. ఏఏ ఆలోచనల రూపాన్ని మనస్సు ధరిస్తుందో ఆ ఆలోచనలు ఎంత వ్యర్థమో, అర్థరహితమో, దేవుని ఆజ్ఞకు భిన్నంగా ఉన్న మన ప్రవర్తన మనకు హృదయగతమైతే మనస్సు యొక్క వేగం తప్పక తగ్గుతుంది.

జాగ్రత్తులో "వాళ్ళిలా చేశారు, వీళ్ళిలా చేశారు. వానిది తప్పు వీనిది తప్పు" అని అంటూ ఏవేవో మాట్లాడుతుంటాము. వీటన్నింటినీ పోగొట్టుకునేందుకు శ్రీ మాష్టారు మంచి మందు చెప్పారు.

"ఆదిలో అపరాధం ఎవరిది?" అని ప్రశ్నించుకొని ఆలోచిస్తే ఇక ఎవ్వరినీ తప్పు పట్టలేము. జన్మ జన్మలు వెనుకకుపోతే ఇప్పుడిలా ప్రవర్తించే సంస్కారాన్ని మొట్టమొదట పరమాత్మే మనకు ప్రసాదించారు. తప్పు భగవంతునిది గదా. వారిని మనం తప్పు పట్టగలమా? పట్టలేము గనుక అవతలవాడు తప్పు చేసినా దానికి అతనిపై ద్వేషము, కోపం అలకలాంటి వికారాలు చూపడం పనికిరావుగదా?

భగవద్గీతలో మత్తః స్మృతిరిజ్ఞాన మపోహనంచ అంటారు. అజ్ఞానం కూడా ఆయనే. ప్రతిజీవిలోని జ్ఞానాన్ని నేనేనంటారు. అజ్ఞానం కూడా ఆయనే గనుక ప్రస్తుత అధర్మ ప్రవర్తనకు భగవంతుడే కారణం గదా? భగవంతుని నిందించగలమా ?

సహస్ర శీర్షా పురుషః అంటే అన్ని జీవుల రూపం ధరించిన పరమాత్మను నేనే అంటున్నారు. గనుక ఎలాచూచినా ఇతరులను తప్పులెంచుతూ, రకరకాల ఆలోచనలతో మనస్సును మరీ చంచలంచేసుకోకు అంటారు.

## ప్రతి చిన్న విషయానికి గురువు మీద ఆధారపడు

"ప్రతి చిన్న విషయానికి గురువు మీదనే ఆధారపడు. అదే అసలైన సాధన". అన్నారు శ్రీ సాయినాధులు. ఈ మాటను శ్రీ మాష్టారు తన ఆచరణతో మనకెలా బోధించారో గమనిస్తే మన ముండే సాధనలోని స్థాయిని బట్టి శ్రీ మాష్టారిని అర్థంచేసుకుంటాము.

విద్యానగర్‌లో శ్రీ మాష్టారు ఉండగా (వివాహంకాక ముందు ముఖ్యంగా) అనేక మంది తమకు జీవనోపాది లేదని, ఏదైన ధన సహాయం చేస్తే వ్యాపారం చేసుకొని బ్రతుకుతామని తాము తీసుకున్నపైకం తిరిగి ఇచ్చేస్తామని చెప్పేవారు. కాని ఎక్కువ మంది తిరిగి ఇవ్వరు. తిరిగి ఇచ్చే వాడాలేదా అనే "విచక్షణ లేకుండా అందరికీ ఇచ్చేస్తే ఎలాసార్" అంటే "సాయి వాళ్ళను నాదగ్గరకు పంపితే లేదని ఎలా చెప్పేది. మన దగ్గర ఉన్నంత వరకు ఇవ్వాలి గదా" అన్నారు. ఋణాను బంధాన్ని విశ్వసించు ఏప్రాణినీ తోలెయ్యవద్దు. అన్నమాట అక్షరాలా ఆచరించి మహాత్ముల ముద్దు బిడ్డడైనాడు. మనలను కూడా అలా ఆచరించి అలాగే కమ్మంటున్నారు.

విద్యానగర్ వదలి ఒంగోలు రావడంలో సాయిపై ఎలా ఆధారపడ్డాడో చూద్దాం.

విద్యానగర్‌లో అనేక కారణాలుగా గలాటాలు మొదలయ్యాయి. కొందరు భక్తులు మాష్టారు గారిని రెండు రోజులపాటు "ఈ ఉద్రిక్తత తగ్గినంతవరకు విద్యానగర్ విడిచిపొండి" అని కారుతెచ్చివాకిటి ముందు పెట్టారు. మరి ఒక పార్టీ భక్తులు "వాళ్ళకేంటి మనం భయపడి పారిపోవడం, ధర్మం మనప్రక్కనుంది గనుక సాయినాధుని అండ మనకుంది. మీరెక్కడికీ పోవద్దుసార్. మీ ఇంటి మీదకు ఎవరైనా వస్తే వాళ్ళ అంతుచూస్తాం" అని రెండవ పార్టీ భక్తులు, వీళ్ళిద్దరూకాక మూడవ పార్టీ కూడా తయారైంది.



ఎటూ చెప్పలేక తటస్థంగా ఉండిపోయారు. అప్పుడు మాష్టారుగారు చెప్పారు. "మీరంతా కారుతోసహా వెళ్ళిపొండి. అరగంట తర్వాత తిరిగిరాండి, ఈ లోగా నేను శ్రీ సాయిని సలహా అడిగి చెపుతాను" అని వారికి చెప్పి అందరిని పంపేశారు. సాయినాధునకు ఒక అగరువత్తి వెలిగించి "ఈ క్లిష్ట పరిస్థితిలో మీ అజ్ఞయే నాకు శిరోధార్యము. ఈ రూములోకి అరగంట లోగా ఎవరిని ప్రవేశపెడతావో మీ ఇష్టం. అరగంటలోగా మొదట వచ్చినవారు ఏమిసలహాఇస్తే అదే పాటిస్తాను" అని చెప్పుకొని కూర్చున్నారు. వారిమనసులో ఎవరో విద్యానగర్ వాళ్ళే వస్తారని అనుకొన్నారు. కాని చిత్రంగా ఎవరో అనంతపూర్ నుండి ఒక క్రొత్తవ్యక్తి వచ్చి రూములోకి రాకముందే "సార్ ఎక్కడికో పోతున్నట్లున్నారు. ఈ పూలు పండ్లు తీసుకొని పోండి" అంటూ రూములోకి వచ్చి పూలు, పండ్లు చేతిలో పెట్టారు.

మాష్టారు : మనదేవూరు ?

ఆగంతకుడు : అనంతపూర్ సార్

మాష్టారు : మీరు బస్సులో ఎవరితోనైనా మాట్లాడారా ?

ఆగంతకుడు : నేను నామంచేస్తూ కళ్ళు మూసుకొని వచ్చాను సార్. ఎవ్వరితోనూ మాట్లాడలేదు.

మాష్టారు : ఎవ్వరితోనూ మాట్లాడకుంటే నీవు ఈ ఊరికి క్రొత్తగదా! మరి మాఇల్లు ఎలా తెలిసింది?

ఆగంతకుడు : భరద్వాజ గారి ఇల్లెక్కడని మాత్రం అడిగాను. ఈ రోడ్డున్నే నడిచి ఐదారు ఇండ్లు దాటగానే వాకిటి ముందు బావి ఉంది అదే వారిల్లని చెప్పాడు. అలాగే వచ్చాను.

మాష్టారు : మీరెక్కడికో పోతున్నట్లున్నారు. ఈపూలు, పండ్లు తీసుకొని పోండి అని ఎందుకన్నారు?

ఆగంతకుడు : వెరీ సారీ సార్, మీరెక్కడికీ పోవడంలేదా? ఏదో నాకలా అనిపించి అలా అన్నాను అంతేసార్ క్షమించండి.

ఆగంతకుడు వస్తూనే ఈపూలు, పండ్లు తీసుకొని పోండి అన్నాడు గనుక - అదే సాయి ఆజ్ఞ అని అరగంట తర్వాత వచ్చిన కారు ఎక్కి ఒక్క సామాను కూడా తాకకుండా విద్యానగర్ వదిలేశారు.

ఇక్కడ అంతటి కష్టము, అతి క్లిష్టమైన పరిస్థితిలో కూడా అరగంటలో మీరు ఎలా ఆజ్ఞాపిస్తే అలా నడుచుకుంటాను. ఎవరినోటిగుండానైనా పలుకండి. సాయినాథుడు నాకు ప్రత్యక్షమైపలకాలి అనికోరలేదు, "ఈ చూడ బడేదంతా కలసి నేను" అన్న సాయి వాక్యాన్ని ఆధారంగా ఎవరినోటి గుండా పలికే పలుకైనా అది సాయి ఆజ్ఞ మాత్రమే అని విశ్వశించి తన ఇష్టము అయిష్టానికి బానిసకాకుండా సాయిపై ఆధారపడి వారి ముద్దు బిడ్డడైనారు.

## శ్రీ మాష్టారు నా అంతరంగాన్ని పరీక్షించడం

నేడు ప్రతివారూ అర్హమైన వారికి పాదాభివందనం చేయడం ఒక ఫ్యాషనైంది. అవతలి వారి ఎడల మనభావమెలా ఉన్నా మనతోటి వారు పాదనమస్కారం చేస్తున్నారని మనం కూడా చేస్తున్నాము. శ్రీమాష్టారు గారి ఎడల నాభావాలెలా ఉన్నాయో చూడ దలచారు. దానికొక చిన్న పరీక్ష పెట్టారు.

అప్పుడు నేను వారి ఇంటిలోని ఒక చిన్నగదిలో ఉంటూ (విద్యానగర్‌లో) నావంటనేను చేసుకొని తింటున్నాను. ఒకరోజు ఐదారు పనస తొనలు ఒక కాగితంలో పెట్టుకొని శ్రీ మాష్టారే స్వయంగా నారూములోకి వచ్చి "ఇదిగో అన్నారు" ఆ సమయంలో నాచేతిలో ఏదోవస్తువు ఉంది. ఆ వస్తువు అక్కడ పడేసి వెంటనే దొసిలిపట్టకుండా



ఒక్క నిముషం నా పనిలోనే నిమగ్నమయ్యాను. ఒక నిమిషమైనా నేను దోసిలి పట్టకుంటే ఆ పనసతొనలు నేలపై పడేసి వెళ్ళారు. నేల మీద పడేసినందుకు నేనెలా రియాక్ట్ అవుతానో గమనించదలచారు. నేను బి.యస్‌సి., బి.ఇడి. టీచరును గదా, చేతికివ్వకుండా క్రిందపడేసి పోయాడే. ఇదేమి మర్యాద అనే భావాలు నాకు రాలేదు. అందుకు బదులు అయ్యో గురువుగారొస్తే వెంటనే దోసిలి పట్టకుండా ఆలస్యం చేశానే ఎంతబుద్ధిలేనివాణ్ణి అని మాత్రం అనుకొన్నాను. నామనోభావాలన్నీ నా ముకంలో కనబడుతున్నాయిగాబోలు అది మొదలు నాపై చాలా ప్రేమగా ఉండేవారు. హృదయంలో పూజ్యాభావం లేకుండా పాదాభివందనం చేయడం మంచిదికాదు. ఆ వ్యక్తిని చక్కగా పరీక్షించాకనే పాదాలు పట్టుకోమని శ్రీ మాష్టారిబోధ.

## నిరంతర గుర్తు

మీలారేపా చరిత్రకు "ముందుగా ఒక్కమాట" వ్రాస్తూ భగవంతుని సంపూర్ణముగా విశ్వసించి, నిరంతరమూ గుర్తుంచుకొని, జీవితమంతటిని ఆయనకు తృప్తికరమైన రీతిన గడుపుకోవడమే సర్వమతాల సారము అని వ్రాశారు. ఈ ఒక్కమాట హృదయపూర్వకంగా అర్థమై, వంటబడితే నేటి మతకలహాలు, జాతివైషమ్యాలు, రాజకీయ కల్లోలాలు మొదలైన సర్వ అనర్థాలు సమసిపోతాయి.

సంపూర్ణంగా విశ్వసించి :- ఏమని విశ్వసించాలి? సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వసమర్థుడు, అనంత కరుణామయుడు నిత్యసత్యుడు, తన ఉనికికి వేరేకారణము లేనివాడు. ఈ విశ్వమంతా తనలీలా రూపముగా గలవాడు అని విశ్వసించాలి.

నిరంతరమూ గుర్తుంచుకొని :- ఈ విధంగా అనుక్షణమూ గుర్తుంచుకోగలిగితే మనం అనుక్షణమూ ధ్యానం చేసినట్లవుతుంది. మనం కళ్ళుమూసుకుని కూర్చొని చేసే ధ్యానం గజస్నానం గాకుండా

పోతుంది. గజస్నానమంటే ఏనుగు పరిశుభ్రంగా నీటిలో మునిగి గట్టుకువచ్చి తనతొండముతో ఒడ్డునున్న ఇసుక మట్టిని తన వళ్ళంతా పోసుకుంటుంది. అలాగే మనం ధ్యానంలో నుండి లేచాక రాగద్వేషాలకు లోనవడం నాది, నా వాళ్ళు అనే వ్యామోహంలో పడడం జరిగి మనధ్యానం గజస్నానమవుతుంది. మనం ధ్యానం నుండి లేచాక గూడా ధ్యానం కొనసాగాలి. ధ్యానమంటే ఇక్కడ భగవంతుని హృదయ పూర్వకంగా గుర్తుంచుకోవడం.

అలా నిరంతరం గుర్తుంచుకోకుండా అడ్డుపడేది ఏది? అదిమన ఆలోచనా స్రవంతి. నీ ఆలోచనలన్నీ నీ అహంకారమే అన్నారు శ్రీ మాష్టారు. గనుక మన అహం సంపూర్ణంగా నశిస్తేనే ఆలోచనాస్రవంతి ఆగుతుంది. అహం చావాలంటే సంపూర్ణ శరణాగతి ఒక్కటేమార్గం - రాగద్వేషాలు నశించడమే కావలసింది. ప్రతిచిన్న విషయానికీ గురువు మీద ఆధారపడవలెను. అదే అసలైన సాధన అన్నారు. ఏ విషయంలోనైనా సరే అలా ప్రవర్తించినవారిపై నిందారోపణ చేయకూడదు. ఆత్మలో కూడా అలాంటి భావం తగదు. వారలా ప్రవర్తించేలా చేసింది మన పూర్వ ఋణానుబంధము మాత్రమే. ఇప్పుడా అనుభవం ద్వారా బాకీ రద్దయిందిగనుక సంతోషించాలి. అలాకాకుండా ఎదుటి వారిపై ఆత్మలోనైనా ద్వేషభావం ఉంచుకున్నామంటే మరుజన్మకు ఆనాటి మన ద్వేషభావమే విత్తనమైకూర్చుంటుంది. గనుక ప్రతి విషయానికి గురువుగారి వైపేచూడు. అలా చూడడమే నిరంతర చింతన. ఎవరితో మాట్లాడినా ఎదుటివ్యక్తిలోని గురువును గుర్తిస్తూ (మానసికంగా) బాహ్యంగా నీ పనిసాగించు అన్నారు. మనసు గురువును చూస్తే కళ్ళు స్నేహితుని చూడాలంటారు శ్రీ మాష్టారు. అలా చేసినపుడు మన ధ్యానం గజస్నానం కాదంటారు. అలా చేయగలిగే శక్తినిమ్మని ప్రార్థిస్తున్నాను.



## ప్రతి మెతుకూ మా నాన్నగారి రూపం

నేను తినే ప్రతి ముద్దలోని ప్రతిమెతుకూ మా నాన్నగారి రూపంధరించి "ఇతరులు శ్రమించి పండించిన ఆహారాన్ని తింటున్నావు. ఆ జీవులకు ఋణపడకుండా వారికొరకు నీవేమిచేస్తున్నావు" అని అడుగు తున్నట్లుంటుంది. గనుకనే ఇలా నిరంతరం శ్రమ చేయగల్గుచున్నాను.

శ్రీ మాష్టారు ఐదు, ఆరు సంత్సరముల వయస్సులో ఒకరోజు భోంచేసేముందు వాళ్ళ నాన్నగారు పెద్దముద్ద భూత బలికి ప్రక్కనపెట్టగానే "మానవునకు అన్నం తినడం కూడా చేతగాదు" అని అన్నారట. అప్పుడు అనంతాచార్యులు గారు అన్నందగ్గరనుండి లేచివెళ్ళి బియ్యంలోని ఒక మెరికగింజ తెచ్చి "ఇదేంటి బాబు?" అని అడిగారట. మాష్టారేకాదు తక్కిన అన్నలుకూడా చెప్పలేకపోయారట. అన్నం ఎలావస్తుందంటే బియ్యం ఉడకబెడితే వస్తుందన్నారు. బియ్యం ఎలావస్తాయి? అంగడిలో నుండి తెస్తే, అంగడిలోకి ఎలా వస్తాయి? టౌన్ నుండి తెస్తారు. టౌన్‌లోకి ఎలా వస్తాయి? చెప్పలేక పోయారు. అప్పుడు అనంతాచార్యులుగారు వరిచెట్టు బొమ్మగీచి ఆచెట్టుకు ఈ మెరికగింజలాంటి వడ్లు అనేవి పండుతాయి, వాటి పొట్టుమిషనులో తొలగిస్తే బియ్యం వస్తాయి. ఈ వరిచెట్లు ఎలా వస్తాయి? భూమినుండి ఇనుముతీసి నాగలికి వాడే కర్రు, కొడవళ్ళు గడ్డపార, పారచేయడం, నాగళ్ళు కంసాలి తయారు చేయడం, నాగలిని ఎద్దులు లాగడం, మనిషి దున్నడం, నారు పోయడం, నారు పెరికి కూలీలచేత పొలమంతా నాటడం, ఎరువులువేసి నీరుపెట్టి నాలుగైదు నెలలు ఆచెట్లను పెంచితే అవి వడ్లు కాస్తాయి. అనేకమంది కూలీలు ఈ వరిచెట్లుకోసి వడ్లు పిడివేటుకొట్టి ఇంటికితెచ్చి, మిషనుకు వేస్తే బియ్యం వస్తాయి. ఈ బియ్యం అంగడికి అక్కడనుండి మన ఇంటికొస్తాయి.

అలాగే కూరగాయలు, అలాగే పాలు బొగ్గులు, బొగ్గుల పొయ్యి, పాత్రలు, బావి, బక్కెట్టు, త్రాడు, చాకు, లాంటి అన్ని వస్తువుల వెనుక ఎందరి శ్రమదాగివుందో విశదీకరించారు. ఇన్ని జీవులు కష్టంచేస్తేనే మనకు అన్నం వచ్చింది. ఇన్నిజీవులలోనూ భగవంతుడే ఉండి పనిచేస్తున్నాడు. అలా శ్రమచేసి మనకు ప్రతిపూట ఆహారమందించే భగవంతునకు కృతజ్ఞతతో మొదట కొంత ఆహారం వారికి సమర్పించి మనం తినాలి. అలా సమర్పించేందుకే ఈ పెద్దముద్ద తీసిపెట్టాను. అలా భగవంతుని కర్పించకుండా తినడం భగవంతుని ఎడల కృతజ్ఞతలేకుండా ప్రవర్తించడమౌతుంది. అని విశదీకరించారు.

ఆనాటి ఆ పాఠమే నా మనోఫలకముపై చెరగరాని ముద్రవేసింది. సాటిజీవులకు మనకు చేతనయినది కృతజ్ఞతతో చేసి తీరాలనే తపనే నాచేత ఈ నిర్విరామకృషి చేయిస్తుంది. ఇదంతా మా నాన్నగారి చలవే. వారి గొప్పదనంలో వెయ్యోవంతుకూడా మాకులేదు. వారితో మేము ఏ విధంగాను సరిపోలము అని తన వినయమైన మార్గంలో తండ్రిగారికి నమస్కారములర్పించారు.

సాటి జీవుల శ్రేయస్సు కొరకు మీ శక్తికొలది ఏదైనచేయండి. లేకుంటే ప్రకృతికి మనం ఋణపడి తగువిధంగా ప్రకృతి తన ఋణం రాబట్టుకొంటుంది. మన బ్యాంకు బ్యాలన్సులు మనలను రక్షించలేవు. మన మాచరించిన ధర్మమేమనలను రక్షిస్తుంది. అని ముగించారు.

మనం కూడా నిత్యం కాకబలికి ఆహారం పెట్టడమే కాకుండా ఆ ఆహారం ఎన్ని జీవులకృషితో మనకు లభిస్తుందో ఆజీవులలోని పరమాత్మకు మనం ఎలా కృతజ్ఞులమై ఉండాలో ప్రతిముద్ద తినేటప్పుడు చింతన చేస్తూ తిని ఋణవిముక్తుల మయ్యే విధంగా నడుచుకుంటే శ్రీ మాష్టారు మనలను ఆశీర్వదిస్తారు.



## త్వమేవ మాతాచ

మానవునకు సుఖము, శాంతి, ఆనందము లేకుండా ఎందుకు పోయాయి ? త్రికరణశుద్ధిలేక పోవడమే. మనస్సు, వాక్కు, శరీరము త్రికరణములంటారు. ప్రతినిత్యం ఆరతుల్లోను పూజల్లోను "త్వమేవ మాతాచ పితాత్వమేవ త్వమేవబంధుశ్చ సఖాత్వమేవ త్వమేవ సర్వం మమదేవదేవ" అని అంటున్నాము. ఇప్పటికి ఎన్నివేల, లక్షల సార్లు అన్నామో, ఇక ఎన్నిమార్లు అంటామో. ఆశ్లోకంలో మనం చెప్పే భావాన్ని ఆచరిస్తున్నామా? నా తల్లి, తండ్రి, బంధువులు, స్నేహితులు సర్వులూ (జడ జీవరూపాలన్నీ) నీవే అని చెపుతున్నాము. ఆచరించడంలేదు. త్రికరణశుద్ధిలేని పూజ హారతులు వ్యర్థమవుతున్నాయిగదా! సాయి సన్నిధికిచేరి చెప్పేదొకటి, చేసేదొకటి తలచేది మరొకటిగా ఉంటే మనకు తృప్తి, శాంతి, ఆనందం వారెలా ప్రసాదిస్తారు. మనం వారి బిడ్డలం గనుక ప్రేమతో చేరదీసి బుద్ధి గరపాలని చూస్తున్నారు. అందరిలో ఉండే సాయిని గుర్తించకుండా మన చెడ్డప్రవర్తన ద్వారా మనకష్టాలు మనమే సిద్ధం చేసుకొంటున్నాము. ఇలాంటి ప్రవర్తనకు కారణం మన ఇష్టము, అయిష్టములే. దాన్నే మరొక విధంగా చెపితే అటాచ్‌మెంట్ మరియు డిటాచ్‌మెంట్. దీని భావము చిరంజీవి గోపాల్ వెంకటగిరి వారికి శ్రీ మాష్టారు స్వప్నంలో బోధించారు. (సెప్టెంబర్, 2000).

పోనీ తల్లి, తండ్రి, భార్య, పిల్లలు, స్నేహితులు, బంధువులను సాయిరూపాలుగా ఆదరించాలి. అట్లా ఆదరించలేకపోయినా పరవాలేదు. కనీసం ఆశ్లోకంలో నిత్యం చెపుతున్నాము గనుక వాళ్ళందరినీ సాయిరూపాలుగా మనసుతో భావననైనా చేస్తున్నామా? అదీలేదు. మరి ఆకరుణామయుని కరుణ మనపైన కుంభవృష్టిగా అనుక్షణం కురుస్తున్నాసరే, మనం త్రికరణశుద్ధి లేకుండా చేసే పనులలోని పాపమే అడ్డమొచ్చి మనలను అట్టి పవిత్ర ఆచరణ వైపు మొగ్గనివ్వడం లేదు.

సద్గురు కృప పొందలేకున్నాము. అలా మనలను మొగ్గనివ్వకుండా మాయ మనలను వంచిస్తుంది. ఈ మాయను దాటశక్యము కాదంటారు శ్రీ కృష్ణుడు. మరి మార్గమేమిటి అంటే "మామేవయే ప్రపద్యంతే మాయామేతాం తరంతితే". అంటారు. నన్నే శరణు పొందితే మాయను దాటగలవు అంటారు. అట్లాచేయడాన్నే (వారిని శరణు పొందడాన్నే) శ్రీ మాష్టారు ప్రత్యేక ప్రయత్నము అంటున్నారు. ప్రత్యేక ప్రయత్నమంటే ఎలఉంటుందో చెప్పారు. భూమినుండి శూన్యప్రదేశం వరకు వెళ్ళి శూన్య ప్రదేశంలో ప్రవేసించి దానిగుండా ప్రయాణించి తర్వాత చంద్రాకర్షణలో ప్రవేసించి చంద్రమండలంచేరాలి. భూమినుండి శూన్య ప్రదేశం వరకు కొన్ని వందలమైళ్ళ ప్రయాణానికి ఎంత ఇంధనం అవసరమో శూన్య ప్రదేశంలో ప్రవేశించేందుకు అంత ఇంధనం కావాలట. కేవలం ఆలైన్ దాటేందుకు కొన్ని వందలమైళ్ళు నడిచేందుకు పట్టినంత ఇంధనం కావాలట. గనుక మాయను దాటాలంటే అనగా సద్గురువు మాట ఆచరించగలగాలంటే అంత ప్రయత్నం చేయందే సులభంగా ఆచరించలేము అన్నారు శ్రీ మాష్టారు.

## సత్యం - ధర్మం

సార్! మీరు ధర్మంతప్పారనీ, నీతులు బోధలవరకే, ఆచరణలేదని అందరంటున్నారు. అని అన్నవారితో "ఓరేయ్! సూర్యుడు పడమట ఉదయించడం జరిగినా నేను ధర్మం తప్పనురా! ఎవరో అంటే మనకేమి? ధర్మము, అధర్మము నిర్ణయించే సమర్ధులు సాయి మాత్రమే. రాగద్వేషాలలో కొట్టుమిట్టాడే మానవుల వల్ల ఆపని కాదురా! అన్నారు.

ఈ విశ్వమంతా సత్యం, ధర్మం మీదనే నడుస్తుంది. అందుకే భగవాన్ శ్రీ వెంకయ్య స్వామివారు మానవాళికంతటికీ తన చివరి సందేశంగా ఈ ఐదు పాయింట్లూ కొన్నిరోజుల తరబడి రాత్రింబవళ్ళు తాను బిగ్గరా అరుస్తూ తనసేవకులను అదేమాట మరలా అంటుండమని చెప్పారు. ఆ ఐదుసత్యాలు మానవజాతి సముద్ధరణకు ఐదు మూలమంత్రాలు.



1. సత్యం 2. ధర్మం తప్పొద్దు 3. సంపన్నత్వం
4. సాధారణత్వం 5. సద్గురు సేవ.

అందుకే మాష్టారు సూర్యచంద్రులు గతితప్పినా నేను సత్యం, ధర్మం తప్పనురా! అన్నారు.

వారి జీవితమంతా సంపన్నత్వం సాధారణత్వం సద్గురు సేవకే అంకితమైంది. ఐ.ఎ.ఎస్ అయికూడా ఒక్క ఇంగ్లీషుపదం వాడకుండా సత్‌సంగాలు చేశారు. వారిగుణగానమునకు నేను చాలను. ఆదిశేషునకే అలవిగాలేదు.

సత్యం తప్పితే మహనీయులకు మనమీద ఎంత అసహ్యమో తెలిపే ఒక సన్నివేశం చూద్దాం.

ఒక వ్యక్తి నెల్లూరు నుండి శ్రీ సుధీంద్రబాబుగారి దర్శనార్థం తుణుకు ప్రక్కనుండే చివటం దాని ప్రక్కనుండే పొలంగి వెళ్ళాడు. బాబుగారు కుటీరంలోపల ఉండి ఎవరుచెపితే ఆ వ్యక్తి వచ్చాడో అడగమన్నారు. అందుకు ఈ వెళ్ళిన వ్యక్తి నాకైనేనేవచ్చానని చెప్పి పంపారు. వెంటనే బాబుగారు ఆవ్యక్తిని నరికి కాలవలో వేయమని అరుస్తున్నారు. అతనిని వెంటనే వెళ్ళిపొమ్మని కేకలేశారు. బాబుగారి సేద్యగాడే ఆమధ్యవర్తి. అతనిని పంపివేయకుంటే నిన్ను చంపుతానని ఆసేద్యగాని మీద విరుచుకు పడ్డారు. ఈ వెళ్ళిన వ్యక్తి మొండి కేసుకొని నిలుచున్నాడు. ఇక లాభంలేదని బాబుగారు అప్పటికప్పుడు వానదేవుణ్ణి ఆదేశించి కుంభవృష్టి కురిపించారు. అయినా ఇతడు కదల్లేదు. తడిసి ముద్దగా వణుకుతూ నిలుచున్నాడు. ఆ మార్గాన పోతున్న ఒక రైతును అకారణంగా ప్రేరేపించి ఇతనిపైకి ఉసిగొల్పారు. అతడు పంగాలు కర్రచూపించి పోకుంటే ఉతుకుతానని బెదిరించి తరిమేశారు.

శ్రీ బాబు గారికి ఎందుకీతనిపై అంతకోపం? ఈవెళ్ళిన వ్యక్తి పచ్చి అబద్ధం చెప్పాడు. ఎవరు చెపితే వచ్చావు అని అడిగితే ఫలానావాళ్ళు చెప్పారు. ఫలానా పేపర్లో చూచి వచ్చాను అని చెప్పాలి. నాకైనేనేవచ్చాననడం పచ్చి అబద్ధంకదా. అందుకే అంతకోపపడ్డారు.

నేను పై విషయమంతా విని శ్రీ బాబుగారు సర్వవ్యాపకులు - ఇప్పటికైనా తప్పుచేసినట్లు ఒప్పుకొని చెంపలేసుకోమన్నాను. అతడా విధంగా చేయగానే ఆరాత్రి శ్రీబాబుగారు స్వప్న దర్శనమిచ్చారట. అబద్దాలాడడమంటే భగవంతునకు ఎంత అసహ్యమో చూడండి. అందుకే శ్రీ వెంకయ్యస్వామి సత్యం ధర్మం తప్పొద్దని చరమసందేశం చెప్పారు. శ్రీ మాష్టారు సత్యం, ధర్మం, సపన్నత్వ, సాధారణత్వం, సద్గురుసేవ ఆచరించి మహాత్ముల ముద్దుబిడ్డడై మనలను గూడా ఆచరించమంటున్నారు.

## శ్రీమాన్ బూటీగారి చరమ సందేశం

మానవులలోని అజ్ఞానం కారణంగా పేరుకొని వున్న అహంకారానికి శ్రీమాన్ బూటీగారి మాటలు గొడ్డలిపెట్టుగా ఉపకరిస్తాయి.

"మీరెప్పుడు షిరిడీ వెళ్ళినా సంస్థానం వారిచ్చే ప్రత్యేక మర్యాదలు స్వీకరించవద్దు. అలా స్వీకరించారంటే ఆనాడే మీరు సాయినాధునికి దూరమయ్యారని గుర్తుపెట్టుకోండి" అని శ్రీమాన్ బూటీగారు తన చరమసందేశం తనవారందరికీ ఇచ్చారట. ఈనాటికీ శ్రీ బూటీ వంశస్తులు షిరిడీ వస్తే అందరితోపాటు క్యూలోనే వచ్చి శ్రీ సాయిని దర్శిస్తారు తప్ప ప్రత్యేక మర్యాదలు ఇచ్చినా స్వీకరించరు.



శ్రీసాయినాధుని సమాధి మందిరమంతా రెండు అంతస్తుల పాలరాతి మేడ ఆనాడు శ్రీ బూటీగారు తన నివాసం కొరకు కట్టించుకొన్నదే. ఆ భవనమంతా శ్రీ సాయినాధునికి కైంకర్యం చేసిన మహనీయుడు శ్రీ బూటీగారు. అంతటి శ్రీబూటీ గారే అలా ఉంటే ఇక మనమెంత వినమ్రులమై ఉండాలో ఆలోచించండి.

నేడు ప్రతివారం పూలమాల తెచ్చేవారు కూడా ప్రత్యేక దర్శనం ఆశించడమెంత అవివేకమో మనమే యోచించుకోవాలి. బరోడారాణిగారు తెచ్చిన బంగారు నాణాల బిందెనే తిరస్కరించిన రాజాధిరాజు గదావారు. మన సమర్పణతో వారికేమిలెక్క.

మందిరాలలో ఆయా కార్యనిర్వాహకులు, కార్యకర్తలు మందిరానికి ధనకనక వస్తురూపంలో కైంకర్యము చేసిన వారినే పరిగణనలోకి తీనుకుంటున్నారుగాని, ఆయావ్యక్తులు అలా కైంకర్యం చేసేటట్లుప్రేరేపించిన దివ్యశక్తిని పూర్తిగా మరచిపోతున్నారు. సత్యం, దర్మం తప్ప వద్దన్నమాట మరిచిపోతున్నారు. పత్రం, పుష్పం, ఫలం, తోయం అన్న గీతావాక్యాన్ని వదిలేశారు. భగవంతుడిచ్చిన భగవంతుని సొత్తును దైవానికే కైంకర్యం చేశారు. అందులో ప్రత్యేకతలు పొందడం, ప్రత్యేక మర్యాదలు చేయడం రెండూ ధర్మ విదుద్ధమని గ్రహించలేకున్నారు. ఈకార్యకర్తలు ఇచ్చేవారినే చూస్తున్నారు గాని ఇవ్వమని ప్రేరేపించే భగవత్ శక్తిని మరచిపోతున్నారు. వారికి ప్రత్యేక మర్యాదలు చేయకుంటే భవిష్యత్తులో ఇకవారినుండి ఏమీ పొందలేమేమో అని భయపడుతున్నారు. ఎవరి దగ్గరనుంచి ఏమి తెచ్చుకోవాలో, ఎలా తెచ్చుకోవాలో సమాధిచెందిన మహనీయులకు తెలియదని అమాయకులైన కార్యనిర్వాహకుల ఆలోచన. వారు చూపే ప్రత్యేక మర్యాదల ద్వారా వారు సత్యం, దర్మం తప్పుతున్నారని వారు గుర్తిస్తే శ్రీమాన్ బూటీగారి చరమ సందేశం ఫలిస్తుంది.

## శ్రీ గురుచరిత్ర సాయిచరిత్ర మనకు రెండు కన్నుల వంటివి

శ్రీ గురు చరిత్ర, శ్రీ సాయి చరిత్ర మానవాళికి రెండు కన్నుల వంటివి. శరీరంలోని అవయవాలన్నింటిలోను కన్నులు చాలా ముఖ్యమైనవి గనుక - సర్వేంద్రియాణాం నయనం ప్రధానం అన్నారు. ఎందుకావిధంగా ఆ గ్రంథాల కంత ప్రాముఖ్యమిచ్చారు. శ్రీ మాష్టారి మాటల ప్రకారం - రెండు గ్రంధాలలోను గురువు మాటయందు శిష్యునకుగల అచంచల విశ్వాసమే ఆశిష్యుని ఉద్ధరించబడినట్లు చెప్పబడింది. శ్రీ గురు చరిత్రలో పండిచేతికి రానున్న పంటనంతా భార్యాబిడ్డలు, చేనుగల ఆసామి, గ్రామస్తులు, కూలీలు ఎందరు చెప్పినా వినకుండా గుర్వాజ్ఞానుసారం కోయించి వేశాడు. అంతకు నాలుగురెట్లు ఫలితం పొందాడు. ఇదేవిధంగా కుష్టువ్యాధి పీడితుడు ఎండిపోయిన మేడి కొమ్మకు నీరుపోసి తన కుష్టువ్యాధి బాపుకొన్న విషయం నుండి మనం నేర్చుకోవలసినది - శ్రీగురుని శక్తి సామర్ధ్యాలమీద కుష్టువ్యాధి పీడితుని అచంచల విశ్వాసం వల్లనే వాని వ్యాధి నివారణైంది. సాయందేవుడు చిమ్మచీకటిలో, కంఠంలోతునీరు, బురద ముళ్ళుగల మార్గాన వెళ్ళి గురువుగారికి నిప్పుతేవడం అతనిగురుభక్తికి నిదర్శనము. త్వష్ట గురువాజ్ఞను శిరమునదాల్చి గురు కుటుంబము వారు కోరిన అసంబద్ధ వస్తువుకు ప్రయత్నించి సఫలీకృతుడవడం లాంటి లీలలన్నీ సచ్ఛిష్యుని లక్షణాలు బోధిస్తున్నాయి. గురు కృప పొందే విధంగా మనలను సంస్కరించు శ్రీ గురుచరిత్ర ప్రారంభంలో కనిపించే నామధారకుని తీవ్రమైన ఆర్తే అతనికి గురుదర్శనము చేయించి గురుచరిత్రంతా బోధించేటట్లు చేసింది.

అలాగే సాయిబాబా చరిత్రలో శ్రీ సాయికి అడవిలో కట్టెలు కొట్టేవాడుగా గురుదర్శనమై తనదగ్గరున్న చద్దన్నము తినిపొమ్మని ఆహ్వానించడము, బాబా మరియు వారి మిత్రులు ఆ ఆహ్వానము



తిరస్కరించి వెళ్ళి మరలా అక్కడికే రావడం, ఆహీన జాతివాని ప్రేమను గుర్తించి బాబా అతని ఆతిధ్యము స్వీకరించడము, నామాట సంపూర్ణముగా విశ్వసించిన వారే సఫలీకృతు లౌతారని గురువు చెప్పగానే ఈశరీరము, మనస్సు ఈక్షణము నుండి నీవేనని చెప్పుకొని అందుకు సంకేతంగా సాష్టాంగ దండప్రణామ మాచరించాడు. వెంటనే ఆగురువుగారు బాబాను బావిలోకి తల్లక్రిందులుగా వ్రేలాడ తీయడము. ఐదుగంటల సేపు బాబా కు ఆనందంతో తేలిపోతున్నట్లు ఉండడం చూస్తాము. తలక్రిందులుగా వ్రేలాడదీసినపుడు ఇతనేమి గురువు ఇలా చేశాడే అని అనుకొని ఉంటే ఆనందమే అనుభవమయ్యేది కాదు. అతడు సర్వశ్య శరణాగతిచేసి తన శరీరంపై తనకు అధికారంలేదని తాను సాష్టాంగ పడ్డప్పుడే తన శరీరం గురుపరం చేశానని గనుక ఇప్పుడు ఆశరీరంపై తనకెలాంటి అధికారమూ, అభిమానమూ లేవని దృఢంగా నమ్మి ఉండబట్టే ఆనందం అనుభవమయింది.

ఇదే విధంగా మాలన్‌భాయి బాబా ఆజ్ఞపాటించి చనిపోయింది. శ్రీ బాబా గారు ఆమెను కటిక మంచినీరు మాత్రమే త్రాగి ఉపవసించాలని, గుడ్డ పరచుకొని కటిక నేలపై పడుకోవాలని ఆజ్ఞాపించారు. ఆమె అక్షరాలా అదేవిధంగా ఆచరించింది. కాని చనిపోయింది. బంధువులందరూ ఆమెకు తినేందుకు, అనుభవించేందుకు ప్రాప్తం అంతే ఉండింది అని కొందరంటే మరి కొందరు ఇక్కడికి రాకుండా ఈ రెండు రోజులూ ఇంట్లో ఉంటే అందరు వ్యాధిగ్రస్తులూ తిన్నట్లు మాంసము, గ్రుడ్లు, పాలు తింటూ మెత్తని పడకపై పడుకొని ఉండేదే గదా! అని రకరకాలుగా విమర్శించారు. బాబా యందు ఆమె ఉంచిన విశ్వాసమే బాబా ఆమెను పునర్జీవింపజేశారు. ఇలా గురుభక్తి గురువుయందు విశ్వాసాన్ని బోధించే గ్రంథాలు గనుకనే ఇవి మానవాళికి రెండు కన్నులవంటివి అని చెప్పేవారు. ఇంతేగాక సర్వశాస్త్రాల సారమే శ్రీ సాయి చరిత్ర అని చెప్పేవారు.

గొలగమూడి

తేది. 25-10-2000

## లక్ష్మక్కగారికి లెటర్

పూజ్యగురు బంధువు లక్ష్మక్క గారికి పెసల సుబ్బరామయ్య నమస్కారములు. మీ లెటరు చేరినది. ధన్యవాదములు. మీ లెటరులో

(1) పోటీలు, వంతులు, కీచులాటలు - వ్యక్తి ప్రాధాన్యత

(2) రామదాసి సంఘటన

(3) ఆలోచనలన్నీ అహంకారమే

అన్న విషయాలు తమరు ప్రస్తావించారని తలంచుచున్నాను.

(1) పోటీలు, వంతులు, కీచులాటలు రావడానికి వ్యక్తి ప్రాధాన్యతలే కారణము. వ్యక్తి ప్రాధాన్యత ఎందుకు వస్తుంది. తాను మందిరానికి ఎందుకు వస్తున్నాడో తెలియక పోవడంవలన. ఏది చేసినా పరవాలేదు చేయక పోయినా పరవాలేదు ఎదుటి వ్యక్తి హృదయాన్ని గాయపరచరాదన్న ఎరుక ఏమారకుండా ఉంటే సున్నితమైన ప్రవర్తన వస్తుంది. ఆ ప్రవర్తన ద్వారా మన సంస్కరణ వీలౌతుంది. అవతలివ్యక్తి ప్రవర్తన పదిమందికి బాధకలిగిస్తుంది కదా అనవచ్చు. కానీ సర్వానికీ యజమాని సద్గురువే. ఆయనకు చెప్పి మన భాద్యత తీర్చుకుంటే సరి. ఈ ప్రయత్నంలో సబూరి మితిమీరి అవసరం. కానీ సద్గురువు మాత్రం శాశ్వత పరిష్కారంచేసి తీరుతారు. ఎవరైనాసరే గమ్యాన్ని గుర్తుచేసుకొని సాగుతుంటే పోటీలు, వంతులు, కీచులాటలకు తావే ఉండదు. అసలు గొడవంతా ఏదేదో సేవ అని భావించడంలోనే వస్తుంది. అసలు సేవ అంటే మనసును నిగ్రహించడమే అని ఎరుగక పోవడమే ఈ గొడవకు కారణము. ప్రతివారిలోను వెలిగిపోతున్న సద్గురు జ్యోతికి ఆవరించియున్న మలినాన్ని తొలగించుకోవడమే అసలైన సేవ సాధన. మిగిలినదంతా వ్యక్తుల అజ్ఞానమే.



పోటీలు వంతులు కీచులాటలద్వారా గురువుగారు మన ఎడల అసహ్యపడతారని ఎరుగకపోవడమే అలా ప్రవర్తింపజేస్తుంది.

(2) రామదాసి సంఘటన ఒక్కటే సాధనకంతా ముఖ్యమైన బోధ - నీకు పనికిరాని వస్తువు ఇతరులకు ప్రేమతో ఇవ్వమన్నారు. అట్లాకాదు. మనకు పనికివచ్చేదే అనుకుందాము. దానిని ఎదుటివాని అవసరాన్నిబట్టి మన అవసరాన్ని కాస్త ఆపుకొని ఇవ్వగలిగితే సాయి మనలను అలాచేసినందుకు ఎంత గొప్పగా అనుగ్రహిస్తారో చూడండి. అలాంటి త్యాగంలేకుండా నాది, నాకు, అనే బంధము నుండి ఎలా విడుదల పొందగలం.

విద్యానగర్‌లో మాష్టారు తాటాకు చాకలికి ఇవ్వడం - విద్యానగర్ లో మాస్టారి ఇంటి వెనుక అంతా ఒపెన్‌ప్లేసే. దడికడితే కాస్త మరుగుగా ఉంటుందని ఎంతో శ్రమతోటి నాలుగు మోపులు తాటాకు తెప్పించారు మాష్టారు. తెల్లవారే ఒకచాకలి ఆ తాటాకు ఇస్తే రెండురోజుల తర్వాత తెచ్చి ఇస్తానని వచ్చాడు, నా దగ్గరకొస్తే కాదంటేకాదని పంపేశాను. నేను లేనప్పుడు మాష్టారిని అడిగాడు. తీసుకుపొమ్మన్నారు. ఇక మరలా అతడు తెచ్చి ఇవ్వలేదు. వీరు అడగబంపలేదు. తనకవసరమైన వస్తువునుకూడా మాష్టారు ఎలా దానంచేస్తున్నారో చూడండి. రామదాసి తనకు పనికిరాని పుస్తకం ఇచ్చేందుకే తల పగులకొట్టుకొని చస్తానన్నాడు. ఇతనికి త్యాగం అంటే ఏమిటో ఎలా బోధపడుతుంది ? ఎన్ని రోజులు విష్ణు సహస్రనామం చదివినా ఏమౌతుంది? నైతిక విలువలు విస్తరవంటివట. ఆధ్యాత్మికత అనేది బోజనమన్నమాట. అసలు విస్తరేలేకుండా అన్నం తినడం అసంభమంటారు శ్రీ మాష్టారు. ముందు నైతిక విలువలు పెంచుకుంటే అవే ఆధ్యాత్మికతకు మనలను దగ్గరచేస్తాయంటారు.

సర్వ అనర్దాలకు మూలం కోపం. కోపం ఎందుకొస్తుంది ? కావాలి అనే కోరికవలన. కావాలి అనే కోరికను త్యాగంచేయకుండా విష్ణుసహస్రనామం చదువుతుంటే ఏమౌతుంది. ఈనాడు మన

పారాయణలుకూడా ఈ రామదాసి పారాయణలాగానే ఉన్నాయి. పారాయణలవలన ప్రయోజనంలేదా ? అని మీరడగవచ్చు లేకేమి ? మనం చేరవలసిన గమ్యంవైపు నడవకుండా వెనుకకు నడుస్తున్నాము. గమ్యంచేరే కాలము ఎక్కువ తీసుకుంటుంది.

ఎప్పుడైనా ఎవరికైనా కోరిక వదలందే జన్మచక్రంలోనుండి విముక్తిలేదు.

అతడు రామదాసుగదా ? మరి దాసునకు కోపం తగదుగదా ? బాబా చెప్పినట్లు పుస్తకం కావాలంటే డబ్బుపారేస్తే వస్తుంది. మనిషి అలా వస్తాడా ? అందరిలో బాబాను చూచేదిపోయి అందరిపైన ద్వేషభావం పెంచుకుంటుంటే ఇక సాధనేముంది. అవతలివాడు మనమీద ద్వేషభావం పెంచుకొని దూరమైతే మనమేమీ చేయలేము. మనభావం సరిగా ఉంటే చాలు.

(3) నీ ఆలోచనలన్నీ నీ అహంకారమే :- ఇది చెప్పరానంత గొప్పమాట. ఇది మనసుయొక్క స్వభావానికి సంబందించినది. మనలోని అహం ఎంత పలుచబడితే మన ఆలోచన అంత తగ్గుతుంది. మనం వద్దన్న విషయాలమీదకే ఈ పాడుమనసు పోతుంది. కూరగాయలు తరిగినంతసేపు కుదురుగా గురువుగారి రూపం ధారణచేస్తూ నామంచెప్పవచ్చుగదా ? నిరంతరం నన్ను ఏమారుస్తూనేఉంది నా మనసు. కేవలం అహంకారమనే అడ్డుగోడే అందుకు కారణం. బహిరంతరములయందు వ్యాపించియున్న సాయిని వదలి లౌకిక విషయాలవెంబడి మనసు పరుగు తీయడమంటే అహంకారముకాక ఏముంది. తైలధారవలె మననస్సను నద్గురు మననంలో ఉంచవలసినదిపోయి చెత్త ఆలోచనలు రావడం ఎంత దుర్మార్గమో గదా! పట్టువీడక యుద్ధం సాగిస్తే సాయి ఏనాటికైనా తప్పక సహాయపడకపోడనే నమ్మకమే నన్ను ఆ బాటవెంట నడుపుతుంది. ఈ లెటర్లద్వారా సత్‌సంగం చేసినా మంచిదేనని శ్రీ మాష్టారు ఇలా చేయిస్తున్నారండీ. నమస్కారములతో

\- పె.సు.



## మాష్టారు చెప్పిన పచ్చి అబద్ధం

శ్రీ మాష్టారు విద్యానగర్‌లో ఉండగా సత్‌సంగం జరిగే రూముకు ఒక యువక త్రాగుబోతు తప్పత్రాగి వచ్చాడు. అక్కడ అందరు మహనీయుల చిత్రపటాలతోపాటు ఒకటిన్నర అడుగుల ఎత్తుగల సాయి విగ్రహంకూడా ఉంది. ఆ త్రాగుబోతు యువకుడు "నీవు ప్రజలను మోసంచేస్తున్నావు. ఈ పటాలు బొమ్మలు ఏంచేయగలవు" అనే వాగుడుతో శ్రీ మాష్టారిని తూలనాడుతూ అక్కడున్న సాయి విగ్రహాన్ని తన కాలుతో తన్నాడు. మరుక్షణంలో నేను ఆ త్రాగుబోతుపైన పడిపోయాను. మమ్మల ఇద్దరినీ మిగిలిన వాళ్ళంతా బయటకు లాక్కువచ్చి అడ్డంతీస్తూ నన్ను వెళ్ళి రూములో కూర్చోమని నెట్టుకువచ్చారు. నన్ను వదలండి వాడి అంతం చూస్తానంటాను నేను. అదేవిధంగా వాడూ మాట్లాడుతున్నాడు. శ్రీ మాష్టారు సాక్షీభూతుడుగా ఇదంతా తాను కూర్చున్న చోటునుండి లేవకుండా చూస్తున్నారు.

కొంతసేపటికి రూములో తానెలాంటి అసంబద్ధమైన పనిచేయనని అందరికీ నచ్చచెప్పి అతడు తిరిగి రూములో కూర్చొని "అతడు నాపైనబడి కొట్టాడు. అసలతడు నన్నెందుకు తాకాలి. ఈ ఇల్లు అతడిదా ?" అని గోలమొదలుపెట్టాడు. వెంటనే శ్రీ మాష్టారు "ఆ విగ్రహం అతనిదయ్యా, దాన్ని నీవు కాలితో తన్నావు. అందువల్ల అతనికి కోపమొచ్చింది" అన్నారు. ఆ మాట పచ్చి అబద్దం. ఆ విగ్రహం నాది కాదని శ్రీ మాష్టారికి స్పష్టంగా తెలుసు. మా ఇద్దరిమద్యా ద్వేషం నసింపజేసి శాంతినెలకొల్పాలనే సంకల్పంతోనే అ పచ్చి అబద్దం చెప్పి 'శాంతి నెలకొల్పువారు ధన్యులు' అని క్రీస్తు చెప్పింది. ఆచరించి చూపుతున్నారు. మనసొంత ప్రయోజనాలకు ఆర్థిక ప్రయోజనాల కొరకు అబద్దం చెప్పడంలేదు. అవతలి వ్యక్తి త్రాగిఉన్నాడు నిజం చెప్పినా గ్రహించే స్థితిలో లేడు. శాంతి స్థాపనకు అదొక్కటే మార్గమైంది.

## సత్‌సంగమంటే ప్రజల అపోహ

సత్‌సంగమంటూనే అదేదో గొప్ప భక్తులు చేయవలసిన కార్యమనీ అందరూ అందులో పాల్గొనే అధికారం అర్హత లేదని కొందరి అభిప్రాయం. చేసేది సరిగా చేయాలిగాని మన ఆచరణ సరిగా లేకుండా సత్‌సంగానికి పోవడం దండగ అనడం పరిపాటి.

తాజుదీన్ బాబాగారంటారు "పాపులంతా నా దగ్గరకు రండి. పుణ్యాత్ములంతా వారివారి లోకాలకు పొండి" మన నడవడి సరిచేసుకునేందుకు రిపేరు చేసే వర్క్‌షాపు లాంటిది సత్‌సంగం జరిగేచోటు. గ్రంథ పారాయణ నుండి మనం నేర్చుకోవలసింది ఏమిటి? మనలోని దోషాలేమిటి ? వాటిని సరిచేసుకోవడం ఎలాగు ? మనలోని దోషాలు గుర్తించుకోవడం మొదటి కర్తవ్యం. తార్వాతమెట్టు నిర్మూలన. అది మన తీవ్ర ప్రత్యేక ప్రయత్నంతోనే సాద్యం. ఎవరికి వారే వారిలోపాలు నిర్మూలించుకునే పద్ధతులు ఆచరించాలి. తగిలీ తగలని చెంప దెబ్బలు, కేవలం బాబాకు చెప్పుకోవడం కొన్ని కేసులలో మాత్రం సరిపోవచ్చు. అందరికీ అన్ని దోషాలకు అది సరిపోదు.

వివేకానందుడు చేసుకున్న ప్రాయశ్చిత్తములాంటి ప్రాయశ్చిత్తాలు కొన్ని సందర్భాలలో అవసరం. సత్‌సంగము మనలను మన దోషాలనుండి విముక్తి చేసే వర్క్‌షాపులాగ మనం వినియోగించుకోవాలి. అంతేగాని పరిశుద్ధాత్ముల సమావేశము సత్‌సంగమని తలచడం పొరపాటు.

సత్‌సంగం చేయడం మాకురాదు అనేది చాలా గొప్ప సోమరి చెప్పేమాట. మనమేమి ఉపన్యాసాలు ఇవ్వనవసరంలేదు. పుస్తకం చదువుకొని వారివారి బావాలు చెప్పుకోవడమే. నిత్యం ఒకే సమయంలో శ్రద్ధతో సత్‌సంగంలో పాల్గొంటుంటే మనలను దైవమేమి చేస్తారో ఎవరికి వారే సాక్షి. నిత్యం ఒకే టైంలో క్రమం తప్పకుండా సత్‌సంగానికి హాజరవడమే సాయికి మనం సమర్పించే శ్రద్ధ లేక నిష్ఠ. అలా సమర్పించాలంటే త్యాగము తప్పనిసరి అవుతుంది. త్యాగమేమిటి ? ధన దాన్యాలు ఇమ్మన్నారా? ఒక అరగంట నీ పనులు పక్కకు నెట్టడమే త్యాగం. రాత్రింబవళ్ళు మనలను కనిపెట్టుకుని రక్షించే పరమాత్మకు



వారెంతో ఆశతో మననుండి కోరిన కాలం నిత్యం సమర్పించలేకుంటే మనయొక్క మ్రొక్కుబడులనే ఆశించే రాజకీయ నాయకుడు కాదుగదా! అలాచేయలేని మనకు కోరిన వెంటనే ఆయన పలుకలేదని ఆయనపై అలిగే హక్కుఎలా వస్తుందో మనమే యోచించాలి. మా ఇంటికి సత్‌సంగ ప్రదేశానికి చాలా దూరం అనేది ఒకమాట. మీ ఇంటి దగ్గరగాని, ప్రక్క యింటిలోని ఆవరణములోనైనా జయప్రదంగా సత్‌సంగం చేసుకోమన్నారు. పెద్దవారు అక్కరలేదు. చిన్న పిల్లలే చాలు. వారే అసలైన సాయి భక్తులు. ఒక్క బిడ్డకు రెండు సాయి కథలు చెప్పి పిడికెడు బొరుగులు పెడితే రేపు పదిమంది పిల్లలను తీసుకువస్తాడు. అలా చిన్న పిల్లలే చాలు సాయి కథలు చెప్పుకునేందుకు అంటారు మాష్టారు. అలా నిత్య సత్‌సంగ నిర్వర్తిస్తే నిష్టసబూరి సమర్పించినట్లే, త్యాగం చేసినట్లే. ఇది శ్రద్ధా భక్తులతో జరుగుతుంటే ఆ తరువాత సాయి తన హస్తం యిస్తాడు. దీనికి ప్రత్యక్ష నిరూపణే "సాయి కృప" కలిచేడు మందిర లీలలు అన్న చిన్న పుస్తకమంతా.

## మనసు శాంతించే మార్గం

ఆదిలో అపరాధం ఎవరిది? వీడిట్లా ద్రోహం చేశాడు. వాడట్లా చేశాడు, వాడిలాంటి వాడు, వీరిలాంటి వారు అని నిరంతరము పరనింద చేస్తూ పంది చేసినట్లు వ్యవహరించే మనసును లొంగ దీసుకునే గొప్ప మార్గమిది. వాడు మలభక్షిణచేస్తూ ఈ జన్మలో అలా చెడ్డగా ప్రవర్తించుటకు కారణమేమిటి ? గత జన్మ సంస్కారాలు. అలా వెనక్కు పోగా పోగా మొట్టమొదట వాణ్ణి అలా సృష్టించింది భగవంతుడేగదా. గనుక భగవంతుని నిందించ సాధ్యమా ? వాళ్ళ నట్లా చేశాడు వీళ్ళనిట్లా చేశాడు భగవంతుడు. గనుక వాళ్ళు అలాగే ప్రవర్తిస్తారు. ఎవరినీ తప్పు పట్టేందుకు వీలులేదు. మన కెంత హాని జరుగుతున్నా ఈ భావనలో స్థిరంగా నిలువగలిగితే ఆనందమే ఆనందం. ఇప్పుడు మనకు జరిగే హానికి పూర్వ జన్మల ఋణానుబంధాలే కారణమని బాగా మననం చేసి ఆ భావంలో స్థిరంగా నిలువడమే సాధన.

## ముక్తి - అర్హత

1-11-95 సాయిబాబా పక్ష పత్రికలో వ్రాస్తారు. మాటలతో ముక్తినిగూర్చి వాపోయి ప్రయోజనమేముంది. అర్హత సంపాదించి ఒర్పుతో సాధన చేయాలి. అర్హత కల్గినప్పుడు మనము దానిని వద్దన్నా భగవంతుడు అనుగ్రహించి తీరుతాడు. కనుక సాధన ద్వారా అర్హత సంపాదించుటే మన ధ్యేయం కావాలి.

ఈ భావాన్నే అన్నమయ్య అంటారు. ఓ దేవాదిదేవా నీ కొలువు నర్తకులమైన మేము ఆడిపాడి నీకు వినోదము కల్గించవలెనుగాని మోక్షమిమ్మని మిమ్మడుగతగునా ? మాకు అర్హత గలదని మీకు తోచినప్పుడు అది మీరు మాకు అనుగ్రహించవలసినదే కదా !

కొలువు నర్తకులంటే - ఈ జగత్తే భగవంతుని కొలువుకూటము. అందులో పాత్రధారులమైన మనమంతా నర్తకులమే. మన ఆటపాటలు అంటే జీవిత విధానముద్వారా భగవంతునకు సంతృప్తి కల్గించి వారి కృప పొందాలిగాని బాబా మోక్షమిమ్మని అడిగి ప్రయోజనములేదు అంటారు.

జీవిత విధానముద్వారా అన్నారు, ఆ విధానమేమిటి? ఇష్టా ఇష్టాలు లేని జీవితం. మాష్టారు గోపాల్ అనే వెంకటగిరి భక్తునకు స్వప్నంలో చెప్పినట్లు నాది, నావారు అనే అటాచ్‌మెంట్ లేకుండా డిటాచ్‌మెంట్ కల్గి జీవించడం. కామము దహించి నను కరుణించు రంగా అన్నట్లు జీవించాలంటారు. లేకుంటే మోక్షమడిగే అర్హత లేదంటున్నారు.

మన జీవిత విధానంద్వారా వారికి సంతృప్తి కలిగించాలి. మన తండ్రి భగవంతుడు. మనం తృప్తి శాంతి ఆనందంతో ఉంటే వారికి సంతోషముగాని ఉన్నదాంతో అసంతృప్తి, అశాంతి దు:ఖముతో ఉంటే వారికి బాధ కల్గించిన వాళ్ళము అవుతాము. వాళ్ళు నామాట వినడంలేదు,



వాళ్ళు ఇలాచేశారు. వాడివల్ల ఇంత నష్టంవచ్చింది అంటాము. అంతా పూర్వజన్మ కృతం కర్మ తద్దైవమిది కజ్యతే అన్నారు. వారు మనకు అట్టి మానసిక బాధ కల్గించడం కేవలం పూర్వ ఋణానుబంధాన్ననుసరించేననే ఎరుక గల్గి మరు జన్మకు తిరిగి ఋణానుబంధం కల్గించే రాగద్వేషాలు పెంచుకొని చెన్నబపప్ప వీరభద్రప్పలు కావద్దంటారు.

మహల్సాపతిలాగ జీవించమంటున్నారు.

## గురువును ఎన్నుకొనే పద్ధతి

గురువును ఎన్నుకొనే పద్దతి అన్ని జీవిత చరిత్రలు (వీలున్నన్ని) చదివి నీ మనసుకు, హృదయానికి హత్తుకున్న మహాత్ముని నీ గురువుగా చేసుకొని సాధన సాగించు అనేవారు.

### మందిరాలకు వెళ్ళే మనకు మంచి బోధ

కనీసం మందిరంలో ప్రవేశించినాకనైనా లోకాభిరామాయణం మాట్లాడడం ఆపాలి. ఎంతసేపు అలా ఉండాలి అంటే కనీసం మందిరంనుండి బయటకు వెళ్ళినంత వరకు అన్నారు. అంటే - అందరి ముఖాలు చూడడం మానివేయాలి. ఏమిసార్ ! కన్ను కన్ను కలువగానే ఏదో మాట్లాడుతామోయ్. మీరేగద సార్ అందరిలో సాయిని చూడడం అభ్యసించమన్నారు ? నిజమేరా నీ స్నేహితుని చూచిన వెంటనే ఏమి. మాట్లాడావు? వాళ్ళు బాగున్నారు. వీళ్ళెట్లాంటివాళ్ళు? ఇవేకదటోయ్. అదేనా అందరిలో సాయిని చూడటమంటే. అలా మాట్లాడకుండా బిగించుకున్నా మనిషిని చూస్తూనే వారితో మన గత స్మృతులు వద్దన్నా గుర్తుకొస్తాయి. ఆయన దగ్గరకెళ్ళికూడా ఈ గొడవెందుకు అన్నారు.

## మహనీయులెలా వుంటారు, గుర్తించేదెలాగు

ఎవరి సన్నిధిలో మన మనసు ప్రశాంతతబొంది, కాలగతి (టైం జరగటం) గుర్తింపులేకుండా మనం హాయిని అనుభవిస్తామో అది మహనీయుని సన్నిధి అని గుర్తించండి.

ఇలాంటి అనుభవం తనకు కలిగినప్పటికీ ఆధ్యాత్మికత తెలియనివారు అది మహాత్ముని సన్నిధియని గుర్తించలేరు. అలాంటివారికొరకు మరొక చక్కని పరీక్ష చెప్పారు.

మనం మహనీయుడు అవునా కాదా అని పరీక్షించే వారిదగ్గర సాదారణంగా జరిగేందుకు వీలులేని ఒక అనుభవం జరుగవలెనని, ఆ అనుభవం ఇంత టైంలోనే జరగాలని, అలా అనుగ్రహించమని మనం మన నోటితో అడగకుండా మానసికంగా చెప్పుకొని వారి సన్నిధిలో కూర్చొనేది. కూర్చున్నంతసేపు సాయినామం మానసికంగా జపిస్తూ ఉండు. మనం మానసికంగా చెప్పుకున్న టైం లోపలే ఆ అనుభవం జరిగితే వారు సిద్ధ పురుషులని తెలుసుకొనేది.

మూడవ విషయం :- నిజమయిన మహనీయులెవ్వరుకూడా తన పూర్వ చరిత్ర వారి నోటివెంట బయటపెట్టుకోరు. సన్నిహితులైన భక్తులు మరలా మరలా అర్థించినప్పుడు "కక్కిన కూటికి ఆశపడుతామా?" అన్న సందర్భాలున్నాయి. షిరిడీ సాయి, అక్కల్‌కోట స్వామివంటి మహనీయులైతే కొందరికి మాదిగవారమని మరికొందరికి సత్‌బ్రాహ్మణులమని మరికొందరితో ఆ విషయం అడిగితే చెప్పుతో కొడతానని అన్నారు.

నాలుగవ లక్షణం :- వారు భక్తులనుండి ఏమీ ఆశించరు. భక్తులమీద ఎనలేని ప్రేమను అనుక్షణం కురిపిస్తుంటారు. వారి అన్నపానీయాలు పోషణ, పాలన భగవంతుడే చూడాలి.



ఐదవ లక్షణం :- కరచాలనంతో వస్తువులను సృష్టించరు. అలా సృష్టించి ప్రజలను భ్రమకొల్పేవారిని మనం దర్శించనక్కరలేదు.

ఆరవ లక్షణం :- మనకేదైన ఆపద రాబోతుంటే పరోక్షంగా మనలను హెచ్చరించి ఆ ఆపద రాకుండా చేస్తారు. వారి మాటలకు నిజమైన అర్ధం మనకా ఆపద తప్పిపోయాక మనకు అర్ధమౌతుంది.

నా అనుభవాలు :-

(1) రామిరెడ్డి తాతగారి సన్నిధిలో 6 గం॥ కాలం ఒక్క క్షణంగా గడవడం.

శ్రీ వెంకయ్యస్వామివారి దగ్గర సాయంత్రం 4 గం॥లనుండి రాత్రి 12 గం॥లవరకు అంటే 8 గం॥ల సేపు అలా కూర్చోనుండటం. అక్కడ సినిమాలా, టివి ప్రోగ్రాములా, పాట కచేరీలా, డ్రామాలా, ఏమీలేవు. కానీ వారి సన్నిధి వదలి పోవాలని బుద్దే వచ్చేదికాదు.

ఆచార్య భరద్వాజగారు చీరాలస్వామి దగ్గర రోడ్డు ప్రక్కన నేలమీద చీరాలస్వామి కెదురుగా రోజుల తరబడి ఎండ, గాలి, వాన లెక్కచేయకుండా కూర్చోగలిగేవారు.

గ్రామ దేవతలు, గణాలు మనుషుల శరీరంపై ఆవహించి పూనడాలు జరుగవచ్చు. కానీ అంతా తామే అయిన సిద్ధపురుషులు ఎవరివంటిమీదకు వచ్చి మాట్లాడరు. వారెవరికైనా ఏదైన చెప్పదలిస్తే ఆ వ్యక్తికి స్వప్నంలో కన్పించి ఆ వ్యక్తికే నేరుగా తమ సందేశం చెప్పగలరు. భౌతిక దర్శనం ద్వారా కూడా చెప్పడముంటుంది. మహనీయులు సమాధి చెందిన తర్వాతకూడా తన భక్తుల భక్తి శ్రద్ధలననుసరించి వారికి స్వప్నంద్వారా గాని భౌతిక దర్శనము ద్వారా గాని తమ సందేశమందించడమేగాక వారి కష్టాలు తీరుస్తారు.

శ్రీ మాష్టారు తన వివాహవిషయమై షిర్డిలో దీక్ష చేసినప్పుడు శ్రీసాయి నాదుడు పాకలపాటి గురువుగారి రూపంలో తన సందేశమందించి వివాహం చేసుకోమన్నారు. ఆ వ్యక్తి ఇచ్చిన అడ్రసు ప్రకారం బాంబేలో వెతికితే అలాంటి వ్యక్తే అక్కడ లేరని తేలింది. పై విషయములన్నీ అవగాహనైతే మహనీయుల నిజస్వరూపం తెలుస్తుంది.

పై విషయాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించాకనే వారికి పాదనమస్కారం చెయ్యి. నీకు అనుభవం రాకుండానే ఎవరో నమస్కరిస్తున్నారని నీవు పాదనమస్కారం చేయడం అపచారమన్నారు శ్రీ మాష్టారు. ఒక సారి తల తాకట్టుపెడితే (పాదనమస్కారంచేస్తే) జీవితాతం ఆ భావం అలా ఉండిపోవాలంటారు.

ఆ మహనీయుడు ఇతరులకు అనుభవము ఇచ్చి ఉండవచ్చు నీకు ఇవ్వలేదు. ఎందుకని ? ఋణానుబంధంలేదు గనుక ఇవ్వలేదు. అందరిలాగా నీవు పాదనమస్కారం చేయనంత మాత్రాన నిన్ను వారు శపించరు. అంతచిన్న విషయానికే కోపగించేవారు మహనీయులెలా అవుతారు. శ్రీ రామకృష్ణ పరమహంస గారిని పరీక్షించిన వివేకానందులవారిని పరమహంసగారు మెచ్చుకుంటారు. తమను పరీక్షించేవారిని చూస్తే మహనీయులు సంతోషపడుతారు. ఎందుకంటే పరీక్షించిన భక్తులు చివరివరకు నిలుస్తారు గనుక.

గనుక మనం ఏ మహనీయుని దగ్గరకెళ్ళినా ఇతరుల అనుభవాలను బట్టి గాక మన అనుభవాల ఆధారంగా వారికి తలతాకట్టుపెట్టడం మంచిదని శ్రీ మాష్టారు నేర్పిస్తున్నారు.



## వ్యర్థంబు చేసితి నావయస్సంత

చివరికి తోడు ఎవ్వరూ రారు. అని ఉదయ హారతిలో పాడుతున్నాము. ఈ విధంగా చింతపడకుండా మిగిలిన వయస్సునైనా సద్వినియోగం చేసుకో - మృత్యువు అనుక్షణం మనలను మ్రింగుతుంది. ఈ మ్రింగుడు ఏ క్షణాన పూర్తయితే ఆ క్షణాన ఈ ప్రపంచంనుండి వెళ్ళిపోతాము. ఈ లోగా ఈ కొద్దికాలమైనా సద్వినియోగం చేసుకో. సద్వినియోగం చేసుకుంటాను ప్రభూ. అలాంటి అవకాశమివ్వమని నిత్యం ప్రార్థిస్తున్నాము. అలాంటి అవకాశం రావాలంటే కామము దహియించి నను కరుణించు అన్నారు. అదే జరుగువలసింది. కామము అంటే సర్వ కోరికలూ అని అర్థం. బ్రతకాలి అనే కోరికతో సహా - అంటారు శ్రీ మాష్టారు. అందుకుగాను జగమంతా నీవే అని గుర్తించడమే కావాలి. అలా గుర్తించి నడుచుకుంటే జగమంత నిన్ను ప్రేమిస్తుంది. నీవు త్రికరణశుద్ధగా అలా ప్రేమించాలి. చెప్పడం చాలదు. పాడడం చాలదు. మదర్థెరెసా. శ్రీ వెంకయ్యస్వామి శ్రీ భరద్వాజలాగ శ్రీసాయినాధునివలె అందరినీ నీవు ప్రేమిస్తే అందరూ నిన్ను ప్రేమిస్తారు. నీ కామము దహించబడకుంటే నీవు అందరినీ ప్రేమించలేవు. అందరూ నిన్ను ప్రేమించరు. అది జరుగనప్పుడు ఊరకే యాంత్రికము, లాంఛనప్రాయంగా పాడిన హారతులౌతాయి.

నా వయస్సంతా వ్యర్థమైనదని నీవు చింతించినట్లు నీ బిడ్డలు చింతించకూడదు. వారికి చిన్నతనాన్నే దైవభక్తి అలవాటుచెయ్యి. వెన్నతో పెట్టిన విద్యగా మహనీయుల కథలుచెప్పు. వారి చిత్రపటానికి నమస్కరించే సంస్కారమివ్వు. అబద్ధముచెప్పి లోకాన్ని నమ్మించే చెడునుండి నీ బిడ్డలను కాపాడాలంటే మొదట నీ ప్రవర్తన చక్కగా ఉండాలి. నీవు తప్పుచేస్తు బిడ్డలకు బోధిస్తే అది ఫలిస్తుందా? రామకృష్ణ పరమహంస బెల్లంకథలా ఉండాలి గదా.

అందుకే టీచర్స్ అంటే శ్రీ మాష్టారికెంత ప్రీతో చెప్పలేను. ఎందుకని అంత ప్రీతి? ఏ ఆఫీసువారి దగ్గరికైనా కల్మష హృదయులైన పెద్దలే వచ్చేది. ఒక అరగంట ఉండి వెళ్లిపోతారు. మరి టీచర్స్ దగ్గరకు నిష్కల్మషులైన చిన్నారులొస్తారు. కాస్తా పెద్ద పిల్లలు కాలేజీకి వస్తారు.

వీళ్ళందరికి దైవభక్తినేర్పే అవకాశం టీచర్స్‌కు ఉందిగనుక మాష్టారికి టీచర్స్ అంటే ఎంతో ప్రీతి. సాయిని పిలిస్తే పలుకుతాడు అని ఛాలంజింగ్‌గా చెప్పండి అని అంటారు. అలా చెప్పాలంటే పిలిస్తే పలుకుతాడు అని ముందు టీచరుకు నమ్మకముండాలిగదా. అలాంటి నమ్మకం కలిగేందుకు పిలిచిచూడు నీకే తెలుస్తుంది. ఆపైన చెప్పకుండా ఉండలేవు అంటారు. పిల్లలకు చెప్పాలంటే ముందు టీచర్ క్షుణ్ణంగా తెలుసుకొని ఉండాలి. ఏమితెలుసుకోవాలి. సాయి యొక్క నిజతత్వం, మహనీయుల యొక్క నిజతత్వం ఏమిటిది ? సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వ సమర్ధుడు అని తెలుసుకొనిఉంటే ఇక ఛాలెంజింగ్‌గా స్మృతి మాత్ర ప్రసన్నుడని చెప్పగలడు. గనుక అలా తెలుసుకోమని టీచర్స్‌ను ప్రోత్సహించేవాడు. ప్రతివారు ఒక టీచర్‌గా తయారై ప్రక్కవాళ్లను ఎడ్యుకేట్ చేయమనేవారు.

గాడిదలకంటే హీనం కావద్దనేవారు. గాడిదలు గంధం చెక్కలు మోసినా వాటికి సువాసన తెలియదు. కానీ వాటిని ఒకరినుండి మరియొకరికి మోసి పుణ్యం కట్టుకుంటున్నాయి. నీవుకూడా నీ బావాలు మోస్తున్నావుగాని పంచుకోవడంలేదు. అలా చేయకుంటే గాడిదకంటే హీనమవుతావు అని హెచ్చరించారు. అందుకే సత్సంగాలుచేయి. ప్రక్కవారితో నీ బావాలు చర్చించు. సాయిని గూర్చి వినండి. సాయి నీ మేదస్సును వెలిగించి దివ్యకాంతులు చిమ్మిస్తారు అని వాపోయారు. మీరెక్కడుంటే అక్కడ సత్సంగాలు చేయండి, నాకు లక్షలిచ్చినట్లు అని మొత్తుకున్నారు. వారి చిరకాల వాంఛ తీరుస్తాం. ప్రసాదం తిని, చేతులు



కడుక్కొనే పని మానమన్నారు. హారతులతోపాటు, సాయిలీలలు, మహనీయుల చరిత్రలు చదివిస్తూ ఉండమని నిర్వాహకులకు బోధించారు. శ్రీ మాష్టారు మనకు చెప్పే మంచిమాట సత్సంగాలు చేయమని మాత్రమేగానీ అవిలేకుండా లాంఛనప్రాయమైన సత్సంగాలు చేస్తూ అలంకరణలతో సంతృప్తిపడమనలేదు.

శ్రీ మాష్టారుగాని, శ్రీ సాయిగాని శ్రీ స్వామిగాని మనలను సన్యసించమన్నారా ? మనలను బికారులు కమ్మన్నారా ? వాట్ డు యు మీన్ బై నెగ్లిజెన్స్ ఆఫ్ డ్యూటీ అన్నారు. మన డ్యూటి పర్ఫెక్ట్‌లీ వెల్‌గా చేయడమే వారు కోరేది. పర్ఫెక్ట్‌లీ వెల్‌గా అంటే సత్యం ధర్మం తప్పకుండా అని అర్థం. చూడబడేదంతా కలసి నేను అని గుర్తిస్తే ఇక సత్యం ధర్మం తప్పడం ఉండదు. ఒకరినొకరు దోచుకోవడం ఉండదు. అలా దోచుకోకుంటే మా వ్యాపారాలు దివాలా తీయవా అంటారు. తీస్తే తీస్తామేమోకాని కూడు, గుడ్డ, గూడు కొరకు బాబా కొరత రానీయడు. నా బిడ్డలను పస్తులు, ఉపవాసాలు ఉండనివ్వను. నా భక్తులింట్లో లేమి అన్నది పొడచూపనివ్వనని అభయమిచ్చారు. అది నిత్య సత్యమని నా పర్సనల్ అనుభవం. అన్నం, గుడ్డ, గూడు ఉన్నాక కోటీశ్వరులైనా ఇంతకంటే ఏమి అనుభవిస్తారు. చివరికి మనకేమి కావాలి. వృద్ధాప్యంలో మహల్సాపతిలాగ శరీరం వదలడం, రోశిరెడ్డిలాగా శరీరం వదలడమే కావాలి. అలా వదలాలంటే సాయిని తోడుగా చేసుకొని సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వ సద్గురుసేవే మన ధ్యేయం కావాలి. సద్గురువులేడు అని చింతించవద్దు. ఈ జగమంత నీవే అనే ఎరుక వస్తే సద్గురుడే మన దగ్గరకొస్తాడు. ఉపాసనీ బాబా దగ్గరకు సాయి పోయారు. అనంతాచార్యుల దగ్గరకు వెళ్ళడు. నీవు ముసల్మానువు అంటే కూడా వెళ్ళలేదా ఎందుకు పోయారు. వారు అలాంటి అర్హత సాధించారు గనుక వెళ్ళారు. మనము కూడ సాధించుకుందాం.

## శరీరానికంటే ముందు మనస్సు అలసిపోవడం

శరీరానికంటే ముందు మనస్సు అలసిపోయినందుననే మనకు అలసట వస్తుంది. మనస్సు ఉత్సాహంగాఉంటే అలుపేరాదు. మనస్సు ఉత్సాహంగా ఎలావుంటుంది. మనంచేసే ప్రతి పనీ సాయిసేవ అనే భావం ఉండాలి. ఉదా :- సేద్యం చేస్తుంటే, నా సేద్యం అనే సేవద్వారా అన్నిజీవులలోని సాయియొక్క ఆకలితీరుతుంది అనే భావం ఉండాలి. అలానే ప్రతిపనివాడు తలవడమే నిజమైన సాయిసేవ. అంతేగాని హారతులు పాడుతూ, పూజలుచేస్తూ పోటీలు, వంతులు కీచులాటలు మానకుండా వ్యవహరిస్తుంటే సాయికి బాధకలుగుతుంది అన్నారు మాష్టారు.

సేద్యమైతే బాగుంది సార్. వ్యాపారం చేస్తే ఎలాగుసార్ అన్నాడు మరొక విద్యార్ధి. వ్యాపారమంటే సారాయి వ్యాపారమా ? నల్లమందు వ్యాపారమా అన్నారు శ్రీ మాష్టారు. అవికాదనుకొండి. గుడ్డలు, చిల్లర సామాను, పేనాలు, పుస్తకాలు, ఎరువులు ఎన్ని వ్యాపారాలున్నాయి సార్. అన్నాడు ఆ విద్యార్ధి.

ప్రతిపని మనుషులకొరకో లేక చెట్లకొరకో, పశువులకొరకో చేస్తున్నామనుకో. ఈ అన్ని జీవులలోను పరమాత్మ ఉన్నాడు. ఈ వ్యాపారంద్వారా ఆ పరమాత్మను సేవిస్తున్నాము అని హృదయపూర్వకంగా భావించి ధర్మబద్ధంగా ఆ పనిచేయడం అవసరం. ధర్మ బద్ధంగా ఎప్పుడు చేయగలుగుతాడు ? ఆశ చచ్చినరోజు మాత్రమే చేయగలుగుతాడు. అందుకే శ్రీ వెంకయ్యస్వామివారు "ఆశపోతే అంతా పోతుండ్లాయ్యా" అన్నారు. మన జీవితంలో ధర్మం ప్రధానంగా చేసుకొని జీవించడం నేర్చుకోవాలి. అంతేగాని లౌకికంగా సంఘంలో పేరు ప్రతిష్టలు సంపాదించాలనే ధ్యేయముంటే ధర్మ బద్ధంగా జీవించడం చాలా కష్టమౌతుంది. మనమెన్ని పూజలు చేసినా వ్రతాలు, దానాలు చేసినా ధర్మం ప్రధానాంశంగా లేకుంటే అన్నీ బూడిదలో పోసిన పన్నీరే అవుతాయి. నిత్యం హారతుల్లో "కామము దహించి మము కరుణించు స్వామీ" అని ఎన్నిమార్లు పాడినా ప్రయోజనమేముంటుంది. కామము దహించుకునే ప్రయత్నం మనంచేస్తూ వారిని ప్రార్థిస్తుంటే సాయినుండి సహాయంపొంది ధర్మ మార్గంలో నడువగలుగుతాము.



## మాయకు మరొకపేరు

మాయకు మరొకపేరు ప్రకృతి. దాన్నే సత్వ, రజస్తమో గుణాలనికూడా అంటారు. ప్రకృతికి మరోపేరు జగత్తు. జగత్తుకూడా మాయ అన్నమాట. ఈ మాయను జయించడం ఎలా అంటే ప్రత్యేక ప్రయత్నం కావాలి అన్నారు మాష్టారు. ప్రయత్నం కాదు ప్రత్యేక ప్రయత్నం. ప్రత్యేక ప్రయత్నమంటే ఎలాంటిదో చెప్పారు. భూమ్యాకర్షణ, చంద్రాకర్షణ అని రెండు వున్నాయిగదా. వీటి రెంటిమద్యా స్పేస్ అనే ఆకర్షణ లేని జాగా కొంత ఉంది. భూమి నుండి స్పేస్‌కు కొన్ని వేల మైళ్ళ దూరముంది. భూమినుండి ఈ స్పేస్ వరకు ఒక రాకెట్ వెళ్ళాలంటే ఎంత ఇందనం కావాలో, భూమ్యాకర్షణ నుండి ఈ స్పేస్‌లోనికి ప్రవేశించేందుకు అంత ఇందనం కావాలి. భూమ్యాకర్షణనుండి స్పేస్‌లోనికి పోవడంలాంటిదే ప్రత్యేక ప్రయత్నం.

అన్నీ ఋణానుబంధం ద్వారానే జరుగుతుంటాయి. ఈ సూత్రాన్ని అతిక్రమించడమే ప్రత్యేక ప్రయత్నం అదే మార్కండేయుడు చేసి చిరంజీవి అయింది అన్నారు.

## గురు సమాగమం

సాయి తన గురువును 12 సం॥ సేవించారు. ఈ 12 సం॥ వారిని చూస్తే సాయికి అన్న పానీయాల మాటే గుర్తు వచ్చేది కాదట. అలౌకిక స్థితిలోనున్న వారు మనలాగ క్రమంతప్పకుండా ఆహారం స్వీకరించేవారు కాదు. ఏ కొద్దిపాటి ఆహారమో నోటిలో పెడితే కళ్ళు తెరవకుండానే మ్రింగేవారు ఒక్కొక్కప్పుడు అదీలేదు. గురువుగారు ఆహారం ఎంగిలి చేస్తే సాయి ఆహారం తినేవారు. వారు అసలు ఆహారమే మ్రింగకుంటే సాయి ఆకలికి వేపాకు తినేవారు.

12 సం॥లకు గురువు కళ్ళు తెరచి నన్ను 12 సం॥ కాపాడావు. నిన్ను సప్త సముద్రాల ఆవల ఉన్నా రక్షిస్తానంటారు. ఈనాటి ప్రతిభంతా గురువుగారిదే ననేవారు. అలా 12 సం॥ దీక్ష సాగించి ఎముకల గూడైనారు బాబా. ఏమి చూచివారిని అలా సేవించారు. ఒకేఒక్క మహిమ. తనను బావిలో తల్లక్రిందులుగా వ్రేలాడదీసినపుడు నీళ్ళు అందకున్నా 5 గం॥ సేపు ఆనందమే అనుభవమైంది. అలా ఎందుకు ఆనందం అనుభవమైంది? బాబా మనసులో గురువుగారు నన్ను వేలాడతీశారే. ఇదెక్కడి గురువు అని సంశయించి బెంబేలెత్తలేదు. తన మనోభావానికి సత్యంగా అంటిపెట్టుకొన్నాడు. ఇప్పుడే కదా నేను నిన్ను సంపూర్ణంగా విశ్వసిస్థానని, నా తనువు, మనస్సు ప్రాణాలను మీ పాదములు చెంత అర్పించాననే దానికి గుర్తుగా పాదనమస్కారం చేశాను. మీకర్పించిన శరీరం మీదే గనుక అది ఏమైనా నేను వగచేందుకు వీలు లేదు. అని సత్యాన్ని అంటిపెట్టుకొని ఉన్నారు. గనుకనే ఆనందం అనుభవమైంది. గురువును సంశయించి ఉంటే ఆనందానుభూతిరాదు. అలా గురువును గుర్తించేందుకు కారణమేమి? తన ముంతలోని చద్ది అన్నం తినమన్న కట్టెలవాడి ప్రేమను గుర్తించడమే కారణం. ప్రేమను గుర్తించాలంటే తన హృదయంలో తాను ప్రేమమయుడై ఉండాలి. గనుక మనం ప్రేమమయులం కానిదే గురువు లంభించరు. అవధులు లేని ప్రేమను అన్నిజీవులపై కల్గియుంటే రాగద్వేషాలు పోయినట్లే అదే ఆధ్యాత్మికతలో మొదటి మెట్టు.

## అహంకారపు అడ్డు పొరలు తొలగాలి

అహంకారపు అడ్డుపొరలు తొలగాలి. నా దేవుడేగొప్ప. నా సాధనా మార్గమే గొప్ప అనేది నశింపజేసుకోవాలి. వినదగునెవ్వరు చెప్పిన వినినంతనే వేగపడక వివరింపదగున్, అని వేమన చెప్పినట్లు విడమరచి తెలుసుకోవాలి. ఈ విషయములో మాష్టారు, పిల్లలు, పెద్దలేగాక ఎవరు చెప్పినా అందులోని సాధకబాధకాలు వివరించి మంచిని గ్రహించేవారు.



## ప్రారబ్ధం త్వరగా ఖర్చు చేయడమెలా ?

ప్రారబ్ధం త్వరగా ఖర్చుచేయడమా లేక నిదానంగా ఖర్చుచేయడమా అనేది మన కృషిమీద ఆధారపడి ఉంది. నిదానంగా ఖర్చుచేయడమంటే ఏదైనా శారీరక అనారోగ్యం లాంటివి వస్తే కొద్దిపాటి బాధతో ఎంతోకాలం అనుభవించాల్సిన కర్మను మనకైమనమే ఆ బాధను ఎక్కువచేసుకొని కొద్దికాలం అనుభవించగానే త్వరగా బయట పడతాము. అయితే ఈ పద్ధతికి ఎవ్వరూ ఇష్టపడరు. కొద్దిపాటి బాధతో ఎక్కువకాలం అనారోగ్యంగా ఉండేందుకైనా సిద్ధపడతారు గాని బాధను ఎక్కువగా అనుభవించేందుకు ఎవ్వరూ ఇష్టపడరు.

ఒకసారి శ్రీ మాష్టరు గారికి నోరుపూసిందట. ఎన్నెన్నో మాత్రలు, నాటువైద్యాలు చేస్తున్నారు. కాని తగ్గలేదు. ఏపదార్థము మ్రింగనివ్వదు. చల్లని కాఫీత్రాగాలన్నా బాధే. ఇక అన్నం అసలులేదు. ఎవ్వరితోటి మాట్లాడేందుకు వీలుకాదు. వారంరోజులు గడిచింది. పై సూత్రాన్ని గుర్తుకు తెచ్చుకొని ఒకరోజు మామిడికాయ ఊరగాయలోని యర్రకారం తీసుకొని నాలుకకు బుగ్గలలోపల బాగా రుద్దేశారట. తీవ్రాతితీవ్రమైన మంట, కళ్ళగుండా నీళ్ళుకారుతున్నాయి. అయినా సహించి మిరప్పొడి ఊసెయ్యకుండా అలాగే కూర్చున్నారట. పది పదిహేను నిమిషాలుంచి ఊసేశారట. అయినా తీవ్రమైన మంటే. ఆరోజంతా అలా గడిపారట. తెల్లవారి అన్నం తిన్నారట. తన స్వానుభం ద్వారా ప్రారబ్దాన్ని త్వరగా ఖర్చుచేయాలంటే బాధను కోరితెచ్చిపెట్టుకొని అనుభవించాలని చెప్పారు.

## మందిరాలను గూర్చి మాష్టారి మంచిమాట

లక్షల ఖర్చుతో నిర్మించిన మందిరాల ఉపయోగం నేడు తప్పుత్రోవ త్రొక్కడం చాలా శోచనీయము. సమతాభావం, సోదరభావం మంటగలిపి సాయినాధుని ఆశయాలకు భిన్నంగా నడుచుకుంటూ అదే సాయి సేవ అని మనం భ్రమ పడుతున్నాము. మన అనుచరులైన మిగిలిన సోదరులకు కనువిప్పు కల్గించాలి అని అన్నారు.

మందిరాలలో ప్రత్యేక ఆహ్వానాలు. ఆదరణలు సాయి పద్ధతి కాదని శ్రీ మాష్టారు బోధించారు. నేడు డబ్బు ప్రధానంగా లెక్కలోకి తీసుకొని మందిరాలలో ఆదరణలు, అన్నదానాలు జరుగుతున్నాయి. ఈ విషయం ప్రస్తావిస్తే వారు సాయి చూపిన ఆదరణను చూపిస్తారు. ఇవతలి వారు కుష్ఠువ్యాధిగ్రస్తుని చేతిలోని మిఠాయి బాబా గ్రహించడం వగైరా చెపుతారు ఆయన ఏమి చేసినా సమతాభావం అలవడాలి. అనేదాన్ని మనకు నేర్పారు. పెద్ద చందాలిచ్చిన దాతలకు ప్రత్యేక చూపులు. చిన్నచందాదారులకు మరొక చూపు నేడు అలవాటైంది. సాయి మందిరానికి డబ్బెందుకు? రెండు కొయ్య పాదుకలు చాలని చెప్పేవారు మానవుల హృదయాలలోను, ఆచరణలోను, భక్తి ప్రధానంకాని భక్తితో నిమిత్తం లేకుండా రాణిగారు తెచ్చిన బంగారు నాణెముల బిందెకేమి విలువ నిచ్చారు బాబా. అన్నదానాలలో ప్రత్యేక పంక్తులలో కూర్చోబెట్టడం, దర్శనానికి స్పెషల్ క్యూలు ఏర్పాటు ఎంత శోచనీయమో చూడండి. సాయి ఆసించిన, నేర్పించనెంచిన సమతాభావం గంగపాలై బంగారు అలంకరణలు పట్టువస్త్రాలు రకారకాలతీపి పదార్థాలతో అన్నాదానాలు -



ఇవా బాబాగారు మందిరాలలో జరుగాలని ఆసించింది. పై హంగామా వద్దనేదిలేదు. కానీ సమతాభావపు పాఠాలు కరువైనాయి.

విద్యానగర్ మందిర ప్రారంబోత్సవం నాడు జరిగిన సన్నివేశం మరుపురానిది.

శ్రీ కేశవయ్యగారు మద్రాస్ ప్రఖ్యాత సాయిభక్తులు వచ్చి శ్రీ సాయి చిత్రపటాన్ని ఆవిష్కరిస్తారు. జనం తండోప తండాలుగా వచ్చారు. శ్రీ కేశవయ్యగారిని మందిరంలోనికి పోనివ్వరేమో అనేంతరద్దీ. వెనుక ద్వారంనుండి తీసుకవచ్చారు. ఆవిష్కరణ కాగానే 1 గం॥లో వెళ్ళిపోయారు. ప్రత్యేక దర్శనాలు లేవు అందరూ సామాన్య దర్శనము చేసుకోవలసిందే. కొందరు బడా నాయకులు మాష్టారుగారిపై అలిగారు. ఎందుకు? వారికి స్పెషల్ దర్శనం స్పెషల్ ఎంట్రీ ఇవ్వలేదని. ఆలిండియా సాయి సమ్మేళనం నెల్లూరులో జరిగితే శ్రీ మాష్టారిని ఈ అలక కారణంగా ఆహ్వానించలేదు. వారు రాలేదు. సాధారణ లౌకికులకిచ్చిన విలువకూడా శ్రీ మాష్టారికి ఇవ్వలేదు. కానీ సాయి స్పెషల్ ఇన్విటేషన్ పంపారు శ్రీ మాష్టారికి. ఒక బెంగుళూరతను వచ్చి మాష్టరు గారిని ఆహ్వానించలేదని తెలిసి కారులో వెళ్ళి శ్రీ మాష్టారిని తీసుకొచ్చారు. వచ్చారు గనుక వేదిక ఎక్కించారు. ఇలా ఉంటాయి మన మనస్తత్వాలు. ఈ డొనేషన్స్ ఇచ్చిన వారికి, సాంఘీకంగా గొప్పస్థాయిగలవారికి మనం స్పెషల్ చూపిస్తే సమతాభావం పోయిందని గుర్తించాలి. అన్న దానాలలో బీదవారికి వేరే పంక్తులుండడం ఎంత సోచనీయమో. అదృష్టం అనాలో దురదృష్టం అనాలో ఇలాంటి సన్నివేశాలే నాకళ్ళలో పడుతుంటాయి.

## చూడబడేదంతా కలసినేను

"ఈ కనబడేదంతా కలసినేను". అన్న బాబా మాటను శ్రీ మాష్టరుగారు తన ఆచరణ ద్వారా మనకు చక్కని బోధను అనుగ్రహించారు. ఆ బోధను వారి వలె ఆచరించి శ్రీ సాయిని సేవించడమా లేక సాయికి హారతులు పాడి ప్రసాదం తినేవరకే మనం పరిమితమవడమా అనేది మనకే వదిలిన మహనీయ మూర్తివారు. వారు విద్యానగర్‌లో ఉండగా ఏమానవుడు ఆచరించి ఎరుగని ఒక విశిష్టమైన ఆచరణ మనకు సవాల్‌గా ఆచరించారు.

విద్యానగర్‌లోని లెక్చరర్లందరూ ప్రతినెలా కొంత చందా వేసుకొని ఒక హోమియో వైద్యుని ఉంచుకొని వైద్యసౌకర్యముపొందేవారు. అలా కొన్ని నెలలు గడిచాక ఇక మీ సేవలు మాకక్కరలేదని చెప్పి వారిని వెళ్ళిపొమ్మన్నారు. ఆ వైద్యుడు శ్రీ మాష్టారితో పరిచయము గలవాడు గనుక ఆవిషయం శ్రీ మాష్టారికి చెప్పుకున్నాడు. వెంటనే శ్రీ మాష్టారు వాళ్ళిచ్చే జీతం నేనే ఇస్తాను. నీవు వెళ్ళిపోకుండా నీపనికొనసాగించమని చెప్పి ఆ వైద్యునకు జీతమిచ్చి మందులు తెచ్చిచ్చేవారు.

ఇలాంటి అనుకోని అధిక వ్యయాన్ని శ్రీ మాష్టారు ఎలా సర్దుబాటు చేశారో తెలుసుకుంటే నాపైనాకే అసహ్యమేస్తుంది. ఉదయం హోటల్‌లో టిఫిన్ చేస్తే కనీసం ఐదురూపాయలు ఖర్చు, రాత్రి అన్నం వండేటప్పుడు పిడికెడు బియ్యం ఎక్కువవేసి వండి ఆమిగిలిన అన్నంలోకాస్తపాలు మిగిలించిపోసి అందులో ఒకచుక్క మజ్జిగవేసి ఒక ఉల్లిపాయ తరిగి వేసిపెట్టేవారు. పాలు గడ్డకడుతాయి. ఆ అన్నం ఉదయం టిఫిన్‌కు బదులు తినేవారు. అలా నెలకు 150 రూ పొదుపుచేసి ఈ డాక్టరు ఖర్చుభరించేవారు. నేను ఇంకా రుచిగా టిఫిన్ తినాలనుకుంటాను. గాని అందరిలోని సాయిసేవకై టిఫిన్ మానుకొని అలాంటి వైద్యసేవ చేయగలుగుచున్నానా అనిపిస్తుంది. అందరిలో సాయిని చూడటం అనేదాన్ని ఆచరించేందుకు శ్రీ మాష్టారు ఎంత గొప్ప త్యాగంచేశారో చూడండి. అందుకే వారు మహాత్ముల ముద్దుబిడ్డడయ్యారు.



ఇలా కొన్నాళ్ళు జరిగాక ఆడాక్టరుగారికి రోగులెక్కువ కాసాగారు. అందుకని వారంలో ఐదురోజులు బయటి గ్రామాలు నెల్లూరు, గూడూరు, వెంకటగిరి, సూళ్ళూరుపేట, శ్రీహరికోట మిగిలిన రెండు రోజులు విద్యానగర్‌లో చూచేవారు. ఈ విధంగా వారి వైద్యశాల చివరకు ఒంగోలుకు కూడా వచ్చి అక్కడే స్థిరపడిపోయింది. మీలారెపా చరిత్రలో 29వ పేజిలో మీలారెపా గారు చెపుతారు. "ప్రశాంతమయిన మనస్సు, అంతులేని శక్తి సామర్థ్యాలు ................ ఆధ్యాత్మిక సాధన అనునిచ్చెనలో మొదటి మెట్టు. సాధనలో తానుచేసేయత్న మంతా కరుణ, సకలజీవుల యొక్క శ్రేయస్సుకోసం తన స్వార్థాలను వినియోగించాలనే నిశ్చయంనుండి ఉత్పన్నం కావాలి. గమ్యాన్ని స్పష్టంగా ఎరిగి తన ఆశయాలు, ప్రార్థనలూ మానసిక క్రియలు యోచనాస్థాయిని దాటినవైఉండాలి." యోచనా స్థాయిని దాటితే ఏముంటుంది? ఆతరువాత భాగం క్రియాస్థాయి. మన ప్రార్థనలు మానసిక క్రియలు క్రియారూపంధరించాలి అని చెపుతున్నారు. ఇందులోని ఆచరణే శ్రీ మాష్టారుగారు టిఫిన్ మాని చద్దన్నం తిని డాక్టరు గారిని పోషించడం. ఇలాంటి త్యాగాల ద్వారా అందరిలోని సాయిని సేవించు అని మనకు తన ఆచరణద్వారా శ్రీ మాష్టారు బోధిస్తున్నారు.

ఇందులో మొదటి విషయం ప్రశాంతమయిన మనస్సు. అన్నారు. ప్రశాంతమైన మనస్సెప్పుడు దొరుకుతుంది. మనకు రావలసినవన్నీ వచ్చితీరుతాయి. మన ఆరాటం అవసరంలేదు. మనకు సత్యమార్గమే శరణ్యము. అని హృదయంలో బాగానాటుకొని ఉండాలి. ఆరాటం ద్వారా మనం ఆర్జించినా అది ఇనప్పెట్టిలోగాని బ్యాంకులోగాని ఉంటుందిగాని మనం అనుభవించలేము. అనే సత్యం బాగావంటబట్టినప్పుడు మనలను కార్యాచరణకు దిగనిస్తుంది.

## గాడిదలు గంధపుచెక్కలు

గంధపుచెక్కలు మోసే గాడిదలకు వాటివిలువ వాసన తెలుసంటారా? బొత్తిగా తెలియదుసార్. మానవాళిలో మెజారిటీ ఈ గాడిదల్లాంటి వారేనోయ్. అయితే ఈ మానవులకంటే ఆగాడిదలే మేలోయ్. ఎందుకంటే ఆవిలువైన వస్తువును ఒకచోటి నుండి మరొకచోటికి చేరవేసి పుణ్యం కట్టుకుంటున్నాయి. మరి. ఈ మానవులు తమకు తెలిసిన ఎంతో గొప్ప విషయాలు తమ బుర్రలో మోస్తుంటారు తప్ప దూరపువారికి గాకపోయినా ప్రక్కవారికి కూడా చెప్పరు. టీకొట్లదగ్గర ఊసుబోని కబుర్లుచెప్పుకుంటారుగాని కొంచెసేపు మహనీయుల చరిత్ర పారాయణ శ్రవణము చేసి ఒకరికి తెలిసిన విషయాలు మరొకరితో చెప్పుకోరు. ఎందుకలా సత్‌సంగం చేయును ఇష్టపడరో తెలుసా? ఈతడు గొప్ప పుడింగ్ అయిపోయాడు అని వాళ్ళనుకుంటారేమోనని భయం. ఎదుటివాళ్ళు మనలను మంచివాడనుకోవాలని ఆశిస్తారు. తాను తానుగా జీవించేది పోనిచ్చి ఇతరుల భావాల కొరకు జీవిస్తుంటారు. అందుకే మన కంటే ఆగాడిదలే మేలన్నాను. కష్టంగాని సుఖంగాని అవిఅలా మోస్తూ మనకు సహాయం చేస్తున్నాయి. ఈ గాడిదలు తన యజమానినుండి కనీసం పొట్టకంత గడ్డికూడా ఆశించవు. వాటిని వదిలేస్తే వాటిమానాన అవి మేస్తాయి..



మనమూ ఆగాడిదల్లాగ ఏమీకోరకుండా మనకు తెలిసిన విషయాలు ఇతరులకు చెపుతుంటే బాబా ఎంత సంతోషిస్తారోగదా!

అంటే మాష్టారు మనలనందరినీ సత్‌సంగాలు చేయమంటున్నారు. ఎప్పుడో వారానికోసారి గాకుండా నిత్యం చేయమంటున్నారు. మొదట నిత్యం ఇంట్లో చేయమన్నారు. సత్‌సంగం టైంలో ఇంట్లోని అందరూ పాల్గొనేటట్లు చేయమన్నారు. భగవంతునకు మన మర్పించే అతివిలువైన కానుక మన కాలము - మనస్సు. అందరూ కలసి కట్టుగా సత్ సంగంలో కూర్చుంటే శ్రీ మాష్టారెంత సంబరపడతారో చెప్పలేము. అందుకే వారు 'మీరెక్కడుంటే అక్కడ సత్‌సంగం చేయండి. అదే నాకు లక్షలిచ్చినట్లు' అన్నారు.

ఇంట్లో అందరూ సత్‌సంగానికిరారు సార్ అంటే ఒకరోజు అన్నం తినకుండా అలగనిదే వాళ్ళు దోవకురారు అనిచెప్పి అమ్మగారిచేత నిత్యం నామస్మరణ చేయిచడానికి తాను ఎలా సున్నితంగా ఒకపూట అన్నం తినకుండా మానేసిన విషయం చెప్పి నన్నుకూడా అలాచేయమన్నారు. నేనలాచేసినంత వరకు మా అమ్మగారు ఇంట్లోజరిగే సత్ సంగానికి వచ్చేదిగాదు. అలా చేయగానే అదిమొదలు ఆమే మొదట వచ్చి కూర్చునేది. శ్రీ మాష్టారికి అతి ప్రీతిపాత్రమైన నిత్యసత్‌సంగం అందరము చేసి తరిద్దాం. సత్‌సంగానికి కుంటిసాకులు చెప్పే మన వక్రబుద్ధిని బాబాకిద్దాం.

## శ్రీ మాష్టరు చూపిన మార్గాలు

శ్రీ మాష్టరు గారు సాయి ఆదేశాన్ని పొందే మూడు మార్గాలు బోధించారు. ఇది వాచా చెప్పడంగాకుండా తన అచరణద్వారా బోధించారు. ప్రతి మానవుడూ సర్వజ్ఞుడైన శ్రీసాయి ఆదేశం ప్రకారం జీవితయాత్ర సాగించడం ఎంతో శ్రేయోదాయకమైన మార్గమని చెప్పేవారు. మానవ మాత్రులమైన మనకు రకరకాల సమస్యలొస్తుంటాయి.

ఒకటవ పద్ధతి :- తాను వివాహంచేసుకోవాలా వద్దా అనేది ఒక సమస్య. ఇందులో తొందరేమీ లేదు. వ్యవధి ఉందిగనుక షిరిడీలో ఉండి వారంరోజులు పారాయణ మరియు నిత్యం శ్రీసాయి సమాధికి నూటెనిమిది ప్రదక్షిణలు చేస్తూ మిగిలిన కాలాన్ని సాయి స్మరణలో గడిపారు. శ్రీసాయి తన సమస్యకు ఏ పరిష్కార మార్గమాదేశిస్తే అదే ఆచరిస్తానని చెప్పుకున్నారు. తనను వివాహంచేసుకొని తీరాలని మాట తీసుకున్న శ్రీ పాకలపాటి గురువుగారి రూపంలోనే శ్రీసాయి వచ్చి వివాహం చేసుకొమ్మని చెప్పిన విషయం మనం సాయి లీలామృతంలో చదివాము. ఇది ఒక పద్ధతి.

రెండవ పద్ధతి :- శ్రీ సాయినుంచి సందేశం పొందేందుకుగాను దీక్షచేసేందుకు వ్యవధిలేదు. ఏదో విధంగా వెంటనే వారు మనమొరవిని సందేశమివ్వాలి. అలాంటి పరిస్థితి వచ్చింది. ఒకసారి శ్రీ మాష్టారు పలానా తారీకున నేను షిరిడీలో మీ దర్శనం చేసుకుంటానని చెప్పుకున్నారట. కానీ అదే తారీకున ఎంతోకాలం ఉద్యోగంలేని తనను తెలంగాణా ఏరియాలో ఇంటర్వ్యూకు పిలిచారు. శ్రీసాయికి చెప్పుకున్న ప్రకారం షిరిడీ వెళ్ళడమా లేక ఇంటర్వ్యూకు వెళ్ళడమా ? చాలా ఇబ్బందికరమైన సమస్య. స్నేహితులు, హితాభిలాషులూ ఇంటర్వ్యూకే వెళ్ళమని బలవంతం చేశారు. రైల్వేస్టేషనుకు వచ్చాక శ్రీసాయి ఆదేశం తీసుకోవాలని బలంగాతోచి రైల్వేస్టేషనులోనే శ్రీసాయికి అగరువత్తి



సమర్పించి (1) ఇంటర్వ్యూ (2) షిరిడీకి అని రెండు చీట్లువ్రాసి శ్రీసాయి పటంముందుంచి ఒక పిల్లవానిద్వారా ఒకటి తీయించారు. షిరిడీకి అనే చీటీవచ్చింది. వెంటనే షిరిడీకే వెళ్ళారట. ఆ తర్వాత తనకు విద్యానగర్‌లో ఉద్యోగమొచ్చిందట. తెలంగాణాకు తాను వెళ్ళివుంటే తనకున్న సర్వీసునుబట్టి తనకే ఉద్యోగమొచ్చిఉండేదట. అయితే చిత్రమేమిటంటే రెండు నెలలు జరుగకుండానే తెలంగాణా అజిటేషన్‌వచ్చి తన స్థానములో చేరిన లెక్చరర్‌గారి గుడ్డలు, సూట్‌కేసు లాక్కొని పంచె, బనియన్‌తో తరిమారట. ఆ స్థానములో తానే ఉంటే దేహశుద్ధికూడా జరిగేదేనని చెప్పారు శ్రీమాష్టారు.

మూడవ పద్ధతి :- ఎందుకో తెలియదు. ఆ సమయంలో అలా అనిపించి చీట్లువేసే పద్ధతికి స్వస్తిచెప్పి మరొక క్రొత్త పద్ధతి ఎన్నుకున్నారు. తాను అంతవరకు ఉన్న విద్యానగర్ వదలి వెళ్ళాల్సిన టైం వచ్చింది. తన మూలంగా ఆ గ్రామంలో హత్యలు జరిగేటట్లున్నాయి. తన సత్సంగ సభ్యులంతా మూడు పార్టీలయ్యారు. ఒక వర్గంవారు రెండురోజులు మీరు మొఖం తప్పించి వెళ్ళండి గ్రామంలో వేడి చల్లారిపోతుంది. అప్పుడు తిరిగివస్తే ఏ సమస్యా ఉండదు. వెంటనే కదిలిరండి అని ఒక కారుతెచ్చిపెట్టారు. రెండవ వర్గంవారు - ధర్మం మనవైపుఉంది. సాయి అండ మనకుంది. మనం వాళ్ళకు భయపడి పారిపోనక్కరలేదు. మీరు వెళ్ళవద్దు అంటారు. మూడవ వర్గంవారు - అటు ఒకటవ వర్గానికిగాని ఇటు రెండవ వర్గానికిగాని చెందకుండా తటస్థంగా ఉన్నారు. అప్పుడు శ్రీ మాష్టారు అందరికీ ఒక మాట చెప్పారు. మీరంతా వెళ్ళిపోయి అరగంట ఆగి తర్వాత ఇక్కడకురండి. ఈలోగా నేను శ్రీసాయిని అడిగి చెపుతాను అన్నారు. వాళ్ళంతా అలానే వెళ్ళారు. శ్రీ మాష్టారు శ్రీ సాయికి అగరొత్తి సమర్పించి "సాయి ! ఈ అరగంటలోగా మొదట ఈ గదిలోకి వచ్చినవారు ఏ సలహాఇస్తే అదే మీ సలహాగా తలచి పాటిస్తాను. ఎవరిని ప్రవేశపెడుతారో మీ ఇష్టం" అని చెప్పుకొని మామూలు లుంగీ బనియన్‌తోనే

కూర్చొనియున్నారు. పది నిమిషాలు కాకుండానే అనంతపూర్‌నుండి ఒక క్రొత్త వ్యక్తి పూలు పండ్లు తీసుకొని వాకిట్లోకి రాగానే "సార్ ఎక్కడికో వెళ్ళేటట్లున్నారు. ఇవి తీసుకొని వెళ్ళండి అంటూ గదిలో ప్రవేశించాడు.

అప్పుడు సంభాషణ ఇలా జరిగింది.

మాష్టారు :- బస్సులో మీ రెవరితోటి ఏమి మాట్లాడారు ?

విజిటర్ :- బస్సులో నామం చెప్పుకున్నానేగానీ ఎవ్వరితోటి మాట్లాడలేదుసార్

మాష్టారు :- బస్టాండులో ఏం మాట్లాడారు?

విజిటర్ :- భరద్వాజగారి ఇల్లెక్కడని అడిగాను సార్. ఈ రోడ్డునే వెళ్ళి కుడిప్రక్క బావిఉండేదే వారి ఇల్లని చెప్పారు. అలాగే వచ్చానుసార్.

మాష్టారు :- మీరెక్కడికో వెళ్ళేటట్లున్నారు. ఇవితీసుకొని పొమ్మాన్నారే. అలా ఎందుకన్నారు ?

విజిటర్ :- వెరీసారీసార్. వాకిట్లోకి రాగానే నాకెందుకో అలా అనిపించి అలా అనేశానుసార్. నిజానికి మీరెక్కడికీ పోవడంలేదా ? వెరీవెరీ సారీసార్ అన్నారు.

ఈ వచ్చిన వ్యక్తే అరగంటలో వచ్చిన మొదటివ్యక్తి. అతడు మాట్లాడిన మొదటి మాట "వెళ్ళండి" అన్నమాటే. ఇంతలో కారువచ్చింది. వెంటనే చొక్కాతొడుక్కొని ఒక్క వస్తువుతాకకుండా వెళ్ళిపోయారు.

ఈ మూడేగాక ఇంకెన్నో పద్ధతులలోవారు శ్రీసాయి సందేశాన్ని పొంది ఉండవచ్చు. శ్రీ మాష్టారు సందర్భోచితంగా నాకు తెలిపినవి ఈ మూడు మార్గాలే. శ్రీసాయి ఆదేశం తాను తలచిన వెంటనే లభిస్తుందనే దృఢమైన నమ్మకమే వారి జీవితానికి చుక్కానిగదా !



## సాయి దరిచేరడమెలా?

శ్రీసాయి దరిచేరడమెలాసార్ ? అంటే శ్రీ మాష్టారు చాలా సులభమార్గం చెప్పారు.

మన లెక్కలో పాపంకంటే పుణ్యమెక్కువ ఉంటే ఆ పుణ్యమే మనలను సద్గురు సాన్నిధ్యం చేరుస్తుంది. మానవుడు మిశ్రమ కర్మలు చేస్తుంటాడు. తానాచరించే కర్మలలో పుణ్యపాపాలు కలసిఉంటాయి. ప్రతినిత్యం విధిగా పుణ్యకర్మలు ఆచరిస్తూవస్తే మన లెక్కలో పుణ్యం పెరుగుతుంది. వేటిని పుణ్యకర్మలంటారు ? అనేది తెలియాలి. ఇవి శారీరక, వాచక, మానసికంగా ఉంటాయి.

దేవ ద్విజగురుప్రాజ్ఞపూజనం శౌచ, మార్జవం బ్రహ్మచర్య మహింసాచ శారీరక తప ఉచ్యతే అన్నారు. మొదటిది పూజ. మనం పూజించేవారి గొప్పతనమేమిటో క్షుణ్ణంగా తెలుసుకొని పూజిస్తే గొప్ప ఫలితముంటుంది. అలాంటి వారిలో శ్రీసాయినాధుని వంటి సద్గురువును పూజించడం ఉత్తమోత్తమం. వారి చరిత్ర క్షుణ్ణంగా తెలుసుకొని వారాచరించమన్న జీవితవిధానాన్ని ఆచరిస్తూ వారిని పూజిస్తుంటే జీవితంలో ఇక కొరతంటూ ఉండదు.

తరువాత అంశం శౌచం - బాహ్యాభ్యంతర శుచి. బాహ్య శుచి, మరియు హృదయ పారిశుద్ధ్యము. ఆర్జవం అంటే ఋజు వర్తనము. బ్రహ్మచర్యం, అహింస ఇవన్నీ మనమాచరిస్తే మనకు తెలియకుండానే శ్రీసాయిలాంటి సద్గురుని సేవిస్తున్నట్లే లెక్క.

శ్రీ వేమనగారు పుణ్యకర్మలంటే ఏమిటో చెపుతారు. ఏ ప్రాణికి మేలుచేసినా పుణ్యమే. అలాగే ఏ ప్రాణికి కీడుచేసినా పాపమే అంటారు.

విశ్వమంతా తానేఐన సద్గురుని గుర్తిస్తూ మన ఆచరణను సరిచేసుకుంటూపోతే పుణ్యం దానంతట అదే మన లెక్కలో పెరుగుతుంది.

"ఈ చూడబడేదంతా కలసి నేను" అంటారు సాయి. అలాగే ఆకలిగొన్న ఏ ప్రాణికి పెట్టినా నాకు పెట్టినట్లే అన్నారు. ఏ ప్రాణికి బాధకలిగించినా నాకే బాధకలుగుతుందని నిరూపణ ఇచ్చారు.

ఇదేవిధంగా శ్రీ వెంకయ్యస్వామివారు - అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడని వ్రాసుకోయ్యా అన్నారు. వెంకయ్యపేరుమీద పిడికెడు మెతుకులుపెట్టినవారికి అవి తెచ్చినవారికి వారిమంచి చెడ్డలన్నీ మనం చూడొద్దయ్యా అన్నారు.

గనుక మన నిత్య కార్యక్రమం పూజ, పారాయణతో మొదలైతే ఎంత చక్కని బాటలో పయనిస్తామో చూడండి. అలా వీలులేని వృత్తులలోనుండేవారు వీలైనప్పుడైనా చేయాలి అనే పట్టుదల ఉండాలి. అలాంటి పట్టుదల లేకుంటే మనం పాపకార్యాలవైపుకే మ్రొగ్గే ప్రమాదముంది. యాంత్రికము, లాంఛనప్రాయము అయిన పారాయణ మాని ఆత్మోత్తేజముతో పారాయణ చేయమంటారు శ్రీ మాష్టారు.

పాప కార్యాలంటే ఇతరులను చంపడం మాత్రమే అని తలంచరాదు. ఇతరులనుగూర్చి మనం వహించే చెడ్డతలంపులన్నీ పాపకార్యాలే అవుతాయి. ఇతరులద్వారా మనకు హాని జరిగింది. అలా హాని జరిగినప్పుడు మన ఆలోచనలు ఎలా ఉండాలి అని అన్నదే సాధన. అదే సాయి దరిచేరే మార్గం.



దైవమంటే ఏమిటి అన్న శిష్యునితో గురువుచెపుతాడు. "పూర్వజన్మ కృతం కర్మ తద్దైవ మిదికజ్యతే." పూర్వం చేసిన కర్మఫలితమే మన పాలిట దైవము అంటారు. మన పూర్వజన్మ కర్మఫలితమే వారిని మనకు హానిచేయమని ప్రేరేపించింది. అంతేకాని స్వతహాగా వారికి అలాంటి ఆలోచనలు ఉండవు. బ్యాంకులో అప్పుతెచ్చుకొని తీర్చేటప్పుడు బాధపడడం మంచిదేనా ? అన్న మాష్టారి మాటే ఇందులో ఇమిడివుంది. విద్యానగర్‌లోని రాద్ధాంతంఎడల వారి ఆలోచన, ఆచరణే మనకు వెయ్యిజన్మలకు సరిపడు బోధ.

శ్రీ మాష్టరుగారి మార్గం గిట్టనివారు కమెండో అనే పత్రికను స్పెషల్ ఇష్యూవేసి అందులో శ్రీ మాష్టార్ని చెండాలంగా వర్ణించి ఆ పేపర్లన్నీ ఊరూర ఫ్రీగా పంచారు. శ్రీ మాష్టారిని ఒక హంతకుడుగా ప్రచారంచేశాడు. ఒకరోజు రెండురోజులు కాకుండా షుమారు నెలరోజులు కత్తితీసుకొనివచ్చి వారిని దుర్భాషలాడారు. ఇన్నిచేసినా వారిమనసులో ఆ వ్యక్తులనుగూర్చి ఒక్క ఆలోచన రాలేదు. లివ్ ఇన్‌ది ప్రజెంట్ అంటే ఎలాగో ఆచరించి చూపారు.

సమ శృత్రౌచ మిత్రేచ తధా మానావ మానయో అంటే ఎలా ఉంటుందో ఆచరించి చూపారు. పై విషయాల వివరణ మరొక వ్యాసంలో చూస్తాము. శ్రీ మాష్టారి ఆచరణలాంటి ఆచరణే మనలను సాయిదరికి చేరుస్తుంది. ఆత్మ పారిశుద్యమంటే ఏమిటో, మానవుడు ఎలా ఉండాలో మనకు నేర్పిన మహనీయుడు శ్రీ మాష్టారు.

## సద్గురుని చూపేది పుణ్యమే

సర్వశుభాలకు పుణ్యమే మూలం శ్రీమాష్టారు తన ఆచరణద్వారా మానవాళిని ఎంతగొప్పగా ఉత్తేజితులను చేశారో చూడండి. వారు విద్యానగర్‌లో ఉండగా ఒక్కొక్క బ్లాక్ అండ్ వైట్ ఫోటో శ్రీ సాయినాదులవారిది తన దగ్గరకొచ్చే వారందరికీ ఇచ్చి పూజచేసుకోమని సాయినిగూర్చి చెప్పేవారు. సాయినాధుని పటం ఇంట్లో పూజిస్తుంటే ఇక దేనికికూడా మనం చింతించడం, దిగులుపడటం, వ్యగ్రీకావడం, భయపడడం అంటూ ఉండదని బల్లగుద్దిచెప్పేవారు. ఈ పూజను గురించి భగవద్గీతలో పదిహేడవ అధ్యాయంలో పద్నాలుగవ శ్లోకంలో

"దేవ ద్విజగరు ప్రాజ్ఞ పూజనం శౌచమార్జవం బ్రహ్మచర్య మహింసాచ శారీరం తప ఉచ్యతే" అని చెప్పారు. దేవతలు, బ్రహ్మజ్ఞానము కొరకు పాటుపడువార్తు, గురువులను, క్షుణ్ణంగా శాస్త్రాలనెరిగిన వారిని పూజించుట, శౌచమంటే బాహ్యంగా శుభ్రత, అంతరంగంలో శుభ్రత, ఆర్జవమంటే ఋజు స్వభావము అనగా యధార్థం పలకడం. బ్రహ్మచర్యం, అహింస - పాటించడాన్ని శారీరక తపస్సని చెప్పారు. ప్రతివారిని ప్రథమ సోపానమైన శారీరక తపస్సు చేయమని ప్రోత్సహించారు. అందునా శ్రీ సాయిని పూజిస్తుంటే వారిచరిత్ర చదవడం, వినడం వంటివి జరుగుతుంటే అనంతంగా పుణ్యము గల్గిమనం సద్గురు సాయి నాధుని బిడ్డలంగా తీర్చిదిద్దబడగలమని చెప్పేవారు.

శ్రీ వేమనగారు పుణ్యమంటే నిర్వచనం చెప్పారు. ఏ జీవికి ఉపకారం చేసినా పుణ్యమే ఏ జీవికి అపకారం చేసినా పాపమే అంటారు.



ఈ శ్లోకంలోని తర్వాత అంశాలైన శౌచం ఆర్జవం, బ్రహ్మచర్యం, అహింస, మొదలైన వాటిని శారీరక తపస్సన్నారు. శౌచం, ఆర్జవమంటే ఏమిటో చూస్తాం. శౌచం - బాహ్యశుచి మరియు అంతరంగంలో ఎవరిఎడల చెడ్డభావాలు లేకుండుట. మనకు కీడుచేసిన పరమ దుర్మార్గునిఎడలగూడ చెడ్డభావము లేకుండుట. అది ఎలా సాధ్యమయ్యా అంటారు కొందరు. ఇప్పుడు మనకు కీడు చెయ్యాలని అతనికి బుద్ధి పుట్టేందుకు కారణం అతనితో పూర్వజన్మలోని మన ఋణానుబంధమే కారణం. బ్యాంకులో అప్పుతెచ్చుకొని తీర్చేటప్పుడు బాధపడడం ధర్మమా? అనే భావంతోనే ఉండాలి. అలాకాదు, అతడు ఇప్పుడే తన చెడ్డ ప్రవర్తనద్వారా మనకు కీడు చేశాడు. పూర్వజన్మ ఋణానుబంధంలేదు అనుకొందాము. ఋణానుబంధంవలననే అతనలా కీడు చేశాడు అని మనం అనుకొన్నందున మనకు నష్టమేముంది. అతనిచెడు కర్మకు ఫలితం అతడనుభవిస్తాడు. మనంమాత్రం రాగద్వేష విముక్తుల మవుతాము. పరమ దుర్మార్గునికికూడా కీడు తలపెట్టని మన ప్రవర్తనద్వారా ఆ వ్యక్తిలో తప్పక మార్పు వస్తుంది. ఇది ఆ వ్యక్తికి మనవలన జరిగే ఉపకారం అన్నమాట. అదీపుణ్యమే.

ఇంతేకాకుండా ఆ దుర్మార్గుని క్షమించి అతనిలో మార్పుతెచ్చి సన్మార్గునిగా చేయమని మనం ప్రార్థించాలట. అదే క్రీస్తు చేసినది. తనను శిలువ వేసిన వారిని గూర్చి క్రీస్తు అంటారు.

"వారేమి చేయుచున్నారో వారెరుగరు. దయచేసి వారిని క్షమించి మంచిమార్గంలోకి నడపండి" అని ప్రార్థిస్తారు.

విద్యానగర్‌లో తనను ఒక నెలరోజులు అనరాని మాటలతో ఎంతో విసిగించిన వారిలోగూడ మార్పుగల్గి క్షమాపణ చెపుతాడు. ఇది శ్రీ మాష్టారు ఆచరించి చూపిన శౌచం.

ఆ తర్వాత ఆర్జవం - అంటే ఋజువర్తనం. మనం యదార్థవాదులుగా ఉండడంవలన మనకు లాభం రాకపోవచ్చుగాని మన ప్రవర్తనద్వారా అవతలివారికి మనవలన కీడుమాత్రం జరుగదు మేలే జరుగుతుంది.

ఆ తర్వాత బ్రహ్మచర్యం - దీని ద్వారా మనకెంతో పుణ్యం సంక్రమిస్తుంది. బ్రహ్మచర్యమంటే అష్టవిధ బ్రహ్మచర్యమట. శారీరకంగా స్త్రీపురుష కలయికేగాకుండా అలాంటి ఆలోచన రాకూడదట. అలాంటి మాటలు మాట్లాడరాదు. అలాంటి మాటలు వినరాదు అలాంటి బొమ్మలు చూడరాదు. అలాంటి స్త్రీలముఖం చూడరాదు. ఇలాంటివి ఎనిమిది ౦కాలు చెప్పారు. వీటిని ఎంతో గొప్పగా పాటించారు గనుకనే శ్రీ మాష్టారు మహాత్ముల ముద్ద బిడ్డడైనారు.

తాను బ్రహ్మచారిగా ఉండగా జరిగిన ఒక ఉదంతం ఒక దానిని వారి పుట్టిన రోజు పండుగరాత్రి చెప్పారు. తాను కాలేజీలో చదువుతున్నరోజులట. ఒకరోజొక అమ్మాయి తను, తన మిత్రునితో కలసి పిక్‌నిక్‌కు వస్తానని అంగీకరించింది టైం మరియు తేదీ నిర్ణయించుకున్నారు. కానీ శ్రీ మాష్టారికి తన గదికి వచ్చింది మొదలు తానెంత నిక్రుష్టపు పనిచేయబోతున్నాడోనన్న ఆలోచనగల్గి దానినుండి తప్పించుకోవడం ఎట్లాగా అని తీవ్రమైన ఆలోచన గల్గింది. ఆ సమయానికి తన మిత్రుడు తన గదికిరానే వచ్చాడు. ప్రయాణంగాకుండా ఉన్న



మాష్టార్నిచూచి త్వరగా తయారుకమ్మని తొందరచేయసాగాడట. ఈయన మౌనంగా చాపమీద కూర్చొనుంటే ఆ మిత్రుడు టైం అయిపోతుంది ఆ అమ్మాయి మనకోసం అక్కడ ఎదురుచూస్తుంది అని తొందర చేయసాగాడు. నేను రావడంలేదని చెప్పాడు శ్రీ మాష్టర్. ఎందుకో కారణం చెపితే నీవు చంపేస్తావుగనుక చెప్పనన్నారు. ఎన్నో ప్రమాణాలుచేసి ఎంతో బ్రతిమాలితే చెప్పారట 'నేను మీ చెల్లెల్ని తీసుకొని మరొక తావుకు పిక్‌నిక్ పోతున్నాను' అనగానే అతడు పండ్లు బిగించి ముఖం మాడ్చుకొన్నాడు. ఓరి నీచుడా ఎంతపని చేశావురా ? అన్నాడట. "నేను ముందుగానే చెప్పాను. విషయం చెపితే నన్ను చంపేస్తావని" అని అన్నారట. అప్పుడు మాష్టారు అన్నారట "నీ చెల్లెలితో పోతున్నానని అనగానే నీకింతబాధ అయిందే మనతో వస్తానన్న అమ్మాయిగారి అన్నదమ్ములకు, తల్లిదండ్రులకు తెలిస్తే వారెంత బాధపడుతారో ఆలోచించు" అని అతనిని పంపేశారట. ఆ తర్వాత విషయం ఏమైందో మేము వారిని అడుగలేదు వారు మాకు చెప్పలేదు. ఇలా బ్రహ్మచర్య దీక్షచేశారు గనుకనే మహాత్ముల ముద్దుబిడ్డడైనారు. మనలనుగూడా అలాచేసి సాయి కృపపొందమంటున్నారు.

అహింస :- హింస లేకుండా ప్రాణుల మనుగడేలేదు.

ఉదా:-బల్లులు ఇతర పురుగులను తినాలి. కప్పలూ అంతే. మానవులలో ధృవప్రాంతాలవారికి సీల్, వాల్‌రస్ అనే జంతువులే ఆహారము. మనం కూరగాయలు తింటున్నాము వాటికిమాత్రం ప్రాణంలేదా ? బాధలేదా ? ఉన్నవని శాస్త్రజ్ఞులు నిరూపించారు. గనుక అహింస అంటే శారీరక బాధ మాత్రమేగాక మానసిక బాధ పెట్టడంగూడా తగదని శాస్త్రం. శ్రీ మాష్టారి

జీవితంలో చూస్తే తన విద్యార్థులనుగాని, ఆశ్రితులనుగాని కుటుంబ సభ్యులనుగాని ఇలా చేయండి అని నిర్బంధించి ఎరుగరు. ఇష్టాఇష్టాలు లేకుండా జీవించడమే వారి జీవిత కళ గదా !

పై చెప్పినవన్నీ శారీరక తపస్సని చెప్పారు. వీటిలో మొదటిది పూజ - దానిని చక్కగా చేయాలంటే ఆ మహనీయుడెంతటివారో వివిధ భక్తుల అనుభవాలు తెలుసుకోవాలి. అప్పుడే మనము మనస్ఫూర్తిగా పూజించి మనమూ వారి కృప పొందగలుగుతాము. గనుక ఆ మహనీయుని జీవిత చరిత్ర పారాయణ ముఖ్యము. పూజ, పారాయణ ఎంతో గొప్పగా ప్రచారముచేసిన మహనీయుడు శ్రీ మాష్టారు. పూజ, పారాయణ యాంత్రికము, లాంఛనప్రాయము కాకూడదంటారు.

శారీరక తపస్సు తర్వాత వాచక తపస్సు, మానసిక తపస్సు. మొదటి మెట్టు చక్కగా ఆచరిస్తుంటే రెండవ మెట్టు మూడవ మెట్టుకూడా ఆ మహనీయుని దయవలన చక్కగా ఆచరించగలుగుతాము. ఆ విధంగా మనందరినీ సద్గురు కృపకు పాత్రులయ్యే విధంగా నడిపిన మహనీయ మూర్తి శ్రీ మాష్టారు.

ఇక్కడ నా ప్రత్యక్ష స్వానుభవం ఒక్కమాట చెపుతాను. శ్రీ మాష్టారిని నేను ప్రథమంగా దర్శించకముందు సంవత్సరానికి రెండు రోజులు చొప్పున గతమూడు సంవత్సరాలనుండి కలిచేడులో జరుగు గీతాజ్ఞాన యజ్ఞములో ఉపన్యసించేందుకు శ్రీ మాష్టారు వస్తూనే ఉన్నారట. కానీ నా పుణ్యము చాలినంతగా లేదు గనుక వారిని కలువలేక పోయాను. ఈ మూడు సంవత్సరములలోను నేను శ్రీ రామకృష్ణ పరమహంస జీవిత



చరిత్ర చదువడం జరిగింది. అందులో వారు "నీ ఆస్థిపాస్తులు, భార్యా పిల్లలు, బంధువులనుగూర్చి కడవలు కడవలు కన్నీళ్ళు కారుస్తావే, భగవంతుడు కావాలని ఎప్పుడైనా ఒక్క కన్నీటి బొట్టు కార్చావా" అని ఒకరిని అడుగుతారు. ఆ మాట చదివాక నాలోని లోపం అర్థమైంది. వారు చెప్పినట్లు ఏకాంతంలో ఎన్నోసార్లు నాకు తెలియకుండా కట్టలు తెంచుకొని కన్నీళ్ళు కారాయి. ఒక చోట పరమహంసగారు డాక్టరుగారి అనుమతి లేకుండా కాంపౌండర్ దగ్గర మందుతీసుకుంటే పరమహంసగారికి వెంటనే కళ్ళు కనబడకుండా పోతాయి. వారు మహనీయులుగనుక వెంటనే తప్పు గ్రహించి మందుపొట్లం ఆస్పత్రిలో పారవేయగానే కళ్ళు కనిపించాయి. ఈ సన్నివేశం నన్ను ఎంతగా సంస్కరించిందో ఇక్కడ వ్రాయలేను.

దీనికితోడు ఏర్పేడు - విద్యానందస్వామి వారి ఉపన్యాసం విని నిత్యం నిద్రలేస్తూనే శ్రీ కృష్ణుని చిత్రపటం మొదట చూచినాకనే ప్రపంచం చూడాలని తలదగ్గర పటం ఉంచుకొని కొన్ని శ్లోకాలు చదువుతూ శ్రీ కృష్ణుని ప్రార్థించేవాణ్ణి. ఈ శ్రీరామ కృష్ణ చరిత్ర పారాయణ, శ్రీ కృష్ణ స్తోత్రం మొ॥ వాటితో పుణ్యం గొప్పగా సమకూడి, ఆ పుణ్యమే నన్ను శ్రీ మాష్టారి పాదాలదగ్గరకు చేర్చింది. వారు నన్ను శ్రీ స్వామివారి పాదాలకు అప్పగించడం జరిగింది. గనుక సద్గురు దర్శనానికి పూజ మొదటిమెట్టు. మిగిలిన అనంతకోటి మార్గాలలో పుణ్యం ఆర్జిస్తే ఆ పుణ్యమే మనలను సద్గురు సన్నిధికి చేరుస్తుంది. అందుకే శ్రీ మాష్టారు సాయి పూజను ప్రోత్సహించి పూజావిధానం పుస్తకం అచ్చువేయించి పూజ ఎందుకు చేయాలి ? ఎలా చేయాలి అనేవి వివరించారు.

## క్రొత్తవి తగిలించుకోవద్దు

ముముక్షువులేగాక సర్వ మానవులూ ఆచరించదగ్గ చక్కని బోధ చేశారు. మన మనసులోని వాసనలే మన జీవితంలోని నడవడికి మూలం. ఇప్పుడు మనం ఏర్పరచుకొనే భావాలే మనలోని వాసనలుగా మనలను వెంబడించి భవిష్యత్తులోని మన జన్మలలోని అనుభవాలుగా మనకు ప్రతిఫలిస్తాయి. మనమీ జన్మలో రాగ,ద్వేషాలకు లోనైనట్లయితే ఆయా భావాలు మనవాసనలుగా మన మరణానంతరం మనలను వెంబడిస్తాయి. రాగ ద్వేషాలకు లోనవుతున్నామంటే భవిష్యత్ జన్మలలోని అనుభవాలు మనమే సిద్ధంచేసుకుంటున్నామని అర్థం. మానవుల సర్వ ఆలోచనలూ, భావాలూ రాగద్వేషాలనే రెండు రకాలుగా వర్గీకరించారు. అందుకే శ్రీ మాష్టారు గత జన్మలలోని వాసనలు, సంస్కారాలు వాటిద్వారా కలుగబోవు అనుభవాలను గూర్చిన బాధ్యత బాబాకు వదలి ఈ జన్మలో క్రొత్తవి తగిలించుకోకుండా నడవడి సరిదిద్దుకోమన్నారు. గతంలోని బంధాల విషయం బాబా ఐదు రకాలుగా పరిష్కరిస్తారట (1) కొండంతను గోరంతలుగా అనుభవింపచేయవచ్చు (2) మనకు జాగ్రత్తులో జరుగవలసిన అనుభవాలను స్వప్నాలలో జరిగేటట్లు చేయవచ్చు ఉదా :- టి.బి. పేషెంటు బాధను - స్వప్నంలో గుండెలమీద రోడ్డురోలరును త్రిప్పినట్లు ఉండి భయంకరంగా అరవడం, మరొకరోజు పద్యాలు చెప్పలేదని ఉపాధ్యాయుడు కొడితే అరచేతులలో రక్తంకారుతున్న స్వప్నం.

(3) మన ఆధ్యాత్మికాభివృద్ధికి దెబ్బలేని వాటిని అలాగే జరుగనివ్వడం.



(4) అలాంటి అనుభవాలేవీ జరుగకుండా ఆ ఫిల్మ్ తీసివేయడం ద్వారా చేయవచ్చు.

(5) ఒక్కొక్కసారి ఆ అనుభవాన్ని భవిష్యత్తుకు మార్చనుగూడా మార్చవచ్చు. ఏది చేసినా మన ఆధ్యాత్మిక పురోభివృద్ధి దృష్టిలో పెట్టుకొని చేస్తారు.

ఇప్పుడు మనం చేయవలసినదల్లా భవిష్యత్తుకు ఫిల్మ్ సిద్ధంచేసుకోకుండా ఉండడమే. కొన్ని కొన్ని అనుభవాలు మనకు కష్టంగా ఉండవచ్చు. కానీ అవన్నీ శ్రీ బాబాగారి ప్రసాదాలుగా సంతోషంగా స్వీకరిస్తూ ఆయనుభవాలకు కారణమైన వారిఎడల ఎలాంటి భావనలేకుండా జీవించగల్గడంలోనే మన కౌశలమంతా ఇమిడివుంది. అందుకే మాష్టారు - బ్యాంకులో పూర్వం అప్పుతెచ్చుకున్నాము. ఇప్పుడా అప్పు చెల్లిస్తూ బాధపడడం అధర్మంకదా. అప్పు తీరిపోతుందని సంతోషించవలసినచోట బాధపడుతూ క్రొత్త బంధాలు తగిలించుకుంటున్నాము. ఈ క్రొత్త బంధాలతో మరు జన్మలకు మూలమైన ఫిల్మ్ మనకు మనమే తయారు చేసుకొంటున్నాము.

మనసు బాబా మీద లగ్నంచేసి సుఖంగాని, దుఃఖంగాని మనసులోకి రానీయకుండా ఉండడమే సాధన. అందుకే శ్రీ మాష్టారు ధ్యాసలేకుండా గడిపిన క్షణాలలోని మనోవికారాలు జన్మపరంపరలను పేడే త్రాళ్ళని తలచి విషాన్ని త్యజించినట్లు జాగరూకతతో త్యజించమన్నారు. భార్యా, పిల్లలు, బంధు మిత్రుల ఎడలకూడా ఎలాంటి భావాలూ మనసులోకి

రాకుండా ఆయా బాకీలు తీర్చుకుంటూ ప్రతి అనుభవంలో తారసిల్లే మనుష్యులందరూ బాబా రూపాలనే భావాన్ని ఏమరుపాటు లేకుండా వహించమంటారు.

ఎన్ని జన్మలకైనా ఆత్మజ్ఞానం పొందేందుకు ఎవ్వరైనా నేర్చుకోవలసిన పాఠమిదే ! "క్రొత్తవి తగిలించుకోవద్దు. పాతవాటి విషయం బాబాకు వదలండి వారు వాటిని స్వప్నాలలో అనుభవింపజేస్తారా. జాగ్రత్తులో కొండంతను గోరంతగా అనుభవింపజేస్తారా. అసలు అనుభవమే లేకుండా చేస్తారా అనేది వారికి సంబంధించినది. క్రొత్త రుణానుబంధాలు తగిలించుకోకుండా జాగ్రత్తగా జీవించడం మన కర్తవ్యం." ఈ మాటలో రాగద్వేషాలు వదులు, సంపూర్ణ శరణాగతి చెందు, ప్రతి చిన్న విషయానికీ గురువుపై ఆధారపడడమే నిజమైన సాధన. సత్యం, ధర్మం తప్పవద్దు. సంపన్నత్వం సాధారణత్వం సాధించు, సద్గురుని సేవించు అన్న దానిలో సర్వ సూత్రాలూ ఇమిడి ఉన్నాయి.

జగత్తంతా నడిపించేది పరమాత్మేగదా ? అలాంటప్పుడు కోరికల పుట్ట అయిన మన మనస్సు అధర్మాన్ని ఇది ధర్మం ఇది మంచిదని భ్రమింపజేసి మనలను రాగ బంధంలో బంధిస్తుంది. దానిని పొందడంలో అడ్డుపడిన వారిఎడల ద్వేషం వహిస్తాము. ఇలా క్రొత్తవి తగిలించుకుంటూనే మనంచేసేదంతా శ్రీ సాయి సేవ అని భ్రమిస్తూ క్రొత్తవి తగిలించు కుంటూఉంటాము. ప్రతి చిన్న విషయానికి గురువుపై ఆధారపడు. అదే అసలైన సాధన అన్నమాట అనుక్షణం గుర్తుంచుకుంటే క్రొత్తవి



తగిలించుకోకుండా తప్పుకోగలము. ఆ విధంగా అన్నింటికీ వారినే కారణంగా భావిస్తుంటే క్రొత్తవి తగులుకోకుండా ముందుకు పోగలుగుతాము.

ఒకరి సొమ్ము తినడం, అనుభవించడం మాత్రమే ఋణానుబంధం అనితలవడం పొరపాటు. ఎవరిని గురించి ఎలాంటి భావం మనులో ఉంచుకున్నా మన మనసులో ఏర్పడ్డ భావమే మరు జన్మకు బంధమంటారు. ప్రతి కలయిక, ప్రతి అనుభవము పూర్వ ఋణాను బంధం వల్లనే కలుగుతున్నాయి. కుక్కలు, బిచ్చగాండ్రు మాత్రమేగాక సర్వప్రాణుల తోటి ఈ జన్మలో మన కలయిక పూర్వఋణాను బంధం వల్ల కలుగుతున్నదని అనుక్షణము గుర్తుఉంచుకొని మసలుకోవాలంటారు. ఈ జన్మలో ఏ ప్రాణిని గ్గూర్చి కూడా ఏ భావము ఉంచుకోకుండా, అన్ని అనుభవాలు సాయి మన మంచి కొరకు కలిగించినవిగా స్వీకరించి ఆయా జీవుల రూపాలలో సాయినాధుడే మన దగ్గర కొచ్చారని భావిస్తుండమంటారు.

ఈ సూత్రం మరచిపోయి ఇతడు మంచివాడనో, ఇతడు చెడ్డవాడనో, ఇతడు దొంగ అనో ఎలాంటి భావం మనస్సులో ఉంచుకొని ఆలోచిస్తుంటే మరుజన్మకు మన బంధం మనమే తయారుచేసుకున్నామని అర్థం. అందుకే శ్రీ మాష్టారు లివ్ ఇన్ ది ప్రెజెంట్ అని చెప్పి దానిని ఆచరించి చూపారు. వారు ఎలా ఆచరించారో విద్యానగర్ అల్లర్లు సమయంలో బాగా తెలిపారు. దీన్నే గీతలో "నాభినందతి నద్వేష్టి" అన్నారు.

## సద్గురుసేవ ఎలాచేయాలి

సద్గురుసేవ ఎలా చేయాలి? అనేవిషయం మాటలతోగాక ఆచరణ ద్వారా చూపిన మహనీయుడు శ్రీ మాష్టారు. గురువు అని తలతాకట్టు పెట్టకముందే ఆగురువును క్షుణ్ణంగా పరిశీలించి పరీక్షలు చేసి తలతాకట్టుపెట్టు. తలతాకట్టు పెట్టాక ఇక జీవితంలో తల వెనుకకు తీసేదే ఉండరాదు. గురువులో కనిపించే దోషాలన్నీ నీలో ఉండే దోషాలేనని బాగా తెలుసుకో అనేవారు.

శ్రీ మాష్టారి కష్టాలు నాకే కలిగిఉంటే శ్రీ స్వామివారిని జీవితంలో మరలా తలవడమంటూ ఉండేదికాదు.

(1) విద్యానగర్‌లో ఉద్యోగంలో చేర్చుకోలేదు.

(2) అదే సమయంలో ఓంగోలులో మొదటి ఆరునెలలు ప్రెస్ సరిగా జరుగక పనివారికి జీతాలిచ్చేదే గగనంగా వుంది.

(3) అమ్మగారు అనారోగ్యంతో మంచమెక్కారు

(4) వేదమ్మ చిన్నపాప, ద్వారకనాథ్ గారు పురిటి బిడ్డ

(5) ఇంట్లో ఎనిమిది మంది తినాలి. మరియు అతిధులు, ఎప్పుడు ఎందరొస్తారో తెలియదు.

(6) ఒంగోలులో కాపురానికి యోగ్యమైన ఇల్లు దొరకలేదు. పడిపోయే స్తితిలో ఉన్న పెంకుటిల్లు - బాంబే లెట్రిన్‌లేదు. పాకీ వాళ్ళు సుభ్రంచేసే లెట్రిన్. లెట్రిన్ కాదు ప్రత్యక్ష నరకకూపము.

(7) "మీరు వెళ్ళి కాలేజీ ఓనర్‌ను కలుసుకుంటే వెంటనే ఉద్యోగంలో చేర్చుకుంటారు. మీరు వారిని కలుసుకునేందుకు మీ ప్రిస్టేజ్ మీకు అడ్డమొస్తుంది అని మిత్రులు ఆత్మీయులు అంటున్నారు.



శ్రీ మాష్టారు, నేను, ఇంకొకరు కలసి శ్రీ మాష్టారిని కాలేజీలో చేర్చుకునే అధికారి దగ్గరకు వెళ్ళాము. ఎంతోసేపు వాదించి ఆ అధికారి చివరకు "ఒకే వ్యక్తి రెండుపనులు సక్రమంగా చేయలేడు. నీవు కాలేజీలో పనిచేయాలంటే సాయి పని మానుకో లేక సాయిపని చేస్తూ కాలేజీ నన్నామానుకో" మన్నాడు. వెంటనే మాష్టారు 'మేము సరిగా పనిచేస్తున్నామోలేదో జడ్జిచేసే అధికారం ఒక్క సాయికి మాత్రమే ఉంది' అన్నారు. ఇక ఆ అధికారి మాట్లాడలేదు. "ఆ అధికారం ఒక్క సాయికి మాత్రమే ఉంది" అంటే నీకులేదు అని చెప్పక చెప్పినట్లే అయింది. వారు మాష్టారిని కాలేజీలో చేర్చుకోలేదు. మనసులో మాట దాచకుండా భయమే లేకుండా మాట్లాడడం ఇక్కడే చూచాను.

సాయి మనకేది మంచిదైతే అదే చేస్తాడులే అని చేతులు ముడుచుకొని కూర్చోలేదు. డైరెక్టర్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్‌కు తెలుపుకున్నారు. ఓపెన్ ఎంక్వయిరీ జరిపి కాలేజీలో జేరమని ఉత్తరువిచ్చారు. కాలేజీలో చేరి పదిహేనురోజులు పనిచేసి రాజీనామా చేశారు.

ఇక్కడ మానవాళికి తన ఆచరణద్వారా గొప్ప బోధచేశారు.

ఎక్కువమంది చెప్పినట్లు - అంతా సాయిదయ అని నిర్వీర్యంగా భజన చేస్తూ కూర్చోలేదు. అన్యాయాన్ని ఎదిరించి చివరికంటూ గమ్యంచేరారు. శ్రీ మాష్టారు ఒక చక్కని మాటచెప్పేవారు. "మనంచేసే పనికి ఏ కొద్దిపాటి అడ్డంకు కలిగినా ఆ పనిని విడిచివేయడం ఎక్కువమందికి గల అలవాటు. అది వారి సంస్కారము. ఈ సంస్కారాన్ని అధిగమించి కార్యము సఫలము కానీ విఫలముకాని చివరిదాక పోరాడడమనే సుగుణం అలవరుచుకోవాలి. కార్యము విఫలమైనప్పుడు మన ప్రారబ్దం ఖర్చయిపోయినందుకు సంతోషించాలి. ఫలితమెట్లున్నా మన కృషిలో మాత్రం లోపం లేకుండా చేయాలి. లేకుంటే కర్మ క్షాళనం కాదు. గనుక

"ఆరంభింపరు నీచమానవుల్" మధ్యలో విడిచివేయడం మధ్యముల సంస్కారం చివరికంటూ పోరాడడం ఉత్తముల లక్షణం అని పెద్దలు చెప్పారు.

సాయిమీద భారం వేశానని నిర్వీర్యంగా కూర్చోకుండా ఓపెన్ ఎంక్వయిరీలో అవతలవారు తనపై మోపబోయే నిందలు, ఆ నిందలవెనుక ఉండే సత్యమైన పచ్చిసత్యాలు వ్రాసి టైపుచేయించి, జరాక్సు తీయించి ఒక్కొక్క కట్ట షుమారు యాబై పేజీలుగలవానిని ఎంక్వయిరీలోని ముగ్గురు అధికారులకు పదిరోజులు ముందుగా అందించి, తన కేసంతా బాగా చదివి అర్థంచేసుకోమని అర్ధించారు. ఈ కార్యానికి షుమారొక వెయ్యిరూపాయలు తన కష్టకాలంలో ఖర్చుపెట్టారు. చివరకు విజయం సాధించారు. కృషి చేయడం మన ధర్మం. ఫలితం దైవానిదని తన ఆచరణద్వారా బోధించిన మహనీయుడు.

ఆ విధంగా ఉద్యోగ విరమణ చేశాక నిర్విరామంగా సాయి ప్రచార కార్యంలో నిమగ్నమయ్యారు. నెలకు నాలుగైదు రోజులు ఇంటిపట్టునుంటే ఇరవై అయిదు రోజులు పర్యటనలో ఉండేవారు. అమ్మగారి అనారోగ్యము, పిల్లల చదువులు వీటిని చూచుకుంటూనే ప్రచారయజ్ఞం కొనసాగించి సద్గురుసేవ ఎలా చేయాలో చూపారు.

వారు ప్రచారయజ్ఞం కొనసాగించిన విధానం ఆలోచించేకొద్దీ నాకైతే గుండె ఆగిపోయేటంత ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది. ఎన్నో గ్రామాలు తిరిగి ఉపన్యసిస్తుంటారు. ఒక్క ఉపన్యాసానికైనా ముందుగా తయారవడమంటూ ఉండదు. అప్పటికప్పుడు మాట్లాడడమే. అంతకుముందు అదే విషయం చెపితే వినిన వారికికూడా మరలా క్రొత్తగా ఉన్నట్లుగానే వినేవాళ్ళము. అదే సద్గురు కృప.

ఇంట్లో నెలకు ఐదు రోజులు లేక ఒక వారంరోజులుంటారు. ఈ వారంరోజులు ఒకవైపున సాయిబాబా పక్షపత్రిక ప్రూపులు దిద్దేపని.



ప్రూపులు దిద్దేపని ఏమాత్రం ఆలస్యమైతే ఆ నెలలో పత్రిక ఆ మేరకు ఆలస్యంగా భక్తులకందుతుంది. గనుక ఎన్ని పనులున్నా పత్రిక తప్పకుండా సకాలంలోనే వెలువడేటట్లు ప్రూపులు దిద్దేవారు. మరొకవైపు నాకు ప్రమాదం నెత్తిమీద కూర్చున్నది. మీరేమి చేయమంటే అది చేస్తాను. మీ సలహా కొరకు వేయి కన్నులతో ఎదురుచూస్తాను. అన్న లెటర్సుకు వెంటనే జవాబులు వ్రాయాలి. అదంతా బాబాసేవ గనుక అలాగే వ్రాసేవారు. ఈ వారం రోజులలో బిడ్డల చదువు పర్యవేక్షణ ఏ మాత్రం అశ్రద్ధచేస్తే ఇక వాళ్ళు చదువులో వెనుకబడిపోతారని - వందమంది విజిటర్సుతో మాట్లాడుతూనే - ఏమివేదా! ఎన్నో లెక్కవేస్తున్నావు. ఏయ్ ద్వారకా ఆ ఇంగ్లీషుపాఠం అయిపోయినట్లేనా ? అది పూర్తిచేస్తే నీతో కేరంస్ ఆడుతానోయ్ అని ఉత్సాహపరుస్తూ, లాలిస్తూ వాళ్ళపని చూస్తుండేవారు. ఏం వేద లెక్కలు వేస్తుందా? అని అమ్మగారిని పలకరిస్తే - ఏం మాట్లాడవు. అసలు లెక్కలు చేస్తుందా నిద్రపోతుందా? ఏం మాట్లాడవేమి ? అంటూ ఒకవైపు అమ్మగారిని పలకరిస్తూ పిల్లలను చురకవేస్తూ పర్యవేక్షణ సాగించేవారు. వారి ఎదుటే కూర్చొని చాతక పక్షులవలె ఎదురుచూస్తూ ఉన్న దూరప్రాంతంనుండి వచ్చిన విజిటర్సుతో మాట్లాడుతుండేవారు. సాయి మందిర నిర్మాణ సలహాలు కోరుతూ అప్పుడే వచ్చి కూర్చున్న కమిటీ మెంబర్సుకు సలహాలిచ్చి వెంటనే పంపాలి. పంపకుంటే పాపంవాళ్ళువాళ్ళ స్వంత పనులు వ్యాపారాలు మానుకొని బాబాసేవ కొరకు వచ్చారు. వాళ్ళను ఇబ్బందిపెట్టకూడదు గదా! అప్పుడే నేను గొలగమూడి నుండి దిగి సార్ ! మా వెంకయ్యస్వామివారి చరిత్ర ఎడిటింగ్ ఎంతవరకు వచ్చింది అంటూ దిగబడే నాకు సమాధానం చెప్పాలి. ప్రెస్ వర్కర్ల గొడవలు పరిష్కరించాలి. మిద్దెమీద ఉండే హోమియో డాక్టరుగారు ట్రీట్‌మెంట్ విషయంలో సలహాలంటూ వస్తే వారికీ వెంటనే సలహా ఇచ్చి పంపాలి. అప్పుడే దిగుతారు వేద పండితులు మహాజ్ఞాన మూర్తులైన స్వామివారు. తానులేచి ఇంట్లోకివెళ్ళి ప్రవరచెప్పి

వారికి పాదాభివందనంచేసి వచ్చి కూర్చునేవారు. ఢిల్లీలాంటి దూరపు ప్రదేశాలవారికి అప్పుడే వీడ్కోలు సందేశాలు పలకాలి. ఎంతో సేపటినుండి అక్కడే కూర్చొనున్న తన ఆత్మబంధువుల కలహాలు పరిష్కరించాలి. ఇంతమందిలో ద్వారకపేచీపెట్టి ఏడుస్తూవస్తే వాని అలక తీర్చాలి. ఇక్కడ వ్రాయలేని అనేక విషయాలు ఏకకాలంలో అష్టావధానమేగాక శతావధానాలూ చేసేవారు. నేనొకరోజు నా ఆశ్చర్యం పట్టలేక సార్ ! ఇంత నిర్విరామ కృషి మీరెలా చేయగలుగుచున్నారు. మేమెందుకు చేయలేకున్నాము అనిఅడిగితే వారు అతి సులభంగా తేల్చిపారేశారు. సద్గురుసేవకు విరామమెలా ఉంటుంది సుబ్బరామయ్యా ! పనులు చేసేకొద్దీ వారు ఇంకా ఇంకా పనులు మనమీదకు తోస్తూనే ఉంటారు. పనులు నెత్తినపెట్టేదీ ఆయనే పనులు చేయించేది ఆయనే. మనం తెడ్డులాంటివాళ్ళం. ఆయనెంత స్పీడుగా త్రిప్పితే అంత స్పీడుగా తిరుగుతాం. అంతే అని ముక్తసరి సమాధానమిచ్చారు.

ఆ నిర్విరామ కృషిలోని మూలసూత్రం - మనం చేసే ప్రతిపనీ సద్గురుసేవేకానీ మన సొంత పనులుకాదు అనే భావం హృదయపూర్వకంగా ఉండాలి. అంటే "త్వమేవ మాతాచ పితా త్వమేవ" .... సర్వం మమ దేవ దేవ అన్న శ్లోకం యొక్కభావము హృదయపూర్వకంగా ఆచరిస్తే పనిలో అలుపే ఉండదని అర్థంగదా ! బిడ్డలు తనవారనే మోహంలేదు. బాబా నాకు అప్పగించిన పాపలు గనుక పోషణ, పాలన, లాలన సక్రమంగా గురుసేవగా చేయాలి. వచ్చిన అతిథులు, ప్రెస్ వర్కర్లు, ఢిల్లీ అతిధులు, వేద పండితులు, హోమియో డాక్టరు అందరూ సాయిరూపాలే. ఆయా రూపాలలో సాయి మనసేవ కోరుతున్నారు. అనే ఏమరుపాటు లేని భావమున్నట్లయితే అలాంటి విసుగు విరామంలేని నిర్విరామ కృషి చాలా సులభమని బోధిస్తున్నారు. వారిలాగా మనలనూ ఆ భావం నేర్చుకోమన్నారు. అప్పుడే విరామంలేని ఆనందమొస్తుందంటున్నారు.



## స్వప్న దర్శనాలు, భౌతిక దర్శనాలు

వెంకటగిరి నివాసి జి. గోపాల్ ఇలా చెబుతున్నాడు :

మా ఇంటిలోని ఆర్థిక ఇబ్బందులు, ఇతరత్రా అనేక పరిష్కరించ వీలుగాని సమస్యలతో, సతమతమవుతున్నాను. ఇవిగాక నా చదువు 2వ సం॥ "లా" అయిపోయింది. 3వ సం॥ జరుగవలసిఉంది. అది జరుగలేదు. మా నాన్నగారి ప్రవర్తన మా అన్నగారి ప్రవర్తన నన్ను బాధపెడుతున్నాయి. నా బాధను చిత్రపటంలోని శ్రీ సాయికి చెప్పుకున్నాను. ఆనాటి రాత్రి నా స్వప్నంలో శ్రీ మాష్టారు కనిపించారు. "గోపాల్ ఆ బిల్డింగు చూడు ఎంత అందంగా ఉందో ?" అన్నారు. "అవును సార్ చాలా బాగుంది అన్నాను.

మాష్టారు :- దానిమీద పిడుగుపడి ద్వంసమైతే నీకెట్లాఉంటుంది.

నేను :- అది ద్వంసమైతే నాకేంబాధ ఉంటుందిసార్ నాకేమీ ఉండదు.

మాష్టారు :- ఆ ఇంటి యజమానికి చాలా బాధగా ఉంటుందిగదా మరి నీకెందుకు బాధలేదు ? నీకు ఆ ఇంటిఎడల - నాదికాదు అనే భావన

డి-టాచ్‌మెంట్ ఉంది గనుక బాధలేదు. యజమానికి అటాచ్‌మెంట్ ఉందిగనుక బాధ ఉంటుంది. ఆ బిల్డింగ్‌పై నీ భావన (నాదికాదు అనే భావం) ఎలావుందో అలా ఈప్రపంచంలోని సుఖ, దుఃఖాల ఎడల నీభావాన్ని నిల్పుకో. తల్లిగర్భంలోనుండి వచ్చేటప్పుడు ఎవ్వరూ ఏమి తెచ్చేదిలేదు. వెళ్ళేటప్పుడు తీసుకుపోయ్యేదిలేదు. ఈ సిరి సంపదలన్నీ మనో కల్పితాలు. గనుక నీవు ప్రపంచం ఎడల డి-టాచ్‌మెంట్ కలిగిఉంటే నీకు దుఖఃము ఉండదు అని అదృశ్యమయ్యారు. ఈ లీలద్వారా శ్రీ మాష్టారు స్మృతిమాత్ర ప్రసన్నులని సర్వవ్యాపకులని తెలుస్తుంది.

ఒక భక్తురాలు - దమ్మపేట, ఖమ్మం జిల్లా ఇలా చెపుతున్నారు.

నేను కొన్ని కష్టాలలో ఉండి "మాష్టరుగారూ మీరు నాతో ఉన్నట్లు నిదర్శనముంటే నేనీ కష్టాలనన్నింటినీ సంతోషంగా భరించగలను. మీరలాంటి నిదర్శనమివ్వండి" అని కన్నీటితో ప్రార్థించాను. ఆనాటి రాత్రి కూర్చొనిఉన్న పటంలోవలె శ్రీ మాష్టారు తెల్లని పంచ చొక్కాతో దర్శనమిచ్చి నా వీపుమీద రెండుమార్లు గట్టిగా తట్టినారు. ఆ అనుభవం తలచుకుంటే శరీరం గగుర్పొడుస్తుంది. ఇదే విధంగా మరిరెండుమార్లు దర్శనమిచ్చారు. వారు నేటికీ స్మృతిమాత్ర ప్రసన్నులు.

సూళ్ళూరుపేట నుండి పి. రాజాలాల్ ఇలా వ్రాస్తున్నాడు.

గురుబంధు శ్రీ పెసల సుబ్బరామయ్యగార్కి నమస్కారములు. నాకు మాష్టరుగారు భౌతికంగా దర్శనమిచ్చిన సన్నివేశాన్ని మీకు తెలియచేస్తున్నాను.

మొట్టమొదటిసారిగా నేను జనవరి 1989 సం॥లో మరోనంద దీపం పుస్తకములోని మాష్టారుగారి ఫోటోచూడడం జరిగింది. ఆ ఫోటో చూడగానే ఆయన రూపం నా మనసులో ముద్రపడింది. కాని మాష్టరుగారిని భౌతికంగా దర్శించాలనుకునేటప్పటికి 1989 ఏప్రియల్ 12వ తేదికి సమాధి చెందారనే విషయం తెలిసి నిర్ఘాంతపోయాను. అప్పటినుంచి మాష్టరుగారి సమాధిని దర్శిస్తూ, వారిని సన్నిహితంగా దర్శించి, సేవించినవారిని కలుసుకుంటూ వారిద్వారా మానసికంగా మాష్టరుగారికి సన్నిహితం అవుతూవుంటాను. నాకు ఏదైనా సమస్యవస్తే అమ్మగారికి మాష్టరుగారిపేర ఉత్తరంవ్రాస్తే ఆ ఉత్తరం అక్కడకు చేరకముందే నా సమస్యకు పరిష్కారం దొరుకుతూవుండేది. అప్పటినుంచి ప్రతి



మంగళవారం మా యింటిలో సత్సంగం జరుపుకుంటూ వున్నాము. సత్సంగంలో మహాత్ముల ముద్దుబిడ్డడు, నాకు తెలిసిన మాష్టారు. మరోనందదీపం, మాష్టరుగారి స్మృతులు పారాయణ చేసుకుంటూ వున్నాము. ఈ విధంగా చేసుకుంటూపోతూవున్నా నాలో ఏదో తీరని కొరతవుండేది. అదేమిటంటే మాష్టరుగారిని భౌతికంగా దర్శించలేక పోయాననే బాధ. ఆ కోరికను మాష్టరుగారు సోమవారం 20-11-2000 తేదిన నెరవేర్చారు.

ఆరోజు రాత్రి మా ఆవిడకు విపరీతమైన కడుపునొప్పి. భరించలేకుండావుంది. నేను బాబాను, మాష్టరుగారిని తలచుకొని విన్నవించాను. నిద్రపట్టలేదు. సుమారు రాత్రి 2 గం॥ ప్రాంతంలో నేను బయటకువెళ్ళివచ్చి మంచంపై పడుకుని అలా ప్రక్కకు తిరిగిచూస్తే మేము సత్సంగంచేసే ప్రదేశములో "మాష్టరుగారు" భౌతికంగా దర్శనమిచ్చారు. నేను కళ్ళు నులుముకుని చూచేసరికి ఆయన క్రిందకువంగి పైకి లేస్తున్నారు. క్రొత్త పెద్దంచు పట్టుపంచె, క్రొత్త హాఫ్ ఖద్దరు షర్టు వేసికొనివున్నారు. నేను లేచేసరికి ఆయన అదృశ్యమైనారు. ఆ రూపం యిప్పటికికూడా నా మనసులో కన్నుమూసినా, తెరిచినా తలచిన మరుక్షణమే గోచరిస్తుంది.

ఈ విధంగా మాష్టరుగారు నాపై కరుణతో సమాధి అయిన 11 సం॥ల తరువాత భౌతికంగా దర్శనమివ్వడమేకాకుండా, మా ఆవిడకు వెంటనే కడుపునొప్పి తగ్గించి కరుణామయుడు, ఆపద్బాంధవుడు అనే నామాన్ని సార్థకం చేసుకున్నారు.

సాయి - మాష్టరుగారి ఆశీస్సులు నాకు సదాకలగాలని ప్రార్థిస్తూ ....

## ఆచార్యులవారి అద్భుత స్థితి

ఈ క్రింది లీల జరుగవలెనంటే శ్రీ మాష్టారి స్థితి ఎలాంటిదై ఉండాలో యోచించండి. అంతా తానైనవాడు సాక్షీభూతుడైనవాడు, నిత్యసత్యుడు, మానవాళి ఎడల చెప్పనలవికాని కరుణగలవాడు, అద్వైతస్థితిలోను ద్వైతస్థితిలోను రెండు స్తితులలోనూ ఉండగలవారికే ఈ దివ్వలీల ప్రసాదించ సాధ్యము.

శ్రీ మాష్టారిని భక్తులు ముద్దుగా మమాత్ముల ముద్దుబిడ్డడన్నారు. కొందరు సాయిబాబా కా బేటా అన్నారు. మరికొందరు సాయి మాష్టర్ అన్నారు. ఇవన్నీ శ్రీ భరద్వాజ మాష్టారిపేర్లు. నిర్వివాదాంశంగా అందరూ వారిని ప్రేమమూర్తి అనేవారు. నేటికీ అంటున్నారు. ఇకముందు అంటారు.

ఆనాటివరకు నేను భరద్వాజగారు అనేపేరు చెవితో వినడంతప్ప వారి ఫోటోను నేనెప్పుడూ చూడలేదు. మేము ఏడు సంవత్సరములు లైఫ్ ఇన్సూరెన్సు కట్టి ఆ తర్వాత ఆర్థిక ఇబ్బందులవలన కట్టలేక మానేశాను. పాలసీ కాలదోషం పట్టింది. అయ్యో ఇన్నివేలడబ్బు పోయిందే అని మనసులో బాధ. ఏమీచేయలేనిస్థితి. నేను షిర్డిసాయి బాబాను పూజించుకొనేదాన్ని. ఒకరోజు రాత్రి మూడుగంటలప్పుడు శ్రీ మాష్టారు నన్ను నిద్ర నుండి తట్టిలేపి ఎందుకమ్మా బాధపడుతున్నావు. రేపు మనిషి వస్తాడు. నీ పాలసీ తిరిగి బ్రతుకుతుంది. ఏమీ బాధవద్దని చెప్పి అదృశ్యమయ్యారు. ఈయనెవరు ఇలాచెప్పాడే. సాయిబాబా ఈ రూపంలో వచ్చాడేమో అని అనుకున్నాను. తెల్లవారి మధ్యహ్నం ఎల్.ఐ.సి. ఏజంటు వచ్చి "లక్ష్మీ మీ ఎల్.ఐ.సి. పాలసీ బ్రతుకుతుంది. మీకు లోన్ ఇస్తారట



ఆ డబ్బుతో పాలసీ కట్టండి అని చెపుతూ తన సంచిలోనుండి ఏదో ప్రింటెడ్ ఫారం తీసి నాకివ్వబోయాడు. శ్రీ భరద్వాజగారి ఫోటో ఒకటి వారి సంచినుండి క్రిందపడింది. ఆ ఫోటోచూచి "రాత్రి వీరు నాకు స్వప్నదర్శనమిచ్చారు" అని నా స్వప్న వృత్తాంతం వారికి చెప్పాను. అప్పడాయన ఎంతో సంతోషంతో "వీరు మన క్రిష్ణమాచారిగారి సోదరులు. అందరూ వీరిని సాయి మాష్టర్ అంటారు" అని చెప్పారు. ఏ జన్మలో నేను వారిని సేవించానో నా కష్టకాలంలో నాకు స్వప్నదర్శనమివ్వడమేగాక నష్టపోయిన జీవిత భీమా డబ్బు వచ్చేటట్లు చేశారు. ఈ మహనీయునికి కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను. చెన్నం లక్ష్మి, గుంటూరు. అరండల్‌పేట - 7వ లైను, మొదటి అడ్డరోడ్డు.

## షిరిడీ దర్శనం

ఆ భోళాభాయి ముసలాయనకు మనం షిరిడీకి వస్తామంటే ఎంతో ఉబ్బిపోతాడు. మనం షిరిడీకి పోతే ఆయనకేమి వస్తుంది! లౌకికంగా ఏమీరాదు. అలా రావాలని ఆయన కోరనూ కోరడు. తన బిడ్డలు అలివిగాని బరువు నెత్తిన మోస్తుంటే చూస్తూ కూర్చోలేడు. తన బిడ్డ ఆ బరువును ఎప్పుడెప్పుడు తన నెత్తిన పెడతాడా అని వేయి కళ్ళతో ఎదురు చూస్తుంటాడు. మనం విశ్వాసంతో షిరిడీకి వెళ్ళి మన బరువు తీసేసుకున్నాము గనుక ఆయనకు సంబరము. మన ఖర్మ మనకైతే బరువుగాని భోనభోంతరాళాలు మోసే ఆమహనీయునకు మన ఖర్మ ఒకలెక్కా ఏమిటి?

నాకున్న సంపదలు నీ చరణాల సేవకై అంకితమిచ్చితిని అని ఆరతుల్లో పాడుతాము. సంపదలంటే డబ్బు దస్కమేనా? మనం వాటిని వారికిచ్చినా వారేమి చేసుకుంటారు? బరోడా రాణి గారు తెచ్చిన బంగారు నాణాల బిందెను త్రిప్పికొట్టిన కుబేరపతి గదా ఆయన. మన సిరిసంపదలంతా మన దగ్గరే ఉంచుకుందాం. చార్జీడబ్బు మాత్రం ఖర్చుపెట్టి షిరిడీ వెళ్ళి సెల్యూట్ కొడితే ఆయన ఎంత గొప్పగా సంతోషపడి పోతాడో! వెళ్ళిరావడం అవిశ్వాసంతో కాదుసుమా! విశ్వాసంతో. సంపద అంటే ఇంకొక అర్థముంది. మన కండర శక్తి, మానసిక శక్తీ కూడా మన సంపదే. వీటిని వారిసేవకంకిత మిచ్చానని భక్తుడు చెపుతున్నాడు. లౌకిక సంపదతోసహా సర్వం వారి సేవకంకితమిచ్చానని అర్థం. ఆయన సేవ అంటే ఆయనిప్పుడు లేడుగా అనిచెప్పవచ్చునా? ఈ చూడబడేదంతా కలసినేనే. ఏ ప్రాణిని ఆదరించినా, తిరస్కరించినా అదంతా నాకేచెందుతుంది అన్నారు. గనుక లౌకిక సంపద, కండర శక్తి, మానసిక శక్తి సర్వం వారిసేవకే అంకితమిస్తున్నానన్నాడు భక్తుడు. వ్యాపారంలో అమాయకులను మోసంచేసి దోచుకునే వారికి, గవర్నమెంటు జీతాలు తీసుకుంటూ, లంచాలు గుంజుకుంటూ, పని ఎగగొట్టేవారేగాక అన్నిరంగాలలోని మానవులూ ఒకటి గుర్తించాలి. ఎన్నో లక్షల జీవులు కృషిచేసి తయారుచేసిన ఆహారంతిని జీవిస్తున్నాను. వారి రూపంలో పనిచేసేది దైవశక్తే - దైవమే. గనుక వారికొరకు అంటే ఆరూపంలో ఉన్నదైవంకొరకు ధర్మ బద్ధంగా జీవిద్దామనే ఎరుకతో జీవించడమే మన సంపదలు వారిసేవ కంకిత మివ్వడమౌతుంది.

అంతేగాని దొంగలెక్కలు సృష్టించి గవర్నమెంటు కళ్ళుమూసి బాబాకు రోజామాలలు నైవేద్యాలు సమర్పిస్తే వారి సేవచేసినట్లుకాదు.



గనుక ధర్మబద్ధంగా జీవిస్తూ ఎన్నోలక్షల మానవులకంటే ఉత్తమస్థితిలోను మనలనుంచినందుకు కృతజ్ఞతాభావంతో అవధూత లీలలో శ్రీ మాష్టారు చెప్పినట్లు నిత్యం గాని, వారానికొకసారి గాని, నెలకొకసారి గాని, సంవత్సరానికొకసారి గాని షిరిడీగాని, గొలగమూడిలో గాని ఆసద్గురు మూర్తిని కృతజ్ఞతతో దర్శించి నమస్కరిస్తే మహా విష్ణుమూర్తి అవతారమైన శ్రీ మాష్టారి బోధ మనందరికీ బాధ కాకుండా బోధగా ఉండగలదని ఆసిస్తాను.

## ఆకలి తీరడం

ఆకలి తీరడమేగమ్యం : ఐదు వందల రూపాయలు ఖర్చుపెట్టి ఫయివ్‌స్టార్ హోటలులో తిన్నా యాభైపైసలు పెట్టి నూకలు తెచ్చి గంజికాచి త్రాగినా ఇద్దరికీ కలిగేది ఒకటే - అదే ఆకలితీరడం. గనుక క్రీస్తు చెప్పినట్లు - మనలోపలికి పొయ్యేది కాదు లెక్క మన నుండి బయటికి వచ్చేదే లెక్క. బయటికి వచ్చేది ఏమిటి? మన భావాలు, మన మాటలు, మన పనులు. వీటిని సత్యం ధర్మం తప్పవద్దు, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవసాధించు అన్న వరుపురాయి పెట్టి చూస్తూపోతే - మంత్రమెక్కడుంది తంత్రమెక్కడుంది, చూసుకుంటూ పొయ్యేదే గదా అన్న శ్రీ స్వామివారి మాటకు సరిపోతుంది.

ఇదే మాటను శ్రీ వెంకయ్య స్వామీ వారు ఒకరోజంటారు. "అయ్యా! ఆగుడిశెల్లో వాళ్ళకి సరిపోయింది - ఆమిద్దెల్లో వాళ్ళకి సరిపోయింది".

## బోధయజ్ఞాయనమః

4-2-2001 రాత్రి 9 గం. 30 ని.లకు నిద్రకు ఉపక్రమించబోతూ ఎలక్ట్రానిక్ అలారం టైపీసు బటన్‌నొక్కి చుక్క కనబడేటట్లుచేసి సాయినాధునికి నమస్కరించి పడుకున్నాను. తిరిగి నాకొమారుని - గడియారంలో చుక్క కనబడుతుందోలేదో చూచి పడుకోమని లేపాను. వాడు గడియారం నొక్కుతాడేమోనని వాడివైపే చూస్తున్నాను. వాడు గడియారం తాకకుండానే వంగి చూచి "చుక్క కనబడుతుంది నాన్నా" అని చెప్పి పడుకున్నాడు. 1-45 గం॥లకు అలారం కొట్టవలసి ఉంటే 3 గంటలవరకు అలారం కొట్టలేదు. బటన్ క్రిందకి నొక్కి ఉంది. మందిరంలో 3 గం॥లకు అభిషేకం. మనిషి వచ్చి లేపితేలేచాను. గంట 3 అయింది. గడియారం అలారం మ్రోగలేదేమిటని నాభార్యను కొడుకును అడిగితే అసలు మేము నిద్రేలేవలేదంటారు. ఇదేమిటి స్వామీ ఇలాచేశారే? అంటే అది ఒక బోధ అని హృదయంలో పలుకుతున్నాడు. ఆ బోధేమిటో ఈ మూర్ఖపు బాలునకు తెల్పండి స్వామీ అనివేడుకున్నాను. "విశ్వమంతటా అణువణువు నందును శతృమిత్రులందును నేనేయున్నాను. ఆ గడియారం బటన్‌లోను నేనే ఉన్నాను. "అందుగల డిందులేడని సందేహము వలదు" అన్నట్లు ఈ గడియారం బటన్‌లోను నేనే ఉన్నాను. నేనే లోపలికి వెళ్ళాను. బటన్ లోపలికి వెళ్ళాలంటే వేలు పెట్టినొక్క బళ్ళేదు." ఎందుకు స్వామీ అలా చేశారు అంటే నిన్నటి నీ ప్రవర్తనకు శిక్షిది. అన్నారు. నిన్ననేనొకరిని గూర్చి అతనిలా చేశాడు అని మరియొకరికి చెప్పాను. అలాఎందుకు చెప్పావు. ఎవరిమీద ఎలాంటి భావాలూ లేకుండా ఉండాలంటావే అలా ఆచరించవద్దా. అతనిని గురించి మరొకరితో అలా ఎందుకు చెప్పావు. మనం మంచి సాధకులముగా ముందుకు సాగాలంటే సర్వమున్ అతని దివ్య కళామయమంచు విష్ణునం దుల్లము చేర్చి తారడవిన నుండుట మేలు - అన్న శ్రీ పోతనగారి వాక్యమే శిరోధ్యార్యము.



## మాష్టారి వైద్యం

ఈ విషయం శ్రీ మాష్టారే స్వయంగా ఒకరోజు చెప్పారు ఒకరు రక్త విరోచనాలతో బాధపడుతూ ఆస్పత్రి వైద్యాలన్నీ విఫలమై మాష్టారి దగ్గరకొచ్చాడట. అతను వాకిట్లోకి రాగానే అతని వెనుక చెట్టునిండా దానిమ్మ పిందెలుగల దానిమ్మ చెట్టు ఉన్నట్లుగా శ్రీ మాష్టారికి కనిపించిందట. అతడు తన బాధను చెప్పగానే శ్రీ మాష్టారు "దానిమ్మ పిందెలు తినమని" వైద్యం చెప్పారట. అతనలా చేయగానే అన్నాళ్ళు బాధించిన రక్తబేదులు ఒక్కసారి నిలచిపోయాయని శ్రీ మాష్టారుచెప్పారు. "ఒక్కొక్క సారి ఒక్కొక్క హోమియో మందు ఇతనికిస్తే సరిపోతుందని స్ఫురిస్తుంది. అలాచేయగానే ఆవ్యాధి నమమవుతుంది. అంతేగాని నాకేమీ అతీంద్రీయ శక్తులు లేవూ పాడూలేవు." అన్నారు.

అహంకార నాశనానికి దివ్యమైన ఔషదం :

ఆలోచనలు పోవడంలేదు స్వామీ అంటే శ్రీ స్వామివారు అంటారు - నీ ఆలోచనలన్నీ నీ అహంకారమే. అహంకారం పొయ్యేదెలాసార్ అంటే మాష్టారు చెబుతారు - అహంకారమనే మత్తగజాన్ని లొంగతీసుకొనేందుకు సద్గురువనే పురుష సింహానికే సాధ్యమవుతుంది. నీవు సద్గురుని సేవించి శరణువేడు - పగ్గాలప్పగించి సర్వస్యశరణాగతి చెయ్యి. అని శెలవిచ్చారు.

## గజస్నానం

ధ్యానంలో ఉన్నప్పుడే కాదు. అన్ని వేళలా ఆనందంగా ఉండగలగాలి.

అన్నివేళలా ఆనందంగా ఉండగలగాలంటే - రాగద్వేషాలు సమూలంగా దహించబడాలి. అట్లా దహించబడాలంటే భగవంతుని సర్వసమర్ధత్వం, సర్వజ్ఞత్వం, సర్వ వ్యాపకత్వాల మీద గొప్ప విశ్వాసముండాలి. ఎవరినీ తప్పు పట్టేవీలులేదు. ఆదిలో అపరాదం ఎవరిది? అని యోచించు. సర్వం చేసేది ఆయనే - అదే అల్లామాలిక్ అనేందుకు అర్ధం.

మత్తః స్మృతిరిజ్ఞాన మపోహనంచ అన్నాడు గీతలో; నా ఆజ్ఞలేక ఆకైనా కదలదు అన్నారు సాయి. నీ ఆలోచనలన్నీ నీ అహంకారమే అన్నారు శ్రీ స్వామివారు.

ఎప్పుడూ ఆనందంగా ఉండాలి. అదే సాయికృప. ఆనందం లేకుండా మనకెందుకు పోతుంది? మనసు చలించి యోచనలతో నిండిపోతుంది. ఇది నేను చేయలేక పోయాను. వాడిదిచేయలేదు. అనేభావాలు వదిలెయ్యాలి. అంతా ఆయననడిపినట్లే జరుగుతుంది. అని విశ్వసించు. హృదయపూర్వకంగా విశ్వశించు. ఎప్పుడూ ఆనందమే - ఆనందం.

ఆ విధంగా సాయి కృపపొందాలంటే వారడిగిన మూల్యం చెల్లించాలిగదా! అదే నిష్ట, సబూరి. సబూరి అంటే నష్టం ఓర్చుకోవడం. ఇష్టం, అయిష్టం పోతేగాని జీవితకళ చేతగాదు. జీవిత కళ నేర్చుకోనిదే నిష్ట సబూరి ఇవ్వలేవు. సద్గురుని ఆజ్ఞలు అంజనేయస్వామిలాగ ఆచరించాలి. లక్ష్మణుని వలె కాదు సుమా! శ్రీ స్వామి వారి సేవకుడు రోశిరెడ్డి చెప్పినట్లు - నోరువిప్పితే భ్రష్టయి పోతావు జాగ్రత్త - సద్గురుని సర్వసమర్థత్వం మీద అఖండ విశ్వాసం కావాలి అలాంటి విశ్వాసం కలగాలంటే మనపుణ్యమే కారణం. గనుక ఈ క్షణంనుండైన పుణ్యకర్మలు ఆచరించు.



## మాటవినని మనస్సుకు మందు

మాటవినని మనస్సుకు శ్రీ మాష్టారి మంచిమందు: సర్వం ముందు నిర్ణయానుసారమే జరుగుతుంది అని విశ్వసించి - నీ ఆలోచనలు మాను అన్నారు.

ఉదా: ఒకనాడొక మిత్రుడు తన జబ్బు తగ్గినతరువాత కూడా నెల్లూరులో పరీక్షలు చేయించాలని పోతున్నాడు.

నేనన్నాను - వీళ్లకు ఏమీపనిలేదు. అక్కడ చేసేపరీక్షలన్నీ డబ్బుగుంజే పనులే అన్నాను. వెంటనే మాష్టారు నామదిలో గుర్తుచేశారు. పెనవర్తి దశయ్య చెల్లెలు వేరేకాపురం పెట్టడం - (అవధూలలీల) ఏవ్యక్తి ఏసమయంలో ఎక్కడ ఉంటాడో, ఏమితింటాడో, ఏమి మాట్లాడుతాడో ముందే నిర్ణయించబడ్డాయి. ఆ విధంగానే జరుగుతుంది. జరిగితీరుతుంది. సద్గురు సంకల్పిస్తే తప్ప అది అలా జరిగితీరవలసిందే.

నా మిత్రుడు పరీక్షలు చేయించేందుకు నెల్లూరు పోవడంకూడా ముందే నిర్ణయమైంది గదా. అతను పనిలేక నెల్లూరు పోవడమేమిటి? ముందు నిర్ణయానుసారం పరీక్షచేయించేందుకు పోయి తీరుతాడు.

అయితే ఒక్క కండిషన్‌లో అయితేపోదు. ఎలాగు - ప్రత్యేక ప్రయత్నం ఉంటేపోడు. ప్రత్యేక ప్రయత్నమంటే పగ్గాలప్పగించడం.నీవు సర్వసమర్ధుడివి గనుక నాకు అవసరమైంది నీవేచేయగలవు. నేను ఆరోగ్య పరీక్షల కొరకు నెల్లూరికిపోను. అని ప్రాణానికి తెగించి కూర్చుంటాడు. అక్కడ నెల్లూరులో ఆరోగ్యపరీక్షలకు డబ్బులు ధారపోసి ఋణముక్తుడవడమే మంచిదని సద్గురుడు తలచినట్లయిన తప్పక స్వప్నాదేశమిస్తాడు. ముందునిర్ణయం ప్రకారం నడుచుకోవడమా ప్రత్యేక ప్రయత్నముతో సద్గురునికి పగ్గాలప్పగించి కూర్చోవడమా అనేది మన తీవ్రసాధనమీద ఆధారపడుతుంది. ఇలాగే ఒక మిత్రుడు మందుతిననని మొండికేశాడు చివరకు స్పృహలేకుండా పడిపోయాడు. ఆక్షణంలోనే వేరేరాష్ట్రంలో ఉన్న అతని తమ్ముడు వచ్చి అతనిని ఆస్పత్రిలో వేశాడు. అది సద్గురుని నిర్ణయమని అతడు మందుతిన్నాడు. ఆరోగ్యవంతుడయ్యాడు.

## సాధనా ధ్యేయం

సాధనా ధ్యేయము మనస్సును అరికట్టుట. మనస్సు ఏమిచేస్తుంటే అరికట్టాలి?

(1) ఎప్పుడూ ఇతరులను తప్పుపట్టి విమర్శిస్తుంది దీనికి శ్రీ మాష్టారి మంచి మందు ఏమంటే

ఆదిలో అపరాదం ఎవరిది? అని జన్మజన్మలు వెనక్కు వెళితే ఆదిలో ఎక్కడో వారిని అలాసృష్టించింది భగవంతుడే గనుక ఆదిలో అపరాదం భగవంతునిదే అవుతుంది. పరమాత్మను తప్పుపట్టగలమా. అది వారి విలాసము - అది నా ఆట పొమ్మంటాడు. గనుక ఎవరినీ తప్పు పట్టకుండా ముందుకుసాగు. తప్పు పట్టమొదలు పెడితే నీకంట్లోని దూలంతీసుకోవడం మాని ఇతరుల కంట్లోని నలుసు తీయప్రత్నించినట్లే నన్న క్రీస్తు మాటలు గుర్తుకు తెచ్చుకో అన్నారు శ్రీ మాష్టరు గారు.

(2) ఇది ఇలా చేయాలి. అది అలా చేయాలి అని బాగా సంవత్సరాలు, నెలలు, రోజులు, గంటల తరబడి ఆలోచిస్తుంది ఈపాడు మనసు. దీనికి శ్రీ మాష్టారి మంచిమందు ఏమంటే అల్లామాలిక్. యజమాని భగవంతుడు గనుక నీ అహంకార పూరితమైన ఆలోచనలు మాని ఆయనకు పగ్గాలప్పగించు. సర్వం ఆయనే చేస్తారు. ఆసమయము వచ్చినప్పుడు చాలాస్వల్పమైన ఆలోచనతో సర్వం జరిపిస్తాడు. అల్లామాలిక్ అని ఆయన క్రిందమనం పనివారమనే భావంతో ఆశ, వ్యామోహాలు లేకుండా నీకర్తవ్యం ధర్మమార్గంలో నిర్వర్తిస్తే మనసు నిలుపడం సాద్యమౌతుంది. కాని నీ ప్రయత్నముతో జరుగదు. నీవు చేయవలసింది ఆశవ్యామోహాలకు దూరమవడం, నిష్ఠ సబూరి సమర్పించడం - సద్గురునికి తృప్తికరంగా మన జీవిత యాత్రసాగించడమే మనం చేయగలిగేది.



## రాగద్వేష వియుక్తైస్తు

మానవుని రాగద్వేషాలే లేక ఇష్టము అయిష్టాలే పరమాత్మను తెలుసుకునే మార్గానికి అడ్డముండే ముండ్ల మండలు. రాగద్వేషాలు ఎందుకు కల్గుతున్నాయి. ముందు నిర్ణయం ప్రకారం సర్వం జరిగి తీరవలసిందే. అనిర్ణయంలో మార్పురావాలంటే కేవలం సద్గురుని సంకల్పంలోనే ముందు మార్పురావాలి. అలా ముందు నిర్ణయం ప్రకారం సర్వంజరుగుతుందని, మనం రాగద్వేషాలకు లోనైన క్షణంలో గుర్తరాదు. ఆక్షణంలో కూడా గుర్తురావాలంటే నిత్యసత్‌సంగము, శ్రవణ మనన నిధిధ్యాసలే కావాలి. అవి రావాలంటే నిష్ఠసబూరీలు కావాలి. సబూరి అంటే ఓర్పు. ఓర్పు అంటే నష్టాన్ని ఓర్చుకోవడం. సత్‌సంగము, శ్రమణ మనన నిధి ద్యాసలు కావాలంటే ఊరకరావు. తన పనిపోతుంది - నష్టాన్ని ఓర్చుకోవాలి అది తప్పదు.

సద్గురుని కృప పొందాలంటే మన పూజ నామజపం, స్తోత్రం, పారాయణలు అన్నీ కూడా యాంత్రికము, లాంచన ప్రాయము కాకుండా సజీవంగా సాగాలి. సజీవమైన పూజ, పారాయణ స్తోత్రం చేయగలగాలంటే గతంలోని పాపంకంటే మన పుణ్యం ఎక్కువ బరువు గలదైవుండాలి. గనుక ఈ క్షణంనుండైనా పుణ్యకర్మలు ఆచరించాలి. ఏజీవికి మేలు చేసినా పుణ్యమే, ఏ జీవికి కీడుచేసినా, తలపెట్టినా పాపమే అంటారు వేమనగారు. ఇదంతా శ్రీసాయి చెప్పి అనుభవమిచ్చి బోధించిన సత్యాన్ని మనకందిన సద్గురుడు శ్రీ మాష్టరుగారు.

## గురువు మీద ఆధారపడు

ప్రతిచిన్న విషయంలోను గురువుమీద ఆధారపడు, అదే అసలైన సాధన. సాధనమున పనులు సమకూరు ధరలోన అన్న మాట ఇవిరెండు పరస్పర విరుద్ధము కదా? సాధనము అంటే మనం చేసేది కదా. గనుక మనంచేసేదానికి గురువు మీద ఆధార పడడానికి ఎంతో దూరంగదా? కానేకాదు. చేసేది మనమే అయినా చేయించేవాడు ఆయన అన్నభావం హృదయ పూర్వకంగా ఉంటే అహంకారం రాదు. ఆయన చేయిస్తున్నాడు అన్నప్పుడు - పని సఫలమైనప్పుడు హృదయంలో ఆనందము, పని విఫలమైనప్పుడు హృదయంలో బాధ ఉండకూడదు. పని ఏమైనా మనసు ప్రశాంతముగా ఉండాలి. ఇదే నిష్కామ కర్మకు గీటురాయి. గనుక గురువు మీద ఆధారపడు అన్నా సాధనమున పనులు సమకూరు ధరలోన అని అన్నా అర్థం ఒక్కటే. దీని మీద వాదన ప్రయోజనం లేదు.

ఆనాడు నల్లక్రిష్టయ్య భగవద్గీత చెపితే ఈనాడు ఈ తెల్ల క్రిష్టయ్య ఆభగవద్గీతకు తన ఆచరణ ద్వారా భాష్యం చెప్పారు. వీరి ఒక్కొక్క మాట మానవజాతికి ఆనందం కురిపించే వజ్రాలమూటే గదా!

ఒకరు చేసే గురుసేవలో మరియొకరు జోక్యం కలిగించుకోకూడదు.



కష్టాలు అనుగ్రహానికి గుర్తు.

నీకు భయము, దు:ఖము, ఆందోళన ఉన్నాయంటే నీకు వారిమీద విశ్వాసం లేదని లెక్క.

ఇలాంటి దివ్యసందేశాలు వారి రచనలలో కోకొల్లలు.

## మనోనిగ్రహం

దానం స్వధర్మో నియమో యమశ్చశ్రుతంచ శాస్త్రాణి సద్ ప్రతాని సర్వే మనోనిగ్రహలక్షణాంతాః

శ్రీ స్వామివారి మందిరంలో ప్రతిశుక్రవారము పటాలన్నింటికీ ఉన్నబొట్టు తుడిచేసి క్రొత్తగా తిరిగి బొట్టుపెట్టాలి. అలా బొట్టుపెట్టేటపుడు మనసులో ఏమాత్రం చిన్న ఆలోచన వచ్చినా బొట్టు కుదరదు. తుడిచేసి మరలా పెట్టాలి. ఏ ఆలోచనా లేకుండా మనస్సును జాగ్రత్తగా అదుపుచేసుకొని బొట్టు పెటడితే చక్కగా కుదురుతుంది. ప్రతిసేవకు మనోనిగ్రహమే గమ్యము అని శ్రీ స్వామివారు నోటితో బోధించకనే బోధిస్తున్నారు.

## అత్తిచెట్టు

అత్తిచెట్టును మేడిచెట్టు అనడం కూడా ఉంది. విద్యానగర్ (నెల్లూరు జిల్లా) లోని సాయిబాబా మందిరం ముందు దత్తమందిరం ఉంది. ఆదత్త మందిరము మేడిచెట్టుప్రక్కన నిర్మించారు. ఆమేడిచెట్టును శ్రీ మాష్టరు గారు తన తపోశక్తంతా నిక్షేపించి ఒక చిన్న మొలకను ఆకుండలో ఏఏ ఎరువులు వేసి పెంచారోగాని మందిరం ముందు నాటేనాటికి మూడడుగల చెట్టు, ఎంతో పెద్ద ఆకులతో చాలా పోదిగా ఎదిగింది. ఆ చెట్టును చూడగానే మేడిచెట్టు ఇంత పోదిగా ఎలాపెంచారు అని ఆశ్యర్యపోయాను. చెట్టు మందిరంముందు నాటినాక 10 అడుగుల ఎత్తు పెరిగింది. సైక్లోనుకు పడిపోయి వేళ్ళు భూమిపైకి వచ్చాయి. తిరిగి తాళ్ళుకట్టి చెట్టును లేపిదాని మొదలుచుట్టూ పెద్ద గుట్టగా రాళ్ళుపేర్పించారు. ఇక మరలా పడిపోలేదు. శ్రీ మాష్టరు గారి తపోశక్తికి ఆమేడిచెట్టు ప్రత్యక్ష సాక్ష్యము.

## టైంటేబుల్

మనకు ఇష్టమున్నా లేకున్నా నిత్యం టైంటేబుల్ ప్రకారం పనిచేసితీరాలి. ఇదే సాయి నేర్పించిన గొప్పపాఠము. ఆరతి టైంలో నిద్రపోతున్న వాణ్ణి సాయి మసీదులోకి రానియ్యలేదు. గనుక టైంటేబుల్ ప్రకారం పనిచేయమనేది గురువాజ్ఞ. మనం సోమరితనానికి, ఇష్టాఇష్టాలకు,



స్నేహితులు చుట్టాలకు, మనసొంత పనులకు దాసులమైనంత సేపు సద్గురువుకు దాసులము కాలేము. సబూరి అంటే నష్టాన్ని ఓర్చుకోవడమనికూడా అర్థంకదా. సరైన కాలానికి ఆరతికి రావాలన్నా, పూజ, పారయణ, ధ్యానం, దైవదర్శనం చేయాలన్నా తప్పనిసరిగా నష్టం ఓర్చుకొని తీరాలి. ఆకాలంలో సొంత పనులు వదలాలి. అదే సబూరి. అప్పుడే భగవంతుడు కనికరించి మనలను దగ్గరకు తీస్తారు. లేకుంటే మనలను మాయ దగ్గరకు తీసుకుంటుంది. ఇందులోనే శ్రద్ధ కూడా ఇమిడివుంది. ఆరతులపైన శ్రద్ధ, సద్గురు స్మరణ పైన శ్రద్ధ, హారతులకు వస్తానని సద్గురువుకిచ్చిన మాటపై శ్రద్ధ వట్టి శ్రద్ధకాదు, బుద్ధుడుచెప్పిన కేవలశ్రద్ధ, అణుమాత్రమూ మలినమంటని శ్రద్ధ ఉండాలి.

ఓ శ్రీ భరద్వాజ గురుదేవా ! ఒకే ఒక్క మాటలో ఎన్ని కఠోరసత్యాలు బిగించావయ్యా. అనంతకోటి సాష్టాంగదండ ప్రణామాలు ప్రభో !!

అలా మనం టైంటేబుల్ ప్రకారం పనిచేస్తూ, సబూరి సమర్పిస్తూ, ఆరతుల్లో భావాలను ఆచరిస్తూ వస్తే అంతులేని ఆనందం కాక మరేమి అనుభవమవుతుంది?

ఓ సద్గురురాయా! ఈ మాయను అతిక్రమించి (అంటే రాజస, సాత్విక, తమోగుణాలను అతిక్రమించి) శుద్ద సాత్వికంగా అయ్యేట్టుల మమ్ము మేము శుద్ధిచేసుకునే క్రియకు మీ అండ సహాయము అనుగ్రహించు ప్రభూ.

# చివరి మాట

శ్రీ మాస్టరు గారు మహసమాధి చెందిన తర్వాత కూడా భౌతిక దర్శనాలిచ్చి తాను మృత్యువుపై సాధించిన ఘన విజయాన్ని మనకు తెలియ పరుస్తున్నారు. ఎందుకు ? మనము పరిపూర్ణమైన విశ్వాసంలో సాధనకు అంకితమై జీవిస్తామని వారి ఆశ. అనుక్షణమూ మనం మృత్యువునకు సమీపమౌతున్నామనే విషయం ప్రతి ఒక్కరూ మరచిపోకుండా అనుక్షణం గుర్తుంచుకోవలసిన విషయం. కనుక ఎవరో అవకాశమున్న వాళ్ళు తప్ప మిగిలిన వాళ్ళందరమూ గృహస్తులుగా జీవిస్తూ భగవంతుడనుగ్రహించిన సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోమంటున్నారు. ముక్తికి కృషి చేయమంటారు.

1. రోజూ కొంత సమయం నామస్మరణ, పారాయణ, సత్సంగం, పూజలకు వినియోగించు.

2. నిత్యం ఒకే సమయంలో పై సాధనలు చెయ్యి.


3. అన్నం తయారుచేసేటప్పుడు, కూరగాయలు తరిగేటప్పుడు నామస్మరణ మరువ వద్దు.

4. అన్నం తిన్నంత సేపూ తప్పక నామస్మరణ చేస్తేనే ఆ ఆహారం భగవంతుడు స్వీకరిస్తాడు.

5. నడిచేటప్పుడు మనస్సుపై కన్నువేసి ఆలోచనలలో పడిపోకుండా నామం చేయమంటారు.

6. పుణ్య కర్మలు ఆచరిస్తే సర్వం అపుణ్యమే సమకూరుస్తుంది అంటారు. అలా చేసి తరిద్దాం.

సర్వేజనా సుఖినోభవంతు.



శ్రీ మాష్టారి సమాధి మందిరము, లాయర్ పేట, ఒంగోలు.